The Largest Circulated
Telugu Monthly
సచిత్ర మాసపత్రిక
స్వాతి
ESTABLISHED 1970
₹10
డిశంబరు 2012
కట్నంగా కాఫీ రాజధాని

పిల్లలు పుట్టని దంపతుల ఆశాకిరణం !

డా॥ రమా సంతాన సాఫల్య కేంద్రం !!

ISO 9001:2008 సర్టిఫైడ్ ఐ వి ఎఫ్ సెంటరు



ఇక్కడ అన్ని ఆధునిక శాస్త్రీయ పరీక్షలూ, **IUI-IVF-ICSI** (టెస్ట్ ట్యూబ్ బేబి), సరోగేసి, లేజర్, **TESA-MESA**, సెమెన్/ఎగ్/ఎంబ్రియో ఫ్రీజింగ్/డొనేషన్ లాంటి సౌకర్యాలు అన్నీ అందుబాటులో ఉన్నాయి. ఎటువంటి సమస్యలు ఉన్నవారికైనా తగిన వైద్య సహాయం అందుతుంది.

పిల్లలు పుట్టక పోవటానికి కారణాలు అనేకం! అతితక్కువ స్పెర్మ్ కౌంట్ ఉన్నా, స్పెర్మ్ కౌంట్ లేకున్నా, వారి టెస్టిస్ లోపల ఏ కొద్దిగా స్పెర్మ్ కణాలు ఉన్నా వాటిని తీసి నేరుగా ICSI ద్వారా అండంలోకి పంపి పిండోత్పత్తి జరపవచ్చు! స్వంతంగా అండోత్పత్తి లేని స్త్రీలకు డోనార్ఎగ్ ద్వారా గర్భధారణ కలిగించ వచ్చు. గర్భసంచి లేనివారికీ, ఉన్నా గర్భధారణకి వీలు కాని వారికీ సరోగేట్ మదర్ ద్వారా సంతాన ప్రాప్తి కలిగించవచ్చు ! ఇదివరకు IVF ఫెయిల్ అయినవారికీ, 35 సం॥ తరువాత IVF ప్రయత్నించేవారికీ, పాలిసిస్టిస్ ఓవరీస్ ఉన్న వారికీ Diode Laser Assisted Hatching పద్ధతిలో గర్భధారణకి కృషి చేయవచ్చు!

చందన బ్రదర్స్ ఎదురుగా, అమీర్‌పేట్, హైదరాబాద్.

ఫోన్లు : (040) 2340 1255, 9989223316/9989223320.

E-mail : ramafertility@yahoo.com **Website : www.fertilityindia.com**

విశాఖపట్నం : 99892 23314/99892 23325;
రాజమండ్రి : 99892 23323, 94408 20132;
విజయవాడ : 99892 23324,99124 60584 ;
గుంటూరు : 998922 3321/ 99892 23322.
ఫోన్‌లో ఉచిత కన్సల్టేషన్ : 99892 23341

మా హాస్పిటల్ 365 రోజులూ తెరిచి ఉంటుంది. వెంటనే వచ్చి కలిసి, మీ సందేహాలు తీర్చుకొని సంతానప్రాప్తికై శాస్త్రీయ ప్రయత్నం చేయండి !

'డా॥ రమా సంతాన సాఫల్య కేంద్రం' వారి మరో ప్రాంతీయ కేంద్రం రాయచూర్ లో "డా॥ రమా టెస్ట్‌ట్యూబ్ బేబి సెంటర్" పేరుతో హనుమాన్ థియేటర్ ఎదురుగా, గజ్జర్‌పేట్ వద్ద సేవలందిస్తోంది. ఫోన్లు : 072590 24741, 072590 24747

సూచనలు : ▸▸ ఒక సంవత్సర కాలం కావాలనుకున్నా సంతానం కలుగని దంపతులు వెంటనే సంప్రదించడం ఉత్తమం. ▸▸ వచ్చే ముందు 5 రోజులు భార్యా భర్తలు దూరంగా ఉండాలి. ▸▸ ఒకటి, రెండు సార్లు గర్భస్రావం జరిగిన వాళ్లు మళ్లీ గర్భధారణకోసం ఆగకుండా తప్పనిసరిగా ముందుగానే రావాలి. ▸▸ వివాహం జరిగాక కూడా ఋతుక్రమం సరిగాలేని వాళ్లు తక్షణం సంప్రదించాలి. లేకపోతే తీరని నష్టం జరగవచ్చు. ▸▸ తమ పాత రిపోర్టులన్నీ తెచ్చుకోవాలి. ▸▸ బయటి నుండి వచ్చే వారికి గదులు లభిస్తాయి.

మీ సేవలో, 1991 నుండి.

Dy. Director డా॥ విజయలక్ష్మి గారు

విశాఖపట్నం :	1వ తేదీన మ॥ 3 గం. - రా॥ 8 గం.ల వరకు	
	2వ తేదీన ఉ॥ 9 గం. - మ॥ 3 గం.ల వరకు	
రాజమండ్రి :	3వ తేదీన ఉ॥ 10 గం. - రా॥ 7 గం.ల వరకు	
విజయవాడ :	4వ తేదీన ఉ॥ 10 గం. - రా॥ 7 గం.ల వరకు	
గుంటూరు :	5వ తేదీన ఉ॥ 9 గం. - సా॥ 6 గం.ల వరకు	

డా॥ పావోలు రమాదేవి గారు

విశాఖపట్నం :	15వ తేదీన మ॥ 3 గం.- రా॥ 8 గం.ల వరకు
	16వ తేదీన ఉ॥ 9 గం.- మ॥ 3 గం.ల వరకు
రాజమండ్రి :	17వ తేదీన ఉ॥ 10 గం.- రా॥ 7 గం.ల వరకు
విజయవాడ :	18వ తేదీన ఉ॥ 10 గం.- రా॥ 7 గం.ల వరకు
గుంటూరు :	19వ తేదీన ఉ॥ 9 గం.- సా॥ 6 గం.ల వరకు

KRSA 102m 289

ఆహ్ నుంచి...
ఆహా వరకు!



Euro RSCG/RB/Paras/Moov/0294/12 13

The Largest Circulated Telugu Monthly

స్వాతి

ESTABLISHED 1970 | సంపుటి 43 | సంచిక 7 | డిశంబరు 2012

పాఠక దేవుళ్ళకు నమస్కారం

ఎడిటర్: వేమూరి బలరామ్



ముఖచిత్రం జయంతిరాయ్ Courtesy : Gladrags

అనిల్ బిల్డింగ్స్ * సూర్యారావుపేట * పోస్ట్ బాక్స్ 339 * విజయవాడ-520 002

కథలు

వారధి : వారణాసి నాగలక్ష్మి-24
ద్వేషం (నాకు నచ్చిన కథ) : ఎన్.ఆర్.నంది -48
తోడు దీపం : దాట్ల దేవదానం రాజు-70

శీర్షికలు

గంటల పంచాంగం-12 శబ్దతరంగాల ఆనందం : హెలెన్ వైట్
(పాతకెరటాలు) : మాలతీ చందూర్-15 మహనీయుల ముచ్చట్లు-22
సాహితీ సదస్సులు-76 సాయిచరణదీప్-88 మాసఫలం-90

స్వాతి స్పెషల్స్

బుద్ధుడు నడచిన నేల : బాలాంత్రపు వేంకటరావు-40
108 సంఖ్యా ప్రాముఖ్యం : రామకృష్ణమఠం-60
కట్టుంగా కాఫీ రాజధాని : అశ్విన్ రాజగోపాలన్-62 దయ : కొంపెల్ల విశ్వం-68

విడిప్రతి వెల : ₹ 10.00
సంవత్సర చందా : ₹ 120.00 విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిల్) : ₹1020 (26 డాలర్లు)

చందాను
www.swatipublications.com
వెబ్‌సైట్ ద్వారా చెల్లించవచ్చు

Ordinary soap
Dettol soap
Dettol
Join us at
www.facebook.com/Dettolindia
HavasWW\0471\12-13

పదండి ముందుకు

శబ్దతరంగాల ఆనందం (పాతకెరటాలు) : 15

మనుషుల మధ్య దూరాన్ని జయించిన మహనీయుడు అలెగ్జాండర్ గ్రాహమ్‌బెల్. ఈయన పరిశోధనలవల్లే నేటి ప్రపంచం మన చేతుల్లో ఉంది. అంతటి శాస్త్రజ్ఞుడికి సైతం ఒక ప్రేమ కథ ఉంది. అదేమిటో ఈ నెల 'పాతకెరటాలు'లో చదవండి.

ముద్దమందారం : 21

మందారపూలు ఎక్కడున్నా చూసేందుకు ఎంతో ఆకర్షణీయంగా ఉంటాయి. మరి అవి ఎన్ని రంగుల్లో పూస్తాయి. వాటి ఉపయోగాలు ఏమిటో 'ముద్దమందారం' చెప్తుంది.

బుద్ధుడు నడచిన నేల : 40

యావత్ప్రపంచానికి మహిమాన్విత పుణ్యక్షేత్రంగా భాసిల్లిన పుణ్యభూమి మన భారతావని. శతాబ్దాలపాటు దేదీప్యమానమైన భారతదేశ చరిత్రలో వెలుగొందిన అవతారపురుషుడు బుద్ధుడు. ఆయన చూపినబాటే ఈ 'బుద్ధుడు నడచిన నేల'.

చరిత్ర చెప్పే చంద్రకేతు ఘడ్ : 59

పశ్చిమబెంగాల్‌లోని ఉత్తర 24 పరణాల జిల్లాలో ఈ ప్రాచీన సంస్థానం ఉంది. దశాబ్ద కాలంగా విరామం లేకుండా జరిపిన పరిశోధనల్లో బయల్పడిన ఎన్నో విశేషాలు, వింతలు గురించి 'చరిత్ర చెప్పే చంద్రకేతు ఘడ్' రహస్యాలు మీకోసం.

కట్నంగా కాఫీ రాజధాని : 62

మనసు సాంత్వన పొందడానికి ఉన్న అవకాశాల గురించి ఆలోచిస్తే అప్పుడు గుర్తొచ్చేదే ప్రకృతి. అలాంటి ప్రకృతికి వరమైన ప్రాంతమే చిక్‌మగుళూరు. ఆ ప్రాంత విశేషాలు తెలిస్తే 'కట్నంగా కాఫీ రాజధాని' కావాలని అడుగుతారు. అదేంటో తెలుసుకోండి మరి.

సగం అక్కడా... సగం ఇక్కడా (అరిందం అనే లండన్ మామ్మకథ) (అనుబంధ నవల):

అరిందం అసలు పేరు అరవిందం. భర్త పేరు భట్టు. లండన్‌లో న్యాయవాదిగా మంచి పేరు సంపాదించాడు. వీరికి సంతానం లేదు. ఇండియా నుండి లండన్ వెళ్ళేప్పుడు అరిందంను బొంబాయిలో వదిలేస్తాడు భట్టు. బంధువులకు, ఊరిజనానికి మాత్రం వారు లండన్‌లోనే కాపురముంటున్నారనే భ్రమను కల్గిస్తారు ఆ ఇద్దరూ. అలా ఎందుకు చేస్తున్నారు, ఆ తర్వాత ఏంజరుగుతుందనే ఆసక్తిని రేపుతుంది ఈ నవల.

ఇంకా, మరింకా, ఎన్నో, మరెన్నో పదండి ముందుకు...

గిన్నీస్ రైల్వేలైన్

కల్కా టు సిమ్లా



గిన్నీస్ బుక్‌లో చోటుచేసుకున్న భారతీయ రైలుమార్గం కల్కా టు సిమ్లా రైలు మార్గం. **96** కిలోమీటర్ల దూరంలో **4800** అడుగుల ఎత్తుకు చేరటం దీని రికార్డు. **1903**లో నిర్మించిన ఈ రైలుమార్గంలో **103** గుహలు, **800** వంతెనలు వున్నాయి.

ఈ **96** కిలోమీటర్ల దూరం ప్రయాణానికి దాదాపు ఐదుగంటలు పడుతుంది. ఇప్పటికీ ఈ గుహలకు విద్యుత్ సరఫరా లేనే లేదు.

లోపల వెలుతురు అవసరమైతే దానిని అందించేందుకు సూర్యకాంతిని ప్రతిబింబింప చేసే అద్దాల అమరిక మాత్రమే ఉంది.

ఈ రైలుమార్గం మూడింట రెండువంతులు వంపులు తిరిగే వెళుతుంది. బ్రిటీష్‌వారు నిర్మించిన 'నేరో గేజ్' రైల్వేలైన్లలో మిగిలివున్న వాటిలో ఇది ఒకటి.

అనిల్ అవార్డ్

బహుమతి

₹ 25,000

నాడు సంఘంలో నెలకొనివున్న చెడును, సాంఘిక దురాచారాలను రూపుమాపేందుకు గురజాడ, కందుకూరి, కాళ్ళకూరి, చిలకమర్తి వంటి కొందరు మహారచయితలు నడుంకట్టి ఓ ప్రయోజనాన్ని ఆశించి రచనలు చేశారు.

ఆ తరువాత వచ్చిన గొప్ప నవలలను వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. అయితే ప్రయోజనాన్ని అందించే నవలలుగా అనిల్ అవార్డ్ పోటీలో ఎంపికయ్యే అవార్డ్ నవలకు, సాధారణ ప్రచురణకు తీసుకునే నవలలకు ఓ విశేషత,విశిష్టత ఏర్పడింది. నాణ్యమైన నవలలుగా ప్రతిఒక్కరి హృదయంలో ముద్రించబడ్డాయి. అందుకే ఎప్పటిలానే ఈ సంవత్సరం కూడా 'అనిల్ అవార్డ్ నవలల' పోటీని ప్రకటిస్తున్నాం.

తెలుగు సాహిత్యంలో సగర్వంగా చెప్పుకునే సాహితీ అవార్డ్ 'అనిల్ అవార్డ్'.
రచయిత(త్రు)లందర్నీ ఈ పోటీలో పాల్గొనవలసిందిగా కోరుతున్నాం.
సబ్జెక్ట్ మీ ఇష్టం. హార్ట్ టచింగ్‌గా ఉంటే చాలు.
అలా ఉండే నవల పదికాలాలపాటు శాశ్వతంగా గుర్తుండిపోతుంది.
గుర్తుండిపోయే నవల రాశారా 'అనిల్ అవార్డ్' మీదే.

నవలల పోటీ

మీరు పంపే నవలలు
ఈ క్రింది నిబంధనల ప్రకారం ఉండాలి.

- నవల అరఠావు సైజులో సుమారు 120 పేజీల వరకూ ఉండాలి. అంటే మాసపత్రిక సైజులో (1/8 డెమ్మీ), ప్రింటింగ్‌లో 96 పేజీలు రావాలి. (ఈ నవల ప్రింటింగ్‌లో ప్రతి పేజీకి 34 లైన్లు ఉంటాయి. లైనుకు సుమారుగా 32 అక్షరాల చొప్పున పడతాయి). మాసపత్రిక సైజులో ప్రింటింగ్‌లో 96 పేజీలకు తక్కువ పేజీలు ఉన్న నవలలు సాంకేతిక కారణాలవల్ల పోటీ పరిశీలనకు అనర్హమైనవిగా పరిగణించబడతాయి.
- అముద్రితమని, దేనికీ అనువాదంగానీ, అనుసరణగానీ కాదని స్వదస్తూరితో రాసిన హామీపత్రాన్ని విధిగా జతచేయాలి.
- బహుమతి పొందని నవలల్లో యోగ్యమయినవి మామూలు ప్రచురణకు తీసుకునే హక్కు స్వాతికి ఉంది. నవలల ఎంపికలో స్వాతి సంపాదకునిదే తుది నిర్ణయం. ఈ విషయంలో ఉత్తరప్రత్యుత్తరాలకు తావులేదు.
  ఈ 'అనిల్ అవార్డ్ నవలల పోటీ' గడువు తేదీని పొడిగించేందుకుగానీ, పోటీని రద్దుచేసేందుకుగానీ స్వాతి పబ్లికేషన్స్ యాజమాన్యానికి సర్వహక్కులూ ఉన్నాయి.

సాధారణ ప్రచురణకి తీసుకున్న
ప్రతి నవలకి పారితోషికం ₹ 10,000

- ప్రచురణకు స్వీకరింపని నవలను తిప్పి పంపగోరువారు తగినన్ని స్టాంపులు అతికించిన కవరు పంపాలి.
- నవల పంపే కవరుమీద '2013 అనిల్ అవార్డ్ నవలల పోటీ'కి అని రాయాలి.

నవలలు పంపవలసిన చిరునామా : ఎడిటర్, స్వాతి సచిత్ర మాసపత్రిక
అనిల్ బిల్డింగ్స్, సూర్యారావుపేట, పోస్ట్ బాక్స్ 339, విజయవాడ 520 002



వినదగునెవ్వరు చెప్పిన

◆కొడవటిగంటి కుటుంబరావుగారి 'పానకంలో పీచు' కథ చదువుతుంటే నిజజీవితంలో సన్నివేశాలు పాత్రలుగా మనచుట్టూ ఉన్నట్టనిపించాయి. కాళీపట్నం రామారావుగారికి నచ్చిన కథ కావడం విశేషం.

మహనీయుల ముచ్చట్లులోని 'భార్యకు ఎదురు చెప్పని గాంధీజీ'లో ఆసక్తికర విషయాలు తెలిపింది. 'అప్పగింతలు', 'ఎవరు నీవారు', 'మౌనంలో స్వరం' కథలు మాకు నచ్చాయి. బార్లీ మంచి పోషకాహారమని 'ఆరోగ్యం సిరి-ఔషధగని'లో తెలియజేశారు. శరత్‌చంద్రగారి అనుబంధ నవల 'జీవన యానం' నిజజీవితానికి అద్దంపట్టేలా వుంది.

ర్యాలి సురేంద్రబాబు, వి.సావరం

◆మున్నెన్నడూ చదవని చారిత్రాత్మక అంశాలు, విజ్ఞాన వికాస విషయపూరిత వ్యాసాలు, పాఠకుల విలక్షణ, విచక్షణ విజ్ఞానస్పందిత రచనలు మాకు ఎంతో ఆసక్తిని, ప్రశంసలను కలిగిస్తున్నాయి.

ఎ.పి.రావు, విశాఖపట్నం

◆'వేదఛందస్సు' శీర్షికతో ప్రారంభమై, 'జీవన యానంతో' ముగిసిన ఈ నెల స్వాతి ఆసాంతం మధురాతి మధురంగా వుంది.

మానస సరోవర విశేషాలు నిజంగా అత్యంత మనోహరంగా ఉన్నాయి. వాణిశ్రీ 'ఎవరు నీవారు' కథ చాలా బాగుంది. అతిభయానక పరిస్థితులను ఎదుర్కోవలసివచ్చినా మనసులను కదిలించేలా వుంది. కొడవటిగంటి కుటుంబరావుగారి 'పానకంలో పీచు' కథ బాగుంది.

డా॥ శివభూషణం, కర్నూలు

◆కొడవటిగంటి కుటుంబరావుగారి 'పానకంలో పీచు' కథలో పల్లెటూరి, బస్తీ జీవితచిత్రణ బాగుంది. 'అప్పగింతలు' కథ ద్వారా వైదేహిపడ్డ బాధ గురించి చదివి చలించిపోయాం.

'ఎవరు నీవారు' కథలో ప్రస్తుత సమాజంలో డబ్బుంటేనే ఎవరైనా దగ్గరకు తీస్తారని తెలుపుతూ, అదే సమాజంలో లక్ష్మణరావులాంటి మంచివారు కూడా ఉంటారని నీతిపూర్వకంగా చెప్పారు.

ఈ ఉత్తరానికి ₹ 200 పారితోషికం

◆'ఎవరు నీవారు' కథ వాస్తవానికి దగ్గరగా ఉంది. కన్నకొడుకులు హరీష్, సురేష్, కూతురు పద్మావతిలు తండ్రి సీతారామయ్య చనిపోతే రాబోయే ఆస్తికోసం గ్రద్దల్లా.... తల్లి జానకిని పొడుచుకుతినటం కంటతడి తెప్పించింది.

దూరపు బంధువు కూడా కాని ఫైనాన్స్ కంపెనీ మేనేజర్ లక్ష్మణరావుపాత్ర ద్వారా రచయిత్రి వాణిశ్రీగారు నీకు నీ కొడుకుల బుద్ధి తెలియాలని నా దగ్గర డబ్బు లేదని నాటకం ఆడాను అంటూ 'కొసమెరుపు' నేటి కొడుకులకు చెంపపెట్టుగా వుంది.

'ఈ నెల ప్రశ్న'కి సమాధానం చమత్కారంగా ఉంది. శీర్షికలన్నీ చాలా బాగున్నాయి.

'ఆరోగ్యసిరి ఔషధగని బార్లీ' విశేషాలు కిచెన్ కెమిస్ట్ వ్యాసాలు ఉపయోగకరంగా ఉంటున్నాయి.శరత్‌చంద్రగారి అనుబంధ నవల 'జీవన యానం' అద్భుతంగా ఉంది.

ఈ.వేమన, శ్రీకాకుళం

వెంకటేష్‌గారి 'ఆ దారిలో...' కథ చాలాబాగుంది. పిల్లలను దండిస్తున్న టీచర్లపై తిరుగుబాటు ధోరణిలో ఆలోచించడం బాగుంది.'అష్టపది'లో నడిచిన వారు జన్మరాహిత్యాన్ని పొందుతారని తెల్సింది.

'మౌనంలో స్వరం' కథ చదువుతుంటే బంధాలనేవి ఏ దేశంవారికైనా ఒక్కటేనని అనిపిస్తూ కథ చివర్లో రెండు కన్నీటిబొట్లు రాల్చాం.

కె.రాధ, గంగారం

◆ 'జీవనయానం' నవల చాలా బాగుంది. కథలో ప్రేమను గురించి బాగా రాశారు.ప్రేమ ఏ దేశంలోనైనా ఒకటే అని వివరించిన తీరు బాగుంది. 'అక్కడ గడియారాలు ఘనీభవిస్తాయి', 'మౌనంలో స్వరం', 'ఎవరు నీవారు','అష్టపది' బాగా నచ్చాయి.

టి.సుబ్బమ్మ, రేపల్లె

◆ 'ఆ దారిలో', 'ఎవరు నీవారు', 'మౌనంలో స్వరం' కథలు చాలా బాగున్నాయి. రక్తసంబంధం ఎంత బలమైనదో ఈ కథలో చాలా బాగా రాశారు రచయిత. 'అతిభయానకం అత్యంత మనోహరం అష్టపది' సూపర్బ్‌గా వుంది. 'జీవనయానం' నవల మా కుటుంబసభ్యులందరికీ బాగా నచ్చింది. *కైలా భవ్యకుమారి, రేపల్లె*

◆ కథలన్నీ బాగున్నాయి.ఆలోచింపజేశాయి. 'కిచెన్ కెమిస్ట్రు' వాము గురించి తెలుసుకొని విస్తుపోయాం. మౌత్‌ఫ్రెషనర్‌గా ఇప్పుడు వామునే వాడుతున్నాం. గాంధీమహాత్ముని గురించి మరికొన్ని విషయాలు తెలియజేశారు.

గాంధీజయంతి రోజునే ఆయన గురించి తెల్సుకోవడం ఎంతో సమయోచితంగా అనిపించింది.

కె.సత్తిరెడ్డి, గొల్లలమామిడాడ

◆ 'పానకంలో పీచు' కథ నేటి పాఠకులకు చదివే అవకాశం కల్పించినందుకు, ఆనందంగా ఉంది.నాటికీ,నేటికీ మారని సామాజిక పరిస్థితులూ, మనుషుల ప్రవర్తనలూ జీవితంలో రాజీపడిపోవడమూ కథలో ఆవిష్కరించబడ్డాయి.

'ఆ దారిలో' కథ గొప్ప సందేశాన్ని ఇచ్చింది. ఇప్పటికే విద్యార్థులపట్ల దుర్మార్గంగా ప్రవర్తించే ఉపాధ్యాయులకు శిక్షలు విధించే ఉత్తర్వులు వెలువడినట్లు విన్నాను. 'ఎవరు నీవారు' కథలో వృద్ధులందరూ పాటించవలసిన అంశాలు ఎన్నో ఇందులో ఇమిడి వున్నాయి. *కె.బి.కృష్ణ, కాకినాడ*

◆ 'ఎవరు నీవారు' కథ చాలా బావుంది. తెలుగు ఛందస్సు తెలిసిన మాబోటి కవులకు 'వేదఛందస్సు' మాకు అత్యంత ప్రీతికరం, మార్గదర్శకం. అతిభయానకం, అత్యంత మనోహరమైన మానససరోవర యాత్రను తెలుసుకున్నాం.

జి.మోహనరావు, తమిళనాడు

◆ సాహిత్యవిలువను పెంచే 'వేద ఛందస్సు' వివరణ ఎంతో బాగుంది. భార్యకు ఎదురుచెప్పని గాంధీజీ వ్యక్తిత్వం, ఆమెకిచ్చిన గౌరవం, ఆ మహనీయుని ఆదర్శమూర్తిగా మా ముందు నిలబెట్టింది. గురువు చెప్పేబోధసరిగ్గాఅర్థంచేసుకోలేని శిష్యుడు పడేపాట్లు 'దేవుడు' ఫీచర్‌లో అవగతమైంది. కథలన్నీమంచిస్ఫూర్తితో ఆద్యంతం ఉత్కంఠగా చదివించాయి. అనుబంధ నవల 'జీవనయానం'లో శ్రీకాంత్ త్యాగనిరతి ఆకట్టుకుంది.

వి.వి.రమణ, కాకినాడ

◆ 'పానకంలో పీచు', 'అప్పగింతలు', 'ఎవరు నీవారు', 'ఆ దారిలో...', 'మౌనంలో స్వరం' కథలు చాలా బాగున్నాయి. 'దేవుడు', 'అతిభయానకం అత్యంత మనోహరం అష్టపది', 'అక్కడి గడియారాలు ఘనీభవిస్తాయి' ఫీచర్స్ అలరించాయి.

ఎమ్.రమేశ్‌చంద్ర, గుర్రంపేట ◇◇

మీ అభిప్రాయాలను, సూచనలను పోస్టుకార్డుపై మాత్రమే రాసి పంపండి.

ఈ నెల విడుదలలు



Courtesy . BEST OF ANDHRA PRADESH

'శ్రీ దుర్గా భవాని చరిత్ర' రచన : డా॥ జయంతి చక్రవర్తి, వెల : ₹ 200,(పాపులర్ ఎడిషన్), ₹ 250 (బౌండ్ ఎడిషన్).'దశమహావిద్యలు', వెల : ₹ 135. 'శ్రీ కనకదుర్గ వైభవం', వెల : ₹ 150 (పాపులర్ ఎడిషన్), ₹ 200 (బౌండ్ ఎడిషన్). 'శ్రీ దుర్గాదేవి స్తోత్రమాల', వెల : ₹ 15.

ప్రతులకు : సాయి వెంకటేశ్వర బుక్ డిపో, 26-27-77, బాటా షోరూమ్ ఎదురు, గాంధీనగర్, విజయవాడ-3; సాయి వెంకటేశ్వర బుక్‌డిపో, ప్లాట్ నెం.3, 103, 2-4-1085,సాయిలక్ష్మి నికేతన్, రామకృష్ణా హాస్పటల్ ఎదురువీధి, కాచిగూడ కుమార్ థియేటర్‌దగ్గర, నింబోలి అడ్డ, హైదరాబాద్-27.

'చిత్రాంగి' చారిత్రాత్మక పద్యనాటకం', రచన: తుర్లపాటి రామచంద్రరావు, వెల: ₹ 40. ప్రతులకు: తుర్లపాటి రామచంద్రరావు, ఫ్లాట్‌నెం. 126, ఫ్లాట్ నెం. 502, అక్కినాపల్లి మాన్షన్, రాజీవ్‌నగర్, యూసుఫ్‌గూడ పోస్టు, హైదరాబాద్-500 045.

'అమరం' సంపాదకుడు : డా॥ భీంపల్లి శ్రీకాంత్, వెల:₹ 30, ప్రతులకు:డా॥ భీంపల్లి శ్రీకాంత్, ఇంటి నెం.8-5-38,టీచర్స్‌కాలనీ,మహబూబ్‌నగర్-900. అన్ని ప్రముఖ పుస్తకకేంద్రాల్లో దొరుకును.

'బ్లడ్ క్యాన్సర్ (లుకేమియా) మరియు బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ ఒక అవగాహన' రచన : డా॥ జక్కుల విజయ్‌రావు, (తెలుగు అనువాదం: శ్రీమతి కె.రాధామూర్తి), వెల : ₹ 200

కాపీలకు : రచయిత: డా॥జెవెల్. ప్రవలిక, ప్లాట్ నెం.1, శ్రీ చంద్ర హోమ్స్, టీచర్స్ కాలని, చక్రిపురం, ఇసిఐఎల్ (పోస్టు), హైదరాబాద్-62.

'పాఠం పూర్తయ్యాక' కవిత రచన : దాట్లదేవదానం రాజు, వెల : ₹ 60.

కాపీలకు : దాట్లదేవదానం రాజు, 8-1-048, 'ఉదయిని' జక్రినగర్, యానాం-533 464;

విశాలాంధ్ర బుక్‌హౌస్, నవోదయ బుక్‌హౌస్, పాలపిట్ట బుక్స్, హైదరాబాద్.

'తదేక గీతం-చైతన్య దీపం' రచన : నెర్లిమర్ల లక్ష్మి వెల : ₹ 60, కాపీలకు : క్రీసెంట్ పబ్లికేషన్స్, 29-25-43ఎ, వేమూరివారి వీధి, సూర్యారావుపేట, విజయవాడ-520 002.

'తాన! తందాన!' కవితల సంపుటి రచన : ఎస్.వివేకానంద, వెల : ₹ 100.

ప్రతులకు : ఎస్.వివేకానంద, వసుంధరా పబ్లికేషన్స్, ఇం.నెం. 11-3-34/9, రోడ్ నెం.15, శ్రీ వేంకటేశ్వరా కాలనీ, సరూర్‌నగర్, హైదరాబాద్-35, విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు,నవోదయ బుక్ హౌస్, కాచిగూడ రోడ్, హైదరాబాద్-27.

'చీకటి గీతలు' కథల సంపుటి

రచన : గవర ఈశ్వరరావు, వెల : ₹ 100.

ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 4-1-435, విజ్ఞాన్‌భవన్, బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్-1; ప్రజాశక్తి బుక్‌హౌస్, డోర్ నెం. 21/1, ఎమ్.హెచ్. భవన్, అజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, ఆర్.టి.సి కళ్యాణమండపం దగ్గర, హైదరాబాద్-20;

పాలపిట్ట బుక్స్, హౌస్ నెం. # 16-11-20/6/1/1, ఫ్లాట్-103, విజయసాయి రెసిడెన్సీ, సలీమ్ నగర్, మలక్‌పేట, హైదరాబాద్-36.

'మౌనరాగం' రచన : అంగులూరి అంజనీదేవి, వెల : ₹ 70, ప్రతులకు : మధుప్రియా పబ్లికేషన్స్, మాచవరం, విజయవాడ-520 004.

'**అడ్డా' కథానికల సంపుటి** రచన:శైలజామిత్ర, వెల : ₹ 80, ప్రతులకు: పాలపిట్ట బుక్స్,హౌస్ నెం. #16-11-20/6/1/1, #403, విజయశ్రీ రెసిడెన్సీ, సలీమ్ నగర్, మలక్‌పేట, హైదరాబాద్-500 036; శైలజామిత్ర, 98,సౌజన్య ఎవెన్యూ, ఎస్.బి.ఐ కాలనీ, గాంధీనగర్, హైదరాబాద్-500 080.

'**బహుముఖ ప్రజ్ఞాశాలి ధర్మపురి కృష్ణమూర్తి' (సంక్షిప్త జీవితచరిత్ర)** రచన : డా॥ దేవరకొండ సహదేవరావు, వెల : ₹ 75,

ప్రతులకు : డా॥ డి. సహదేవరావు, సుష్మిత ఎన్‌క్లేవ్, #50-50-27(3), బి.ఎస్.లేఅవుట్, విశాఖ పట్నం-530 013; డి.ఎస్.రాజు, S/o.డి.కె.మూర్తి, ప్రేమ్‌నగర్, 4వ లైన్, బరంపురం-760 002, ఒరిస్సా. డి. అరుణ, C/o. డి.టి.రాజు, ఆఫీసర్, హెచ్.సి.సి.ఎల్, జి-2, ఇంద్రాణి రెసిడెన్సీ, గణేష్ సినిమాహాల్ రోడ్డు, ఆదిలాబాద్- 504 001.

'**మన విజయవాడ' (కవితా సంకలనం)** రచన: చలపాక ప్రకాష్, వెల:₹50, ప్రతులకు: రమ్యభారతి సాహిత్య త్రి మాసపత్రిక, 1-4/3-36, సంజయ్ గాంధీ కాలనీ, విద్యాధరపురం, విజయవాడ-12.

'**గుడుగుడు కుంచం'** బాలల గేయాలు, రచన: వేటూరి ప్రభాకరశాస్త్రి, వెల : ₹ 75. '**వేడుక పాటలు' పిల్లల కోసం,** రచన: డా॥వి.ఆర్.రాసాని, వెల: ₹ 60. '**పని పాటలు' పిల్లల కోసం,** రచన : డా॥ వి.ఆర్.రాసాని వెల : ₹ 60.

'**అగాధం'** రచన : కె. అశ్విని, వెల : ₹ 75, ప్రతులకు : మిసిమి పబ్లికేషన్స్, కళాజ్యోతి ప్రాసెస్ ప్రైవేట్ లిమిటెడ్, 1-1-60/5, ఆర్.టి.సి., X రోడ్స్, ముషీరాబాద్, హైదరాబాద్-500 020.

'**ఆంధ్రప్రదేశ్‌లో నవతరం'** రచన : తిప్పినేని రామదాసప్పనాయుడు, వెల : ₹200. ప్రతులకు : టి.రామదాసప్పనాయుడు, 2-1-465, 6వ వీధి, నల్లకుంట, హైదరాబాద్-500 044.

'**నా చిన్నతనం'** పిల్లల కోసం రచన : మోహన్‌దాస్ కరమ్‌చంద్‌గాంధీ, వెల : ₹ 60.

ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్, బ్రాంచీలు, హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, అనంత పురం, గుంటూరు, తిరుపతి, ఒంగోలు, హనుమ కొండ, కాకినాడ, కరీంనగర్, శ్రీకాకుళం.

'**ఒక స్థితప్రజ్ఞుని జీవితచరిత్ర'** రచన : వివేకా నంద మిట్టపల్లి విఠలాచార్య, వెల : ₹ 40.

ప్రతులకు: శ్రీ వివేకానంద విఠలాచార్య, ఇంటి నెం. 4-482/5, ప్లాట్ నెం. 78/బి, న్యూ బాలాజీ నగర్, మీర్‌పేట గ్రామం, సరూర్‌నగర్ (మండలం), రంగారెడ్డి జిల్లా-500 097.

శ్రీ వి.రాజేందరరావు, ప్లాట్‌నెం. ఎమ్.ఐ.జి-20, ఫేజ్-4, వనస్థలిపురం, హైదరాబాద్-70; శ్రీ కటకం రాజేశం, విజయలక్ష్మి బుక్ సెల్లర్స్, పెట్రోల్ పంపు దగ్గర, వివేకానందరోడ్డు, పోస్టు మరియు మండలం కోరుట్ల, కరీంనగర్ జిల్లా-505 326.

'**వందేకృష్ణం'** రచన : డా॥ కె.వి.కృష్ణకుమారి, వెల : ₹ 100, ప్రతులకు : సాహితీ ప్రచురణలు, 29-13-53, కాళేశ్వరరావురోడ్డు, సూర్యారావుపేట, విజయవాడ-2.

'**బతుకుబండి కథలు'** రచన : గనారా, వెల : ₹40, ప్రతులకు : సాహితీ స్రవంతి, C/o. ప్రజాశక్తి బుక్ హౌస్, కార్ల్‌మార్క్స్ రోడ్డు, విజయవాడ-2.

'**మహారాజశ్రీ అవతారంగారు'**
రచన : సింహప్రసాద్, వెల : ₹ 100.

'**బ్రహ్మానందలహరి'(హాస్యకథలు)** వెల : ₹100. ప్రతులకు : శ్రీశ్రీ ప్రచురణలు, 401, మయూరి ఎస్టేట్స్, ఎమ్.ఐ.జి-II- 650, కె.పి.హెచ్.బి.కాలనీ, హైదరాబాద్-500 072.

'**బాలల భువన విజయం' (సాహిత్యరూపకం)** రచన : కేవిస్వీ, వెల : ₹ 25, '**సరసమైన కథలు'** రచన : కేవిస్వీ, వెల : ₹ 150,

ప్రతులకు : ఓరియన్ పబ్లికేషన్స్, శ్రీ సుజ్ఞానా నంద ఆశ్రమం కాంపౌండ్, నందిసర్కిల్, కె.టి. రోడ్డు, తిరుపతి-517 501. <<

జీవితంలో పుస్తకాలే మంచి దారి చూపిస్తాయి.

సంక్షిప్త పంచాంగం

శ్రీ నందన నామ సంవత్సర ఆశ్వయుజ బహుళ విదియ నుండి
కార్తిక బహుళ విదియ వరకు

2012 నవంబరు

01 గురు । విదియ ఉ. 6.17 వరకు। కృత్తిక ప. 8.23 వరకు। రా.వ. 2.30ల 4.19 వరకు। ప.దు. 9.51ల 10.37 వరకు। మ.దు. 2.27ల 3.13 వరకు। రాహుకాలం మ. 1.14ల 2.40 వరకు। మంచి సమయం ప. 11.30ల 1.00 వరకు.

02 శుక్ర । తదియ ప. 8.59 వరకు। రోహిణి ప. 11.33 వరకు। సా.వ. 5.52ల 7.40 వరకు। ప.దు. 8.19ల 9.05 వరకు। మ.దు. 12.08ల 12.54 వరకు। రాహుకాలం ప. 10.22ల 11.48 వరకు మంచి సమయం ప. 9.20ల 10.20 వరకు.

03 శని । చవితి ప.11.39 వరకు। మృగశిర మ.2.39 వరకు। రా.వ.12.03ల 1.51వరకు। ఉ.దు. 6.03ల 7.35 వరకు। రాహుకాలం ప.8.56ల 10.22 వరకు। మంచి సమయం ప.10.25ల 11.20 వరకు.

04 ఆది । పంచమి మ. 2.07 వరకు। ఆర్ద్ర సా. 5.32 వరకు। వర్జ్యం లేదు। సా.దు. 3.58ల 4.44 వరకు। రాహుకాలం సా. 4.04ల 5.30 వరకు। మంచి సమయం మ. 1.30ల 2.40 వరకు.

05 సోమ । షష్ఠి సా. 4.09 వరకు । పునర్వసు రా. 8.00 వరకు। ఉ.వ. 6.46ల 8.32 వరకు । తె.వ. 4.38లగా...। మ.దు. 12.09ల 12.55 వరకు। మ.దు. 2.26ల 3.12 వరకు। రాహుకాలం ఉ. 7.31ల 8.57 వరకు। మంచి సమయం ప. 9.10ల 11.00 వరకు.

06 మంగళ । సప్తమి సా. 5.37 వరకు। పుష్యమి రా. 9.53 వరకు। ...శే.వ. 6.22 వరకు। ప.దు. 8.21ల 9.07 వరకు। రా.దు. 10.31ల 11.17 వరకు । రాహుకాలం మ. 2.39ల 4.05 వరకు। మంచి సమయం లేదు.

07 బుధ । అష్టమి సా.6.22 వరకు। ఆశ్లేష రా.11.04 వరకు। ప.వ.11.19ల 1.00 వరకు। ప.దు. 11.24ల 12.10 వరకు। రాహుకాలం మ.11.48ల 1.14 వరకు। మంచి సమయం మ.2.10ల 3.00 వరకు.

08 గురు । నవమి సా. 6.19 వరకు। మఘ రా. 11.29 వరకు। ప.వ. 11.17ల 12.55 వరకు। ప.దు. 9.51ల 10.37 వరకు। మ.దు. 2.27ల 3.13 వరకు। రాహుకాలం మ. 1.14ల 2.40 వరకు। మంచి సమయం ఉ. 9.00ల 9.45 వరకు.

09 శుక్ర । దశమి సా. 5.27 వరకు। పూర్వఫల్గుని రా. 11.05 వరకు। ఉ.వ. 7.21ల 8.55 వరకు ప.దు. 8.19ల 9.05 వరకు। మ.దు. 12.08ల 12.54 వరకు। రాహుకాలం ప. 10.22ల 11.48 వరకు। మంచి సమయం సా. 4.45ల 6.20 వరకు.

10 శని । ఏకాదశి మ. 3.49 వరకు। ఉత్తరఫల్గుని రా. 9.56 వరకు। ఉ.వ. 5.56ల 7.27 వరకు। ఉ.దు. 6.03ల 7.35 వరకు। రాహుకాలం ప. 8.56ల 10.22 వరకు। మంచి సమయం ప. 10.50ల 12.00 వరకు.

11 ఆది । ద్వాదశి మ. 1.28 వరకు। హస్త రా. 8.08 వరకు। ఉ.వ. 5.42ల 7.11 వరకు। రా.వ. 3.21ల 4.48 వరకు। సా.దు. 3.58ల 4.44 వరకు। రాహుకాలం సా. 4.04ల 5.30 వరకు। మంచి సమయం మ. 2.30ల 3.30 వరకు.

12 సోమ । త్రయోదశి ప. 10.34 వరకు। చిత్త సా. 5.48 వరకు। రా.వ. 10.46ల 12.11 వరకు మ.దు. 12.09ల 12.55 వరకు। మ.దు. 2.26ల 3.12 వరకు। రాహుకాలం ఉ. 7.31ల 8.57 వరకు మంచి సమయం ప. 11.00ల 11.45 వరకు.

13 ● మంగళ । చతుర్దశి ఉ. 7.14 వరకు। అమావాస్య రా. 3.38 వరకు। స్వాతి మ. 3.07 వరకు రా.వ. 8.02ల 9.26 వరకు। ప.దు. 8.21ల 9.07 వరకు। రా.దు. 10.31ల 11.17 వరకు। రాహుకాలం మ. 2.39ల 4.05 వరకు। మంచి సమయం లేదు.

14 బుధ । కార్తిక శుద్ధ పాడ్యమి రా. 11.56 వరకు। విశాఖ మ. 12.13 వరకు। మ.వ. 3.44ల 5.08 వరకు। ప.దు. 11.24ల 12.10 వరకు। రాహుకాలం మ. 11.48ల 1.14 వరకు। మంచి సమయం ఉ. 7.00ల 8.00 వరకు.

15 గురు । విదియ రా. 8.19 వరకు। అనూరాధ ప. 9.18 వరకు। మ.వ. 2.15ల 3.40 వరకు। ప.దు. 9.51ల 10.37 వరకు। మ.దు. 2.27ల 3.13 వరకు। రాహుకాలం మ. 1.14ల 2.40 వరకు। మంచి సమయం ప. 10.40ల 11.40 వరకు.

16 శుక్ర । తదియ సా. 4.55 వరకు। జ్యేష్ఠ ఉ. 6.31 వరకు। మూల తె. 4.03 వరకు। మ.వ. 1.42ల 3.08 వరకు। రా.వ. 2.37ల 4.03 వరకు। ప.దు. 8.19ల 9.05 వరకు। మ.దు. 12.08ల 12.54 వరకు। రాహుకాలం ప. 10.22ల 11.48 వరకు। మంచి సమయం లేదు.

17 శని । చవితి మ. 1.55 వరకు। పూర్వాషాఢ రా. 2.01 వరకు। మ.వ. 12.50ల 2.18 వరకు। ఉ.దు. 6.03ల 7.35 వరకు। రాహుకాలం ప. 8.56ల 10.22 వరకు। మంచి సమయం లేదు.

18 ఆది । పంచమి ప. 11.24 వరకు। ఉత్తరాషాఢ రా. 12.34 వరకు। ప.వ. 9.33ల 11.03 వరకు తె.వ. 4.26 లగా...। సా.దు. 3.58ల 4.44 వరకు। రాహుకాలం సా. 4.04ల 5.30 వరకు। మంచి సమయం మ. 2.00ల 3.00 వరకు.

19 సోమ । షష్ఠి ప. 9.31 వరకు। శ్రవణం రా. 11.47 వరకు। ...శే.వ. 5.59 వరకు। రా.వ. 3.46లగా... మ.దు. 12.09ల 12.55 వరకు। మ.దు. 2.26ల 3.12 వరకు। రాహుకాలం ఉ.7.31ల 8.57 వరకు మంచి సమయం ప. 10.30ల 12.00 వరకు.

20 మంగళ । సప్తమి ప. 9.21 వరకు। ధనిష్ఠ రా. 11.42 వరకు। ...శే.వ. 5.22 వరకు। ప.దు. 8.21ల 9.07 వరకు। రా.దు. 10.31ల 11.17 వరకు ।రాహుకాలం మ. 2.39ల 4.05 వరకు। మంచి సమయం ప.10.20ల 12.00 వరకు.

21 బుధ । అష్టమి ఉ. 7.54 వరకు। శతభిషం రా. 12.20 వరకు। ఉ.వ. 7.06ల 8.44 వరకు। ప.దు. 11.24ల 12.10 వరకు। రాహుకాలం మ. 11.48ల 1.14 వరకు। మంచి సమయం మ. 2.00ల 3.00 వరకు.

22 గురు । నవమి ప. 8.10 వరకు। పూర్వాభాద్ర రా. 1.38 వరకు। ఉ.వ. 7.05ల 8.46 వరకు। ప.దు. 9.51ల 10.37 వరకు। మ.దు. 2.27ల 3.13 వరకు। రాహుకాలం మ. 1.14ల 2.40 వరకు। మంచి సమయం లేదు.

23 శుక్ర । దశమి ప. 9.07 వరకు। ఉత్తరాభాద్ర రా. 3.32 వరకు। ప.వ. 11.59ల 1.43 వరకు। ప.దు. 8.19ల 9.05 వరకు। మ.దు. 12.08ల 12.54 వరకు। రాహుకాలం ప. 10.22ల 11.48 వరకు మంచి సమయం ప. 10.05ల 10.20 వరకు। మ. 2.00ల 3.00 వరకు.

24 శని । ఏకాదశి ప. 10.39 వరకు। రేవతి పూర్తి। సా.వ. 4.44ల 6.29 వరకు। ఉ.దు. 6.03ల 7.35 వరకు। రాహుకాలం ప. 8.56ల 10.22 వరకు। మంచి సమయం ప. 11.50ల 3.00 వరకు.

25 ఆది । ద్వాదశి మ. 12.39 వరకు । రేవతి ఉ. 5.54 వరకు: తదుపరి అశ్విని । తె.వ. 4.11లగా... సా.దు. 3.58ల 4.44 వరకు । రాహుకాలం సా. 4.04ల 5.30 వరకు । మంచి సమయం ఉ. 4.00ల 5.00 వరకు । ప. 10.00ల 11.10 వరకు.

26 సోమ । త్రయోదశి మ. 3.00 వరకు । అశ్విని ప. 8.38 వరకు । ...శే.వ. 5.58 వరకు । సా.వ. 7.25ల 9.13 వరకు । మ.దు. 12.09ల 12.55 వరకు । మ.దు. 2.26ల 3.12 వరకు । రాహుకాలం ఉ. 7.31ల 8.57 వరకు । మంచి సమయం ఉ. 4.30ల 5.30 వరకు.

27 మంగళ । చతుర్దశి సా. 5.35 వరకు । భరణి ప. 11.36 వరకు । రా.వ. 1.08ల 2.56 వరకు । ప.దు. 8.21ల 9.07 వరకు । రా.దు. 10.31ల 11.17 వరకు । రాహుకాలం మ. 2.39ల 4.05 వరకు । మంచి సమయం లేదు.

28 ○ బుధ । పూర్ణిమ రా. 8.16 వరకు । కృత్తిక ప. 2.42 వరకు । వర్జ్యం లేదు । ప.దు. 11.24ల 12.10 వరకు । రాహుకాలం మ. 11.48ల 1.14 వరకు । మంచి సమయం ప. 9.45ల 10.00 వరకు । మ. 1.15ల 1.45 వరకు.

29 గురు । బహుళ పాడ్యమి రా. 10.57 వరకు । రోహిణి సా. 5.49 వరకు । ప.వ. 8.47ల 10.35 వరకు । రా.వ. 12.07ల 1.55 వరకు । ప.దు. 9.51ల 10.37 వరకు । మ.దు. 2.27ల 3.13 వరకు రాహుకాలం మ. 1.14ల 2.40 వరకు । మంచి సమయం ప. 11.30ల 1.00 వరకు.

30 శుక్ర । విదియ రా. 1.32 వరకు । మృగశిర రా. 8.51 వరకు । వర్జ్యం లేదు । ప.దు. 8.19ల 9.05 వరకు । మ.దు. 12.08ల 12.54 వరకు । రాహుకాలం ప. 10.22ల 11.48 వరకు । మంచి సమయం ప. 9.40ల 10.20 వరకు.

2012 నవంబరు నెలలోని ముఖ్య పండుగలు :

1- ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం, అట్లతద్ది, 10- మతత్రయ ఏకాదశి, 12- మాసశివరాత్రి, 13- నరక చతుర్దశి, దీపావళి, 14- బాలల దినోత్సవం, కార్తికమాస ప్రారంభం, 15- చంద్రదర్శనం, తోబుట్టువుల చేతిభోజనం, 16- వృశ్చిక సంక్రమణదినం, మొహరం నెలారంభం, 17- నాగులచవితి, 21- ధనురయనం, 23- యాజ్ఞవల్క్యజయంతి, 24- మతత్రయ ఏకాదశి, 25- క్షీరాబ్ధి ద్వాదశి, మొహరం, 26- వైకుంఠచతుర్దశి, 28- మహాకార్తికి, జ్వాలాతోరణం.

యోగక్షేమాలు :

1, 2, 4, 10, 19, 23, 24, 29- ఉద్యోగ, వ్యాపార ప్రయత్నాలకు, అధికారులను కలుసుకోవడానికి, నూతన వస్తువులు కొనుగోలుచేయడానికి, నూతన విద్యాభ్యాస ఆరంభానికి అనుకూలం.

3, 8, 12, 18, 23, 24, 30- ఏజెన్సీల ప్రయత్నాలకు, శిల్ప, నాట్యకళలు ప్రారంభించడానికి, ప్రయాణాలు చేయడానికి అనుకూలం.

1, 2, 9, 11, 18, 22, 24, 25- రాజకీయ నాయకులను కలుసుకోవడానికి, క్రీడలలో పాల్గొనడానికి, షేర్ల క్రయ-విక్రయాలకు, రియల్ ఎస్టేట్ల వ్యాపారాలకు అనుకూలం.

6, 13, 16, 20, 23- వాహనమార్పులు చేసుకోవడానికి, పెండింగ్ పనులు పూర్తిచేసుకోవడానికి, బ్యాంకింగ్ వ్యాపారాలకు, వ్యవసాయపనులు ప్రారంభించడానికి, విత్తనాలు చల్లడానికి.

5, 14, 17, 26, 28- ఇరుగు-పొరుగులతో కలహాలు సూచితం, అనవసర ఖర్చులు, అపవాదములు పొందుట, వస్తు-వ్యవహారనష్టములు పొందే సూచనలున్నాయి.

7, 15, 21, 27- నమ్మినవారిద్వారా మోసపోవడం, ఋణదాతలవల్ల ఒత్తిడులు పొందడం, మనోభీతిలు పొందడంవంటి స్థితులు ఉంటాయి.

◇◇



పాత కెరటాలు

మాలతీ చందూర్

ఈనాడు ప్రతిఒక్కరూ చెవికి సెల్‌ఫోన్ ఆనించుకుని వున్న ఊరులో వారికే కాదు అమెరికా, ఆస్ట్రేలియావంటి దేశాల్లో వున్న వాళ్ళతో నిల్చున్నచోటనుంచే మాట్లాడుతున్నారు.

మామూలు మనిషి పైదేశాల వారితో ఇంట్లో పక్కన కూచున్నవారితో మాట్లాడినట్లు సులువుగా మాట్లాడ గలుగుతున్నాడు అంటే అందుకు కారణం అలెగ్జాండర్ గ్రాహమ్‌బెల్ అనే అద్భుత వ్యక్తి. ఈ మహనీయుడు దూరాన్ని జయించిన శాస్త్రజ్ఞుడు. తను కనుగొన్న పరికరం మానవాళి మధ్య గలదూరాన్ని శబ్దరూపంలో దగ్గరకు తీసుకొచ్చిన అద్భుత సాధనం టెలిఫోన్.

ఈనెల అలెగ్జాండర్ గ్రాహమ్‌బెల్ జీవితం, ఆయన ప్రేమించి పెళ్ళిచేసుకున్న చెవిటి అమ్మాయిని గురించి నవల 'మేక్ జాయ్‌ఫుల్ సౌండ్' 'శబ్దతరంగాల ఆనందం' అన్న నవలని స్వాతి పాఠకులకి పరిచయంచేస్తున్నాను.

'టెలిఫోన్' దూరశ్రవణ వాణిని కనిపెట్టిన అలెగ్జాండర్ గ్రాహమ్‌బెల్ చెవులు వినిపించని తనకంటే పాతికేళ్ళ చిన్నపిల్లని పెళ్ళిచేసుకుని, ఆమెకి మాట్లాడటం, టెలిఫోన్‌లో సంభాషణనేర్పాడు అంటే వినే వాళ్ళకి ఆశ్చర్యంగా వుంటుందిగాని అసలు అలెగ్జాండర్ 'చూపు ద్వారా సరి అయిన ఉచ్చారణ' అన్న ప్రయోగం తండ్రి నుంచి నేర్చుకుని, వినికిడి లేనివారికి కంటిచూపుద్వారా మాటలు, మాట్లాడటం, తండ్రినుంచే నేర్చుకున్నాడు.

కొందరికి పుట్టుకతోనే చెవులు వినిపించకపోవటంతో ఆ బధిరులు మూగవారు అయిపోతారు. సాధారణంగా పుట్టుకతోనే చెవిటివారు మాట్లాడలేక పోతారు. ఎందుచేతనంటే 'మాట' అన్నది శబ్దం.

ఈ శబ్దం వినిపించనప్పుడు మాట ఎలా పలకాలో తెలియక వారు మూగవారు అయిపోతూ సౌంజ్ఞలద్వారా జీవితం వెళ్ళతీస్తూంటారు.

యువకుడైన అలెగ్జాండర్ చెవిటివారి చేత మాట్లాడించటం, వారి నోటి నుంచి శబ్దం రావటం, పరిశోధనచేసి, చెవిటివారు ఎదుటివారి పెదిమల కదలిక ద్వారా ఆ కదలికను బొమ్మల ద్వారా తెలియబరిచి, అలా 'విజబుల్ స్పీచ్ సిస్టమ్' బోస్టన్ లోని స్కూళ్ళలో నేర్పుతున్నప్పుడు మేబుల్ హెబ్బర్డ్ ప్రేమలో పడతాడు.

అలెగ్జాండర్ గ్రాహంబెల్‌కి మొదటి నుంచీ 'శబ్దం'పై కొత్త పరిశోధనలు చెయ్యటం సరదా. ఒకరోజున తమ పెంపుడు కుక్క రెండు దవడలూ గట్టిగా నొక్కి పట్టుకున్నపుడు దాని నోట్లోంచి

శబ్దతరంగాల ఆనందం : హెలెన్‌వైట్

● పనిలోనే ఆనందించేవానికి ఫలితంపై ఆలోచన ఉండదు.

వింత శబ్దం. 'అమ్మమ్మరా' అన్న మాటని పోలిన ఒక మాదిరి శబ్దం రావటంతో అలెగ్జాండరు అదే పరిశోధన దాని నోటిమీద ప్రయోగించగా, ఇంటి కొచ్చిన బంధువులంతా 'ఈ కుక్క అమ్మమ్మరా' అంటున్నదని ఆశ్చర్యపడిపోయేవారు. ఈ కుక్క నోటినుంచి వెలువడే శబ్దం వినటానికి దూరదూరం నుంచీ ప్రజలు వచ్చేవారు.

మొదటినుంచీ అలెగ్జాండర్ పీలగా, అనారోగ్యంగా వుండేవాడు. ఇంగ్లండూ,స్కాట్లండూలోని పొగ మంచుకి అతని ఆరోగ్యం దెబ్బతిన్నది. బతకడంటారు వైద్యులు.

తండ్రి పట్టుదలతో అలెగ్జాండరుని కెనడా తీసుకెళ్ళి కొన్నాళ్ళు కొడుకుతో గడుపుతాడు. ఆరోగ్యం కుదుటపడుతుంది. అప్పుడు తండ్రితోపాటు అలగ్జాండర్ బోస్టన్ రావటం అక్కడ తండ్రి ప్రోత్సాహంతో 'మూగ బధిర స్కూలులో టీచింగ్ పోస్టుకి అప్లయ్ చెయ్యటం అతను టీచరుగా వున్న కాలంలోనే మేబుల్ హెబ్బార్డ్‌తో ఆయన పరిచయం ప్రేమగా మారుతుంది.

మేబుల్‌కి నాలుగేళ్ళపుడు 'స్కార్లెట్‌ఫీవర్' విపరీతంగా వస్తుంది. పసితనం నుంచీ చురుకుగా కబుర్లు చెపుతూ ఆటపాటల్లో ఉత్సాహంగా గడిపే మేబుల్ పక్కమీంచి లేవలేక బలహీనంగా, నిరుత్సాహంగా వుంటున్నదని కనిపెట్టిన తల్లి, కూతురికి బొమ్మలూ, ఆట వస్తువులూ చూపించి మాట్లాడించాలని చూస్తుంది.

నవ్వుతూ తుళ్ళుతూండే ఈ పిల్లని మామూలు పిల్లని చెయ్యాలని చూస్తుంది. కాని మేబుల్ నవ్వదు. నిరుత్సాహంగా పడుకునివుంటుంది.

ఒక రోజున తల్లి మేబుల్‌ని బలవంతాన ఎగ్జిబిషన్‌కి తీసుకువెళితే, అక్కడ వున్న చిటికెన వేలంత దొరసాని బొమ్మనిచూసి మేబుల్ 'బుల్లి దొరసాని' అంటూ నెలల తరబడి నిశబ్దంగా వున్న మేబుల్ నోటి నుంచి కీచుగా ఆ మాటరావడంతో తల్లికి మేబుల్ మూగది అవలేదు మాట్లాడగలుగుతుంది అన్న ఆశ కలుగుతుంది.

మేబుల్ నెమ్మది నెమ్మదిగా మాట్లాడగలుగుతుందిగాని ఒక రోజున తల్లిని అడుగుతుంది "అమ్మా పక్షులు కుయ్యవేమిటి?" నువ్వు నాతో మాట్లాడటం మానేశావుకదూ!" అనడుగుతుంది.

అప్పుడు తల్లి గ్రహిస్తుంది మేబుల్ మాటరాక కాదు మాటలు వినిపించక, చెవులు వినిపించకపోవటంచేత మాట్లాడటంలేదు అని అలా తల్లి మేబుల్‌ని అన్ని స్కూళ్ళకి తీసుకువెళుతుంది.

ప్రతి స్కూల్లో ఒకటే జవాబు. పుట్టు చెవిటి పిల్లలు మాట్లాడలేరు.ఎందుకంటే వారికి ఏ వస్తువ పేరూ తెలియదు.శబ్దంలేకపోవటంవల్ల వస్తువులని పేరుపెట్టి పిలవలేరు.తల్లిదండ్రులతో మాట్లాడలేరు. శబ్దంవల్లనే మాట వస్తుంది. శబ్దరహితమైనపుడు మాటలు రావు అని. ఐతే మేబుల్‌కి నాలుగేళ్ళపుడు జ్వరం రావటంవల్ల చాలా పసితనంలో విన్నశబ్దాలు, మాటలు గుర్తున్నాయి తప్ప కొత్త మాటలు రావు అన్నది స్పష్టంచేస్తారు.

మేబుల్ తండ్రి న్యాయవాది. సంపన్నుడు. మూడో కూతురు మేబుల్‌కి ఎలాగైనా మాట్లాడటం నేర్పాలి. ఈ పిల్లని మూగబధిర స్కూల్లో జేర్పించి ప్రయోజనం లేదు. కొత్త పద్ధతిలో మాట్లాడటం నేర్పాలనుకుంటాడు. అప్పటికి మేబుల్‌కి పదేళ్ళు అలెగ్జాండర్ బెల్ బోస్టన్‌లోని మూగబధిర పిల్లలకు కొత్త మార్గాన 'విజబుల్‌స్పీచ్' ద్వారా మాట్లాడటం నేర్పే ప్రక్రియ ప్రారంభించాడని విని, అతని దగ్గరకు మేబుల్‌ను తీసుకెళతారు.

తనకంటే పాతికేళ్ళు చిన్న అయిన ఆ పిల్ల కళ్ళలోని మెరుపు, చిలిపితనం, చురుకుచూసి అలెగ్జాండరు ఆకర్షితుడవుతాడు.

మేబుల్‌తల్లితో 'సౌంజ్ఞలు పిల్లలశబ్ద గ్రహణశక్తికి అడ్డుకట్ట వేస్తాయని ఎదుటి వారి పెదిమల కదలిక

● తాము అనుసరించలేని మంచితనాన్ని చూసి ప్రతివ్యక్తీ భయపడతాడు.



అరక్యారెట్ తింటే చాలు

నిండుగా ఆరెంజ్ కలర్‌లో నిగనిగలాడే క్యారెట్లు తింటే కంటికి చాలా మంచిదన్నది సంగతి అందరికీ తెలిసిన పాత సంగతి. వీటిని ఎక్కువగా తినడంవల్ల గుండెకూ మంచిదనేది కొత్తవిషయం. డచ్‌పరిశోధకులు దాదాపు 20 వేలమంది ఆహారపు అలవాట్లపై పరిశోధనలు నిర్వహించారు.

నిండు ఆరెంజ్ కలర్ కూరగాయలు, పండ్లు ముఖ్యంగా క్యారెట్లు తినడంవల్ల మిగతారంగులవి (ఆకుపచ్చ, ఎరుపు, తెలుపు, పర్పుల్ వంటివి) తినేవారికంటే ఎక్కువ పరిరక్షణ కలుగుతుందని తమ పరిశోధనల్లో గుర్తించారు.

రోజుకు ఓ సగం క్యారెట్ తింటున్నా 32 శాతం గుండె జబ్బుల రిస్క్ తగ్గిపోతుంది. క్యారెట్‌లో ఆల్ఫా, బీటా కెరొటొనాయిడ్స్ ఎక్కువగా ఉండడమే ఇందుకు కారణం. ఇవి యాంటీ ఆక్సిడెంట్స్‌గా పనిచేస్తాయి. చిలగడదుంపలు, గుమ్మడి కూడా చాలా మంచివి. వీటితో తయారైన స్క్వాష్‌లు చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. ◆

వల్ల, ఆ వస్తువు గుర్తించటం నేర్పమని' చెపుతాడు. ఒకొక్క అక్షరాన్ని పెదిమల కదలికతో కనబడేటట్టు చేసి ఆ అక్షరాన్ని కాయితం మీద రాస్తే ఎలా ఉచ్చరించాలో మేబుల్ తెలుసుకుని, నెమ్మదిగా మాట్లాడటం నేర్చుకుంటుంది.

తొలి పాఠంగా సరిగ్గా పాలు తాగే సమయానికి ఒక కప్పు పాలు అందకుండా దూరంగా వుంచి పాలు అన్న శబ్దం మేబుల్ అనగలిగేదాకా పెదిమలు కదుపుతూ ఆ కదలిక ద్వారా 'పాలు' అన్న మాట ఆ పిల్ల నోటి నుంచి వచ్చాక ఆ పాల కప్పు దగ్గరకు తొయ్యండి' అంటాడు.

మేబుల్ తల్లి అక్షరాల అలెగ్జాండరు చెప్పింది చెప్పినట్లు పాటిస్తూ పాలకప్పు కనిపించేంత దూరంగా వుంచి కూతురు నోటివెంట పాలు అన్న మాట వచ్చేదాకా తిరిగి తిరిగి తను అని పది నిముషాలకి పాలు అన్న తరువాత కప్పు అందిస్తుంది. సహజంగా మేబుల్ తెలివైనది.

చిన్నతనంలోని శబ్దాలు ఇంకా మర్చిపోలేదు. తల్లి పదేపదే పాలు అనటం గ్రహించుకుని, వినిపించకపోయినా 'పాలు' అనటంవల్ల ఆ అమ్మాయికి మాటలు వస్తాయని పెదవుల కదలికతో మాటలని గుర్తించగల శబ్దగ్రహణశక్తి క్రమంగా వస్తుంది.

అప్పటికే విజబుల్ స్పీచ్ సిస్టమ్‌లో అంటే పెదవుల కదలికద్వారా చెవిటివారికి మాటలు నేర్పవచ్చు అన్నదానివల్ల అలెగ్జాండర్ పేరు ప్రఖ్యాతులుపొంది, అనేక మూగ బధిర స్కూళ్ళలో, విద్యాలయాల్లో ఉపన్యాసాలిచ్చి, పెదిమల కదలికవల్ల శబ్దం ఎలా గ్రహించవచ్చునో ప్రత్యక్షంగా చూపించి చాలామంది పిల్లలకి మాట్లాడటం నేర్పుతాడు.

ఐతే ఈ మాటలు మొదట్లో స్పష్టంగా పలకలేకపోయినా, రెండు మూడేళ్ళు గడిచేసరికి, భావ వ్యక్తీకరణ, మనసులో మాటలు స్పష్టంగా చెప్పటానికి ఎటువంటి ఇబ్బందీ వుండదు సరికదా అవతలవాళ్ళు అర్థంచేసుకోగలరన్నది కూడా నిరూపిస్తాడు. మేబుల్‌కి పద్దెనిమిదేళ్ళు వస్తాయి.

ఆమె స్పష్టంగాఅందరిలాగా మాట్లాడగల్గుతుంది. తల్లిదండ్రులకూ, అలెగ్జాండరుకూ తప్ప ఆమెకి చెవులు వినిపించవని ఎవరూ గుర్తించలేరు.

● ఇతరులకు ఎంత సహాయం చేశావో లెక్కించకపోవడమే గొప్ప లక్షణం.

ఎందుకంటే మేబుల్ ఎవరితో మాట్లాడినా ముఖాముఖి కళ్ళలోకి చూసి మాట్లాడుతుంది.ఆమె దృష్టి ఎదుటివారి పెదిమలమీద వుంటుంది.

టీచరు మేరీ ఇచ్చిన శిక్షణతో అక్షరాలు చూసి పైకి చదవటం, చదివిన వాటిని అప్పజెప్పటం అల వరచుకుంది. మేబుల్‌కి పుస్తకాలంటే విపరీతమైన ఇష్టం. ముఖ్యంగా దేశదేశాల చరిత్రని చదివి ఆమె జీర్ణించుకుంది.

ఒకసారి ఒక బ్రిటీష్ రాజకీయనేత అతిథిగా తమ ఇంటికి వచ్చినప్పుడు అప్పటికి అలెగ్జాండర్ మేబుల్‌లు దంపతులయ్యారు.

ఆ రాజకీయనేత ఈ దంపతులతో బ్రిటన్, అమెరికాలమధ్య సత్సంబంధాలు తియ్యగా వర్ణిస్తుంటే మేబుల్ 'మా దేశం నుంచి మీ పాలకులని తరిమేశాంగా' అని నవ్వుతూ అంటున్నపుడు అలెగ్జాండర్‌కి ఆశ్చర్యంవేస్తుంది. భార్యకి ఇంత చారిత్రిక అవగాహన వుందా? అని.

అలెగ్జాండర్ గ్రాహమ్ బెల్ శిష్యురాలి పట్ల ఆకర్షితుడవుతున్నాడు. మేబుల్‌కి చెవులు వినిపించవన్నది అతనికి పెద్ద లోపంగా అనిపించదు.

ఆమె అందం, ఆమెలోని చురుకుతనం, ఉత్సాహం అత నిని ఆయస్కాంతంలాగా పట్టిలాగుతున్నాయి. కాని తమ మధ్య పదిహేనేళ్ళ వయసు తేడా వుంది. తనకి ఎంత పేరుప్రతిష్టలున్నా ప్రొఫెసర్‌గా పెద్ద సంపదలేదు.

వయసు వ్యత్యాసం, సంపదలోగల వ్యత్యాసం తమ ప్రేమకి అడ్డవుతుందా?

అలెగ్జాండరుకి మేబుల్‌ని పెళ్ళిచేసుకుంటాను అని అడిగే ధైర్యంవుండదు. ఎలా?ఎలా? అని మధనపడి చివరికి మేబుల్ తండ్రి దగ్గర ఈ ప్రస్తావన ఎత్తుతాడు. ఒకటి రెండేళ్ళు ఆగి పెళ్ళి చేసుకోండి అని తండ్రి సలహా కాని ఇనుము ఎంత దృఢమైనదైనా అయస్కాంతం ముందు ఆగలేదు. ఆకర్షణలో కొట్టుకుపోతుంది.

ఆఖరికి మేబుల్ అలెగ్జాండరు పడుతున్న అంతర్మధనం అర్థంచేసుకుని తనంతతానుగా అతన్ని పెళ్ళిచేసుకునేందుకు ఒప్పుకుంటుంది. ఇద్దరూ దంపతులవుతారు.

చిరకాలంగా అలెగ్జాండర్‌ని పట్టి పీడిస్తున్న టెలిఫోన్ ప్రయత్నం అతనిని నిలవనివ్వదు. టెలిగ్రామ్‌కంటే టెలిఫోన్‌లో సూటిగా ఎక్కువమందితో మాట్లాడుకునే అవకాశం. అవతలి కంఠం వినగల వసతి వుంటుంది.

టైటానిక్ సర్వైవర్స్

ప్రయాణీకులతో వెళ్తున్న టైటానిక్ నౌక ఉత్తర అట్లాంటిక్ సముద్రంలో 1912 ఏప్రిల్ 15వ తేదీన మంచుకొండను ఢీకొన్నది.

నౌక మునిగిపోయేది కాదని నౌక తయారీదారులు చెప్పినప్పటికీ ఇది 20వ శతాబ్ది ఓ అతి పెద్ద దుఃఖఘటనగా చరిత్రలోమిగిలిపోయింది.

2,223 మంది ప్రయాణీకులతో ఇంగ్లండ్‌లోని సౌతాంప్టన్ నుంచి ఉత్తర అమెరికాలోని న్యూయార్క్ బయలుదేరింది.

యాంపుల్ లైఫ్‌బోట్స్ చాలినన్ని లేని కారణంగానే చాలామంది ప్రాణాలు పోవడానికి ప్రాథమిక కారణం అనే సంగతి చాలామందికి తెలియదు. పైడెక్‌ను 62 లైఫ్‌బోట్స్‌ను అమర్చడానికి ఏర్పాటు చేసినప్పటికీ వాటిలో 20 మాత్రమే ఉన్నాయి.

ప్రయాణీకులకు డెక్ మరింత బాగా కనపడేందుకు గాను లైఫ్‌బోట్ల సంఖ్యను కుదించారు. నౌక మంచు కొండలో చిక్కుకున్నప్పుడు సైతం సిబ్బందికి సరిగ్గా శిక్షణ లేని కారణంగా ఉన్న లైఫ్‌బోట్లను పూర్తి సామర్థ్యంతో వాడుకోలేకపోయారు.

పై ఫోటో లైఫ్‌బోట్ 14కు సంబంధించినది.

● హడావుడివల్ల ఎలాంటి లాభం ఉండదు. ఇది ఉన్నవారు ఎప్పటికైనా నష్టపోతారు.



Courtesy BETTER PHOTOGRAPHY

ఐదో అధికారి హెరాల్డ్ లోవ్ ఆధ్వర్యం వహించాడు. ప్రమాదం నుంచి బయటపడిన కొందరు ఆర్.ఎం.ఎస్. కర్పాథియ రిస్క్యూషిప్‌ను సమీపిస్తున్న దృశ్యం. పడవలో ఉన్న లూయిస్ మ్యాన్స్‌ఫీల్డ్ అగ్డెన్ అనే ప్రయాణీకుడు ఈ ఫోటో తీశాడు.

షిప్‌లో అతను సాధారణ ప్రయాణికుడు. అతని వద్ద కెమెరా ఉంది. అతనిలోని తక్షణ దీక్ష ఈ అరుదైన ఫోటోగ్రాఫ్ చూసే అవకాశాన్ని మిగిల్చింది. ఈ ఘోరప్రమాదానికి దృశ్య సాక్ష్యంగా మిగిల్చింది. ప్రమాదం జరిగిన రాత్రి నీటిలో ఉష్ణోగ్రత రెండు సెల్సియస్ డిగ్రీలు మాత్రమే ఉంది.నౌకనుంచి దూకి గడ్డకట్టిన నీటిలో ఈదే ప్రయత్నం చేసినవారంతా మరణించారు.

ఇంకొందరు చలికి తట్టుకోలేక చనిపోయారు. రక్షించే ప్రక్రియ మిగతా అన్ని లైఫ్‌బోట్లను దించిన తర్వాత నాలుగుగంటలు ఆలస్యంగా మొదలైంది. కర్పాథియ సుమారు *706* మంది ప్రయాణీకులను, రెండు కుక్కల్ని రక్షించింది. ◆

టెలిగ్రామ్ అయితే కేవలం అక్షరాలు తప్ప శబ్దం ద్వారా అవతల మనిషి తెలియదు. టెలిఫోన్ ప్రపంచవ్యాప్తంగా వాడకందారుని తీగెల ద్వారా శబ్దరూపాన దగ్గర చేస్తుంది.

ఈ ప్రయత్నం సఫలీకృతం అయితే ప్రపంచాన్ని తీగెలతో కలిపి శబ్దవిప్లవం తేవచ్చు అని అలెగ్జాండర్ తాపత్రయం. ఈ టెలిఫోన్ సాధన తయారుచెయ్యటానికి డబ్బు కావాలి. దీని హక్కులు అమెరికాలోని వెస్టర్న్ కంపెనీకి అమ్మితే డబ్బు వస్తుంది.

ఆ డబ్బుతో ఫోన్ పరికరాన్ని ప్రజలకి పరిచయం చెయ్యవచ్చు. దీనిని ప్రజల మధ్యకి పంపవచ్చు అని అలెగ్జాండరు అభిప్రాయం.

అలెగ్జాండరు శాస్త్రజ్ఞుడు. అతను అనుకున్నది సృష్టించటంలో దిట్ట. అయితే అతనికి డబ్బు లావాదేవీలు తెలియవు. అమాయకంగా టెలిఫోన్ రైట్స్ భార్యకి, మామగారికీ తెలియకుండా ఒక కంపెనీకి ధారాదత్తం చేస్తాడు.

లాయరు, లౌక్యుడూ అయిన మామగారు అల్లుడి అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకున్నారని అయిదు భాగాల్లో నాలుగుభాగాలు అల్లుడికి, మిగతా ఒక భాగం కంపెనీకి చెందాలని కేసుపెట్టి రెండు సంవత్సరాలపాటు అల్లుడి తరఫున పోరాడి కేసు గెలుస్తాడు.

టెలిఫోన్‌లో విక్టోరియా మహారాణి మాట్లాడటానికి మొట్టమొదటి టెలిఫోన్ పరికరం రాజభవనంలో పెట్టారు. దాంతో టెలిఫోన్‌కోసం జనం వేలం వెర్రిగా

● ప్రపంచం ఎలా ఉన్నా, నీవు నమ్మిన మంచి మార్గాన నీవు వెళ్ళు.

ఎగబడతారు. మార్కెట్‌లో అలెగ్జాండర్ కంపెనీ షేర్సు ఆకాశం అంత ఎత్తు ఎదుగుతాయి.

అలెగ్జాండరు ఎన్నడూ వూహించని పేరు ప్రఖ్యాతులు, సంపదా వస్తుంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు కలుగుతారు.

ధనం, పేరు ప్రఖ్యాతులు ఈ భార్యా భర్తలని కించిత్‌కూడా కదిలించవు. వీరి మధ్యగల ప్రేమాను రాగాలు చెక్కుచెదరవు.

ప్రపంచ ప్రఖ్యాత వ్యక్తి హెలెన్ కెల్లర్. అలెగ్జాండరు వద్దనుంచి గొంతులోని కండరాల కదలికను, మెడమీద వేళ్ళువుంచి, ఆ కదలికనిబట్టి, మాటల్ని అర్థంచేసుకోటం ప్రారంభించింది.

మూగ, బధిర, అంధురాలైన హెలెన్ కెల్లర్ జల పాతపు హోరుని, పక్షుల కిలకిలారావాలని విని, ఆ శబ్దాలని అనుభవించగల స్థాయికి వచ్చి ఎన్నో గ్రంథాలు రాసి, ప్రపంచవ్యాప్తంగా మూగ బధిర, అంధులకు కొత్త జీవితం ఇచ్చి వారిని ప్రభావితం చేసిందీ అంటే అందుకు ముఖ్యకారకుడు అలెగ్జాండర్ గ్రాహమ్‌బెల్.

హెలెన్ కెల్లర్‌కి గురువు అన్నాసలివాన్‌కి ఆయన ఇచ్చిన ట్రైనింగ్ కారణం అని చెప్పుకుంటారు.

మేబుల్‌కి ఇద్దరు ఆడపిల్లలు. తమ తల్లికి విని పించదు. ఆమె బధిరురాలని చాలాకాలం తెలి యదు. తల్లి మామూలుగానే మాట్లాడటం తప్ప ఆమెకి వినిపించదు అని పిల్లలకు తెలియదు.

ఒకసారి రెండో కూతురికి ఒంట్లో బాగుండక జ్వరంతో వుండగా తల్లి పక్కన కూచుని కబుర్లు చెప్పి, మందు ఇచ్చి, పిల్లని పడుకోబెట్టి పక్క గదిలోకి వెళ్ళబోతుంటే పిల్ల 'అమ్మా' అని పిలుస్తుంది. తల్లి వెనక్కితిరిగి చూడదు.

గదిలోకి వెళ్ళిపోతుంది.

కూతురు తల్లి తనని లక్ష్యపెట్టకుండా వెళ్ళిపోయిందని తండ్రికి ఫిర్యాదుచేస్తుంది.

అప్పుడు అలెగ్జాండరు కూతురి పక్కన మంచం మీద కూచుని "మీ అమ్మ లక్ష్యపెట్టకుండా వెళ్ళ లేదు. ఆమెకి వినిపించదు.

మీ అమ్మకు వినికిడి సమస్య.మీ అమ్మకు విని పించకపోవటం అవమానంగా భావించకు.

చెవులు వుండికూడా, చెవిటి వాళ్ళలాగా ప్రవ ర్తించే మామూలు వాళ్ళకంటే మీ అమ్మ చాలా గొప్పది. మీ అమ్మను చూసి గర్వపడు అంతే తప్ప సానుభూతి ప్రదర్శించక్కరలేదు. అవమా నంగా భావించకు" అని నెమ్మదిగా వివరిస్తాడు. అపురూప వ్యక్తిత్వంగల ఆ తండ్రి అలెగ్జాండరు గ్రాహమ్‌బెల్.

యాభైఏళ్ళ అపూర్వమయిన, ప్రేమైక్యమైన దాంపత్య జీవితం గడిపిన తరువాత అలెగ్జాండర్ గ్రాహమ్‌బెల్ 1922-ఆగష్టుమాసంలో మరణిం చాడు. ఈ ఎడబాటుని భరించలేనట్లు జనవరి 1923లో మేబుల్ కూడా భర్తని చేరుకుంటుంది. ఈ ఇద్దరినీ పక్కపక్కన అతినిరాడంబరంగా సమాధి చేస్తారు.

అలెగ్జాండర్ సమాధిపైన 'అలెగ్జాండర్ గ్రాహమ్ బెల్ ది ఇన్‌వెంటర్' పక్కన అతని ప్రియమైన భార్య 'మేబుల్ హెబ్బార్డ్ బెల్' అని చెక్కివుంది. ఎటువంటి ఆర్భాటమూ లేకుండా అతినిరాడం బరంగా ఈ సమాధుల కింద శాశ్వత నిద్రపోతున్న ఈ దంపతులు ప్రపంచంలోని మూలమూలలకీ శబ్ద తరంగాలతో ఊపిరిపోశారు.

ఈ గ్రంథాన్ని 'మేక్ ఎ జాయస్ సౌండ్' అన్న పేరున హెలెన్‌వెయిట్ 1961లో రాశారు. ఎక్కడైనా దొరుకుతుందేమో వెతికి చదవండి.

టెలిఫోన్ రిసీవర్ చేతులోకి తీసుకోగానే కాల క్షేపం కబుర్లతో వృధా చెయ్యక ఒక్కసారి అలెగ్జాండర్ గ్రాహమ్‌బెల్ దంపతులని జ్ఞాపకం చేసు కోండి. ఈ ఆధునిక ప్రపంచాన్ని తన టెలిఫోన్ ద్వారా ఒకటిగా చేసిన మహానుభావుడు అలెగ్జాం డర్ గ్రాహమ్‌బెల్. ◇◇

● క్షణంసేపు కూడా భవిష్యత్ పట్ల విశ్వాసం కోల్పోవద్దు.

ముద్దమందారం

Coutesy BETTER HOMES AND GARDENS

మందారమొక్కలు తోటంతా అందాన్ని ఇస్తాయి. అరవిరిసిన మందారాలు ఇంటికే రమణీయత చేకూర్చుతాయి. నిండురంగులతో పూలు, ముదురాకుపచ్చదనంతో ఆకులు మెరిసిపోతుంటాయి. మందార మాలో కుటుంబానికి చెందింది. ఇది మన నేటివ్ ప్లాంట్ కావడంతో సులువుగా పెంచుకోవచ్చు. మందార మూలాలు భారత్, చైనాలకు చెందినవి. తర్వాత ప్రపంచం అంతా విస్తరించాయి.

హైబ్రిడైజేషన్ పుణ్యమా అని ఇప్పుడు దాదాపు 150 రకాల మందారాలు అందుబాటులోవున్నాయి. మందార వివిధ కొమ్మలు, రెమ్మలతో గుబురుగా పెరిగే మొక్క. దాదాపు ఆరడుగుల ఎత్తు పెరుగుతుంది. మామూలుగా ఎరుపు, మజంటా రంగుల మందారాలు సహజరూపం గలవి.

హైబ్రిడైజేషన్‌తో ఇప్పుడు మందార రంగులు, షేడ్లకు లెక్కేలేదు. తెలుపు, పసుపు, నారింజ, కనకాంబరం వాటిల్లో మరింకెన్నో షేడ్లతో ఏకరెక్క, ముద్ద రకాలతో చూసేకొద్దీ చూడాలనిపిస్తాయి. ఝుంకా మందారాలు ఉన్నాయి.

వీటి అభివృద్ధికి వేరుమొక్కలతో పనిలేదు. ఒక అడుగు గట్టికొమ్మ తీసుకుని ఆకులన్నీ తీసేసి మట్టిలో లోతుగా పాతాలి. తడి ఆరకుండా నీళ్ళు పోస్తుంటే మూడువారాల్లో కొమ్మకు చిగుర్లు తొడగడం మొదలవుతుంది. మరోవారంలో వేరు కూడా దృఢంగా నాటుకుంటుంది. వేరు, ఆకు బాగా ఎదిగాయనిపించినప్పుడు దాన్నితీసి కుండీలో పెట్టుకోవాలి. కొన్ని నెలలయ్యాక ఎక్కడ కావాలనుకుంటే అక్కడ నాటుకోవచ్చు. వర్షాలు మొదలవగానే, ఏడాదికోసారి మందారను ప్రూనింగ్ చేయాలి.

ఐతే చాలా షార్ప్‌గా చేయాలి. కొమ్మలులాగినట్లు, మొదలు కదిలేలా లేదా కాడ పైభాగాన గల చర్మం వేలాడే విధంగా చేయకూడదు. ఇందుకోసం పదునైన గార్డెన్ సిజర్స్ వాడాలి. వర్షంపడిన వెంటనే మొక్కపాదులో వేర్లకు దూరంగా కొద్దిగా పొటాష్ వేస్తే పూలు మంచిరంగులో పూస్తాయి.

రంగులు, రకాలు : ఎక్కువగా పెంచుకునే కొన్ని మందారాలపేర్లు తెలుసుకుంటే నర్సరీలనుంచి ఎంచుకోవడం సులువవుతుంది.

పెర్సిలాంకస్టర్ : ఇది చిన్నగా పొదలావుంటుంది.

హవాయ్ వైట్: ఐవరీ రంగుపూలతో గుబురుగా పెరిగే మొక్కనిండా లెక్కలేనన్ని పూస్తాయి.

కల్యాణి : పొడవుగా పెరిగి,ఏడాదంతా పూస్తుంది.

కాలిజబ : అనేక కొమ్మలతో పొడవుగా ఉంటుంది. బాగానిండు స్కార్‌లెట్ షేడ్‌లో పూలుపూస్తాయి.

డెఫోడిల్ : డెఫోడిల్ పూలని కన్‌ఫ్యూజ్ కాకూడదు. పసుపుపచ్చ ముద్దమందారం ఇది.

హైబిస్కస్ కొలినస్ : అసాధారణ డబుల్ టోన్, పర్పుల్ కలర్ పూలతో నిండుగా ఉంటుంది.

హైబిస్కస్ ముటాబిలిస్ : అసాధారణ డబుల్ పెటల్ పూలు తెల్లగా పూసి, ఎండెక్కేకొద్దీ ఎరుపు రంగుకు మారతాయి.

ఉపయోగాలు : చాలా దేశాల్లో ఈ పూలను టీ కాయడానికి వాడతారు. దక్షిణ భారతదేశంలో, శ్రీలంకలో హెయిర్ కండిషనర్‌గా ఉపయోగిస్తారు. పశ్చిమబెంగాల్‌లో మందారపూలతో కాళీమాతను అలంకరించే సంప్రదాయముంది. దుర్గాపూజలో ఎక్కువగా మందారపూలు వాడతారు. ◇◇

ఎడ్లబండి తోలిన చరిత్రకారుడు డాక్టర్ పట్టాభి

కాంగ్రెస్‌పార్టీ చరిత్రకారుడు, ఆనాటి కాంగ్రెస్ అతిరథమహారథులలో ఒకరు, గాంధీయిజం భాష్యకారుడు డాక్టర్ పట్టాభి సీతారామయ్య అసాధారణ మేధావి, మంచివక్త! 'కాంగ్రెస్ చరిత్రను పట్టాభి రచించిన తీరుచూస్తే ఆయన ఎంతటి కార్యదీక్షా పరుడో, ఎంతటి మేధావో అర్థంకాగలదు.

1600 పేజీలుగల కాంగ్రెస్ చరిత్రను డాక్టర్ పట్టాభి కేవలం 59 రోజులలో రచించారంటే ఎవరికైనా ఆశ్చర్యం కలుగకపోదు.

కాంగ్రెస్‌పార్టీ చరిత్ర రచన 1935 మే 1న ప్రారంభమై జూన్ 29కి పూర్తి అయింది. ఆ 1600 పేజీలు రాయటంలో 1922, 1925 సంవత్సరాలలో కాంగ్రెస్‌కు సంబంధించి ప్రకటితమైన మూడు బులిటెన్లు మాత్రమే ఆధారాలుగా ఉపయోగించు కున్నారు. మరే విధమైన గ్రంథాలుగాని, పత్రాలు గాని ఆధారం లేకుండా, మరొకరి సహాయంలేకుండా డాక్టర్ పట్టాభి తన జ్ఞాపకశక్తి, ప్రతిభ మాత్రమే ఆధారంగా ఆ పుస్తకంరాశారు. ఆ పుస్తకాన్నిమొదట ఐదువేల ప్రతులు అచ్చువేద్దామనుకున్నారు.

కాని ముద్రణకి ముందే నాలుగువేల ప్రతులకు ఆర్డర్లువస్తే పదివేల కాపీలు అచ్చువేశారు. అప్పట్లో ఆ పుస్తకం వెల 8 రూపాయలు. గ్రంథం అచ్చు కాగానే డాక్టర్ పట్టాభి కూడా అందరిలా 4 ప్రతులు సొంత సొమ్ముతో కొనుక్కున్నారు.

రాతలో దొరకడు

పట్టాభి రాసిన కాంగ్రెస్ చరిత్రను చదివిన మహాత్మాగాంధీ ఆయనని- "ఏమయ్యా నీవు మాట్లాడే మాటలు ములుకుల్లా ఉంటాయి కదా! మరి నీవు రాసిన ఇంత గ్రంథంలోనూ ఎవ్వరినీ విమర్శించకుండా, ఎవ్వరినీ నొప్పించకుండా ఎలా రాయగలిగావు" అని ప్రశ్నిస్తే అందుకు పట్టాభి చిరునవ్వుతో "బాపూజీ! నేను కరణం బిడ్డను. కరణం ఎప్పుడూ రాతలో దొరకడు" అన్నారు.

గాంధీజీ ఒకసారి పట్టాభి సీతారామయ్యతో "మీరు హిందీ ఎందుకు నేర్చుకోరు?" అన్నారు.

అందుకు పట్టాభి "సరేచూడండి. వచ్చే కాంగ్రెస్ సమావేశాలలో హిందీలోనే ఉపన్యసిస్తాను" అని పట్టుదలతో ఆరుమాసాలలోనే హిందీలో ప్రావీణ్యం సంపాదించి, కాంగ్రెస్ సమావేశంలో అనర్గళంగా మాట్లాడారు. ఆనాటి పట్టాభి ఉపన్యాసంలోని ఒక వాక్యం "జోకుచ్ కహనా హై తో హాత్ సే కరో"దాన్ని పెద్ద అక్షరాలతో. అట్టపైన రాయించి తన ఆశ్రమంలో వేలాడదీయించారు గాంధీజీ.

ఆ మాటకు తెలుగు అనువాదం ఇది "మనము చెప్పదలచిన విషయం చేసి చూపిన మంచిది"

పాకశాస్త్ర ప్రావీణ్యం

ఒక దఫా కాంగ్రెస్ మహాసభలు జరుగుతూండగా వంటవాళ్ళు హఠాత్తుగా సమ్మెచేశారు.

కాంగ్రెస్ నాయకులు, ప్రతినిధులు భోజనాలు తయారుచేయించటం ఎలాగని కిందా మీదా పడుతూవుండగా డాక్టర్ పట్టాభి చటుక్కున కొంత మంది కాంగ్రెస్‌వాలంటీర్లను వెంటబెట్టుకుని వంట శాలకు వెళ్ళి వంటలన్నీ స్వయంగాచేసి తన పాక శాస్త్ర ప్రావీణ్యాన్ని నిరూపించుకున్నారు.

డాక్టర్ పట్టాభి ఖర్చు విషయంలో చాలా పొదు పుగా ఉండేవారు. ఈయన ప్రసిద్ధ వైద్యుడేకాక, ఆర్థికవేత్త కూడా. ఆయన అనేక ఆర్థికసంస్థలు నెలకొల్పి పెంచి పోషించారు. ఆంధ్రాబ్యాంకు, భారతలక్ష్మీబ్యాంకు, ఆంధ్రా ఇన్స్యూరెన్సుకంపెనీ మొదలైనవి ఈయన స్థాపించినవే.

బందరులోని ఆంధ్రజాతీయకళాశాల నెలకొల్ప టానికి విశేష కృషిచేశారు.

1906లో కలకత్తా కాంగ్రెస్ మహాసభకు హాజరైన ఆంధ్రప్రతినిధులు బందరులో జాతీయ కళాశాల ఏర్పాటుచేయాలని నిర్ణయించారు.

1907లో కోపల్లె హనుమంతరావు, డాక్టర్ పట్టాభి మొదలైనవారితో ఒక కమిటీ ఏర్పాటైంది. ఆ కమిటీ గ్రామ గ్రామాన తిరిగి చందాలు వసూలు చేసి నిర్మించిన కళాశాలకు 1910 ఫిబ్రవరిలో ప్రారంభించాలని ముహూర్తం నిర్ణయించారు. ప్రారంభోత్సవానికి హైకోర్టు న్యాయమూర్తి గురుదాస్ బెనర్జీని ఆహ్వానించారు. తీరా ఆ సమయానికి తాను రాలేకపోతున్నానని కబురు పంపడంతో సీతారామయ్యగారు ఎడ్లబండిలో దేశభక్త కొండా వెంకటప్పయ్యగార్ని తీసుకొచ్చారు.

ఆత్మాభిమానం

పట్టాభి గొప్ప ఆత్మాభిమానంగల మనిషి కూడా.

ఒకసారి సర్దార్ పటేల్ పట్టాభితో "మిమ్మల్ని ఎ.ఐ. సి.సి. వర్కింగ్‌కమిటీ మెంబరుగా తీసుకోవాలనుకుంటున్నాం. ఏమంటావ్?" అంటే "వర్కింగ్‌కమిటీ మెంబరుగా తీసుకుంటానంటే కాదనే అహంకారిని కాదు. మీరు తీసుకోకపోయినా ప్రాధేయపడే స్వభావం కాదు నాది" అన్నారు పట్టాభి.

క్రిప్పు రాయబారంతో చర్చలు

1942లో క్రిప్పు రాయబారంవచ్చింది.అదే సమయంలో పట్టాభిగారి చిన్నకొడుకు పెళ్ళి నిశ్చయమైంది. పట్టాభి కుమారుడి పెళ్ళినిమిత్తం ఢిల్లీ నుంచి వచ్చే ప్రయత్నంలో ఉన్నారు. అప్పుడు గాంధీజీ పట్టాభిని పిలిపించి "క్రిప్పు రాయబారంతో చర్చించాలంటే నీవు తప్పనిసరిగా ఉండాలి.

కాబట్టి నీవు పెళ్ళికి వెళ్ళటానికి వీల్లేదు" అనగానే పట్టాభి గాంధీజీ మాట శిరసావహించి, తాను వివాహానికి రావటంలేదని, పెళ్ళి నీవే జరిపించవల్సిందని తక్షణం పట్టాభి భార్యకు ఉత్తరంద్వారా తెలియజేశారు. తన కుమారుని పెండ్లి ఆ విధంగా తను లేకుండానే జరిగిపోయింది.

క్రిప్పు రాయబారంతో మంతనాలు చేయటంలో పట్టాభి సీతారామయ్య రాజకీయచతురత, విషయ పరిజ్ఞానం గొప్పగా వెల్లడైనాయి.

పూర్తి టైమ్ చెబితే...

రఘుపతి వెంకటరత్నం నాయుడుగారు పట్టాభిగారికి చిన్నప్పుడు గురువు. బందరు నోబుల్ కాలేజీలో వెంకటరత్నం నాయుడుగారు అధ్యాపకుడిగా పని చేశారు. అప్పుడు పట్టాభి సీతారామయ్యగారు ఆ కాలేజీలో విద్యార్థిగా ఉండేవారు.

ఆ తర్వాత కొంతకాలానికి పట్టాభిసీతారామయ్యగారు జాతీయనాయకుడిగా ఎదిగిన తర్వాత ఒకానొక సభలో గురుశిష్యులు వెంకటరత్నం నాయుడుగారు, పట్టాభిగారు పాల్గొనటం జరిగింది.

ఆ సందర్భంలో పట్టాభిగారు మాట్లాడుతూ "మా గురువుగారు వెంకటరత్నం నాయుడు గొప్ప పండితులు, సాక్షాత్తూ సరస్వతీపుత్రులు.

ఐతే ఆయనలో చిన్న దోషం ఉంది.

వారెప్పుడు క్లాసుకి టైమ్‌కు వచ్చేవారు కాదు. సగం టైమ్ మాత్రమే చెప్పేవారు" అన్నారు.

దాంతో చటుక్కున వెంకటరత్నం నాయుడుగారు అందుకుని "నా శిష్యుడు పట్టాభికి సగం టైమ్ చెబితేనే జాతీయస్థాయికి ఎదిగాడు. పూర్తి టైమ్ చెబితే ఇంకా ఎంత పైకి ఎదిగేపోయేవాడో" అనటంతో అందరూ చప్పట్లుకొట్టారు.

వేమూరి జగపతిరావు

వారధి

హిమాలయాల్లోని శివాలిక్ పర్వతశ్రేణుల మధ్యగా ప్రవహించి ప్రవహించి, ఋషీకేష్ అంతటా వీచే పిల్లతెమ్మెరల్ని తన నీటిఆవిరితో చల్లగా మారుస్తూ, తళతళ మెరుస్తూ, గలగలలాడుతూ ముందుకి సాగిపోతోంది గంగమ్మ.

మే నెల కావడంతో సాయంత్రం అయిదు గంటలు దాటుతున్నా ఇంకా చల్లబడలేదు వాతావరణం. రెండు తీరాలమీదా కనుచూపు సారినంతమేరా ఆలయాలూ, ఆశ్రమాలూ, ఇళ్ళూ, బజార్లూ సంధ్యాసమయపు అరుణకాంతుల్లో వింతగా మెరుస్తున్నాయి!

రాజేశ్వరి కొడుకు కుటుంబంతోపాటు మవునంగా నడుస్తోంది. నదిలోని అలల్లాగే ఆమె మనసులోనూ ఆలోచనలు సుళ్ళు తిరుగుతూ సాగిపోతున్నాయి. తను ఒంటరిదైపోయిందంటే ఇంకా నమ్మబుద్ధికావడంలేదు. ప్రభాకరం తోటే తనదైన జీవితం అంతమైపోయింది.

అతను వెళ్ళిపోయినా తన ప్రాణం ఇంకా ఉంది. ఆ పైవాడు తీసుకెళ్ళేదాకా తను బతకాల్సిందే. ఒక్కర్తే బతకలేదు గనక కొడుకు కుటుంబంలోకి చొచ్చుకువెళ్ళి, అక్కడ తనకో స్థానాన్ని ఏర్పరచుకోవాలి. తనకంటూ కొంతస్థలాన్ని ఆక్రమించుకోవాలి. ఏడాది దాటిపోయినా అతని నిష్క్రమణం తాలూకు గాయం ఇంకా ఇంత పచ్చిగా ఉందేమిటి? లోపలికీ బయటికీ తిరిగే గాలి ఊపిరితిత్తుల్లో ఇంత కల్లోలం సృష్టిస్తోందేమిటి?

తన పక్కనే నడుస్తూ ఎస్సెల్లార్ కెమేరాతో ఫొటోలు తీసుకుంటున్న మైథిలి తన కోడలు! విజయ్ పక్కనే నడుస్తూ గలగలా కబుర్లుచెపుతున్న పన్నెండేళ్ళ సుమన్ లా ప్రకారం తన మనవడు.

వాళ్ళు ఏడాదికోసారి వచ్చి తమతో వారమో, పదిరోజులో ఉండి వెళ్ళడానికీ, తనదైన ఇల్లు ఖాళీ చేసి వాళ్ళ జీవనస్రవంతిలో కలిసిపోయి జీవించడానికీ ఎంతతేడా. దీనికి తనెలా సర్దుకోగలదు?

తననిలా వదిలేసి వెళదామనుకున్న వ్యక్తి కనీసం తన జీవికకవసరమయిన చిన్నచిన్న పనులు కూడా నేర్పకుండానే హఠాత్తుగా మాయమయిపోయాడేమిటి?

"అమ్మా! మీరిక్కడే నిలబడండి. బోట్ టికెట్లు తీసుకొస్తా" ఆగి తల్లి భుజాన్ని సుతారంగా తట్టి వెళ్ళాడు విజయ్.

"నాన్నా! నేనూ రావచ్చా?" అంటూ వెనకే వెళ్ళాడు సుమన్.ఒక్కక్షణం ప్రభాకరం వెనక పరుగెత్తే చిన్నారి విజయ్ గుర్తొచ్చాడు రాజేశ్వరికి.

నిలుచున్నచోటు నుంచే మైథిలివైపు చూసింది. కెమేరా అడ్జస్ట్ చేసుకుంటూ నదిలో కదులుతున్న పడవల ఫొటోలు తీసుకుంటోందామె.

ఆ ఫొటోలు దగ్గర పెట్టుకుని పెయింటింగ్స్ చేస్తుంది కదా! ఎంత ఆర్టిస్టయితే మాత్రం పవిత్రమైన గంగాహారతి కోసం వెళుతూ ఆ పాంటూ షర్టూ ఏమిటి? ఆ జుట్టేమిటి?

టికెట్లు తీసుకుని విజయ్ వచ్చాడు. ముందుకి నడిచి బోటు ఆగేచోటికి చేరారు.క్యూలో ముందున్న జనం ఎక్కేసరికి బోటు నిండింది. అయ్యో అనుకుంది రాజేశ్వరి.ఇంతలోనే అటునించి ఇంకో పడవ రావడం జనం బిలబిలా దిగిపోవడం జరిగాయి. ఖాళీ పడవలోకి నలుగురూ ఎక్కారు.

"ఇక్కడ కూచుందాం" అంటూ తనకి నచ్చిన

వారణాసి నాగలక్ష్మి

● ప్రచారంకన్నా ఆచరణ మిన్న.

చోటికి పిలిచాడు సుమన్. వాడి కళ్ళనిండా ఉత్సాహం. ఎదురుగా కనిపిస్తున్న రాం ఝూలా వాడి దృష్టినాకర్షించింది.

"నాన్నా! దీనికి పిల్లర్లు లేవేమిటి? ఇంత పొడుగున్న వంతెన పిల్లర్లు లేకపోతే పడిపోదా?" అని అడిగాడు.

"పండూ! వచ్చేముందు నీకేం చెప్పాను? ఇంటర్నెట్లో మనం వెళ్ళేచోటు గురించి అన్నీ చదవాలని చెప్పానా లేదా?" అన్నాడు విజయ్ నవ్వుతూ.

వాడు చిలిపిగా నవ్వాడు.

"చూశాను నాన్నా! అదీ... సస్పెన్షన్ బ్రిడ్జి. నదిలో పడవల ప్రయాణానికి అస్సలు అడ్డం లేకుండా మనుషులు హాయిగా అటునించి ఇటూ, ఇటునించి అటూ వెళ్ళడానికి పనికొచ్చే వంతెన ఇది! దానికి అటూఇటూ పెద్ద టవర్స్ వున్నాయి చూశారా? వాటినించీ వేళ్ళాడే సపోర్ట్ కేబుల్సూ, వాటికి ఎటాచ్ చేసిన చిన్న కేబుల్సూ వంతెన పడిపోకుండా ఆపుతాయి"

విజయ్ వాడి ఉంగరాల జుట్టు వేళ్ళతో చెరుపుతూ "దొంగా" అన్నాడు.

రాజేశ్వరి మైథిలివైపు చూసింది. కొడుకు వంక చూస్తున్న ఆమె కళ్ళలో ఏదో మెరుపు. వెంటనే చూపు తిప్పుకుంది రాజేశ్వరి.

"మనం వెనక్కొచ్చేటపుడు రాం ఝూలా మీంచి వస్తాం కదా!" అడిగాడు మళ్ళీ.

విజయ్ అవుననగానే పిడికిలి బిగించి 'య్యేస్' అంటూ ఓ ఎక్స్ప్రెషనిచ్చాడు.

చూస్తూండగానే బోటు నిండింది. ఎదురుబల్ల మీద కూర్చున్నవాడు కాస్తా లేచొచ్చి విజయ్కీ, రాజేశ్వరికీ మధ్య కూర్చుంటూ "మామ్మా! రేపు మాతో రాఫ్టింగ్కి మీరూ రావాలి" అన్నాడు.

"లేదు నాన్నా! రేపు మీరు ముగ్గురూ వెళ్తారు. పొద్దున్నే నీలకంఠేశ్వరస్వామి దర్శనానికెళ్తాంకదా! తర్వాత నేను గెస్ట్హౌస్లో రెస్ట్ తీసుకుంటాను. మీరేమో రివర్ రాఫ్టింగుకెళ్తారు. మీరు తిరిగొచ్చాక గంగాస్నానానికెళ్తాం అందరం" అంది రాజేశ్వరి.

వాడు రాజేశ్వరిచేతిమీదికి వాలిపోతూ "మామ్మా ప్లీజ్! మీరూ రావాలి మాతో" అన్నాడు.

రాజేశ్వరి వాడిమాటలకి అంత ప్రాధాన్యత ఇవ్వకుండా బోటు బయటికి చూస్తూ ఉండిపోయింది. పడవ నిండా జనం ఉన్నా ఎవ్వరూ మాట్లాడడం లేదు. ఎటు చూసినా సంధ్యాసుందరి వయ్యారాలు పోతూ ఉంది. ప్రతి దృశ్యం వైబ్రంట్గా, అందంగా, పవిత్రంగా కనిపిస్తోంది.

రాజేశ్వరి మనసంతా ఆవరించిన ఒంటరితనం వల్ల ఆ దృశ్యాల్లోని సౌందర్యంలో కూడా విషాదఛాయలు అలముకున్నట్టే తోచింది.

తనూ భర్తా ఒకరికొకరుగా జీవిస్తున్నపుడు ఏ సమస్యా తననంతగా బాధించలేదు.ఒక్కడేకొడుకు. వాడిని పెంచి పెద్దచేశారు. చదువూసంధ్యా చెప్పించారు. తమకెంత నచ్చకపోయినా వాడిష్టపడ్డ పిల్లని చేసుకుందుకు ఒప్పుకున్నారు.

వాడి జీవితం వాడిది అనుకున్నారు. ఎక్కడో సముద్రాల కవతల వాడూ, వాడి కుటుంబం...ఆ అమ్మాయి వాడి భార్యగానే తనకి కనిపిస్తుంది. తన కోడలుగా ఎప్పుడూ అనిపించదు.

పొడుగాటి జడా, పచ్చగా మెరిసిపోయే శరీరం, కలువరేకుల్లాంటి కళ్ళూ, సంప్రదాయ కుటుంబం నించి వచ్చిన నీలిమని కోడలుగా చేసుకోవాలని తనెంతో కోరుకుంది.

ఆరడుగుల పొడుగూ, కోటేరేసిన ముక్కూ, వెన్నెల్లా నవ్వే విజయ్బాబుకి తగినపిల్ల అసలు దొరుకుతుందా అనుకుంటుంటే నీలిమావాళ్ళు పక్కింట్లోకి అద్దెకొచ్చారు.

తను కోరుకున్నవన్నీ ఆ పిల్లలో కనిపించాయి. ఏం లాభం? అప్పటికే వాడి మనసులో మైథిలి తిష్టవేసుకుంది. ప్రభాకరంకూడా 'వాడికి నచ్చిన పిల్లని చేసుకోనీ' అని తనని ఒప్పించారు.

● దానం చేస్తున్నామనే అహాన్ని విడిచి దానం చేయడం నేర్చుకోవాలి.



కుటుంబసభ్యుల డిన్నర్లు

పెద్దల బిజీ కెరీర్లు, పిల్లల చదువుల నడుమ డైనింగ్ టేబుల్ దగ్గర కుటుంబసభ్యులందరూ చేరడం చాలా అరుదైపోతోంది.

కాని పిల్లలు ఎదిగేవయస్సులో పెద్దలతో కలసి భోజనం చేయడంవల్ల కలిగే ఫలితాలు చాలా ఉంటాయని పరిశోధకులు వివరిస్తున్నారు.

టీనేజీకి చేరే పిల్లలు ఎవరైతే పెద్దలతో కలసి డిన్నర్ చేస్తారో వారు ఎక్కువగా పండ్లు, కూరగాయలు, ఇతర పోషకాలు అధికంగా ఉండే పదార్థాలు తింటారని తెలిపారు.అలాగే బ్రేక్‌ఫాస్ట్ కూడా వారు మానుకోరు.

పెద్దలతో కలసి అరుదుగా భోజనంచేసే పిల్లలతో పోల్చితే వీళ్ళు శీతలపానీయాలు కూడా అంతగా తాగరు. కాబట్టి పగటివేళ ఎలాగూ కుదరదు కాబట్టి రాత్రులైనా వీలయినంతవరకు భోజనం కలసిచేసే ప్రయత్నాలు చేయాలి. వారం రోజులూ కుదరని పక్షంలో కనీసం వారంలో రెండు రోజులయినా చేయాలి. ◆

తాము ఒప్పుకోకపోయినా వాడు ఆ అమ్మాయినే చేసుకునేవాడేమో! ఒప్పుకుని మర్యాద నిలుపుకున్నారు తామిద్దరూ.

ఒక్కడే కొడుకైనా వాడి కుటుంబం దూరంగా ఉండడానికి తను అలవాటుపడిపోయింది. ప్రభాకరం తననెంతో ప్రేమగాచూసుకునేవారు. ఆ రోజుల్లో ఒకరు వెళ్ళిపోయి రెండోవారు ఒంటరిగా మిగిలిపోతే ఏమవుతుందో అన్న ఆలోచనే తన మనసులోకి రాలేదు. ఎప్పటికీ తామిద్దరూ కలిసేవుంటారన్నట్టుగా జీవించింది.

పరాకుగా కూర్చున్న తల్లినీ ఆవిడమీదకు వాలిపోయి బతిమాలుతున్న సుమన్‌నీ చూస్తూ ఆలోచనలోపడ్డాడు విజయ్.

ముప్పై ఎనిమిదేళ్ళ దాంపత్య జీవితం వాళ్ళది. ప్రభాకరం ఉన్నన్నాళ్ళూ రాజేశ్వరికి బయటి విషయాలేవీ తెలుసుకోవలసిన అవసరం రాలేదు. ఆయన ఇష్టాయిష్టాలూ అవసరాలూ గమనించుకుంటూ, ఆయన ఆజ్ఞలు పాటిస్తూ ఆవిడా, ఆవిడ సరదాలు కొద్దోగొప్పో తీరుస్తూ, ఆవిడకవసరమయిన వాటన్నిటినీ ఏర్పాటుచేస్తూ ఆయనా జీవించారు.

తనకన్నా పదేళ్ళు చిన్నదైన రాజేశ్వరిని చిన్నపిల్లలాగా ట్రీట్‌చేస్తూ, సంఘంలో ఆవిడ గౌరవానికి భంగంరాకుండా చూసుకునేవారు ప్రభాకరంగారు. ఒక ఆదివారం మధ్యాహ్నం భోజనాలవేళ తలనొప్పి ఎక్కువగా ఉందనీ, అన్నం తినాలని లేదనీ ఆయన పడుకుంటే, "మీకు ఆకలి వేస్తున్నా తెలీదు. కాస్త పెరుగన్నం తినండి... అదే తగ్గుతుంది" అని బలవంతాన తినిపించింది రాజేశ్వరి.

తిన్న కొద్దిసేపటికే వాంతి చేసుకుని మొదలు నరికిన చెట్టులా పడిపోయాడు ప్రభాకరం. మాసివ్ హార్ట్‌ఎటాక్ అన్నారు. కొడుకు కుటుంబంతో కబుర్ల కాలక్షేపం కోసం సంపాదించిన కంప్యూటర్ పరిజ్ఞానం అన్ని రకాల సైట్స్‌లోనూ గుండెపోటుల గురించి చదివి భర్తని చేజేతులా తనే చంపుకుందని నమ్మేందుకు పనికొచ్చింది. అప్పటినించీ రాజేశ్వరిలో చాలా మార్పొచ్చింది.

తిండిపై ఆసక్తిపోయింది. కొద్దినెలల్లోనే బరువు సగానికి తగ్గిపోయింది. ఎవరితోనూ మాట్లాడకుండా

నిస్సత్తువగా రోజు గడిపేస్తూ దగ్గరివాళ్ళెవరయినా వచ్చి పలకరిస్తే భర్తని తన మూర్ఖత్వంవల్ల ఎలా చంపుకుందో వివరిస్తూ, అతను వెళ్ళిపోయాక తను బతకడంలో అర్థంలేదన్నట్టు మాట్లాడుతూ అదో ధోరణిలో పడిపోయింది.

అప్పటివరకూ తనకి మార్గదర్శకుడుగా ప్రభాకరం ఉండడంతో రాజేశ్వరి ఎప్పుడూ భవిష్యత్తు గురించి పెద్దగా ఆలోచించలేదు. వంటకి ఆధరువులూ, రాబోయే పండక్కి కొనవలసిన బట్టలూ, సరుకులూ, దగ్గర్లో వున్న శుభకార్యాలకి చెయ్యాల్సిన ప్రయాణాలూ, ఇవ్వాల్సిన బహుమతులూ...

ఇవే ఆవిడ భవిష్యత్తు గురించిన ఆలోచనలూ, ప్రణాళికలూ. భర్త చుట్టూ అల్లుకున్న జీవితం తప్ప ఆవిడకే సొంతమైన జీవితం ఏమీలేదు.

హఠాత్తుగా ఆయన నిష్క్రమించేసరికి పిడుగుపాటుకి చెట్టు మాయమైతే దానినల్లుకున్న తీగలా కుప్పకూలిపోయిందావిడ.

ఈ విషయం అర్థంకాగానే విజయ్ మనసు బరువెక్కిపోయింది. తండ్రి చిన్నపిల్లలాగా పరిగణించిన రాజేశ్వరి అతని క్కూడా చిన్నపిల్లలాగే కనిపించింది. ఆమెని జాగ్రత్తగా సాకాలని, మళ్ళీ ఆమె ఆరోగ్యంగా తిరిగేలా చూసుకోవాలని అతను నిర్ణయించుకున్నాడు.

మైథిలితో అతనికి చదువుకునే రోజులనించీ స్నేహం. స్నేహితులనేర్పరచుకునేటపుడు ఎవరైనా సాధారణంగా రూపురేఖలకన్నా మనస్తత్వానికీ, కంపాటిబిలిటీకి ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు. వేవ్ లెంగ్త్ కలవకపోతే గాఢమైన స్నేహం కుదరదు.

అదే పెళ్ళిదగ్గర కొచ్చేసరికి రూపురేఖలూ, ఆస్తీ అంతస్తులూ, కులగోత్రాలూ ముఖ్యమౌతాయి.

విజయ్‌కి మైథిలితో స్నేహం అలాగే మొదలైంది. దృఢమైన వ్యక్తిత్వం, అచంచలమైన ఆత్మవిశ్వాసం, పరవళ్ళు తొక్కే ఉత్సాహం, జీవితాన్ని అందంగా తీర్చిదిద్దుకోగల నేర్పు సొంతం చేసుకున్నట్టు కనిపించే ఆమె కేవలం స్నేహితురాలిగా ఉన్న రోజుల్లో రాజేశ్వరి అతని పెళ్ళిప్రస్తావన వచ్చినప్పుడల్లా తన అందమైన కొడుక్కి కాబోయే భార్య, తన ఒక్కగా నొక్క కోడలు ఎలావుండాలో చెప్తూ ఉండేది.

అతను నవ్వుతూ వినేవాడు. అప్పుడతనిక్కూడా ఆ లక్షణాలు నచ్చేవి. మంచి ఉద్యోగంలో స్థిరపడిన తర్వాత ఇండియా వచ్చినపుడల్లా పెళ్ళిచూపులకి వెళ్ళడం ఎవరూ నచ్చక వెనక్కివెళ్ళిపోవడం జరిగేది.అప్పుడే అతనికి తనజీవనసహచరి ఎలా ఉంటే బావుంటుందో అర్థమైంది. పెళ్ళి టైమ్ వచ్చేసరికి అతనికి మైథిలి తప్ప ఎవరూ నచ్చలేదు.

ఆమెతో జీవితం ఎప్పటికీ విసుగనిపించదని అతనికనిపించింది. మైథిలి కూడా తన గురించి అలాగే అనుకుంటోందని తెలిసి అతని మనసు ఎగిరి గంతేసింది.

తామిద్దరి మధ్యా ఏర్పడిన అను బంధం చాలా అరుదైనదనీ, లక్షల్లో ఒకరికి దొరికే భాగ్యమనీ తోచడంతో తల్లిదండ్రులిద్దరికీ నచ్చక పోయినా వాళ్ళని అయిష్టంగానయినా ఒప్పించి మైథిలిని పెళ్ళిచేసుకున్నాడు విజయ్.

తల్లిదండ్రులమీద ఎంత ప్రేమ వున్నా వాళ్ళ ఇష్టానికి వ్యతిరేకంగా పెళ్ళిచేసుకోవలసి రావడం, తన భార్య తల్లికి దగ్గరకాలేకపోవడం విజయ్‌ని కొంత కలవర పెట్టకపోలేదు. దానికితోడు పెళ్ళైన రెండేళ్ళకి మైథిలికి పిల్లలు పుట్టరని తెలిసింది.

ఆ విషయాన్ని జీర్ణించుకునేందుకు ఇంకెవరైనా అయితే ఎంత స్ట్రగుల్ అయ్యేవారో! కొద్దివారాల్లోనే తను ఆ దెబ్బనించి కోలుకుంది. తర్వాత తనతో విపులంగా మాట్లాడాలని వుందనీ, ఒకరోజంతా చర్చించుకుందామనీ అడిగింది.

ఆ రోజు తనకి స్పష్టంగా గుర్తుంది. ఎంత సూటిగా ఈ విషయం గురించి మాట్లాడిందిడిసమస్య ఇదీ, 'నీ రక్తం పంచుకుపుట్టిన పిల్లలే నీకు కావాలంటే నువ్వు మరో పెళ్ళిచేసుకునేందుకు వీలుగా నీతో విడిపోవడానికి సిద్ధంగా వున్నా'నంది. నీ స్నేహాన్ని మించింది నాకేదీ లేదంటే 'వుయ్ కెన్

మెడిటేషన్‌తో మల్టీ టాస్క్

ఈ రోజుల్లో ఒకే సమయంలో బహుళ పనులు చాలామందికి తప్పడంలేదు. ఇలాంటి అవసరం ఎక్కువగా ఉన్నవారికి మెడిటేషన్ చక్కని సహాయకారి. మన స్ఫూర్తిగా, పూర్తి ఏకాగ్రతతో ధ్యానం చేసే వారు పనుల్ని విసుగూ, విరామం లేకుండా ఎక్కువసేపు కొనసాగించగలరు.

అంతేకాదు- బహుళపనుల నడుమ వారి జ్ఞాపకశక్తీ మెరుగవుతుంది. నిజానికి, బహుళపనులు మెదడుకు మంచివి కావని, సరైన పనితీరుకు సిఫార్సు చేయతగినవి కావన్న సాధారణ అభిప్రాయముంది.నిజం కూడా. కాని కొన్నిసార్లు ఒకటికంటే ఎక్కువ పనులు చేయాల్సిన అవసరం వస్తుంటుంది.

అటువంటప్పుడు టెన్షన్ లేకుండా వుండేందుకు మెడిటేషన్ సహకరిస్తుంది. ఈ విషయమై ప్రొఫెసర్లు సుదీర్ఘ పరిశోధనలు నిర్వహించారు. మెడిటేషన్‌చేసేవారు చేయనివారికంటే బహుళ పనుల సందర్భంలో తక్కువగా ఒత్తిడికి గురైనట్లు గుర్తించారు. ఏదేమయినా ఒకేసారి రెండు పనులకు మించి చేయకూడదని, ఒకేసారి ఐదు కంటే ఎక్కువ పనులు అసలే చేయకూడదని వారు సూచించారు. ◆

రిమెయిన్ ఫ్రెండ్స్' అంది. ఆ మాటలకి తనామెని కొట్టినంత పనిచేశాడు.

తమ దాంపత్యజీవితంలో చిన్నపాటి ఒడుదుడుకులేమైనావుంటే అవి ఆ షార్ట్‌స్పాన్‌లో ఎదురయినవే. అతి త్వరలోనే తామిద్దరూ కోలుకున్నారు. సుమన్‌ని ఎడాప్ట్ చేసుకున్నారు. ఇప్పుడు వాడు తమ బయోలాజికల్ సంతానంకాదనే ఊహే రాదు.

ఈ పెళ్ళితో విజయ్ ఎప్పుడో ఒకప్పుడు చాలా అసంతృప్తికి లోనవుతాడనీ అప్పుడు చెయ్యగలిగిందేమీ ఉండదని రాజేశ్వరి భయపడింది.

తాను ఎంపికచేసిన పిల్లయితే విజయ్ ఇంకా ఎంతో సంతోషంగా ఉండేవాడని అనుకుంటూ, భర్తతో వాదిస్తూ ఉండేది. మైథిలికి పిల్లలు పుట్టరని తెలిశాక తననుకున్నంతా అయ్యిందని బాధపడింది. మనసు సర్దుకుని 'పోనీలే టెస్ట్‌ట్యూబ్ బేబీ కోసం ప్రయత్నిస్తారేమో' అనుకుందిగాని ఇలా అనాథ పిల్లవాడిని దత్తతచేసుకుంటారని అనుకోలేదు.

కొడుకు విషయంలో అనుకున్నవేవీ జరక్కపోవడంతో తనని తాను మానసికంగా అతని కుటుంబం నుంచి విడదీసుకుంది రాజేశ్వరి.

పైకి అంతా సవ్యంగా కనిపించినా మైథిలిని ఆవిడ మనసుకి దగ్గరగా రానివ్వలేదు. మనవడిని హృదయానికి హత్తుకోలేదు. ప్రభాకరానికి మరింత దగ్గరగా జరిగి అతనితోడిదే లోకం అనుకుని ఆ జీవితానికి అలవాటుపడిపోయింది. పడవ ఒడ్డుకి చేరేసరికి ఆలోచనాస్రవంతి ఆగింది. నలుగురూ కిందికిదిగి పరమార్థనికేతన్ వైపు దారితీశారు.

సుమన్ మామ్మ చెయ్యి పట్టుకున్నాడు.

రాజేశ్వరికి విజయ్ చిన్నతనం గుర్తొచ్చింది. వాడు పసివాడుగా ఉన్నపుడు తల్లి తన చెయ్యి పట్టుకోవడం వాడికి నచ్చేది కాదు. ఎక్కడైనా తప్పిపోతాడేమో అని చెయ్యి పట్టుకోబోతే విదిలించేసే వాడు 'అయామె బిగ్ బాయ్' అంటూ.

అపుడు తను "నువ్వు బిగ్‌బాయ్‌వికదా! నేనేమో

ముసలిదాన్నైపోతున్నా. సరిగ్గా నడవగలనో లేదో! నా చెయ్యిపట్టుకు నడిపిస్తావా ప్లీజ్?" అనడిగేది.

అపుడు వాడు తన చెయ్యి గట్టిగా పట్టుకుని నడిచేవాడు. సుమన్ చెయ్యి ఇవాళ చిన్నప్పటి విజయ్ చెయ్యిలాగే అనిపిస్తోంది.

దారికటూ ఇటూ ఎన్నో షాపులు. వాటినిండా రంగు రంగుల కళాకృతులు.

పూసలతో, సెమీ ప్రెషస్ స్టోన్స్‌తో చేసిన గాజులూ, గొలుసులూ. ఇలా ఎక్కడికెళ్ళినా ప్రభాకరం తనతో ఓపిగ్గా ఆ షాపుల్లోకి వచ్చేవారు. తనకి నచ్చినవేవో కొనివ్వడంలో ఆనందాన్ని పొందేవారు. రాజేశ్వరి కళ్ళు చెమ్మగిల్లాయి.

మరికొంతదూరం నడిచి పరమార్థనికేతన్ చేరారు. భక్తులూ, ఆధ్యాత్మిక సాధనకోసం వచ్చే వారికోసం దాదాపు వెయ్యిగదులతో, పూల మొక్కలూ, మందిరాలతో విశాలంగా ఉన్న ఆశ్రమ వాతావరణం వారిని సాదరంగా ఆహ్వానించింది.

పురాణాల్లోని రకరకాల సన్నివేశాల తాలూకు శిల్పాలు చూస్తూ సుమన్ అడిగే ప్రశ్నలకు విజయ్, మైథిలీ సమాధానాలు చెపుతుంటే రాజేశ్వరి వయసు మళ్ళిన స్త్రీలు, ముఖ్యంగా వితంతువులు కూర్చుని ప్రశాంతంగా భజన చేయడాన్ని గమనించి ఆగిపోయింది. ఇలాంటి చోట ఉండిపోతే?

"అమ్మా! కొంచెం ముందుగా వెళ్ళి గంగ ఒడ్డున కూర్చుంటే బావుంటుంది. తర్వాత ప్లేస్ దొరకదు" విజయ్ మాటలకి తెప్పరిల్లి అతని వెంట అడుగులు వేసింది. అంతా ఆశ్రమద్వారం దాటి బయటికి వచ్చారు. ఎదురుగా గంగాతీరానికి ముఖద్వారం లాగా అందమైన కమాను.

దానిమీద కృష్ణార్జునుల రథం, ఎంత అందంగా, శోభాయమానంగా తయారుచేశాడో ఆ శిల్పి. ఈ కమానువల్ల, ఆ వెనక ప్రవహిస్తున్న గంగామాత, అందమైన ఫ్రేములో జీవంతో పరవళ్ళు తొక్కుతున్న చిత్రంలా దృష్టిపథంలో ఇమిడిపోయింది.

ఆ నీటిమధ్యగా నదీజలాల్లోంచి పైకి ఉద్భవించిన హిమనగంలా తెల్లని మహాశివుని ప్రతిమ.

జీవకళతో మెరిసిపోతోంది. కమాను నుండి నది వరకూ సాగిన వెడల్పాటి మెట్లు. మంత్రముగ్ధలా నిల బడిపోయింది రాజేశ్వరి. "నాన్నా! ఇక్కడచూడు మైటీ హనుమా! ఎంత పెద్ద స్టాట్యూనో చూశావా?" ఆశ్చర్యంగా అరిచాడు సుమన్.

"మనూ! ఇక్కడ మాట్లాడకుండా ఉండి ఈ వాతావరణాన్ని ఫీల్ అవాలి మనం!

చెప్పులు స్టాండ్‌లో పెట్టి, ఇక్కడ మెట్లమీద కూర్చుని, స్వామీజీ కండక్ట్ చేసే హవన్ కార్యక్రమాన్ని చూడాలి. ఆ శ్లోకాలు, స్తోత్రాలూ, ఆ మంత్ర పఠనం వల్ల ఈ వాతావరణమంతా పాజిటివ్ వైబ్రేషన్స్ వ్యాపిస్తాయి. మౌనంగా ఆ కంపనాలని ఫీల్ అయినపుడే మన శరీరంలో జరిగే అద్భుతాన్ని మనం ఎక్స్‌పీరియెన్స్ చెయ్యగలుగుతాం. సరేనా?" అన్నాడు విజయ్ మృదువుగా.

వాడు నాదస్వరం విన్న నాగుపాములా తలూపాడు. నలుగురూ వెళ్ళి ఆఖరిమెట్టుమీద నిలబడి చల్లని నీటితో కాళ్ళూ, చేతులూ, కళ్ళూ కడుక్కొని కొద్దిగా పైకి నడిచి మెట్టుమీద కూర్చున్నారు. అప్పటికే అక్కడ హవన్ జరుగుతోంది.

దాదాపు పాతికమంది బాలవటువులు వేదపఠనంచేస్తున్నారు. గంగమ్మ పాదాల మృదుపదధ్వని ఒకవైపు, ఏకకంఠంగా సాగుతున్న మంత్రోచ్చారణ మరోవైపూ. రాజేశ్వరి పక్కనే విజయ్, కింద మెట్టు మీద మైథిలీ, సుమన్ కూర్చున్నారు.

ఆ ప్రాంతమంతా అత్యంత పరిశుభ్రంగా అలంకరించబడి ఉంది. ఎదురుగా గంగానదీప్రవాహం...ప్రవాహపుమధ్యలో అర్థచంద్రాకారపు వంతెన లాంటి నిర్మాణం మీద ఎత్తుగా మహాశివుడు ధ్యాన మగ్నుడై ఉన్న శిల్పం. ఆ వాతావరణం తనలోని బాధనీ, దిగులునీ, భయాలనీ చేత్తో తీసిపారేస్తున్నట్టనిపించి మెల్లగా కళ్ళుమూసుకుంది రాజేశ్వరి.

మంచిభావాలుమనస్సంతా కమ్మేస్తే ఇక ఆ రోజంతా హుషారు, ఆనందం చిందులువేస్తాయి. అందుకోసం ముచ్చటగా మూడు సూత్రాలు పాటిస్తే చాలు.

నిద్ర : ఎంత నిద్ర అవసరమో ముందుగా గుర్తించుకోవాలి. అందరికీ ఒకే గంటల నిద్ర సూత్రం వర్తించదు. ఒక్కోసారి ఒకే వ్యక్తికి నిద్రకు సంబంధించిన తేడాలూ ఉండొచ్చు. నిద్రపోయే సమయం, సహజంగా లేచే సమయం నోట్‌చేసుకోవాలి. ఇలా కనీసం ఓ వారం చేయాలి.

అప్పుడు రాత్రి వేళ సగటునిద్ర సమయం తెలుస్తుంది. ఆ సగటు సమయమే శరీరానికి కావాలి. శారీరక సహజనిద్ర ప్రక్రియపట్ల అవగాహన ఉండాలి.

పానీయాలు : శరీరంలో నీటి కొరత ఏర్పడితే మూడ్ మారిపోతుంది. ఓ రెండు రోజులపాటు తాగే నీటిపై కన్నేయాలి. పానీయాలు ఆరోగ్యవంతమైనవి కావాలి. అలా అని అవసరమైన దానికంటే ఎక్కువ నీరు తాగితే శారీరకవ్యవస్థ నుంచి ప్రధాన లవణాలు వెలికి వెళ్ళిపోయే అవకాశం ఉంటుంది. రోజుకు ఆరునుంచి ఎనిమిది గ్లాసులు సరైన సగటు మోతాదు.

కదలిక : ఉదయమా, సాయంత్రమా అన్న సంగతిని పక్కనబెడితే చురుకైన, శారీరక కదలిక మనస్సుకు, మెదడుకూ ఉత్తేజాన్నిస్తుంది. అలసటగా, చిరాగ్గావుంటే కొద్దిసేపు బ్రిస్క్‌వాక్ చేసి చూడండి లేదా సైక్లింగ్, స్విమ్మింగ్ ఏదైనా. ఒక్క 15నిమిషాలు చాలు.

ఓ వారంపాటు ఈ 15 నిమిషాలూ కేటాయించి చూస్తే ఎండార్ఫిన్లు చురుగ్గా ఉంటాయి. మరు వారం మరో 5 నిమిషాలు పెంచుకోవచ్చు. ◆

శృతిపక్వమైన గొంతులనేకం కలిసిచేస్తున్న శ్లోక పఠనం తాలూకు ప్రకంపనలు ఆమె శరీరంలోకి చొచ్చుకుపోయి లోపల ముడులు ముడులుగా చుట్టుకుపోయిన చికాకులనీ, గుబుళ్ళనీ వదులు చేసి, సాపుచేసి, కనిపించని రోగాన్ని నయం చేసినట్టనిపించింది. మెల్లగా కళ్ళు తెరిచింది.

తను భూమిమీదే ఉందా? తన మనసింత హాయిగా ఆహ్లాదంగా ఎలా అయింది? దాదాపు గంటసేపు ఆ అలౌకికానుభవాన్ని అనుభూతిస్తూ, ఆ వైబ్రేషన్స్‌ని ఆస్వాదిస్తూ ఉండిపోయింది రాజేశ్వరి. అంతలో అత్యంత మార్దవమైన కంఠంతో స్వామీజీ ప్రసంగం మొదలయింది.

పర్యావరణాన్ని, ముఖ్యంగా ప్రాణికోటి జీవం నిలిపే పవిత్ర గంగాజలాలని ఎలా నిర్మలంగా ఉంచుకోవాలో,మన వారసత్వ సంపదలనెలా కాపాడుకోవాలో గంభీరంగా చెప్పుకుపోతుంటే మంత్రముగ్ధులై వింటూండిపోయిన అశేష ప్రజానీకంలో తనూ ఒకతెగా నిలిచిపోయింది.

నీలతోయద మధ్యస్థా విద్యుల్లేఖేవ భాస్వరా
నీవారశూక వత్తన్వీ పీతాభాస్వత్యణూపమా
తస్యా శ్శిఖాయా మధ్యే పరమాత్మా వ్యవస్థితః

అందరిలోనూ అత్యంత సూక్ష్మరూపాన నిలిచి ఉన్న పరమాత్మ ఆ క్షణాన తన కళ్ళకు కనిపిస్తున్నట్టనిపించింది. అందరిలోనూ ఆ పరమాత్మ ఉన్నట్ట

యితే ఒక్కవ్యక్తి మరణం తననింత దుఃఖసము ద్రంలోకి నెట్టేయడమేమిటి?

ఆ విశాల ప్రాంగణాన్నీ, గంగానది ఉపరితలాన్నీ ఆవరిస్తున్నట్టుగా మధురమైన గానం మొదల యింది. కిందకి ఉన్న విశాలమైన చప్టామీద కొంత మంది మైమరచి నాట్యం చేస్తున్నారు.

సంధ్యా సమయమయింది. వరసగా మెట్లమీద అమర్చిన ఇత్తడి దీపపు సెమ్మెల్లో దీపాలు వెలిగిం చారు. ఏకకంఠంగా గానలహరి సాగింది.

చీకట్లు ముసురుతున్నకొద్దీ ఎదురుగా ఉన్న మహా శివుని రూపం మరింత తెల్లగా ప్రకాశమానంగా అయి మనసులోని దుఃఖాన్నంతటినీ తనలో లయం చేసుకుంటున్నట్టనిపించింది.

తీరం కనిపించినంత మేరా చూపు సారించింది. కనీసం వెయ్యిమంది జనం ఉండి ఉంటారక్కడ. అయినా ఆ శ్రావ్యమైన గానం మినహా ఎంతటి నిశ్శబ్దం. మెట్లెక్కి హారతి అందుకుంటోందా గంగమ్మ అన్నట్టు రెండు మెట్లపైదాకా వచ్చింది నీటిమట్టం.

చేతుల్లో దీపపుసెమ్మెలతో, పళ్ళేలలో ప్రమిద లతో స్వామిశిష్యులంతా గంగమ్మకు హారతులి చ్చారు. ఒకరినుంచి మరొకరికి దీపాలు చేతులు మారాయి. ఎవరో రాజేశ్వరి చేతికి అందించారు దీపమున్న పళ్ళేన్ని. తిరిగి దీపాలన్నీ శిష్యుల చేతు ల్లోకి చేరాయి. కార్యక్రమం ముగిసింది.

అంతా హోమ భస్మాన్ని బొట్టుగా ధరించి నిశ్శబ్దంగా వెను దిరిగారు. అప్పటికి దాదాపు ఎని మిదయింది. మెల్లిగా వచ్చిన దారినే వెనక్కి నడిచి రాం ఝూలా వంతెన చేరారు. సుమన్ గంతులేస్తూ ముందుకి పరుగెత్తాడు.

"నాన్నా! ఈ వంతెన ఉయ్యాలలా ఊగుతోంది చూశారా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"అందుకే మరి దీన్ని ఝూలా అన్నారు!" నవ్వుతూ చెప్పాడు విజయ్. ఒక అలౌకిక అనుభూతి పొందినట్టు జనమంతా దాదాపు మౌనంగా ఝూలా మీద నడిచిపోతున్నారు. ఆ ఒడ్డునుంచి ఈ ఒడ్డు చేరడానికి పది నిముషాలు పట్టింది.

ఆ దరి ఈదరినీ కలిపే అందమైన వంతెన కన్నా మనుషులనే ఏకంచేసే మమతల వారధి మిన్న! మానవతాభావం పెంచే మార్గమే మన లక్ష్యం మనసుల్లో శాంతిని పంచే ప్రతి యత్నపు ఫలితం... హర్షం!

చల్లగాలిలో విజయ్ పాట హాయిగా చెవికి సోకింది. తననుద్దేశించే పాడుతున్నాడా అనుకుంది రాజేశ్వరి. రాత్రి పడుకుంటే ఎంతోకాలం తరువాత హాయిగా నిద్రపట్టింది.

మర్నాడు అయిదుగంటలకే లేచి స్నానాదులు ముగించుకుని ఆరింటికల్లా టాక్సీ ఎక్కి నీలకంఠే శ్వరాలయానికి ప్రయాణమయ్యారు.

ప్రభాత కిరణాలకి కొండదారికటూ ఇటూ చెట్ల ఆకులు మెరిసిపోతున్నాయి.

కారు పైకెక్కుతున్నకొద్దీ పర్వతశ్రేణులు రక రకాల ఛాయల్లో ఆకుపచ్చగా, నీలిపచ్చగా, లేత నీలంగా కనిపిస్తూ కనువిందు చేస్తున్నాయి.

వదిలించుకుపోతున్నా వెంటపడే అల్లరిపిల్లలా గంగానది ఎంతదూరం వెళ్ళినా తమ వెంటే వస్తున్న ట్టనిపించింది. అద్భుత సౌందర్యరాశిలా ఆకట్టుకుని కళ్ళు తిప్పుకోనివ్వలేదు.

గంటన్నర ప్రయాణం తర్వాత నీలకంఠుని ఆలయంచేరి దర్శనంచేసుకుని తిరుగు ప్రయాణ మయ్యారు. సుమన్ మళ్ళీ మొదలుపెట్టాడు. "మామ్మా! ప్లీజ్ మీరూ రండి మాతో రాఫ్టింగ్‌కి. చాలా బావుంటుంది. చాలా సేఫ్. మేం ఇదివరకు వెళ్ళాం" అంటూ.

"నేనురాఫ్టింగూ, జంపింగూ చెయ్యలేను నాన్నా! నువ్వూ, అమ్మ, నాన్నా వెళుదురుగాని" అంది రాజేశ్వరి. "మరి గంగాహారతికి నేను రాలా? రాఫ్టింగ్‌కి మీరూ రావాలి. మ్యూచువల్ కోఆప రేషన్!" అని అన్నాడు.

నుడివేద సుమతీ

కులకాంతతోడ నెప్పుడుఁ
గలహింపకుఁ వట్టితప్పు ఘటియింపకుమీ
కలకంఠి కంటి కన్నీ
రొలికిన సిరి యింటనుండ దొల్లదు సుమతీ

టీ.సుమతీ! కులకాంతతోడన్=భార్యతో, ఎప్పుడున్ కలహింపకు=జగడమాడకుము, వట్టితప్పు ఘటియింప కుమీ=మోపకుము, కలకంఠి కంటి=స్త్రీ యొక్క కంటి నుండి కన్నీరు, ఒలికినన్, సిరి=లక్ష్మి, ఇంటన్+ ఉండన్, ఒల్లదు=ఇష్టపడదు.

తాత్పర్యము : భార్యతో ఎప్పుడును జగడమాడరాదు. లేని తప్పులు మోపరాదు.

పతివ్రతయైన స్త్రీయొక్క కంటినీరు పడినచో ఇంటియందు సంపద ఉండదు. ◆

రాజేశ్వరికి నవ్వొచ్చింది. "నదిమీద బోట్‌లో వెళ్ళడం,రాం ఝూలామీద నడవడం నీకిష్టం గనక వచ్చావు. నాకోసం వచ్చావా?" అంది సరదాగా.

"ఏం కాదు. అంతసేపు ఆ హారతిలో కూచోవడం ఏం బావుందీ? నదులకీ, కొండలకీ హారతులిస్తారా ఎక్కడేనా? అమ్మానాన్నా మీతో వచ్చారు గనక నేనూ రావాల్సొచ్చింది.

నాన్న ఎప్పుడూ చెప్తారు. మనం ఫ్యామిలీ కనక ఒకళ్ళకోసం ఒకళ్ళు కొన్ని పనులు ఇష్టం లేక పోయినా ప్రేమతో చెయ్యాలని"

తనవైపే చూస్తున్న వాడి నల్లటికళ్ళలో తనని కూడా తీసుకెళ్ళాలని ఎంత తాపత్రయం. ఆ క్షణంలో వాడెంతో ముద్దొచ్చాడు రాజేశ్వరికి. వాడి కోసం వెళ్ళాలని కూడా అనిపించింది.

"నాకు నీళ్ళంటే భయం నాన్నా. రాఫ్టింగ్ లాంటి ఎడ్వెంచర్స్ నేను చెయ్యలేను. నా వయసు అందుకు సహకరించదు" అంది రాజేశ్వరి వాడి బుగ్గలు సాగతీస్తూ.

"ఫిఫ్టీ ఎయిట్ ఈజ్ నాట్ ఓల్డేజ్ మామ్మా!మొన్న పేపర్లో చదవలేదా లైఫ్ స్టార్ట్స్ ఎట్ ఫిఫ్టీ అని? ఇప్పుడే మీరు ఇలాంటివి చెయ్యాలి" అన్నాడు వాడు.

మనసులో ఎక్కడో కలుక్కుమంది. యాభయ్యేళ్ళకి జీవితం మొదలయ్యేట్టయితే యాభయ్యేడేళ్ళకి భర్తని కోల్పోయిన స్త్రీ ఏమవ్వాలి?

"మామ్మ అలా అంటుంది గాని తనకి నీళ్ళంటే చాలా చాలా ఇష్టంరా మనూ. ఇలా రాపిడ్స్‌లో ప్రయాణ మంటే భయంగాని వాననీళ్ళన్నా, సెలయేళ్ళన్నా ఎంతిష్టమో" అన్నాడు విజయ్ ముందు సీట్లోంచి.

"మీరూ రండి అత్తయ్యా. చాలా సేఫ్ ఇది. చిన్న పిల్లలు కూడా చేస్తారు. ఒక్కసారి చేశారంటే ఇంక మీకు బోటు ప్రయాణం నచ్చదు.

నదితో స్నేహం చేస్తూ, నదితోపాటుగా సహజమైన ప్రయాణం చేస్తున్నట్టుండే ఈ అనుభవం వేరే ఎక్కడా దొరకదు. నిన్నటి గంగాహారతిలాగే ఇదీ ఒక అపూర్వమైన అనుభవం"అంది మైథిలి.

తనని ఎంత దూరంలో నిలిపితే అంత దూరంలోనే ఆగిపోయే మనస్తత్వం మైథిలిది.

సాధారణంగా ఏ విషయంలోనూ నొక్కిచెప్పడం ఆమెకి అలవాటులేదు. కానీ ఈసారి అలా చెప్పాలని మైథిలికనిపించినట్టే ఆమె చెప్పిన మాటలు వినాలని రాజేశ్వరికి అనిపించింది.

"లైఫ్ జాకెట్ వుంటుంది మామ్మా...నీళ్ళల్లోపడినా బలే బావుంటుంది" ఉత్సాహంగా అన్నాడు.

"నీ మొహం. నీళ్ళలో పడనే పడం అత్తయ్యా.

కావాలని కొంతమంది ఎక్కువ రాపిడ్స్ లేనిచోట నదిలోకిదూకి ఎంజాయ్ చేస్తారు"అంది మైథిలి.

విజయ్‌వైపు చూసింది రాజేశ్వరి.

"రా అమ్మా! నీకు అలవాటు లేదు గనక అలా భయపడుతున్నావు గాని నీకన్నా పెద్దవాళ్ళూ, చిన్న చిన్న పిల్లలు కూడా వస్తారు" అన్నాడు విజయ్.

సరే ఏమవుతుంది మహా అయితే... నీళ్ళలో పడి పోతే,మునిగిపోతే మాత్రం నష్టం ఏముందీ అనిపించింది. "సరే భయమే అయినా వీడికోసం వస్తాను" అంది రాజేశ్వరి.

అంతా ఉత్సాహంగా గెస్ట్‌హౌస్ దారి పట్టారు రాజే శ్వరి తప్పక ఒప్పుకుంది గాని ఆమె మనసులో దడగానే ఉంది. మధ్యాహ్న భోజనం అయ్యాక కొంతసేపు విశ్రాంతి తీసుకుని రాఫ్టింగ్ కోసం బయల్దేరారు. రైలు ప్రయాణం కోసం పెట్టుకున్న సల్వార్ పైజామా వేసుకుంది రాజేశ్వరి.

ముందుగా బుక్‌చేసిన మూడు టికెట్లతోపాటు మరో టికెట్ కావాలని అడిగాడు విజయ్.

"ఎందుకురా విజయ్ ఆరొందలు దండగ. నాకు ఎంతమాత్రం రావాలని లేదు" అని మళ్ళీ మొదలుపెట్టింది రాజేశ్వరి.

చిన్నపిల్లని చూసినట్టు ఆమెని చూస్తూ భుజాల చుట్టూ చెయ్యివేసి "ఇంకేం మాట్లాడకు. నువ్వే అంటావ్ ఎంత బావుందో అని" అన్నాడు ఇంకేం వినను అన్నట్టు. రాఫ్టింగ్ సరంజామాతోబాటు దాదాపు పదిమందితో జీప్ బయల్దేరింది.

మళ్ళీ ఘాట్ సెక్షన్లో గంటసేపు ప్రయాణం తర్వాత కొంత ఎగువనున్న నదీతీరం చేరారు. మిగిలినవాళ్ళంతా లైఫ్ జాకెట్లూ, తలకి హెల్మెట్లూ చకచకా ధరించారు.

రాజేశ్వరికి మైథిలి సాయం చేసింది. గైడ్ వచ్చి అందరినీ చెక్ చేశాడు. ఈ ఎడ్వెంచర్‌లో తమకి గాయాలయినా ప్రాణాలు పోయినా అందుకు తమదే బాధ్యత అని రాసి ఉన్న ఫారంస్ మీద అంతా సంతకాలు పెడుతుంటే వణికే చేతులతో తానూ సంతకం పెట్టింది రాజేశ్వరి.

జీపుపైన వేసి కట్టిన తెల్లని రాజహంసలాంటి పాలిథీన్ రాఫ్ట్‌ని మోసుకుంటూ తెచ్చి నదినీళ్ళలో వేశారు. నదికి దూరంగా వున్నప్పుడు వేడిగా అని పించినా నీటికి దగ్గరగా వచ్చేసరికి చల్లని పిల్లతెమ్మె రలు చుట్టి హాయిగా అనిపించింది. గైడ్ ముందు కొచ్చి ఏవో కొన్ని సూచనలిచ్చాడు.

"ఆంటీజీ! మీరు తెడ్డు వేస్తారా? ఊరికె కూర్చుంటారా?" అనడిగాడు. జారుతున్నట్టున్న తెప్ప అంచుని చూస్తూ "నేనా? ఉహు" అంది.

మైథిలీ నవ్వుతూ- "అత్తయ్యా! మీరిక్కడ ముందు కూర్చోండి. ఇది బెస్ట్ వ్యూ. యూ విల్ ఎంజాయ్" అంది. ఏదో ట్రాన్స్‌లో ఉన్నట్టు రాజేశ్వరి రాఫ్ట్‌లోకెక్కి చెప్పినచోట కూర్చుంది.

అటు నలుగురూ, ఇటు నలుగురూ తెడ్లు పట్టు కుని కూర్చున్నారు రాఫ్ట్ అంచుల మీద. "రెండు చేతులతోనూ తెడ్లు పట్టుకుంటే మరి ఎత్తైన కెర టాలుగా రాపిడ్స్ వస్తే నీళ్ళలోకి పడిపోరూ?" అంది రాజేశ్వరి భయంగా.

ఏం పడిపోరమ్మా! ఒక కాలు ఇక్కడా రెండో కాలు వెనకగా లాక్ చేసి పెట్టుకుంటాం, ఇందాక గైడ్ చెప్పాడుగా వినలేదా?" అన్నాడు విజయ్.

"పసివాడు కూడా కూడా తెడ్లు వెయ్యడమే మిత్రా?" అంది బెంగపడుతూ.

"మామ్మా! నేనూ నాన్నలా వెయ్యగలను! నువ్వే చూడు" అన్నాడు వాడు.

ఇంక చేసేదేం లేక 'గంగమ్మా! నువ్వే శరణు' అనుకుని మౌనంగా ముందుకి కూర్చుంది. ఆవిడకి చెరో వైపూ విజయ్, మైథిలీ కూర్చున్నారు.

అవి రెండూ గైడ్ స్థానం తర్వాత అతి ముఖ్య స్థానాలని తెలిసి "ఎందుకురా నాన్నా ఇలాంటి పనులు? కొంచెం వెనక్కి కూర్చుని ఎంజాయ్ చెయ్యకూడదూ? మీరీ పనిలో వుంటే వాడినెవరు చూస్తారు?" అంది పొంగుకొస్తున్న కోపాన్నీ, నిస్స

మంచి ప్రవర్తనకు....



ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవరచుకోవాలన్నా, అనారోగ్యకర అలవాట్లు వదిలేయాలన్నా రెండు అంశాలు ఈ మధ్య బాగా తోడ్పడుతున్నాయి.

స్నేహితులు మొదటి కారణం కాగా, రెండోది ఫేస్‌బుక్ లేదా ఇతర సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లు. ముఖాముఖి ప్రభావంతో స్నేహితులు ప్రముఖపాత్ర వహిస్తారు. అనుకూల ప్రవర్తనా సంబంధితమార్పుల పట్ల ఉద్దీప్తం చేయడంతో సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లు ప్రభావవంతంగా ఉంటున్నాయి.

ఈ విషయమై విస్తృత అధ్యయనాలు జరిగాయి. ఒకరు ఆరోగ్యవంతమైన మార్గాలు చేపట్టాలని భావించినప్పుడు రెండోవారు ఆ దిశగా ప్రోత్సహించడంవల్ల ఇది సాధ్యపడుతుందని అధ్యయనకారులు తెలిపారు.

నిజానికి చాలా ప్రజారోగ్య సంస్థలు ఫేస్‌బుక్ లేదా ట్విట్టర్‌వంటి సామాజిక నెట్‌వర్కింగ్‌లద్వారా ఈ.పని ఆరంభించి, మంచి ఫలితాలు సాధిస్తున్నాయికూడా. మరి మంచిఫ్రెండ్‌గా ప్రతిఒక్కరూ మంచిని ప్రోత్సహించాలి కదా. ◆

హాయతనూ అదిమిపెడుతూ.

తిక్కవేషాలు కాకపోతే ఆడదై వుండీ అంత లెక్కలేకపోవడం ఏమిటి? అనుకుంది మైథిలివైపు నిరసనగా చూస్తూ. అదంతా ఊహించిందే అన్నట్టు విజయ్ ఆమెని లక్ష్యపెట్టకుండా తెడ్డు వేయడానికి సిద్ధమైపోయాడు.

"ఫార్వార్డ్ పాడిల్. ఏక్ సాథ్" అరిచాడు గైడ్. అంతా ఒకేసారి తెడ్డువేశారు సుశిక్షితులైన సైనికుల్లా. నదిలో ముందుకి సాగింది రాఫ్ట్. కొన్ని క్షణాల్లోనే రాజేశ్వరి టెన్షన్ మాయమయింది.

నది పాడే సంగీతం తప్ప అంతా నిశ్శబ్దం. ఆహ్లాదకరమైన చల్లదనం. చుట్టూ కొండలు సూర్యకిరణాలకి మెరుస్తున్నాయి.

ఎదురుగా అనంతమైన జలరాశి. అందాల రాశి.అవి సూర్యకిరణాలో,చంద్రకిరణాలో తెలియనంత హాయైన చల్లదనం.ప్రకృతికింత దగ్గరగా అసలెపుడైనా ఉన్నానా? అనుకుంది రాజేశ్వరి.

'గంగా! తెర పానీ అమ్రుత్' వెనక కుర్రాడొకడు పాటందుకున్నాడు. తెప్ప ముందుకి సాగింది ఐదు నిముషాలపాటు. "అబ్ ఆ యేగీ పెహ్లీ రాపిడ్. ఆప్ సావధాన్ రహియే. మై జైసే బోలూ ఆప్ వైసేహీ కర్నా" అన్నాడు గైడ్.

రాజేశ్వరి గుండెగుభిల్లుమంది ఎదురుగా కొంత దూరంలో కనిపిస్తున్న ఉవ్వెత్తున ఎగసిపడుతూ అల్లిబిల్లిగా సుళ్ళు తిరుగుతున్న కెరటాలనిచూసి. "మేడం మీరు మోకాళ్ళమీద కూర్చుని తెప్పరింగ్స్‌ని గట్టిగా పట్టుకుని తలభాగం తెప్ప ముఖందగ్గర పెట్టుకుని కూర్చోండి" అన్నాడు హిందీలో.

రాజేశ్వరి అంతకుముందే చూపించిన విధంగా కూర్చుంది అప్రయత్నంగా. గైడ్ సూచనలకనుగుణంగా అంతా తెడ్డు వేస్తున్నారు.

దగ్గరగా వచ్చేస్తున్న నిలువెత్తు కెరటాలు తమని

● ప్రపంచం ఎలా ఉన్నా, నీవు నమ్మిన మంచిమార్గాన నీవు వెళ్ళు.

మింగేయడానికొస్తున్న జలచరాల్లా అనిపించాయి రాజేశ్వరికి. ఇంక ఏమయితే అదవుతుంది అనుకుని 'గంగమ్మా! నా కుటుంబాన్ని కాపాడు: పసి వెధవ నీళ్ళలోకి జారిపోకుండా కాపాడు' పదేపదే అదే అనుకుంటూంటే తెప్ప కెరటాల పైకెక్కి వాలులోకి జారింది.

విజయ్ "మనూ! పుల్ ద వాటర్! లాక్ యువర్ ఫీట్" అంటూ కెరటాల ఎత్తులమీంచి నీటిని తెడ్డుతో లాగుతుంటే తనకి కుడివైపు కూర్చున్న మైథిలిని ఓరకంట చూసింది రాజేశ్వరి.

ఎంత కాన్ఫిడెన్స్. సరిగ్గా విజయ్‌లాగే తెడ్డు వేస్తూ నీటిని లాగుతోంది.

ఎత్తైన కెరటాలు చెళ్ళు చెళ్ళున ఎడాపెడా తెప్పని కొట్టాయి. అంతా తడిసి ముద్దయ్యారు. పెద్దకెరటం పైకెక్కి వాలులోకి జారినపుడల్లా అంతా కేరింతలు కొట్టారు ఉత్సాహంతో.

తనకటూ ఇటూ కొడుకూ కోడలూ కనిపిస్తున్నారుగానీ కనపడకుండా వెనక ఉన్న సుమన్‌గురించి ఆమెకి బెంగగా ఉంది.

ఆనందాతిరేకంతో సుమన్ పెడుతున్న కేకలు వినిపిస్తుంటే 'అమ్మయ్య! నా మనవడు క్షేమం' అనుకుంటూ ఉంది రాజేశ్వరి.

ఎలాగయితేనేం మొదటి రాపిడ్‌ని విజయవంతంగా దాటారు. తెప్ప మళ్ళీ ప్రశాంత ప్రవాహంలోకి వచ్చింది. రాజేశ్వరి మెల్లగా లేచి తన స్థానంలో కూర్చుంది. తెప్పలో జనం అంతా ఉత్సాహంతో తుళ్ళిపడుతున్నారు. రాజేశ్వరికేదో అర్థమయినట్టనిపించింది.

రాపిడ్స్ వచ్చినపుడు సాధారణంగా తెప్ప కెరటాల మీద ఉయ్యాలలూగుతూ సాగుతుంది. తెప్పలోని గైడ్లిద్దరూ అవసరమైనపుడు ఏం చెయ్యాలో చేసి తెప్పని కాపాడగల సమర్థులు.

ఒకవేళ నీళ్ళలో పడినా లైఫ్ జాకెట్స్‌వల్ల మునిగిపోకుండా ప్రవాహంతోపాటు ముందుకి సాగుతారు. తెప్పలోని వాళ్ళు వాళ్ళని పైకి లాగుతారు. ఇంక నీళ్ళలో ఏ రాయో తగిలి గాయాలయ్యే అవకాశం లేకపోలేదు.

ఆ మాత్రం రిస్క్ తీసుకునే ఈ క్రీడకి వస్తారు మరి. అలా అనుకున్నాక ఆమె మనసు నెమ్మదించింది.పదినిముషాలు ప్రశాంతంగా సాగిందో లేదో రెండో రాపిడ్ గురించి ప్రకటించాడు గైడ్. సర్దుకున్న రాజేశ్వరి మనసు మళ్ళీ దడదడలాడింది.

ఈసారీ దాదాపు అలాగే కెరటాల సయ్యాటకి దీటుగా తెప్పసాగింది తెడ్ల సాయంతో.

కేరింతలు మిన్నంటాయి. చొచ్చుకొచ్చిన కొండ రాళ్ళని తప్పుకుంటూ, బండరాళ్ళని దాటుకుంటూ ఈ నిరంతర ప్రయాణం ఆవిడకి విసుగు రాదా అనుకుంది రాజేశ్వరి. ఎన్ని అడ్డంకులొచ్చినా వీలైతే వాటిని దాటుకుంటూ, వీలు కాకపోతే తన దారి మార్చుకుంటూ సాగిపోయే గంగామాత తనకేదో పరమార్థం బోధిస్తున్నట్టనిపించింది.

ముంచెత్తిన కెరటాలకి వీడ్కోలిస్తూ ముందుకి సాగారు. ఆ ఉధృతం తగ్గి ప్రశాంతస్థితికి వచ్చేసరికి "విజయ్! అత్తయ్య వణుకుతున్నారు. అయ్ థింక్ షి ఈజ్ గెట్టింగ్ కోల్డ్" అంది మైథిలి.

"లేదు లేదు. అయాం ఫైన్" అంది రాజేశ్వరి వణుకు తున్న పెదవుల్ని బిగించి పెడుతూ. వెనక్కి తిరిగి సుమన్‌ని చూసింది.

"మామ్మా! ఎలా వుంది? సూపర్ ఉంది కదా?" అన్నాడు ఈ చెవినుంచి ఆ చెవిదాకా సాగిన నవ్వులతో. 'ఓరి పిడుగా!' అనుకుంది రాజేశ్వరి.

మూడో రాపిడ్ దాటేసరికి ఆమెకి భయం చాలా వరకు తగ్గింది. రాపిడ్ దాటినతర్వాత వచ్చే ప్రశాంతత ఒక అద్భుతంలా అనిపించింది. అప్పటికి దాదాపు నాలుగ్గంటలై ఉంటుంది సమయం.

"సాబ్! మీరేమైనా చూయింగంలాంటివి తిన్నా చిన్నచిన్న రాపర్స్ కూడా గంగమ్మ ఒడిలోకి విస

● క్షణంసేపు కూడా భవిష్యత్ పట్ల విశ్వాసం కోల్పోవద్దు.

శరీరం చెప్పేది వినండి

వైద్యుల్ని కలవాలంటే వయస్సులో ఉన్న మహిళలకు బోర్. ఏదో చిన్న సమస్యేకదా వెయిట్ చేసి చూస్తే పోలా అనుకుంటారు.

నిజంగా చాలా అనారోగ్యంగా అనిపించినా దాన్ని నిర్లక్ష్యంచేస్తూ రోజులు మేనేజ్ చేసుకుంటూ పోతారు. దానంతట అదే నయమైపోతుందనేది వారి అభిప్రాయం. కాని చాలా సాధారణంగా అనిపించే ఐదు లక్షణాల్ని మాత్రం వారు నిర్లక్ష్యం చేయనేకూడదు. తప్పనిసరిగా డాక్టర్ అప్పాయింట్‌మెంట్ తీసుకోవాలి.

నియంత్రణ లేని క్రావింగ్స్ : తరచుగా దాహం, ఆకలి ఉంటున్నా, తీపి తినాలనిపిస్తున్నా అది బహుశా డయాబెటిస్‌కు సూచన .

అలసట, కళ్ళు తేలిపోవడం : ఇలా రోజుకు ఒకసారి కంటే ఎక్కువగా ఉంటే వైద్యుని సంప్రదించి, రక్తంలో చక్కెరస్థాయిలు పరిశీలించుకోవాలి.

బరువు తగ్గడం, పెరగడం : కొద్ది కిలోలు అటూఇటూ కావడం సహజం. ఐతే సంఖ్యలో తేడాలు మరీ ఎక్కువగా ఉన్నట్లయితే, రెండు నెలల వ్యవధిలో ఆరేడు కిలోల వ్యత్యాసం ఉంటే అది థైరాయిడ్‌కు సూచన కావచ్చు. వైద్యుని సంప్రదించాలి.

ఎక్కడైనా లంప్: శరీరంలో ఏ భాగంలో ఉండ మాదిరి లంప్ తగులుతున్నా, రెండు వారాల్లో అది తగ్గకపోతే యాంటీబయాటిక్స్ లేదా తదుపరి పరీక్షలు చేయాల్సిన అవసరం ఉంటుంది.

శరీరం, మనస్సు చెప్పేవి : శారీరకంగా, మానసికంగా బాగా లేనప్పుడు అందుకు తగిన సిగ్నల్స్ అందుతుంటాయి. వాటిని తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలి.

జలుబుచేస్తే డాక్టరు దగ్గరకు వెళ్ళాల్సిన అవసరం రాదు. అదే తీవ్రమైన గొంతునొప్పి లేదా సైనస్, నిరంతర దగ్గు ఉంటే మాత్రం వెళ్ళితీరాల్సిందే.ఏ లక్షణం అయినా వారానికిమించి ఉంటే వైద్యుల అవసరం తప్పదు. ◆

రద్దు. వాటిని నాకివ్వండి. నేను జాగ్రత్తగా తీసుకెళ్ళి చెత్త బుట్టలోవేస్తాను" అన్నాడు గైడ్ హిందీలో.

వెనక్కి తిరిగి అతన్ని పరీక్షగా చూసింది రాజేశ్వరి. ఇరవయ్యేళ్ళు వుంటాయో వుండవో. వాళ్ళల్లో తెల్లనివాడి కిందే లెక్క. కొంచెం బొద్దుగా, నిర్లక్ష్యంగా, 'జీవితమే ఒక ఆట. అది వెలుగునీడల సయ్యాట' అని పాడుకుంటున్నట్టు వున్నాడు.

భయాన్ని వదిలేస్తే జీవితం ఎంత బావుంటుందో కదా అనిపించింది ఆమెకి. దూరాన రేవు కనిపించింది. అక్కడ చాలా తెప్పలు నిలిచి వున్నాయి.

"సాబ్ మనం పది కిలోమీటర్లు ప్రయాణం చేశాం. ఇక్కడ అయిదు నిముషాలు ఆగుదాం. ఎవరికైనా మంచినీళ్ళు కావాలంటే తాగచ్చు" అన్నాడు గైడ్.

"ఇంకా ఎంతదూరం?" అడిగింది రాజేశ్వరి.

"ఏమ్మా? అలసటగా వుందా? చలి వేస్తోందా?" చెయ్యి పట్టుకుంటూ అడిగాడు విజయ్.

"అదేం లేదురా? తెలుసుకోవాలని అడిగానంతే!" అంది. నిజంగానే ప్రకృతి ఒడిలో పవళించినట్టున్న ఈ అనుభవం బావున్నట్టే ఉంది.

● అవసరంలో ఆదుకున్నవారే నిజమైన స్నేహితులు.

"ఇంకా పదహారు కిలోమీటర్లుందమ్మా! ఇక్కడి నుంచి ఇంకా కొన్ని రాఫ్టులు మనలాగే ప్రయాణి స్తాయి. ఇపుడింకో రకం ఎంజాయ్‌మెంట్"అన్నాడు. అయిదు నిముషాల్లో రాఫ్ట్ మళ్ళీ కదిలింది. కొత్తగా నీళ్ళలోకి దిగుతున్న రాఫ్టులలో కాలేజీ కుర్రాళ్ళని చూస్తూ చేతులూపారు తెప్పలో వాళ్ళంతా.

పైకి లేస్తూ, కిందికి జారుతూ, సుళ్ళు తిరుగుతూ రాపిడ్స్ దాటడం, లాహిరి లాహిరి లాహిరిలో అన్నట్టు అలలతో సాగడం.

భయం తగ్గాక, రాపిడ్స్ దగ్గరై ఎత్తుగా ఎగసిపడే కెరటాలు సమీపించగానే గంగామాత కెరటాల చేతులతో తనకి స్నానం చేయిస్తున్నట్టనిపించి ముగ్ధురాలైంది రాజేశ్వరి.

నది మధ్య ఈ స్వచ్ఛజలాల్లో అమ్మ తనంత తానే చేయించే స్నానానికీ, తను సాయంత్రం తీరంలో చేద్దామనుకున్న స్నానానికీ ఎంత తేడా అనుకుంది.

నాలుగు గంటల నదీవిహారం తర్వాత ఇరవయ్యారు కిలోమీటర్ల ప్రయాణం చివరిదశకొచ్చింది. నది బాగా వెడల్పుగా గంభీరంగా అయింది.

గైడ్ "ఇక్కడ అంతా నీళ్ళలోకి దిగచ్చు" అనగానే ఒకరి తర్వాత ఒకరు తెప్పమీంచి నీళ్ళలోకి దూకారు. మైథిలి కూడా దూకి చేపలా ఈదుతూ జలకాలాడింది. గైడ్ దగ్గరున్న డ్రై బ్యాగ్‌లో పెట్టుకున్న సెల్‌ఫోనులూ, కెమేరాలూ అడిగి తీసుకుని ఫోటోలు తీసుకున్నారు.

అక్కడికి దగ్గరలో వున్న కొండ అంచు (క్లిఫ్) ఎక్కి, ముప్ఫయి అడుగులఎత్తునుంచి 'క్లిఫ్ జంపింగ్' చేశారు. విజయ్, మైథిలీ మాత్రమే కాకుండా సుమన్ కూడా అలా దూకుతుంటే రాజేశ్వరి ఆశ్చర్యపోయింది.

బిలబిల్లాడుతూ వచ్చిన అమ్ముకునేవాళ్ళు మాగీ, చాయ్ అమ్ముతుంటే రాజేశ్వరి టీ తాగింది. సుమన్ మాగీ తిన్నాడు.

అంతా మళ్ళీ తెప్ప ఎక్కారు.

"నాన్నా! రాం ఝూలా దగ్గరకొచ్చేశాం!" పొలికేక పెట్టాడు సుమన్.

వంతెన కిందనించి రాఫ్టు పోతుంటే "చూశావా మనూ! నదిని డిస్టర్బ్ చెయ్యకుండా ఎలా ఈ ఉయ్యాల వంతెన కట్టుకున్నారో వీళ్ళు.

ఈ గైడ్ కుర్రాడు కూడా చూశావా ఒక్క చిన్న ప్లాస్టిక్ రాపర్ కూడా నీళ్ళలో వెయ్యకుండా జాగ్రత్త తీసుకున్నాడు. తమకి బతుకు తెరువునిచ్చే గంగమ్మని వీళ్ళెంతగా పూజిస్తున్నారో గమనించావా? పర్యావరణాన్ని పరిరక్షించుకుంటే ప్రకృతి మనకెంత ఆనందాన్నీ, ఆరోగ్యాన్నీ ఇస్తుందో చూశావా!" అన్నాడు విజయ్.

"అఫ్‌కోర్స్ నాన్నా! అయ్ లవ్ యూ బోత్ అండ్ మామ్మా ఫర్ దిస్ వండ్రఫుల్ ఎక్స్‌పీరియెన్స్!" అంటూ తండ్రికి ఫ్లయింగ్ కిస్ విసిరాడు వాడు.

కొద్దిసేపట్లో లక్ష్మణ ఝూలా కూడా దాటి మొదట బయలుదేరిన చోటికి చేరారు. తెప్ప దిగుతున్న అందరిలోనూ ఏదో పొంగిపొర్లే ఉత్సాహం... ఉల్లాసం! రాజేశ్వరి దిగబోతుంటే మైథిలి చెయ్యి అందించింది. ఆ చేతిని ఆప్యాయంగా పట్టుకుని కిందికి దిగింది రాజేశ్వరి.

ఆవలి ఒడ్డున నిన్న గంగాహారతి జరిపిన పరమార్థనికేతన్ కనిపించింది.

డ్రై బ్యాగ్‌లోంచి తమ వస్తువులు తీసుకుని నలుగురితోపాటూ రోడ్డు వైపుగా నడుస్తూ తన కుటుంబాన్ని క్షేమంగా ఒడ్డుకి చేర్చిన గంగమ్మకి మనసులో నమస్కరించుకుంది రాజేశ్వరి.

"నాన్నా మళ్ళీ ఎప్పుడొద్దాం?" అన్నాడు సుమన్ గునుస్తూ.

"ఇప్పటికిది పూర్తై ఇల్లు చేరలేదు. అప్పుడే మళ్ళీ ఎప్పుడని అడుగుతున్నావా బుజ్జిగాడాని. వచ్చే ఏడాది వద్దాంలే" అంది రాజేశ్వరి. ◇◇

● ఆడినమాట, గడచిన కాలం, వేసిన బాణం తిరిగిరానివి.



అలలమీద నగరం

ఈ అలల మీద తేలుతూ వుండే ఈ నగరాన్ని విచ్చుకున్న పువ్వు రూపంలో మాల్దీవులలో నిర్మిస్తున్నారు.సముద్రంలో లోతు తక్కువగా వుండే లెగూన్స్ ఐదింటిమధ్య ఈ ఓషన్ ఫ్లవర్ నిర్మాణం మొదలైంది.

ఇందులో మొత్తం 185 విల్లాలు, ఒక గోల్ఫ్ కోర్ట్, ఒక కాన్ఫరెన్స్ హాల్ ఉన్నాయి. ఇవన్నీ సముద్రంలో తేలుతూనే వుంటాయి.

హాలండ్‌కి చెందిన ఓ సంస్థ ఇచ్చిన ఈ డిజైన్‌ను ప్రభుత్వం ఆమోదించింది.

ఇక నిరంతర అలల తాకిడితో ఇళ్ళే జలకాలాడుతుంటాయి ఈ నగరంలో.

బుద్ధుడు నడచిన నేల

భారతావని ప్రపంచదేశాలకు జ్ఞానామృతాన్ని పంచిన వేదభూమి. అది ఆధ్యాత్మికతకు సన్నిధి. ఆత్మీయత, ఆదరణ, ఔదార్యాలకు పెన్నిధి. సత్ప్రవర్తన, స్వార్థరాహిత్యం, సదాచారాలకు ఆలవాలం. శ్రద్ధ, సహనం, సౌజన్యాలకు నిలయం.

జప, తప, యోగసాధనలకు పుణ్యతీర్థం. జ్ఞానులకు, జిజ్ఞాసువులకు పుట్టినిల్లు.యోగులు,ధార్మిక మహర్షులు, తత్వవేత్తలు, యుగపురుషులకు కార్యక్షేత్రం. మతాలు ఎన్నో, మార్గాలు అన్ని. అభిప్రాయాలు ఎన్నో మతాలు అన్ని. భారతావని ఓ రతనాలగని. యావత్ప్రపంచానికీ మహిమాన్విత పుణ్యక్షేత్రంగా భాసిల్లిన పుణ్యభూమి, కర్మభూమి.

అసంఖ్యాక శతాబ్దాల దేదీప్యమానమైన భారతదేశ చరిత్రలో జాతిని దైవంవైపు, ధర్మంవైపు కొనిపోయే దివ్యపురుషులు, అవతారమూర్తులు ఈ పుణ్యభూమిలో అనేకసార్లు అవతరించారు. మానవాళి మానసక్షేత్రాలలో ఆధ్యాత్మిక భావనా బీజాలు అంకురింపచేశారు. జాతిని జాగృతం చేశారు.

విజ్ఞాన విపంచి

భారతదేశాన గంగానదీతీరం ఆధ్యాత్మికత, నాగరికత, విజ్ఞాన సంపన్నతల త్రివేణి సంగమం. ధరణిని ప్రభావితం చేసిన పలు ధార్మిక విశ్వాసాలు కూడా ఇక్కడే జనించాయి. చరిత్రపుటలలో ఘన వారసత్వానికి ఆనవాళ్ళుగా నిలిచిన మహాసామ్రాజ్యాలు ఇక్కడ విలసిల్లాయి.

అంతర్జాతీయస్థాయిలో మహా విద్యాలయంగా వినుతికెక్కి, ఎందరో జిజ్ఞాసువులను ఆకట్టుకున్న ప్రపంచంలోకెల్లా అత్యంత ప్రాచీనమైన నలంద విశ్వవిద్యాలయం ఘనమూలాలు ఇక్కడే ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఎందరో మేధావులు, తాత్వికులు, జిజ్ఞాసువులు, అధ్యయనశీలురను ఆకర్షించిన విజ్ఞాన పీఠాలు ఇక్కడ పరిఢవిల్లాయి.

పెక్కు శాస్త్ర పరిశోధనలకు శాస్త్రాధ్యయనాలకు, మహోత్కృష్ట గ్రంథరచనలకు ఈ పుణ్యనదీతీరమే మహావేదిక అయింది.

చరిత్రలో స్వర్ణయుగం

గంగానది పరీవాహక ప్రాంతాలలో ఎన్నో నాగరికతలు, సంస్కృతులు విలసిల్లాయి. ఎన్నో సామ్రాజ్యాలు వెలిశాయి.కాలగర్భంలో కలసిపోయాయి.

చరిత్ర ప్రసిద్ధిగాంచిన మగధ సామ్రాజ్యానికి రాజధాని పాటలీపుత్రమే ఇది 25వ శతాబ్దంలో అజాత శత్రువుచే నిర్మించబడిన మహానగరం. ఈ పాటలీ పుత్ర కాలగమనంలో పాట్నా అయింది. నేటి బీహార్ రాష్ట్రానికి రాజధాని అయింది.

నాటి పాటలీపుత్రం భారతదేశ రాజకీయ చైతన్యానికి, ఆధ్యాత్మికోన్నతికి, ధార్మిక జాగృతికి కేంద్ర స్థానమైంది. ఆనాటి పాలనాకాలం చరిత్రలో స్వర్ణయుగంగా చిరస్థాయిగా నిలిచిపోయింది.

ఈనాటి బీహారు రాష్ట్రం పలురంగాలలో వెనుకబడి ఉండవచ్చుగాని గతవైభవ చిహ్నాలకు,చరిత్రలకు ఆనవాలు కావచ్చు కాని ఈ సీమకు ఎంతో ఘన నేపథ్యం ఉంది. అలెగ్జాండర్‌ని నిలువరించిన పోరాట పటిమ వీరోచిత యుద్ధాలు, స్వయం పరిపాలన వ్యవస్థ స్థాపన, స్వర్ణయుగం పాలన, చాణక్య రణతంత్ర నీతులు, వ్యూహరచనా నైపుణ్యాలు. ఇలా ఎన్నో ప్రత్యేకతలు.

ఈ ప్రాంతం లోకంలో శోకం చూసి పరివ్రాజకునిగా మారిన సిద్ధార్థుడు జ్ఞానోదయంతో బుద్ధునిగా మారిన జ్ఞానకేంద్రం. ఆధునిక కాలానికి వస్తే

బౌద్ధులు భక్తితో కొలిచే మహాబోధి దేవాలయం
బుద్ధుడు జ్ఞానోదయం పొందిన దివ్యప్రదేశం



రాజ్‌గిర్‌లోని బుద్ధుని విగ్రహం

పావనసీమ

బుద్ధుని పాదముద్రలతో పునీతమైన ఎన్నో మహనీయమైన, మనోజ్ఞమైన బౌద్ధ క్షేత్రాలను ప్రపంచం నలుమూలల నుంచి పర్యాటకులు సందర్శిస్తూ వుంటారు. అలౌకికమైన అనుభూతిని ఆస్వాదిస్తూ వుంటారు. బుద్ధుడు జన్మించిన దివ్యప్రదేశం. గౌతమబుద్ధుడు నడయాడిన పావనసీమ.

బీహార్ ఎంతో వందనీయమైన ప్రదేశం. బౌద్ధచైత్యాలు, ఆరామాలు ఎక్కువగా ఉండటంచే పూర్వం దీన్ని 'విహార్'గా పిలిచేవారని ప్రతీతి.

బుద్ధగయలోని బోధివృక్షం కింద బుద్ధునికి జ్ఞానోదయమైంది. ఇరవై ఆరు వేల సంవత్సరాల క్రితం, లోకంలో శోకాన్ని చూసి చలించిన, సమరం సమస్యకు పరిష్కారం కాదన్న కపిలవస్తు యువరాజు సిద్ధార్థుడు అందర్నీ విడిచి, అన్నీ విడిచి పరివ్రాజకుడై ప్రపంచానికి కొత్త వెలుగుదారులు చూపించి బుద్ధుడయ్యాడు.

లుంబినీ నగరంలో కన్ను తెరిచి కుశీనగరంలో మహాభినిష్క్రమణంచెందిన కరుణామూర్తి సందేశం నిఖిలజగతికి అమృతభిక్ష.

ఆ అవతారమూర్తి కారుణ్యరస ప్రవాహంలో జాతి పునీతమైంది. అహింసా ప్రబోధకుని ప్రేమ ప్రవాహంలో భారతావని పులకించింది.

భారత స్వాతంత్ర్య సమర రథసారథి మహాత్మా గాంధీ ఉద్యమజీవితంలోని కీలకఘట్టాలకు బీహార్ కార్యక్షేత్రమయింది.

భారత తొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్, దళిత రవికిరణం బాబూజగ్జీవన్‌రామ్ వంటి ఉద్దండులను జాతికి అందించిన ఘనసీమ బీహార్.

అవినీతిపై అలుపెరగని పోరాటం సాగించి, రెండవ స్వాతంత్ర్య ఉద్యమ శంఖారావాన్ని మ్రోగించి, సంపూర్ణ విప్లవానికి పిలుపునిచ్చి అత్యయిక పరిస్థితి చీకటి తెరలు చీల్చిన ప్రజాస్వామ్య పరిరక్షకులు, సముద్ధారకుడు లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ బీహార్ గర్వించదగ్గ జాతి రత్నం. విభిన్న ప్రత్యేకతలు, విశిష్టతలు సంతరించుకున్న బీహార్ ప్రసిద్ధ పర్యాటకప్రదేశంగా ఎనలేని గుర్తింపు పొందింది.

బీహార్ బౌద్ధవిహారాలకు, జైనమందిరాలకు, హిందూ దేవాలయాలకు ముస్లిమ్ ప్రార్థనాస్థలాలకు ప్రసిద్ధిగాంచినది.

ఈ ప్రాంతానికి వున్న పర్యాటక ప్రశస్తి, ఆధ్యాత్మికోన్నత దృష్ట్యా ఎందరో పర్యాటకులు, భక్తులు, ఆధ్యాత్మికచింతనాపరులు ఈ ప్రాంతాన్ని సందర్శిస్తూ వుంటారు.

ఎగిసిన బుద్ధఘోష

'బుద్ధం శరణం గచ్ఛామి. ధర్మం శరణం గచ్ఛామి. సంఘం శరణం గచ్ఛామి' అంటూ భారతదేశంలోనే కాదు ప్రపంచదేశాలలో ఉవ్వెత్తున ఎగిసింది బుద్ధఘోష

మానవుడు సంఘపరంగా మనుగడ సాగిస్తూ ధర్మాన్ని నిలబెట్టాలని, దానికి బౌద్ధమే సరైన మార్గమని చాటిచెప్పిన గౌతమ బుద్ధుడు నడయాడిన ప్రాంతం అంతా పుణ్యభూమే.

మానవాళి ప్రగతి, సమాజహితం, సుస్థిర శాంతి

స్థాపన మౌలిక లక్ష్యాలుగాచేసి, బుద్ధభగవానుడు అహింసాధర్మాన్ని ప్రేమైక భావనను మనోజ్ఞంగా సుబోధకం గావించాడు. బౌద్ధం సమత, మమత, మానవీయతలకు ప్రాధాన్యం ఇస్తుంది.

గౌతమ బుద్ధుడు తాను ఉద్బోధించిన మార్గానికి 'ధమ్మ' అని నామకరణం చేశాడు. మానవుల శాంతియుత సహజీవనానికి బుద్ధుడు చూపిన విశిష్టమార్గం ధమ్మపథమే. అది నాటికి, నేటికి విశ్వానికి శిరోధార్యమే.

సందర్శనీయ క్షేత్రాలు

బుద్ధభగవానుడు మోక్షంపొంది శతాబ్దాలు గడిచాక, మౌర్యసామ్రాజ్య చక్రవర్తి అశోకుడు బౌద్ధాన్ని పునరుద్ధరించాడు.

ప్రపంచవ్యాప్తంగా బౌద్ధమతం వ్యాప్తిచెందడానికి ఇతోధికంగా దోహదం చేశాడు. భారతదేశవ్యాప్తంగా బౌద్ధ పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం గుర్తించిన నలభై అయిదు ప్రముఖ ప్రదేశాల్లో బీహార్‌లోని బౌద్ధ సందర్శనీయ స్థలాలుకూడా ఉండటం గమనార్హం.

ప్రస్తుతం బీహార్‌లో సందర్శనీయ బౌద్ధక్షేత్రాలలో బోధిగయ (బుద్ధగయ) రాజ్‌గిర్, నలంద, వైశాలి చేరివున్నాయి. రాజ్‌గిర్, నలందలలోని ఇతర ప్రదేశాలుగాక, గయలోని గుర్పా, బారాబర్, జెతియన్ వంటి అనేక ఇతరస్థలాలను సందర్శనీయ కేంద్రాలుగా అభివృద్ధిచేయాలన్న ప్రణాళికలున్నాయి.



Courtesy DISCOVER INDIA

విశ్వశాంతి స్తూపం

బుద్ధగయ

ఇక్కడ వున్న అత్యంత పురాతనమైన మహాబోధి ఆలయం ఎంతో సుప్రసిద్ధమైనది. బుద్ధుడు జ్ఞానోదయం పొందిన చోటు గయ. అది హిందువులకు ఎంతో పవిత్రమైన పుణ్యతీర్థం. బుద్ధుడి జ్ఞానోదయంతో అది బుద్ధగయ (బోధిగయ) అయింది.

మహాబోధి దేవాలయం బోధివృక్షానికి తూర్పున ఉంది.బుద్ధుడు జ్ఞానోదయంపొందిన బోధివృక్షం నేటికీ నిలిచివుంది. అసలు వృక్షపరంపరలో ఇది ఐదవది అని చెబుతారు. అది ఆనాటి వృక్షం అయినా, కాకపోయినా అదే ప్రదేశంలో బోధివృక్షం ఉంది. ఆ వృక్షఛాయలోనికి చేరగానే అనిర్వచనీయమైన ప్రశాంతత ఆవరిస్తుంది.

ఈ దేవాలయం ఓ వాస్తుశిల్పి అద్భుతం. ఇది 48 చదరపు అడుగుల విస్తీర్ణంగల పునాది నుంచి 170 అడుగుల ఎత్తున ఉంది. మత సార్వభౌమాధికారానికి ప్రతీకగా ఆలయం శిఖరంపైన ఛత్రములు నిర్మించబడినవి. ఈ దేవాలయం గర్భగుడిలో నల్లరాతితో చెక్కబడిన బుద్ధుని విగ్రహం భూమిని తాకుతూ కూర్చొన్న భంగిమలోవుంటుంది. విగ్రహం దక్షిణహస్తం భూమిని స్పృశిస్తూ భూమిస్పర్శముద్రలో దర్శనమిస్తుంది. ఇదే భంగిమలోనే బుద్ధుడు జ్ఞానోదయం పొందాడు.

ఈ దేవాలయ ప్రాంగణంలో రెండువేల ఐదు వందల సంవత్సరాల క్రితం నిర్మించిన ఎన్నో విలక్షణమైన స్తూపాలున్నాయి. యాత్రికులు అనిమేష్ లోచన్ చైత్యాన్ని సందర్శిస్తారు.

ఇది కన్నురెప్ప వేయకుండా కృతజ్ఞతతో బోధి వృక్షాన్ని తదేకంగా చూస్తూ ఒక వారంరోజులపాటు బుద్ధభగవానుడు గడిపిన ప్రదేశం.

ఈ ఆలయ ప్రాంగణంగాక,బుద్ధగయలో 80 అడుగుల ఎత్తైన బుద్ధుని విగ్రహం, ఒక బుద్ధ



కుండం, రాజాయాతన, బ్రహ్మయోని, చైనాదేవాలయం, ఆరామం, ఒక బర్మా దేవాలయం, భూటాన్ బౌద్ధ ఆరామం, అంతర్జాతీయ బౌద్ధ ఆరామం, జపనీయుల దేవాలయం, థాయ్ దేవాలయం, ఆరామం, టిబెటన్ల ఆరామం, వాస్తుశిల్ప మ్యూజియం ఇంకా బుద్ధగయలో అసంఖ్యాక ఆరామాలు వున్నాయి.

ప్రపంచంలో బౌద్ధ దేశాలు ఇక్కడికి వచ్చే తమ భక్తులకోసం ఆరామాలు నిర్వహిస్తున్నాయి.

ఎలా చేరాలి : అతి దగ్గరలో ఏడు కిలోమీటర్ల దూరంలో గయలో విమానాశ్రయం ఉంది. దగ్గరలో గయ రైల్వే స్టేషన్ (17 కి.మీ) ఉంది. గయనుంచి బుద్ధగయకు రోడ్డు రవాణా సౌకర్యం ఉంది.

ఎక్కడ బసచేయాలి : సిద్దార్థ విహార్, బుద్ధ విహార్ అందుబాటులో ఉంటాయి.

నలంద

అంతర్జాతీయ స్థాయిలో మహావిద్యాలయంగా భాసిల్లి ఎందరో జిజ్ఞాసువులను ఆకట్టుకున్న అతి ముఖ్యమైన నగరాలలో బీహారులోని నలంద ఎంతో ప్రాముఖ్యతను కల్గి ఉంది. ఇది ఒక మహా విజ్ఞాన పీఠం. బుద్ధగయకు సుమారు 62 కిలోమీటర్ల దూరంలో ఉంది నలంద.

ఐదవ శతాబ్దానికి చెందిన ఈ మహా విద్యాలయం ఒక నయనమనోహర దృశ్యం. మూడవ శతాబ్దంలోనే అశోకుడు నలందని ఎంతో అభివృద్ధి చేసినట్లు చారిత్రక ఆధారాల వలన తెలుస్తోంది. మహోన్నత వైభవంతో విరాజిల్లింది.

ఆనాటి మహోన్నతవైభవానికి మౌనసాక్ష్యాలుగా మిగిలిన శిథిలాలు చారిత్రక అవశేషాలను చూడగానే భక్తి పూర్వకమైన స్ఫూర్తి మనస్సును ఆవరిస్తుంది.ఆనాడే ప్రపంచదేశాలనుంచి ఎందరో విద్యార్థులు 'నలంద'కి అధికసంఖ్యలో వస్తూవుండేవారు, తమ అధ్యయనాలు సాగించేవారు.

ప్రపంచంలోకెల్లా తొలి ఆవాస అంతర్జాతీయ విశ్వవిద్యాలయంగా నలంద గౌరవప్రాభవాలను తలుచుకొని గర్వపడడం తప్ప ఏం చేయలేం. ప్రముఖ చైనా యాత్రికుడు హుయాన్ సాంగ్ కొంతకాలం 'నలంద'లో గడిపాడు.

ఈ ప్రదేశంలోని విశేషాలను గ్రంథస్థం చేశాడు. 'నలంద'లోని విశేషాలను, పర్యాటక అద్భుతాలను చూడాలనుకొంటే 'గైడ్' సహాయం తీసుకోవడం మంచిది.

లేకపోతే ఇక్కడి వాస్తు శిల్పకళా వైభవాలను, వాస్తుశిల్ప వ్యక్తీకరణలను, వాస్తుశిల్పకళా ఖండాల వైభవాలను ఆసాంతం చూడడం కష్టమవుతుంది. ఈ గైడ్స్ సాధారణంగా తమ సంభాషణా చాతుర్యానికి స్థానికమైన ముచ్చట్లు, ఐతిహ్యాలను తమ

పరిజ్ఞానాన్ని జోడించి ఈ ప్రదేశం గురించి ఎంతో అందంగా, మంత్రముగ్ధంగా చెబుతుంటారు. ఇక్కడ చూడడానికి ఎన్నో విశేషాలు ఉన్నాయి.

స్తూపాలు, ఆరామాలు, హాస్టల్స్, ప్రయోగశాలలు, ధ్యానమందిరాలు, ఉపన్యాస ప్రాంగణాలు, దేవాలయాలు ఎన్నో వున్నాయి.

పధ్నాలుగు సంవత్సరాలు ఇక్కడ గడిపిన భగవాన్ మహావీర్ నుంచి బుద్ధభగవానుడి వరకు మహనీయుల పాదస్పర్శతో పులకించిన ఈ ప్రదేశం ఎంతో గౌరవ ప్రాపకాలను పొందింది.

సుమారు క్రీ.శ. 150లో జన్మించిన ప్రఖ్యాత అధ్యాపకుడు నాగార్జునుడు తన ఏడవ ఏటనే నలందలో అధ్యయనం మొదలుపెట్టిఅధ్యయనంలో అగ్రగామిగా నిలిచి, ఇక్కడే ఆచార్యపదవిని అలంకరించాడు. నలంద విశ్వవిద్యాలయ శిథిలాల ప్రవేశద్వారానికి ఎదురుగా వాస్తుశిల్ప కళా మ్యూజియంవుంది.

తవ్వకాలలో బయటపడ్డ అనేక కంచు విగ్రహాలు, చెక్కుచెదరని బుద్ధుని విగ్రహాలు, ఇంకా హిందూ దేవతల విగ్రహాలు, బౌద్ధవిగ్రహాలు, అపురూపమయిన నాణాలు ఇత్యాది అందమైన సంచయాన్ని ఇక్కడ భద్రపరిచారు. ప్రపంచానికి జ్ఞాన బిక్షువునిచ్చి విజ్ఞానవీచికలు పరిమళించిన ఈ ప్రాంతం సందర్శనీయ స్థలం. నిన్నటి వైభవాలకు, నేటి స్థితి గతులకు నిలువుటద్దం నలంద.

ఎలా చేరాలి : అతి దగ్గరలో 89 కిలోమీటర్ల దూరంలో పాట్నాలో విమానాశ్రయం ఉంది. సమీపంలో 12 కిలోమీటర్ల దూరంలో రాజ్‌గిర్ రైల్వే స్టేషన్ ఉంది. రాజ్‌గిర్, బుద్ధగయలతో చక్కగా అనుసంధానం చేస్తూ నలందకు రోడ్డురవాణా సౌకర్యం ఉంది (110 కి.మీ.)

ఎక్కడ బసచేయాలి : బీహార్ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థకు చెందిన మూడు టూరిస్ట్ బంగళాలు ఉన్నాయి. అయితే రాజ్‌గిర్‌లోని తథాగత్ విహార్, అజాతశత్రు విహార్, గౌతమ్ విహార్.

రాజ్‌గిర్

నలందకు 15 కిలోమీటర్ల దూరంలోవున్న రాజ్‌గిర్ బౌద్ధులకు దర్శనీయక్షేత్రం. ఇది లోయలోవున్న ప్రశాంతమైన ఓ చిన్నపట్నం. బుద్ధభగవానుడు ఇక్కడ ఎన్నో సంవత్సరాలు గడిపాడు.

గౌతముడ్ని అతని సోదరుడు దేవదత్తుడు గాయపరచినపుడు రాజవైద్యులు బుద్ధుడికి వైద్యం చేసింది రాజ్‌గిర్ (జీవకామియవన్ గార్డెన్స్)లోనే అని నమ్మకం జనంలో ఉంది.

ఇక్కడి గృద్ధకూట్ పర్వతంమీదే బుద్ధుడు తన బోధనలు చేశాడు. తొలి బౌద్ధమండలి సమావేశం జరిగిన చోటు ఇదే. బుద్ధుని ప్రవచనాలు రాజ్‌గిర్‌లోనే లిఖించబడ్డాయి. ఈ ప్రాంతం ఔషధగుణాలు గల వేడినీటి సెలయేరులకు పేరెన్నికగన్నది.



నలంద విశ్వవిద్యాలయం శిథిలాలు

జపాన్‌కు చెందిన బౌద్ధభక్తులు గృద్ధకూట్ పర్వతం మీద శాంతిస్థూపానికి నిర్మించిన రోప్‌వే చూడదగ్గది. చాలామంది పర్యాటకులు వేడినీటి సెలయేళ్ళలో పవిత్ర స్నానం ఆచరించి, రోప్‌వే ద్వారానో లేదా కాలినడకన రెండు గంటలు నడిచో ఈ స్థూపాన్ని దర్శించుకుంటారు.

రాజ్‌గిర్‌లో చూడవలసిన ఇతర అంశాలలో ముఖ్యమైనది సోన్‌భాండార్ గుహలు. ధ్యానం చేసుకోవడానికి ఉద్దేశించిన ఈ గుహలు మూడవ, నాల్గవ శతాబ్దాలలో నిర్మితమయ్యాయి.

వైశాలి

వైశాలి పొలిమేరలలో కొల్హావద్ద బౌద్ధారామంవుంది. గౌతమబుద్ధుడు తరచు వచ్చి బోధనలు చేసేవారు. జనశృతిలోవున్న ఐతిహ్యం ప్రకారం ఆయన సందర్శన సమయంలో విశ్రాంతి తీసుకోవడానికి, ఆయన సౌకర్యంగా బస చేసేందుకు ఎన్నో కోతులు ఒక తటాకాన్ని తవ్వాయని, ఆయనకు ఒక పాత్ర నిండా తేనెను ఇచ్చాయని తెలుస్తోంది.

ఇక్కడే బుద్ధుడు తన చివరి ప్రవచనం బోధించాడు. ఈ సంఘటనను పురస్కరించుకొని గౌరవసూచకంగా అశోకచక్రవర్తి క్రీ.పూ. మూడవ శతాబ్దంలో ప్రసిద్ధ సింహ స్తంభాలలో ఒకదానిని ఇక్కడ నిర్మించాడు.

బుద్ధుడు తన చివరి ప్రయాణం సాగించే దిశలోనే ఈ సింహం చిత్తరువు ఉత్తరాభిముఖంగా ఉంటుంది. ఈ ఆరామంలో చూడదగ్గవి అంతగా ఏం లేకపోయినా ఈ ప్రదేశం పావనమయినది. వందనీయమయినది.

బుద్ధుని మహాపరినిర్వాణం తర్వాత వందేళ్ళు గడిచాక జరిగిన బౌద్ధమండలి రెండవ సమావేశానికి వైశాలి ఆతిథ్యమిచ్చింది. ఈ సంఘటన స్మారకార్థం రెండు స్తూపములు నిర్మించారు. ఇక్కడ దొరికిన కొన్ని వాస్తు శిల్ప అవశేషాలను భద్రపరిచిన వైశాలి మ్యూజియం చూడవలసిన ప్రదేశాలలో ఒకటి.

మ్యూజియం దగ్గరలో పైమూతతో కప్పబడిన స్తూపం ఉంది. ఇందులో బుద్ధభగవానుని అస్తికల అవశేషాల శవపేటిక ఉందని చెబుతారు.

అక్కడికి కొన్ని కిలోమీటర్ల దూరంలోవున్న నందనఘర్‌లో బౌద్ధయుగానికి ముందటి పాలక వంశాల అవశేషాలువున్న డజన్లకొద్దీ వైదికమైన మట్టిదిబ్బలను కూడా చూడవచ్చు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే భగవాన్ మహావీర్ వైశాలి శివారు ప్రాంతంలో జన్మించాడు. 22 ఏళ్ళవయస్సు వరకు ఇక్కడే జీవించాడు.

బింబిసార చక్రవర్తి ఖజానా ఇందులో నిక్షిప్తమై ఉందన్న ఇతిహాసగాథ వినబడుతూ ఉంటుంది. నిధులకోసం ప్రయత్నించడం, ఈ గుహలకింద వున్న మార్పుకు లోనయ్యే అత్యంత గాఢమైన గంధకంవలన ఈ గుహలు విస్ఫోటనం చెందే ప్రమాదం వుందని టూరిస్ట్ గైడ్స్ అలా హెచ్చరిస్తూ వుంటారు.

ఈ ప్రాంతంలో చూసితీరవలసిన ఇతర ప్రదేశాలలో స్వర్ణభాండార్ (జరాసంధుని పాలన కాలం నాటి బంగారం భాండాగారం) వేణు వన (బుద్ధభగవానుడి కోసం బింబిసార చక్రవర్తి నిర్మించిన ఆరామం వున్న చోటు) బింబిసారుని ఖైదు, గృద్ధకూట్ పర్వతంపైన వున్న శిఖర ఆరామానికి బుద్ధభగవానుడు ఎక్కివెళ్ళడం చూసే అవకాశం ఉంటుందనే బింబిసారుడు తన ఖైదుకోసం ఈ స్థలాన్ని ఎంచుకున్నట్టు తెలుస్తోంది.

ఎలా చేరాలి : అతిసమీపంలో 101 కిలోమీటర్ల దూరంలో పాట్నాలో విమానాశ్రయం ఉంది. రాజ్‌గిర్‌లో రైల్వేస్టేషన్ వున్నా, అక్కడికి దగ్గరలోవున్న గయ రైల్వేస్టేషన్ అనువుగా ఉంటుంది. ఇది 78 కిలోమీటర్ల దూరంలో ఉంది.

ఎక్కడ బసచేయాలి : బీహార్ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థకు రాజ్‌గిర్‌లో తథాగత్ విహార్, అజాతశత్రు విహార్, గౌతమ్ విహార్ అనే మూడు టూరిస్ట్ బంగ్లాలు ఉన్నాయి.

ప్రపంచంలోకెల్లా అత్యంత ప్రాచీనమైన నాగరికతా కేంద్రంగా వైశాలి విలసిల్లింది. వేనవేల సంవత్సరాల క్రితమే ప్రజాస్వామ్యరీతిలో పరిపాలన నడిపిన ఘనత వైశాలి దక్కించుకుంది.

ప్రజలనుంచి ఎన్నికైన ప్రతినిధులు ఆ కాలంలోనే చక్కటి పరిపాలన అందించారు. అశోకస్తూపం, శాంతి స్తూపం వంటి ఇతర సందర్శనీయస్థలాలు వైశాలిలో వున్నాయి.

ఎలా వెళ్ళాలి : అతి సమీపంలో 70 కి.మీ. దూరంలో పాట్నాలో విమానాశ్రయం ఉంది. దగ్గరలో హిజ్‌పూర్ (35 కి.మీ.) రైల్వేస్టేషన్ ఉంది. వైశాలినుంచి పాట్నాకు (56 కి.మీ.) ముజఫర్‌పూర్‌కు(36కి.మీ.) రోడ్డు మార్గాన కూడా వెళ్ళవచ్చును.

ఎక్కడ బసచేయాలి : వైశాలిలో అంబపల్లి విహార్ వద్ద టూరిస్ట్ బంగ్లా ఉంది.

గయ

భారతదేశంలోని అత్యంత పురాతనమైన నగరాలలో గయ ఒక్కటి. గయలో బ్రహ్మయోని, దుంగేశ్వరి పర్వతాలు వున్నాయి.

నిర్వాణ అన్వేషణకోసం బుద్ధభగవానుడు ఈ ప్రాంతానికి వచ్చాడు. బుద్ధుడు కొన్ని రోజులపాటు బ్రహ్మయోని పర్వతంపై గడిపాడు. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని స్మారకార్థం పర్వతంపైన అశోకుడు ఒక స్తూపాన్ని, బుద్ధుని విగ్రహాన్ని పర్వతంపై పాదముద్రలను నిర్మించాడు.

రెండు సన్నటి గుహలు బ్రహ్మయోనిపర్వతాల్ని మాత్రియోనిలో కలుపుతాయి. ఈ గుహలగుండా వెళ్ళేవారికి జనన మరణచక్రం నుంచి విముక్తి లభిస్తుందన్న ఇతిహాసగాథ ప్రచారంలో ఉంది.

దుంగేశ్వరి పర్వతాలకు (ప్రాగ్బోధ పర్వతాలని పిలుస్తారు) కూడా అంతే ప్రాముఖ్యత ఉంది. జ్ఞానోదయంకోసం బుద్ధగయకు తన ప్రయాణాన్ని ప్రారంభించడానికి ముందు బుద్ధుడు ఇక్కడే దైవశక్తులను పొందాడని చెబుతారు.

ఈ శిఖరంపైన అశోకస్తూపం, బౌద్ధఆలయం శిథిలాలు నేటికీ కనిపిస్తాయి. గయలోని మ్యూజియం కూడా చూడదగ్గప్రదేశాలలో ఒకటి. మహాబోధివృక్షం ప్రతిరూపంతో పాటు సుమారు 2000 ప్రాచీన కళాఖండాలను, వస్తువులను ఈ మ్యూజియంలో భద్రపరిచారు.

ఎలా చేరాలి : గయలో అంతర్జాతీయ విమానాశ్రయం, రైల్వేస్టేషన్ ఉన్నాయి.

ఎక్కడ బసచేయాలి : గయలో గల హోటల్ సిద్ధార్థ ఇంటర్నేషనల్ సౌకర్యంగా వుంటుంది.

దివ్యానుభవం

సమాజాన్ని జాగృతం చేయడానికి మహనీయులు ప్రతియుగంలో ఉద్భవిస్తుంటారు.

వారినే మనం దైవాంశ సంభూతులుగా భావించి కొలుస్తుంటాం. గౌతమబుద్ధుడు చారిత్రక పురుషుడైనా, అవతారస్వరూపుడైనా ఆయన బోధనలు జగతికి శిరోధార్యాలు.

బుద్ధుని దివ్యబోధనలు పరిఢవిల్లిన ప్రాంతాలలోని బౌద్ధక్షేత్రాలు, ఆరామాలు, ఇతర పర్యాటక విశేషాలను సందర్శిస్తున్నంతసేపూ మనం అలౌకిక భావనకు గురవుతాం.

ఆ భావనతో మనం ఇక్కడ తిరుగాడే ప్రతి అంగుళం దర్శనీయంగానే ఉంటుంది.

గౌతమబుద్ధుడు నడయాడిన నేలపై విలసిల్లిన ఈ పుణ్యక్షేత్రాలు సందర్శిస్తుంటే ఓ అనిర్వచనీయమైన ఆనందానుభూతికి లోనవుతాం.

వీచేగాలిలో, పారే సెలయేటి గలగలల్లో, పూచే పూలసౌరభాలలో జాలువారే జలపాతాలలో, పరవశించే ప్రకృతిలో అణువణువునా అడుగడుగునా బుద్ధం శరణం గచ్ఛామి, ధర్మం శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి అన్న బుద్ధఘోష ప్రతిధ్వనిస్తూ వుంటుంది.

నాడు బుద్ధుని పాదస్పర్శతో పులకించిన నేలపై నేడు మనం నడుస్తూవుంటే ప్రేమ ప్రవాహంలో, జ్ఞాన ప్రవాహంలో ఓలలాడుతున్నామన్న భావన మనలో కలుగుతుంది. దివ్యానుభవంతో మనసు ఆనంద పులకాంకితమవుతుంది.

బాలాంత్రపు వేంకటరావు

ద్వేషం

మహానుభావా! మీకో శతకోటినమస్కారాలు. మీ ప్రపితామహులాది పెద్దలకో సహస్ర కోటివందనాలు నన్నాసీట్లోనించి మార్చెయ్యవయ్యా అంటే తలగుమాస్తా వినిపించుకోకపోతే ఖర్మ, నేనేం చెయ్యాలి? పైగా గుండుమీది ఏరియల్ వంకీలా క్వశ్చన్‌మార్క్ మొహమెట్టి వైయ్యీ, గియ్యీ అని అడుగుతాడు ఏవఁని సమాధానం చెప్పాలి?

చెప్పిన భావం, భాష్యం ఆయనకు అర్థమయి ఏడిస్తేగా? మధ్య నాకొచ్చిపడింది చావు. ఇలా మరో పద్దినాలుంటే నిజంగా పిచ్చెక్కేట్టుంది.

ఏం చెయ్యాల్రా రావుఁడూ? అని లంచి అవర్లో నీవు తప్ప నితఃపరంబెరుగనన్నట్టు ఉపాయాన్వేషణలో కొట్టుకుపోతూ ఉన్న శర్మ గోలెట్టేస్తున్నాడు. అర్థించాడుగా అభయహస్తమిచ్చేట్టు గాఢంగా ఓ దమ్ములాగి అయితే ఆ సీట్లోనించి మారిపోతానంటావ్! అన్నాడు.

"అందుకే గదరా ఈ కంఠశోష? ఆఫీసరుడికి చెప్పుకుందావంటే అతనూ ఈ తల గుమాస్తాల కంటే రెండాకులు ఎక్కువే చదివాడాయిరి. కారణాలు అడిగితే ఏవఁని చెప్పుకోవాలి?"

"నిజం చెప్పేసెయ్"

"ఏవఁని? ఆ నల్లపిల్ల ఎదురుగా కూర్చుని పన్చెయ్యడానికి నానా ఇబ్బందిగా ఉందనా?" "ఆఁ"

"ఏడ్చినట్టుంది. అంత మాటా పుసుక్కున అనేశానే అనుకోదాంతో ఆయనో ఛార్జ్‌షీట్ ఇచ్చేస్తే?"

"ఛార్జ్‌షీట్ ఎందుకిస్తాడు?"

"ఇడియట్లా మాట్లాడకు. నేను కోరేదాంట్లో సబబేవఁన్నా ఉందా?"

"అయితే నోర్మూసుకునూర్కో"

మహారాజని మొరెట్టుకుంటే- అన్నట్టయింది శర్మగతి. ఈ ఆఫీసర్‌కూడా షెడ్యూలు కాస్టే. "లేదు సార్! ఆ లక్ష్మి ఎదురుగా కూర్చోవడం కష్టంగా ఉందంటే కారణం అడుగుతాడు. ఆ కారణం తన దగ్గర లేదు. ఇదేదో కాంప్లెక్స్‌తో బాధపడే మనిషని తనని ఈ ఊర్నించే బదిలీచేసేస్తే ఏంగతి?

అసలు లక్ష్మి అంటే తనకెందుకంత కోపం? చూస్తే చాలు ఒంటికాలుమీద సర్రున లేస్తాడు.

ఎన్.ఆర్.నంది

ఆఫీసు పదింటికైతే ఆమె తొమ్మిదిన్నరకే ఆఫీసుకి తగలడుతుంది.

సాయంకాలం అయిదయేవరకూ కట్టేసినట్టు సీట్లోనే పడేడుస్తుంది. కర్మ కాకపోతే తను యుడిసి కావడమేమిటి? ఇలాంటి కుండపెంకు ఎదురుగా సీటు దొరుకుతుందని (దివ్య దృష్టితో) తెలిసుంటే ఆ బి.ఎ చదివుండేవాడు కాదుగదా! ఆ సుబ్బిగాడు-చంద్రుళ్ళేని ఆకాశం మాదిరి చుక్కల మొహమూ వాడున్నూ- శారద పక్కన సీటు కొట్టేశాడు. వెధవలో ఛారమ్‌లేదు, షివ్రీ లేదు. శారద గలగల నవ్వినపుడైనా నవ్వగలుగుతాడో లేదో! ఏదైనా పెట్టిపుట్టాలంటారు. ఇదే కాబోసు! ఇప్పుడప్పుడే ఓ పుష్కరం లోపున ప్రమోషన్లొచ్చే సూచన్లేవీ లేవు.



నాకు నచ్చిన కథ

పాత్ర చిత్రణ బాగా చేసిన రచయితకన్నా పాత్ర సృష్టిచేసిన రచయిత గొప్పవాడని నా నమ్మకం. సృష్టి అంటే కొత్తగా మొలిపించడం కాదు. మనుషులందరిలో ఉండే గుణాలు పరిశీలించి ప్రతివాడు భుజాలు తడుముకునేలాగానో, ప్రతివాడికీ ఎదుటివాడిలో ప్రత్యక్షమయ్యేవాడిలాగానో పాత్రల్ని సృష్టించడం. సత్యభామ కథలెందరు రాసినా ఆ పేరు తలుచుకోగానే గుర్తొచ్చేది ముక్కుతిమ్మనగారే.

ఆయన చేసిన సజీవకల్పనే ఆ పేరుప్రతిష్ఠలు

తెచ్చింది. అలాగే గౌరవ సృష్టి నక్షత్రకుడు.

ఆధునిక కాలంలో ఎందరో రచయితలు ఉన్నా గిరీశం, పార్వతీశం, గణపతి, కాంతం, అప్పారావు పాత్రల్ని సృష్టించిన రచయితలకి చరిత్రలో చెరగని చోటుంటుంది. కారెక్టర్‌గా వారి సరసన నిలబెట్టలేక పోయినా అందరిలో ఉండే ఓ గుణాన్ని బయటపెట్టే కథే ఎన్.ఆర్.నంది రాసిన 'ద్వేషం' కథ.

కొందర్నిచూస్తే జాలేస్తుంది, కొందర్ని చూస్తే అసూయపుడ్తుంది, కొందర్ని చూస్తే అసహ్యం వేస్తుంది. అన్నీ అకారణంగానే! జాలిగాని, అసూయ గాని, ద్వేషంగాని ఉండాల్సిన అవసరంలేదని ఆ తరువాత పరిచయంవల్ల తెలినా అహంవల్ల ఆ అభిప్రాయం మార్చుకోటం కుదరదు. మార్చుకున్నా నీమీద ద్వేషంలేదని చెప్పే అవకాశం దొరకదు.

నల్లపిల్ల లక్ష్మిమీద అకారణంగా ద్వేషం పెంచుకున్న శర్మకి ద్వేషం ప్రేమగా మారేసరికి లేటయిపోయింది. కథా అయిపోయింది.

ఏమాత్రం పరిచయం లేకపోయినా వ్యక్తుల మీద ఉత్తిపుణ్యానికి కొన్ని అభిప్రాయాలేర్పరుచుకొనే మానవనైజం ఈ కథలో వస్తువు.

ఇదే విషయంమీద మరికొందరు కథలు రాసినా నందిగారి కథ చాలా బావుండడం వల్లనే ఆయన రాసి పుష్కరందాటినా ఇంకా నాకుగుర్తుంది. నాటక

ఈ మధ్యలో తనకంటే ముందున్న ముప్పై నలభై మంది సీనియర్లు భూకంపంలాంటి దొచ్చిగుటుక్కు మంటేతప్ప తనకి ప్రమోషన్‌రాదు (ఇందరు ఎమ్మెల్యేలు, ఎంపీలు వున్నారు.

స్టీలు ఫ్యాక్టరీ ఆంధ్రదేశానికి రప్పించలేకపోతే పొయ్యారు-కనీసం భూకంపాలనైనా రప్పించలేరు). అందాకా ఈ తాటకి ముందు కూర్చుని ఊర్వశీ, తిలోత్తమాది అప్సరసల్ని ఊహించుకొంటూ ఎలా కాలంగడపాలో అర్థంగాక శర్మ తలబాదుకున్నాడు. కనిపించిన ప్రతివాడితో ఇదే గోల. ఏమో ఏవెధవేం ఒరగబెట్టేస్తాడో అని. కాని ఒక్కడు- ఒక్క వెధవన్నా తన బాధనర్థం చేసుకోడేం? మొన్ననో సారి ఆ సూరిగాడితో చెప్పుకుంటే-

"లక్ష్మా! ఆమెకేమోయ్! ఏనాటమీ ప్రకారం చూస్తే ఆమె శారదకంటే అందగత్తే కదా!" అని ఓ చిన్న కాంప్లిమెంట్ పారేశాడు.

"అందానికి ఆ సూరిగాడిచ్చే డెఫినిషన్ ఏవిఁటో? వెనకనుంచి చూస్తే అతను మధ్య వరూధిన్లా ఉంటుందట.కొంపదీసి ఆ వయ్యారిని ఈ వెధవ గాని లవ్ చేస్తున్నాడేమో ఖర్మ.

అయితే నన్నేం చెయ్యమంటావయ్యా? నా మానాన నన్నిలా వదిలేస్తారా మీరంతా కలిసి?" ఏడుపు ముఖంపెట్టి ఏడ్చాడు శర్మ.

రామ్మూర్తి మరోసారి గాఢంగా దమ్ములాగి "అసలా అమ్మాయంటే నీకెందుకురా అంత ఇది?" అన్నాడు.

ఆ 'అంత ఇది' ఈ వెధవ తనలా ఆ తారు డబ్బాముందు పగలంతా కూర్చునివుంటే తెలిసొచ్చేది. చూస్తే చాలు డోకొచ్చే ఆ ముఖద్యుతులు ఆ స్వరూపానికి తోడు రెండు జడలట-

రెండు జడలు ఆ జడల్లో సన్నజాజులు, సంపెంగలూ, గులాబీలు లేనట్టు బంతిపూల అలంకరణ. ఛీ! పూలని సెలెక్ట్ చేసుకోవడంలో కూడా ఆడవాళ్ళ మనస్తత్వం వ్యక్తమవుతుందిలా ఉంది.

శారద మల్లెపూలు (ప్లాస్టిక్‌వి అయితే మటుకు) పెట్టుకుంటుంది. చేతుల్లేని జాకెట్ వేసుకుంటుందని కొందరు విమర్శక శిఖామణులు విమర్శిస్తారేగాని, ఆ జాకెట్‌లో ఎంత లావణ్యమూర్తిలా ఉంటుంది మరి? ఆమె కాలిగోటికి కూడా సాటిరాని ఈ నల్ల రాయి, ఏనాటమీ ప్రకారం ఆలోచిస్తే అందాల రాశిట. ఫ్! రామ్మూర్తి సీటు మార్చే ఉపాయాలు చెప్పకుండానే ఆఫీసులోకి వచ్చేశాడు.

శర్మ సీట్లోకి రాగానే ఆ నల్లమ్మాయి అతని దగ్గరకొచ్చింది. ఏదో పరిమళం గుప్‌మంది. శారీరకమైన వికృతాలని కప్పుకునేందుకు ఆడవాళ్ళు ఎన్ని రకాల సూత్రాలని కనిపెట్టారు. కొన్ని కీటకాలు

● చిత్తశుద్ధితో చేసే పనులు సత్ఫలితాలను ఇస్తాయి.

రచయిత కావటంవల్ల బ్రెవిటీ, తెలుగు గాలి పీల్చి రాస్తున్నందువల్ల నేటివిటీ, ముక్తసరి మనిషి కావటం వల్ల సటివిటి ఈ కథలో జమపడ్డాయి.

రెండు చేతులా సంపాయించుకోటం తెలియనట్లే రెండుచేతులారా రాయటంకూడా చెయ్యని కారణాన రాసిన కాసిని కథలూ చెట్టున కోసిన మామిడిపళ్ళలా మహా రుచిగా ఉంటాయి.

అసలీ కథ నచ్చటానికి ప్రధానకారణం ఏమిటంటే 'మరో మొహంజాదారో' చదివాక ఎవడీ నందీశ్వరుడని ద్వేషం పెంచుకున్నాను.

అలాటి నాటకం ఛస్తే రాయలేనన్న విశ్వాసమే దానిక్కారణం. ఎమ్బీవిఎల్

కూడా 'ఆపోజిట్ సెక్స్'ని ఆకర్షించేందుకు ఇలాంటి సౌరభాన్నే వెదజల్లుతాయట. ఈ పిల్లది కూడా బహుశ అలాంటి పురుగుల తత్వమేనేమో!

ఇన్కమ్టాక్స్కి సంబంధించిన వివరాలు కొన్ని మీ లెడ్జర్లో ఉన్నాయి. దయచేసి ఆ ఇన్ఫరమేషన్ దీనిమీద ఎండార్స్చేసి ఇస్తారా? అంది లక్ష్మి.

చూసుకో తల్లీ కావలిస్తే అన్నట్టు సీట్లోనించి లేచి బయటకెళ్ళిపోయాడు. పదినిముషాలయాక తిరిగొచ్చాడు. సీటుదగ్గిర ఆ 'లావణ్యమూర్తి' లేదు. ధైర్యంగా వచ్చి సీట్లో కూచున్నాడు.

"ఇన్ఫర్మేషన్ దొరకలేదండీ"- జీడిగింజలా వచ్చి మళ్ళీ పట్టుకుంది. శర్మకు చిరాకేసుకొచ్చి లేచిపోయాడు పోవాలని.

"ప్లీజ్! ఈ కేస్ ఇవాళ డిస్పాచ్ చేయాలి"

"అయితే నేనేం చెయ్యాలి?" చిరాగ్గా అని "అవిగోలెడ్జర్స్-చూసుకోండి కావలిస్తే" అన్నాడు.

"కనిపించలేదండి" శపించుకుంటూ లెడ్జర్ విప్పాడు. రెండువందల నాలుగో పేజీ తీసి ఆమెకిచ్చాడు. ఆమె నిట్టూర్పు విడిచి నోట్ చేసుకొని ఎదుటి సీట్లోకి వెళ్ళిపోయింది.

"చూడండి లక్ష్మీదేవిగారూ! మీరిలా అస్తమానం డిస్టర్బ్ చెయ్యడం బావుండలేదు. మీకేమన్నా ఇన్ఫర్మేషన్ కావాల్సొస్తే- లెడ్జర్సన్నీ ఇక్కడే పడున్నాయిగా- మీరే దయచేసి చూసుకొంటే నన్ను రక్షించినవారవుతారు"

గట్టి వార్నింగే ఇచ్చాననుకున్నాడు శర్మ. ఈ దెబ్బతో తలగీర వదిలివుండొచ్చు. కానీ తలెత్తినప్పుడల్లా ఆ మేఘచ్ఛాయను తప్పించుకోకుండా ఎలా ఉండటం? ఓ గజంగుడ్డ తీసుకొచ్చి మధ్య పరదాలా కట్టేసుకుంటేనో?

ఆ అమ్మాయి గురించి జాలిపడాలనిపించదు శర్మ కెప్పుడూ. తన వీధిలో చివరింట్లో ఎప్పుడూ డిటెక్టివ్ నావెల్స్ చదువుకుంటూ కూచునే ఓ నల్లమ్మాయి. ఆ అమ్మాయిని చూస్తే ఒళ్ళు గగుర్పొడుస్తుంది ఎంతో ఇదిగా! ఆ అమ్మాయి కూడా రెండు జళ్ళే వేసుకుంటుంది.ఏకలవ్యుడు వంచిన విల్లులా వంగుతాయి వాతెరలు ఆమె నవ్వినప్పుడు.

ఎంత ఆకర్షణ వుంది ఆ అమ్మాయిలో మరి! కాని ఈ లక్ష్మితో అలా అనిపించదు సరిగదా, కనిపిస్తే చాలు వుడ్బాల్లా తన్ని బౌండ్రీ అవతలకు గిరవాటెయ్యాలన్నంత కసి పుట్టుకొస్తుంది. కొందర్ని చూస్తే చప్పున ఆప్యాయత పుట్టుకొచ్చేస్తుంది. కొందర్ని చూస్తే బలిని పాతాళంలోకి తొక్కేసినట్టు తొక్కెయాలనిపిస్తుంది-ఎందుకో మరి!

లక్ష్మిలో తనని ఏడిపించే అంశమేవిఁటో?

రంగా? మాటలా? కులమా?

ఏమో! సరిగ్గా అతనికే తెలీదు.ఏ క్షణంలో ఆమె కనిపించినా ఏడిపించడమే శర్మ ధ్యేయం. ఒకనాడు లంచ్ అవర్లో రాజు వచ్చాడు.

"అలంకార్లో మంచి పిక్చరొచ్చింది వస్తావేవిఁట్రా శర్మా!" అన్నాడు.

"ఏం పిక్చరేం?"

"ఏదో హాలీవుడ్ సరుకు. హీరోయిన్ నీగ్రో నవలామణి"

"అయితే నేను రాలేను"

"ఏవోఁ?"

"ఆ నలుపున్నేను భరించలేను"

"అదేం? రోజూ చూస్తున్న నలుపే నీకు అలవాటు కాలేదంటే-" అన్నాడు రాజు లక్ష్మివేపు ఓరగా చూస్తూ.

"అందుకే ఛస్తున్నా. ఈ పీడా ఎప్పుడు వదిలిపోతుందని" అన్నాడు శర్మ. ఈసారి లక్ష్మివేపు సూటిగా చూస్తూనే!

● గతాన్ని మరచిపోయి, ప్రస్తుతం మనముందున్న కర్తవ్యాన్ని గురించే ఆలోచించాలి.

లక్ష్మి తలొంచుకుంది. ఏడుస్తుందిలా ఉంది. ఏడవాలి ఇంకా ఏడవాలి. అలా ఏడుస్తేనే తన కసి తీరుతుంది. మరో రోజున శర్మ ఆఫీసుకి ఓ దిన పత్రిక తీసుకొచ్చాడు. అతని చుట్టూ బృందం చేరింది. విశేషాలేవి(ట్రోయ్ అంటూ! "మిస్ ఆఫ్రికా బొమ్మ పడింది. చూడండహో!" అని పేపరెత్తి నీగ్రో అమ్మాయి ఫోటో చూపిస్తూ దండోరా వేశాడు.

"అప్సరసలా ఉందోయ్"మూర్తి కాంప్లిమెంట్.

"మన ఆఫీసు అప్సరసలకన్నా అందంగానే ఉంది" అని శర్మ విరగబడి నవ్వాడు.అందరి దృష్టి లక్ష్మిమీదే పడింది. వాళ్ళంతా లేవిడీ చేసేట్టు నవ్వుతూ వుంటే శర్మ హృదయంలో వీణమోగింది. వాళ్లంతా కలసి తననే ఏడిపిస్తున్నారని తెలిసినా లక్ష్మి పల్లెత్తుమాటనేది కాదు ఆఫీసర్‌కి రిపోర్టుచేస్తే బావుండేది అనిపించేది శర్మకు.

ఆ అమ్మాయి రంగు సింహస్వప్నమైంది శర్మకు. ఇంట్లో మసిబొగ్గుల్ని చూస్తే చాలు పొయ్యిలో వేసేసేవాడు. ఓసారి నల్లపెన్‌రాయనని మారాంచేస్తే హుస్సేన్‌సాగర్‌లో విసిరేశాడు. ఆఖరికి ఆల్బంమీద నల్లని రెక్సిన్ క్లాత్ ఉందని దాని ముఖమే చూడటం మానేశాడు. సాయంకాలం ఇంటికి వెళ్ళేసరికి పని మనిషినల్లచీరతో ప్రత్యక్షమైంది.ఆమెను ఛడామడా తిట్టేసి సినిమాకి వెళ్లిపోయాడు.

హాల్లో మహాఇబ్బందిగా కూర్చున్నాడు-తెరమీద స్లైడ్‌లో ఛార్మినార్ కాల్చమని బతిమాలుతున్న అమ్మాయి నల్లబ్లౌజ్ వేసుకుంది.

హెర్క్యులెస్ సైకిల్ తొక్కే పడతి నల్ల కుర్తా తొడుక్కుంది. లైట్లురాక హాలంతా నల్లగా చీకటి మయమైపోయింది. నలుపు భరించరానిదైంది. గట్టిగా అరవాలనుకున్నాడు.

వెనకనించి వీణానాదంలాంటి కంఠస్వరం విని పించింది. వెనక్కితిరగాలనుకుంటూనే తిరగలేక పోయాడు. వీణానాదం తెలుగులోని అచ్చుల్నీ, హల్లుల్నీ, ద్విత్వాక్షరాలనీ, మధ్యే మధ్యే గుణత్రిక సంధుల్నీ వల్లించేస్తోంది. ఆ మంజుల స్వరంతో పాటు మరో మగగొంతు.

ఊపిరి బిగబట్టి ఆ స్వరాలని విన్నాడు.

మైగాడ్! ఈ జీడిగింజ ఇక్కడక్కూడా తయా రైందా! స్వర్గానికి పోయినా సవతిపోరు తప్పనట్టు ఈ తద్దినం ఇక్కడా తగలాలా ఆ పక్కన కూర్చున్న పురుష పుంగవుడెవడబ్బా!

ఆ తారుడబ్బాకు పెళ్లయినట్టులేదు. మరీ మగ రాయుడెవడు? ప్రేమికుడా? అన్నా, తమ్ముడూ అయితే అంత కేరింతలు కొడుతుందా? ఇంటర్వ ల్‌లో లైట్లు వెలగ్గానే తనను చూసి షాక్ తింటుందా? లేక వాడితో చెప్పి తన్నిస్తుందేమో!

తన్నుల తలంపు రాగానే చప్పున లేచిపోయాడు భయం వేసి. అంతలో ఇంటర్వల్ అయి గప్పున లైట్లు వెలిగాయి. వెనకనించి ఓ పరిచిత కంఠం "ఓరే! శర్మా!" అని పిలిచింది.

వెనక్కి చూశాడు నరసుగాడు. జీడిగింజ వీడికి ఎలా తగిలిందబ్బా! అని చుట్టూ చూశాడు. ఎక్కడా కనిపించలేదు. నరసుగాడూ, ఒక పారిజాతం మాత్రం ఉన్నారు. నరసు పారిజాతాన్ని పరిచయం చేశాడు తన శ్రీమతి అంటూ.

ఆవిడ నమస్తే అంది. కళ్ళుమూసుకున్నాడు శర్మ. ఆమె ఏదో అంటోంది. కంఠస్వరం అచ్చు ఆ నల్లపిల్లదే! కాని రూపం దేవకన్య.

ఎంత పొరపడ్డాడు. ఒకే రకం కంఠస్వరాన్ని రెండు విభిన్న స్వరూపాలకు ప్రసాదించిన సృష్టి శక్తిని కసిదీరా తిట్టుకున్నాడు. ఇంటర్వల్ తర్వాత శర్మ నరసు పక్కనే కూర్చున్నాడు. ఆమె గలగలా మాట్లాడుతోంది చీకట్లో. ఆ మాటలు లక్ష్మి మాట్లా డుతున్నట్టే భ్రమ.

మర్నాడు ఆఫీసుకి వెళ్లీవెళ్లగానే లక్ష్మివేపు చిత్రంగా చూశాడు. నరసు భార్యలా వూహించు కున్నాడు. తెల్లని వాయిల్ చీర భుజాలమీద నిం డుగా కప్పుకుని రాసుకుంటోంది లక్ష్మి. ఆ పైట

● తప్పుపట్టడం తేలిక, తప్పు సరిదిద్దుకోవటం కష్టం.

పనికిరావని పారేయొద్దు

కొన్ని ఆహారపదార్థాల్లో మనకు తెలియని మేలు దాగుంటుంది. కొన్ని మనం అనుకున్నంత చెడ్డవీ కాకపోవచ్చు. అటువంటివాటిపై కొంతైనా అవగాహన ఉంటే ఉపయోగం.

చాలామందికి యాపిల్‌పై చెక్కుతీసేసి తినే అలవాటు ఉంటుంది. కాని, ఎముకలకు ఉపయుక్తమైన 'బోరాన్' ఈ తొక్కలో లభిస్తుంది.

క్యాన్సర్‌ను నిరోధించే యాపిల్‌లో ఉండే ఐదు గ్రాముల పీచులో మూడింటరెండొంతులు ఈ తొక్కలోనే ఉంటుంది. బంగాళాదుంపలపై చర్మం అంటే గొంతు పట్టేస్తుంది. కాని ఈ పీల్‌లో నాలుగు మిల్లీగ్రాముల ఐరన్, 20 మిల్లీగ్రాముల క్యాల్షియం ఉంటాయి.

దుంప ఫ్లెష్‌తో పోల్చితే ఐరన్ ఒక శాతంకంటే తక్కువ. 10 మిల్లీగ్రాముల క్యాల్షియం వ్యత్యాసం ఉంది. క్యాలీఫ్లవర్‌లోని తెల్లనిపువ్వు వాడి ఆకులు, కాడల్ని పారేస్తారు.

కాని కాడలనిండా పీచువుంటుంది. ఆకుల్లో బీటాకెరోటిన్ అధికం. గుడ్డులోని పచ్చసొనతింటే కొవ్వు పెరుగుతుందన్న భయం అనేకమందికి ఉంటుంది. కాని ముందుగా పేర్కొన్నట్లు గుడ్డు పచ్చసొనలో కొలెస్ట్రాల్ 274 మిల్లీగ్రాములు కాక 213 మిల్లీగ్రాములే ఉంటుంది. కొవ్వు ఉండేది ఐదు గ్రాములు. కాబట్టి రోజుకో గుడ్డు తింటే ముప్పులేదు. ◆



లోపల ఎర్రని బ్లౌజ్. దాన్నెందుకామె పైటతో పూర్తిగా కప్పుకున్నట్టు?

ఎప్పుడూ ఆమె ముదురు ఎరుపు జాకెట్‌నే ఎందుకు వాడుతుంది? ఆ రంగుని ఎందుకు తెల్లని చీరతో కప్పుకోవడం? హృదయంలోని భావాలని కప్పేసుకోవాలనే తాపత్రయమా? భావాలు ఉంటే గింటే అవి ఎలాంటివైయుంటాయి?

ఆ బ్లౌజు రంగులా కర్కశత్వాన్ని సూచించే కరకు భావాలా? అసలు ఆ భావాల స్వరూపం ఏవిటో? ఆ వాళంతా లక్ష్మి శర్మతో మాట్లాడలేదు. అప్పుడప్పుడు కళ్లెత్తి జాలిగాచూసేది. ఏమన్నా ఇన్ఫర్మేషన్ కావాలేమో పాపం? నిన్నిచ్చిన వార్నింగ్‌తో భయపడి అడగలేకపోతోందేమో? లంచ్ అవర్లో బయటకు వెళ్లి తిరిగొచ్చాక లక్ష్మి శర్మ సీటుదగ్గర నిలబడి లెడ్జర్ తీసుకొని ఏదో రాసుకుంటోంది.

'పాపం' అని జాలిపడ్డాడు శర్మ!

తనంటే లక్ష్మి నిజంగా భయపడి పోతోంది. దూరంగానిలబడి ఆమెవేపు సాలోచనగా చూశాడు. ముఖం ఎంత అమాయకంగా వుంది. సిల్హౌటీలో మాంచి ఫొటోజెనిక్ ఫేస్ లక్ష్మిది. ముక్కు కొనదేరి అందంగానే ఉంటుంది.

మెల్లగా వచ్చాడు. ఆమె తప్పుచేసిందాన్లా లెడ్జర్ మూసేసి తన సీట్లోకి వెళ్లికూర్చుంది.

"ఏం కావాలో చెప్పు లక్ష్మి చేస్తాను అనాలనుకున్నాడు. మాటలు పెగల్లేదు".

ఆలోచిస్తూ కూలబడ్డాడు పెదవుల మధ్య పెన్ తిప్పుకుంటూ తలొంచుకుని ఫైల్స్ చూసుకుంటున్న లక్ష్మిని పరిశీలిస్తూ వుండిపోయాడు. కడుపులో ఎవరో చెయ్యిపెట్టి దేవినట్టు జాలీ, బాధా కలిగాయి శర్మకు. ఈ లక్ష్మి తనని వ్యక్తిగతంగా ఎప్పుడూ బాధించలేదు. కనీసం దురుసుగానన్నా మాట్లాడదు. ఆఫీసులో కూడా ముభావంగానే వుంటుంది.

రాంబాబుగాడూ, రాజుగాడూ నల్లరంగుమీద

● మౌనానికి మహత్తర శక్తి ఉంది. మంచి ఆలోచనలు, నిర్ణయాలు మౌనం నుంచే పుడతాయి.

వ్యాఖ్యానాలు చేసినప్పుడు తలొంచుకొని తనపనేదో తాను చేసుకొంటుందిగాని తలెత్తి వాళ్ళను కనీసం కళ్ళతోనైనా వారించదు.

నైలాన్ చీరమీద ఓసారి రాజుగాడు విట్టువిసిరేస్తే శారద ఖబడ్దార్ అంటూ జాతీయభాషలో అంతర్జాతీయ భాషలో వంద వార్నింగ్‌లిచ్చింది. కాని ఈ లక్ష్మి ఆ మాటలు తననే అంటున్నట్టు గ్రహించి కూడా పల్లెత్తు మాటనదెందుచేతనో!

పాపం లక్ష్మి ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్‌తో బాధ పడుతున్నట్టుంది.శారదా, నీలవేణి, వైదేహి ఆమెతో అంటీ అంటనట్టు తిరుగుతారు. ఇక ఎదురుగా ఉన్న తను-ఆమెమీద మాట విసరని క్షణంలేదు.

చిన్నతనంలో తను తనింట్లో వుండే వారా లబ్బాయిని ఇలానే మాటలతో తూట్లుపొడిచేసేవాడు. స్కూల్లో జగ్గారావుని రాళ్ళుచ్చుకొని కొట్టి ఏడిపించేవాడు. బలహీనుల్ని హింసించాలనే తత్వం తన నరనరాల్లోనూ జీర్ణించుకుపోయిందా? ఆ హింసను లక్ష్మి ఎందుకు భరిస్తున్నట్టు? ఆమె మౌనంవల్లే తనింకా రెచ్చిపోతున్నాడా?

ఆ మర్నాడుకూడా లక్ష్మి ఇన్ఫర్మేషన్‌కోసం శర్మ దగ్గరకు రాలేదు. ఆ మర్నాడే కాదు వారం దినాలూ తను సీట్లో లేనపుడు జూచి లెడ్జర్ తీసుకొని తనకి కావల్సింది ఎండార్స్ చేసుకునేది. శర్మ మనస్సులో ఓ మూలగా గోల ప్రారంభమైంది.

లక్ష్మి ఈ మౌనంతోనే తనమీద ప్రతీకారంతీసుకుంటుందేమోనని తనతో మాట్లాడకుండా తన పని తాను చేసుకొంటూ ఏవిటి సాధిద్దామని?

"కోపమా లక్ష్మీ?" అని లక్షసార్లు అడగాలనుకొన్నాడు. అనలేక తనపని మానేసి ఆమె వేపు ఓర చూపు చూస్తూ ఉండిపోయేవాడు.

ఒకసారైనా చూస్తుందేమో తలెత్తి చిరునవ్వు ఒకటి నవ్వుదామనుకునేవాడు. కాని ఆమె రెండు మూడుసార్లు కనురెప్పలెత్తిందేగాని లిప్తపాటులో తలదించేసుకునేది. అది బాధో, నిర్లక్ష్యమో శర్మకు బోధపళ్ళేదు. ఒకనాడు లంచ్ అవర్లో శర్మ కాఫీ పుచ్చుకొని తొందరగా సీట్లోకి వచ్చేశాడు. లక్ష్మి టేబుల్‌మీద తలవాల్చుకుని కళ్ళుమూసుకుని ఉంది. మెల్లగా చెప్పుల చప్పుడు చేశాడు.

ఆమె ఉలిక్కిపడి తలెత్తి చూసింది. కళ్ళనుంచి కన్నీళ్ళు కారుతున్నాయి. చప్పున రుమాలుతో అద్దుకుని తలతిప్పుకుంది.

ఆశ్చర్యంగా ఆమెవేపు చూశాడు శర్మ.పలకరించాలనిపించింది. ఆమె ఏడుపుకు కారణంతెలుసుకోవాలనిపించింది.నవ్వుకున్నాడు.ఏ మనిషినైతే కని పిస్తేచాలు కసురుకుంటూ అనుక్షణం అసహ్యించుకునేవాడో అదే మనిషి బాధను తెలుసుకోవాలని ఆత్రుతపడటం వింతే అనిపించింది శర్మకు.

"కాంటీన్‌కి వెళ్ళలేదాండి?"

పిలుపుతో ఉలిక్కిపడ్డ లక్ష్మి ఆశ్చర్యాన్నంతనీ ఆ ఒక్కక్షణంలోనే గుండ్రంగా కళ్ళలోనే తిప్పేసి తలొంచుకుని అడ్డుగా తిప్పింది.

"ఒంట్లో బాగులేదా?"

తలతిప్పింది.మళ్ళీ మాటలు కరువయ్యాయి.

ఎర్రని బ్లౌజువేపు చూస్తూ కూర్చున్నాడు.

నిష్కారణంగా తనామెను ఏడిపిస్తాడు. ఎంత మనోదార్ఢ్యంగల మనిషైతే మటుకు ఆ అపహాస్యాలకు ఒకనాడుగాకపోతే ఒకనాడైనా ఏడవదా? మరీ భరించరాని సమయంవచ్చినప్పుడు ఆమె బరస్టయి ఆఫీసరుకు రిపోర్టు చేస్తే? అక్కడితో తన బతుక్కాస్తా రెడ్‌మార్క్‌తో ముక్కలై ఊరుకుంటుంది.

ఆమె షెడ్యూల్డుకాస్టు ఆఫీసర్‌షెడ్యూల్డు కాస్టు-కులాభిమానం ఆయనచూపించకమానాడా? "మీరు లెడ్జర్‌లో ఇన్ఫర్మేషన్ అడగడం మానేశారు"

గుటక వేసి ఊరుకుంది.

"కోపమొచ్చిందా?"

తల అడ్డంగా తిప్పింది.

"కోపం ఎప్పుడూ రాదా మీకు?"

దీనంగా చూసింది. అంకుశంలాంటి అమాయ

● ఉత్తమమైన స్వభావం అత్యున్నతమైన ఆభరణం.

లిఫ్ట్ లేకుంటే కిందకు దిగాల్సిందే



మెట్లెక్కి దిగుతుంటే మామూలుగా శరీరానికి మంచి వ్యాయామమే అవుతుందికాని, అరవయ్యో పడిలో పడినవారికిమాత్రం ఇబ్బందులు తప్పవు. లిఫ్ట్ సౌకర్యం లేకుండా అపార్ట్‌మెంట్లలో నివసించే అరవై సంవత్సరాలు,ఆపైన వయస్సు గలవారిలో 85 శాతం మంది ఎముకలు, జాయింట్ సంబంధిత సమస్యలు ఎదుర్కొంటున్నట్లు ఓ అధ్యయన సంస్థ పేర్కొంది.

గ్రౌండ్, ఫస్ట్‌ఫ్లోర్లు కాకుండా మిగతా అంతస్తులలోని నిర్వాసితులపై అధ్యయనాలు నిర్వహించారు. వయస్సు, అపార్ట్‌మెంట్‌లో ఏ అంతస్తులో నివసిస్తారు, వృత్తి, ఎన్నిసార్లు ఎక్కి దిగుతారు. వైద్యచరిత్ర తదితర అనేక అంశాల్ని పరిగణనలోకి తీసుకున్నారు.

స్త్రీలా, పురుషులా, ఆర్థిక, మానసిక స్థితిగతులు తదితర అంశాల ఆధారంగా అంచనాలు రూపొందించారు. విస్తృతపరిశోధనల అనంతరం పైఅంతస్తుల్లో ఉండేవారికి.ఎముకలు, జాయింట్ సమస్యలు ఎక్కువగా ఉన్నట్లు తేలింది.

కాబట్టి వయస్సులో ఓ పరిధిదాటాక పై అంతస్తులలో నివసించేవారు లిఫ్ట్ కనుక లేకపోతే కిందికిదిగి రావాల్సిందే. ◆

కపు చూపులు. మెల్లగా ధైర్యంచేసి క్షణంపోయాక అన్నాడు "మిమ్మల్ని అస్తమానం ఏడిపిస్తూవుంటాను ఎందుకలా ఏడిపించాలనిపిస్తోందో నాకు తెలీదు"

ఆమె పెదవులు ఒణికాయి.మనస్సులో గాయం రేగినట్టు కళ్ళు దీనంగా మూసుకుంది.

శర్మ సందేహానికి ఆమె దగ్గర్నుంచి రెండ్రోజులకు గాని సమాధానం రాలేదు.

"బహుశ నన్ను చూస్తే అందరికీ అలానే అనిపిస్తుందేమో!" అంది.

గతుక్కుమన్న శర్మ ఓ క్షణంతర్వాత భయంగా- ఏమో? అన్నాడు.

నా దురదృష్టం అంది లక్ష్మి క్లుప్తంగా

మీరేం దురదృష్టం చేసుకున్నారు?"

"దేవుడికి తెలియాలి"

ఆమె సన్నగా కన్నీళ్లు తిప్పుకున్నట్టు గ్రహించాడు. ఆ మర్నాడూ, ఆ తర్వాత ఆమె తనకు తానై శర్మతో ఏమీ మాట్లాడలేదు. లెడ్జర్స్ కూడా అతను లేనప్పుడే తీసుకుని కావలసింది రాసుకునేది. శర్మకు మనస్సు చివుక్కుమంది.

కావాలని అతను మాట్లాడించినా ఆమె ఎందుకంత పెడసరంగా ఉందో అర్థంకాలేదు. తను అసహ్యించుకునే దినాల్లో ఆమె ఏదో వంకతో అస్తమానం ప్రాణం తీసేది.

ఇప్పుడు మాట్లాడుతుంటే బెట్టు చూపిస్తోంది. ఎందుకో ఆ బెట్టు? దేనిని చూసుకుని? చదువా? ఎలాగో పియూసి గట్టెక్కింది.సంస్కారమా- తండ్రి చెప్పులుకుట్టుకునేవాడు. అందమా-వర్ణించనలవి కానిది. ఎందుకో మరి మిడిసిపాటు?

ఆడవాళ్ళకు తరతరాలుగా రక్తంలో జీర్ణించుకుపోయిన అహం, అతిశయం ఈవిడా ప్రదర్శిస్తున్నట్లుంది. ఆడది ఎంత వికృతంగా ఉన్నా మగాడు మానిని చుట్టూ ప్రదక్షిణం చేస్తాడనే చిన్నచూపు వల్లనేకదా ఈవిడ ఇంత నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. మళ్ళా శర్మ సీటు మారిపోవాలనే బాధ హెచ్చవ

● పూలపరిమళం గాలివాటుకే వెళుతుంది. కానీ మనిషి మంచితనం ప్రతిదిక్కుకూ ప్రసరిస్తుంది.

జొచ్చింది. ఈసారి ఏమైతే అయిందని ఆఫీసర్ దగ్గరకు వెళ్ళాడు. "నన్ను సీట్లోంచి మార్చెయ్యండి సార్" అని సవినయంగా ఏడ్చాడు.

కారణం అడిగాడు ఆఫీసర్.

శర్మ తెగించి అబద్ధం చెప్పాడు. ఆమె నైతిక ప్రవర్తన మంచిది కాదన్నాడు. సీటుకింద అస్త మానం తన కాళ్లని నొక్కుతుందన్నాడు.

రాసుకుని తిరుగుతుందన్నాడు. ఒకసారి తనింటికే రమ్మనమని పిలిచిందని అబద్ధంచెప్పాడు. మనసులోని ద్వేషాన్ని, అసూయనీ, ఆగ్రహాన్ని ముద్దచేసి ఆమెను పుంశ్చలిగా చిత్రించి చెప్పాడు. అన్నీ చెప్పాక ఎందుకో బావురుమని ఏడ్చాడు. ఆ ఏడుపుతో అతని కసి అంతా వికృతరూపంలో బయటకు వచ్చేసింది.

ఆఫీసర్ అంతా విని అర్థంకాక అతనివేపు చాలా సేపు ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయాడు. అతని చూపు శర్మలో అనుమానాన్నీ, భయాన్నీకలిగించింది. ఆఫీసర్ కాళ్లమీద పడిపోయాడు. అతను తననే శిక్షిస్తాడని భయంవల్లనో లేక మనస్సులోని వైక ల్యాన్ని ఈ అస్త్రంతోసాధిద్దామనో శర్మకేతెలీదు.

ఆఫీసరు వారించాడు.

"ఏవిటిది-లేవండి" అని తానే లేచిపోయి "మీరా మెకు 'భయపడి' ఆ సీటు మార్చుకోవాలనుకుంటు న్నారా? అయితే ఆమెను అక్కడినుంచి మార్చేసినా మీకు ఇబ్బందిలేదుగా?" అన్నాడు.

"ఎలాగైనా సరే సార్"

"అయితే మీరు వెళ్ళండి. ఆమె పొద్దుటే ఉద్యో గానికి రాజీనామా ఇచ్చింది. రేపటినుంచి రాదు"

శర్మ నెత్తిన పిడుగుపడ్డట్టు అచేతనుడైపోయాడు. ప్రపంచమంతా ఒక్కసారిగా చీకటైపోయింది. పిచ్చి పిచ్చిగా అడుగులేసుకుంటూ సీట్లోకి వచ్చి కూర్చు న్నాడు. ఎంతసేపటికీ తేరుకోలేకపోయాడు.

తలొంచుకుని రాసుకుంటున్న లక్ష్మిని గుచ్చి గుచ్చి చూశాడు. ఎందుకు రాజీనామా చేసినట్టు? తనకీ, ఆఫీసుకాకులకి భయపడా? అలా అయితే రిపోర్ట్ ఇచ్చి కండిషనల్ రిజిగ్నేషన్ ఇవ్వొచ్చుగా?

"మీ... మీరు రిజైన్ చేస్తున్నారా లక్ష్మీ?" అన్నాడు మెల్లగా. ఆమె తలెత్తి చూసి, తలూపి, తలదించు కుంది.

"ఎందుకు?"

సమాధానం లేదు.

"నా మూలానా?"

లక్ష్మి తలెత్తి వింతగా చూసింది.

"నావల్ల తప్పేమన్నా వుంటే క్షమించండి" అని లేచి షార్ట్ లీవ్ తీసుకుని ఇంటికి వెళ్ళిపోయాడు.

లక్ష్మి మర్నాటినించి ఆఫీసుకు రావడం మానే సింది. శర్మకు మొదటిరోజున ఏదో చిరాకు అనిపిం చింది. మనస్సు దేనిమీదికీ లగ్నం చెయ్యలేక పోయాడు. అస్తమానం తలెత్తి ఎదుటి సీటువేపు పిచ్చిగాచూసేవాడు. తన కసికి, కోపానికి, ద్వేషానికి, అసూయకూ అలుసుగా కనిపించే మౌనప్రతిమ ఇప్పుడు లేదక్కడ.

ఆమెను ఏడిపించి తన హింసాతత్వాన్ని చల్లార్చు కునేవాడు. కానీ ఇప్పుడామె లేకపోవడంవల్ల తన లోని క్రౌర్యం శాంతించే అవకాశంలేక మరింత రెచ్చిపోయి కనిపించిన ప్రతివారిమీద కట్లు తెంచు కొని పడేది. ఒకనాడు తమ్ముణ్ణి చావబాదాడు.

మరోనాడు కూర బాగులేదని తల్లిని కసిరాడు. జీతంనాడు ఇంట్లో డబ్బులు ఇవ్వలేదు. ఆఫీసులో పనిచేసేవాడు కాదు. ఫైల్స్ గుట్టలయాయి.

ఆఫీసర్‌చేత తిట్లు తిన్నాడు. గుండెల్లో పగిలే అగ్నిపర్వతాలని అదుపులో పెట్టుకోవడం తనకి చేతకాదనే నిశ్చయానికి వచ్చేశాడు. ఖాళీగా కని పించే లక్ష్మి కుర్చీ అతన్ని రెచ్చగొట్టి మరింత ఏడి పించింది. చెప్పుకోలేని బాధ.

చల్లారని ఆవేశం. వెర్రివాడిలా చూపులు. సరిగ్గా గుడ్డలు వేసుకునేవాడు కాదు. గడ్డం చేసుకునేవాడు

● మంచిపని ప్రతిదీ మొదట కష్టమనిపిస్తుంది.



యువత ఎప్పుడూ హై స్పిరిట్స్‌తో ఉండి, చాలాసార్లు దిగజారే మూడ్‌ను ఇట్టే సరిచేసుకోగల రని, ఎదిగేకొద్దీ అనుకూల దృక్పథంలో తగ్గుదల మొదలౌతుందని సాధారణంగా భావిస్తుంటాం. కాని ఈ అంచనాలు వాస్తవం కాదు.

పెద్దవారు సంతోషపూరిత భావోద్రేకాలు ఎక్కువగా ప్రదర్శిస్తారని, యువతతో పోల్చితే ప్రతికూల మూడ్‌ను త్వరితంగా వదుల్చుకోగల రని నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ పరిశోధకులు తెలిపారు. పెద్దవాళ్ళలో పరిణతి ఇందుకు కారణ మని, యువతలో ఇది లోపిస్తుందని భావించ కూడదు. పెద్దవాళ్ళు సంతోషంగా ఉండడంకోసం తమ పరిసరాల్లో అనుకూల పరిస్థితులపై ఫోకస్ చేసి ఉంటారు. పెద్దగా ప్రాముఖ్యం లేని, అవసరం లేదనుకున్న ప్రతికూల పరిస్థితులవైపు వారి దృష్టిని మరల్చరు.

అంటే ప్రతికూలతనుంచి అనుకూల విష యాలవైపు తమ దృష్టిని మరల్చగల ఫ్లెక్సిబిలిటీ కలిగి వుంటారన్నమాట. ఇదంతా వయస్సుతో నిమిత్తంలేని ఆశావాదం అనుకోవాలి.

మనం, మన ఆలోచనలు, దృష్టిని జరిగే నచ్చని విషయాలనుంచి మరల్చి, అన్నివేళలా పాజిటివ్ అవుట్ లుక్ కలిగివుంటే కనుక ప్రతికూల భావాల విషవలయంలో చిక్కుకోకుండా మనల్ని మనం కాపాడుకోగలం. ◆

కాదు. లంచ్ అవర్లో కాంటీన్‌కి వెళ్ళకుండా సీట్లో కూర్చుని కసిదీరా ఏడ్చుకునేవాడు. ఎదుటి సీట్లో వున్నంతకాలం లక్ష్మి మౌనంగానే తనని ఏడిపిం చింది. రాజీనామా ఇచ్చి మాయమైపోయి కూడా ఏడిపిస్తూనే ఉంది. ఆమెను చూడాలి.

ఒక్కసారి మాట్లాడాలి. ఆమె తనని క్షమించిం దంటే చాలు తను కోలుకుంటాడు. ఆమె ఎక్క డుందో ఈ మహానగరంలో కనుక్కోవడమెలా? ఎవర్ని అడగాలనుకున్నా ఇంకా తనని విడిచిపెట్టని అహం,సిగ్గుమధ్యకొచ్చి విరగబడినవ్వుతున్నాయి.

ఒకనాడు ఊరంతా తిరిగాడు. సినిమాలదగ్గర నిలబడ్డాడు. నల్లగా కనిపించే ప్రతి స్త్రీని ఆత్రంగా చూశాడు. రెండు మూడు దినాలు ఇంటికి రాకుండా హైదరాబాద్,సికింద్రాబాద్ నగరాల వీధుల్ని,వాడల్ని శల్యపరీక్షలు చేసిచేసి లాభంలేక టేంక్‌బండ్‌మీద కూర్చున్నాడు. ఓడిపోయాననుకున్నాడు.

ఒక అడుగు ముందుకు వస్తే నీట్లో పడిపోవచ్చు. ఈతరాదు కాబట్టి మూడునిమిషాల్లో చచ్చిపోతాడు. కాని చావడమెందుకు? లక్ష్మి కనిపించనంతలో ఎందుకు తనకి చావాలనే ధ్యాస కలిగింది? తానెవరు? లక్ష్మి ఎవరు? ఏదో పెళ్ళి ఊరేగింపు వస్తోంది.చప్పున వెనక్కి చూశాడు. లక్ష్మికిగాని పెళ్లి అవుతోందా? గుండె ఆగినంతపనయింది.

ఊరేగింపు దగ్గరపడింది.

● చిన్న ఖర్చులే అని దుబారా చేయకండి, చిల్లి చిన్నదే అయినా పెద్ద ఓడ కూడా మునిగిపోతుంది.

కార్లో వరుడు కూర్చునివున్నాడు. మెడలో పూల దండలు. ముందు బ్యాండ్ వాయిద్యాలు. పది మంది మనుషులు, పేదవాడి పెళ్లిలా వుంది.

పెళ్లికొడుకుని చూశాడు. చాలా వికృతంగా వున్నాడు. గ్యాస్‌లైట్ల వెలుతుర్లో అతని కళ్లు, పళ్లు మాత్రమే కనిపిస్తున్నాయి. వెనకాల నడిచే మనుషులు దాదాపు అంతా నల్లగానే వున్నారు.

నలుపు ఇప్పుడతనికి ద్వేషకారణం కాలేదు. కాని వరుని రంగే అతనికి కోపాన్ని కలిగించింది. ఇలాంటి వికృతాకారుడు లక్ష్మికి భర్తా! నో! వీల్లేదు. చప్పున లేచాడు. ఎవరో నవ్వినట్టు అయింది.

లక్ష్మి ఎవర్ని చేసుకుంటే తనకేం? ఆ వరుడు ఎంత వికారంగా వుంటే అంతగా తనకి లక్ష్మిమీద వుండే ద్వేషం. కోపాలు తీరుతాయిగా!

వీల్లేదు. అలా కాకూడదు. లక్ష్మిని తను ద్వేషిస్తున్నాడా? ప్రేమిస్తున్నాడా?

తెలీదు. తెలుసు. లక్ష్మిని తను ప్రేమిస్తున్నాడు అందుకే ద్వేషిస్తున్నాడు. ద్వేషంనించి ప్రేమ పుట్టలేదు. ప్రేమలోనించే ద్వేషం పుట్టింది.

ఎనాటమీ ప్రకారం చూస్తే లక్ష్మి అవయవాల పొందిక ఏ అప్సరసకుంటుంది? సిల్హౌటీలో లక్ష్మి శరీరం ఎంత ఆకర్షణీయంగా వుంటుంది? కాని ఆ రంగు ద్వేష కారణమయింది.

తను మనస్సులో ఊహించుకునే లక్ష్మికి, కనిపించే లక్ష్మికి ఎక్కడా సమన్వయం కుదరదు. తన ఊహల లక్ష్మిలా ఈ లక్ష్మికనిపించదనే, ఈలక్ష్మిని తను ద్వేషించేది. కాని ఇప్పుడు రెండింటికీ భేదం లేదు. తనకు లక్ష్మి కావాలి.

అంతలో ఆఫీసులో పనిచేసే ప్యూన్ రంగయ్య ఎదురుపడ్డాడు. వాడే పలకరించాడు.

"మూడు రోజులనించి ఆఫీసుకి రావడంలేదే సార్?" అన్నాడు.

వాడికి సమాధానం చెప్పలేదు.

"రంగయ్యా! మన ఆఫీసులో పనిచేసే లక్ష్మిగారి ఇల్లెక్కడ-నీకు తెలుసా?" అని అడిగాడు.

"ఇల్లయితే తెలీదుగానీ చిక్కడ్‌పల్లిలో ఎక్కడో ఉండాలి సార్" అన్నాడు రంగయ్య.

శర్మ పరిగెత్తాడు టాక్సీలు దొరకలేదు. బస్సుల్లో స్థలం లేదు. రిక్షా కట్టించుకుని బయలుదేరాడు.

ఎక్కడని వెతకడం? రాత్రి పన్నెండింటివరకూ వెతుకుతూనే వున్నాడు. ఇక లాభంలేక హిమాయత్ నగర్ రోడ్డు పట్టాడు.

కల్లుపాకల అవతల, ఇళ్లదగ్గర ఏదో పెళ్లి జరుగుతోంది. పెళ్లివాయిద్యాలు విని ఆగిపోయాడు. అప్రయత్నంగా కన్నీళ్లు కారాయి.

"లక్ష్మి ఇహ నిన్నీ జన్మలో మళ్లీ కలుసుకోలేనేమో!" అని ఒకచోట కూలబడిపోయాడు. అలా ఎంతసేపు కూర్చున్నాడో తెలీదు. ఆకాశంలో చంద్రుడు లేడు. నక్షత్రాలు ఒయ్యారంగా ఒళ్లు విరుచుకుంటున్నాయి. కళ్లు విప్పాడు.ఎవరో తాగి మైకంలో ఏదో మాట్లాడుకుంటూపోతున్నారు.

"ఎదవకి ఓ సదువా. అందవా ఏవుందనిరా ఆణ్ణి పెళ్లాడుతోంది అన్నాడొకడు"

"ఇంకా నయం ఆడన్నా ఒప్పుకున్నాడు. ఆఫీసులో అది బాపనోడితో వుండేదంట.

నెలకూడా తప్పింది. అందుకే అచ్చిగాడు దానికంత అర్జంటుగా పెళ్లిజేస్తున్నాడు"

మిగిలినవాళ్లు నవ్వులు మొదలెట్టారు.

శర్మ చప్పున లేచాడు. బహుశ లక్ష్మి గురించే వాళ్లు మాట్లాడుకుంటున్నారేమో! చప్పున పెళ్లి పందిరి దగ్గరకు పరుగెత్తాడు.

పందిరిలో పెళ్లయిపోయింది.నాలుగైదు రిక్షాలు వున్నాయి. రిక్షాలన్నీ ఆత్రంగా చూశాడు. చివరి రిక్షాలో పెళ్ళికొడుకు కూర్చుని వున్నాడు.కొందరాడవాళ్ళు పెళ్ళికూతుర్ని తీసుకొచ్చారు. రిక్షా ఎక్కించారు. పెళ్ళికూతురు వరుని పక్కన కూర్చుంది.

శర్మ కళ్ళు బైర్లుకమ్మాయి.వెనక్కి అడుగులేసుకుంటూ వెళ్ళి ఒకరాటను ఢీకొని కిందపడిపోయాడు. లక్ష్మి అని నిశ్శబ్దంగా ఏడ్చాడు.

అరుంధతీ నక్షత్రం మేఘాలచాటుకి వెళ్ళిపోయింది.రిక్షాలు కదిలిపోయాయి మెల్లగా. ◇◇

చరిత్రను చెప్పే చంద్రకేతు ఘడ్

పశ్చిమబెంగాల్‌లోని ఉత్తర 24 పరగణాల జిల్లాలో ఈ ప్రాచీన సంస్థానం ఉంది. 1956 నుంచి ఓ దశాబ్దకాలంపాటు కోల్‌కతా యూనివర్శిటీ జరిపిన విస్తృత తవ్వకాల్లో మౌర్యుల కాలం ముందునుంచి పళరాజులదాకా ఆరు కాలాల ప్రాచీననాగరికతకు ఆధారాలు వెలికివచ్చాయి.

పశ్చిమబెంగాల్ హెరిటేజ్ కమిషన్,రాష్ట్ర ఆర్కియాలజీ విభాగం, ఆర్కిలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాల ఆధ్వర్యంలో పునరుద్ధరణ మొదలైంది. చంద్రకేతు ఘడ్ బెంగాల్, తూర్పు భారతాల ప్రాచీన చరిత్రకు దర్పణం పడుతుంది.

ఈ ప్రదేశాన్ని హెరిటేజ్ జోన్‌గా రాష్ట్రప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. హెరిటేజ్ కమిషన్ చంద్రకేతు ఘడ్ సర్టిఫికేషన్‌కోసం ప్రయత్నించింది. మట్టి ఇళ్ళు, పెంకురూఫ్‌లు, కళాఖండాలు, మ్యూజియం తదితరాలతో హెరిటేజ్ విలేజ్‌ను జాగ్రత్తగా మలచాల్సి వుంటుంది.

కళాఖండాలు భారీగా కనిపించిన ప్రాంతానికి దగ్గరగా, 24 పరగణాల జిల్లాకు దక్షిణంగా తిల్పి, ధోశ గ్రామాల్లో పురాతత్వవిభాగం తవ్వకాలు చేస్తోంది. ఇవి పియాలి నదికి సమీపంలో ఉండి, విద్యాధరినదికి అనుసంధానమై చంద్రకేతు ఘడ్‌కు సమీపంగా ఉంటాయి. ముందుగా ఇక్కడ దొరికిన కళాఖండాల్ని చోరులు అంతర్జాతీయ వేలగాళ్ళకు అమ్మాలని ప్రయత్నించారు.

మొదట్లో శతాబ్దంక్రితం బ్రిటీష్‌వారు గుర్తించినప్పుడు శిథిలాలు దాదాపు వంద ఎకరాల్లో విస్తరించి ఉన్నట్లు అంచనా వేశారు. మానవ నివాసాలు ఏళ్ళతరబడి ఉన్నందున తవ్వకాలు అసాధ్యం అయ్యాయి. ఇప్పుడు గుర్తించిన ప్రదేశం ఎకరంలో మూడోవంతు కూడా లేకపోవచ్చు.

చంద్రకేతు ఘడ్ తొలి ప్రదర్శనలు సెటిల్‌మెంట్ చుట్టూ మట్టిప్రాకారాల నడుమ ఉంటాయి. దీనిలో ఖనయ హైరర్ ఢిపి శిథిలాలు, స్థానిక ప్రైవేట్ కలెక్టర్ల మ్యూజియంలు ఉంటాయి.

ఆయా ప్రదేశాలవద్ద స్కెచి చారిత్రాత్మక సమాచారం మాత్రం లభిస్తుంది. చంద్రకేతు ఘడ్ ప్రాకారాల వెంట సన్నని దారిపై నడుస్తూ వెళ్తే మరో కలెక్టర్ (కళాఖండాల సేకరణ చేసిన వ్యక్తి) అసాద్-అజ్ జమాన్ మ్యూజియం కనపడుతుంది. 1500కు పైగా కలెక్షన్లు ఇతనివద్ద ఉన్నాయి.

ఇది కోల్‌కతాకు 50 కిలోమీటర్ల దూరంలో, రెండుగంటల ప్రయాణంలో ఉంది. ◇◇

108 సంఖ్యా ప్రాముఖ్యం

"ఏకమ్ సత్ విప్రా బహుధా వదంతి"
"సత్యం ఒక్కటే", జ్ఞానులు దానిని బహువిధాలుగా చెప్తారు. ఈ నిజాన్నే భారతీయ విజ్ఞానం సర్వదా ప్రతిధ్వనిస్తూ వుంది.

అసలు సత్యమేదనగా, సృష్టి భగవంతుని ఆవిష్కరణ, సృష్టి భగవంతునిలోనే ఉంది. ఆ సృష్టి చివరకు భగవంతునిలోనే లీనమవుతుంది.

స్వర్గం, పాలపుంత, గ్రహాలు, నక్షత్రాలు, మానవులు, ఇతర జీవజాలమూ ఆ భగవంతునిచే సృష్టించబడింది.ఆయనలోనే ఉన్నది, చివరకు ఆ దివ్యసూత్రంలోనే లీనమవుతుంది. ఈ విశ్వంలో ఒక లయ, ఒక కూర్పు, ఒక సమన్వయం ఉంది. ఈ విషయం ప్రాచీన భారతీయులకు తెలుసు.

సంభ్రమమైన 108 సంఖ్య ప్రాచీన భారతీయులకు చాలా పవిత్రమైనది. అన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలలోనూ 108 అనే సంఖ్యకు వారు చాలా ప్రాముఖ్యతనిచ్చారు.

దేవుని/దేవతను మంత్రపుష్పాలతో పూజిస్తూ- 108 పవిత్రపూసలు గల జపమాలను గణిస్తూ జపం చేసేవారు. 108 సంఖ్యయొక్క ప్రాముఖ్యతను భారతదేశంలో హిందువులే కాదు, బౌద్ధులు,జైనులు, సిక్కులు,టోయిస్ట్‌వంటివారందరూ గుర్తించారు.

తనలోని దైవత్వాన్ని గ్రహించటానికి ఆత్మ 108 మెట్లు దాటాలని వీరి నమ్మకం. ఈ సంఖ్య భగవంతునికీ, భక్తునికీ మధ్య అనుసంధానకారకమని భారతీయుల నమ్మకం. వేదఋషులు ఖగోళ శాస్త్రానికి సంబంధించిన గణనలో-

⁘ భూమికి, చంద్రునికి మధ్య దూరం, చంద్రుని వ్యాసానికి 108 రెట్లు ఉందని.
⁘ భూమికి, సూర్యునికి మధ్య దూరం, సూర్యుని వ్యాసానికి 108 రెట్లు ఉందని.
⁘ సూర్యునియొక్క వ్యాసం భూమి వ్యాసానికి 108 రెట్లు అనీ నిర్ధారించారు.

ఈ వేదగణన ఆధునిక సాంకేతిక విశ్వగణనలో

లభించిన భూమికీ, చంద్రునికీ, భూమికీ సూర్యునికీ ఉన్న దూరంతో దాదాపు సరిపోయింది.

ఆయుర్వేదం మనిషి శరీరంలో 108 మర్మస్థానాలను గుర్తించింది.

108 అనే మర్మాల గొలుసులో 107 గ్రంథులు శరీరంలో ఉంటాయని ఆయుర్వేదం చెబుతుంది. ఇవి జీవచైతన్యం మానవశరీరంలో మిళితమయ్యే కేంద్రస్థానాలు. ఈ మర్మస్థానాల ద్వారా ప్రాణశక్తి జీవిని చైతన్యపరుస్తుంది.

భారతీయ యోధునికి పైన చెప్పబడిన 'మర్మస్థానాలు' తెలిసేవుంటాయి. అతడు యుద్ధం చేసే సమయంలో శత్రువును ఆ 'మర్మస్థానాలపై' దాడి చేసి సంహరిస్తాడు. అలాగే పవిత్రమైన శ్రీచక్ర యంత్రంలో 54 స్త్రీ, 54 పురుష అంతర్భాగాలు ఉంటాయి. వీటి మొత్తం 108.

జ్యోతిష్యశాస్త్రం మానవప్రవృత్తికి సంబంధించి బ్రహ్మాండాన్ని 27 చంద్రసూచికలైన నక్షత్రాలతో, ఒక్కో నక్షత్రం తిరిగి 4 పాదాలతో ఉంటుందని గుర్తించింది. ఇది 27 × 4 = 108 పాదాలయింది. అవే 108 ప్రాథమిక మానవ ప్రవృత్తులు.

శిశుజనన సమయంలో చంద్రుడు ఏ పాదంలో ఉంటాడో, దాని ప్రభావం ఆ వ్యక్తి జీవితంలో, వృత్తిలో,ఆనందంలో,కుటుంబంలో, చివరకు మోక్ష మార్గాలలోనూ ప్రతిఫలిస్తుంది.

⁘ భారతీయ జ్యోతిష్యంలో 12 రాశులు, 9 గ్రహాలు ఉంటాయి. 12 × 9 = 108.

⁘ మానవుడు సగటున ప్రతి రోజూ 21,600 సార్లు శ్వాస తీస్తాడు. అందు 10,800 సూర్యాంశ, 10,800 చంద్రాంశ... 108ని 100తో గణిస్తే... 10,800 వస్తుంది. దీన్ని 2తో గుణిస్తే... 21,600 వస్తుంది అని తంత్రశాస్త్రం చెబుతుంది.

⁘ భరతుడు - తన "నాట్యశాస్త్రం"లో చేతులు, కాళ్ళూ కలిపి చేసే నాట్యభంగిమల మొత్తంసంఖ్యను 108గా గుర్తించాడు. వీనిని 'కరణ'ములంటారు.

⁘ 18 పురాణాలు, 108 ఉపనిషత్తులు, భగవద్గీతలో 18 అధ్యాయాలు, ఎన్నో ప్రముఖ సంస్కృత గ్రంథాలలో 108 శ్లోకాలు ఉంటాయి. హిందువులు నిత్యమూ పూజచేసే విధానంలో అష్టోత్తర పూజ, అష్టోత్తర శతనామావళి వంటివి ఉంటాయి. చాలామంది సిద్ధులు తమ తమ పేర్లకు ముందు 108 గానీ, 1008 గానీ ఉంచుకునే సాంప్రదాయం ఉంది.

⁘ సంస్కృతభాషలో 54 అక్షరాలు ఉంటాయి. వీటికి శివ, శక్తి తత్వాలైన స్త్రీ, పురుష రూపాలు ఉంటాయి. అనగా 54 × 2 = 108.

⁘ భారతీయ కాలగణన ప్రకారం బ్రహ్మకు ఒక రోజు అంటే నాలుగు యుగాలు కలిసిన 43,20,000 సంవత్సరాలు. ఇది 108 అనే సంఖ్యతో భాగింపబడుతుంది.

⁘ సంఖ్యాశాస్త్రంలో 108ని 1 + 0 + 8 = 9గా రాస్తారు. ఒక సంఖ్యను 9తో గుణించి, వచ్చిన సంఖ్యను కూడగా తిరిగి తొమ్మిది వస్తుంది.

⁘ గణితంలో 108 అనగా $1 \times 2^2 \times 3^3 = 108$ వస్తుంది. ఇంతటి వైశిష్ట్యం గల 108 సంఖ్య ఎంతో దివ్యమైనది. అది సృష్టికర్తకు, సృష్టికి అనుసంధానం కలిగించేది.

అందుకే మన ఋషులు, పురాణాలు, వేదాలు, భారతీయ సంస్కృతి 108 సంఖ్యకు ఇంతటి పవిత్రతను, ప్రాముఖ్యాన్ని ఇస్తున్నది.

Courtesy: రామకృష్ణ మఠం, హైదరాబాద్



కట్నంగా కాఫీ రాజధాని

లేలేత సూర్యకిరణాలు, చిగురాకుల మీద తెలి మంచు బిందువులు, ఎత్తైన పర్వతశ్రేణులు, లోతైన లోయలు, పరుగులెత్తే వాగులు, వంకలు, ఎగిసిపడే జలపాతాలు, పర్వతసానువులలోనిహరిత వనాలు, అరవిరిసిన ప్రకృతి, పూలసౌరభాలు-

పక్షుల పలకరింపులు, కొండా కోనలలో మెలికలు తిరిగిన దారులు, అలసటను దూరంచేస్తూ అడుగడుగునా కనువిందుచేసే ప్రకృతి అందాలు, గుండెలనిండా స్వచ్ఛమైన గాలి పీల్చుకునే భాగ్యం, ప్రకృతిలోని సహజ సౌందర్యాలను, సహజ సంగీత మాధుర్యాలను తనివితీరా ఆస్వాదించాలని, పర్యాటక ప్రాధాన్యతగల ప్రాంతాలలోని వందలయేళ్ళ నాటి శిల్పకళా వైభవాలను కనులారా వీక్షించాలని, ఆనందించాలని, అపురూప అనుభవాన్ని సొంతం చేసుకోవాలని, మధురమైన జ్ఞాపకంగా మిగుల్చుకోవాలని ఎవరైనా కోరుకోవడం సహజం.

ప్రకృతిలో కొద్దిసేపైనా గడపడం అంటే ప్రకృతి సీమలలో సంచరించడం అంటే మనతో మనం, మనలో మనం అనుసంధానం కావడమే... ప్రకృతి కొత్తచూపునిస్తుంది. కొత్తశక్తిని నింపుతుంది.

పుణ్యతీర్థాలు, పర్యాటకప్రాంతాలు, విహార యాత్రలు మనస్సును తాజాగా వుంచుతాయి.

విరామంతో ఒత్తిడి మాయం

ఆధునిక జీవితం సవాళ్ళమయం. ఒత్తిడితో జీవితాలు భారం, నిస్సారమవుతున్నాయి.

పరుగులు తీయిస్తున్న 'జీవనసరళి'లో ఒక్కక్షణం పరుగుఆపి, మనసు సాంత్వన పొందడానికి వున్న అవకాశాల గురించి ఆలోచిస్తే, ఒత్తిడి నివారణకు మార్గం దొరుకుతుంది.

మానసిక ప్రశాంతత కోసం, ఒత్తిడి నుంచి బయటపడడం కోసం ఏదో పుణ్యక్షేత్రానికో, హిల్ స్టేషన్‌కో, టూరిస్ట్‌స్పాట్‌కో,సాగరతీరాలకో, సుందర వనాలకో వెళ్ళమని వైద్యులు సూచిస్తున్నారు. దాని వలన ఒత్తిడి దూరమవుతుంది.

తనువు, మనస్సు పునరుత్తేజితం అవుతాయంటున్నారు. వారం అంతా ఒకటే పరుగు. ఆది వారం కాస్త విశ్రాంతి అదీ పేరుకే. ఎందుకంటే వారం నుంచి చేయాల్సిన పనులన్నీ పేరుకుపోయి వుంటాయి మరి. తెల్లవారితే మనం మన ఉరుకులు పరుగులు మామూలే.

అందరూ అలాగే ఉన్నారని కాదు దాదాపు నూటికి తొంభైమంది జీవనశైలి అలానే వుంది.

జీవితంలో ఎదురయ్యే సవాళ్ళను ఎదుర్కొనే, ఒత్తిడిని తట్టుకునే శక్తిని ఎప్పటికప్పుడు పునఃస్సంపన్నం చేసుకోవాలి. అంటే ఏడాదికో, ఆర్నెల్లకో పిల్లల వేసవి సెలవులకో ఒక మారు ప్రకృతి ఒడిలో సాంత్వనపొందాలి.

అలసిన తనువు, మనస్సు రీఫ్రెష్‌కావాలి.రీఛార్జి కావాలి. మనల్ని మనం మరిచిపోయి ప్రకృతి అందాలను ఆస్వాదించాలి, అనుభవించాలి.ఆ అనుభూతిని గుండెనిండా నింపుకోవాలి.

ఈ అనుభవం కోసం ప్రకృతిలోని అందాలని వెతుక్కుంటూ బయలుదేరాలి.

కాఫీప్రియులకు ప్రత్యేకం

భారతదేశ మహానగరాల మధ్య వాటికి అతిదగ్గరలో వున్న పర్యాటక విశ్రమప్రాంతాల విషయంలో పోటీఏర్పడితే బెంగళూరు ఖచ్చితంగా ఆ జాబితాలో అగ్రభాగాన నిలుస్తుంది.

నైరుతి దిశలోని కూర్గ్‌నుంచి ఉత్తరదిశలో హంపి వరకు వన్యప్రాణి సమూహ ప్రాంతాలను గణనలోనికి తీసుకుంటే, 52 వారాలకు చాలినన్ని వారాంతపు విశ్రమప్రాంతాలు,పర్యాటకస్థలాలున్నాయి.

మీరు కాఫీప్రియులు అయినా కాకపోయినా భారత దేశ కాఫీరాజధాని అయిన చిక్‌మగుళూరును బెంగ ళూరుకుదగ్గరలో తప్పకుండా చూడవలసిన పర్యాటకప్రాంతాల జాబితాలో భాగం.

చిక్‌మగుళూర్‌ను చాలా ట్రావెల్ గైడ్స్‌లో ఒక హిల్ స్టేషన్‌గా పేర్కొనడం జరిగింది. ఏదైనా ఓ ప్రాంతాన్ని చూడాలన్న కాంక్ష వున్నప్పుడు ఎత్తు పల్లాలు, ఇరుకైన వంపులు తిరిగిన మన్నటిదారులు, నిలువుగా పైకి ఎక్కాల్సిన కొండప్రాంతాలలో

Courtesy . GO NOW

ప్రయాణం భారమైనా, ఈ ఇబ్బందులు ఏవీ అడ్డంకికావు. అప్పుడప్పుడు బెంగళూరు ట్రాఫిక్ కొంచెం ఇబ్బందిపెట్టవచ్చు. ఈ విషయంలో చాలా మందికి గతానుభవాలు వుండవచ్చు.

మరీవేగంగా వెళ్ళలేని సందర్భాలు వుంటాయి. అయితే ఎలాంటి ఇబ్బందిలేని ఐదుగంటల కారు ప్రయాణంలో పదిహేను వందలమంది కాఫీపంట దార్లు వున్న జిల్లాకు చేరతాం, బలమైనగాలి మేనిని తాకుతూ స్వాగతం పలుకుతుంది.

చలిగింతలు లేని చక్కటిగాలికి మనకు ఆహ్లాదంగా అనిపిస్తుంది.

విలాసాల విడుదులు

చుట్టూ ఎత్తయిన కొండలు, లోతైన లోయలు, కొండచరియలలో, దట్టమైన తోటల్లో నుంచి కమ్మని కాఫీ పరిమళాలు, కాఫీతోటల మధ్య సేద దీరేందుకు విశ్రాంతి విడుదులు, చిక్‌మగుళూరులో పర్యాటకులకు సౌకర్యంగా వుండే ప్రశాంత ప్రదేశం సెరాయ్. వైభవోపేతమైన రిట్రీట్‌కు అత్యుత్తమ చిరునామా అదే.

డెబ్బై ఎకరాల ఆవరణగల కాఫీఎస్టేట్‌లో వుంది. స్వాగతలాంఛనాలలో భాగంగా ఒక గ్లాస్ కోల్డ్ కాఫీతో గొంతు తడుపుకుంటాం.

ఈ రిసార్ట్‌లోని 29 విల్లాలలో ఏదో ఒకదానివైపు వడివడిగా కదులుతాం. ఈ విల్లాలలో ప్రతిదానిలో తమదైనశైలిలో ఓ ప్రైవేట్ పూల్ వుంది.

(పిల్లలకు నచ్చే విల్లాలలో ఐతే నులివెచ్చని నీరుగల పూల్ వుంది) నాజూకైన అందాలకు ప్రాధాన్యత ఇస్తూ లోసొగసులను ఎంతో మనోహరంగా అలంకరించారు సహజమైన వెలుతురు సమృద్ధిగా వుంటుంది.

విల్లాలచుట్టూ పచ్చనిచెట్లతో పరుచుకున్న పచ్చదనం.ప్రబలమైన కాఫీ బ్రౌన్‌వర్ణంతో సరితూగే రీతిలో రంగులమేళనం. వైవిధ్యం వున్న మనోహరం. పెద్ద ఈతకొలను, లాంజ్ బార్, విశాలమైన రెస్టారెంట్ ఈ హాలులో ప్రత్యేక ఆకర్షణలు.

చిక్‌మగుళూరును పరిశోధించి అధ్యయనం చేయడానికి వెళ్ళడానికి మినహా, ఎవ్వరైనా ఈ విల్లాలోని ఈ సౌకర్యాలు వదులుకుంటారా అంటే సందేహమే. తాజ్‌గేట్‌వే హోటల్‌లో మకాంచేయడం గురించికూడా ఆలోచించవచ్చు.

అత్యంత ప్రశాంతమైన పరిసరాలు, మనోజ్ఞ

మైన ప్రకృతి దృశ్యాలు, ధ్వనులతో ఈ హోటల్ కూడా మనోహరంగానే వుంటుంది.

ఈ హోటల్‌లో 10 గదులు, 19 కాటేజీలు వున్నాయి. కొలనియల్ శిల్పకళతో ఎంతో సుందరంగా వుంటాయి. ఆశ్చర్యకరమైన పర్వతశ్రేణులు వాటి దృశ్యాలు మంత్రముగ్ధం చేస్తాయి.

బాబా బుదాన్ అనే సిద్ధపురుషుడు చిక్‌మగుళూరు చరిత్రపటంలో చోటు చేసుకోవడానికి అనాలోచితంగా కారకుడయ్యాడు.

నాల్గుశతాబ్దాల క్రితం ఆయన యెమెన్ దేశం సందర్శించినప్పుడు కాఫీలోనిరుచిని ఆ పరిమళాన్ని తెలుసుకోవడం జరిగింది. కాఫీ రుచిచూసి ఆయన ఏడు కాఫీ గింజలను రహస్యంగా మనదేశానికి తీసుకువచ్చినట్టు ఒక గాథ ప్రచారంలో వుంది.

చిన్నకూతురుకు కట్నంగా

చిక్‌మగుళూరు సమీపంలోని చంద్రద్రోణ పర్వతంపై వున్న తన పర్వత నివాసంచుట్టూ ఈ కాఫీ గింజలునాటారు. ఈ మొక్క వేళ్ళూనుకుంది దరిమిలా ఈ ప్రాంతం బాబా బుదాన్‌గిరిగా పేరొందింది. 150 ఏళ్ళక్రితం బ్రిటీష్‌వారు కాఫీని వాణిజ్య పంటగా సాగుచేయడం మొదలుపెట్టారు.

భారతదేశ కాఫీ గాథ నిజంగా మొదలయింది. ఇక అక్కడ నుంచి వెనక్కి తిరిగి చూసుకోవలసిన పరిస్థితిలేదు. చిక్‌మగుళూరును చిన్నకూతురు పట్నంగా అభివర్ణించడం మొదలైనప్పటి నుంచి వెనక్కితిరిగిచూసే ప్రశ్న ఉత్పన్నంకాలేదు.

స్థానికనేత రుక్మాంగద చిన్నకూతురుకు కట్న కానుకల కింద ఈ ఊరుని ఇచ్చినట్లు ఇక్కడి ప్రజలు ప్రగాఢంగా నమ్ముతుంటారు.

పసిపాపకన్నా మిన్నగా

ఉదయంపూట ఒక కప్పు టీకి మీరు నిద్రలేచినట్టయితే, కాఫీ ఎస్టేట్‌కి మీరు విధిగా వెళ్ళాల్సిందే. సెరాయ్ సరిహద్దులు విడిచి వెళ్ళడానికి మీకు మనస్కరించకపోతే, రిసార్ట్ లోపలవున్న కాఫీ ఎస్టేట్‌లో మీరు గైడెడ్ టూర్ చేయవచ్చు.

కాఫీ గింజనుంచి కాఫీకప్పు వరకు సాగే క్లిష్టమైన, అద్భుతమైన ప్రస్థానంగురించి తెలుసుకోవాలంటే మీరు సాహసించి బయటకు రావడం మంచిది.

చిక్‌మగుళూరుకు చెందిన అరబికా కాఫీగింజలు ప్రపంచప్రసిద్ధమైనవి. రోబస్టా మరోప్రధానమైన రకం కాఫీగింజ.

చిక్‌మగుళూరు ప్రపంచఖ్యాతిని తెచ్చిపెట్టిన అరబికా రకం కాఫీమొక్కలు నీడ వున్న కొండచరియలలో ఏటవాలు పర్వత సానువులలో చక్కగా పెరుగుతాయి. పసిపాపకన్నా ఎక్కువగా వీటికి సంరక్షణ పోషణ అవసరం.

వీటిని చాలా జాగ్రత్తగా పెంచాలి. నేల బాగా పొడిగా ఉండాలి. కొంచెం ఆమ్లగుణాలు కలిగి వుండాలి. ఖనిజాలు సమృద్ధిగా ఉండాలి.

కలుపు మొక్కలు, తీగలు, లతలపై ఒక కన్నేసి వుంచాలి. అయితే వాటిని పూర్తిగా తొలగించకూడదు. అత్యంత ప్రధానమైన అంశం ఏదంటే కాఫీ తోటలకు చురుక్కుమనిపించే సూర్యకాంతి నుంచి ఆచ్ఛాదన అవసరం.

సాధారణంగా ఈ ప్రాంతంలో కాఫీతోటలను అత్యంత ఉన్నతంగా పెరిగే సిల్వర్ ఓక్ వృక్షాల పత్రజాలం కింద పెంచడం జరుగుతుంది.

చిన్నిపువ్వు... చిక్కటి కాఫీగా

మొదట పువ్వులు పూస్తాయి. అవి క్రమంగా కాఫీకాయలుగా మారతాయి. ఇవి పండ్లుగా పక్వానికిరావడానికి ఎనిమిదినుంచి పదినెలలు పడుతుంది. తర్వాత పంటకోతకు వస్తుంది.

సంక్లిష్టమైన ప్రక్రియలో కాఫీపండ్లు గోధుమ రంగుగల పరిమళభరితమైన కాఫీగింజలుగా మారతాయి. అప్పుడు వాటిని వేయించడానికి వీలవుతుంది. ఈ ప్రక్రియలో గింజలను వర్గీకరిస్తారు. కడుగుతారు. తేమను తగ్గిస్తారు.

తీవ్రమైన వేపుడుప్రక్రియలో కాఫీగింజలు 180° నుంచి 230° సెల్సియస్ డిగ్రీలమధ్య వేడిచేస్తారు. ఈ సమయంలో వీటిరంగు ఆకుపచ్చనుంచి పసుపు రంగుకి, చివరగా గోధుమవర్ణానికి మారుతుంది.

అవి గ్రైండింగ్‌కు బ్రూయింక్ సిద్ధం అవుతాయి.

ఈ ప్రక్రియ విషయంలో మరింత స్పష్టత కావాలంటే, చిక్‌మగుళూరు కాఫీ మ్యూజియంలో ఒక ఉదయం గడపండి.

కనువిందుచేసే అందాలు

చిక్‌మగుళూరులో కేవలం కాఫీతోటలే కాదు చుట్టుపక్కల ఎన్నో సందర్శనీయస్థలాలువున్నాయి. చిక్‌మగుళూరుకు అతిదగ్గరలో వున్న బేలూరు, హాలేబీడులో అపురూప శిల్పకళకు ఆనవాళ్ళుగా నిలిచిన చారిత్రక దేవాలయాల నుంచి కర్ణాటకలోని అత్యంత ఎత్తైన పర్వతప్రాంతం ముల్ల యానగిరినుంచి వీక్షించే ఎన్నో ఆశ్చర్యకరమైన దృశ్యాల వరకు ఎన్నో విహార యాత్రా ప్రదేశాలు.



పర్యాటక కేంద్రాలు భారతదేశపు అత్యంత చారిత్రకమైన ప్లాంటర్స్ క్లబ్‌లలో ఒకటైన కడూరు క్లబ్‌ను కూడా సందర్శించండి.

ముఖ్యంగా మీరు సెలవులు గడపడానికి వచ్చి వుంటే ఈ పట్టణంలో ఒకపూట వున్నా ఖర్చుబాగానే అవుతుంది. సెరాయ్‌కి చెందిన వైభవోపేతమైన, విలాసవంతమైన 'ఓమా స్పా'లో కొన్ని పునరుత్తేజిత చికిత్సలున్నాయి.పనిలోగడ్డుగా అనిపించే రాబోయే వారానికి తగ్గట్టుగా మీలో మళ్ళీ శక్తినింపడానికి తోడ్పడతాయి. సిగ్నెచర్ కాఫీ స్క్రబ్‌కు మించింది లేదు. అది చర్మాన్ని మృదువుగా చేస్తుంది.

పునఃశ్శక్తి మంతం చేస్తుంది. కాఫీ పరిమళం మిమ్మల్ని మంత్రముగ్ధుల్ని చేస్తుంది.

రుచుల జాడ వేరు...

ఈ ప్రాంతంలోని అపూర్వమైన, అద్వితీయమైన మాలెనాడు వంటకాలలోని అద్భుతాలను మీరు ఆస్వాదించవచ్చు. మాలెనాడు అంటే పర్వత శ్రేణు లున్న నేల అని అంటారు చిక్‌మగుళూరు చుట్టు పక్కలవున్న సకలేశపుర, ముదిగెరె ప్రాంతాలవరకు పర్వతశ్రేణులు విస్తరించి వున్నాయి.

మాలెనాడు వంటకాలలో ఉపయోగించే దినుసు లన్నీ పశ్చిమ కనుమలలోని దట్టమైన వనాలలో పెరుగుతాయి. వెదురుచిగుర్లు, పచ్చిపనసకాయలు, కోల్ కస్సియా ఆకులు ఈ వంటకాలలో విరివిగా వాడతారు. ఈ రుచులలో పరిమళాలలో కూర్గ్, మంగుళూరు ప్రభావ ఛాయలు కనిపిస్తాయి.

మాలెనాడు అక్కిరోటి (బియ్యపుపిండితో పుల్కాలు) పీతలపచ్చడి, కోజి (చికెన్), సారూవంటి మాలెనాడు ప్రత్యేకవంటకాలు స్థానిక రెస్టారెంట్స్ లోను లేదా స్పెషల్ మెనూగా తాజ్‌గేట్‌వే, సెరాయ్‌లలో దొరుకుతాయి.

సందర్శనీయాలు

కాఫీ ఎస్టేట్ సందర్శన : కాఫీ ఎస్టేట్ లోపల ట్రెక్కింగ్‌కులేదా కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ సందర్శనకు మీ హోటల్ ఏర్పాట్లుచేస్తుంది.

గోల్ఫ్ క్లబ్ : చిక్‌మగుళూరు గోల్ఫ్ క్లబ్ గోల్ఫ్ కోర్సు డిజైనర్ ఫిల్ ర్యాన్ మానసపుత్రిక. 9 హోల్స్ కోర్సు. దూరంగావున్న పర్వతాల అందమైన దృశ్యా లనుచూసే అవకాశం కల్పిస్తుంది. ఇందులో అన్ని హంగులుగల గదులు, ఫ్లష్‌క్లబ్‌కేస్ వున్నాయి.

శిల్పకళకు ఆనవాళ్ళు... బేలూరు హాలేబీడు : మనోహరమైన శిల్పసోయగాలు...అణువణువునా తొణికిసలాడే సౌందర్యం ఆలయకుడ్యాలపై అచ్చె రువుకలిగించే రకరకాల భంగిమలు, సుమనోహ రంగా చెక్కిన వైనాలు... బేలూరు, హాలేబీడులోని చారిత్రక ఆలయాలు.

బేలూరులోని చెన్నకేశవాలయం హాలేబీడులోని హోయసలేశ్వర ఆలయాలలో శిల్పసౌందర్యాలతో అద్వితీయం. ఈ ఆలయానికి దగ్గర్లో వున్న పురా వస్తు ప్రదర్శనశాలలో విగ్రహాలు, శిల్పాల అవశే షాలు ఇక్కడ భద్రపరిచారు. ఈ ప్రాంతంలో

అనేక జైనమందిరాలు కూడా వున్నాయి.హోయసల శిల్పకళా వైభవానికి అద్దంపట్టే ఈ చారిత్రక దేవాలయాలు బెంగళూరు నుంచి చిక్‌మగుళూరుకు వెళ్ళే దారిలో వున్నాయి.



ఆహ్లాదకర ఆటవిడుపు

అభయారణ్యాలు : ఇక్కడికి 40 కిలోమీటర్ల దూరంలో భద్ర అభయారణ్యం వుంది, వన్య ప్రాణులను చూడడానికి. వైల్డ్ లైఫ్‌ట్రెక్స్, జంగిల్ సఫారీలు ఆనందించవచ్చు.

సుందర ప్రకృతి దృశ్యాలు : బాబా బుదాన్ గిరిశ్రేణి (35 కి.మీ) ముల్లయానగిరి శిఖరాన్ని దర్శించవచ్చు.

మీరు బహిరంగ ప్రదేశాల్లో ట్రెక్కింగ్ చేయాలన్న సరదా వున్నవారయితే డిమాండింగ్ ట్రెక్స్‌లో ఏదో ఒకదాన్ని ఎంచుకోండి లేదా వెనుకసీట్‌లో కూర్చుని డ్రైవ్‌చేయండి. మీ కారునుంచి అద్భుత దృశ్యాలు వీక్షించండి.

ప్రకృతి అందాలకు నెలవు కెమ్మనగుండి : ప్రకృతిని ఆస్వాదించడం ఎంతో మనోజ్ఞంగా వుంటుంది. ఈ పర్వతశ్రేణిని బాబా బుదాన్ కొండలుగా వ్యవహరిస్తారు. చారిత్రకకాలంలో కెమ్మనగుండి మైసూర్ మహరాజ్ కృష్ణరాజ్ ఒడయార్‌కు వేసవి విడిది. చిక్‌మగుళూరుకి సరిగా 60 కి.మీ దూరంలో ఈ హిల్ స్టేషన్ వుంది.

ఇక్కడి ప్రకృతి ఎంతో శోభాయమానంగా మరెంతో ప్రశాంతంగా ఉంటుంది.

ఆగుంచి...సూర్యాస్తమయం అద్భుతం : ప్రకృతి సౌందర్యాలకు పట్టుగొమ్మ ఆగుంచిగ్రామం. అనేక ఔషధ వృక్షజాలంతోపాటు కొండలు, కొలనులు, జలపాతాలతో నిండిన అటవీప్రాంతం ఆగుంచి. ఇక్కడ వర్షపాతం ఎక్కువ.

అందుకే దీనిని దక్షిణాది చిరపుంజిగా అభివర్ణిస్తారు. ఆగుంచిలో సూర్యాస్తమయ దృశ్యం చూసేందుకు ఎంతో మనోహరంగా వుంటుంది.

చిక్‌మగుళూరు నుంచి 35 కిలోమీటర్లదూరంలో వున్న ఆగుంచి కర్ణాటకలో చూడదగ్గ పర్యాటక ప్రాంతాలలో ఎంతో అందమైనది. దేశంలోకెల్లా ఎత్తయిన జలపాతంగా పేరుగాంచిన మంచికల్ జలపాతాలు ఆగుంచిలో వున్నాయి.

ప్రకృతిలో అనుసంధానం

జీవితం గొప్పవరం. దాన్ని అనుభవించలేక పోవడం జీవితంలోని మధురానుభూతుల్ని మన సారా ఆస్వాదించలేకపోవడం విచారకరం, చేతకానితనం పర్యవసానమే ఈ విచారం.

ప్రశాంతత, మనశ్శాంతి, సాంత్వన ఇవేవీ వ్యాపారసరుకులు కాదు మాల్స్‌లోకొనడానికి. సేద దీరడానికి ప్రకృతినిమించిన చోటు ఏదీలేదు.

ప్రకృతిని వదిలి రిలాక్స్ కావాలనుకుంటే అది ఖరీదైన కార్పొరేట్ వ్యవహారమని గుర్తుంచుకోవాలి. ప్రకృతి అందాలు, శిల్ప సౌందర్యాలు, ఆధ్యాత్మిక చింతనలు, కాఫీపరిమళాలు ఎవరినైనా మంత్రముగ్ధంచేస్తాయి. ప్రతి ఒక్కరూ ఒక్కసారైనా ఈ ప్రాంతాల్లో పర్యటించాలి.

అశ్విన్ రాజగోపాలన్

దయ

ప్రజాపతి ఒకప్పుడు తీవ్రధ్యానంలో ఉన్నారు. ఆయన సంతానమైన దేవతలు, మానవులు, దానవులు ధ్యానం పూర్తిచేసి తమకు ఆయన ఎప్పుడు ఉపదేశం ఇస్తారా అని ఆత్రుతతో నిరీక్షిస్తున్నారు. ఆయన కళ్ళు తెరిచారు. తమ సంతానాన్ని చూశారు.

వారి ఉద్దేశాన్ని గ్రహించి, ఉపదేశం ఇవ్వాలనుకున్నారు. తమ సంతానంమీదున్న అభిమానంతో వారికి ఒకే ఒక అక్షరాన్ని ఉపదేశించితే, భావాన్ని వారెలా గ్రహిస్తారో అనే కుతూహలం ఆయనకు కలిగింది.

ఒకే ఒక అక్షరం అందరికీ చెప్పారు. ఆ అక్షరం 'ద'. దేవతలు ఆ అక్షరాన్ని 'దమము' అని అర్థంచేసుకున్నారు. దమము అంటే ఇంద్రియ నిగ్రహం. దేవతలు ఇంద్రియ నిగ్రహం కోల్పోవడంవల్లే ఎప్పుడూ పతనమైపోతుంటారు.

మానవులు 'ద' అనే అక్షరాన్ని 'దానం'గా అర్థంచేసుకున్నారు. దానగుణంతో వుండాలని, తమకున్నదానిలో ఎంతో కొంత దానం చేయాలని అర్థంచేసుకున్నారు.

ఇక రాక్షసులు 'ద' అనే అక్షరాన్ని 'దయ'గా స్వీకరించారు. సర్వప్రాణులపట్ల దయకల్గివుండాలని,దయాగుణంవల్లే తాము తరిస్తామని, ప్రజాపతి తలంపు అదే అని భావించారు.

నిజానికి- ఈ కలియుగంలో, ప్రస్తుత కాలంలో దేవతలు, మానవులు, రాక్షసులు విడివిడిగా ఎక్కడ వున్నారు? అంతా మనలోనే వున్నారు. దేవతలు, మానవులు,రాక్షసులు అన్నీ

మనమే. మనలో ఏ గుణం ఎక్కువగా బైటకు తెలిస్తే ఆ గుణం కలవారిగా లోకం మనల్ని గుర్తిస్తుంది. సమయానుకూలంగా గుణాలు ప్రదర్శితమవుతూ వుంటాయి. వాటినిబట్టే మనకు కీర్తి, అపకీర్తి.

అంచేత మనం దేవతల్లా దమము, అదే ఇంద్రియ నిగ్రహం పాటించాలి. మనిషి పుట్టుక పుట్టినందుకు దానం చేయాలి. మనలో దానవుడు ప్రకోపిస్తున్నప్పుడు సంయమనంపాటించి, దయాగుణంతో వ్యవహరించాలి. అప్పుడే పరిపూర్ణ మానవులుగా తయారవగలం.

ఒక ధనవంతుడున్నాడు. ఆయనకు డబ్బు, దస్కం, మందీమార్బలం అన్నీ వున్నాయి.

వీటితోపాటు దయాగుణం చాలా ఎక్కువగా వుంది. మనిషిలోని మంచిగుణం పువ్వుల సువాసన లాంటిది. అది దాచడం ఎవరి తరం?

ఆ ధనవంతునికి దయావంతుడని పేరు వచ్చింది. ఆ ఊరిలో ఆయనకు తెలిసి ఎవరూ ఆకలితో వుండకూడదు.

పట్టెడన్నం,మానం కాపాడుకోవడానికి వస్త్రం- ఆయన లేదనకుండా ఇచ్చేవాడు. వీటికి తోడు ఆయన శ్రీరామభక్తుడు.

అన్న వస్త్రాలిచ్చి, అవన్నీ శ్రీరాముని దయ వల్లే తాను ఇవ్వగల్గుతున్నాననీ,వారు పొందగలుగుతున్నారనీ వచ్చిన ప్రతివారికీ చెప్పేవాడు.

తీసుకున్నవారు ఎంతో దయతో అవన్నీ ఆయన ఇస్తున్నందుకో, రాముని మీద ఎంతో కొంత భక్తి వుండడంవల్లో నిజమేనని, కృతజ్ఞత చెప్పి వెళ్లేవారు.

ఒకరోజు బాగా పొద్దుపోయాక ఓ ముసలాయన ధనవంతుని ఇంటికి వచ్చాడు. ఆయన తిండి తిని మూడు రోజులైంది.ఆయనది పొరుగూరు. ధనవంతుని దయాగుణం విని, కష్టపడి వచ్చాడు. లోపల ఆకలి, బైట చలి- రెండూ ఆయన్ని బాధిస్తున్నాయి.ధనవంతుడు ఆయన స్థితికి జాలిపడి ఆదుకున్నాడు. మంచి భోజనం పెట్టాడు. ఉన్న వస్త్రాలు ఇచ్చాడు. వృద్ధునికి ఆకలిమంట, చలి వణుకు తగ్గాయి.

ధనవంతుడు యథారీతి శ్రీరాముని దయ గురించిచెప్పి, వృద్ధునికి అవన్నీ శ్రీరాముని వల్లే అమరాయి అని చెప్పాడు. అందుకు వృద్ధుడు ఒప్పుకోలేదు. ఇవన్నీ నువ్వు చేసి, రాముని పేరు ఎందుకు చెప్తావు అని నిలదీశాడు.ధనవంతుడు రాముడే తనకు ఐశ్వర్యం, సద్బుద్ధి ఇచ్చి కాపాడుతున్నాడని చెప్పాడు.

ముసలాయన అంగీకరించలేదు. ఆయన నాస్తికుడు. మాట మాట పెరిగింది. వృద్ధుడు శ్రీరాముడ్ని నోటికొచ్చినట్టు తిడుతున్నాడు. ధనవంతుడు ఓర్చుకోలేకపోయాడు. ఆయన కోపం తారస్థాయికి చేరింది. రాముడ్ని నిందించవద్దని ఆఖరిసారి చెప్పి చూశాడు. ముసలాయన విన్లేదు. నౌకర్లచేత వృద్ధుడ్ని అర్ధరాత్రిపూట, అందునా చలిలో నిర్దాక్షిణ్యంగా బైటకు గెంటించాడు ధనవంతుడు.

మనసు చెదిరిపోయింది. శ్రీరామ ధ్యానం చేశాడు. అదీ సరిగ్గా కుదర్లేదు. అలాగే పూజ గదిలో పడుకున్నాడు. మగతనిద్ర- రాముడు వచ్చి "ఎందుకంత కలతపడతావు? ఆ వృద్ధుడు ఎంతో కాలంగా నన్ను నిందిస్తున్నాడు- నోటికొచ్చినట్టు తిడతాడు.

అయినా అతనికి ఎలాగోలాగ నేను సహాయం చేస్తూనే వున్నాను. దయాగుణం గలవాడివని పేరు తెచ్చుకుని, ఇంత నిర్దయగా ఎందుకు ప్రవర్తించావు?" అని అడిగాడు.

వెంటనే మేలుకున్నాడు ధనవంతుడు- రామ విగ్రహం పాదాలు పట్టుకున్నాడు- "ప్రభూ! నీ అంత దయాగుణం మాకు ఎలా వస్తుంది, నన్ను క్షమించు"

కొంపెల్ల విశ్వం

దయ్యింది.పదకొండయ్యింది. 'ఏం మనిషో? అతీగతీ లేదు' అనుకుంది చిలకమ్మ.

అనుకోవడమే తడవుగా ఆమె ఎదురుగా ప్రత్యక్షమయ్యాడు మందపాటి బంగార్రాజు. "ఇంత సేపూ ఎక్కడ తగలడ్డారూ? కళ్ళేమో కాయలు కాసేసాయి. ఉన్న ఆ కొద్దిపాటి చూపు పోయినట్లే" చిలకమ్మ అంది. ఇదే ప్రశ్నను కాసింత సౌమ్యంగా అడగొచ్చు. కాని అడగదు. అందమైన వెటకారమో, పౌరుషపు ఛాయో కావాలి ఆమెకు.

"ఒక్కడ్నేనా? తోడు లేకుండానా? పైగా రాచ పీనుగును" అన్నాడు.

తువ్వాలుతో మూటగట్టి తెచ్చిన గోరింటాకును గుట్టగా పోసాడు. చెంబుతో నీళ్ళు తెచ్చాడు. శుభ్రం చేసి సన్నికలు పొత్రం మీదవేసి మెత్తగా నూరాడు. ముద్దగా చేసి సీమండి గిన్నెలోఉంచి చిలకమ్మకు సైగచేశాడు ఓపిక ఉన్నపుడు చిలకమ్మ అన్నిపనులు తనే చేసేది. భర్త కోరికను ఏనాడూ కాదనలేదు.

ఆయన మొండితనమూ ఇష్టమే. సరదాతిట్లు ఇష్టమే. మాట విసురుకున్నా క్షణంలో మళ్ళీ మామూలే. "వేళాపాళా లేదా? ఇప్పుడేంటీ? భోజనాలయ్యాక చూడొచ్చు" అంది చిలకమ్మ.

ఫక్కుమని నవ్వాడు. "నువ్వు లేవా? గోరుముద్దలు తినిపించడానికి.అన్నాలసంగతి తర్వాత చూద్దాం. ముందు ఇది కానీయవోయ్" కొంటెగా చూస్తూ అన్నాడు బంగార్రాజు.

ముక్కాలి పీటమీద కూర్చుని తనచేతిని చిలకమ్మకు అందించాడు. ఆ చేతిని అపురూపంగా ఒళ్ళోపెట్టుకుని వంగుని కళ్ళజోడు సర్దుకుంటూ గోరింటాకు పెట్టడం మొదలెట్టింది. సగం పూర్తయ్యింది. తదేకంగా దీక్షగా చిలకమ్మ చూస్తూంది. ఉన్నట్టుండి బంగార్రాజు చిలకమ్మ తలను ఢీకొట్టాడు. ఉలిక్కిపడింది. చిరుకోపం నటించింది.

అప్పుడొచ్చింది కోడలు రమ. బుగ్గలు నొక్కుకుని 'చాల్లే సంబడం' అని కూడా అంది.

తోడు దీపం



హాయిగా నవ్వుకున్నారు దంపతులు. రెండు అరచేతులు నిండా పెట్టించుకుని బాగా ఆరేదాక అట్టిపెట్టుకున్నాడు. 'గోరింటాకు ఎండి కడుక్కున్నాక ఒరిసినట్లున్న చర్మంపై గిలిగింతలు ఎంత బావుంటాయో' అనుకుంటూ మురిసిపోయాడు బంగార్రాజు. చిలకమ్మ బోసినోటితో నవ్వింది.

బంగార్రాజు పెద్ద ఎత్తరి కాదు. తెల్లని వెండి జుట్టు. తల వెనుక పాతకాలం నాటి సుడులు తిరిగిన గిరజాలు.తమ్మెల్ని కలుపుకుంటూ మీసం, చెవులకు కమ్మీలు, మెడలో కాశీతాడు, ఒంటికి ఎడమభుజం మీదుగా అడ్డంగా జంధ్యం, గూడ పంచె, భుజంమీద కాషాయరంగు తువ్వాలు, దబ్బ పండు ఛాయ, దళసరి తెల్లపొర కప్పిన ఒక కన్ను, పని చేస్తుంది.

బంగార్రాజుకి భార్యచేత ఇలాంటి సపర్యలు చేయించుకోవడం ఇష్టం. రకరకాల సంకేతాలతో చిలకమ్మని రప్పించుకునే వేషాలేస్తుంటాడు. అలాంటి పనులు చేయించుకున్నప్పుడు చక్కగా ఉండొచ్చు కదా. ఉండడు.ఏదో పుల్లవిరుపు మాటంటాడు. ముందు సరదాగానే మొదలెడతాడు.

తర్వాత నెమ్మదిగా మాటలతీవ్రత పెంచుతాడు. ఒకరకంగా రెచ్చిపోతాడు.చిలకమ్మనీ ఆవిడ పుట్టింటివారినీ దెప్పుతాడు. అక్కడితో ఆగడు. అయిన వాళ్ళని తేలిగ్గా తీసి పారేస్తుంటాడు.

వినీ వినీ సహనం కోల్పోతుంది చిలకమ్మ. అప్పుడు తగని తప్పని పరిస్థితుల్లో తన ఒరలో

దాట్ల దేవదానం రాజు

వెరశి ఎనభై ఏళ్ళయినా వడలని రూపం.

చిలకమ్మ ఆయనకు సరిజోడు.నుదుటన పెద్ద బొట్టు.ఎల్లపుడూ పెదాలపై చెరగని చిరునవ్వు. భర్తతోడే లోకం. ఇద్దరూ పరిసరాలస్పృహ లేకుండా చేతులు కలుపుకుని కూర్చుంటారు.

ఒకరి కళ్ళల్లోకి మరొకరు చూస్తుంటారు. భార్యకు సుస్తీచేస్తే మంచం పక్కన కూర్చుని కాళ్ళు పడతాడు. వద్దని మొత్తుకున్నా వినడు. రాత్రంతా జాగరణ చేస్తాడు. మాటిమాటికీ చేయి పట్టుకుని నాడి చూస్తుంటాడు. ఆమె కూడా అంతే.

ఒకరికోసం మరొకరు పుట్టినట్టే. బంగార్రాజు కంట్లో నలక పడిందనుకోండి.కళ్ళని చేతితో గట్టిగా నలుపుకుంటున్నట్లుగా ఉత్తినే అభినయం చేస్తాడు. చిలకమ్మ చూస్తుంది. వెంటనే దగ్గరకొస్తుంది.

"ఏయ్,ముసిలాయనా... ఏం చేస్తున్నారు? కళ్ళు నలుపుకుంటున్నారా? ఉన్న ఒక్క గుడ్డూ ఏమైపోవాలి? అన్నన్నా..." అంటూ వారిస్తుంది.

వేళ్ళతో కంటిరెప్పల్ని నొక్కి ముఖం దగ్గరకు తీసుకుని గట్టిగా ఊదుతుంది. తర్వాత చీరకొంగు చివర మడతలుపెట్టి నోటి దగ్గర ఉఫ్‌మని వెచ్చని ఊపిరులూది కంటిమీద పెడుతుంది పదేపదే అదే దాచుకున్న బ్రహ్మాస్త్రాన్ని తీస్తుంది.అతిలాఘవంగా వదులుతుంది."మీరు ఊరికినే ఎగిరిగెంతులెయ్యకండి. ఆ రోజు నారాత బాగోక పాల్పడ్డానుగానీ నా పెళ్ళి వరించి చేసుకున్నది కాదు.

ఇపుడు ఎంత ఏడిచి ఏం లాభం? ఇస్తానన్న కట్నం సరిపెట్టలేక పెళ్ళి ఆగిపోవడం పరువునష్టమని సత్యహరిశ్చంద్రనాటకంలో కాటికాపరి సీను చూస్తున్న మిమ్మల్ని ఉన్నపళంగా లాక్కొచ్చి నా మెడలువంచి మూడు ముళ్ళేయించారు. లేకపోతే నా బతుకు బంగారం కాదూ?"

అంతే. తేలుకుట్టిన దొంగలా చల్లబడిపోతాడు బంగార్రాజు. ఏదో పనున్నట్టు గాలిలో తువ్వాలు విదిలించి విసావిసా వెళ్ళిపోతాడు.కాసేపు దూరంగా వెళ్ళిపోయి తనలోతాను గొణుక్కుంటాడు. ఒక గంటసేపు ఆ ఛాయలకి రాకుండా గడుపుతాడు.ఆ తర్వాత మళ్ళీ మామూలే. అన్నీ మరచిపోతాడు.

పెళ్ళయిన ఆరుమాసాలకే తను పుట్టింటికెళ్ళినపుడు తెలిసిన ఒక రహస్యం మనసులోనే దాచుకుంది చిలకమ్మ. కట్నంకోసం బెట్టుచేసిన ఆనాటి పెళ్ళికొడుకు మరో పెళ్ళిచేసుకున్న రెండునెలలకే ప్రాణాంతకమైనవ్యాధితో చచ్చిపోయాడనే విషయం

● ఆలోచించటమేకాదు, ఆచరణ ముఖ్యం- అదీ ఇప్పుడే ప్రారంభించాలి తప్ప రేపటికి వాయిదా వేయకూడదు.

ఎప్పటికీ చెప్పకూడదనే నిశ్చయించుకుంది.

"నేనే గనుక తగలకపోతే మొగుడు చచ్చినదానివై మూలన కూర్చుని పడుండేదానివి" అని ఎదురుదెబ్బ తీసి ఇంకా ఏడిపిస్తాడని, మరింత పేట్రేగిపోతాడని ఆవిడ భయం.చెబితే జరిగేది ముమ్మాటికీ అదే.

రోజులన్నీ ఒకేలా సాగవు. జీవనయాత్ర కుదురుగా సాగిపోతే ఇంకేముంది? కొడుకు వరహాలరాజు తల్లిదండ్రుల్ని దగ్గర కూర్చోబెట్టుకుని యానాం మకాం మారుద్దామనీ అక్కడ చిన్న ఉద్యోగం దొరికిందని చెప్పాడు. ఉన్న అయిదు కుంచాల చేను అమ్ముకుని అప్పులు తీర్చుకుని కలోగంజో తాగి బతుకుదామని అన్నాడు. బంగార్రాజు లేచి అటూ ఇటూ తిరిగాడు. కొంతసేపు ఆలోచించాడు.

"ఇదిగో వరాలూ, యానాం వెళదామంటున్నావు. సరే, మీతో బాటే మేమూను. బతికి చెడినవాడినినేను. అదొక్కటి జ్ఞాపకం ఉంచుకో" ఒక్కక్షణం ఆగాడు. గదిలోపల కోడలి ఏడుపు వినబడుతూంది.

"తాతలు నేతులు నాకారు. మనకాడకొచ్చేటప్పటికి నిత్యం దరిద్ర్యం కాపలా కాస్తున్నది. ఉన్న ఊరిని విడిచి వెళ్ళడమంటే మాలాంటివాళ్ళకి సగం ప్రాణం పోయినట్లే. ఏం చేస్తాం? ఎలా జరగాలో అలా జరుగుతుంది"

బంగార్రాజు అంగీకారంతో వరహాలరాజు కాపురం యానాం మారింది. మెట్టకూరు ప్రాంతంలో ఒక చిన్న ఇల్లు అద్దెకు తీసుకున్నారు.

● ● ●

మూడేళ్ళ కాలం ఎంత? గిర్రున తిరిగింది. బంగార్రాజు,చిలకమ్మల అన్యోన్యత చెక్కుచెదరకుండా కొనసాగుతూంది. కొన్ని సంఘటనలు జీవితాల్నే అతలాకుతలం చేసేస్తాయి. అయోమయానికి గురిచేస్తాయి.

యూనియన్ గొడవల వల్ల వరహాలరాజు పని చేస్తున్న ఫ్యాక్టరీ మూతపడింది. కార్మికులు ఆవేశంతో ఫ్యాక్టరీని దగ్ధం చేసేసారు. ఉద్యోగస్తులు రోడ్డునపడ్డారు. ఇప్పట్లో పరిష్కారం దొరికేలా లేదు. ఊళ్ళో ఉండి సంసారాల్ని ఈదగలిగే శక్తిని కోల్పోతున్నారు. నాలుగు దిక్కులకేసి చూస్తున్నారు. అందులో వరహాలరాజు ఒకడు.

అపుడొచ్చింది వరహాలరాజుకు ఒక ఆలోచన. ఇబ్బందికరమైనదే. అయినా గత్యంతరం లేదు. తండ్రి దృష్టికి తీసుకురావడానికి రెండురోజులు కిందామీదా పడి నలిగిపోయాడు. మధనపడ్డాడు. ఇక చెప్పక తప్పలేదు. బిడియపడుతూ నీరసమైన గొంతుతో విషయం బంగార్రాజు చెవిలోవేశాడు.

"పర్వాలేదు. అంతా బాగానే ఉంటుంది. ఈ రోజు ఓల్డేజీహోమ్‌కి వెళ్ళి చూసివచ్చాను. కాలక్షేపం కూడా బాగానే అవుతుంది. మీరిద్దరూ అక్కడే ఉండొచ్చు. పైసా కట్టక్కర్లేదు.

నాకూ బాధగానే ఉంది. నాకిష్టమై కాదు. ఇంక అంతకన్నా గతి లేక. మీకెలా చెప్పాలో తెలియక ఆగాను. ఇప్పుడే వెళ్ళక్కర్లేదు. ఖాళీలు లేవట.

ఖాళీ అయిన వెంటనే చెబుతానన్నారు మేనేజరు రంగయ్యగారు" వరహాలరాజు ఒక్కోమాట నెమ్మదిగా చెప్పాడు.

బంగార్రాజు నిర్ఘాంతపోయాడు. విస్మయంతో నోరెళ్ళబెట్టాడు. ఏ మూలో దాగున్న అహానికి సూటిగా గురిపెట్టి కొట్టినట్లయింది.సన్నని వణుకు, ముఖానికి చిరుచెమట, నేలమీద కూలబడిపోయాడు.చిలకమ్మ స్థితీ అంతే.ఆందోళనగా భర్త ముఖంకేసి చూస్తూ ఉండిపోయింది.

"ఖాళీలు ఎలా అవుతాయి?" బలహీనంగా బంగార్రాజు ప్రశ్నించాడు.

వరహాలరాజు వెంటనే సమాధానం చెప్పలేకపోయాడు. మౌనం వహించాడు. చివరి ఆఖరి మజిలీలో ఖాళీ... అంటే... అంటే...

బంగార్రాజుకి అర్థమైంది. రెండు రోజులు గడిచాయి. నిశ్శబ్దం... స్వభావానికి విరుద్ధమైన నడవ

● మన అంతరాత్మే మనకు మంచి స్నేహితుడు.

భారతీయ తొలి నోబెల్ విజేత

భౌతికశాస్త్రంలో భారతీయ కాంతిపుంజం సర్ సి.వి.రామన్.*1888*లో జన్మించిన రామన్ ప్రభుత్వ ఉద్యోగిగా కలకత్తాలో జీవితం ప్రారంభించినా అనతికాలంలోనే పరిశోధనల్లోకివెళ్ళి మూలకాల్లో కాంతి వెదజల్లబడే విధానం వివరించి 'రామన్ ఎఫెక్ట్' అనే పేరును శాశ్వతం చేసుకున్నాడు.

భౌతికశాస్త్రంలో ఆయన క్వాంటమ్ ఫోటాన్ స్పిన్. ఎకౌస్టో ఆప్టిక్ ప్రభావం, భారతీయ సంగీత వాయిద్యాల ధ్వనితరంగాల మీద పరిశోధనలు చేశాడు.

బెంగళూర్‌లోని ఐ.ఐ.ఎస్.సి. వ్యవస్థాపకుడు ఆయన. *1970*లో మరణించాడు. ◆

డిక.మాటలులేవు,పలకరింపులులేవు.అరుపులులేవు, అనవసరపు సలహాలు లేవు.

అభిప్రాయ ప్రకటనలు లేవు. అనుభవాల్ని విప్పి చెప్పే సోది లేదు. కఠిన నిశ్శబ్దం, ఆకుల గలగలలు, పిట్టకూతలు, పారే నీటిసవ్వడులు ఏవీ లేవు.

ప్రకృతి సైతం గజగజలాడే మౌనం. గాయాలు కనపడటం లేదు. కవుకుదెబ్బ తగిలినట్టు గిలగిలలాడిపోయాడు బంగార్రాజు.

నచ్చచెప్పడమెలాగో తెలియక సతమతమైంది చిలకమ్మ. శతవిధాల ప్రయత్నించింది, భర్త మౌన భంగం చెడగొట్టాలని. కాలం మనది కానప్పుడు బెట్టు పనికి రాదంది. ప్రవాహంలో కొట్టుకుపోవడం మినహా గత్యంతరం లేదంది.

"మన ఈడు వాళ్ళుంటారు. పాతతరం కబుర్లు ఉంటాయి. రకరకాల మనుష్యులతో పరిచయం, సత్కాలక్షేపం ఉంటాయి. మనల్ని గౌరవంగానే చూస్తారు" మాట్లాడుతున్న చిలకమ్మ దగ్గరకొచ్చి నిలబడి చాచి చెంపమీదకొట్టినట్టు అభినయించాడు తప్ప మాట్లాడలేదు. వారం గడిచింది. మార్పులేదు. చిలకమ్మ కన్నీళ్ళు బంగార్రాజుని కరిగించలేదు.

"అంతకుముందులా ఉండండి నాన్నా, అర్థం చేసుకోండి. అంతే.పోనీ వదిలేయండి.ఏం జరగాలో అది జరుగుతుంది" రెండుచేతులు జోడించి అన్నాడు వరహాలరాజు. సరిగ్గా అదే సమయానికి వరహాలరాజు మిత్రుడు రవి వచ్చాడు. యానాం ఊరు ప్రస్తుత పరిస్థితి గురించి మాట్లాడుకుంటున్నారు. బంగార్రాజు కాళ్ళు బారచాపి గోడకు వీపు ఆన్చి నేలమీద కూర్చుని వింటున్నాడు.

ఉన్నట్టుండి రవి అన్నాడు- "ఒకడున్నాడు. రాత్రిపూట ఇంట్లోకి జొరబడ్డాడు. వంటింట్లోకి దూరాడు. చప్పుడు చేయకుండా అన్నం తిన్నాడు. సామానులేమీ ముట్టుకోలేదు.

కేవలం కడుపు నింపుకోడం కోసమే వచ్చాడు. వాడికి కనీసం అన్నంకూడా సమకూర్చలేనివ్యవస్థలో ఉన్నామని బాధపడటంతప్ప వాడిని దొంగ అని అనగలమా, చెప్పు? లేకపోతే సోమాలియాలోలా ఎసరు కాగుతున్న పొయ్యిమీద గిన్నె ఎత్తుకుపోయే వారు లేరని సంతోషపడాలా?"

"ఆకలి జీవుని లక్షణం. దాన్ని జయించడానికి ఉచ్చమూనీచమూ అంటూ ఉండదు.పరువు గిరువు ఉండదు" అన్నాడు వరహాలరాజు. ఇది రవి చెప్పిన

● ఈ రోజును సద్వినియోగం చేసుకుంటే రేపటిరోజును నవ్వుతూ ఆహ్వానించగలుగుతాం.

దానికి సమాధానామో కాదో తెలియదు. చటుక్కున బంగా(రాజు కొడుకుకేసి చూశాడు.

ఆ సాయంత్రం-ఫినాయిల్ తయారుచేసి చిన్న చిన్న సీసాల్లోపోసి మూతలు బిగిస్తున్నాడు వరహాలరాజు. ఉద్యోగం పోయిన తర్వాత తను ఎన్నుకున్న వ్యాపారం అది. ఇంటింటికి, షాపులకు, ఆసుపత్రులకు సరఫరా చేస్తున్నాడు. కొడుకు చేస్తున్నపనిని తీక్షణంగా గమనిస్తున్నాడు బంగా(రాజు.

ఏమనుకున్నాడో ఏమో దగ్గరకు వచ్చి కూర్చున్నాడు. కాసేపటికి పొడిదగ్గు దగ్గాడు. వరహాలరాజు తండ్రిని పట్టించుకోలేదు. తన పనిలో తనున్నాడు. "అమ్మ, నేను రెడీ. వాళ్ళతో మాట్లాడు" భారంగా నిట్టూర్చి అన్నాడు బంగా(రాజు.

తండ్రి మాట విన్న వరహాలరాజు ముఖంలో బాధ... దుఃఖం... అశక్తత.

"మిమ్మల్ని కష్టపెడుతున్నాను నాన్నా. నాకూ ఇష్టం కాదని మీకూ తెలుసు.కనీసబాధ్యతే అయినా మోయలేని స్థితిలో ఉన్నాను.ఈ రోజే ఎమ్మెల్యే గారినీ, ఓల్డేజీ హోమ్ మేనేజరు రంగయ్యగారినీ కలుస్తాను"అని తండ్రిని సూటిగా చూడలేక తల వంచుకుని అన్నాడు వరహాలరాజు.

ఇంటిలోపల, బయట చీకటి ముసురుకుంటున్నది.ఇంకాసేపట్లో ఆ చీకటిచిక్కనవడం మామూలే. మర్నాడు- వరహాలరాజు యానాం ఓల్డేజీహోమ్‌కు వెళ్ళాడు. నాలుగైదురోజుల్లో కబురు పంపిస్తామని చెప్పారు. వారం తర్వాత మళ్ళీ మళ్ళీ కలిశాడు.

ఒక ఇబ్బందికరమైన పరిస్థితి ఎదురైంది. ఓల్డేజీ హోమ్ పూర్తి ఉచితమే అయినా సంఖ్యాపరమైన నియమం ఉంది. ఒకటిమాత్రమే ఖాళీ అయ్యింది. అదీ మగవాళ్ళకి.తల్లీదండ్రీ ఒక్కసారే వెళ్ళాలంటే కుదరదు."ముందు ఆయన్ని చేరిపోమనండి. తర్వాత మీ అమ్మగారు వస్తారు. రెండూ ఒకేసారి సాధ్యం కాదు. మరొకవిషయం. ఉన్న ఈ ఖాళీలో ఎవరైనా చేరిపోతే ఇదీ ఉండదు.ఆలోచించుకోండి" అన్నాడు మేనేజరు.

వరహాలరాజుకు ఏం చేయాలో పాలుపోలేదు. ఇద్దర్నీ విడదీసి తండ్రి ఒక్కడ్నే పంపడం ఇష్టం లేదు. ఏం జరిగిందని నొక్కినొక్కి అడుగుతుంటే అదే విషయాన్ని బంగా(రాజుకి చెప్పాడు.

బంగా(రాజు, కొడుకుని దగ్గరకు పిలిచి భుజం మీద చేయివేశాడు. "నిజంగా గాంధీ మహాత్ముడు ఎంత గొప్పవాడురా. రవి అస్తమించని సామ్రాజ్యాన్ని గజగజ వణికించాడు సత్యాగ్రహం గొప్ప ఆయుధంరా" అన్నాడు బంగా(రాజు.

"ఇప్పుడా గొడవంతా దేనికి నాన్నా? సమయం సందర్భం లేకుండా మాట్లాడుతున్నావు. చరిత్ర పాఠాలొద్దు చక్కగా పడుకో"

"పడుకోవడం సంగతి అటుంచు. నేనూ మౌన పోరాటంలోనే జీవితసత్యాలు తెలుసుకున్నాను. ఈవేళ, రేపు మంచి ముహూర్తాలున్నాయి. పర్వాలేదు. నేను ముందు వెళతాను. అమ్మ తర్వాత వస్తుందిలే. రేపు కలువు"

చిలకమ్మ ఆయన చేతులు పట్టుకుని వెక్కివెక్కి ఏడ్చేసింది.వాళ్ళిద్దర్నీ అలాగే వదిలి బయటికి వెళ్ళిపోయాడు వరహాలరాజు. సగం తెరిచిన తలుపు లోంచి ఎవరో చూస్తున్నట్లుంది.కోడలు కాదు. మరి ఎవరు? ఒట్టి గాలేనా? ఏమో?

● ● ●

బంగా(రాజు సహచరముసలివాళ్ళని చూస్తుంటే కడుపు తరుక్కుపోతున్నది. ఒక్కొక్కళ్ళది ఒక్కో దీన గాథ. నిత్యం తీగ అంచుమీద నడక కష్టం. మానవ సంబంధాల్లోని మార్పు యుగధర్మం అనుకోవాలా? ఒక ఉదాత్తమైన ఆశయంతో నెలకొల్పబడిన ఓల్డేజీ హోమ్ శుచీశుభ్రతకు ఆలవాలంగా ఉంది. భక్తి విశ్వాసాలకు అనుకూలంగా ఉండేలా మందిరాలున్నాయి. సేవకు అంకితమైన మహనీయుల విగ్రహాలున్నాయి. కింది అంతస్తులో ఆనంద నిలయం ఉంది.

అనాథపిల్లలకు మెరుగైనవిద్య అందించే ఏర్పాటుంది. చదవగలిగేవాళ్ళకు దినపత్రికలున్నాయి. సొంతకథలు చెప్పుకోవడానికి నోళ్ళున్నాయి. చేదు, తీపి జ్ఞాపకాలు ఉన్నాయి.

దూరంలోంచి సాన్నిహిత్యపు విలువలు ఇంకా తెలుస్తాయి. అరవై ఏళ్ళ వివాహబంధం... చిలకమ్మ... ఎడబాటు... ఒకటే లోటు.

రాత్రిళ్ళు సరిగ్గా నిద్రపట్టదు. ఇన్నేళ్ళ దాంపత్యంలో ఒంటరిగా గడిపినరోజులు తక్కువ. క్షణం ఆలస్యమైతే చాలు వీధిగేటు పట్టుకుని ఎదురు చూసేది. చిలకమ్మ ఇపుడు ఏం చేస్తుందో?

మరోవారం గడిచింది.బంగార్రాజులో క్రమేపీ బెంగ పెరిగిపోసాగింది. తింటున్న మెతుకులపట్ల అనాసక్తి, పరాకుగా ఉండటం, ఒంటరిగా ఉండటానికి ఇష్టపడటం, కాలం విధించిన శిక్షలో జైలుజీవితంలా, క్షణాలు దుర్భరంగా, ఉహూ (ఇక లాభం లేదు, ఓపిక నశిస్తూంది) ఇక్కడ ఉండటం సాధ్యం కాదు. బయటపడాల్సిందే.

సరిగ్గా అప్పుడే ఒక కబురు తెలిసింది, ఒకావిడ కాలం చేసిన సంగతి. చరమాంకపు మజిలీ... ఖాళీ? రంగయ్య చెప్పాడు, భార్యని తీసుకొస్తే చేర్చుకుంటామని. కనీసం కళ్ళతో చూసుకోవచ్చు. అపుడపుడు మాట్లాడుకోవచ్చు.

చిలకమ్మ వస్తే బాగానే ఉంటుంది. బాబోయ్, విముక్తి ఉండదు. శాశ్వతంగా బందీ, బంగార్రాజులో భయం మొదలైంది. అస్థిమితంగా అటూ ఇటూ తిరుగుతున్నాడు. వద్దు... వద్దు... ఆవిడ్ని ఇక్కడకు తీసుకురావద్దు. మేనేజరుతో చెప్పేసేడు.

"నేను కూడ ఇక్కడుండను. ఇంటికెళ్ళిపోతాను. నన్నూ పంపించేయండి" వరహాలరాజు వచ్చాడు. జరిగేదదే అని ఊహించిందే. బలవంతపెట్టలేదు. ఇంటికి తీసుకొచ్చేశాడు. చిలకమ్మ బంగార్రాజుని ఆలింగనం చేసుకుంది. ఆమె కళ్ళు లోతుకు పోయాయి. చూపులు బలహీనంగా ఉన్నాయి.

పోయిన పెన్నిధి దొరికినట్టు ఆనందపడింది. "రోజూ టైడల్‌లాక్ వరకూ వచ్చేదాన్ని. ఆశ్రమంకేసి చూసేదాన్ని, మీరు కనబడతారని. వెనక్కి తిరిగి చూస్తే శ్మశానం కనిపించేది. భయంతో ఇంటిదారి పట్టేదాన్ని. కష్టమో నష్టమో నేను కూడా వచ్చేద్దును కదా. మీరే ఎందుకు వచ్చేశారు?"

ఆకాశంలో మేఘాలు... అంతట్లోనే జల్లులు పడుతున్నాయి. వాళ్ళు విడివడలేదు.తడిసిపోతున్నా చలించలేదు. అపుడు నెమ్మదిగా బంగార్రాజు చెప్పాడు- "అక్కడున్నవాళ్లకు వేరే తోడు లేదు. నాకైతే నువ్వున్నావు. అది చాలు. బతికినన్నాళ్ళూ కలిసేఉందాం. ఉన్న గింజల్నే పంచుకుందాం" ఇక బెంగలేదు... దిగులు లేదు... తోడుదీపం... చిరు వెలుగులో... సమస్తలోకాన్ని జయించొచ్చని తేలికపడ్డాడు బంగార్రాజు. దాంపత్యజీవన ఔన్నత్యంబోధపడినట్లుగా హాయిగా నవ్వింది చిలకమ్మ. ◇◇

సర్కారు ప్రాంతాల రాయలసీమ ప్రాంతాలలో వాడుకలో ఈ కిందివిధంగా ఉన్నాయి.

సర్కారు జిల్లాలు	రాయలసీమ జిల్లాలు
❀ బంగాళాదుంపలు	ఉర్లగడ్డలు
❀ చిలకడదుంపలు	గనిషి గడ్డలు
❀ ఉల్లిపాయలు	ఎర్రగడ్డలు
❀ చిన్న ఉల్లిపాయలు	తెల్లగడ్డలు
❀ సొరకాయ	ఆనపకాయ
❀ రామములగకాయలు	తక్కాడుకాయలు (కామన్‌గా టమోటా)
❀ ఉసిరికాయ	నల్లికాయ
❀ బత్తాయిపండు	చీనికాయ
❀ కిళ్ళీ	బీడ
❀ ముఖము చూడు	మూతి చూడు
❀ నలెకల పాము	నల్లకిచు
❀ జిల	నవ (జనరల్‌గా దురద)
❀ వెళ్ళాడు	పూడ్చాడు
❀ పలుగు	గడ్డపార
❀ దోమలు	చీకటీగలు
❀ చీపురు	పొరకట్టు
❀ మధ్యలో పాప	నడిమిపాప
❀ బొప్పాయికాయ	ఫరింది కాయ
❀ వర్జ్యం చూస్తారు	రాహుకాలం చూస్తారు
❀ అమావాస్య మంచిది కాదు	అమావాస్య మంచిది

సూర్యదేవర గిరిజాప్రసాద్

సాహితీ సదస్సులు



హైదరాబాద్ రవీంద్రభారతిలో జి.వి.ఆర్. ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో
89వ జన్మదినం సందర్భంగా డా॥ అక్కినేని నాగేశ్వరరావును సత్కరిస్తున్న వ్యవసాయ శాఖామాత్యులు
శ్రీ కన్నా లక్ష్మీనారాయణ, శ్రీ గుదిబండి వెంకటరెడ్డి, డా॥ పావులూరి శివరామయ్య, పి.విజయబాబు తదితరులు

హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవనంలో 'తెలుగు రక్షణ వేదిక' నిర్వహించిన 'శతక కవుల సన్మాన'
కార్యక్రమంలో ప్రముఖ కవి, నటుడు, గాయకుడు శ్రీ సాదనాల వేంకటస్వామినాయుడును సత్కరిస్తున్న
తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు శ్రీ నారా చంద్రబాబునాయుడు



బెంగళూరులో జరిగిన 'అమ్మ భాషను ఆదుకుందాం' కార్యక్రమంలో *www.savemothertang.com* వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి అధ్యక్షులు శ్రీ కనుమూరి బాపిరాజు. చిత్రంలో డా॥ ఎ.రాధాకృష్ణరాజు, తదితరులు ఉన్నారు



హైదరాబాద్ రవీంద్రభారతిలో జి.వి.ఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ నిర్వహించిన కార్యక్రమంలో వ్యవసాయ శాఖామాత్యులు శ్రీ కన్నా వి.నారాయణచే సన్మానంతోపాటు అక్కినేని స్వర్ణకంకణాలు స్వీకరిస్తున్న ఢిల్లీ తెలుగు అకాడమి ప్రధాన కార్యదర్శి శ్రీ ఎన్.వి.ఎల్.నాగరాజు, శ్రీ అల్లం పాండురంగారావు. చిత్రంలో శ్రీయుతులు గుదిబండి వెంకటరెడ్డి, డా॥ అనగాని మంజుల, పి.విజయబాబు, సి.రామకృష్ణ తదితరులు

హైదరాబాద్‌లో ఆంధ్రప్రదేశ్ హిందీ అకాడమీలో ప్రముఖ కవయిత్రి డా॥ సి.భవానీదేవి తెలుగు కవిత్వానికి హిందీ అనువాద సంపుటి 'అక్షర్ మేరా అస్తిత్వ్'ను ఆవిష్కరిస్తున్న డా॥ సి.నారాయణరెడ్డి. చిత్రంలో శ్రీయుతులు శ్రీనివాస్, డా॥ రిషభ్‌దేవ్‌శర్మ, శ్రీమతి ఆర్.శాంతసుందరి, ఆచార్య ఎన్.గోపి, డా॥ జి.నీరజ తదితరులు ఉన్నారు

'అల్లు రామలింగయ్య స్మారక జాతీయ పురస్కారాన్ని' చిరంజీవి చేతులమీదుగా తనికెళ్ళ భరణి అందుకున్నారు.
ఈ కార్యక్రమంలో శ్రీయుతులు అల్లు అరవింద్, అల్లు అర్జున్, సారిపల్లి కొండలరావు, పరుచూరి వేంకటేశ్వరరావు,
మంత్రి వట్టి వసంతకుమార్, కొత్తపల్లి సుబ్బారాయుడు, కొండవలస, గుండు హనుమంతరావు,
వై.కె.నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు



శ్రీకృష్ణ స్వరరాగ ప్రవంతి ఆధ్వర్యంలో జరిగిన సినారె స్వర్ణోత్సవ సంబరాలలో విశిష్టఅతిథిగా పాల్గొన్న
ప్రముఖ రచయిత, వ్యాఖ్యాత శ్రీ వెంకట్ గరికపాటిని సత్కరిస్తున్న పద్మభూషణ్ డా॥ సి.నారాయణరెడ్డి,
చిత్రంలో ఎస్.బి.ఐ ఏ.జి.ఎమ్. సిహెచ్.త్రినాధరావు ఉన్నారు

'యువకళావాహిని'- 'సుస్వర మ్యూజిక్ అకాడమీ' రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో
తొలి తెలుగు సినిమా నేపథ్యగాయని రావు బాలసరస్వతీదేవిని సత్కరిస్తున్న శ్రీయుతులు మంత్రి కాసు కృష్ణారెడ్డి,
సారిపల్లి కొండలరావు, పాలకుర్తి మధుసూదనరావు, మంగళగిరి ఆదిత్యప్రసాద్, ఎమ్.వి.ఆర్.మురళీకృష్ణ,
నాగరాజప్రసాద్, వై.కె.నాగేశ్వరరావు తదితరులు



హైదరాబాద్ డా॥ బోయి భీమన్న సాహిత్యపీఠం- పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి శ్రీ సి.దామోదర రాజనరసింహ ద్వారా భీమన్న సాహిత్యనిధి పురస్కారం స్వీకరిస్తున్న ప్రముఖ రచయిత డా॥ రావూరి భరద్వాజ. చిత్రంలో శ్రీమతి హైమవతీ భీమన్న, విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి తదితరులు ఉన్నారు

హైదరాబాద్ శ్రీ త్యాగరాయ గానసభలో జంటనగర ప్రముఖ సంస్థ 'రాగరాగిణి' నిర్వహణలో, ప్రముఖ సినీనటుడు హరనాథ్ 76వ జయంతి సందర్భంగా, సినీనటుడు శ్రీ చంద్రమోహన్‌కు 'స్వర్ణపతక' సత్కారంలో పాల్గొన్న ప్రముఖులు, శ్రీ గోపీనాథరెడ్డి, డా॥ కళా వెంకటదీక్షితులు, త్రినాధరావు, శైలజ, నిరంజన్, జి.వి.జి.రాజు సంస్థ అధ్యక్షురాలు ఎమ్.వి.రమణకుమారి, కార్యదర్శి ఎమ్.వి.సుబ్బలక్ష్మి తదితరులు



హైదరాబాద్ రవీంద్రభారతిలో యువకళావాహిని నిర్వహణలో సారిపల్లి కొండలరావు సారథ్యంలో డా॥ అక్కినేని నాటక కళాపరిషత్ 18వ రాష్ట్రస్థాయి పోటీల ముగింపు కార్యక్రమంలో ఉత్తమ ప్రదర్శనకు అవార్డునిస్తున్న డా॥ అక్కినేని నాగేశ్వరరావు. చిత్రంలో శ్రీయుతులు మంత్రి కాసు కృష్ణారెడ్డి, గోపరాజు రమణ, సురభి ప్రభావతి, వై.కె.నాగేశ్వరరావు ఉన్నారు

గాంధీజయంతి సందర్భంగా కడప కవిత విద్యాసాంస్కృతిక సేవాసంస్థవారు వివిధ రంగాలలో విశిష్ట సేవలందించిన వారిని సి.పి.బ్రౌన్ పరిశోధక కేంద్రం సమావేశ మందిరంలో సత్కారం నిర్వహించిన యోగివేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అర్జుల రామచంద్రారెడ్డి. చిత్రంలో కవిత విద్యా సాంస్కృతిక సేవాసంస్థ అధ్యక్షులు, ఇంటర్మీడియట్ విద్య విశ్రాంత సంయుక్త కార్యదర్శి అలపర్తి పిచ్చయ్య చౌదరి, డా॥ మూల మల్లికార్జునరెడ్డి, చిన్నయ్య, డా॥ ఎమ్.వి.ఎన్.నాయుడు, సత్కారగ్రహీతలు ఉన్నారు



హరగోపాల్ రాయగా, కళాప్రవీణ్ సంగీత దర్శకత్వంలో- సుద్దాల అశోక్‌తేజ, మోహనవంశీ పాడిన 'గాలి అలలమీద నవ్వులు' భావగీతాల సి.డీని రవీంద్రభారతిలో డా॥ సి.నారాయణరెడ్డి విడుదల చేశారు. 'యువకళావాహిని' ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కవి కె.శివారెడ్డి, శ్రీయుతులు సరిపల్లి కొండలరావు, శ్రీపాద స్వాతి, కె.స్వర్ణలత, బి.పద్మజ, వై.కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ- రాజీవ్ విద్యామిషన్ నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో రాష్ట్రంలోని రెండులక్షల యాభైవేలమంది ఉపాధ్యాయులను ఉద్దేశించి సైన్సుపై ప్రసంగించిన కోనసీమ సైన్సు పరిషత్ అధ్యక్షులు శ్రీ సి.వి.సర్వేశ్వరశర్మ, ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యం మరింత అభివృద్ధి చెందేందుకు పలుప్రక్రియలు చేపడుతున్న ఆర్.వి.ఎమ్- రాష్ట్రపథక సంచాలకులు శ్రీమతి వేమూరి ఉషారాణి ఐ.ఎ.ఎస్.

చెన్నైలోని పొట్టి శ్రీరాములు స్మారక మందిరంలో ఎమ్.ఆర్.వి. సత్యనారాయణమూర్తి కథలసంపుటి
'తూరుపు వెళ్ళే రైలు' ఆవిష్కరిస్తున్న ప్రసిద్ధ రచయిత్రి శ్రీమతి మాలతీచందూర్.
చిత్రంలో శ్రీయుతులు ఎమ్.రాజేశ్వరి, జి.చెన్నయ్య, ఉప్పలధడియం వెంకటేశ్వరరావు, రచయిత మూర్తి ఉన్నారు



చిత్తూరుజిల్లా మదనపల్లెలో భరతముని ఆర్ట్స్ అకాడమి నిర్వహించిన కార్యక్రమంలో మదనపల్లి శాసనసభ్యులు
ఎస్.షాజహాన్ బాషా ద్వారా కళారత్న అవార్డ్ స్వీకరిస్తున్న జి.వి.ఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ ఛైర్మన్
శ్రీ గుదిబండి వెంకటరెడ్డి. చిత్రంలో సినీనటి దివ్య, సంస్థ సభ్యులు శ్రీ రాఘవరావు ఉన్నారు

హైదరాబాద్ రవీంద్రభారతిలో ప్రముఖ రచయిత్రి, కవయిత్రి శ్రీమతి ఝాన్సీ కె.వి.కుమారి రచించిన
అంతరంగం గ్రంథం, క్రీస్తుక్రాంతి స్వరాల ఆడియో ఆల్బమ్‌లను ఆవిష్కరిస్తున్న డా॥ సి.నారాయణరెడ్డి.
చిత్రంలో డా॥ సిహెచ్.భవానీదేవి, ఆకాశవాణి వివిధభారతి పూర్వ సంచాలకులు శ్రీ నల్లూరి బాబురావు,
పాత్రికేయులు శ్రీ ప్రభుకిరణ్, సభాధ్యక్షులు డా॥ ఎన్.గోపి, డా॥ ఎ.బి.కె.ప్రసాద్, కె.రామచంద్రమూర్తి,
ఆచార్య కొలకలూరి ఇనాక్ తదితరులు ఉన్నారు



కేంద్ర సాహిత్యఅకాడమి యువసాహితి అవార్డుగ్రహీత డా॥ వేంపల్లి గంగాధర్‌ను సత్కరిస్తున్న కడపజిల్లా కలెక్టర్ శ్రీ వి.అనిల్‌కుమార్, శ్రీయుతులు అలపర్తి పిచ్చయ్యచౌదరి, సుధాకర్, నూకా రామ్‌ప్రసాద్‌రెడ్డి తదితరులు



హైదరాబాద్ కళా సుబ్బారావు కళావేదికపై జి.వి.ఆర్. ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ నిర్వహించిన సాహితీ కార్యక్రమంలో పొత్తూరి విజయలక్ష్మి రచించిన 'నిశ్శబ్ద జలపాతాలు' కథా సంపుటిని ఆవిష్కరిస్తున్న డా॥ కె.వి.రమణాచారి. చిత్రంలో శ్రీ పింగళి కమలాకేసరి, డా॥ రావూరి భరద్వాజ, సుధామ, డా॥ పి.మధుసూదనరావు, శ్రీ గుదిబండి వెంకటరెడ్డి, శ్రీ కేతవరపు రాజ్యశ్రీ, శ్రీమతి గురజాడ శోభాదేవి,శ్రీ పి.వెంకటదాసు తదితరులు ఉన్నారు

హైదరాబాద్ త్యాగరాయ గానసభలో బాలసాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో బాలసాహితీ రచయిత్రి డా॥ అమరవాది నీరజ రచించిన 'తేనె చినుకులు' పిల్లలకథల ఆవిష్కరణ కార్యక్రమంలో శ్రీయుతులు చొక్కపు వెంకటరమణ, డా॥ అమరవాది నీరజ, కళా వేంకటదీక్షితులు, బి.ఈశ్వరరెడ్డి, శంకరనారాయణ, మారేమండ సీతారామయ్య, దాసరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు

యువకళావాహిని ఆధ్వర్యంలో డా॥ అక్కినేని నాగేశ్వరరావు 89వ జన్మదిన పురస్కారసభలో అక్కినేనికి నవరత్న కిరీటధారణ చేస్తున్న డా॥ సి.నారాయణరెడ్డి, డా॥ టి.సుబ్బరామిరెడ్డి, డా॥ కె.వి.రమణాచారి, శ్రీ రుద్రరాజు పద్మరాజు, శ్రీ సారిపల్లి కొండలరావు, చిత్రంలో శ్రీయుతులు తమ్మారెడ్డి భరద్వాజ, వి.బి.రాజేంద్రప్రసాద్ దొర, వై.కె.నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు

జానపద కళాకారుడు, తెలంగాణ సాంస్కృతిక యోధుడు సుద్దాల హనుమంతు 102వ జయంతి సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో సుద్దాల హనుమంతు, జానకమ్మ జాతీయ పురస్కారాన్ని ఛత్తీస్‌గఢ్ పండ్వాని కళాకారిణి పద్మభూషణ్ డా॥ తీజన్‌బాయికి అందజేశారు. చిత్రంలో డా॥ సి.నారాయణరెడ్డి, శ్రీ గద్దర్, శ్రీ కె.శ్రీనివాస్, శ్రీమతి కల్వకుంట్ల కవిత, శ్రీ ఆర్.నారాయణమూర్తి, శ్రీ ఎన్.శంకర్, ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బూడిద భిక్షంగౌడ్, నల్లగొండ కలెక్టర్ శ్రీ ముక్తేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే శ్రీ చాడ వెంకట్‌రెడ్డి, సుద్దాల ఫౌండేషన్ సభ్యులు శ్రీ సుద్దాల భారతి, సుధాకర్ తదితరులు ఉన్నారు



న్యూఢిల్లీలోని ఆంధ్రాభవన్ అంబేద్కర్ ఆడిటోరియంలో 'ఆంధ్రప్రదేశ్‌లో నవతరం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పార్లమెంటుసభ్యులు



యువత భవిత- చర్చావేదిక, పుస్తక ఆవిష్కరణ- శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో హైకోర్టు జడ్జి శ్రీ వి.ఈశ్వరయ్య, ఆంధ్రజ్యోతి ఎడిటర్ శ్రీ కె.శ్రీనివాస్, అభ్యుదయ రచయిత శ్రీ సాంబశివరావు, శ్రీ నరసింహారెడ్డి, శ్రీ రామదాసప్పనాయుడు పాల్గొన్న దృశ్యం



అమలాపురం సాహితీ మిత్రమండలి ఆధ్వర్యంలో సంగీత సాహిత్య భూషణ్ ఆంధ్రరత్నం ప్రముఖ కవి శ్రీ రేకపల్లి శ్రీనివాసమూర్తి రచించిన 'గిరధరా' శతకాన్ని ఆవిష్కరిస్తున్న లయన్ శ్రీమతి పాలెపు సుబ్బలక్ష్మి. చిత్రంలో డా॥ గుళ్ళపల్లి ప్రభాకర ఫణీరాజా, కవి నల్లా నరసింహమూర్తి, శ్రీపాద రామకృష్ణ



విజయనగరంలో హరికథా పితామహుడు శ్రీ ఆదిభట్ల నారాయణదాసు 148వ జయంతి ఉత్సవాల సందర్భంగా దాసు ప్రతిభను ఉద్దేశించి డా॥ ఎ.గోపాలరావు రచించిన పూజాపుష్పం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీ కోలగట్ల వీరభద్రస్వామి. చిత్రంలో సంస్థ అధ్యక్షులు శ్రీ పి.వి.నరసింహరాజు, కోశాధికారి శ్రీ భైరవభట్ల నరసింహం తదితరులు ఉన్నారు

చెన్నై వేదవిజ్ఞాన వేదిక, ఆంధ్ర అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో జరిగిన 'తరతరాల తెలుగు కవిత'
కార్యక్రమంలో 'రాయప్రోలు వారి కవితా ప్రారంభం'పై ప్రసంగించిన డా॥ ద్వానాశాస్త్రిని సత్కరిస్తున్న
శ్రీయుతులు కె.మధు, జె.కె.రెడ్డి, భమిడిపాటి సుబ్రహ్మణ్యం, ఆదిశేషయ్య తదితరులు

హైదరాబాద్ జూబ్లీహాల్‌లో
డా॥ గుర్రం జాషువా ***117***వ
జయంతి, శత కవిత వసంతం
సమ్మేళనంలో కవి,
రచయిత శ్రీ అడపా
రామకృష్ణను సత్కరిస్తున్న
ఆచార్య కొలకలూరి ఇనాక్,
ఆచార్య జి.కృపాచారి



నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా ***117***వ జయంతి సభను కడప కవిత విద్యా సాంస్కృతిక సేవాసంస్థ వారు
నిర్వహించిన సందర్భంగా కీలకోపన్యాసం గావించిన యోగివేమన విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షులు
డా॥ ఈశ్వరరెడ్డిని సన్మానిస్తున్న శాసనమండలి సభ్యులు శ్రీ షేక్ హుస్సేన్ సత్యాగ్ని, సంస్థ అధ్యక్షులు,
ఇంటర్ విద్యామండలి విశ్రాంత సంయుక్త కార్యదర్శి శ్రీ అలపర్తి పిచ్చయ్య చౌదరి,
రచయిత శ్రీ నూకా రాంప్రసాదరెడ్డి, జిల్లా రచయితల సంఘ అధ్యక్షులు శ్రీ ఎ.రాజేంద్రప్రసాద్ తదితరులు



వెన్నెల సాహితీ సాంస్కృతిక సంస్థ 12వ వార్షికోత్సవసభలో నవవిధ రంగాల ప్రముఖులను సత్కరించి నవరత్న పురస్కారాన్ని అందించిన వ్యవస్థాపక అధ్యక్షులు డా॥ చిట్టూరి గోపీచంద్



వరంగల్ జిల్లా పరకాల గ్రంథాలయ అధికారి శ్రీ ముదిగంటి వెంకటరెడ్డి పదవీవిరమణ సందర్భంగా శ్రీ వెంకటరెడ్డి దంపతులను సన్మానిస్తున్న కేంద్ర సాహిత్య అకాడమి అవార్డుగ్రహీత డా॥ అంపశయ్య నవీన్. చిత్రంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.పద్మజ, తెలుగు భాషోద్యమ సమాఖ్య జిల్లా సహ అధ్యక్షులు శ్రీ కామిడి సతీష్‌రెడ్డి, ఉపాధ్యక్షులు శ్రీ కాటూరి శ్రీధరాచార్య, సాహితీ మిత్రమండలి అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి డా॥ పల్లేరు వీరస్వామి, శ్రీ మేరుగు శ్రీనివాస్, శ్రీ జయపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు

విజయనగరంలో గురజాడ 150వ జయంతి సందర్భంగా జరిగిన కవి సమ్మేళనంలో కవి శ్రీ పి.అనంతరావును సన్మానిస్తున్న చాగంటి సోమయాజులు కుమార్తె చాగంటి తులసి మరియు ప్రభుత్వ అధికారులు



మచిలీపట్నం ఆంధ్ర సారస్వత సమితి ఆధ్వర్యంలో జరిగిన సాహిత్యసభలో ప్రసంగిస్తున్న సమితి అధ్యక్షులు శ్రీ కొట్టి రామారావు. చిత్రంలో పి.నాగలక్ష్మి, శ్రీ గుత్తికొండ, డా॥ ధన్వంతరి, అధ్యక్షులు డా॥ రావిరంగారావు, శ్రీయుతులు ఎస్.వెంకటేశ్వరరావు, ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి, పి.ఓంనమశ్శివయ్య, ఎల్.బాలాజీ, ఎమ్.శివాక్, తూములూరి రాజేంద్రప్రసాద్ ఉన్నారు

కడప, సి.పి.బ్రౌన్ సమావేశమందిరంలో గాంధీజయంతి సందర్భంగా సాహిత్యంలో విశిష్టసేవలందించిన శ్రీ పుత్త పుల్లారెడ్డిని సత్కరిస్తున్న యోగివేమన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అర్జుల రామచంద్రారెడ్డి, జాతీయ కబీరు పురస్కారగ్రహీత రాజరత్నం ఐజాక్, సంస్థ అధ్యక్షులు అలపర్తి పిచ్చయ్యచౌదరి తదితరులు



మహాకవి గురజాడ 150వ జయంతి సందర్భంగా పశ్చిమగోదావరిజిల్లా గణపవరంలో రచయిత తెన్నేటి రచించిన 'తేనెలూరు తెలుగు మనది' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో శ్రీయుతులు టి.భాస్కరరావు, ఆర్.వి.ఎస్.రాజా, మన్నె సత్యనారాయణ, కె.గాంధీ, వి.రామారావు, కె.బదరీనాథ్, ఎన్.రాంపండు తదితరులు పాల్గొన్నారు

చోటు

అమ్మ ఒడి అద్భుతమయిన చోటు. అమ్మ ఒడిలో నుండి బడిలోకి మారేటప్పుడు అక్కడ మనకో చోటు. పరీక్షల్లో ఓ చోటు, విద్యార్హతలను బట్టి సమాజంలో ఓ చోటు. పల్లెటూరు వెళ్ళాలన్నా, పల్లెటూరు నుండి రావాలన్నా బస్సులో తుండుగుడ్డో, సంచీయో కిటికీలోనుండి వేసి చోటు సంపాదిస్తాం.

"భగవంతుడు సర్వవ్యాపి కదా! అన్నిచోట్లా వున్నాడని, హృదయంలోనే వున్నాడని చెప్పడాన్ని మీరెలా సమర్థిస్తారు" అని భగవాన్ శ్రీ రమణ మహర్షిని ఒకరు అడిగారు.

దానికి భగవాన్ ఇలా చెప్పారు

"నీవు నీ శరీరంలో వున్నానని చెపుతున్నట్లే భగవంతుడు నీ హృదయంలో వున్నాడంటాం. ఈ హృదయం అనేది ఒక చోటు కాదు.

తమ శరీరాలే తామని నమ్మేవారికి ఈశ్వరుడిక్కడ వున్నాడని చెప్పేందుకు ఓ చోటు కావాలి. నిజానికి మనంకానీ, ఈశ్వరుడు కానీ ఏ ప్రదేశాన్ని ఆక్రమించం"

నిజమే కదా! అంతటా, అన్నిచోట్లా నిండి వున్నవారు ఒకే చోటుకు ఎలా పరిమితం అవుతారు.అయితే మహాత్ములు ఒకే చోటుకు పరిమితమై వున్నట్టు కనిపిస్తూ, అన్నిచోట్లా అపరిమితంగా నిండిపోతారు. కారణం - వారు లేని చోటు ఏదీలేదు కాబట్టి.

భగవాన్ శ్రీ రమణమహర్షి, శ్రీరామకృష్ణ పరమహంస, శ్రీ షిర్డీసాయి, స్వామి శివానంద, శ్రీ పూర్ణానందస్వామి- ఇలాంటివారంతా అందుకు ఉదాహరణలు.

ఆధ్యాత్మికంగా ప్రారంభంలో వున్నప్పుడు ఒకే ప్రదేశంలో, ముఖ్యంగా ఒకేచోట కూర్చుని ధ్యానంచేయడం సత్ఫలితాలు ఇస్తుంది.

సమయపాలన - ప్రతిరోజు ఒకే టైముకు చేయడం మరింత మేలుచేస్తుంది. ఆ సమయం అయ్యేసరికి, ఆ చోట్లో కూచుంటే మనసు తొందరగా ధ్యానమార్గానికి వస్తుంది.

అభ్యాసం కూసువిద్య - ఇలా చేయగా చేయగా ధ్యానం సులువవుతుంది. మనసు వశమవుతుంది. ఎలా అంటే - మొదటిదశలో మీరు ధ్యానంలో వుండగా, చిన్న అంతరాయం కలిగింది. అది అధిగమించడానికి వేడిగా పాలు తాగాలనుకున్నారు.

సేవకులనో, బంధుజనాన్నో అడిగారు. తెచ్చి ఇచ్చారు. రెండవ దశలో పాలు తాగాలనుకున్నప్పుడు, మీరు అడగకుండానే మీకు అవి లభించాయి. మూడవదశలో పాలు తాగాలనుకున్నప్పుడు మీరు అడగలేదు. పాలు మీకు ఎవరూ తెచ్చి ఇవ్వనూలేదు. కానీ పాలల్లో ఉండే శక్తి తనంతతానుగా మీలో వచ్చి చేరింది.

ఆశ్చర్యంగా ఉండవచ్చు కానీ ఇది నిజం. అందుకే 'సంత్' సత్పురుషులు గంటలకొద్దీ నామసంకీర్తనలో పాల్గొన్నా, ప్రవచన్ చెప్పినా వారికి ఏ అలసటా ఉండదు.

పైగా నామం అత్యంత శక్తివంతమైనది కాబట్టి శక్తినిస్తుంది. ఒకే చోటులో నిరంతరం వున్నా, ఆ చోటుకు ప్రాముఖ్యం వేరేవారు ఇవ్వచ్చు. మనం ఇవ్వకూడదు.

స్వామి శ్రీ సుందరచైతన్యానంద ప్రారంభ దశలో ఊరి పొలిమేరల్లో బండరాతిపై కూర్చుని ధ్యానం చేసేవారట. ఓ రోజు ఆయన అక్కడకు

వెళ్ళేసరికి వేరే వ్యక్తి అదేచోట కూర్చుని ఉన్నా డట. అతను వెడతాడేమో అని స్వామి చూశారు. అతను వెళ్ళలేదు.

స్వామి మరోచోట కూర్చుని ధ్యానస్థు లయ్యారు. ధ్యానం పూర్తిఅయి లేచేసరికి, ఆ

వ్యక్తి లేడు.కానీ బండరాయికింద నుండి త్రాచు పాము రావడం చూశారు.

చోటు మారింది కానీ, ధ్యానం మారలేదు. ఈ విషయం స్వామి శ్రీ సుందర చైతన్యానందే తమ ప్రవచనంలో చెప్పారు.

మా గురుదేవులు శ్రీ షిర్డీసాయి శరీరంతో ఉన్నప్పుడు ఆయన్ని ద్వారకామాయిలో ఎందరో వచ్చి దర్శనం చేసుకునేవారు.

ఓ వ్యక్తి క్రమం తప్పకుండా వచ్చి, ఓ చోటులో కూర్చుని బాబానే చూస్తూ ఉండేవాడు.

ఓ రోజు ఆ వ్యక్తి వచ్చేసమయానికి ఓ కుర్రా డొచ్చి అక్కడ కూర్చున్నాడు. వ్యక్తి ఆ కుర్రాడ్నిలేచి మరోచోటులో కూర్చోమన్నాడు. అందుకు కారణం అడిగారు బాబాగారు.

"అది నేను రోజూ కూర్చునే చోటు" చెప్పాడు వ్యక్తి.

"అలా అని అక్కడ రాసి ఉందా- మరో చోటులో కూర్చుని నన్ను చూడు. నీకు ఇంకా బాగా కనిపి స్తాను" అన్నారు బాబాగారు.

ఆ వ్యక్తి అలాగే చేశాడు.

మరో రోజు -

నానావలి అనే భక్తుడు ద్వారకా మాయికి వచ్చి బాబాగార్ని గద్దె మీంచి లెమ్మన్నాడు.

మరోమాట చెప్పకుండా లేచారు బాబాగారు. నానావలి కాసేపు గద్దె మీద, బాబాగారు కూర్చునే చోట కూర్చున్నాడు. కాసేపు కూర్చుని గద్దెదిగి, బాబాగారికి నమస్కరించి వెళ్ళిపోయాడు.

బాబాగారు తన చోటులోంచి లేవమన్నప్పుడు బాధపడలేదు. మళ్ళీ తిరిగి కూర్చోమన్నప్పుడు సంతోషించ లేదు. ఇతరులకు చెప్పడమే కాదు, చెప్పింది చేసి చూపిస్తారు. అక్షరాలా ఆచరిస్తారు.

అందుకే వాళ్ళు మహాత్ములు, మనకు ఆత్మీయులు.

సాయిచరణదీప్
saicharanadeep9@gmail.com

మాసఫలం

నవంబరు 2012

మేషం

అశ్వని, భరణి, కృత్తిక 1వ పా.

గ్రహాలన్నీ ప్రతికూలములు ఇవ్వగల స్థితిలో ఉన్నాయి. జాతక పరిశీలనలలో ప్రతికూలములనిచ్చే దశాంతర్దశలైతే మరింత జాగ్రత్తలు పాటించాలి. పూర్వార్జితములను కదపవలసివుంటుంది. సమర్థత ఉండి అసమర్థులుగా వ్యవహరించడం ఉంటాయి. చిన్న నిర్ణయమైనా పెద్ద జాగ్రత్తలు అవసరం.

ఈ నవంబరు, డిశంబరు, జనవరిలలో ఒంటరిగా ఉండడానికి ప్రయత్నించక కుటుంబవ్యక్తులతోను, ఆత్మీయవర్గంతోను మీ మనోభావాలు పంచుకోవడం, చిన్నపనైనా సంప్రదింపులతో చెప్పడం మేలు. ఎంతో కొంత కొత్తదనం ఉండేటట్లుగా మీ పరిసరాలను మార్పు చేసుకోవాలి.

నూతన పనులను తలపెట్టేటప్పుడు నష్టపోయినా ఇబ్బందులు ఏర్పరచనవి మాత్రమే తలపెట్టండి. విద్యార్థులకు అనుకూలసమయమే, ప్రతికూల స్నేహవర్గాలను గుర్తించి దూరంగా పెట్టాలి.

ఉద్యోగ-వ్యాపారాలలో అడ్డదారిలో సంపాదించాలనే ఊహలకు దూరంగా ఉండండి. వీరు నిత్యం ఉషఃకాలంలో నవగ్రహారాధనలు చేసుకుంటూ శివార్చన దర్శనాలకు ప్రాధాన్యతనీయడం మేలు.

అశ్విని : అనుకూల దినములు-1, 2,4,9,16,23, 24,29. ప్రతికూల దినములు- 5,10,14,20,22.

భరణి : అనుకూల దినములు-1, 5, 9, 10, 16, 18, 24, 25, 30. ప్రతికూల దినములు-6, 11, 14, 15, 21, 23.

కృత్తిక : అనుకూల దినములు-1, 2, 4, 9, 10, 16, 18, 19, 23, 29, 30. ప్రతికూల దినములు-7, 12, 15, 22, 24. ◆

వృషభం

కృత్తిక 2, 3, 4 పా, రోహిణి, మృగశిర 1,2పా.

ఈ మాసంలో 9న కుజుని రాశి మార్పు, 15న రవి మార్పులచే 1 నుండి 10 వరకు ఆరోగ్యం అనుకూలించడం, బుద్ధివికాసంవల్ల కఠినమైన పనులను కూడా తేలికగా నిర్వహించుకుంటారు.

ఈ నెల 10వ తేదీ నుండి 16వ తేదీ వరకు ఆలోచనలు కలసిరాకపోవడం, 16వ తేదీనుండి అనారోగ్యం, దూరప్రయాణాలు చేయవలసిరావడం, హాస్పిటల్స్, రక్షకభట సమావేశాలు, వ్యసనాలకు ప్రాధాన్యతనీయడం ఉంటాయి.

గృహనిర్మాణాలు చేపట్టేటపుడు ప్రభుత్వ అనుమతులతోనే ప్రారంభించండి. వీసా ప్రయత్నాలను, ప్రభుత్వ పనులను అగ్రిమెంట్స్, రెన్యువల్స్ ప్రథమార్థంలో పూర్తి అయ్యేటట్లు చూసుకోండి.

ఇన్స్యూరెన్స్ ప్రీమియములకు, పన్నుల చెల్లింపులకు ప్రాధాన్యతను ఇవ్వాలి. అవివాహితులు నిశ్చితార్థముల దిశలో మంచి ఆలోచనలకు ప్రాధాన్యతనివ్వాలి. తొందరపాటు నిర్ణయాలుంటాయి. మెలకువలవసరం. వీరు సూర్య, సుబ్రహ్మణ్యారాధనలు నిత్యం నిర్వహించుకోవడం మేలు.

కృత్తిక : అనుకూల దినములు-1, 2, 4, 9, 10, 18, 19, 23, 29, 30. ప్రతికూల దినములు-7, 12, 15, 16, 17, 22, 24.

రోహిణి : అనుకూల దినములు-1, 2, 9, 10, 18, 19, 24, 29, 30. ప్రతికూలదినములు-8, 13, 16, 17, 23, 25.

మృగశిర : అనుకూల దినములు-1, 2, 4, 10, 18, 21, 23, 25, 29, 30. ప్రతికూల దినములు-9, 14, 16, 17, 24, 26, 27. ◆



మిథునం

మృగశిర 3, 4 పా, ఆరుద్ర, పునర్వసు 1, 2, 3 పా.

వీరికి ఈ మాసంలో గ్రహచారాలు ప్రయోజనాలు ఇచ్చేవిగా సాగుతున్నాయి. కుటుంబంలో మైత్రీ భావాలుండి కలిసికట్టుగా వ్యవహరించుకుంటారు. అవసరాలు తీరే విధంగా ఆదాయాలుంటాయి. ఋణగ్రహీతలు ఋణవిముక్తికై ప్రయత్నించతగిన సమయం. పూర్వార్ధంలో చేపట్టిన పనులు, ఉత్తరార్ధంలో పూర్తిచేసుకోగలుగుతారు.

బంధువర్గంయొక్క, తోటి ఉద్యోగులచేతను సహకారములు తీసుకుంటారు. 3-4 వారాలలో విందులు నిర్వహించడం, అదనపు బాధ్యతలను స్వీకరించడం, మానసికంగా సంతృప్తిని పొందడం, ఇతరులకు ఉపకరించడం ఉంటాయి. వివాహ ప్రయత్నాలు చేసేవారికి తొలుత శ్రమగా తోచినా ఒక కొలిక్కిరావడం,కొందరికి పీటలవరకు సాగడం వంటి శుభములు జరుగుతాయి.

విద్యార్థులు పునస్సమీక్షలతో ప్రయత్నించుకుంటూ 11 సార్లు నమకపారాయణ చేయించుకోవడం మేలు. పెంపుడు జంతువులచేత, వాహనాలచేత చిన్నపాటి ఇబ్బందులుంటాయి. జాగ్రత్తలు అవసరం. నిరుద్యోగులకు మంచి అవకాశాలు సిద్ధిస్తాయి. ఉద్యోగమార్పులు ప్రతికూలిస్తాయి.

వ్యాపార కర్షక వర్గీయులు ఇతోధిక లాభములు పొందుతారు. నూతనమైనవి చేపడతారు. వీరు మరిన్ని ప్రయోజనాలు పొందడానికి అశ్వత్థ ప్రదక్షిణలు,రుద్రకవచపారాయణ చేసుకోవడం మేలు.

మృగశిర : అనుకూల దినములు-1, 2, 4, 10, 16, 21, 23, 25, 29, 30. ప్రతికూల దినములు-9, 14, 17, 18, 19, 24, 26, 27.

ఆరుద్ర : అనుకూల దినములు-2, 3, 4, 9, 11, 21, 22, 24, 29, 30. ప్రతికూల దినములు-10, 14, 18, 19, 25, 28.

పునర్వసు : అనుకూల దినములు-4, 8, 10,12, 16, 21, 22, 23, 25, 30. ప్రతికూల దినములు-1, 2, 11, 15, 18, 19, 26, 29. ◆

కర్కాటకం

పునర్వసు 4వ పా, పుష్యమి, ఆశ్లేష.

వీరికి 15 వరకు అర్ధాష్టంలో శని-రవిలు ప్రతికూల ఫలితాలు ఇచ్చేవారు అవడంవల్ల ప్రయత్న కార్యములన్నిటికీ పట్టుదల అవసరం. అన్నిటా గోప్యములు, జాగ్రత్త అవసరం. బంధువర్గంయొక్క ఈర్ష్యాద్వేషాలు పొందడం వంటివి జరిగే అవకాశాలు ఉన్నాయి. 10వ తేదీనుండి క్రమంగా అనుకూలతలు పొందుతారు.

భూమి, గృహం, ప్లాట్స్ కొనుగోలు చేసే ప్రయత్నాలకు అనుకూల సమయం. కర్షకులకు ప్రయోజనాలు ఉంటాయి. నిరుద్యోగుల ప్రయత్నాలు అనుకూలిస్తాయి. ఇతరులను నమ్మి ధనం, విలువయిన వస్తువులు ఇవ్వడం మంచిదికాదు.

అవివాహితులలో కొందరికి నిశ్చితార్థములు, కొందరికి వివాహాలు పూర్తవడం జరుగుతుంది. విద్యార్థులు, నిరుద్యోగులు ప్రలోభాలకు లోనవ్వకుండా ప్రయత్నించుకుంటే శుభాలు పొందుతారు. వృత్తి-ఉద్యోగ మార్పులు అనుకూలించవు.

సామాన్య అనారోగ్యం, మానసికభీతి ఉంటున్నా నిత్యకృత్య వ్యవహారాలను ఇబ్బందిపెట్టవు. భాగస్వామిక ప్రయోజనాలుంటాయి. స్త్రీలకు ప్రభుత్వ తరహా ప్రయోజనాలు చేకూరుతాయి. విలువైన వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

నూతన విద్యావకాశాలు లభిస్తాయి. వీరు అర్ధాష్టమ శనికై కాలభైరవాష్టక పారాయణలు శివాలయ దర్శనాలు చేసుకోవడం మేలు.

పునర్వసు : అనుకూల దినములు-4, 8, 10, 12, 16, 18, 23, 25, 30. ప్రతికూల దినములు-1, 2, 11, 15, 20, 21, 22, 26, 29.

పుష్యమి : అనుకూల దినములు-4, 9, 11, 19, 23, 24, 29. ప్రతికూల దినములు-3, 12, 16, 20, 21, 22, 28, 30.

ఆశ్లేష : అనుకూల దినములు-2, 8, 10, 16, 19, 23, 24, 25, 30. ప్రతికూల దినములు-1, 4, 13, 17, 20, 21, 22, 29. ◆

సింహం

మఖ, పూర్వఫల్గుని, ఉత్తరఫల్గుని 1వ పా.

ఈ మాసంలో గ్రహసంచారాలు మిశ్రమంగా ఉపకరిస్తాయి. వృత్తి-ఉద్యోగాలు కొద్ది మందగమనంతో సాగుతాయి. అనుకోని విధంగా ఖర్చులు ఆదాయాలను మించుతాయి. మాటపట్టింపులకు దూరంగా ఉండండి. అధికారులు, పెద్దలు ఆగ్రహిస్తారు.

తలపెట్టిన పనులకు కాలాతీతములు జరుగుతున్నా పూర్తిచేసుకుంటారు. ఎదుటివారి తీరును అంచనావేయకుండా మీ ధోరణిలో మీరు సాగి కష్ట-నష్టాలను చూస్తారు.

1వ తేదీనుండి 10వ తేదీవరకు మానసిక భయాలకు గురికావడం కుటుంబవ్యక్తుల తోడ్పాటు, సోదరులతో వాగ్వాదాలు, ప్రయాణాలు శ్రమతో సాగడం, ఆర్థిక సమానత్వములు ఉంటాయి.

11వ తేదీ నుండి 19వ తేదీ వరకు అనారోగ్యాలు, సంతాన విద్యావిషయక ఆలోచనలు,వృత్తి, ఉద్యోగాలలో పొరపాట్లు, సర్దుబాట్లు, మనోచింతనలు, ఆర్థికంగా తప్పనిసరి అప్పులివ్వడం ఉంటాయి.

20వ తేదీనుండి 30వ తేదీవరకు మానసిక సంతృప్తి, వృత్తి, ఉద్యోగ, వ్యవహారాలలో బిజీగా ఉండటం, కించిత్ ధనలాభాలు, విద్యావ్యాసంగాల పట్ల శ్రద్ధ వహించడం. మాసమంతా స్పెక్యులేషన్లకు, సాహసకార్యాలకు దూరంగావుండండి.అర్హతలను మించి ఏర్పడే ఆర్థిక లబ్దిలుంటాయి. గౌరవాలు సభాపూజితములు సిద్దిస్తాయి.వీరు అధిక ప్రయోజనాలకు దేవాతారాధనలు చేసుకోవడం మేలు.

మఖ : అనుకూల దినములు-1, 2, 4, 9, 16, 23, 24, 29. ప్రతికూల దినములు-3, 5, 14, 18, 22, 30.

పూర్వఫల్గుని : అనుకూల దినములు-1, 5, 9, 10, 16, 18, 24, 25, 30. ప్రతికూల దినములు-4, 6, 14, 19, 23.

ఉత్తరఫల్గుని : అనుకూల దినములు-1, 2, 4, 9, 10, 16, 18, 19, 23, 29, 30. ప్రతికూల దినములు-5, 7, 15, 21, 24. ◆

కన్య

ఉత్తరఫల్గుని 2,3,4పా, హస్త, చిత్త 1, 2 పా.

మాస పూర్వార్థం, ఉత్తరార్థం కూడా ప్రయోజనాలు సిద్ధిస్తాయి.కుటుంబంలో ఉత్సాహములు మీ పట్టుదలలకు మరింత ఊతమిస్తాయి. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి.

కీలక బాధ్యతలను స్వీకరించడం, సాటివారితో గుర్తింపును పొందడంవుంటాయి.స్వల్ప అనారోగ్యం, కొన్ని నిర్ణయాలలో ఫలితాలందు తాత్సారములు ఎదుర్కోవలసివస్తుంది. మధ్యవర్తిత్వాలు నిర్వహించి గుర్తింపు పొందుతారు.

విద్యార్థుల వ్యాసంగాలకు,నిరుద్యోగుల ఉపాధులకు అనువైన సమయం. ప్రయాణాలు ప్రయోజనాలు ఇచ్చేవైనా 10వ తేదీ జాగ్రత్తలు పాటించాలి. నూతన పొదుపు పథకాలను స్వీకరిస్తారు. వ్యవసాయ, ఉత్పత్తి రంగాలలోనివారికి అనుకున్న విధంగా జోరుగా ఉండి లాభాలు పొందుతారు.

స్పెక్యులేషన్లలో నియంత్రణతో కూడిన లాభాపేక్షతలు కలవారికి మేలు జరుగుతుంది. మాతాపితరుల నుండి రావలసినవి పొందడం మాసాంతంలో దుర్వార్తలు వినడం ఉంటాయి.

ఋణాలకై చెల్లుచీటికీ స్వల్పప్రయత్నాలు అవసరం. ఈ నవంబరు, డిశంబరులలో ఏలినాటి శని ప్రభావం తక్కువగా ఉంటుంది.

పెద్ద పనులకు ప్రయోజనాలకు ప్రయత్నించదగ్గ సమయం. మరింత ప్రయోజనాలు పొందడానికి శివారాధనలు ఉపకరిస్తాయి.

ఉత్తరఫల్గుని : అనుకూల దినములు- 1, 2, 4, 9, 10, 18, 19, 23, 29, 30. ప్రతికూల దినములు- 5, 7, 15, 20, 24, 25, 26, 27.

హస్త : అనుకూల దినములు-1, 2, 9, 10, 18, 19, 24, 29, 30. ప్రతికూల దినములు-6, 8, 16, 21, 25, 26, 27.

చిత్త : అనుకూల దినములు-1, 2, 4, 10, 16, 18, 21, 23, 29, 30. ప్రతికూల దినములు-7, 9, 17, 22, 25, 26, 27. ◆

తుల

చిత్త 3, 4 పా, స్వాతి, విశాఖ 1, 2, 3 పా.

గ్రహసంచారములు ప్రతికూలంగా ఉన్నాయి. వ్యక్తిగత జాతక పరిశీలనలు తప్పనిసరి చేయడం మంచిది. ఆదాయాలు ఇచ్చే మార్గాలకు ఆటంకాలు ఉండటం, తండ్రి తత్సంబంధ వ్యక్తులరీత్యా శ్రమలుంటాయి. చేపట్టిన ప్రయత్నాలకు దిశానిర్దేశములు లేకుండా సాగుతాయి.

వృత్తి, వ్యాపారాలలో నూతనమైనవి తలపెట్టక అనుభవం ఉన్నవాటినే చేపట్టండి. కుటుంబవ్యక్తుల వల్ల విమర్శలు, ఖర్చులు ఎక్కువ ఉంటాయి.

మాస పూర్వార్ధంలో ఆరోగ్య విషయమై ఔషధ సేవలు, శస్త్రచికిత్సలు, నిరాశానిస్పృహలకు లోనవడం వంటివి ఉండి, మాస ఉత్తరార్ధంలో కొంత అనుకూల ఫలితాలు పొందుతారు.

వీరు తీర్థయాత్రలు చేపట్టడం, నూతన ప్రదేశాలకు వెళ్ళడంవంటి వాటివల్ల ప్రయోజనాలు పొందుతారు. వారాంతాలలో విందులకు, విహారాలకు, అన్నదానాలు నిర్వహించడానికి ప్రాధాన్యతనీయడం మేలు. వివాహ, ఉద్యోగ ప్రయత్నాలు చురుకుగా సాగుచున్నా స్థిరీకరణలకు కొంత అధికమైన సమయం పడుతుంది. రాజకీయ వ్యక్తులకు, వృత్తులు నిర్వహించేవారికి జనాకర్షణలు తగ్గడం, పెట్టుబడులు ఎక్కువవడం వంటివి ఉంటాయి.

మేలైన ప్రయోజనాలు పొందడానికి రుద్రాభిషేకమును నిర్వహింపచేసుకొని గజేంద్ర మోక్ష పారాయణను చేసుకోవడం మేలు.

చిత్త : అనుకూల దినములు-1, 2, 4, 10, 11, 16, 18, 21, 23, 25, 29, 30. ప్రతికూల దినములు-7, 9, 17, 22, 26, 27.

స్వాతి : అనుకూల దినములు-2, 3, 4, 9, 11, 21, 22, 24, 29, 30. ప్రతికూల దినములు-8, 10, 18, 23, 28.

విశాఖ : అనుకూల దినములు-4, 8, 10, 12, 16, 18, 21, 22, 23, 25. ప్రతికూల దినములు-2, 9, 11, 19, 24, 29. ◆

వృశ్చికం



విశాఖ 4వ పా, అనూరాధ, జ్యేష్ఠ.

పూర్వార్ధంలో జన్మంలో కుజరాహువులు, ఉత్తరార్ధంలో రవి రాహువులు సంచారం. ఏలినాటి శని ప్రభావం ప్రధాన ఫలితాలను నిర్దేశిస్తాయి. మనోభీతి, శారీరక గాయాలు, ఆదాయాలు బాగున్నా వృథా ఖర్చులుంటాయి.

వృత్తి, ఉద్యోగాలలో ఎదగాలనే ప్రయత్నాలలో దుబారాలకు, తప్పులు చేయడానికి అవకాశాలు ఉన్నాయి. మీ సలహాలు, సూచనలుమాత్రం ఇతరులకు ఉపకరిస్తాయి. మీరు అనుకున్న పనులు మాత్రం నత్తనడకన సాగుతాయి.

ఇంటి మార్పులు, చిన్న చిన్న ఫంక్షన్లు నిర్వహిస్తారు. మొక్కుబడిగా సాగినా ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఎక్కువ సమయం కేటాయిస్తారు.

కుటుంబ సభ్యులకై తలపెట్టిన శుభాలను బంధువర్గ సహాయాలతో పూర్తిచేసుకుంటారు. నూతన వ్యాపార ప్రయత్నాలకు, సాహసమైన పనులకు దూరంగా ఉండండి.

విద్యార్థులు, నిరుద్యోగులు ప్రయత్నలోపాలు ఉండకుండా వ్యవహరించుకోవాలి. వృత్తి, ఉద్యోగ మార్పులు కావాలనుకునేవారికి ప్రతికూల పరిస్థితులు ఉంటాయి. తప్పనిసరి అయితేనే ప్రయాణాలు సాగించండి. భాగస్వామిక వ్యాపారాలు నిర్వహించేవారు నూతనవ్యాపారాలు ప్రారంభిస్తారు.

వీరు ప్రతిరోజా సూర్య-సుబ్రహ్మణ్యారాధనలు చేసుకోవడం మేలు.

విశాఖ : అనుకూల దినములు-8, 10, 12, 16, 18, 21, 22, 23, 25. ప్రతికూల దినములు-2, 3, 4, 5, 9, 11, 19, 24, 29, 30.

అనూరాధ: అనుకూల దినములు-1, 9, 11, 19, 21, 22, 23, 24, 29. ప్రతికూల దినములు-3, 4, 5, 10, 12, 20, 25, 30.

జ్యేష్ఠ : అనుకూల దినములు-2, 8, 10, 16, 19, 23, 24, 25. ప్రతికూల దినములు-3, 4, 5, 11, 13, 21, 26, 30. ◆



ధనుస్సు

మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పా.

ఈ మాసంలో గ్రహ సంచారాలు మిశ్రమంగాఉన్నాయి. చిన్న పనికైనా వ్యక్తిగతమైన శ్రద్ధాసక్తులు అవసరం. పూర్వార్ధంలో ప్రయత్నంమీద పనులు జరిగినా, బహుళంలో అనారోగ్యాలు వుండి చేసిన పనులే తిరిగి చేయవలసివుంటుంది. ప్రతి చిన్న విషయానికీ అధికశ్రమ చెందడం జరుగుతుంటుంది.

మాసమంతా అవసరాలకు సరిపడే విధంగా ఆదాయాలుంటాయి. భ్రాతృవర్గంవల్ల కొన్ని సమస్యలు ఉంటాయి. వాహన యంత్రాదుల ఉపయోగాలలో మెలకువ వహించండి.

నూతన వ్యాపారపు ఒప్పందాలలో అగ్రిమెంట్ల రెన్యువల్స్‌లో ఒకటికి రెండుసార్లు తప్పనిసరి పరిశీలనలు అవసరం. కుటుంబవ్యక్తుల తీరుతెన్నులు ఆనందాన్నిస్తాయి.కుటుంబసౌఖ్యములుంటాయి.

వ్యవసాయదారులకు, కార్మికరంగంవారికి కొత్తదనం లేక రోజులు మందంగా సాగుతాయి. ప్రణాళికాబద్ధంగా చేపట్టిన పనులలో కూడా పొరపాట్లు జరిగే అవకాశం ఉంది. విద్యార్థులు టార్గెట్స్ ఏర్పరచుకుని ఆ దిశగా సాగడం ఉపకరిస్తుంది.

గతంలో నిలచిపోయిన ఆస్తిపంపకాదులు, గతించాయనుకున్న పొరపాట్లు తిరిగి తెరపైకి వచ్చే సూచనలున్నాయి. మీవి కాని వ్యవహారాలలో చూసీ చూడనట్లు ఊరకుండడమే ఉపకరిస్తుంది. వీరు మరిన్ని ప్రయోజనాలకు విష్ణుసహస్రమును, లక్ష్మీ అష్టోత్తరమును పారాయణ చేసుకోవడం మేలు.

మూల : అనుకూల దినములు-1, 2, 4, 9, 16, 23, 24, 29. ప్రతికూల దినములు-5, 6, 7, 12, 14, 22, 28.

పూర్వాషాఢ : అనుకూల దినములు-5, 9, 10, 16, 18, 24, 25, 30. ప్రతికూల దినములు-1, 6, 7, 13, 14, 23, 29.

ఉత్తరాషాఢ : అనుకూల దినములు-1, 4, 9, 10, 16, 18, 19, 23, 29. ప్రతికూల దినములు-3, 6, 7, 15, 24, 30. ◆



మకరం

ఉత్తరాషాఢ 2,3,4 పా, శ్రవణం,ధనిష్ఠ 1,2పా.

ఈ రాశివారికి గ్రహ సంచారాలు అనుకూలముగా ఉన్నాయి. ఆదాయ, వ్యయాలు మీ అంచనాలకు తగినట్లుగా ఉంటాయి. సుఖసౌఖ్యాలకు, కుటుంబవ్యక్తులకు ఆభరణాలకు ఖర్చులుచేస్తారు. ఆరోగ్యపరంగా బాగానే ఉంటుంది.

ప్రభుత్వ పనులు, ఋణములు తేలికగా ఏర్పడతాయి. కీర్తి, గౌరవం, ధనం కలసివస్తాయి. కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. చేసే వృత్తి, ఉద్యోగాలపట్ల నైరాశ్యంగా ఉంటూ తప్పనిసరి విధానాలుగా వ్యవహరించుకుంటారు.

బహుళంలో సాధారణ స్థితులు సిద్ధిస్తాయి. భూమి, గృహం, ఆస్తిపంపకాదులు నిలచివుంటాయి. వ్యాపార, వ్యవహారాలందు మీదే జయం. నూతన కాంట్రాక్టులు పొందడం,గతంలో రావలసినవి వసూలవడం, సామాజికంగా విలువలు పెరగడం జరుగుతాయి. సంతాన ఆరోగ్య, విద్య, ఉద్యోగాలందు ఆవేదనలకు గురి అయ్యే సూచనలున్నాయి.

వివాహ ప్రయత్నాలు చేసేవారు కొందరికి నిశ్చితార్థములు,కొందరికి వివాహాలు జరుగుతాయి.

విదేశీ నివాసాలకు, ప్రయాణాలకు ప్రయత్నించే వారికి అనుకూలం. జీవిత భాగస్వామి సహకారాలు కీలక సమయాల్లో మీకండగా నిలుస్తాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారాలు నిర్వహించేవారికి అభ్యంతరాలు ఉంటాయి. వీరు సుబ్రహ్మణ్యారాధనను చేసుకోవడంవలన మేలైన ఫలితాలు పొందుతారు.

ఉత్తరాషాఢ : అనుకూల దినములు-1, 2, 10, 16, 18, 19, 23, 29, 30. ప్రతికూల దినములు-4, 7, 8, 9, 14, 15, 24.

శ్రవణం : అనుకూల దినములు-1, 2, 9, 10, 18, 19, 24, 29, 30. ప్రతికూల దినములు-4, 8, 9, 14, 16, 25.

ధనిష్ఠ : అనుకూల దినములు-1, 2, 4, 10, 16, 18, 21, 23, 25, 29, 30. ప్రతికూల దినములు-5, 8, 9, 15, 17, 26. ◆



కుంభం

ధనిష్ఠ 3, 4 పా, శతతార, పూర్వాభాద్ర 1,2,3 పా.

వీరికి ఈ మాసంలో గ్రహ సంచారాలు మిశ్రమంగా ఉన్నాయి. ఖర్చులు కనబడుచుండడంవల్ల ఆర్థిక పర్దుబాట్లు అవసరమవుతుంది. వృత్తి, ఉద్యోగాలలో సవాళ్ళను ఎదుర్కొంటారు.ఇతరులకు మాట ఇచ్చే ముందు జాగ్రత్త వహించాలి.

ప్రయత్నాలను గోప్యంగా నిర్వహించుకోండి. కుటుంబవ్యక్తుల కారణంగా మనోవేదనలు పొంది ఒంటరితనాన్ని కోరుకొనే సూచనలున్నాయి.

ఉద్యోగ, వ్యాపారవర్గంవారు పట్టుదలలతో వ్యవహరించుకోవడంవలన గుర్తింపు పొందడమేకాక వృద్ధిని పొందుతారు. గృహనిర్మాణాదులకు కావలసిన ప్లానులు ఆమోదం పొందడానికి, వీసా ప్రయత్నాలు ఫలించడానికి అవకాశాలు ఉన్నాయి.

మధ్యవర్తిత్వాలకు, పెద్ద తరహా పాత్రలకు దూరంగా ఉండడమే మేలు. విద్యార్థులు, నిరుద్యోగులు కృషికి, అర్హతకు తగిన ఫలితాలు పొందుతారు. స్పెక్యులేషన్లు, సాహసమైన పనులు మీ శక్తికి తగినవిగా ఉండేటట్లు చూసుకోండి. నూతన వాహనసౌఖ్యాలు పొందుతారు.

మాస ద్వితీయార్ధంలో మరిన్ని అనుకూల ఫలితాలను పొందుతారు.విద్యార్థులు వ్యాసంగాలపైనే దృష్టిని ఉంచుకోవడం మేలు.

బంధుమిత్రులతో ఉపకార, ప్రత్యుపకారాలు ఉంటాయి. విలువైన బహుమతులు పొందగలరు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు.

ధనిష్ఠ : అనుకూల దినములు-1, 2, 4, 10, 16, 18, 21, 23, 25, 29, 30. ప్రతికూల దినములు-5, 9, 11, 15, 17, 26, 27.

శతభిషం : అనుకూల దినములు-2, 3, 4, 9, 21, 22, 24, 29, 30. ప్రతికూల దినములు-6, 10, 11, 16, 18, 28.

పూర్వాభాద్ర : అనుకూల దినములు-4, 8, 12, 16, 18, 21, 22, 23, 25. ప్రతికూల దినములు-1, 2, 7, 10, 11, 17, 19, 29. ◆

మీనం

పూర్వాభాద్ర 4వ పా, ఉత్తరాభాద్ర, రేవతి.

వీరికి ఈ మాసంలో గ్రహ సంచారం ప్రతికూలంగా ఉంది. మంచి ఆలోచనలు చేయలేకపోతారు. కొన్ని అపవాదాలు, శ్రమలు, ఇతరుల బాధ్యతలు మీద పడతాయి. కొత్త మార్పులు 9వ తేదీ తర్వాత చేపట్టండి. గౌరవాలకోసం, బంధువర్గం కోసం ఖర్చులు చేయవలసివుంటుంది.

ఇతరులకు సలహాలు ఇచ్చి దారినపోయేది నెత్తిన పోసుకున్నట్లవుతుంది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలోని ఉద్యోగులకు అధికారుల ఒత్తిడి వుంటుంది. అల్లులవల్ల మాటపడవలసిన పరిస్థితులు ఉంటాయి. ఆర్థిక అవసరాలపట్ల అవగాహనలతో వ్యవహరించుకోవాలి.

ముఖ్యమైన ఖర్చులకు ఋణములు చేయవలసిన పరిస్థితులుంటాయి. చిన్నతరహా వ్యాపారులకు లోన్‌లు, ఇతరత్రా సదుపాయాలు సిద్ధిస్తాయి.

కుటుంబవ్యక్తుల తీరుతెన్నులు కొన్ని నిరుత్సాహాన్ని ఇస్తాయి. వారు మీ మాటను నిర్లక్ష్యంగాను, తేలికగాను తీసుకుంటారు. అనవసరపు ప్రయాణాలుంటాయి. మాతాపితరుల ఆరోగ్యం విషయంలో మెలకువగా వ్యవహరించడం అవసరం.

విద్యార్థులకు నెల ఆరంభంనుండి వ్యాసంగాలు సాగుచున్నా కలవరపెట్టే సంఘటనలు వుంటాయి. మిత్రవర్గంవల్ల సమయదుర్వినియోగం జరిగే పరిస్థితులుంటాయి. వీరు రోజా కాలభైరవాష్టక పారాయణలు చేసుకోవడం మేలు.

పూర్వాభాద్ర : అనుకూల దినములు-4, 8, 16, 18, 21, 22, 23, 25. ప్రతికూల దినములు-1, 2, 7, 11, 12, 13, 17, 19, 29.

ఉత్తరాభాద్ర : అనుకూల దినములు-1, 4, 9, 11, 19, 21, 22, 23, 24, 29. ప్రతికూల దినములు-3, 8, 12, 13, 14, 18.

రేవతి: అనుకూల దినములు-2, 3, 8, 10, 16, 23, 24, 25, 30. ప్రతికూల దినములు-4, 9, 12, 13, 19, 21. <<

ఈ నెల ప్రశ్న

బహుమతి ₹300

ఈ క్రింది ప్రశ్నకు హాస్యం, వ్యంగ్యం, చమత్కారమైన సమాధానాన్ని మీ పేరు, చిరునామాతో పోస్టుకార్డుపై రాసి, మాకు నవంబరు 10వ తేదీలోపు అందేటట్లు పంపాలి. బహుమతి ₹300. భావం ఒకటే అయినా క్లుప్తతకు, మాటల పొందికకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. సీరియస్‌గా ఉండే సమాధానాలు పంపవద్దు. మీ సమాధానాలు : 'స్వాతి, అనిల్ బిల్డింగ్స్, సూర్యారావుపేట, విజయవాడ-520 002'కు పంపండి. తుది నిర్ణయం "స్వాతి"దే.

ఈ నెల ప్రశ్న :

దేవుడికి హారతినిచ్చేటప్పుడు గంటనెందుకు కొడతారు?

మీ సమాధానాన్ని పోస్టుకార్డుపై మాత్రమే రాసి ప్రతినెలా 10వ తేదీలోపు మాకు అందేలా పంపండి.

నవంబరు నెల ప్రశ్న :

పంతాలు, పట్టింపులు ఎందుకు?

ఉత్తమ సమాధానం :

పెళ్ళి, పెటాకులు అయ్యేందుకు!

బి. సూర్యనారాయణ, సూపర్‌వైజర్

మెటీరియల్ ఇన్‌స్పెక్షన్ డిపార్ట్‌మెంట్, హిందుస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, గాంధీగ్రామ్, విశాఖపట్నం- 530 005.

Editor: VEMURI BALARAM Swati Publications Anil Buildings Suryaraopet Vijayawada 520 002
Printed and Published by the owner VEMURI BALARAM
Printed at Anil Swati Press Autonagar Vijayawada. Cover at Kala Jyothi Process Pvt.Ltd., Hyderabad

Tel.: (0866) 243 1862 243 4017 Advt. 243 1233 Marketing 243 3938 Fax: 0866-243 0433
E-mail: swativja@eth.net advt_swati@sify.com www.swatipublications.com

96

ఏకపీఠంపై శ్రీ బాలపార్వతీ సమేత శ్రీ జలధీశ్వరస్వామి
ఘంటశాల

www.managhantasala.net

జలం జీవులకు ప్రాణాధారం. దేహాన్ని పరిశుద్ధం చేసేదీ, ఆరోగ్యాన్నిచ్చేదీ, ఆయుష్షును పెంచేదీ జలమే. జలం నుంచి ఉంచి జలధీశ్వరునిగా భక్తులచే పూజలందుకుంటున్న కృష్ణా జిల్లా ఘంటశాలలోని శ్రీ బాలపార్వతీ సమేత శ్రీ జలధీశ్వర స్వామిని దర్శించండి. ఆరోగ్యవంతులుకండి.

జయ జయ శ్రీ జలధీశ్వరస్వామివారికి జలమంటే ఇష్టం. కాసిన్ని నీళ్ళతో ఆయన్ని అభిషేకిస్తే చాలు, తృప్తిపడి కరుణతో మన శరీరంలో వున్న వ్యాధులన్నింటినీ ఆయన కడిగేస్తాడు.

భక్తులు అభిషేకించిన నీరే తీర్థమై, ఆ తీర్థమే మహౌషధమై, సర్వరోగాలను హరించివేస్తుంది. ఆరోగ్యవంతుల్ని చేస్తుంది.

ఈ స్వామి ఆరోగ్యప్రదాత. శ్రీ జలధీశ్వరస్వామికి మూడు ప్రదక్షిణలుచేసి అభిషేకతీర్థాన్ని సేవిస్తే,సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుంది.ఎందరో భక్తులకు అనుభవైకవేద్యమది. ఏకపీఠంపై వెలసిన శ్రీ బాలపార్వతీ సమేత శ్రీ జలధీశ్వరస్వామి విశిష్టత ఇది.

సతీసమేతంగా కొలువైన నవగ్రహమండపం ఇక్కడి ప్రత్యేకత. ఒకే ఆవరణలో తన కుమారులైన విఘ్నేశ్వర సుబ్రహ్మణ్యేశ్వరులతో శ్రీ బాలపార్వతీ సమేత శ్రీ జలధీశ్వరస్వామి దర్శనభాగ్యం, భక్తుల పాలిటి మహద్భాగ్యం. ఇక్కడి సుబ్రహ్మణ్యస్వామికి సుబ్రహ్మణ్యషష్ఠినాడు విశేషమైన పూజలు జరుగుతాయి.

గ్రహానుగ్రహం కోసం, గ్రహదోషాలను పోగొట్టుకోదలచిన వారు ఈ సతీసమేత నవగ్రహాలను వ్యక్తిగతంగా ఆరాధిస్తే, అత్యంత త్వరగా తమ సమస్యలన్నింటి నుండి బయటపడతారు.

సమగ్ర సమాచారంకోసం సెల్ : 99854 63899

బస్సు మార్గం : విజయవాడ నుంచి ఘంటశాలకు (ఉయ్యూరు, కూచిపూడిల మీదుగా) దూరం 40 మైళ్ళు.
మోపిదేవి నుంచి ఘంటశాలకు - 8 మైళ్ళు, కూచిపూడి నుంచి ఘంటశాలకు - 8 మైళ్ళు.

క్రిస్టల్ డాల్ఫిన్స్, ఫోర్సిలిన్, క్యూపిడ్స్ మరియు కట్ గ్లాస్ విగ్రహాలు ఎప్పుడైనా మీ కుటుంబానికి నిర్దిష్టమైన ఆహారాన్ని వండగలవా?



morphy richards

For Trade/Institutional/Corporate enquiries, kindly contact: South:

www.morphyrichardsindia.com

సగం అక్కడా...
సగం ఇక్కడా
(అరిందం అనే లండన్ మామ్మ కథ)
డా॥ మంథా భానుమతి

స్వాతి

సచిత్ర మాసపత్రిక

డా॥ మంథా భానుమతి

సగం అక్కడా... సగం ఇక్కడా!

(అరిందం అనే లండన్ మామ్మ కథ)

స్వాతి సచిత్ర మాసపత్రిక
అనిల్ బిల్డింగ్స్ సూర్యారావుపేట పోస్ట్‌బాక్స్ 339
విజయవాడ-520 002

SAGAM AKKADA...
SAGAM IKKADA!

(NOVEL)

By :

DR. MANDHA BANUMATHI

Published with :

DECEMBER 2012 SWATI

FREE GIFT
FOR SWATI READERS

Writer's Address :

DR. M.BANUMATHI
102, Pinnacle Pride
Umanagar, Begumpet
HYDERABAD-500 016
Ph : 040-2341 4363
Cell : 97012 15465

సగం అక్కడా... సగం ఇక్కడా!

(అరిందం అనే లండన్ మామ్మ కథ)

స్వచ్ఛమైన కోనేటిలో అప్పుడే ఒక కమలం అరవిరిసి ఆకాశంకేసి చూసింది, ఆదిత్యుని తొలికిరణాలకోసం. నులివెచ్చని కిరణ స్పర్శ తగలగానే పులకించి పూర్తిగా వికసించి గర్వంగా తలెత్తి దినకరుడ్ని చూసింది. అందుకోవాలనే ఆదుర్దా ఏమో!

అరవింద అప్పుడే పద్నాలుగేళ్ళు నిండి ప్రపంచాన్ని అర్థంచేసుకుంటోంది.

అరవిరిసిన కమలంవంటి స్వచ్ఛత, అమాయకత్వం... ప్రకృతినీ, తన పురుషుడ్నీ అర్థం చేసుకుని ఆనందించాలనే ఉత్సాహం... ఛెంగు ఛెంగున ఎగురుతూ, గలగలపారే నదిలా చైతన్యం మూర్తీభవించిన తత్వం.

అరవిందని చూస్తే చాలు అందరి హృదయాలూ ఆహ్లాదంగా స్పందిస్తాయి.

"అక్కా! బావగారొచ్చారు" ఎత్తుగడపల మీదినుంచి దూకుతూ తమ్ముడు అరుస్తుంటే అరవింద తత్తరపడి పెరట్లోకి పారిపోయి, కిటికీలోంచి చూసింది, కనురెప్పలు అల్లల్లాడిస్తూ.

సిల్కు లాల్చీ పైజామా, అణచి వెనక్కి దువ్వినా ముందుకి దూకుతూ సగం నుదురు కప్పేస్తున్న నల్లని జుట్టూ... ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్నట్లు, ఎక్కడో చూస్తున్నట్లుండే విశాలమైన కళ్ళూ... 'ఆజానుబాహుం, అరవింద దళాయతాక్షం' అన్నట్లున్న భట్టుని చూడగానే అరవింద బుగ్గలు ఎర్రబడ్డాయి.

"అల్లుడుగారూ! రండి రండి..." తడబడుతూ మామగారు పిలుస్తుంటే, హుందాగా ఇంట్లోకి అడుగుపెట్టాడు భట్టు.

"రేపే తీసుకురమ్మని చెప్పమన్నారు నాన్నగారు. ఎక్కువ సమయం లేదు. సామాన్లన్నీ సర్దేస్తే, కారు తీసుకొచ్చాను. మిమ్మల్ని కూడా రమ్మన్నారు"

అల్లుడి పొడిపొడి మాటల్ని అర్థంచేసుకోవడానికి రెండు క్షణాలు పట్టింది మామగారికి.

అరవింద గుండెలు దడదడా కొట్టుకున్నాయి. రేపేనా! ఎప్పుడో వెళ్ళాలని తెలుసుకానీ ఇంత తొందరగా, అనుకోకుండా ఎలా? బెదురుగా అమ్మని చూసింది.

అమ్మ హడావుడిపడుతూ కాఫీ, ఫలహారాలు తయారుచేస్తుంటే పక్కన చేరింది. "కొంచెం ముందు చెప్పచ్చు కదమ్మా?" సంతోషమో, దుఃఖమో తెలియని ఉద్వేగంతో అంది.

"ఎప్పటికైనా తప్పదుకదమ్మా!అమ్మా, నాన్నా, స్నేహితులూ,హితులూ అంతా అతనే నీకు. అర్థంచేసుకుని,అణకువతో మసలుకో తల్లీ.చేస్తున్నపని ఆపేసి ప్రేమగా కూతురి తల నిమిరింది.

అరవింద బేలగా చూసింది.

• • •

అరవింద ఒక్కక్షణం ఆగి అంతా పరికించింది.

"ఏడు కొండలవాడా! గోవిందా... గోవింద" ఏడుకొండలూ భక్తుల నినాదాలతో ప్రతిధ్వనిస్తున్నాయి.

ఆవిడకి డెబ్భైఏళ్ళు పైనే ఉంటాయి. ఒక చేత్తో కర్ర దాటేసుకుంటూ, ఇంకొక చేత్తో పదేళ్ళ మనవరాలి చెయ్యిపట్టుకుని నెమ్మదిగా నడుస్తోంది. ఈ వయసులో కాలినడకన కొండకెళ్ళాల్సినంత మొక్కేముందో, మధ్యలో మనవరాలి చెయ్యి వదిలేసి నుదిటిమీద చెయ్యి ఆనించుకుని పైకి చూడబోయింది.

అంతలో పక్కనున్న పిల్ల ఒక్క గెంతు గెంతి ముందుకు పరుగెత్తింది.

"అమ్మీ!" బెదిరిపోయి అరుస్తున్న ముసలమ్మ వెనక్కి పడిపోతోంది.

సరిగ్గా ఆ మెట్టుదగ్గిరే ఉన్న అరవింద గట్టిగా పట్టుకుంది.

"నూరేళ్ళు చల్లగా ఉండు తల్లే..." వణుకుతున్న కంఠంతో దీవించింది అవ్వ.

"ఏమయిందవ్వా? మీరిద్దరే వస్తున్నారా?" కర్ర సరిగ్గా సర్ది, అవ్వ చెయ్యి పట్టుకుని నడిపిస్తూ అడిగింది అరవింద.

"అవును తల్లే... కొడుకు, కోడలూ వెళ్తున్న బస్సుకి టక్కరయ్యింది. కొడుకు ఎంటనే ఏడు కొండలాని దగ్గరికెల్లిపొయ్యాడు. కోడలు మూడునెల్లాయి మంచంపట్టి కోలుకుంది. మొక్కు తీర్చుకుందామని మనవరాలి తోడు తీసుకునివెళ్తున్నా"

అరవిందకి ఆశ్చర్యం వేసింది. కొడుకు పోయినా, కోడల్ని బ్రతికించినందుకు సంతోష పడుతున్న అవ్వని చూసి ఒక జీవితసత్యం నేర్చుకుంది అరవింద.

"ఆ బగమంతుడు మనకిచ్చిందాంతో సంతోసపడాలి. పోయిందానికి ఏడవకూడదు" గొణుక్కుంటూ వెళ్తున్న అవ్వని కళ్ళు పెద్దవిచేసి చూసింది. 'శీతోష్ణ సుఖదుఃఖేషు సమస్సంగ వివర్జిత' తాతగారు చెప్పిన భగవద్గీతలో శ్లోకం గుర్తుకొచ్చింది. యోగులు ఎక్కడో హిమాలయాల్లోనే ఉండరు. సరిగ్గా చూస్తే మన మధ్యలోనే కనిపిస్తూ ఉంటారు.

"అరవిందా! త్వరగా రా. అడుగడుక్కీ ఆగుతూ, ప్రజాసేవ చేస్తూ, ఎప్పటికి చేరుకుంటాం? అయినా ఇంతదూరం ఎందుకటా రావడం. నీ దేముడిగదిలో లేడా ఈయన?" మోకాలి పర్వతం చివరి మెట్టుమీద నిలబడి నవ్వుతూ పిలుస్తున్నాడు భట్టు.

బ్రహ్మసమాజ సిద్ధాంతాలని నమ్మే భట్టుకి ఏడుకొండలూ ఎక్కడం అనవసర ప్రయాసే అనిపిస్తుంది. దంపతులిద్దరూ కలిసివెళ్ళాలన్న తండ్రిమాటకి ఎదురుచెప్పలేక వచ్చాడతను.

"తప్పు. అలా అనుకోకూడదండీ. మన ఇలవేలుపు వేంకటేశ్వరస్వామి మహత్యం చాలా గొప్పది" అరవింద ఆయాసపడుతూ మెట్లెక్కి భట్టుపక్కన నిల్చుని లెంపలేసుకుంది, భక్తిగా కళ్ళుమూసుకుని.

"నువ్విలా నత్తనడక నడిస్తే రాత్రయిపోతుంది. చీకటిపడితే దారిలో పులులు ఉంటాయంటారు. అయినా అంత చేటు కష్టం ఏమొచ్చిందో నీకు. నడిచి కొండ ఎక్కాలంటూ నాకింత పనిష్మెంట్ ఇవ్వడానికి"

"అదిగో మళ్ళీ, అలా మాట్లాడద్దన్నానా? ఇంత మంచి తోడునీ, నీడనీ ఇచ్చినందుకూ, పదికాలాలపాటు మమ్మల్ని ఇలాగే కలసివుండనియ్యమనీనూ, అంతకంటే నాక్కావల్సిందేం ఉంటుంది చెప్పండి. అవునూ రాత్రయితే ఏం? భయమెందుకు. ఇవేళ పున్నమి తెలుసా. పుచ్చపువ్వులాంటి వెన్నెల. ముందూ వెనుక కాగడాలు పట్టుకుని భక్తులు నడుస్తూనేవుంటారు. వెన్నెల్లో తిరుమల ఎంత బాగుంటుందో" పరవశంగా అంది అరవింద.

"సరి సర్లే... త్వరగా నడు. వెన్నెల సంగతి కొండమీదికెళ్ళాక చూద్దాం. అయినా నిన్నూ నన్నూ కలిపి పలుపుతాడేసి బంధించేశారు కదా. కలిసుండక ఎలా తప్పించుకుంటానూ" పకపకా నవ్వుతూ అంటున్న భట్టుని వింతగా చూసింది అరవింద.

అందుకోవాలని చకచకా అడుగులు వేస్తూ పలుపుతాడు పశువులకి కదా వేస్తారూ, అమాయకురాలైన అరవిందకి భట్టు మాటలు, ప్రవర్తన వింతగా అనిపించింది.

"నిజమే, ఎంత వెన్నెలున్నా, కాగడాలున్నా... ఈ లోయల్లో పడితే. తలుచుకుంటేనే కాళ్ళు వణుకుతున్నాయి. అవునూ! నిజంగానే వణుకుతున్నాయి. కాలుకి ఏదో గట్టిగా తగులుతోంది. నున్నని రాయి. అమ్మో, జారిపడిపోతున్నాను. ఎంత పెద్ద లోయో! ఏడుకొండలవాడి గుడిగోపురం అదిగో, పట్టుకోండి"

భట్టు చిరునవ్వుతో చూస్తున్నాడు, చేతులు కట్టుకుని.

"అమ్మా! అమ్మా" అరవింద భయంతో కళ్ళుమూసుకుంది.

ఉలిక్కిపడి లేచింది అరవిందం.

• • •

"అమ్మో! ఇదంతా కలా!"

గడియారం రెండు కొట్టింది.

ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది.

ఒళ్ళంతా చెమటలు పట్టేస్తున్నాయి. మొహంమీదినుంచి ధారలుగా కారుతోంది.

చెమట కళ్ళల్లోకి వెళ్ళిపోయి కళ్ళు రెండూ భగభగా మండసాగాయి.

మంచంమీదనుంచి లేచి, పక్కన ఉన్న బల్లదగ్గరికి వెళ్ళి మరచెంబులోని నీళ్ళు అలాగే ఎత్తి గడగడా తాగేసింది. కిటికీదగ్గరికి వెళ్ళి తెర తొలగించి చూసింది.

అంతే, ఒక్కసారి కళ్ళు పెద్దవయ్యాయి. పుచ్చపువ్వులాంటి వెన్నెల పెరడంతా పరచుకుంది.

వెన్నెల్లో నందివర్ధనం పూలు ఆకాశంలోంచి కృష్ణుడు విసిరేసిన వెన్నముద్దల్లా ఉన్నాయి. తన చెవుల్లోని హోరుతప్ప ఇంకే శబ్దం వినిపించట్లేదు. కనిపించినంత మేరా జీవం ఉన్నవీ లేనివీ ఒక్కలాగే నిశ్చలంగా ఉన్నాయి, చిత్రకారుడు వేసిన రంగురంగుల చిత్రపటంలాగ.

అరవిందం తలుపులు తీసుకుని పెరట్లోకి నడిచి అరుగుమీద కూర్చుంది.

ఊహ తెలిసినప్పట్నుంచీ వెన్నెలంటే అంతే. వ్యామోహంలాంటిది. రాత్రంతా అలా కూర్చుని ఆకాశంకేసి చూస్తూ వుండమంటే ఇంకేం అక్కర్లేదు. పున్నమిచంద్రుడు తారలతో సహా ఆకాశంలో విహారం చేస్తున్నాడు.

"తారా చంద్రుల విలాసములతో విరిసే వెన్నెల వరవడిలో..."

మాయాబజార్‌లోని పాట గుర్తుకొచ్చి నవ్వుకుంది అరవిందం. చంద్రుడికి అతిదగ్గరలో ఉన్న తార దూరం నాలుగు కాంతి సంవత్సరాలపైనట. అంటే కొన్ని కోట్ల మైళ్ళదూరం. ఇంక కలిసి తిరిగే ప్రశ్నే లేదు. వాస్తవానికీ ఊహకీ ఎంత దూరం.

చిరుచలి... కొద్దిగా వణికిస్తోంది. లోపలికి వెళ్ళి శాలువా తెచ్చుకుని నిండుగా కప్పుకుంది. స్తంభానికి ఆనుకుని కూర్చుని, నిశ్శబ్ద నిశీథిలోని మత్తుని ఆస్వాదిస్తూ అలా ఉండిపోయింది. అక్కడున్న ప్రతీ చెట్టూ, పువ్వూ, కాయా వెన్నెలని ఆస్వాదిస్తూ మత్తుగా హాయిగా ఉన్నాయి. చాలాసేపు చందమామకేసి చూస్తూ, అలాగే నేలమీద వాలి నిద్రపోయింది.కోడి కూసేవరకూ...

• • •

పాల్దాల్లోంచి వచ్చిన పొగ పల్చగా పంచ అంతా పరుచుకుంది.

పెరట్లోంచి అయిమూలగా ఉదయిస్తున్న సూర్యుడు నారింజరంగు కిరణాలని గుమ్మం దగ్గరికి పంపి అక్కడ వేసిన ముగ్గు సొగసులు చూస్తున్నాడు.

కోటలో తులశమ్మ ముద్దమందారాలతో, నందివర్ధనాలతో అలంకరించుకుని, అదాటుగా చూస్తే గుళ్ళో అమ్మవారి విగ్రహంలాగే ఉంది.

పంచకి ఆనుకునున్న పందిరిమీదున్న దొండతీగకాయలు, ఆకుల వెనకాల దాక్కుని తొంగిచూస్తున్నాయి, ఎవరైనా కోయడానికి వస్తారేమోనని. పెరడంతా శుభ్రంగా కడిగి, నూతి పళ్ళెంలో కూర్చుని గిన్నెలు తోముతోంది పనిమనిషి నాగమణి.

"అరిందంగారూ! పాలబిందె ఇక్కడెట్టేశానమ్మా, తొందరగా వచ్చి లోపలెట్టేసుకోండి. నల్లపిల్లి గోడెక్కి తయారుగా ఉంది. ఓ పట్టు పట్టేద్దారనీ"

పాలేరు వీరన్న కేకలకి మట్టెలు, పాంజేబులు శబ్దం చేస్తుండగా దేవుడి గదిలోంచి బయటికి వచ్చింది అరవిందం.

వంటింట్లోకి వెళ్ళి పాలడేగిశా పట్టుకొచ్చి గుమ్మందగ్గర కింద పెట్టింది.

"ఇందులో వంపెయ్ వీరన్నా. నేనా బిందె ఎత్తలేకపోతున్నా"

"ఇదేం చిన్నా చితకా డేగిశానాండీ మరీ" వినయంగా వంగుని అన్నాడు వీరన్న.

అరవిందాన్ని ఒకసారి చూస్తే మరీ మరీ చూడాలనిపిస్తుంది. అందులో ఆ వేళ పొద్దున్న మరీ... తలారా స్నానంచేసి, జుట్టు చివర వేలుముడి వేసింది. తెల్లని జుట్టు వీపంతా పరుచుకుని,

గాలికి ఎగురుతున్న వెంట్రుకలు నుదుటిమీద పడు తున్నాయి. కనుబొమ్మలు కూడా తెల్లగా అయి, అర్ధరూపాయికాసంత కుంకుమబొట్టుని మరింత ఎర్రగా కనిపించేలా చేస్తున్నాయి. పొందిగ్గా గోచీపోసి కట్టిన ఎర్రంచు నీలం పట్టుచీర నీరెండలో నిగనిగా మెరుస్తోంది. రెండేసి జతల బంగారు గాజులమధ్య అరడజను ఎర్రగాజులు పాలడేగిశా కిందపెడుతుంటే గలగల మన్నాయి. మెళ్ళో ఉన్న పుస్తెలతాడు, నల్లపూసలమీద ఉదయకిరణాలు పడి, అవి పైకి పాకి ఆవిడ మోము వింతకాంతితో వెలిగిపోతోంది.

పట్టుబట్టలు కట్టి అప్పుడే అష్టోత్తరం పూజచేసిన పార్వతీ అమ్మవారిలా ఉంది అరవిందం. బిందెలో పాలు, డేగిశాలోకి ఒంపి, అప్రయత్నంగా నమస్కరించాడు వీరన్న.

"అదేమిటో, రోజూ ఈ దణ్ణం ఎందుకురా అంటే వినవూ" నవ్వుతూ అంది అరవిందం. ముత్యాల్లాంటి పలువరుస తళుక్కున మెరిసింది. డేగిశా తీసుకెళ్ళి పాల్దాలిమీద పెట్టి, కింద పిడకల్ని సర్దింది వేడి సమంగా వచ్చేలా.

"రోజూ అమ్మోరి దర్శనం చేసుకున్నట్టుంటుందమ్మా. అవునుగానీండి. మీరు పెళ్ళికెళ్ళ లేదేటండీ? అక్కడేటో అంతా బోసిపోయుంటుంది"

"నాకెందుకో అన్నేసి రోజుల పెళ్ళిళ్ళకి వెళ్ళాలనిపించదు వీరన్నా. ఊపిరి సలపనట్లుంటుంది. హాయిగా పాటలు పాడుకుంటూ ఎవరూ లేని ఇంట్లో తిరుగుతుంటే ఎంత బావుంటుందో తెల్సా, అయినా, అందరూ వెళ్ళిపోతే ఇల్లెలా? పెళ్ళివాళ్ళు వచ్చేటప్పటికి అంతా సర్దించిపెట్టడానికుండాలి కదా, లేకపోతే అయ్యవారి నట్టిల్లులా ఉంటుంది"

"ఏటో, అమ్మగారిదంతా చాదస్తం" నిట్టూరుస్తూ పెరట్లోకి వెళ్ళిపోయాడు వీరన్న, గొడ్ల సావిడి బాగుచెయ్యడానికి.

"ఏనాటి నోము ఫలమో" అని పాడుకుంటూ అరవిందం పనిలో పడింది.

చకచకా కొట్టుగదిలోకి వెళ్ళి కూరగాయలేమున్నాయో చూసింది. పెళ్ళివారు సాయంత్రానికి కానీ రారు. అప్పటికి పెరటిసావిట్లో గాడిపొయ్యి తవ్వేసి, అటకమీదనించి గుండిగలూ అవీ దింపేసి, సంతనుంచి కూరలు తెచ్చి వేరే వంటలూ అవీ మొదలుపెడ్తారు. మధ్యాహ్నానికి ఏదైనా చేసుకోవాలికదా!

ఉన్నది తానొక్కతే అయినా పాలేళ్ళు, పనివాళ్ళూ కలిపి పదిమంది. ముక్కలన్నీ వేసి పప్పులుసూ, వంకాయ ముద్దకూర చెయ్యమని వంటావిడకి పురమాయించి, అన్ని గుమ్మాలకీ తోరణాలు కట్టడానికి మండువాలో ఉంచిన మావిడాకుల దగ్గిర కూర్చుంటూ అటుగా పరుగెడు తున్నట్లు వెళుతున్న పదహారేళ్ళ నాగమణిని పిలిచింది.

"అదేవే నాగమణీ అలా పారిపోతున్నావూ. ఇవన్నీ ఎవరు చేస్తారూ... రా రా! ఇలా కూర్చుని ఆ పురి కోస్తాడు తియ్యి" నాగమణి, వీరన్న కూతురు. అరవిందానికి సాయంగా ఉండిపోయింది పెళ్ళికెళ్ళకుండా. మూతి ముడుచుకుని వస్తున్న నాగమణిని చూసి నవ్వింది అరవిందం.

"ఓసోసి... అంత కోపవేంటే? పెళ్ళికెళ్ళనియ్యలేదనే. నే చెప్తూనే వున్నా. మీ నాన్నే మొండిపట్టు పట్టాడు. నాకు సాయంగా ఉంటావనీ. వాడిదంతా చాదస్తం. ఎవరైనా ఎత్తుకుపోతారా నన్నూ! నా ఎర్ర పట్టుచీర చింపి నీకు పట్టుపరికిణీ కుట్టిస్తాలే! మొహానికి కాస్త నవ్వు పులువు"

"ఎప్పుడో ఇస్తే ఏం లాభం అమ్మగారూ. ఇప్పుడిచ్చారనుకోండి రేపు వ్రతానికేసుకుంటా" నాగమణి కోపం మర్చిపోయి మండువాలో కూలబడింది. అరవిందం పక్కనే.

"ఒకవేళ నే ఇచ్చినా ఇప్పటికిప్పుడు కుట్టి ఎవరిస్తారే రాణీగారికి"

"దర్జీ శ్రీను నిన్ననే వచ్చాడమ్మగారూ. మీరు చెప్పారని చెప్తా. వెంటనే ఇచ్చేస్తాడు. లండన్ మామ్మగారు కదా మరీ" దీర్ఘాలు తీస్తూ అంటున్న నాగమణిని చూసి నవ్వుతూ లేచింది అరవిందం.

అరవిందం పుట్టినరోజుకి బావగారి పిల్లలూ, మనవలూ అందరూ కలసి కొనిచ్చిన పట్టుచీర. బరువుగా ఉందని కట్టలేకపోతోంది. పిల్లలు లేరని ఎప్పుడూ బాధపడలేదు అరవిందం.

బావగారి పిల్లల్నే తన కన్నపిల్లలనుకుంది. వాళ్ళ పిల్లల్ని స్వంతమనవల్లా చూసుకుంది.

జమీలు పోకముందరి సంగతి.

ఆ ఊరి జమీందారుగారి దివాన్, గణేశం పంతులుగారు. చుట్టుపక్కలున్న నాలుగైదు ఊళ్ళకీ ఒకటే జమీ. బ్రిటీష్ ప్రభుత్వం ఉండగానే కొంత ఆస్తి దివాన్‌గారి పేరుమీద రాసేశారు జమీందారుగారు.

దివాన్‌గారి పెద్దకొడుకు అప్పల నరసింహంగారు తండ్రి వారసత్వం పుచ్చుకున్నారు.

పంతులుగారి చిన్నకొడుకు నరసింహభట్టు బారిస్టర్. వారి చిన్నకోడలు అరవిందం. అరవిందం పెళ్ళినాటికి బొంబాయిలో ప్రాక్టీసు పెట్టాడు భట్టు.

జమీలు పోయినప్పుడు దివాన్‌గారినే కరణంగా నియమించారు. తనదీ, తమ్ముడిదీ ఆస్తి పాస్తులు చూసుకుంటూనే కరణం పని కూడా చూసేవారు అప్పల నరసింహంగారు.

ఆయన పెద్దకొడుకు ప్రస్తుతం ఆ ఊరి కరణం. తాతగారి పేరే. అందరూ పంతులు గారని పిలుస్తారు.

"అమ్మో! ఈ చీరనా అమ్మగారూ..." అంతంత కళ్ళేసుకుని ఆశ్చర్యంగా చూసింది నాగమణి.

నిజవే మరి, అరచెయ్యంత వెడల్పు తెల్లంచు జరీచీర. ఎర్రటిరంగుతో వెండిమబ్బు అంచున్న సంధ్యాసమయంలో ఆకాశంలా ఉంది.

"అప్పుడెప్పుడో ఆరేస్తుంటే మేకుకి తగిలి మధ్యలో పర్రుమందే. నిలువునా చిరిగిపోయింది. అతుకుచీర కట్టకూడదని అట్టేపెట్టాను"

నాగమణి మొహం చేటంతయింది. చురుగ్గా గంటలో వీరన్న సాయంతో మావిడాకులన్నీ తోరణాలు కట్టేసి తుర్రుమంది.

అరవిందం తృప్తిగా గుమ్మాలన్నీ చూస్తుండగా, వచ్చాడు పొలంలో పనిచేసే పెద్దపాలేరు వెంకడు వగర్చుకుంటూ!

• • •

"అరిందంగారూ! కొంప మునిగిపోతోందండీ" పాలేరు వెంకడు డెక్కుతూ అన్నాడు, వీధిలో మెట్లకింద నిలబడి. చెమటలో నాని, నీళ్ళు కారుతూ నిల్చున్నాడు.

వెంకడిది కండలు తిరిగిన ఉక్కులాంటి శరీరం. వెంకటేశ్వరస్వామి విగ్రహంలాగే నిలువెత్తున నల్లగా నిగనిగలాడుతూవుంటాడు. అంత మనిషీ వణికిపోతున్నాడు.

"ఏవయింది వెంకన్నా! ఉండు. కుండలో నీళ్ళట్టుకొస్తాను. ఆర్చుకుపోతున్నావు వెర్రి వెధవన్నా" అరవిందం గబగబా లోపలికి వెళ్ళి దండెంమీదున్న తువ్వాలూ, చిన్నకుండలో నీళ్ళూ తీసుకొచ్చి ఇచ్చింది.

వెంకడు కుండెడు నీళ్ళు గడగడా తాగేసి, తువ్వాలుతో మొహం వత్తుకుని కాస్త తేరుకున్నాడు. అరవిందం కాపురానికొచ్చినప్పుడు వెంకడు ఏడాది పిల్లాడు. పాలేళ్ళంతా ఆవిడ కళ్ళ ముందు పుట్టినవాళ్ళే. అందర్నీ మాతృవాత్సల్యంతోనే చూస్తుంది.

"అరిందంగారూ! టయం నేదండీ. పెళ్ళోరొచ్చేత్తన్నారా! మన చిన్నకాలవలో నీళ్ళు ఉధృతంగా వచ్చేత్తన్నాయండి. వంతెనీవతల గండిపడి చెరువైపోతోందండి. మరి బళ్ళు ఊళ్ళోకి ఎల్లా వత్తయ్యండే"

ఊళ్ళో పెద్దలు, కుర్రకారూ అంతా పెళ్ళికెళ్ళారు. ఇప్పుడెలా, అరవిందానికేం చెయ్యాలో తోచలేదు. కానీ ఏదో చెయ్యాలి. ఈపాటికి సగం దూరం వచ్చేసుంటాయి బళ్ళు. ఇంట్లోకి వెళ్ళి ఉన్నపళంగా చెప్పులేసుకుని బయటికి వచ్చేసింది. ముందు వంతెన దగ్గిరికెళ్ళి చూడాలి.

"అమ్మగారూ! మీరొత్తారా?" వెంకడు ఆశ్చర్యంగా అడిగాడు.

"మరీ, ఏదో చేస్తాననే కదరా, పరిగెట్టుకునొచ్చావూ? పెళ్ళికెళ్ళిన కూలీలంతా తిరిగొచ్చారా? వీరన్నా, వాళ్ళందర్నీ పిల్చుకురా, డ్రైవరున్నాడేమో ట్రాక్టర్‌మీద ఇసుక బస్తాలేసుకు రమ్మను. తోటలో బంగ్లా కట్టడానికట్టుకొచ్చారు కదా! ఇక్కడున్నట్లు రావాలి మరి" అరవిందం నడుస్తూనే, వెంకడి కేకలు విని ఏటయిందోనని గొడ్లసావిట్లోంచి నాలుగంగల్లో వీధిలోకొచ్చిపడ్డ వీరన్నకి ఆదేశాలు ఇచ్చింది. ఊర్లో అన్ని ఇళ్ళల్లో ముసలివాళ్ళు తప్ప ఎవరూ లేరు.

అరవిందం చకచకా నడుస్తూనే ఆలోచిస్తోంది. బొంబాయిలో ఒకసారిలాగే వాళ్ళున్న కాలనీ జలదిగ్బంధం అయిపోయింది. అప్పుడేం చేశారూ? జ్ఞాపకం తెచ్చుకుంది.

వంతెనదగ్గిర పరిస్థితి వెంకడు చెప్పిందానికంటే అధ్వాన్నంగా ఉంది. కాలువ వంతెన కిందకంటే మూడురెట్లు వేగంతో బయట రోడ్డుమీంచి పారుతోంది.

రోడ్డుమీద అడ్డంగా గండిపడిపోయింది. వంతెనమీదనుంచి ఏ బండొచ్చినా గండిపడిన కాలువలో కొట్టుకుపోవడం ఖాయం. అరవిందం కబురు పెట్టకముందే గుమాస్తాగారు కూలీలందర్నీ క్రోడీకరించినట్లున్నారు. యాభైమంది జెమాజెట్టీల్లాంటివాళ్ళు వచ్చేశారు.

ఇంకా ట్రాక్టర్ రాలేదు. బస్తాలేసుకుని రావాలి కదా!

"నమస్కారమమ్మా! మీరొచ్చారా. నేను మానేజిమెంటు చేసేవాణ్ణి కదా!" గుమాస్తా వినయంగా అన్నాడు.

"మనవాళ్ళలో గజ ఈతగాళ్ళెంతమందున్నారు?" అరవిందం అడిగింది, గుమాస్తా మాట వినిపించుకోకుండా.

"ఓ ఇరవైమంది ఉంటారమ్మా. ఇది చూస్తే పంటకాలువ. ఇలా పోటెత్తిన గోదార్లా అవడం ఇదే ఫస్టు టైం"

అరవిందం సాలోచనగా చూసింది. దూరం నుండి అంత వడి లేదు. వంతెన దగ్గరవుతున్న కొద్దీ ఎక్కువవుతోంది.

"ఈత బాగా వచ్చినవాళ్ళని వంతెనకిందికెళ్ళి చూడమనండి. అడ్డున్న చెట్టుకొమ్మల్ని తీసి, ఒడ్డుకెయ్యమనండి. ఈలోపు కొంతమందిని పరుగెట్టి గునపాలు, పారలు, గంపలు తెమ్మనండి. త్వరగా. వంతెన కింద పూడిక తీయిస్తే, ముందీ రోడ్డుమీద ప్రవాహం తగ్గుతుంది. అప్పుడు ఇసుక బస్తాలేసినా ప్రయోజనం ఉంటుంది"

ఈ ఉపాయం తనకి తట్టనందుకు తిట్టుకుంటూ గుమాస్తా అందర్నీ తరిమాడు. అరవిందం చెప్పినట్లే, ఎప్పుడు పడిందో పెద్ద వేపచెట్టు విరిగి, లావుగా ఉన్న దాని మొద్దు, కాలువకి అడ్డంగా వంతెన కిందపడింది. దాని చుట్టూ తుక్కులు, బంకమట్టి చేరి ఆనకట్ట కట్టేశాయి.

అదృష్టం, వానొకటి లేదు. సరిగ్గా ఈతరాని కూలీలు గట్టుమీద నిలబడ్డారు.

గజ ఈతగాళ్ళు, నీళ్ళల్లో కొంచెంసేపు ఉండగలిగినవాళ్ళు కాలువలోకి దిగారు. ముందు మొద్దు చుట్టూ ఉన్న మట్టి, చెత్తా చెదారం గంపలతో తెచ్చి ఒడ్డునపడేస్తుంటే, అక్కడున్నవాళ్ళు పక్కనున్న తోటలో పడేశారు. అదయ్యాక, ఇరవైమందీ కలిసి, వేపమొద్దుని నెమ్మదిగా నిలువుగా చేసి ఒడ్డుకి చేర్చారు. అప్పుడు, వంతెనకిందినుంచి నీరు మళ్ళింది. ఈలోగా ఇసుక బస్తాలేసుకుని ట్రాక్టరు వచ్చేసింది. గండిపడిన రోడ్డుమీద దగ్గరుండి ఇసుక పరిపించి మట్టితో దిమ్మిసా చేయించింది అరవిందం. వంతెన వద్దనుంచి రోడ్డుమీద నడిచి, తృప్తిగా ఇల్లు చేరింది.

• • •

పచ్చని పంటపొలాల మధ్యగా రెండు రెండెడ్లబళ్ళు గంటలు గణగణా మోగించుకుంటూ వస్తున్నాయి.వెనుకగా నడవగలిగినవాళ్ళంతా కబుర్లు చెప్పుకుంటూ వస్తున్నారు. నడవలేనివాళ్ళు కార్లలో, ఇంకా కుర్రకారు ట్రాక్టర్లలో ఊరేగింపులా వస్తున్నారు. మొదటి బండిని ఆకుపచ్చని మామిడికొమ్మలతో, పసుపుపచ్చని బంతి, చామంతుల దండలతో అలంకరించారు.

ఊర్లోకి వస్తున్న పెళ్ళివారికి స్వాగతం పలుకుతున్నట్లు ఊగుతున్నాయి చెరువుగట్టు మీద వరుసగా ఉన్న కొబ్బరిచెట్లు. గట్టుదగ్గర మలుపుతిరిగి ఒక మైలు వెళ్తే అన్నాపురం. అదే, అరవిందం అడుగెట్టిన అత్తారూరు.

ఆ ఊరి కరణంగారి అబ్బాయీ, అప్పల నరసింహంగారి చిన్నమనవడూ అయిన కామేశ్వర్రావుకి, పక్కూరి పప్పోరిపాలెం మునసబుగారమ్మాయితో పెళ్ళయింది.

అంగరంగవైభోగంగా ఐదురోజుల పెళ్ళి.

ఇరవయ్యొకటో శతాబ్దంలో కూడా తరతరాల సాంప్రదాయాల్ని పాటించాలనే కుటుంబం కరణం గారిది.అందుకనే తాతముత్తాతలు ఉపయోగించిన రెండెడ్లబళ్ళు ఎప్పటికప్పుడు బాగు చేయిస్తూ, కొత్తబళ్ళలా ఉంచుతారు. బోలెడు పాడి. అందులో ఆవులే ఎక్కువగా ఉంటాయి.

ప్రతి ఏడూ తొలి నాగలి ఎడ్లు పట్టాల్సిందే, ఆ తరువాత ట్రాక్టర్లు వాడినా, బళ్ళు నడపడానికి కూడా రెండు జతల ఎడ్లు తయారుగా ఉంటాయి. శుభకార్యం వచ్చిందంటే ముందా బసవన్నలకి పూజచేసి అలంకరించి, బండిలోనే కొంత దూరమన్నా ప్రయాణం చేస్తారు.

ఐదోరోజు తెల్లారకట్లే నాగవల్లి, దండాడింపు, తలంటి స్నానాలు అయ్యాక, పెందరాళే భోజనాలు కానిచ్చి పెళ్ళివారు వెనక్కి మరలారు.

పెళ్ళికొడుకు, పెళ్ళికూతురూ బసవన్నలు తలలు ఆడిస్తూ స్వాగతం పలుకుతుండగా బండిలోకి ఎక్కారు. ఐదురోజుల పెళ్ళి వేడుకలతో అలసిపోయిన పెళ్ళికూతురు హేమలత, కళ్ళు మూతలు పడుతుంటే బండిలో వేసిన మెత్తటి పరుపుమీద జోగుతోంది.

అప్పటివరకూ, పెళ్ళి ఐదురోజులూ మధుపర్కంతో, సగం నుదురు కప్పేసిన నామంతో, తలనిండా జుట్టు కనిపించకుండా కమ్మేసిన అక్షింతలతో చూసిన భార్య, మెత్తని కొత్తచీరలో, నుదుట తీర్చిదిద్దిన కళ్యాణంబొట్టుతో, పచ్చని పసుపుతాడుకి కట్టి మెరుస్తున్న మంగళసూత్రాలు, నల్లపూసలూ బండి కుదుపులకి అటూ ఇటూ కదులుతుంటే, అతివ అందాలని పరికించడంలో మునిగిపోయాడు పెళ్ళికొడుకు కామేశ్వర్రావు.

అలంకరించిన బండిలో విశాలంగా, ముందు గడ్డిపరుపు, దానిమీద మెత్తటి బూరుగు దూదిపరుపు. బండి గూడుకున్న మేకులు, పుల్లలు గుచ్చుకోకుండా చుట్టూ కొబ్బరిపీచు, గడ్డి వేసి వెల్వెట్ బట్టతో కుట్టేశారు. అది చాలదన్నట్లు బాలీసులు, తలగడాలు... సుఖంగా ఆనుకుని కూర్చోడానికి.

కరణంగారి పెద్దబ్బాయి నాని మంచి అభిరుచి, కళాహృదయం ఉన్నవాడు. తాతగారి పేరే. ఇంటి అజమాయిషీ అంతా అతనిదే. ఒక్క బండేమిటి, ఇంట్లో ప్రతిమూలా, గొడ్లసావిడితో సహా స్వయంగా పర్యవేక్షిస్తాడు.

నూతన దంపతులు వచ్చే బండిలో ఇంకెవరూ ఎక్కకుండా ఏర్పాట్లు చేశాడు.

ఆఖరికి "బాబాయి, పిన్నితో నేనూ" అంటూ ఏడుస్తున్న మూడేళ్ళకూతుర్ని కూడా బుజ్జగించి వెనక బండిలో నానమ్మ దగ్గిర కూర్చోబెట్టాడు, ఇదేం చోద్యంరా అంటున్న తల్లిమాటలు పట్టించుకోకుండా.

అన్నయ్య కల్పించిన ఏకాంతాన్ని పూర్తిగా వినియోగించుకోవడానికి వీల్లేకుండా ఉంది కాంబాబుకి, మధ్యలో ఈ బండివాడొకడు. ఎడ్లని అదిలిస్తున్నట్లే వుంటాడు. అప్పుడప్పుడు కన్ను వెనక్కి వేస్తున్నాడు. రోడ్డుమీదున్న గతుకులు కొంత సాయం చేస్తున్నాయి,ఇతోధికంగా.

అప్పుడే పెద్దగుంటలో పడిన బండిచక్రం, హేమని ఎగరేసి కాంబాబు ఒళ్ళో పడేసింది. కనురెప్పల్ని బరువుగా ఎత్తి, పెద్దకళ్ళతో బెదురుగా చూసి చటుక్కున లేవబోయింది.

ఊహూ! చీరకొంగు సంచీలు వేళ్ళాడ్డానికి పెట్టిన వంకీకి చిక్కుకుపోయింది. లేవబోతుంటే పమిటచెంగు పక్కకి తప్పుకుంటోంది. సరిచేసుకోబోతే చిరుగుతానంటూ సర్రుమని శబ్దం చేస్తోంది. కొత్త పెళ్ళికొడుకు చూపుల్లో కొంటెతనం. కొంగు తియ్యాలంటే తన మీదనుంచి వంగాల్సిందే. హేమ మరింత బెదిరిపోయి, చిగురుటాకులా కంపిస్తూ నిస్సహాయంగా చూసింది.

ఒక్క నిముషం ఆగి, అగ్నిసాక్షిగా ఏర్పడిన ఏడడుగుల బంధం చాలదన్నట్లు పడిన కొత్త బంధాన్ని, బండి కుదుపులకు ఊగుతున్న ముద్దరాలి మోముని చూశాడు కాంబాబు.

హేమ మరింత ముడుచుకుపోయింది. ఎటూ కదలలేని పరిస్థితి.

కాంబాబుకి కూడా కొత్తగానే ఉంది. తన గుండెచప్పుడు తనకే మద్దెలదరువులా వినిపిస్తోంది.

చేతులు, కాళ్ళు వణుకుతున్నాయి.అయినా ఎంతో బాగుంది. సావకాశంగా భార్యని చూశాడు. పసుపుఛాయలు పూర్తిగా వదలని చెంపలు. సిగ్గుతో ఎర్రబడి, కొబ్బరాకుల్లోంచి పడిన సూర్య కాంతిలో పంచరంగుల్లో మెరుస్తున్నాయి. అదురుతున్న పెదవుల్ని చూస్తుంటే ఒక్కసారి తన పెదవులతో మూసి అభయం ఇవ్వాలనిపించింది.

నుదిటి మీదున్న కళ్యాణంబొట్టు కొత్తకళని తీసుకొచ్చింది. ఆకుపచ్చని పట్టుచీరకి పసుపు పచ్చని తామర పూల అంచుచీర, ఒంటిమీదున్న నగల మెరుపుని మరింత పెంచుతోంది. ఒకే ఒక కిరణం ముక్కుకున్న వజ్రపు ముక్కుపుడకమీద పడి సప్తవర్ణాల కాంతిని మొహమ్మీద పరిచింది. అలా ఉండిపోయేవాడేమో కానీ, హేమ కళ్ళలో వేడికోలు చూసి చెయ్యి చాచి, వంకికి చిక్కుకున్న కొంగుని విడిపించి, భుజాలు పట్టుకుని కూర్చోపెట్టాడు భార్యని.

హేమ గుండె ఝల్లుమంది. కాళ్ళని మరింత ముడిచి, మోకాళ్ళమీద తలపెట్టి, వెనక్కి జరిగి, పక్కకి తిరిగి దారి అంతా అధ్యయనం చెయ్యసాగింది.

కాంబాబు మాత్రం తన పనిలో తానున్నాడు. ఏదో మాట్లాడదామని చూస్తాడు. చెయ్యి చాచి, ముంగురులు సవరిద్దామని చెయ్యి పైకి లేపుతాడు. అంతలో సంకోచంతో వెనక్కి తీసుకుం టాడు. ఈ అవస్థలన్నీ గమనిస్తూ ముసిముసినవ్వులు నవ్వుతూ చెరువులో ఊగిసలాడుతున్న చెట్లనీడల్ని పలుకరిస్తోంది హేమ.

ఒక్కసారిగా హేమ కళ్ళు పెద్దవయ్యాయి. చెరువుగట్టు మలుపు తిరుగుతూనే కన్పించింది. పెద్ద ద్వారం. దానిమీద పువ్వులతో, "హేమలత-కామేశ్వర్రావుల వివాహ వేడుకలు" అని రాశారు. వరుసగా బళ్ళు ప్రవేశిస్తుండగానే, బాజాభజంత్రీలవాళ్ళు వచ్చేశారు, డోలు సన్నాయి వాయిస్తూ. చెరువు దాటగానే అన్నాపురం రాములవారిగుడి. గుడికీ, ఊరికీ మధ్య పిల్ల కాలువ. దానిమీదుగా వంతెన. ఒక వరుస బళ్ళు వెళ్ళేదారే అయినా వంతెన బలంగానే ఉంది. కాలువ ఒడ్డున ఇటూ అటూ వరుసగా ఇళ్ళు.

ప్రతి ఇంటి పెరట్లోంచీ కాలువ వెళ్తున్నట్లే ఉంది. ఇళ్ళు కనిపించకుండా అన్నిరకాల చెట్లూ, తీగలూ. వేళ్ళాడుతున్న కాయలూ, పళ్ళూ... తలలూగిస్తున్న గుత్తుల గుత్తుల పువ్వులూ, కళ్ళార్పకుండా చూస్తోంది హేమ. వంతెనమీద రెండుపక్కలా ఉన్న సిమెంటు గట్టుకి స్తంభాలు. దానికి రంగురంగుల పువ్వుల తీగలు, తీగబఠాణీ, రాధామనోహరం, మాలతీ... సువాసనల్ని వెదజల్లుతున్నాయి. కాలువగట్టు ఎంతో శుభ్రంగా ఉంది.

"ఊరు బావుందా?" చెవి తగిలేలా తల పక్కనే తలపెట్టి అడుగుతున్న కాంబాబుని సిగ్గుగా చూసి కనురెప్పలు కిందికి వాల్చింది. వంతెనకివతలే ఊర్లో ఉన్న ముసలివాళ్ళు, పెళ్ళికి వెళ్ళి వస్తున్నవాళ్ళూ, అందరూ, రోడ్డుకి రెండువైపులా నిలబడి చేతులూపుతున్నారు.

కాంబాబు కాళ్ళు కిందికి జార్చి అందర్నీ నవ్వుతూ పలకరిస్తున్నాడు.

కరణంగారు, నాని, కాంబాబు మేనమామలు, పినతండ్రి... అందరూ కార్లు దిగి సన్నాయి వాళ్ళ వెనుక నడుస్తున్నారు. బోలెడుమంది ఆడవాళ్ళు కూడా కలిశారు, నగలు సవరించుకుంటూ. గుమాస్తా, వెంకడు వంతెనముందు నిలబడి ఆగమని చేతులూపుతూ నానితో మాట్లాడారు.

"ముందు ఖాళీబండి పోనిద్దావండీ, ఇసుక బస్తాలెంతవరకూ తట్టుకోగలవో చూసి, మిగిలిన కార్లు, ట్రాక్టర్లు పంపుదాం" గుమాస్తా చెప్తున్నది వింటూనే నాని వంతెన దాటి వెళ్ళి చూశాడు. రోడ్డుమీద గండిపడిన చోట్లో ఇసుక బస్తాలు పరిచారు. వాటి సందుల్లో ఇసుక మట్టి వేసి దిమ్మిసా కూడా చేశారు. అయినా చెప్పలేం అనుకున్నాడు నాని.

మరి కొత్తపెళ్ళికూతుర్ని నడిపించడమా! ఏం చెయ్యాలీ?

అంతలో ఊర్లోంచి పల్లకీ మోసుకొస్తూ వీరన్న, ఇంకో ముగ్గురు కూలీలు వచ్చేశారు. నాని మొహం విప్పారింది. అమ్మయ్యా, పరువు నిలిచింది.

పెళ్ళికొడుకు, పెళ్ళికూతురూ ఉన్న బండిదగ్గరికి వెళ్ళి పల్లకీని కిందికి దింపారు.

"మనూర్లో కూడా ఉండద్దండే ఊరేగింపు. అందుకే మేనా అట్టుకొచ్చేశావండి" కాంబాబు ఆశ్చర్యంగా చూస్తుంటే వీరన్న అనేశాడు.

పల్లకీ పైకి లేపాక నెమ్మదిగా నానితో వీరన్న అంటుంటే వింది హేమ.

"అరిందంగారిదేనండి ఈ ఉపాయం"

అరిందం అంటే ఎవరో, పేరు తమాషాగా ఉందే.

సరిగ్గా సర్దుకుని కూర్చుంటూ అనుకుంది హేమ.

• • •

పల్లకీ ముందు సన్నాయివాళ్ళూ, వాళ్ళ వెనుక మగవాళ్ళూ, పల్లకీ చుట్టూ, వెనుక ఆడవాళ్ళు, పిల్లలూ... ఊరేగింపు సాగింది.

నాని కూతురు బుజ్జి పల్లకీలో పిన్ని ఒళ్ళో కూర్చుంది. సంతోషంగా చప్పట్లు కొడ్తూ.

పెళ్ళివారి ఊరేగింపు ఎడంపక్కకి తిరిగి విశాలంగా వేసిన తాటాకు పందిళ్ళల్లోంచి వచ్చి కరణంగారి ఇంటిముందు ఆగింది.

సన్నాయివాళ్ళు పాట వాయిస్తున్నారు. హేమకి ఎంతో ఇష్టమైన పాట.

"రావమ్మా మహలక్ష్మి రావమ్మా... నీ కోవెల ఈ ఇల్లు కొలువైవుందువుగానీ" హేమకి ఒళ్ళు పులకరించింది.

పల్లకీ కిందికి దింపారు.

బుజ్జి కిందికి ఉరికి 'అరిందం మామ్మా' అంటూ ఇంట్లోకి పరుగెత్తింది.

కాంబాబు పల్లకీ దిగి, రెండు చేతులూ అందించి, హేమని లేపి భుజాలు నొక్కి వదిలేశాడు. ఆడవాళ్ళు నోరు తెరిచి చూస్తుండగా, వయసులో ఉన్న కుర్రాళ్ళు చప్పట్లు కొట్టారు. కరణంగారు మాత్రం ఒక్క క్షణం కనుబొమ్మలు ముడిచారు.

హేమ బుగ్గలు సిగ్గుతో, కళ్ళు కోపంతో ఎర్రబడ్డాయి.

బొత్తిగా సిగ్గులేకుండా, ఇదేవన్నా లండనో, న్యూయార్కోనా తలదించుకుని అక్కడే నిల్చుంది. కళ్ళలో నీళ్ళు రాలడానికి సిద్ధంగా ఉన్నాయి.

• • •

హేమ ఎరుపెక్కిన కనులతో కాంబాబు ఎడంచెయ్యి చిటికెనవేలు పట్టుకుంది. నానేసి రుబ్బిన వరిపిండి ముగ్గులు, మధ్యలో స్వాగతం అని అందంగా రాసింది నాగమణి.

కాంబాబు చెయ్యి పట్టుకుని మెట్లు ఎక్కి, ముడుచుకుపోతూ గుమ్మం దగ్గర నిలబడింది హేమ. అక్కడ ఆడపిల్లలందరూ దడి కట్టేశారు.

వారి వెనుక పెద్దవాళ్ళు మునివేళ్ళమీద నిలబడి చూస్తున్నారు. మెట్లకిరుపక్కలా ఉన్న వీధరుగుల మీద కుర్రాళ్ళంతా నిల్చుని గొడవ చేస్తున్నారు.

నాని, పెళ్ళికొడుకు పక్కన చేరాడు.

కరణంగారూ, వియ్యంకుడు, మిగిలిన గ్రామపెద్దలు అందరూ పందిట్లో వేసిన కుర్చీల్లో ఆసీనులయ్యారు.

అల్లరల్లరి చేస్తూ గుమ్మానికి అడ్డంగా నిల్చున్నవాళ్ళంతా పక్కకి జరుగుతుంటే హేమ కళ్ళు కొంచెం పెద్దవి చేసి చూసింది.

పెద్ద వెండిపళ్ళెంలో పారాణినీళ్ళు పట్టుకుని ఠీవిగా వస్తోంది ఒక పెద్దావిడ. రెండు జడలు వేసి చుట్టు చుట్టిన ముడి కుదురుగా అమరింది.

ముడిచుట్టూ కనకాంబరాల మాల. జుట్టంతా నెరిసిపోయి వెండిచుట్ట చుట్టినట్లుంది. మెరుస్తున్న కుంకుంబొట్టు, మెడనిండుగా నగలు, గోచీపోసి కట్టిన తోపురంగుకి పసుప్పచ్చ జరీ అంచున్న కంచిపట్టుచీర... అన్నింటినీ మించిన చిరునవ్వు వింత వెలుగునిచ్చింది ఆవిడకి.

ఆవిడని చూడగానే పవిత్రభావం కలుగుతుంది ఎవరికైనా.

"స్టాప్ మేకింగ్ నాయిస్. వెయిట్. నేను డీల్ చేస్తా కదా" అందరూ పకపకా నవ్వులు.

హేమ ఆశ్చర్యంగా చూసింది. దగ్గరదగ్గర డెబ్బై ఉంటుంది వయసు. ఇంత పెద్దావిడ ఇంగ్లీషులో... కాంబాబు మాత్రం ఆవిడకేసి చూడకుండా కోపంగా తల పక్కకి తిప్పేశాడు.

హేమకి అంతా అయోమయంగా అనిపిస్తోంది.

"అబ్బో! అంతా అలకేరా కాంబాబూ! ముందు పేర్లు చెప్పండి ఆ తర్వాత టేక్ యువర్ ఓన్ టైమ్ టు టేక్ ది రాత్ ఆన్ మి"

"అవును. పేర్లు చెప్పి కట్నం ఇస్తేనే లోపలికి రానిస్తాం" చెల్లెలివరుసైన అరడజనుమంది అమ్మాయిలు కోరస్.

"హేమలతా, నేను వచ్చాం. లోపలికి రానియ్యండి" కాంబాబు కోపంగా అరిచినట్లుగా అన్నాడు. అమ్మాయిలు అదేం పట్టించుకున్నట్లు లేరు. హేమకేసి తిరిగారు.

"కమాన్ చెప్పమ్మాయ్" పెద్దావిడ దగ్గరగా వచ్చి హేమ మొహం పైకి ఎత్తింది. కాంబాబు కోపం చూసి బెదిరిపోయిన హేమ భయంగా కళ్ళు ఆర్పింది.

"వాడి గురించి పట్టించుకోకు కోడలుపిల్లా. నువ్వు పేరు చెప్పకపోతే ఇక్కడే ఇలాగే"

"కామేశ్వర్రావుగారు, నేను వచ్చాం" సన్నగా అంది.

"మాకేం వినపించలేదొదినా"

హేమ బెదిరిపోయి చూసింది. వణుకుతున్న చేతిని గట్టిగా పట్టుకున్నాడు కాంబాబు.

"నాకు వినిపించింది" పెద్దావిడ పారాణి నీళ్ళు దిష్టితీసి పళ్ళెం అక్కడున్న నాగమణికి ఇచ్చింది.

"అరిందం మామ్మా! నువ్వూరుకో. మా కట్నం" అమ్మాయిలు మళ్ళీ గోడ కట్టారు. నాని ఐదు వందరూపాయల నోట్లు కాంబాబుకిచ్చి చెల్లెళ్ళకిమ్మన్నాడు. అప్పుడు కాస్త గాలి తగిలి ఊపిరి పీల్చుకుని ఇంట్లోకి నడవబోయింది హేమ.

"రైట్ లెగ్ పెట్టాలమ్మాయ్ ముందు"

"నే చూస్తున్నాలెండత్తయ్యా, పదమ్మా" అమ్మాయిల్ని పక్కకి తోసి కాంబాబు తల్లి మహ లక్ష్మి వచ్చి కొడుకునీ, కోడల్నీ లోపలికి తీసుకెళ్ళింది.

హేమ గట్టిగా ఊపిరి పీల్చి ఇంట్లోకి అడుగుపెట్టింది. ఇంక ఇది తన ఇల్లు. ఎలా ఉంటుందో భవిష్యత్తు.

• • •

"నీ ఫ్యూచర్ గురించేనా? డోంట్ వర్రీ. నీకు రెండుతరాలముందు నేను కూడా నీలాగే తడబడుతున్న అడుగులతో ఈ ఇంటికి వచ్చా. అంతా మనవాళ్ళే"

వీణ మీటినట్లున్న కంఠం. తన చెవి పక్కగా వినిపిస్తుంటే తలతిప్పి చూసింది హేమ.

గుమ్మంలో హారతిచ్చిన పెద్దావిడ, ధైర్యం చెప్తున్నట్లు చెయ్యి పట్టుకుంది. చెరగని చిరునవ్వు, నెరిసిన కనురెప్పలు అల్లల్లాడిస్తూ చూస్తోంది. అప్పటివరకూ నెరిసిన జుట్టునే కానీ కనుబొమ్మల్నీ, కనురెప్పల్నీ చూడని హేమ వింతగా చూస్తుండిపోయింది.

రాజసం ఉట్టిపడుతూ మహారాణీ వేషం వేసిన కన్నాంబలా ఉంది ఆవిడ. వేషానికీ, భాషకీ పొంతన లేకుండా ఉంది. ఇంత ధారాళంగా ఇంగ్లీష్ మాటలు వాడేస్తుంటే మిగిలినవాళ్ళు ఎంతో సహజంగా తీసుకుంటున్నారు.

"దామ్మా! అందాకా నా గదిలో రెస్ట్ తీసుకో. ఆనక తీరుబడిగా తయారవచ్చు"

హేమ అటూ ఇటూ చూసింది. తన పెట్టెలూ అవీ.

"నీ పెట్టెలు కూడా నా గదిలోనే ఉన్నాయి. అక్కడే లైట్ శారీ కట్టుకుని రిలాక్స్ అవచ్చు. అన్నట్లు నా పేరు అరవిందం. అందరూ అరిందం అని పిలుస్తారు. పక్కన వరసలు కూడా తగిలిస్తారనుకో. నేన్నీకు అమ్మమ్మ అవుతాను" హేమ, ఆవిడ వెనుకే వెళ్ళింది.

కరణీకాలు పోయి చాలా ఏళ్ళయినా అలా సంబోధించడం అలవాటైపోయింది. కరణంగారిది మూడు మండువాల లోగిలి. ఒక మండువాలోంచి ఇంకో దాంట్లోకి పెద్ద గుమ్మాలు ఉంటాయి. అరవిందం మధ్య లోగిల్లోంచి ఎడంపక్క మండువాలోకి తీసుకెళ్ళింది హేమని.

మధ్యలో అందరి పలకరింపులకీ చిరునవ్వుతో సమాధానం చెప్తూ, ఎత్తైన గడపలు దాటు కుంటూ అరవిందం గదిలోకి వెళ్ళారు.

చాలా పెద్ద గది. చల్లగా, అప్పుడే వేసిన సున్నం వాసనతో ఆహ్వానం పలుకుతున్నట్లు ఉంది. ఉన్న ఒకే కిటికీకి పల్చని తెర కట్టి ఉంది. ఒక పక్క అద్దం ఉన్న పెద్ద చెక్క బీరువా, ఇంకో పక్క మేజాబల్ల, కుర్చీ, బల్లమీద టేబుల్ లైటు ఉన్నాయి. ఒక గోడకి అద్దాల అలమారు. అందులో ఇంగ్లీషువీ, తెలుగువీ పుస్తకాలు తీరుగా సర్దివున్నాయి.

ఒక గోడకి రవివర్మ చిత్రాలు రెండు, ఇంకో గోడకి పెద్ద ప్రకృతి చిత్రం. పున్నమి వెన్నెల్లో అన్నాపురం. ఊరు మొదట్లో ఉన్న కాలువ, వంతెన, కొబ్బరిచెట్లు. చిత్రకారుడి పేరు లేదు. కానీ

రంగుల కలయిక అద్భుతంగా ఉంది. నిజంగా అక్కడ వెన్నెల్లోనుంచున్నట్లే ఉంది. అరవిందంగారి అభిరుచి అంతా పట్నవాసం పోకడ చూపిస్తోంది. హేమపెట్టెలన్నీ ఓ వారగ పెట్టివున్నాయి.

"అమ్మమ్మగారూ! ఈ పెయింటింగ్"

"నే వేసిందేనమ్మా! అప్పుడెప్పుడో వేస్తూవుండేదాన్ని. మానేసి చాలా ఏళ్ళయింది"

ఎంతమంది చిత్రకారులు ఇలా అనామకంగా ఉండిపోతున్నారో, ఆరాధనగా ఆవిడనే చూస్తుండిపోయింది హేమ.

"చీర మార్చుకుని రామ్మా! బాత్రూమ్ అదీ చూపిస్తా" అరవిందం గది తలుపు దగ్గరగా వేసి వెళ్ళిపోయింది. హేమ దడదడలాడుతున్న గుండెతో నిలబడిపోయింది కాసేపు. కాంబాబు చేసిన చిలిపిపని ఇచ్చిన షాకు ఇంకా వదల్లేదు.

"హేమా!" ఎవరో తలుపు కొడుతున్నారు.

"ఇక్కడున్నావా? నీకోసం ఇల్లంతా వెతికాను సుమా. మా బండి కొంచెం వెనకబడింది" హేమ మేనత్త మాణిక్యం లోపలికొచ్చి సంబరంగా చూసింది.

"అత్తయ్యా!" హేమ బల్లిలా కరిచిపెట్టుకుని వెక్కి వెక్కి ఏడవసాగింది.

"ఏమయిందే. వచ్చి క్షణం కాలేదు. ఎవరైనా ఏమయినా అన్నారా? అమ్మనొదిలి వచ్చాననా. పిచ్చిపిల్లా! మొదట్లో అలాగే ఉంటుంది. ఒక నెల పోయాక చూడు. నువ్వే ఇక్కడ రాజ్యం ఏల్తావు" మాణిక్యం వీపు నిమురుతూ ఓదార్చింది.

హేమ నెమ్మదిగా తేరుకుని, పెట్టెలోంచి కనకాంబరం రంగుమీద ఎర్రచుక్కలున్న ఫుల్ వాయిల్ చీర తీసి కట్టుకుంది. దానిమీదికి ఎర్ర జాకెట్టు.

"బాగున్నావే హేమా! మొహం కడుక్కుని కాసేపు నడుం వాల్చు. పెళ్ళి హడావుడిలో ఏం తిన్నావో, ఏవయినా తింటావా?" మాణిక్యం అడుగుతుండగానే, అరటి ఆకుల్లో వేడి వేడి బజ్జీలు తీసుకొచ్చింది అరవిందం. వెనుకే మరచెంబులో నీళ్ళు పట్టుకుని నాగమణి.

"అయ్యయ్యో! మీరు తెచ్చారా? మేమే వచ్చేవాళ్ళం అత్తయ్యగారూ" మాణిక్యం చటుక్కున అరిటాకులు అందుకుని ట్రంకుపెట్టెమీద కూర్చుంది.

పక్కనే హేమకూడా కూర్చుని మొహమాటంగా చూసింది.

"ఇవేళ నేను తెచ్చానా, కొన్ని రోజులయితే హేమ నాకు తెస్తుందనీ" నవ్వుతూ వెళ్ళిపోయింది అరవిందం, కూడా నాగమణీ.

• • •

"ఇదేనమ్మాయ్. బ్యాక్‌యార్డ్. బాగుందా?" విశాలమైన పెరడు చూపిస్తూ అంది అరవిందం. అప్పటికి హేమకి అరవిందం ఇంగ్లీష్ అలవాటైపోయింది.

హేమ బజ్జీలు తిని, మంచంమీద వాలింది. అంతే, రెండు గంటల తర్వాత లేచింది.

నాగమణి తెచ్చిన టీ తాగి, బాత్రూమ్ ఎక్కడుందో అడిగి మొహం కడుక్కుని మండువా లోకి రాగానే అరవిందం తోట చూపిస్తానని తీసుకొచ్చింది.

తీరుగా పెంచిన అనేకరకాల వృక్షాలతో కళకళ్ళాడుతోంది పెరడు.

రకరకాల పూలమొక్కలు పువ్వుల గుత్తులతో భారంగా తలలూపుతున్నాయి. హేమ పరవశంగా చూస్తోంది. తమ ఇంట్లో కూడా పెద్ద పెరడే కానీ ఇలా తీర్చిదిద్దినట్లు ఉండదు. పైగా హేమ నాలుగేళ్ళనుంచీ ఏలూరులో హాస్టల్లో ఉండి బి.ఏ చదివింది. సెలవులకి వచ్చినప్పుడు స్నేహితురాళ్ళతో అటూ ఇటూ తిరగడం సరిపోయేది.

హేమ చదువు చూసే, కాంబాబు ఇష్టపడి తనని తప్ప చేసుకోనని పట్టుబట్టాడు. అంతే కాక, చూడచక్కని రూపం హేమది.

సంబంధం చెప్పినప్పుడు అన్నాపురం కరణంగారితో తూగగలమా అని సందేహించారు హేమ తల్లిదండ్రులు. పిల్లవాడు బుద్ధిమంతుడు. వాళ్ళకి ఆస్తి, అంతస్థులతో పనిలేదూ అంటూ ఒప్పించారు మధ్యవర్తులు.

సాయం సంధ్యలు అలముకుంటున్నాయి పెరడంతా. రంగురంగుల గులాప్పువ్వులు సంధ్యకిరణాల కాంతులతో రంగులు మార్చుకుని వింతగా కనిపిస్తున్నాయి.

చల్లగాలికి పరవశంతో ఊగుతున్నాయి. అందులో పసుప్పచ్చ గులాబీని చేత్తో ముట్టుకో బోయింది హేమ.

"అమ్మాయిగారూ! ఆగండాగండి ముళ్ళు గుచ్చుకుంటాయి. నే కోసిత్తా..." నాగమణి పరుగెత్తుకుంటూవచ్చింది.

"అబ్బెబ్బే! కొయ్యద్దు. చెట్టునుంటేనే అందం. ఊరికే చేత్తో పట్టుకుని చూద్దామనీ, అంతే. చాలా బాగుంది అమ్మమ్మగారూ తోట"

"ఈ గులాబీలన్నీ బెంగుళూరు నుంచి తెప్పించి వేశాడమ్మా నాని. వాడికే ఇంటరెస్ట్ బాగా. వెనక పెరడయితే, లాన్లూ, జంతువుల ఆకారాల్లో కత్తిరించిన రకరకాల చెట్లూ, సెలయేర్లూ, అచ్చు బృందావన్ గార్డెన్లా ఉంటుందనుకో. ఇప్పుడు డార్క్ అయిపోతోంది కదా... రేపు చూద్దాం" అరవిందం ఇంట్లోకి నడిచింది.

ఇంతకీ ఈ అరిందం మామ్మ ఎవరో, చూడబోతే చాలా ముఖ్యమైన వ్యక్తిలాగే ఉంది. మరి పెళ్ళికెందుకు రాలేదో, తాతగారెక్కడున్నారో, అన్నీ సందేహాలే. ఎవర్నయినా అడగాలంటే మొహమాటం. తలదించుకుని అరవిందం వెనుకే వెళ్తోంది హేమ.

"ఇక్కడున్నావా? నీకోసం ఇల్లంతా వెతుకుతున్నా" కాంబాబు రెండు చేతుల్లోనూ కొబ్బరి బొండాలు పట్టుకుని ఎదురొచ్చాడు.

హేమ మొహం ఎర్రగా అయిపోయింది. ఎవరైనా చూస్తే ఏమనుకుంటారూ. అటూ ఇటూ చూసింది. ఎవరూ కనిపించలేదు. అందరూ మర్నాటి వ్రతానికి ఏర్పాట్లు చెయ్యడంలో మునిగి పోయారేమో! హేమ మూగదానిలా చేతులు కట్టుకుని నిలబడిపోయింది.

"అదో, అక్కడ కూర్చుని బొండం తాగుతూ మనసు విప్పి మాట్లాడుకోండమ్మా. లైటు కూడా ఉందక్కడ. ఏరా! ఇంకా కోపవేనా" కాంబాబు వీపుమీద ఆప్యాయంగా తట్టి, జాజి పంది రికీ, మల్లెపాదకీ మధ్యనున్న బెంచీ చూపించింది అరవిందం.

"పెళ్ళికి రాకుండా కబుర్లు ఎన్నైనా చెప్తావు. అసలు రాకుండా ఎలా ఉండగలిగావు మామ్మా" కాంబాబు బుంగమూతి పెట్టాడు.

"ఏం చెయ్యనురా, మీ తాతగారు లేకుండా ఏ ఫంక్షన్‌కీ రానని నీకు తెలుసుకదా! అండర్ స్టాండ్ చేసుకోవాలి మరి. నేను ఇక్కడుండి ఏర్పాట్లన్నీ చేశాను కదా"

కాంబాబు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. బొండాలు హేమకిచ్చి అరవిందం కాళ్ళకి దండం పెట్టి గట్టిగా కౌగలించుకున్నాడు.

"వెర్రి నాగన్నా" అంటూ నుదుటిమీద ముద్దు పెట్టుకుని, హేమని కూడా పిలిచి ఇద్దర్నీ దగ్గరగా తీసుకుని అంది అరవిందం. "విష్ యు హాపీ మారీడ్ లైఫ్. ఒకళ్ళనొకళ్ళు అర్థంచేసుకుని హండ్రెడ్ ఇయర్స్ హ్యాపీగా ఉండండి. భార్యాభర్తలంటే ఎవరూ విడదీయలేని స్నేహితులన్నమాట. ఒకర్నొకరు ఎప్పుడూ విడిచివుండకండి. ఎమర్జెన్సీ అయితే తప్ప" ఆ మాటలంటుంటే అరవిందం గొంతు గాద్గదికమయింది.

• • •

హేమ తలదించుకుని కూర్చుంది.

"రెండూ నువ్వే తాగేస్తావా? తులసికోట వెనకున్న గంగా బొండం చెట్టువి. ఎంత తియ్యగా ఉంటాయో"

హేమ చటుక్కున రెండు బొండాలూ కాంబాబు చేతుల్లో పెట్టబోయింది.

"ఊఁ! అంతా నాకేనని కాదు, ఇప్పట్నుంచీ మనిద్దరం ఏదైనా పంచుకోవాలనీ. అసలు ఒకటే బొండం తియ్యమంది అరిందం మామ్మ. పూర్తిగా తాగితే కానీ నాకు తృప్తిగా ఉండదు. అందుకనీ" ఓరగా చూస్తున్న హేమ కళ్ళల్లో నీళ్ళు చూసి ఆగిపోయాడు.

"అంతమందిలో మీరు ఇందాక అలా చెయ్యడం నాకేం బాగులేదు తెలుసా" బుంగ మూతి పెట్టింది.

"అవన్నీ చిలిపిసరదాలోయ్! ఆమాత్రం లేకపోతే ఎలా? కావాలంటే అమ్మమ్మల్నీ, మామ్మల్నీ అడుగు. నలభై యాభైయ్యేళ్ళ క్రితం మన తాతలు వాళ్ళూ ఎటువంటి శృంగారపురుషులో చెప్తారు. ఇంద, ఈ చల్లటి బొండం తాగు. ఒళ్ళూ, మనసూ కూడా చల్లబడ్తాయి. ఈ చల్లని సాయంకాలం కోపం, అలుక తప్ప ఇంకే రసమయినా ఫరవాలేదు"

"బీభత్స, భయానక రసాలైతే కూడానా" చీరమీదపడకుండా జాగ్రత్తగా ఎత్తి బొండం నీళ్ళు తాగుతూ అంది హేమ చిలిపిగా చూస్తూ.

"అబ్బో! ఏదో అమాయకంగా ఉన్నావనుకున్నా. ఘటికురాలివే. అలాంటివి మన ఇంటి వాకిట్లోకి కూడా రావడానికి వీల్లేదు. అసలు ఆనందంగా ఎలా ఉండాలో అరిందం మామ్మని చూస్తే తెలుస్తుంది. మాకందరికీ ఆవిడే ఆదర్శం.

హేమ ఫక్కున నవ్వింది.

కాంబాబు తెల్లబోయి చూశాడు.

"ఇందులో నవ్వడానికి ఏముంది. నువ్వు నవ్వుతుంటే చాలా బాగున్నావనుకో"

"అదేం లేదు. అమ్మమ్మగారయితే రోల్‌మోడల్ అనేవారు అనుకుంటే" చీరకొంగు అడ్డు పెట్టుకుని మళ్ళీ నవ్వింది హేమ.

"మధ్యలో ఆ కొంగెందుకూ. హాయిగా ఫ్రీగా నవ్వేయ్. మన ఇంట్లో ఎప్పుడూ నవ్వులే నవ్వులు. అవును, అరిందం మామ్మ ఎక్కువ ఇంగ్లీష్ పదాలు వాడుతుంది"

"ఆవిడ ఆ వయసులో ఎలా నేర్చుకున్నారూ? అసలు ఎబ్బెట్టుగానే లేదు. వేషానికీ, భాషకీ పొంతన లేకపోయినా. నిజంగానే బొండం నీళ్ళు చాలా బాగున్నాయండీ. చాలా థ్యాంక్స్. లోపల సిస్టం అంతా కూల్ అయిపోయింది"

"ఓయ్... ఓయ్... నీకూ మా మామ్మ భాష వచ్చేస్తోందే"

"అదేంలేదు. మేం హాస్టల్‌లో ఇలాగే మాట్లాడుకుంటాం. అరిందం అమ్మమ్మగారికి ఎలా అలవాటయిందీ. ఆవిడ వయసువాళ్ళు ఐదో క్లాసు దాటి చదివుండరు మన ఊళ్ళల్లో.

అసలు ఆవిడ మీకు ఎలా మామ్మ అయ్యారూ. తాతగారు ఎక్కడున్నారూ?" హేమ గోటితో కొబ్బరిబొండంలోని గుంజు బయటికి లాగుతూ అడిగింది.

"మా తాతగారి తమ్ముడి భార్య. మాదంతా జాయింట్ ఫ్యామిలీ. ఆయన లండన్‌లో బారిస్టర్. అరెరే, ఏమిటా రక్తం" గాబరాగా హేమ చేతిని చూస్తూ చటుక్కున రక్తం కారుతున్న వేలు తీసి నోట్లో పెట్టుకున్నాడు కాంబాబు.

"కొబ్బరిపేడు గుచ్చుకున్నట్లుంది. దీనికింత హడావుడి చెయ్యాలా?" హేమ వేలు లాక్కోబోయింది.

"ఉండుండు. వేల్లో పేడు ఉండిపోయినట్లుంది. ఇన్ఫెక్షన్ వస్తుంది. మామ్మా! అమ్మా" గట్టిగా కేకలుపెట్టాడు.

"ఏం లేదు. ఇదిగో వచ్చేసింది. రక్తం కూడా ఆగిపోయింది. ఊరుకోండి. ప్లీజ్" ఎవరైనా చూస్తే ఏమైనా అనుకుంటారేమోనని బెదురుగా చూస్తూ అంది హేమ.

"కొబ్బరిపేడు ధర్మమా అని నన్ను దగ్గరగా రానిచ్చావు. చిన్నప్పుడు చదువుకున్న కొబ్బరి ఉపయోగాల్లో ఇది కూడా చేర్చాలి" కొంటెగా చూస్తూ, ఒక చేత్తో హేమ భుజం పట్టుకుని దగ్గరగా లాక్కుంటూ ఇంకో చేత్తో హేమవేలు దగ్గరగా తీసుకుని పరీక్షగా చూశాడు.

ఒక్కసారిగా పెరట్లో లైట్లు వెలిగాయి. ఏమయిందేమయిందంటూ అరిందం మామ్మ వచ్చేసింది. హేమ ఉలిక్కిపడి దూరంగా జరిగింది.

"అయ్యయ్యో రక్తం వచ్చిందా?" కాంబాబు చెప్పిన కొబ్బరిపేడు సంగతి విని ఆదుర్దాగా అడిగింది అరిందం మామ్మ.

"అబ్బెబ్బే, ఏం లేదండీ" హేమ గబగబా నడుచుకుంటూ ఇంట్లోకి వెళ్ళిపోయింది.

"మామ్మా! మంచి సమయంలో లైట్లేసి వచ్చేశావుకదా మామ్మా!" పళ్ళు నూరుతూ, చేసేదేం లేక కాంబాబు కూడా నెమ్మదిగా లేచాడు నిరాశగా.

అరవిందం నవ్వుతూ నిలబడిపోయింది.

• • •

హాల్లో ఉన్న పెద్ద గడియారం నాలుగు గంటలు కొట్టింది.

దూరంగా ఎడ్లు ఒళ్ళు విరుచుకుంటున్నట్లు గంటల శబ్దం వినిపిస్తోంది.

"అమ్మమ్మగారూ! మీరు కూడా రెండెడ్లబండిలోనే వచ్చారా అత్తవారింటికి?" పొడవాటి

జుట్టు చిక్కు తీసి జడవేస్తున్న అరవిందాన్ని అడిగింది హేమ. పెళ్ళి అలసట తీరక ఇంకా ఇంట్లో మిగిలినవాళ్ళెవరూ నిద్ర లేవలేదు. కొత్తచోటు... హేమకి నిద్రపట్టలేదు. ఎప్పుడు తెల్లవారుతుందా అని చూస్తూ కూర్చుంది మంచంమీద. నట్టింట్లో ఏవో శబ్దాలు అవుతుంటే లేచి వెళ్ళింది. అప్పటికే అరవిందం స్నానం చేసేసి కాఫీ డికాక్షన్ వేసేసింది.

ఇద్దరూ పంచలో కూర్చుని పక్షుల కిలకిలారావాలు వింటూ, కృష్ణపాడ్యమి వెన్నెల ఆస్వాదిస్తూ కాఫీలు తాగారు. హేమని కూడా స్నానం చేసి రమ్మని, పంచలోనే జడ వెయ్యడానికి కూర్చుంది అరవిందం.

"అరవై ఏళ్ళ పైమాటే. పెళ్ళినాటికి నాకు పన్నెండేళ్ళు. పీలగా, పొట్టిగా ఉండేదాన్ని. మీ తాతగారు ఆజానుబాహువు. నాకంటే పదేళ్ళు పెద్ద. పల్లకీలో తీసుకొచ్చారు. మా ఊర్నించి ఇక్కడికి నాలుగు మైళ్ళు కూడా ఉండదు దూరం. ఆడవాళ్ళు, పిల్లలు బళ్ళమీద వస్తే, మగవాళ్ళు నడిచేశారు'' అంది అరవిందం.

"అప్పుడు తాతగారు ఏవైనా చిలిపిపనులు చేశారా పల్లకిలో?'' సన్నగా, వినీ వినిపించకుండా అడిగింది హేమ.

సిగ్గుతో మొహం ఎర్రగా కందిపోయింది. కాంబాబు ఏదో అన్నాడని పంతం కొద్దీ ధైర్యం చేసి అడిగేసింది కానీ పెద్దావిడ ఏమనుకుందో అని భయం వేసింది.

నెమ్మదిగానే అడిగినా హేమ మాటలు అరవిందానికి స్పష్టంగానే వినిపించాయి. జుట్టు వదిలేసి, వణుకుతున్న భుజం మీద చెయ్యి వేసి తనవైపుకి తిప్పుకుంది.

"పిచ్చిపిల్లా! మావాడు అల్లరిచేశాడా బండిలో? అందుకేనా నిన్నంతా వాడిమీద కోర చూపులు విసిరావు! ఇవేళ సత్యనారాయణ వ్రతం. మీవాళ్ళంతా వస్తారు. చదువుకున్న పిల్లవి. రాత్రికి శోభనం. పల్లెటూర్లు కదా, ఏవో పూజలూ అవీ ఉంటాయి. సిగ్గుపడ్డం సహజమేకానీ సంతోషంగా ఉండు. ఇప్పటి ఈ బిడియం, అందం, ఫీలింగ్ మళ్ళీ వస్తాయా?

ఫ్యూచర్లో తలుచుకుంటే మధురానుభూతుల్లా ఉండాలి. గడిచిన కాలం మళ్ళీ రాదు. టైమ్ అండ్ టైడ్ వెయిట్ ఫర్ నన్. హాయిగా ఎంజాయ్ చెయ్యండి'' హేమ చుబుకం కింద చూపుడు వేలుంచి మొహం పైకెత్తి కళ్ళల్లోకి చూస్తూ అంది.

హేమ కళ్ళు అప్రయత్నంగా కిందికి వాలిపోయాయి.

అరవిందం కళ్ళు విశాలంగా ఉంటాయి.

అరమోడ్పు కన్నులతో చూస్తూ ఆప్యాయంగా అంటుంటే ఆ కంఠం వింటూ అలా ఒళ్ళో వాలిపోవాలనిపించింది హేమకి. అలాగే అన్నట్లు తలూపి మళ్ళీ అడిగింది.

"తాతగారు పల్లకీలో...''

"అదా! గడుసుదానివే. వదలట్లేదు నన్ను. అర్ధరాత్రి ముహూర్తం. ఐదు రోజులూ ఏవేవో వేడుకలు, పూజలూ, అగ్నిహోత్రాలు అంటూ వాయించేశారు. ఇంకా మీకు ఇప్పుడు చాలా రిలాక్సేషన్స్ ఉన్నాయి. అప్పుడు సదస్యం అని నాలుగో రోజు చేస్తారు చూడు. వేదపండితులు ఆశీర్వదిస్తారు. దానికి ఆరుగంటలు కూర్చోపెట్టారు పీటలమీద.

నాగవల్లి తలంటు, బరబరలాడే పసుపుబట్టలు తీసేసి మెత్తని పట్టులంగా ఓణీ వేసుకున్నాను. పెందరాళే కడుపునిండా తిని బయలుదేరామేమో, పల్లకీ ఎక్కుతూనే పరిసరాలు పట్టించుకోకుండా మీ తాతగారి ఒళ్ళోపడి నిద్రపోయా.

పల్లకి ఇంటిదగ్గరికి వస్తుంటే సన్నాయి మేళానికి తెలివొచ్చింది. లేస్తుంటే, మీ తాతగారితో సహా అందరూ ఒకటే నవ్వులు" హావభావాలతో చెప్తుంటే హేమకి కూడా నవ్వాగలేదు.

అలా నవ్వుతూనే ముందుకి జరిగి అరవిందం ఒళ్ళో తలపెట్టి పడుకుండిపోయింది.

అరవిందం, హేమ ముంగురులు సవరించి లేచి, తలగడా తెచ్చి తల ఎత్తి కిందపెట్టి, దుప్పటి కప్పింది.

హేమ అదేమీ గమనించనంత గాఢనిద్రలోకి జారుకుంది.

పెరటి సావిట్లో మొదలయిన వంటవాళ్ళ హడావుడి, పాలేళ్ళ కేకలూ, పాలు పితుకుతుంటే గొడ్ల సావిట్లో దూడలు చేస్తున్న సందడీ, ఒక్కొక్కళ్ళే ఇంట్లోవాళ్ళు లేచి తిరుగుతూ చెప్పుకుంటున్న మాటల శబ్దాలూ, ఏవీ హేమని కదలించలేదు.

పంచలో పాల్దాలి పక్కన ముడుచుకుని పడుకున్న హేమనికూడా ఎవరూ గమనించలేదు. అక్కడంతా చీకటి చీకటిగా ఉంటుంది.

● ● ●

కరణంగారింట్లో సందడి మొదలయింది. వీధి వీధంతా తుడిచి, పేడనీళ్ళు చల్లి, సంక్రాంతికి వేసినట్లు ముగ్గులు పెట్టారు అమ్మాయిలందరూ.

కచేరీహాల్లో పెద్ద గడియారం ఏడుగంటలు కొడుతుండగా అరవిందం ఈతాకు బుట్ట సంచీలో కొబ్బరికాయ, అగరొత్తులు, పువ్వులు, హారతికర్పూరం తీసుకుని రాములవారి గుడికి బయలుదేరింది. అన్నాపురంలో ఉన్నన్ని రోజులూ క్రమం తప్పకుండా వెళ్తుంది.

కాలవొడ్డున, కొబ్బరిచెట్ల మధ్యలో ఉన్న ఆ గుడి అంటే అరవిందానికి ఎంతో ఇష్టం. ఏ నాటిమాట. యాభై ఏళ్ళు పైగా ఎన్నిసార్లు వచ్చిందో లెక్కలేదు.

భార్యని వదిలేసి ఎన్నో సంవత్సరాలు రాజ్యం చేసిన రాముడు, ప్రతి ఆలయంలోనూ తన పక్కనే ఉంచుకుంటాడు. అదేమిటో మరి! తన దేహంలోనే సగభాగంలో ఉంచుకున్న అర్ధనారీశ్వరుడు, అమ్మవారిని ప్రతి గుళ్ళోనూ దూరంగా ఉంచుతాడు. ఎంత విచిత్రం. తమ ఊరి గుడిలో ఉన్న ప్రశాంతత మరెక్కడా కనిపించదు అరవిందానికి.

మనసు బాగా లేకపోతే, గుళ్ళో ఓ పక్కగా కూర్చుని, సీతారాముల విగ్రహాలని చూస్తుంటే చాలు. అక్కడే కాలం ఆగిపోకూడదా అనిపిస్తుంది.

అరవిందం గుడివాకిట్లో ఉండగానే ఆడపెళ్ళివారి బళ్ళు వెళ్ళడం కనిపించింది. ఇంట్లో ఎంత హడావుడి జరుగుతున్నా తన పూజ యధావిధిగా జరుపుకుంటుంది.

పదకొండు ప్రదక్షిణాలు చేసి అష్టోత్తరం అయ్యాక విష్ణుసహస్రనామాలు చదువుకుని, పూజారి భాస్కరశర్మగారితో గుడి విషయాలు చర్చించి ఇంటికి వెళ్తుంది.

ఆ రోజు కూడా అలాగే శ్రద్ధగా నామాలు చదవడం మొదలుపెట్టింది.

● ● ●

"హేమా! హేమా... అందరూ వచ్చేశారు. ఇంకా ఆ నిద్రేమిటే? తలంటుకుని పూజకి తయారవ్వాలి" అరవిందం గదిలోకి వచ్చి హేమని లేపబోయిన మాణిక్యం, ఖాళీ గదిని చూసి వెనక్కి తిరిగి ఇల్లంతా వెతికింది.

"స్నానానికెళ్ళిందేమో చూడు. వ్రతానికి కట్టుకోవలసిన చీర నా పెట్టెలో ఉండిపోయింది. తీసుకొచ్చా" హేమ తల్లి సుభద్ర, మాణిక్యం వెనుకే తిరుగుతూ అంది.

"వదినా! ఎక్కడా కనిపించడంలేదు. స్నానాలగదిలో హేమ అత్తగారు ఉంది. ఆవిడా చూడలేదట" మాణిక్యం గాబరాగా అంది.

"ఆ పక్క మండువా చూశావా? నెమ్మదిగా పిలు. మగవాళ్ళకి వినిపిస్తుందేమో"

"అక్కా... అక్కా... పెరడు ఎంత బాగుందో చూశావా? అక్కేదీ" హేమ చెల్లెళ్ళిద్దరూ ఇల్లంతా చుట్టబెట్టి పరుగెత్తుకుంటూవచ్చారు.

"అక్క పెరట్లో లేదా?"

"లేదమ్మా. అక్కడక్కడా పొదలు కూడా ఉన్నాయి. సరదాగా లోపలికి తొంగిచూశాం కూడానూ"

నలుగురూ నాలుగు మూలలా వెతకడం మొదలుపెట్టారు. సుభద్ర గాబరాగా అటూ ఇటూ తిరుగుతూ మహాలక్ష్మి కంటపడింది. కన్ను మూసి తెరిచేలోగా ఇంటెడుమందీ వెతకడం మొదలుపెట్టారు.

కాంబాబు ఆందోళనగా అటూ ఇటూ తిరుగుతున్నాడు.

"పెళ్ళికూతురు కనిపించడంలేదట" ఒక్కసారిగా వార్త గుప్పుమంది.

"అసలేమయింది?" కరణంగారు తన గదిలోంచి బయటికి వచ్చి కనుక్కున్నారు.

"ఇంత పొద్దున్నే ఎక్కడికెళ్ళుంటుందీ"

"నిన్నంతా మొహం ముడుచుకునేవుంది"

"అవునవును, కళ్ళు ఎర్రగా ఉన్నాయి"

"అసలు పెళ్ళి ఇష్టమవునో కాదో కనుక్కున్నారా, అసలే చదువుకున్న పట్నం పిల్లలు. ఎన్నాళ్ళు కాపురాలు చేస్తారో తెలియడంలేదీమధ్యన"

బంధువులంతా తలో మాటా, వింటున్న సుభద్రకి, మాణిక్యానికి కళ్ళనీళ్ళు ఆగట్లేదు.

"అరిందం మామ్మేదర్రా?" ఎవరో గట్టిగా అన్నారు.

"గుడికెళ్తుంటే చూశాం. కానీ ఆవిడొక్కరే ఉన్నారే! అదిగో వస్తోంది. ఒక్కత్తే"

ఇంట్లో జరుగుతున్న గందరగోళం చూసి నెమ్మదిగా నడుస్తున్న అరవిందం పరుగు పెడుతున్నట్లు వచ్చింది.

"ఏమయింది?"

"పెళ్ళికూతురు కనిపించడంలేదత్తయ్యా" మహాలక్ష్మి ఏడుపు గొంతుతో అంది.

అరవిందం ఆందోళనగా చూస్తూ పాలదాలి దగ్గరికి వెళ్ళింది. అంత గొడవకీ కారణమైన హేమ వెచ్చగా ముడుచుకుని నిద్రపోతోంది.

అరవిందం దుప్పటి తీసి హేమని లేపింది.

"అమ్మమ్మా! ఇంకాసేపు పడుకుంటా" గారంగా అంటున్న హేమని చూస్తూ, అందరూ తేలిగ్గా నిట్టూర్చారు. అందరి మొహాల్లోనూ నవ్వులు.

సుభద్ర మాత్రం కోపంగా హేమ దగ్గరికి వెళ్ళబోయింది. "అందర్నీ ఎంత గాబరా పెట్టేశావే. అంత ఇల్లుండగా ఇక్కడ పడుకున్నావేంటే?" ఆవేశంతో జీరబోయిన అమ్మ గొంతు విని బిత్తర బోయింది హేమ. అర్థంకానట్లు అయోమయంగా మొహం పెట్టింది.

పసిపిల్లలా, కళ్ళు పెద్దవి చేసి, పంచంతా నిండిన బంధువులందర్నీ ఆశ్చర్యంగా చూస్తూ చటుక్కున లేవబోయింది.

అనేక విధాలుగా, కళ్ళెం లేని గుర్రంలా పరుగెత్తిన తమ ఆలోచనలకి సిగ్గుపడ్డారు బంధువులు. ఒక్కసారిగా దగ్గరకు తీసుకుని, భయం లేదు, నేనున్నానని ఓదార్చాలనిపించింది కాంబాబుకి.

"భలేవారేనర్రా! కొత్తచోటుకదా, రాత్రి నిద్రపట్టలేదట. నేను పని చేసుకుంటుంటే నట్టింట్లోకి వచ్చింది. స్నానం చేయించి, జడ అల్లుతుంటే, వెచ్చగా ఉందేమో అలాగే నా ఒళ్ళో నిద్రపోయింది పిచ్చిపిల్ల. అది తయారయిపోయింది. మొహం ఓసారి కడుక్కుంటే చాలు. నడవండందరూ... భాస్కరశర్మగారు వచ్చేస్తున్నారు. మళ్ళీ వర్జ్యాల వేళవుతుందిట"

అరిందం మామ్మ అందర్నీ హడావుడి చేసింది.

• • •

కరణంగారి మధ్య మండువా చాలా పెద్దది. పైగా మండువాలో సామాన్లేం ఉండవు. ఎర్రటి నున్నటి గచ్చు మెరిసిపోతోంది.

మండువా పైనుంచి వచ్చే నీరెండ స్తంభాలమధ్యలోంచి ప్రతిబింబిస్తూ తీరుగా వేసిన ముగ్గుల అందాలని రెట్టింపు చేస్తోంది.

వధూవరులు తూర్పుదిశగా కూర్చునేలాగ ఒకపక్కగా సత్యనారాయణస్వామి పటం, విగ్రహాలు పెట్టించి రంగురంగుల పువ్వులతో అలంకరించారు. అన్ని ఏర్పాట్లూ అరిందం స్వయంగా దగ్గరుండి రాత్రి చాలాసేపు పిల్లలచేత చేయించింది.

"ఎవర్రా... ఆడపడుచు కట్నాలు తీసుకోగానే సరికాదు. రండి రండి తలో చెయ్యి వేస్తే క్విక్‌గా అయిపోతుంది పని. కమాన్"

"వచ్చేస్తున్నాం అరిందం మామ్మా! లేత అరిటికాయలు బూరెల్లా వేయించారు వంటవాళ్ళు. బాగా ఎంజాయ్ చేస్తూ తింటున్నాం. చారైతే అదిరిపోయిందనుకో. నువ్వు దగ్గరుండి కొట్టించిన గుండేనా వాడింది" భుజాలు దాటని జుట్టుని రెండు జళ్ళు వేసుకుని జడలు గడియారం ముల్లుల్లా ఊపుతూ అంది కామేశ్వర్రావు పిన్నికూతురు.

"మరీ ఎక్కువ లాగించకండి. మండువా మూల పడుకుండిపోతారు. లేవండి... లేవండి" అరవిందం అందర్నీ తరిమి, చేమంతులు, కాడమల్లెలు, కనకాంబరాలు మాలలు కట్టించింది. మధ్యలో మరువం, దవనం కాడలుపెట్టి.

గుమ్మాలకి మావిడి తోరణాలు, బంతిపూదండలు సరేసరి.

పొద్దున్న ఆడపెళ్ళివారొచ్చే సరికి ఇల్లంతా సహజ సువాసనలతో ఘుమఘుమలాడిపోతోంది. పూలదండల్ని జానెడేసి ముక్కలు కింద కత్తిరింపించి, పళ్ళాల్లో సర్దించి, పళ్ళూ, తాంబూలాలు... అన్నీ తయారుగా పెట్టి మరీ పడుకున్నారు అందరూ.

సరిగ్గా తొమ్మిది గంటలకి కాంబాబుని, హేమని పీటలమీద కూర్చోపెట్టారు.

భాస్కరశర్మగారు అరగంట ముందుగానే వచ్చి తనకి కావలసిన పూజా సామగ్రి అంతా చూసుకున్నారు. పసుపు వినాయకుడికి పూజ చేస్తుండగానే ఊళ్ళోవాళ్ళు గుంపులుగా రావడం మొదలుపెట్టారు. అందరికీ కాఫీలు, ఉప్మా అందాయా లేదా చూసుకుని, చాపలమీద కూర్చోపెడు తున్నారు అమ్మాయిలు.

పనులన్నీ ఒక గాడిలో పడ్డాక అరవిందం, హేమ కనిపించేలా గోడకి ఆనుకుని కూర్చుంది. నునుసిగ్గులతో ఓరచూపు చూస్తూ కూర్చుని శ్రద్ధగా గురువుగారు చెప్తున్నది వింటున్న హేమనీ, కొంటెగా మధ్యలో ఎడంచేత్తో చీర అంచు కిందనుంచి తొంగిచూస్తున్న హేమ కాళ్ళకి చక్కిలి గింతలు పెడుతూ, కోపంగా చూడబోయిన భార్యని తప్పించుకుని అన్యమనస్కంగా పూజ చేస్తున్న కాంబాబునీ చూస్తూ నవ్వుకుంది అరవిందం.

నుదుట కళ్యాణం బొట్టు, చెవులకి రవ్వల దుద్దులు, మెడలో మెరుస్తున్న మంగళసూత్రం, నల్లపూసలతో కంఠం దగ్గరగా అమరే అత్తవారిచ్చిన రవ్వల నెక్లెస్ మాత్రం పెట్టుకుంది హేమ. నూతనవధువు అందం ఎంత వర్ణించినా తనివితీరదు.

అత్తగారింట్లో తొలిరోజు. బెదురుచూపులతో, ప్రతిదీ వింతగా చూస్తూ మధ్యలో కళ్ళు వాల్చి ఆలోచిస్తూ, సిగ్గుదొంతరల మధ్య ఇమిడిపోయే కొత్త కోడల్ని చూసి అరవిందం కళ్ళు తిప్పుకుంది, తన దిష్టే తగులుతుందేమోనని.

కన్నులు అరమోడ్పులు చేసి చూస్తుంటే తన జీవితం కళ్ళకి కట్టినట్లు కనిపించసాగింది. అరవైఏళ్ళ క్రితం సరిగ్గా ఇలాగే...

• • •

ఇదే మండువాలో పసుపు పచ్చని పట్టుచీర, ఎర్ర జాకెట్టు. మెడలో మోయలేనన్ని నగలు వేసుకుని కాటుక కళ్ళతో ఓరకంట పరిసరాలు గమనిస్తూ భట్టుపక్కన కూర్చుని పూజ చేస్తోంది అరవింద. పధ్నాలుగేళ్ళు కూడా నిండని మొహంలో పసితనపుఛాయలు ఇంకా వదల్లేదు.

నాలుగు రోజుల్లో బొంబాయి ప్రయాణం. తలుచుకుంటే గాబరాగా ఉంది. మూడు రోజుల ప్రయాణం. అంత పెద్దపట్నంలో భాష రాకుండా ఎలా ఉండడం.

లైబ్రరీలో చదివిన పుస్తకాలు ఇచ్చిన విజ్ఞానం ఎంతవరకూ పనికొస్తుంది.

అసలు ఇంకా చదువుకుంటానంటే వినకుండా పెళ్ళి. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

అప్పుడే రెండేళ్ళయింది.

అరవింద తన ఈడు పిల్లలందరితో పోలిస్తే చాలా చురుకుగా ఉండేది.

“అమ్మో! ఇది ఏకసంథాగ్రాహే కాకుండా దీని జ్ఞాపకశక్తి అమోఘంరా. ఏ శ్లోకం చెప్పినా ఇట్టే పట్టేస్తుంది” నిద్రపోయిందనుకుని తాతగారు అందరితో అంటున్న మాటలు విని కళ్ళు

మరింత గట్టిగా మూసుకుంది అరవింద. పన్నెండేళ్ళకే 'యస్సెసెల్సీకి వచ్చేసింది. ఆ ఊర్లో ఆడపిల్లల బడిలేకపోతే నాలుగు మైళ్ళ అవతలున్న తాలూకా పట్టణానికి ఎడ్ల బండిమీద పంపిస్తున్నారు తాతగారు. కానీ పరీక్షలు రాయిస్తారో లేదో అనుమానమే.

వయసుకి ఎగ్జంప్షన్ తెచ్చుకోవాలిట. అరవింద అవేం పట్టనట్లు తన చదువు తను చదువుకుంటోంది. ఎలా అయినా స్కూల్ ఫస్ట్ రావాలి. అదే ధ్యేయం.

"ఆడపిల్లలకి ఈ శక్తులన్నీ ఎందుకండీ. అందరూ మెచ్చేలా కాపురం చేసుకోవాలికానీ" నానమ్మ వెంటనే నొక్కులు నొక్కుతుంటే పళ్ళు నూరింది అరవింద.

"అన్నాపురం కరణంగారి రెండో అబ్బాయి ప్లీడరీ చదివాడుట. మన పిల్లంటే మక్కువ చూపిస్తున్నారని విన్నాను. చెప్పొద్దామా?" నాన్నగారు అంటుంటే గుండె దడదడలాడింది.

అరవింద లేచి కూర్చుంది.

"ఓహ్! ఇది ఒక చెవి ఇటేసుంచుతుంది. మహాకష్టం దీనితో"

"తాతగారూ! నేను ఇప్పుడు పెళ్ళిచేసుకోను. కాలేజీలో చదువుతా" తాతగారి దగ్గరికి వెళ్ళి గారంగా అంది, ఆయన తన పక్షం అనుకుని.

"సర్లే, ఇంకా బడికి పంపుతున్నాం సంతోషించు.మనిళ్ళలో కాలేజీలు, చదువులూ ఉన్నాయా? వెళ్ళి నిద్దరో" నానమ్మ విసురుకి స్పందించకుండా తాతగారిని చూసింది. ఆయన కూడా నోరు మెదపలేదు, ఏదో ఆలోచిస్తున్నట్లు.

"అవునురా! కరణంగారిది మంచి సంబంధమే. మంచిరోజు చూసుకుని వెళ్ళి చెప్పొద్దాం" ఉక్రోషంగా చూస్తూ నిస్సహాయంగా వెళ్ళి తన పక్కమీద వాలిపోయింది అరవింద. తనకి చిన్నప్పట్నుంచీ దేనికీ ఏడవడం నచ్చదు. ఎవరూ తన మాట, అభిప్రాయం వినిపించుకోనప్పుడు నోరు మూసుకుని సర్దుకోవడమే అలవాటు.

• • •

ఆ రోజు అరవిందకెంతో ఇష్టమైన రోజు పున్నమి. వెన్నెల రావడం ఎంత ఆలస్యమైనా వాకిట్లో చందమామని చూస్తూ వేపచెట్టుకి కట్టిన ఉయ్యాల ఊగడం ఇష్టం.

అలా ఊగుతుండగా వచ్చారు, అంబాసిడర్ కారులో అన్నాపురం కరణంగారు, భార్యా, వారి ఇద్దరు అబ్బాయిలూ, అమ్మాయీ.

"తొందరగానే బయలుదేరామండీ బావగారూ! మధ్యలో కారు ఆగిపోయింది. తాలూకాకి వెళ్ళి మెకానిక్కుని పిల్చుకొచ్చి బాగుచేయించి, బైట పడేసరికి ఈ వేళయింది. వెనక్కి వెళ్ళిపోదామా అనుకున్నాం కానీ, మీరు ఎదురుచూస్తుంటారని వచ్చేశాం" కరణంగారు కారు దిగుతూ మొహమాటంగా అన్నారు.

"భలేవారే... మనలో మనకేవిటండీ. అయ్యో! మరి మీ భోజనాలూ" తాతగారు అంటుంటే అరవింద ఉయ్యాల్లోంచి దూకింది.

మామూలు బండార్లంక అంచు పరికిణీ, తెల్లని పువ్వుల వాయిలు వోణీ, నల్ల జాకెట్టు... మెళ్ళో సన్నని గొలుసుతప్ప ఇంకేం లేదు. వచ్చినవాళ్ళ ముందు నుంచే ఇంట్లోకి వెళ్ళాలి. నమస్కారం పెట్టి లోపలికి తుర్రుమంది.

"ఫరవాలేదండీ... ఎంతసేపూ? అరగంటలో ఇంటికి వెళ్ళిపోతాం" కరణంగారి పెద్దబ్బాయి అన్నాడు.

"అబ్బెబ్బే, ఎంత మాట. కతికితే అతకదంటారు కనుక మా ఇంట్లో వద్దు. పక్కింట్లో మా చెల్లెలుంటుంది. అక్కడ వండిస్తా చారూ, అన్నమే అనుకోండి. మరో మాట వద్దు" తాతగారు వచ్చినవాళ్ళని కచేరీ హాల్లో కూర్చోపెట్టి, నానమ్మని పిలిచి ఆడవాళ్ళని లోపలికి తీసుకెళ్ళమంటుంటే, అరవిందని లోపలికి తీసుకెళ్ళి తయారుచెయ్యబోయింది వాళ్ళమ్మ.

"ఏ హడావుడీ వద్దు బావగారూ! అమ్మాయిని చూశాం కదా! ఇప్పుడు అలంకారాలేం వద్దు. అలాగే వచ్చి కాసేపు కూర్చోమనండి. అబ్బాయి ఏదయినా అడుగుతాడేమో, అమ్మాయికేం కుందనం బొమ్మలా ఉంది. భోజనాలు చేసే వేళతాంలెండి. మొహమాటం ఎందుకూ, మరీ అర్ధరాత్రైతే అరగదు నాకు..." అనుకున్నట్లుగానే అరవిందని చూడగానే ఒప్పేసుకున్నారు కరణంగారూ, వాళ్ళ ఇంటివాళ్ళూ.

చిన్నపిల్లకేం తెలుసూ అంటూ తన అభిప్రాయం అడగకుండానే పెళ్ళయిపోయింది. భట్టు తండ్రిమాటకి ఎదురుచెప్పే రకం కాదు. అయినా కాదనడానికి కారణాలేం కనిపించలేదు. పన్నెండేళ్ళకే స్కూలు ఫైనల్ అంటే తెలివైన పిల్లే అనుకున్నాడు అతను.

పెళ్ళయ్యాక సాంప్రదాయం ప్రకారం వ్రతం చేయించి మూడు నిద్రలయ్యాక పుట్టింట్లో దింపేశారు. పండగలకీ, నోములకీ అత్తింటికి రావడం, అందరితో బాగా అలవాటయింది.

భట్టు బొంబాయి వెళ్ళి పేరున్న పెద్ద ప్లీడరు క్రిష్ణచౌహాన్ దగ్గిర జూనియర్‌గా చేరాడు. అప్పుడప్పుడే నానావతి కేసులో డిఫెన్స్ లాయర్‌గా వాదిస్తూ పేరు తెచ్చుకుంటున్న రామ్ జఠ్మలానీ అంటే భట్టుకి ఎంతో ఆరాధన. రెండు సంవత్సరాలు పీనల్ కోడ్లన్నీ క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు. పెళ్ళైన వెంటనే వెళ్ళినవాడు మళ్ళీ ఇప్పుడే రావడం. సెకండ్ క్లాస్ రైల్ టికెట్లు కొనుక్కునే వచ్చాడు తనకీ, భార్యకీ.

వృత్తిమీదున్న ధ్యాస, అందులో ఎంతో ఎత్తుకి ఎదగాలనే తపన ముందు, భార్యా... సంసారం అంటే అంత ఆసక్తి లేదు భట్టుకి. కొన్ని రోజులు ఆగితే బాగుండేది కదా అనుకున్నాడు. కానీ తండ్రిమాటకి ఎదురుచెప్పడమే!

"అమ్మాయి చేతిలో అక్షింతలు వేసి దేవుడిమీద వెయ్యమనబ్బాయ్" గురువుగారి మాటలకి ఉలిక్కిపడి చెయ్యి చాపింది అరవింద.

యాంత్రికంగా ఆ చేతిలో అక్షింతలు వదిలాడు భట్టు.

• • •

పదేళ్ళు చిన్నదయిన భార్యని చిన్నపిల్లలాగే, అభిమానంగా అపురూపంగా చూసుకుంటారు కొందరు. ఆ తేడా మర్చిపోయి తమతో సమానంగా ఆలోచించాలనీ, పనులు చెయ్యాలనీ అనుకుంటారు మరికొందరు.

భట్టు రెండోరకానికి చెందినవాడు. తగ్గట్టుగానే అరవింద చీరకడితే తన వయసుకి మించినదానిలా ఉంటుంది. పది సంవత్సరాలుగా తనకి వచ్చిన అయివేజులు పెట్టి అపార్ట్‌మెంట్

కొన్నాడు భట్టు, తను పనిచేసే ప్లీడరుగారి ఆఫీసుకి దగ్గరగా. చుట్టుపక్కలంతా మరాఠీ, సింధీ, గుజరాతీవాళ్ళు. పడవెక్కి రేవుదాటి వెళ్ళలేదెప్పుడూ. అరవింద ఒడ్డునపడ్డ చేపలా విలవిల్లాడి పోయింది, బొంబాయి వెళ్ళిన కొత్తల్లో.

కళ్ళు పెద్దవిచేసి ప్రతిదీ వింతగా చూసేది. అమ్మా, నానమ్మా సంసారం ఎలా నడుపుకోవాలో సమయం దొరికినప్పుడల్లా చెప్తూనేవున్నారు. అయినా... ఏదో భయం. పదిమందిలో తిరిగిన పిల్ల. ఒంటరిగా, రోజా ఏదో పోగొట్టుకున్నట్లు శూన్యంలోకి చూస్తూ కూర్చునేది.

"స్కూల్ ఫైనల్ పాస్ అయ్యావు కదా, ఇంగ్లీష్‌లో మాట్లాడ్డం రాదా? హిందీ పరీక్షలు కట్టు. దాదర్‌లో తెలుగు సంఘం ఉంది. అక్కడికి వెళ్ళావంటే బోలెడు తెలుగు. ఇక్కడ బస్సెక్కితే అక్కడ దిగుతావు. ఈ కూర ఇంకొంచెం బాగా చెయ్యొచ్చు. నేను వచ్చేసరికి లేటవుతుంది. నువ్వు అన్నం తినేసి పడుకో..."

ఇంతే, ఇలాగే ఉంటాయి భట్టు మాట్లాడే మాటలు. అవసరానికి మించి ఒక్కమాట కూడా. ఏం సంగతులే ఉండవా తనతో మాట్లాడ్డానికి. ఒక్క సినిమాకైనా తీసికెళ్ళడేం?

ఆ ఒక్కరోజే కాదు, ప్రతిరోజూ లేటే. ఎన్నిరోజులు గడిచినా కొంచెం కూడా చనువు ఏర్పడ లేదు. తనలో ఏదైనా లోపం ఉందా?

పొద్దున్న లేవగానే నవ్వుతూ పలకరిద్దామంటే, అతని ముడిచిపెట్టిన కనుబొమ్మలు, ఎటో చూస్తున్న కళ్ళు అవకాశమే ఇవ్వవు.

రకరకాల వంటలు చేసి అతని మెప్పుపొందాలని చూసింది. తలదించుకుని తినేసి వెళ్ళి పోతాడు భట్టు. గిన్నెలు ఖాళీ అయితే వంట బాగుంది కాబోలు అనుకోవాలి.

ఎదురింట్లో కొత్తగా వచ్చిన హిందీ అమ్మాయి నవ్వుతూ పలకరించింది ఒకరోజు. భట్టు ఆఫీసుకి వెళ్ళాక బాల్కనీలోకి వెళ్ళి అతను కనుమరుగయ్యేవరకూ చూస్తుంది అరవింద.

ఆ వేళ కూడా అలాగే చూసి బిక్కమొహం వేసుకుని వెనక్కివచ్చి తలుపేసుకోబోతుంటే పిలిచింది. ఆ అమ్మాయి వాళ్ళ ఇంటితలుపుదగ్గర గోడకి నేమ్‌ప్లేట్ తగిలిస్తోంది.

"మేరా నామ్ రష్మీ... ఆప్..."

ఇరవైఏళ్ళుంటాయేమో, పంజాబీడ్రెస్‌లో చిన్నగా కనిపిస్తోంది.

నేమ్‌బోర్డ్‌కేసి చూసింది అరవింద, 'రాహుల్ అండ్ రష్మి మిశ్రా'

"మేరా... అరవిందా...మ్ మ్... మి ఫ్రం ఆంధ్రా..." తడబడుతూ నిలబడింది. తను కూడా నేమ్ ప్లేట్ తగిలించాలి.

పకపకా నవ్వుతూ దగ్గరగావచ్చి చెయ్యిపట్టుకుంది రష్మి, అచ్చు నా చెల్లెలిలాగా ఉన్నావంటూ. వాళ్ళు ఢిల్లీనుంచి వచ్చారుట. చక్కని హిందీ మాట్లాడుతుంది.

పుస్తకాల్లో చదివిన మాటలే ఎక్కువ ఉండడంతో అరవిందకి బాగా అర్థమవుతోంది.

అంతే, ఒక్కసారిగా అరవింద జీవితంలో మార్పు వచ్చింది. ఎక్కడికి వెళ్ళాలన్నా ఇద్దరూ కలిసే. ఇంట్లో ఉన్నప్పుడు కూడా పగలంతా ఒక దగ్గిరే.

దీదీ అంటూ కొత్త వంటలు, కొత్త భాషలు. ఇంగ్లీష్‌లో, హిందీలో కూడా మాట్లాడ్డం వచ్చేసింది. బజారుకు వెళ్ళినప్పుడు తను కూడా నేమ్ ప్లేట్ తయారుచేయించి తీసుకొచ్చి

తగిలించింది. "నరసింహ అండ్ అరవిందాభట్" అచ్చు రష్మి చేయించినట్లే. ప్లేట్‌పైన ఒక లైట్ కూడా పెట్టింది.

ఆ రాత్రి భట్టు వస్తూ వస్తూ చూశాడు, ఒక్కక్షణం ఆగి. తలుపు తీసిన అరవింద మొహం లోకి ఒకసారి చూసి, ఏం మాట్లాడకుండా లోపలికి వెళ్ళిపోయాడు.

అరవింద నిరాశ చెందినా పైకి కనిపించనియ్యలేదు. మాట్లాడలేదంటే అయిష్టమేం లేదు కదా... రెండేళ్ళు గడిచేసరికి బొంబాయి అంతా కొట్టిన పిండి అయిపోయింది.

ఏమాటకామాటే, అరవిందకి ఇంట్లో స్వాతంత్ర్యం బాగా ఉంది. ఇంకా ఇంకా పుస్తకాలు చదివి, లైబ్రరీలకి వెళ్ళి విజ్ఞానం పెంచుకోమనే అనేవాడు భట్టు.

ఆర్థిక ఇబ్బందులు ఎప్పుడూ లేవు. ప్రతి సంవత్సరం పంటలమీద వచ్చే ఆదాయమే చాలు ఇంటిఖర్చులకి. భట్టు సంపాదన కూడా బాగానే ఉంది.

బ్యాంకుకి, బజారుకి అన్నింటికీ అరవింద చకచకా వెళ్ళిపోతుంది. రష్మి తోడు ఉండనే వుంది. భట్టు ఏ సహాయం చెయ్యకపోవడంవల్లనే అన్నీ నేర్చుకున్నానని అనుకుంది అరవింద. జీవితంలో ప్రతిదీ సానుకూల దృక్పథంతో చూడ్డం అరవింద స్వభావం.

"నువ్వు కాలేజీలో ఎందుకు చేరకూడదు?" ఒకరాత్రి భోజనాలయ్యాక భట్టు ప్రశ్నించాడు.

"ఇప్పుడా... పదహారేళ్ళు నిండిపోయాయి. చాలా రోజులయింది క్లాసు పుస్తకాలూ... పరీక్షలూ... చదవగలనా? పైగా మనింట్లో ఎవరూ..."

"పదహారేళ్ళంటే... ఓల్డ్ లేడీ అయిపోయావా? ఎవరో ఒకరు మొదలెట్టాలి కదా మనింట్లో. ఆ పని నువ్వే చెయ్యి. నీకంటూ ఒక వ్యాపకం ఉంటే నా పని నేను చేసుకోవచ్చు. ఇప్పుడొక కొత్త కేసు వచ్చింది. అది నేనే పూర్తిగా చూస్తానన్నాను. చౌహాన్‌గారు తీసుకోనన్నారు"

అరవిందకి నవ్వొచ్చింది. ఇప్పుడేదో తనకోసం పాటుపడుతున్నట్లు. నవ్వు పైకి కనిపించ కుండా అంది.

"సరే చేర్తాను కానీ, ఏ కేసదీ? మీ ప్లీడర్‌గారు ఎందుకు వద్దన్నారూ?"

"ప్లీడర్ అనేది మన ఊర్లలో మాట. ఇక్కడ లాయర్ కానీ అడ్వకేట్ కానీ అంటారు. కేసు సంగతి నీకేం అర్థమవుతుందిలే"

"చెప్తే అర్థం చేసుకుంటా కదా. ఇక్కడికొచ్చిన కొత్తల్లో నానావతి కేసు పేపర్లో చదువు తుండేదాన్ని. ఇప్పుడు దీపక్ సిన్హా హత్య గురించి రోజూ వస్తోంది. మీరు క్రిమినల్ లాయర్ కదా! అందుకని ఇంట్రెస్ట్ డెవలప్ చేసుకుంటున్నా"

భట్టు నమ్మలేనట్లు ఆశ్చర్యంగా చూశాడు. తాగుతున్న కాఫీకప్పు కింద పెట్టేశాడు. అతనికి డిన్నర్ అయ్యాక కాఫీ అలవాటు.

బ్రిటీష్‌వాళ్ళు అలా తాగుతారని చిన్నప్పుడు విన్నాడు.

ఒక్కసారి అరవిందని పరీక్షగా చూశాడు. జుట్టు రెండు పాయలు చేసి రెండు జడలు వేసింది. చీరకట్టు నాజూగ్గా, బుట్ట చేతులు, నుదుట మధ్యగా గుండ్రని బొట్టు, చెవులకి జూకాలు...

మెళ్ళో సన్నని నల్లపూసల గొలుసు, దానికింద మంగళసూత్రాల గొలుసు. కళ్ళకి పై రెప్పలకి తీర్చిదిద్దినట్లు కాటుక పెట్టి కొద్దిగా కొసలు తిప్పింది.

చాలామార్పు వచ్చింది. అదాటుగా చూస్తే మరాఠీ అమ్మాయిలాగే ఉంది.

అరవింద కొంటెగా నవ్వింది. చెరువులో ఉన్న చేపపిల్లని నదిలో వదిలేస్తే మొదట్లో కష్టపడ్డా తట్టుకుని ఈదుతుంది కదా. ఏ సొరచేపో వచ్చి మింగేస్తేతప్ప.

"అవునూ, మీరు కానీ దీపక్ సిన్హా హత్యకేసులో డిఫెన్స్ తీసుకోవట్లేదుకదా?"

పక్కలో బాంబుపడ్డట్లు ఉలిక్కిపడ్డాడు భట్టు.

అరవింద అనుమానంగా చూసింది. కళ్ళు ఖంగారుగా తిప్పుతుంటే నిర్ధారణకొచ్చింది.

"అయితే నా ఊహ నిజమేనన్నమాట. అందుకేనా చౌహాన్‌గారు వద్దన్నారు. అది మీరు వాదిస్తారా? న్యాయవాది మీరు. అన్యాయవాది కాదు" ధైర్యంగా అనేసింది అరవింద.

భట్టు నోటమాట రానట్లు అలా ఉండిపోయాడు కాసేపు. పల్లెటూరి పిల్ల అనుకుంటున్న తన భార్యేనా, ముందు ఈమెతో వాదించి నెగ్గలేమో! ఎంత ఎదిగిపోయిందీ?

"ఇంత తెలివెప్పుడొచ్చిందీ నీకు? నీకేం తెలుసనీ ఇలా మాట్లాడుతున్నావు?"

"తెలివి ఎప్పుడూ ఉంది. ఇప్పుడు ధైర్యం వచ్చింది. డిఫెన్స్ క్రిమినల్ లాయర్‌గా పేరు తెచ్చుకోవాలనుకోవడం తప్పులేదు. కానీ ఇలాంటి కేసు తీసుకుంటే చెడ్డ లాయర్‌కింద పేరు వచ్చేస్తుంది జాగ్రత్త.డబ్బువస్తుందేమో కానీ!"అరవింద, భట్టు ఎదురుగా సోఫాలో కూర్చుంది.

అప్పటివరకూ కావలసినవి అందించి తన పని చూసుకోవడమే కానీ ఎదురుచెప్పలేదు. సలహాలా... ఆతనికి సలహాలిచ్చే సత్తా అప్పటివరకూ రాలేదు మరి.

భట్టు కాఫీ తాగేసి వెనక్కి వాలి ఆలోచిస్తూ వుండిపోయాడు, చూపుడువేలు గడ్డంకింద రాసుకుంటూ.

"మాట్లాడరేం. నాకు జవాబివ్వడం దండగనుకుంటున్నారేమో కానీ మీ అంతరాత్మకి సమాధానం చెప్పుకోవాలి చూసుకోండి"

"అదికాదు అరవిందా! నానావతి కేసులో డిఫెన్స్‌ని సమర్థించావు కదా! దాని మూలానే రామ్‌జఠ్మలానీ పేరు మారుమోగిపోతోంది కదా! మరి ఈ కేసు మాత్రం ఎందుకు వాదించ కూడదూ? దీనితో నాక్కూడా గుర్తింపు వస్తుంది" భట్టు తనని సాటిమనిషిలా చూస్తుంటే సంతోషం వేసింది.

తనతో సమానంగా స్థానమిచ్చి మాట్లాడ్డానికి ఇన్నాళ్ళు పట్టింది. ఆలస్యమైనా తన ఇంట్లో తనకి గుర్తింపు వచ్చినందుకు అరవిందకి సంతోషంగా ఉంది. సోఫాలో సర్దుకుని కూర్చుంది.

"నానావతి కేసుకీ, దీనికీ పోలికేముందండీ. ఒక్క అక్రమసంబంధం వ్యవహారంలో తప్ప. భార్యని ప్రియుడు వాడుకుని వదిలేశాడనీ, పెళ్ళిచేసుకుని బాధ్యత స్వీకరించనన్నాడనీ బాధతో, కోపంతో అరిచాడు నానావతి.

తను మిలటరీలో నెలలతరబడి ఇంటిమొహం చూడకపోతే భార్య తోడు కోరుకోవడంలో తప్పు లేదనుకున్నాడు. పైగా అహుజా (ప్రియుడు) ముందు తుపాకీ తీశాడని కదా? ఆత్మరక్షణకే కాల్చాడని అన్నారు. అక్కడ అన్యాయం చేసినవాడు హతమయ్యాడు.

దీపక్ కేసు దానికి వ్యతిరేకం. భార్య, ప్రియుడు కలిసి సిన్హాని హతమార్చారని ఆధారాలు దొరికాయికూడానూ. ఇష్టం లేకపోతే వదిలేసి వెళ్ళిపోవాలి కానీ చంపుతారా? అదంతా ఆస్తికోసం అని తెలీడంలేదూ? మీరు ఏమని సమర్థిస్తారూ?''

భట్టు మాట్లాడలేకపోయాడు. తన సీనియర్ లాయర్ చౌహాన్‌లాగే వాదిస్తోంది. ఏమైనా సరే, ఇదీ ఆత్మరక్షణకోసమే జరిగిందని నిరూపిస్తాడు తను. అరుదుగా వచ్చే అవకాశాన్ని న్యాయం, నీతి అంటూ పనికిమాలిన కబుర్లు చెప్పి వదులుకోలేడు.

"నీకేం తెలీదులే. ఇదీ సెల్ఫ్ డిఫెన్స్ కేసే. కాకపోతే సానుభూతి సిన్హామీద ఉంది. అదంతా ముద్దాయిలమీదికి వచ్చేలా మార్చేస్తాను చూడు. న్యాయం ఎప్పుడూ ఒకవైపే ఉండదు. సిన్హా సంసారానికి పనికిరాడేమో. మరి ఇన్ని సంవత్సరాలుగా పిల్లలు ఎందుకు పుట్టలేదు? ఇలా చాలా పాయింట్లున్నాయి. అన్నీ క్షుణ్ణంగా స్టడీ చేస్తే తెలుస్తుంది. నీకేం తెలీదు. వెళ్ళి పడుకో. రేపు ఆ కాలేజ్ సంగతి చూడు'' ఇంక మాట్లాడేదిలేదన్నట్లు టేబుల్‌లైట్ వెలిగించి అంత లావు 'లా' పుస్తకంలోకి తలదూర్చాడు భట్టు.

అరవింద లేచి నిలబడి అలాగే ఉండిపోయింది కొంచెంసేపు ఆలోచిస్తూ. ఇదా ఇతని నిజ స్వరూపం? ఆస్తికోసం ప్రియుడితో కలసి భర్తని చంపిన ఒక ఆడదాన్ని సమర్థిస్తున్నాడు. ఇతనికి పుట్టే పిల్లలకి ఇటువంటి మనస్తత్వమే వస్తే. అవునూ, మూడేళ్ళవుతోంది మరి తనకెందుకు పుట్టలేదో? ఆయనలో లోపం ఉంటే తను కూడా... అప్రయత్నంగా ఛీ... ఛీ అనుకుంది అరవింద.

అదే సమయానికి భట్టుకూడా సాలోచనగా చూశాడు తన ఆలోచనని గ్రహించినట్లు. ఒక అర్థంలేని నవ్వు నవ్వి తన గదిలోకి నడిచింది అరవింద.

● ● ●

దీపక్ సిన్హా కేసు నాలుగేళ్ళు నడిచింది.

ఆవేశంలో జరిగిన సంఘటనగా నిర్ధారించి, ముద్దాయిలకి ఐదేళ్ళు కారాగార శిక్ష విధించారు. సిన్హా భార్యకి అతని ఆస్తిలో వాటా ఇచ్చేలా తీర్పు ఇచ్చింది కోర్టు.

అక్రమ సంబంధం నిరూపించలేదని వాదించాడు భట్టు. మొత్తానికి అతను కేసు గెలిచినట్లే. యావజ్జీవశిక్షో, మరణశిక్షో విధించకుండా, సాధారణ జైలు అంటే గెలుపుకిందే పరిగణించవచ్చు. సత్ప్రవర్తన ఉంటే ఇంకా తగ్గించవచ్చని కూడా సవరణ పెట్టారు.

నరసింహభట్టు పేరు అందరి దృష్టిలోకీ వచ్చింది. ఓ ఇంగ్లీషు డైలీ పేపర్లో ఒక పేజీనిండా అతనితో ఇంటర్వ్యూ ప్రచురించారు.

ఇంక నువ్వు స్వతంత్రంగా ప్రాక్టీసు పెట్టుకోవచ్చని అన్నారు క్రిష్ణచౌహాన్. తన శిష్యుడు కేసు గెలిచినా, అంత ఆనందంగా లేదు. నావద్ద పనిచెయ్యనక్కర్లేదని సున్నితంగా చెప్పారు.

నేరం చేసి తప్పించుకోవాలనుకునే నేరస్తుల కేసులు ధారాళంగా రాసాగాయి.

అరవింద బి.ఏ. పాసయింది. భట్టు పగలూ రాత్రీ తేడా లేకుండా సిన్హా కేసులో మునిగిపోయినప్పుడు బోలెడు సమయం దొరికింది. తను అనుకున్నట్లే నేరస్తుల లాయర్‌గా తన భర్త తయారవడం సహించలేకపోతోంది.

రష్మికి ఇద్దరమ్మాయిలు, పింకీ, ఛోటీ. వాళ్ళ ఆటపాటలతో కాలం గడిచిపోతోంది కానీ, ఇంకా ఏదో చెయ్యాలి అనే తపన. కానీ ఏం చెయ్యాలో తోచట్లేదు. ఇంకా పై చదువులు చదివితే... అనుకోకుండా ఆ అవకాశం వచ్చింది. ఊహించని అవకాశం.

భట్టుకి లండన్ వెళ్ళి బారిస్టర్ అవుదామని ఉంది. దానికి ప్రయత్నాలు చెయ్యసాగాడు. ఇదీ నయమే అనుకుంది అరవింద. ఎదురుగా ఏం మాట్లాడకపోయినా వెనుక తమగురించి ఏమనుకుంటున్నారో తనకి బాగా తెలుసు.

లండన్‌లోనా, పరాయిదేశంలో తమగురించి ఎవరు పట్టించుకుంటారు? అక్కడే తను ఇంకా చదువుకోవచ్చు. అయితే తను అనుకున్నదొకటైతే, జరిగింది వేరొకటి.

"నువ్వు ఇక్కడే ఉంటావా, మన ఊరు వెళ్తావా? నేను బార్ ప్రొఫెషనల్ ట్రైనింగ్ అయి బారిస్టర్ల ఛాంబర్‌లో కనీసం ఒక ఏడాది పనిచేస్తే కానీ నా స్వంత ప్రాక్టీస్ పెట్టుకోలేను. ఆ తరువాత నిన్ను తీసుకెళ్ళగలను" భట్టు ఒకరోజు పొద్దున్నే కాఫీ తాగుతూ అన్నాడు.

నాలుగైదు నెలలుగా అప్పుడప్పుడూ అంటున్న విషయమే అయినా, ఇంత త్వరగా అనుకోలేదు అరవింద.

బొంబాయి వచ్చిన ఆరేళ్ళలోనూ మూడుసార్లు వెళ్ళింది తమ ఊరు. ఇప్పుడు అక్కడికి వెళ్ళి ఉండగలదా? బొంబాయిలో మాత్రం ఒక్కతే ఎలా ఉంటుందీ.

"ఎన్నాళ్ళు పడుతుంది?" బయట ఎంతో చొరవగా అన్ని విషయాలూ నెగ్గుకొచ్చినా భట్టుతో అవసరం ఉన్నంతవరకే మాట్లాడ్డం అలవాటు.

ఒక్కోసారి ఇదేం బాంధవ్యం అనిపిస్తుంటుంది కూడా.

"నాకే తెలీదు. ఇక్కడి బేసిక్ డిగ్రీ పనికొస్తుందికానీ మళ్ళీ యమ్మెల్ చదవాలో, మరి డైరెక్ట్‌గా బి.పి.టి. కోర్స్‌లో చేరచ్చో. అక్కడికి వెళ్తేకానీ తెలీదు. మూడు నాలుగేళ్ళు పట్టచ్చు.

అరవింద తెల్లబోయింది.

"అన్నేళ్ళా? ఇక్కడ నేనేం చెయ్యనూ..." చనువు లేకపోయినా భర్త దగ్గర ఉంటే ఆ గౌరవం వేరు. కొన్ని నెలలంటే ఏమీ అనుకోరు కానీ ఏళ్ళ తరబడి. అత్తగారు, మామగారూ పోయారు. బావగారింట్లో... ఏం బాగుంటుందీ!

అసలు పిల్లలెందుకు పుట్టట్లేదూ... తనకి ఇరవై రెండేళ్ళు. ఎనిమిదేళ్ళ నుంచీ కాపురం చేస్తోంది. డాక్టర్‌కి చూపించుకుంటే, ఎలా అతనితో చెప్పడం?

ఇంక విడివిడిగా ఉంటే అసలే ఆశ ఉండదు. అసలు తను చేస్తున్నది కాపురమేనా?

ఎప్పుడో తను నిద్రపోయాక వచ్చి, నిద్రమత్తులోనే, ఏం జరిగిందో తెలియకుండానే గడిచి పోతోంది కాలం. అయినా తన అభిప్రాయం అడిగి చేశాడా ప్రయత్నాలు. 'బెగ్గర్స్ హావ్ నో ఛాయిస్' అని ఊరికే అన్నారా?

"నీ ఇష్టం. ఈ ఇల్లు, సామాన్లు ఇలాగే ఉంచుతాను. మనూర్లో కూడా నీకు సదుపాయం ఏర్పాటుచేస్తాను. నీకిష్టమైతే అన్నయ్యవాళ్ళతో ఉండచ్చు లేదా ఒక మండువా ఇల్లు నీకోసం రిపేర్లు అవీ చేయించివుంచమని రాస్తాను.ఎక్కడున్నా నీకు డబ్బుకి లోటులేకుండా చేస్తాను"

మొహంలో ఏ భావం కనిపించనియ్యకుండా వింది అరవింద. జీవితంలో డబ్బు ఒక్కటేనా

ప్రధానం. సంతోషంగా ఉండడానికి తన వంతుగా ఏం చెయ్యాలి? ఎంతో సరదాగా, అందరితో గలగలా మాట్లాడుతూ చుట్టూ ఉన్నవాళ్ళని ఆనందంగా ఉంచగలిగిన అరవింద తన సంసారంలో నిస్సారాన్ని ఎందుకు తొలగించలేకపోతోంది? ఎందుకు తన రాత ఈ విధంగా రాశాడూ భగవంతుడు?

"ఏంటలా చూస్తున్నావ్? ఏదో ఒకటి చెప్పు"

అయోమయంగా భట్టుని చూస్తున్నదల్లా కళ్ళుదించుకుని అంది, "మీ ఇష్టం. ఈ ఫ్లాట్ కూడా ఉంచండి. నాకు ఎక్కడ బాగుంటే అక్కడుంటా"

• • •

"అరిందం మామ్మా, దీవించు" కాంబాబు కదుపుతుంటే కళ్ళు తెరిచింది. అరె, అప్పుడే అయిపోయిందా వ్రతం. అవును, తను పదేళ్ళకాలాన్ని చుట్టివచ్చిందికదా!

"నూరేళ్ళు పిల్లా పాపలతో చల్లగా ఉండండి" మనసారా దీవించి చెరొక పదివేలూ కవర్లలో పెట్టి ఇచ్చింది.

"మామ్మా! అలిసిపోయావా? కొంచెంసేపు రెస్ట్ తీసుకోవచ్చు కదా?" కాంబాబు నెమ్మదిగా అన్నాడు, అరవిందం మొహంలోకి చూస్తూ.

"అదేంలేదురా, చిన్న నాప్ అంతే... భోజనాలు అవీ చూడాలి. కొంచెం చెయ్యియ్యి" చేతులు చాపింది.

రెండు చేతులూ పట్టుకుని జాగ్రత్తగా లేపాడు కాంబాబు. అరవిందం మరీ లావుగా ఉండకపోయినా మోకాళ్ళనొప్పులు మొదలై చాలారోజులే అయింది.

"కింద కూర్చోవద్దమ్మా అంటే వినవు. ఎలా అమ్మా నీతో" కరణంగారు వచ్చి మందలించారు.

"కొంచెం కష్టపడి కింద కూర్చున్నానా. అంత సుఖం లేదనుకో. కాకపోతే కాస్త లేచేప్పుడే. ఫర్లేదు పంతులూ. నువ్వెళ్ళి పెళ్ళివారిని చూసుకో"

అరవిందం కాళ్ళు సవరించుకుని పెరట్లోకి నడిచింది.

• • •

"అరిందం మామ్మా! తొందరగా రా, ఎవరికీ తెలీకూడదు. కంగారుపడతారు" కాంబాబు తట్టి లేపుతుంటే ఉలిక్కిపడి లేచింది అరవిందం.

మధ్యాన్నం భోజనాలయిపోయి పెళ్ళివారంతా తలో మూల జంపఖానాలమీద వాలి గుర్రుపెడుతున్నారు.

పిల్లల్ని పొలందగ్గిర తోటలోకి తీసుకుపోయాడు నాని, కొబ్బరిబొండాలు, జామకాయలు చాలా ఉన్నాయని.

"ఇప్పుడేరా కాస్త కునుకుపట్టింది. ఏంటా ఎమర్జెన్సీ" చేతులు మెటికలు విరుస్తూ లేచింది అరవిందం.

"ఎమర్జెన్సీనే మామ్మా! హేమని తేలు కుట్టింది. త్వరగా రా"

"అరే, ఇంట్లో తేళ్ళెక్కడున్నాయి, ఎప్పుడో నా చిన్నప్పుడు..." కాంబాబుతో సమంగా అడుగులు వేస్తూ రొప్పుతోంది.

"మామ్మా! నా చెయ్యి పట్టుకో. ఇంట్లో కాదు. పెరటి సావిట్లో"

"అక్కడికెందుకు వెళ్ళారూ. ఓహో..." కాంబాబు మొహం ఎర్రగా అయిపోవడం గమనించి నవ్వుకుంది.

"నా చిన్నప్పటి ట్రంకుపెట్టె తియ్యడానికి వెళ్ళాలే మామ్మా! ఇప్పుడదంతా ఎందుకూ... ముందు పని చూడు"

"చూస్తాలేరా, ఆ తర్వాత నీ పనికి అడ్డం రాకూడదంతేనా? అసలే ఇవేళ..."

"మామ్మా! అవన్నీ తర్వాత. నాకసలే ఏం చెయ్యాలో తోచట్లేదు. తనేమో పళ్ళు బిగపెట్టుకుని ఏడుస్తోంది. ఎంత బాధగా ఉందో, పైగా ఎవరికీ తెలియద్దంటుంది"

వెళ్తూ వెళ్తూ వంటింట్లోంచి ఒక సీసా, స్నానాల గదిలోంచి సబ్బు, పెరట్లో దణ్ణెం మీంచి ఒక మెత్తని తువ్వాలూ తీసి గబగబా నడుస్తూ అంది, "ఒక బక్కెట్టు నీళ్ళు తీసుకురా"

కాంబాబు నూతిదగ్గిర ఆగిపోగానే, తను పెరటి సావిట్లోకి నడిచింది.

హేమ నేలమీద బోర్లా పడుకుని మెలికలు తిరిగిపోతోంది మూలుగుతూ.

"మరేం భయంలేదమ్మా, నేవచ్చేశాగా! ఎక్కడా, నడుందగ్గిర కుట్టిందా? అరెరే మ్మ్రూడుచోట్ల. నువ్వు అలాగే పడుకో" లంగా వదులుచేసి కిందికి దింపి, కాంబాబు తెచ్చిన బాల్చీలో నీళ్ళలో తువ్వాలు కొనముంచి కుట్టినదగ్గిర శుభ్రంగా తుడిచింది. కుట్టినదగ్గిర ఎర్రగా తట్టు లేస్తోంది.

"కాంబాబూ! ఒక ప్లాస్టిక్ సంచీలో ఐస్ తీసుకురా. హేమా! నువ్వు అలాగే పడుకో" కొంగు తీసి నడుంచుట్టూ కుట్టినదగ్గిర పైన గట్టిగా బిగించి కట్టింది.

"ఏం ఫరవాలేదమ్మా! నీకో సంగతి తెల్సా, తేలుకి కుట్టడం రాదు. కొండితో గుచ్చుతుందంతే. ఇట్ ఓన్లీ స్టింగ్స్. పిన్ను పెట్టి గుచ్చినట్లన్నమాట. ఇందులో కొద్దిగానే పాయిజన్ వంటి పదార్థం ఉంటుంది. అది కొంచెంసేపే మంటకానీ తిమ్మిరి పెడుతుంది. ఏం భయంలేదు" ధైర్యం చెపుతూనే ముందు సీసాలోని తినే సోడాని నీళ్ళల్లో కలిపి తట్టుదగ్గిర రాసింది. ఆ తరువాత సబ్బు నీళ్ళతో బాగా కడిగి శుభ్రంగా తుడిచింది.

అంతలో కాంబాబు ఐస్ తెచ్చాడు.

ఐసుతో అద్దుతూ, అతన్ని ఇంట్లోకి వెళ్ళి నిమ్మకాయ నీళ్ళల్లో కొంచెం ఎక్కువ పంచదార వేసి గ్లాసునిండా తీసుకురమ్మని పురమాయించింది.

"అవునే పిల్లా, ఇంతకీ ఇక్కడేం చేస్తున్నారూ మీరిద్దరూ. ఈ సంగతి తెలిస్తే ఈ సావిడంతా శుభ్రం చేయించేదాన్నికదా!"

"ఏమో అమ్మమ్మా! తన చిన్నప్పటి వస్తువులేవో చూపిస్తానని తీసుకొచ్చారు. పెట్టె అటక మీదనుంచి తీస్తుంటే ఏదో కిందపడింది అది తీద్దామని వంగున్నా, పెట్టె జరిపినప్పుడు తేలు కదిలినట్లుంది, వంగునున్న నా వీపుమీద పడిందంతే" నీరసంగా అంది హేమ, ఐసు సంచీ కదిపినప్పుడల్లా వంకర తిరుగుతూ.

"ఇదిగో ఈ నిమ్మకాయనీళ్ళు తాగు. ట్రామా అంతే. అంతకన్నా ఏంలేదు. రాత్రికి తగ్గి

పోతుందిలే. కొంచెం నొప్పిగా ఉంటే కాంబాబు కొబ్బరినూనెతో సుతారంగా రాస్తాడు. అంతే ఎక్కడిదక్కడ మాయం. అయినా ఏం చూపిద్దామనుకున్నావురా?" కాంబాబుకేసి తిరిగింది.

"ఇదే మామ్మా!"

చిన్న ఎర్రకారు. తనే ఎప్పుడో బొంబాయినుంచి తెచ్చింది. అప్పట్లో బ్యాటరీతో నడిచేవి ఎక్కువుండేవి కాదు. ఇంటిల్లిపాదీ ఆశ్చర్యంగా ఆడుకున్నారు దానితో కొన్నాళ్ళు.

"ఇప్పుడు దీన్లో వింత ఏవుందిరా? రిమోట్‌తో ఎగిరే హెలికాప్టర్లు వచ్చాయి. నాకు తెలుసులే. ఏకాంతానికి ఇదొక వంక. అంతేనా? నెమ్మదిగా లేమ్మా. నన్ను పట్టుకుని లోపలికి వద్దువుగాని. నా గదిలో మంచంమీద పడుకోబెట్టి ఐసు అద్దుతా. పోనీ నువ్వద్దుతావేంట్రా?" కవ్విస్తూ కాంబాబుని చూసింది.

"అమ్మమ్మా!" నడుం పట్టుకుని లేచి, కొంగు సరిచేసుకుంటూ అరిచింది హేమ.

"అబ్బెబ్బే, ఊరికే అన్నా. వాడి చెయ్యిపట్టుకుని లే. నా బలం సరిపోదు"

• • •

సికింద్రాబాద్, వాసవీనగర్‌లో ఒక ఇంటిముందు 'మీరూ' టాక్సీ ఆగింది.

డిక్కీలోంచి సామాన్లు తీసి కిందపెట్టాడు టాక్సీడ్రైవర్.

"కొంచెం లోపలికి పట్రా నాయనా!" చెప్పిందానికంటే ఇరవైరూపాయలు ఎక్కువిస్తూ అంది అరవిందం.

గణగణా గంట మోగుతుంటే తెలివొచ్చింది కాంబాబుకి.

ఎలెక్ట్రిక్ కాలింగ్‌బెల్ బదులు తలుపుకి గంట పెట్టారు. మెడమీదున్న హేమ చెయ్యి పక్కకి తప్పించి బద్ధకంగా లేచి టైమ్ చూశాడు, ఐదున్నర.

ఇంత పొద్దున్నే, అదీ ఆదివారం. ఎవరబ్బా, పాలవాడు గుమ్మం కొక్కేనికున్న సంచీలో పాలు వేసి వెళ్ళిపోతాడు. ఆవలిస్తూ వెళ్ళి తలుపు తీశాడు.

"పీప్ హోల్లోంచి చూడకుండా తలుపు తీస్తార్రా. ఏ దొంగాడో అయితే ఏం చేస్తావు?"

"అరిందం మామ్మా! నువ్వా? ఏంటీ ఇంత హఠాత్తుగా, ఇక్కడ బొంబాయిలోలాగ భయం లేదులే. దొంగలెప్పుడూ మిట్టమధ్యాన్నం కానీ, ఊరెళ్ళినప్పుడు కానీ వస్తారు. అయినా ఒక్క ఫోన్‌చేస్తే స్టేషన్‌కి వచ్చేవాణ్ణిగా..." నిష్ఠూరంగా అంటూ, సంబరంగా చూస్తూ, చేతిలో సంచీ అందుకుని, పెట్టెల్ని గుమ్మందగ్గరే ఉంచమని టాక్సీ అతనికి చెప్పాడు.

"సడన్‌గా బయల్దేరాల్సివచ్చిందిరా. నా షెడ్యూల్ ప్రకారం ఇంకా రెణ్ణెళ్ళు ఉండాలి మనూళ్ళో..."

"తెలిసిందిలే, తాతగారు అర్జంట్‌గా రమ్మన్నారు కదూ?"

"హేమ ఇంకా లేవలేదా? ఇద్దరూ ఒకర్నొకరు అర్థం చేసుకున్నారా? అదే. ప్యూస్ అవీ, ఏవైనా మొదట్లోనే చెప్పేసుకుని సర్దుకోవాలి"

"నీలాగా, తాతగారిలాగా కదూ?"

"ఇంకొకరితో పోలికలెందుకులేరా, ఎవరి జీవితాలు వాళ్ళవి. నో కంపేరిజన్"

హాల్లోనుంచి వస్తున్న మాటల శబ్దం విని హేమ లేచి వచ్చింది కళ్ళు నులుముకుంటూ. అరవిందంని చూడగానే నిద్రమత్తు ఎగిరిపోయింది.

"అమ్మమ్మా!" అరుస్తూ వచ్చి గట్టిగా కౌగలించుకుంది.

"ఉండవే పిల్లా, బ్యాలన్స్ తప్పిందంటే పడిపోతాను. బావున్నావా? నిన్ను చూస్తుంటే తెలుస్తోందిలే..." హేమని ఒక అడుగు వెనక్కి జరిపి చూసింది.

మూడు నెలల్లో కొద్దిగా మార్పు వచ్చింది. మొహంలో మెరుపు, ఎర్రబడ్డ బుగ్గలు హేమ సంతోషాన్ని సూచిస్తున్నాయి. పెళ్ళి అయిన వెంటనే కేరళ హనీమూన్‌కి వెళ్ళొచ్చారు ఇద్దరూ.

కాంబాబు హైదరాబాద్‌లో హైటెక్ సిటీలో పనిచేస్తాడు.

ఇరవై ఏళ్ళక్రితం తెలిసున్నవాళ్ళు అమ్మేతుంటే అరవిందం కొన్న ఇల్లు. అద్దెకున్నవాళ్ళని ఖాళీచేయించి కాంబాబుని ఉండమంది, అద్దె ఇస్తానంటే కోప్పడి.

"నే వచ్చి నాలుగురోజులుంటే హోటల్లోలా ఛార్జ్ చేస్తావేరా?"

"మామ్మా! నువ్వు మా దగ్గిరే కొన్నాళ్ళు ఉండిపోవాలి" గారాలు పోయాడు.

"సమయం వచ్చినప్పుడు అలాగే ఉంటాలేరా, ఇప్పుడు చాలా బిజీ" మొహం వంచి మనవడి నుదుటిమీద ముద్దుపెట్టుకుంటూ అంది.

"మామ్మా!" కాంబాబు కళ్ళముందు చెయ్యి ఆడించాడు.

ఆలోచనల్లోంచి బైటపడింది అరవిందం.

మామ్మా, మనవళ్ళ సంవాదం నడుస్తుండగానే హేమ లోపలికి వెళ్ళి మొహం కడుక్కుని మూడు గ్లాసుల్లో కాఫీ తీసుకొచ్చింది.

"ఇలా ఉండాలమ్మాయ్! చురుగ్గా. కాఫీవాసనకి ప్రాణం లేచొస్తోందనుకో. కాముడూ నువ్వు బెడ్ కాఫీనేనా ఇంకా?"

కాంబాబు నవ్వుతూ కాఫీగ్లాసు అందుకున్నాడు.

"కాఫీ తాగాక పళ్ళు తోముకుంటే ఆ స్టైన్స్‌కూడా పోతాయి కదూ మామ్మా!అందుకనే"

హేమ మూతి మూడువంకరలు తిప్పింది. అప్పటివరకూ అమ్మమ్మగారు వచ్చిన ఆనందంలో గమనించలేదు కానీ అరవిందంలో ఏదో తేడా కనిపించింది.

మొహంలో నిండైన నవ్వు, ఆప్యాయత చూస్తూ పట్టించుకోలేదు. అరవిందం ఆహార్యంలో మార్పు. తను అన్నాపురంలో ఉండగా చూసిన అరవిందం మామ్మ వేరు. పంజాబీ డ్రస్‌లో భుజాలు దాటని జుట్టుతో, కట్టు బొట్టు అన్నీ మారిపోయాయి.

మెళ్ళో ఒక ముత్యాలదండ తప్ప ఏమీలేదు. చెవులకి కూడా ముత్యాలదుద్దులే. మాట, తల తిప్పడం, అంతా గుజరాతీ వనితలాగ ఉంది.

కళ్ళార్పకుండా చూస్తున్న హేమని చూసి కనుబొమ్మలు ఎగరేసింది అరవిందం.

"ఈవిడెవరా అని చూస్తున్నావా? వస్తూ వస్తూ రాజమండ్రిలో అయింది ట్రాన్స్ఫర్మేషన్. ఇప్పుడు నేను మిసెస్ అరవిందా భట్. నా బిజినెస్, నా లైఫ్ డిఫరెంట్‌గా ఉంటాయి"

కాంబాబు మాత్రం ఇదంతా సహజమే అన్నట్లు అరవిందం పెట్టెల్ని గదిలో పెట్టడానికి వెళ్ళాడు. "ఇప్పుడు ఈవిడ లండన్ మామ్మగారన్నమాట" గదిలోనుంచి వస్తూ అన్నాడు.

అరవిందం చిరునవ్వు నవ్వింది. తెల్లని పలువరుస, మెళ్ళో హారంతో పోటీపడుతూ తళుక్కుమంది.

• • •

"మామ్మ ఇంకా లేవలేదా?" కాంబాబు టై కట్టుకుంటూ అడిగాడు. పొద్దున్న ఆరూ యాభై అయింది టైము. ఏడింటికి పికప్ కారు వస్తుంది.

"అమ్మమ్మగారు రాత్రి చాలాసేపు తన గదిలో పనిచేసుకుంటూనే వున్నారు. ఆవిడ దగ్గిర లేటెస్ట్ మోడల్ లాప్‌టాప్ ఉంది చూశారా? ఆవిడకూడా లండన్‌లో పనిచేస్తారా? అసలు ఏం చదువుకున్నారూ?"

"అప్పట్లో బి.ఏ పాసయిందని అనేవారు. ఏం పనిచేస్తుందో తెలీదు. ముంబయిలో కూడా ఏదో వ్యాపారం ఉందని అంటారు. చిన్న తాతగారు ఆస్తి అంతా ఆవిడ పేరున రాసేశారు. అందుకనే పొలం వ్యవహారాలు చూసుకోవడానికి ఆవిడ నాలుగు నెలలు మనూళ్ళో ఉంటుంది. తాతగారు లండన్ వెళ్ళాక ఒక్కసారిమాత్రం వచ్చారు.

మాకెవరికీ ఆయన ఎలా ఉంటారో కూడా తెలీదు. వాళ్ళకి పిల్లల్లేరు. మామ్మ ఎంత బాగా కలిసిపోయిందంటే ఆయన్ని ఎవరూ తలుచుకోను కూడా తలుచుకోరు. ఆవిడే సొంత మామ్మేమో అనుకుంటుంటాం. వస్తా... సాయంత్రం మాట్లాడుకుందాం"

హేమ ఆలోచిస్తూ అలాగే నిలబడిపోయింది కొంచెంసేపు. విచిత్రంగా ఉందే. ఇంట్లో ఎవరికీ ఏమీ చెప్పరా? పల్లెటూళ్ళల్లో అందరి సంగతీ అందరికీ కావాలి. ఎలా ఊరుకున్నారూ? కాంబాబు కారు ఎక్కేవరకూ ఆగి తలుపు వేసుకోబోతుండగా నలుగురు ఆడవాళ్ళు గేటు తీసుకుని లోపలికి రావడం చూసి ఆగిపోయింది హేమ.

ఇద్దరికీ నలభై పైన ఉంటుంది వయసు. మిగిలిన ఇద్దరూ ముప్పైలోపు.

ఒకడుగు ముందుకేసి నడుస్తున్నామె నాయకురాల్లాగ ఉంది. గుజరాతీ కట్టు, కోలబొట్టు, చేతులకి రెండేసి కంకణాలూ, మెళ్ళో బంగారు గుళ్ళ గొలుసు, నల్లపూసలూ... పెదవులు, కళ్ళు నవ్వుతున్నట్లుగా, మొహంలో ఏదో స్థిరమయిన నిశ్చయం. చూడగానే ఏదో బృహత్ కార్యం సాధించబోతున్నట్లు అనిపించింది.

ఇంకొకామె మహారాష్ట్రియన్‌లాగ గోచీపోసి చీర కట్టింది. చేతులకి అద్దాల గాజులమధ్య ఆకుపచ్చని మట్టిగాజులు. అర్ధరూపాయకాసంత బొట్టు. అప్పుడే నాగపూర్ దగ్గరున్న పల్లెటూరు నుంచి వచ్చినట్లుంది. మిగిలిన ఇద్దరు యువతులూ, చార్మినార్‌దగ్గిర రోడ్డుపక్కన అమ్మేలాంటి నైలాన్ చీరలు కట్టుకుని, మెళ్ళో నల్లతాడూ, చేతులకి ఎర్ర రబ్బరుగాజులూ, తలలు కొద్దిగా దించుకుని వస్తున్నారు.

"మీరు హేమ కదూ? మిసెస్ భట్ ఉన్నారా?" ముందు వస్తున్నామె అడిగింది అదోక రకమైన యాసతో.

"ఉన్నారు రండి..." వాళ్ళని లోపలికి తీసుకెళ్తూ అనుకుంది హేమ, తన పేరు తెలిసిందంటే అమ్మమ్మగారికి బాగా కావల్సినవాళ్ళే అయుంటారు.

అదే సమయంలో అరవిందం హాల్లోకి వచ్చింది. ఎప్పుడు లేచి తయారయిందో, తెల్లని షల్వార్, లేతగులాబీరంగు లక్నో డిజైన్ కుర్తా వేసుకుని, ముదురు గులాబీచున్నీ మెడమీద నుంచి కప్పుకుంది.

వచ్చినవాళ్ళని చూడగానే ఆవిడ మొహంలో వింతకాంతి.

"రండి రండి పార్వతిబెన్. మీకోసమే చూస్తున్నా. మా గ్రాండ్ బహుని కలిశారా?"

నాయకురాలు, అరవిందాన్ని గట్టిగా హత్తుకుంది.

"మాజీ! ఎంతకాలమయింది. ఆజ్ కల్ మీరు వస్తలేరు. ఎంత ఫోన్లో మాట్లాడుకున్నా చూస్తుంటే ఆ ఖుష్ అలగ్ ఉంటది" కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లుతుండగా అంది.

అరవిందం, పార్వతీబెన్ చెయ్యి పట్టుకుని తీసుకెళ్ళి సోఫాలో కూర్చోపెట్టింది.

మిగిలినవాళ్ళు మొహమాటంగా తలుపుదగ్గిరే నిలబడిపోయారు.

"రండమ్మా! కూర్చోండి. తారాబెన్! క్షేమమేనా? నాగ్‌పూర్ నుంచి ఎప్పుడు వచ్చారూ? ఈ అమ్మాయిలు" మహారాష్ట్రియన్ కట్టులో ఉన్న తారాబెన్ తమతో వచ్చిన యువతులని పక్కన కూర్చోమని సైగ చేసి సోఫాలో కూర్చుంది.

హేమ లోపల్నుంచి తళతళా మెరిసే స్టీలు గ్లాసుల్లో మంచినీళ్ళు ట్రేలో తీసుకొచ్చి అందరికీ ఇచ్చింది.

"థ్యాంక్యూ బేటీ, సుబే సుబే బహుత్ గర్మీ హై" గ్లాసు ఎత్తి గడగడా తాగేసి అంది పార్వతీబెన్. అందరూ మొహమాటంగా చూస్తుంటే తాగమని సైగచేసింది.

"ఈ అమ్మాయిల్ని తారాబెన్ తీసుకొచ్చింది. మన నాగపూర్ బ్రాంచ్ దగ్గిరికి తీన్ దిన్ పహ్లే వచ్చారుట. వ్యాన్‌లో వస్తున్నా కదాని తీసుకొచ్చింది. మీకు జమాఖర్చులన్నీ నెట్‌లో చెప్తున్నా. సామ్నే చెప్పడం అలగ్ కదా" వచ్చీరాని తెలుగు, హిందీ కలిపి మాట్లాడుతున్న పార్వతీబెన్‌ని చూసి నవ్వింది అరవిందం.

"తెలుగు బాగా ఇంప్రూవ్ అయిందే"

"ఏదో మీ ప్రోత్సాహం మాజీ! వీళ్ళిద్దరి కహానీ ఏమిటంటే..."

"అక్కర్లేదు. ఈ అమ్మాయి తనవాళ్ళని టెర్రరిస్టు దాడుల్లో పోగొట్టుకుంది. ఆ అమ్మాయి ప్రేమించి మోసపోయింది" అమ్మాయిలిద్దరూ తలలు ఎత్తి ఆశ్చర్యంగా చూశారు.

"మాజీ! మీకు ఫేస్ రీడింగ్ తెలుసా?"

హేమ కూడా అటువంటి అభిప్రాయంతోనే ఆరాధనగా చూసింది.

"ఈ అమ్మాయి మొహంలో అంతులేని విషాదం. అటూ ఇటూగా ఓరగా చూసే చూపుల్లో భయం... గోడకున్న దేవుడి ఫోటోని చూసి విరక్తితో విరిచిన పెదవులు, తారాబెన్‌ని అంటుకుని కూర్చున్న విధానం... ఇవన్నీ చాలవూ?"

"అవును, ఈ అమ్మాయి పేరు సరసి. ముంబయి పేలుళ్ళల్లో తల్లీ, తండ్రీ అన్నదమ్ములిద్దరూ పోయారు. నిలువనీడ లేకుండాపోయింది. నాగపూర్‌లో ఉన్న దూరపు బంధువుల ఇంటికి వెళ్ళింది. చార్ సాల్ పహ్లే. వాళ్ళతోని ప్రోబ్లం వస్తే వాళ్ళ కాలనీలో మన వర్కర్ తారాబెన్ దగ్గరికి తీసుకొచ్చింది. ఇంక ఈ అమ్మాయి లక్ష్మి. సియోనీ నుంచి. మీరు చెప్పినట్లు"

"సర్లే, ఆ స్టోరీ వద్దు. ఎప్పట్నుంచో మనకి అలవాటైన కథలే కదా. మరి మన నాగపూర్ ఆశ్రమ్‌లోనే ఉంచండి, వాళ్ళ ఇంట్రెస్ట్ ఎందులో ఉందో చూసి. ఈలోగా ఇక్కడున్న మన..."

"అక్కడికే వచ్చారు మాజీ. అంతా చూపించే తీసుకొచ్చాం. సరసి 'జిహ్వ' గ్రూప్‌లో, లక్ష్మి 'శుభం'లో చేరుతామన్నారు. మనకి అబ్జెక్షన్ లేకపోతే ఇక్కడే ఉంటామంటున్నారు. వాళ్ళ ఊరికి దూరంగా"

"అలాగే చెయ్యండి పార్వతీ!మనం బయల్దేరుదామా? హేమా! నువ్వు కూడా వస్తావా?"

అయోమయంగా చూసింది హేమ.

"అంతా తరువాత చెప్తాను. పొద్దున్నే ఉప్మా చేసి హాట్‌పాక్‌లో పెట్టాను. అందరికీ ఇవ్వు. వీళ్ళు తినేలోగా నువ్వు తయారవు. కాంబాబుకి చెప్దామనుకున్నా కానీ నేను బాత్రూంలో నుంచి వచ్చేలోగానే వెళ్ళిపోయాడు"

హేమ ఏదో పజిల్ విప్పబోతున్నదానిలా చురుగ్గా కదిలింది.

• • •

అరవిందం అద్దెకి తీసుకున్న ఇన్నోవా వాన్, నాగార్జునసాగర్ వెళ్ళేదారిలో, ఔటర్ రింగ్‌రోడ్ దగ్గర ఒక కిలోమీటర్ దాటాక కుడివైపుకి తిరిగింది.

కొంచెం దూరం వెళ్ళగానే ఇరుప్రక్కలా చెట్లతో, రకరకాల అడవిపూల తీగలల్లుకున్న పొదలతో నిండిన కంకర్రోడ్డు వచ్చింది.

రెండు కిలోమీటర్లు వెళ్ళిన తరువాత విశాలమైన ఆవరణలోకి ప్రవేశించింది. ఆవరణలో మధ్యగా ఒక పెద్ద ఇల్లు, ముందు పోర్టికో, చుట్టూ పెద్దతోట, అక్కడక్కడ చిన్న చిన్న ఇళ్ళు. ప్రతీ ఇంటిముందు పువ్వుల చెట్లు, ఇళ్ళ వెనుక కూరగాయల తోటలు ఉన్నాయి.

హేమ కళ్ళు విప్పార్చి అంతా పరికించి చూస్తుండగా వాన్ పోర్టికోలో ఆగింది.

ఆరడుగుల పైన పొడవు, దానికి తగ్గలావు, బుర్రమీసాలతో తుపాకీ పట్టుకున్న సెక్యూరిటీ గార్డ్ సెల్యూట్ కొట్టి అరవిందం ఉన్నవైపు తలుపు తీశాడు.

"నమస్తే మేమ్‌సాబ్? కైసే హై ఆప్?"

"ఠీక్ హై బల్బీర్. ఎలా ఉందిక్కడ? అడ్జస్ట్ హోగయా?"

"బహుత్ మేమ్‌సాబ్. ఆప్‌కి మర్జీ. బచ్చేం భీ అచ్ఛా పడ్‌రే"

"గుడ్. నువ్వింకా తెలుగు నేర్చుకోలేదా? మనం ఎక్కడుంటే ఆ భాష నేర్చుకోవాలన్నా కదా?" నవ్వుతూ అడిగింది అరవిందం.

"కుంఛెం కుంఛెం వస్తోంది మాజీ" బల్బీర్ ఇంకో సెల్యూట్ కొట్టి వెళ్ళిపోయాడు తన పోస్ట్ దగ్గరికి. కారు ఆగిన చప్పుడు విని లోపల్నుంచి నమస్కారాలు పెడుతూ నలుగురు వచ్చేశారు. అందరూ యాభై సంవత్సరాలకి అటూ ఇటూ వయసున్నవాళ్ళే.

ఇద్దరు ఆడవాళ్ళు, ఇద్దరు మగవాళ్ళు. ముందుగా వచ్చిన పెద్దాయన పంచెకట్టుతో, తెల్లని లాల్చీ, పైన కండువాతో హుందాగా ఉన్నారు.

"విశ్వనాథంగారూ! అంతా బాగా నడుస్తోందా?"

"ఫస్ట్ క్లాస్ తల్లీ. మీరే చూస్తారు కదా? ఈయన పేరు శ్రీనివాస్. కొత్తగా తీసుకున్నాం. సెక్రెటేరియట్‌లో జాయింట్ సెక్రెటరీగా చేసి ఈ మధ్యనే రిటైర్ అయ్యారు" పక్కనే నిల్చున్న తన్ని పరిచయం చేశారు.

"అవునవును. మెయిల్లో అన్ని డిటైల్స్ ఇచ్చారు కదా. వీరికి మన సంస్థమీద చాలా అభిమానం ఉన్నట్లు సర్వీస్‌లో ఉండగానే తెలిపారు కదా! చాలా సంతోషమండీ. మీవంటివారి కృషి సహకారంతోనే ఈ పనులు చెయ్యగలుగుతున్నాం" అరవిందం ఇద్దర్నీ పలుకరించి, వెనుక ఉన్న ఆడవాళ్ళ కుశలం అడిగింది.

"ఈ అమ్మాయి హేమ. మా మనవడి భార్య. తనకి మన సంస్థల గురించి చెప్పి, ఉత్సాహం ఉంటే మన కార్యక్రమాల్లో పాలు పంచుకుంటుందేమోనని తీసుకొచ్చాను. హేమా! వీరు ఇక్కడ మేనేజర్‌గారు. మిగిలిన అందరూ స్వచ్ఛందంగా ఇక్కడ తమవంతు సహకారాన్ని అందిస్తారు. శ్రీలేఖా, ప్రభా! అమ్మాయికి మన సంస్థ అంతా చూపించండి" విశ్వనాథంగారి వెనుక ఉన్న ఆడవారికి హేమని అప్పజెప్పి, తను ఆఫీసులోకి నడిచింది అరవిందం.

పార్వతి, తారాబెన్, అమ్మాయిలిద్దర్నీ తీసుకుని ఆవిడ వెనుకే వెళ్ళారు.

• • •

"అమ్మమ్మగారు ఎప్పట్నుంచీ ఈ సంస్థలో పనిచేస్తున్నారూ?" ఆవరణ అంతా తిరిగి చూశాక హేమ వేసిన మొదటి ప్రశ్న అది.

శ్రీలేఖ చిరునవ్వు నవ్వింది.

"అర్విందాజీ? ఆవిడ పని చెయ్యడమేమిటి. ఆవిడే సంస్థ, సంస్థే ఆవిడ. మేమే అందరం మాజీవద్ద పనిచేస్తుంటాము. ఇటువంటివి మూడు సంస్థలున్నాయి. అన్నింటికంటే ఇదే పెద్దది, కానీ మొట్టమొదటి సంస్థ ముంబయిలో ప్రారంభించారు"

"ఎవరూ, అమ్మమ్మగారే?"

"అవును. నలభై సంవత్సరాలు పైనే అయింది. అప్పుడు నేను చాలా చిన్నదాన్ని"

"మీకు అప్పట్నుంచీ తెలుసా అమ్మమ్మగారు? ఆవిడ వయసు ఎంతుంటుందీ?" ఆశ్చర్యంగా అడిగింది హేమ.

"నాకు ఊహ తెలిసేసరికే నేను ఆవిడ ఒళ్ళో ఉన్నాను. మాజీకి సెవెంటీ ఇయర్స్ పైనే ఉంటాయి"

"శ్రీలేఖా! నేను వెళ్ళి మాజీతో మాట్లాడుతూవుంటాను. బోలెడు సమాచారం ఉంది. హేమాజీతో మీరు మాట్లాడుతుండండి" ప్రభ వెళ్ళిపోయింది హడావుడిగా.

తను వెళ్ళగానే శ్రీలేఖ, హేమని తన ఇంటికి తీసుకెళ్ళింది.

చెట్ల మధ్యలో ఉన్న సన్నని బాటమీద కొంచెం దూరం వెళ్ళగానే చిన్న కుటీరంలా ఉంది శ్రీలేఖ ఇల్లు. ముందున్న వరండాలో వెదురుతో అల్లిన కుర్చీలు నాలుగు, మధ్యలో ఒక చిన్న టీపాయ్ వేసివున్నాయి. గోడవారగా సిమెంటు అరుగు ఉంది. ఒక గది, వంటిల్లు, గదిలో ఒక పెద్ద మంచం, చదువుకునే బల్ల, కుర్చీ, పక్కనే బాత్రూమ్... గోడకి పెద్ద అలమారు ఉంది. అంతే! మనిషికి కావలసిన కనీస అవసరాలు మాత్రం ఉన్నాయి.

శ్రీలేఖ రెండు కప్పులు టీ చేసి తీసుకొచ్చింది.

ఇద్దరూ వరండాలో విశ్రాంతిగా కుర్చీల్లో కూర్చున్నారు.

"ఇప్పుడు చెప్పండి శ్రీలేఖా! నాకు చాలా ఆదుర్దాగా ఉంది అమ్మమ్మగారి గురించి తెలుసుకోవాలని"

చిరుగాలితో పొగడచెట్లు సువాసనని పంపి తనువునీ, జ్ఞాపకాలు మనసునీ ఆహ్లాద పరుస్తుండగా, శ్రీలేఖ టీ తాగుతూ కళ్ళుమూసుకుని నలభై సంవత్సరాల కాలం వెనక్కి ప్రయాణించింది.

• • •

"మౌసీ! మీరు ఇక్కడ్నుంచి వెళ్ళిపోతున్నారా? మా! నేను కూడా మౌసీతో లండన్ వెళ్తానూ... మమ్మీ! నువ్వు చెప్పు" కాళ్ళూ చేతులూ కొట్టుకుంటూ నేలమీద పొర్లి ఏడుస్తున్న ఏడేళ్ళ పింకీని ఊరుకోబెట్టడం ఎవరితరం కాలేదు.

"అరే పింకీ! మౌసీ మళ్ళీ వచ్చి నిన్నూ ఛోటీని తీసుకెళ్తుంది" రష్మి, పింకీని దగ్గరగా తీసుకుని ఒళ్ళో కూర్చోపెట్టుకుంది.

అరవింద, భట్‌ల ఎదురు అపార్ట్‌మెంటే రష్మీ వాళ్ళది.

భట్టు లండన్ వెళ్ళేరోజు రాత్రి రష్మి ఇంట్లో భోజనానికి పిలిచారు. భట్‌కి తప్ప అందరి హృదయాలూ బరువుగా ఉన్నాయి. అతను వేసే జోక్స్‌కి తప్పదన్నట్లు నవ్వుతున్నారు.

"అంకుల్! మీరు లండన్ ఎందుకు వెళ్ళడం? ఇక్కడే మీ ఫోటో అన్నిసార్లు పేపర్లో వచ్చింది కదా? ఇక్కడే అంత మనీ ఉందికదా" చేతులు బార్లా చాపి పింకీ అడిగిన ప్రశ్నకి అరవింద, భట్ మొహంలోకి చూసింది, ఏం చెప్తాడా అని.

గట్టిగా నవ్వాడు భట్. "గుడ్ క్వశ్చన్ పింకీ. మరి లండన్ పేపర్స్‌లో కూడా రావాలికదా! అందుకనే. లండన్ బాంబేకంటే అంత బాగుంటుంది" పింకీలాగే చేతులు పెట్టి అన్నాడు.

అందరూ నవ్వేశారు భట్ యాక్షన్ చూసి.

భట్ వెళ్ళిన మరునాడు మౌసీ మామూలుగా పొద్దున్నే రష్మి ఇంటికి వచ్చి గుడ్మార్నింగ్ అనగానే ఆశ్చర్యంతో, ఆనందంతో కళ్ళు పెద్దవిచేసి చూసింది పింకీ.

"సర్ప్రైజ్ బేటీ. నేను కొన్నాళ్ళు ఇక్కడే ఉంటాను. మనిద్దరం బోలెడు కథలు చెప్పుకోవచ్చు" మౌసీ చాచిన చేతుల్లోకి ఒక్కసారి వాలిపోయింది.

ఛోటీ కంటే పింకీకే అరవింద వద్ద చనువు ఎక్కువ. భట్ కూడా లేరు. ఇంక పగలు, రాత్రి కూడా మౌసీతోనే. అరవింద యూనివర్సిటీలో చేరేవరకూ.

"అర్విందా! నే విన్నది నిజమేనా?" పింకీని స్కూలుకి తీసుకెళ్ళడానికి వచ్చి అడిగింది రష్మి, ఒకరోజు.

"అవును. రేపట్నుంచీ పింకీని నువ్వే చూసుకోవాలి. నేను చాలా బిజీ"

"అదికాదు, నువ్విప్పుడు యూనివర్సిటీలో చేరడం అంత అవసరమా? మరి లండన్ వెళ్ళవా? భట్ సాబ్ ఏమనుకుంటారూ? ఒక్కదానివీ ఉండగలవా?"

"భట్ సాబ్ అక్కడ ఎగ్జామ్స్ అవీ పాసై, బార్ మెంబర్ అవడానికి టైమ్ పడుతుంది. ఆయనే నన్ను ఇక్కడ ఎమ్మేలో చేరమన్నారు. మరి నేనుకూడా లాయర్ అవాలనేమో! మీరున్నారు కదా! ఒక్కదాన్నెందుకవుతానూ?" మెరుస్తున్న కళ్ళతో అంది అరవింద.

"ఓహ్! ఏ భీ అచ్ఛా డెసిషన్ హై. ఇంకా టూ ఇయర్స్ మనం కలిసివుండచ్చు"

పింకీతో వెళ్ళిపోతున్న రష్మీని చూసి అరవింద కళ్ళు చెమ్మగిల్లాయి. ఆవిడ ఆప్యాయతకో, భట్‌ని వదిలివుండాలనో.

• • •

పింకీ వెక్కి వెక్కి ఏడుస్తోంది.

ఏడుస్తూనే అరవింద సామాన్లు సర్దుకుంటుంటే, తనకి చేతనైన సహాయం చేస్తోంది. ఆ రోజు రష్మీ వాళ్ళింట్లోనే భోజనం అరవిందకి. సాయంత్రమే వెళ్ళిపోతోంది.

"మాసీ! మళ్ళీ ఎప్పుడు వస్తారూ? ఇంక రానే రారా? నన్ను కూడా తీసుకెళ్ళరా?" అంతు లేకుండా వేస్తోంది ప్రశ్నలు పింకీ.

అరవింద, పింకీని దగ్గరగా పిలిచి హత్తుకుంది. ఎప్పటిదీ అనుబంధం. ఎక్కడెక్కడివాళ్ళని ఏవిధంగా కలుపుతాడు భగవంతుడు? ఇద్దరూ కళ్ళనీళ్ళు కారుస్తూ అలా ఉండిపోయారు.

"హే, ఏంటిది? లేవండి. లంచ్‌టైమ్ అవుతోంది. జల్దీ రండి. పింకీ! కమ్మాన్" రష్మీ వచ్చి కేకలేసేవరకూ.

"పింకీ! మళ్ళీ వచ్చేస్తాను. చూడు, ఇల్లు ఇలాగే ఉంచుతున్నాను. తాళాలు మీదగ్గరే ఉంటాయి. కావాలంటే నువ్వు రోజూ ఇక్కడే ఉండి చదువుకోవచ్చు" పింకీని ఊరడిస్తూ రష్మీ వాళ్ళింట్లోకి నడిచింది అరవింద.

"పాస్‌పోర్ట్, టికెట్ అవీ సరిగ్గా పెట్టుకున్నావా అర్విందా?"

ఏదో ఆలోచిస్తూ పరధ్యానంలో పలకలేదు అరవింద.

"హే. నిన్నే! డ్రీమ్స్‌లోకి వెళ్ళిపోయావా, మరి త్రీ ఇయర్స్ అంటే తక్కువా? ఎమ్మే అన్నావు. అది అయ్యాక కూడా వన్ ఇయర్ అయింది. బి.ఎడ్ చేశావు. ఇప్పటికైనా నీ నాథుడికి దయ కలిగింది" అల్లరిగా అంటున్న రష్మీని చూసి నవ్వింది అరవింద, కళ్ళనిండా నీళ్ళతో.

"అవును మరి. కొత్త ప్లేస్. కొత్త దేశం. నిలదొక్కుకోవాలి కదా! ఏంటడిగావ్? పాస్‌పోర్టా? అది రెడీగానే ఉంది. అయినా నేనిప్పుడు మా ఊరు వెళ్తున్నాను. కొన్ని ప్రోపర్టీ మేటర్స్ సెటిల్ చెయ్యాలి. అక్కడ వన్‌మంత్ ఉండాలేమో. ఆ తరువాతే నా లండన్ ప్రయాణం"

"గుడ్, చాలారోజుల తరువాత మీవాళ్ళని కలుస్తున్నావ్. అయామ్ వెరీహ్యాపీ. ఎవరెవరుంటారు అక్కడ?"

అందరి గురించీ చెప్పింది అరవింద. "మా తాతగారు, నానమ్మ, మామగారు మర్‌గయా! అందరూ చాలా లవింగ్‌గా ఉంటారు. నేను వెళ్ళి కొన్ని లీగల్ పనులు చూసుకుని, మేము వెళ్ళినప్పుడు ఉండడానికి వీలుగా కొంత ఇల్లు రెనొవేట్ చేసుకుని రావాలి. అమ్మో! టైమ్ అయింది. వస్తా" అలా వెళ్ళిన అరవింద ఆరునెలలకి బొంబాయి వచ్చింది.

• • •

"వావ్! అర్వీందా, మీ ఊర్నుంచి అటే లండన్ వెళ్ళొచ్చావా? ఇన్నిరోజులు అక్కడే ఉన్నావా?" పొద్దున్నే బెల్‌కొట్టి, తాళం అడిగిన అరవిందని చూసి సంభ్రమంగా అంది రష్మి.

"హ! మా ఊర్లో అంతా సెటిల్ చేసేశాను. ప్రాపర్టీ అంతా నా పేరుకి మార్చేశారు భట్‌జీ. అంటే నాకయితే వెళ్ళి మానేజ్ చెయ్యడానికి కుదురుతుందని. తను చాలా బిజీగా ఉన్నారు. అవసరమైన ఎగ్జామ్స్ అన్నీ క్లియర్ చేసేశారు. ఒక లా ఫర్మ్‌లో చేరారు.

రోజుకి ట్వెంటీ అవర్స్ పనిచేసినా తనకీ, సీనియర్స్‌కీ కూడా తృప్తి ఉండటంలేదు. నేను ఇక్కడే కొన్నాళ్ళు ఉండి ఏదైనా స్కూల్లో చేరదామనుకుంటున్నాను టీచర్‌గా" అరవింద ఇంకా చెప్పడం పూర్తిచెయ్యలేదు. సుడిగాలిలా వచ్చేసింది పింకీ, అప్పుడే నిద్రలేచి, జుట్టు కళ్ళలో పడుతుంటే వెనక్కి తోసుకుంటూ, కళ్ళు పెద్దవిచేసి సంబరంగా చూస్తూ- "మాసీ!"

ఒక్కసారిగా మాతృవాత్సల్యం పొంగింది అరవిందలో. చేతిలో సూట్‌కేసు కిందపెట్టి దగ్గరగా తీసుకుంది. "అబ్బో! ఆర్నెల్లలో బాగా పొడుగయ్యావే?"

"పొడుగైతే అయింది కానీ అల్లరి అంతే ఉంది. ఛోటీ బెన్‌తో ఫైటింగ్‌లూ, నువ్వు లేవు,ఇంకా ఎక్కువైపోయింది. దీన్ని పట్టలేకపోతున్నామనుకో" రష్మి లోపల్నుంచి తాళం తెస్తూ అంది.

"మా! ఇంక నీకు హ్యాపీగా ఉంటుందిలే. నేను మాసీతోనే ఉంటా"

"అవును, రష్మీ! పింకీవాళ్ళ స్కూల్లో ఖాళీ ఉందేమో అడుగుతా, దీనితోనే స్కూలుకి వెళ్ళి వస్తుండచ్చు" అరవింద తన ఇంటికి వెళ్తూ వెనక్కితిరిగి అంది.

"భలే, భలే మా ఇంగ్లీష్ టీచర్‌కి పాపాయి పుడుతుందిట. మా ప్రిన్సిపాల్‌ని అడుగు మాసీ" వెంటనే అందుకుంది పింకీ.

అరవింద నవ్వుకుంది పింకీ ఆతృత చూసి. పిల్లలతో కాలం గడిపితే తనకీ మంచిదే!

• • •

అరవిందా టీచర్ అంటే పిల్లలందరికీ చాలా ఇష్టం. కొంచెం కూడా విసుక్కోకుండా ఏదయినా చక్కగా వివరిస్తుంది.

ఇంగ్లీష్ క్లాస్‌లో పాఠాలే కాకుండా, చిన్న చిన్న కథల పుస్తకాలు చదివించడం, పాటలు నేర్పించడం, ఏ పనైనా మనసుపెట్టి చేస్తుందని పేరుతెచ్చుకుంది. టెంపరరీగా మెటర్నిటీ సెలవులో చేరిన అరవింద, మూడు నెలలకి వేరే ఉద్యోగం వెతుక్కోవాలేమో అనుకుంది.

ప్రిన్సిపాల్‌కి మిసెస్ భట్‌ని వదులుకోవడం ఇష్టంలేదు.

"కొన్ని సెక్షన్స్ పెరుగుతున్నాయి కదా? మనం మిసెస్ భట్‌ని ఎందుకు పర్మినెంట్ చేసుకోకూడదూ?" కమిటీ మీటింగ్ ఎజెండాలో పాయింట్ ప్రవేశపెట్టింది.

"నిజమే... కానీ, ఈమె లండన్ వెళ్ళిపోతుందిటకదా?" ఛైర్మన్ సందేహంగా అడిగాడు.

"వెళ్ళినప్పుడు చూద్దాం. అప్పటివరకూ తన సర్వీసెస్ వాడుకోవచ్చు" ప్రిన్సిపాల్ ఛైర్మన్ గారి భార్యే. ముప్పై సంవత్సరాల క్రితం పదిమందితో మొదలుపెట్టిన "డే కేర్" అలా అభివృద్ధి చెంది, రెండువేలమంది విద్యార్థులతో కె.జీ టు పి.జీ వరకూ విద్యార్థులకి సేవలందిస్తోంది. అందులో ప్రిన్సిపాల్ మేడమ్ కృషే ఎక్కువ.

ఆవిడ మాటకి సాధారణంగా అడ్డుచెప్పరు కమిటీలో.

"ఓకె. మేడమ్. యాజ్ యు సే!"

• • •

అరవింద అప్పుడే స్కూల్‌నుంచి వచ్చింది.

రష్మి వెనుకే వచ్చి ఒక ప్లేట్లో సమోసాలు, ఫ్లాస్క్‌లో టీ తీసుకొచ్చింది.

ఇద్దరూ ఎదురెదురుగా సోఫాల్లో కూర్చుని, టీ తాగుతున్నారు. ఆ రోజు అపార్ట్‌మెంట్‌లో జరిగిన విశేషాలు రష్మి వివరిస్తోంది.

"ఒక్కసారిగా ఇక్కడ పనిమనుషుల గిరాకీ పెరిగిపోయింది. తెలుసా?"

"అయ్యో! మరి ఎలా? ఎక్కడికెళ్ళిపోయారు అందరూ? ఇక్కడ అదే అడ్వాంటేజ్ అనుకున్నా. శుభ్రంగా చేస్తారు పనులు. కష్టమే"

"అదికాదు అర్వింద! రివర్స్‌లో, ఫ్లో ఆఫ్ పనిమనుషులు వచ్చేశారు, చుట్టుపక్కల పల్లెల నుంచి పని కావాలంటూ. అక్కడ తిండి లేదుట. పంటలు సరిగ్గా పండవు. పండినా మంచి ధర రాదు. కూలీలకి ఇచ్చేది చాలా తక్కువ. ఆడవాళ్ళకి తిండి దండుగ అనుకునే కల్చర్"

"నిజంగానా? అలాకూడా ఉంటారా? ఆడేమిటి, మగేమిటి. అందరికీ ఆకలి ఒకటే కదా?" అరవింద సోఫాలో ముందుకి వంగింది.

"నీకు తెలియని లోకం చాలావుంది అర్వింద! ఆడవాళ్ళంటే ఎంత అలుసో, ఏ పని చేసినా ఎంత అవహేళన చేస్తారో, ఎలా ఎబ్యూజ్ చేస్తారో, తమాషా ఏమిటంటే ఆడవాళ్ళే ఆడవాళ్ళకి శత్రువుల్లా ప్రవర్తిస్తారు. ఎంతమంది... ఎన్ని కేసులు? భగవంతుడు ఈ డిస్క్రిమినేషన్ ఎందుకు పెట్టాడా అనిపిస్తుంది నాకు. ఐమీన్ మగవాళ్ళకి బలం ఎక్కువపెట్టడం ఎట్సెట్రా"

"ఇవన్నీ నీకెలా తెలుసు?" కుతూహలంగా అడిగింది అరవింద.

"ఇక్కడికి వచ్చిన కొత్తల్లో నాకు ఏంచెయ్యాలో తోచక పిచ్చెక్కిపోయేది. ఉద్యోగం చెయ్యడం ఇష్టం లేదు. భగవాన్ కృప. మాకు దేనికీ లోటు లేదు. ఏదయినా వాలంటరీ వర్క్ చెయ్యాలని అంతా వెతికాను. అప్పుడు తెలిసింది. 'కర్మయోగ' సంస్థ గురించి. దేశం నలుమూలలా ఉన్నాయి వీళ్ళకి బ్రాంచెస్. ముఖ్యంగా నార్త్‌లో.

'ఆశ్రయ్' అని మనకి దగ్గర్లోనే ఉంది ఒకటి. మొదట్లో పొద్దున్న ఏడుగంటలకి వెళ్ళి, సాయంత్రం ఆరుకి వచ్చి ఇంటిపని చేసుకునేదాన్ని.పిల్లలు పుట్టాక వాళ్ళని చూసుకోవడంలో మునిగిపోయి బాగా తగ్గించేశాను. ఓన్లీ వీక్ ఎండ్స్.

రాహుల్ ఇంట్లో ఉన్నప్పుడు వెళ్ళేదాన్ని. ఇప్పుడు మళ్ళీ ఫుల్‌స్వింగ్. పిల్లలు స్కూల్‌కి వెళ్ళినప్పట్నుంచీ, మళ్ళీ వాళ్ళు వచ్చేవరకూ"

అరవింద ఆశ్చర్యంగా చూసింది.

"ఎప్పుడూ నువ్వు దీనిగురించి మాట్లాడలేదే?"

"నీకు ఇష్టం ఉంటుందో లేదో అని. నీడీ పీపుల్ గురించి మనిద్దరి మధ్యా టాపిక్ రాలేదు. ఇప్పుడు కూడా ఈ పనిమనుషుల గురించి చెప్తూ..."

అరవింద సోఫాలోంచి లేచి అటూ ఇటూ తిరగసాగింది.

"నువ్వు చదువుకోవడం, బొంబాయి లైఫ్‌కి అడ్జస్ట్ అవడం, కొత్త సంసారంలో బిజీగా ఉన్నావని ఎప్పుడూ నీ వరకూ తీసుకురాలేదు" నెమ్మదిగా అంది రష్మి.

"అదికాదు, మనం ఎన్ని రోజుల్నుంచీ కలిసివున్నాం? ఇక్కడ, ఈ రోజు నేనిలా ఉన్నానంటే నువ్వే కారణం. నా చదువుకీ, ప్రపంచజ్ఞానం పెంచుకోవడానికీ, అన్నింటికీ. అటువంటిది నాకే నువ్వేం చేస్తుంటావో తెలియలేదంటే"

అరవింద ఇంకో పాఠం నేర్చుకుంది. తనలోని భావాలూ, సంఘర్షణలూ, తను చేసే పనులూ ఇతరులకి ఎంతవరకూ తెలియాలో అంతవరకే చెప్పాలని.

"అంటే... ఇది ప్యూర్లీ వాలంట్రీ వర్క్ అర్థైందా. అందరికీ ఇష్టం ఉండదు. మొదట్లో చెప్ప బోతే చాలామంది ఏమిటీ గొడవ అన్నట్లు పెట్టారు మొహాలు. పైగా మన చేతి డబ్బు చాలా ఖర్చవుతుంది. అయినా నిన్నుకూడా అడుగుదామని అనుకుంటూనేవున్నాను.

నువ్వు లండన్ వెళ్ళాక ఫండ్ రైజింగ్‌కి హెల్ప్ చేస్తావేమోనని. చెప్పాకదా! ఇన్ని రోజులూ నువ్వూ, నీ ధ్యేయాలూ, ఎక్కడ టైముంది"

"నిజమే, అక్కడ ఏమేంచేస్తావు నువ్వు?" అరవిందలో కొత్త ఉత్సాహం ఊపిరందు కుంది.

"చాలా పనులుంటాయి. రోజుకి ఇరవైనాలుగ్గంటలు సరిపోవనిపిస్తుంది. నేను పనిచేసే చోట ఎక్కువగా మెంటల్లీ సిక్ ఉంటారు. ఎక్కువమంది బొంబాయిలో ఏదో సంపాదిద్దామనో, సినిమాల్లో చేరాలనో వచ్చి మోసపోయి, రోడ్లమీద తిరుగుతూ, మగవాళ్ళ చేతుల్లో పడి అన్యాయమై పోయి మానాలు పోగొట్టుకుని మతి కోల్పోయినవాళ్ళు. వాళ్ళకి కౌన్సిలింగ్ ఇస్తాను.

ఆయాలు ఇల్‌ట్రీట్ చెయ్యకుండా ఆయాలకీ మానవత్వం బోధిస్తుంటాను. వారానికొకసారి మేనేజర్‌ని తీసుకుని బజారుకి వెళ్ళి సరుకులు తెచ్చి అన్నీ సర్దించి లిస్ట్ చేసి, వృథా చెయ్యకుండా చూస్తుంటాను. నేనే కాదు, నాలా ఇంకో పదిమంది హౌస్‌వైవ్స్ ఉన్నారు.

ఏ రోజుకారోజు వచ్చిన వాలంటీర్స్‌ని చూసి వర్క్ అలాట్ చేస్తారు. అందుకని ఎప్పుడైనా వెళ్ళకపోయినా ఇబ్బంది లేదు. కానీ ఎక్కువ రోజులయితే ముందే చెప్పాలి. ఇతర బ్రాంచెస్ నుంచి పంపమని రిక్వెస్ట్ చేస్తారు. నీకు ఇంట్రెస్ట్ ఉంటే శని, ఆది వారాలు చెయ్యచ్చు. అప్పుడు ఎక్కువ డిమాండ్ కూడా. నాలాంటివాళ్ళు వెళ్ళం మరి"

"ఈ సాటర్డే వెళ్దాం.కానీ నేను స్కూలునుంచి వచ్చేసరికి రెండుగంటలు దాటుతుంది"

"అప్పుడే వెళ్ళచ్చు. ఇరవైనాలుగ్గంటలూ వెల్కమ్ అక్కడ" అంతలో వాళ్ళ మాటకి అంత రాయం కలిగిస్తూ కాలింగ్‌బెల్ మోగితే అరవింద వెళ్ళి తలుపు తీసింది.

"మౌసీ! మా ఇంగ్లీష్ టీచర్ వచ్చేసినా నువ్వు స్కూల్లో వర్క్ చేస్తావుట నిజమేనా?" ఉత్సా హంగా, ఎగురుకుంటూ వచ్చి అడిగింది పింకీ.

రష్మి ప్రశ్నార్థకంగా చూసింది.

"హా బేటీ! పర్మనెంట్ చేశారు" తలుపు వేసొస్తూ అంది అరవింద.

"అదే, మా క్లాస్‌లో అందరూ ఎంత హ్యాపీగా ఫీల్ అయ్యారో తెలుసా" పింకీ పట్టలేని

ఆనందంతో అని, వంటింట్లోకి వెళ్ళి పెద్ద పేడాముక్క తెచ్చి అరవింద నోట్లో పెట్టింది.

"ఇదేంటి అర్వింద! మరి భాయ్‌సాబ్ ఏమనరా? నువ్వు లండన్ వెళ్ళడానికి వీలవదుకదా, ఇంక ఇక్కడే ఉండిపోతావా?" రష్మి ఆందోళనగా అడిగింది.

"మా! మౌసీని ఇక్కడే ఉండనీ. మంచిదేకదా!" నోటినిండా పేడా పెట్టుకుని నములుతూ అంది పింకీ.

"ఆగు పింకీ, నువ్వెళ్ళి హోమ్‌వర్క్ చేసుకో. పెద్దవాళ్ళం మాట్లాడుతున్నాంకదా" కొంచెం గట్టిగా అంది రష్మి.

పింకీ మూతి ముడుచుకుని లోపలికి వెళ్ళిపోయింది.

అరవింద మొహంలో ఏ మార్పూ లేదు. అదే ప్రశాంతత, చెక్కుచెదరని చిరునవ్వు. "సమ్మర్‌లో వెళ్ళివస్తుంటాను. ఇక్కడ ఎక్స్‌పీరియన్స్ ఉంటే లండన్‌లో ఈజీగా జాబ్ దొరుకుతుందిట"

"భాయ్‌సాబ్‌కి చెప్పావా మరి?"

"ఇప్పుడు చెప్తాను"

"నేనొకటి అడుగుతాను. నిజం చెప్తావా?" అరవింద కళ్ళల్లోకి చూస్తూ అంది రష్మి.

"అడుగు రష్మి దీదీ! నీకంటే ఎవరున్నారు నాకు?" అంది అరవింద.

"మీరిద్దరూ బాగా ఉంటారా? భాయ్‌సాబ్ నిన్ను లండన్ తీసుకెళ్తారా? వెళ్ళాక ఒక్కసారి కూడా రాలేదేం?"

అరవింద దగ్గుతూ లేచి వంటింట్లోకి వెళ్ళి గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చుకుని తాగి కూర్చుని, గొంతు సవరించుకుంది. ఏదో చెప్పబోయేంతలో మళ్ళీ బెల్ మోగింది.

ఈసారి రష్మి లేచింది. తలుపు తీస్తూనే "హో!" అని శబ్దం చేసింది.

"అర్వింద! భాయ్‌సాబ్!" సంభ్రమంగా చూస్తూ వెనక్కితిరిగింది.

భట్టు పలకరింపుగా నవ్వి, పెట్టెల్ని తీసుకుని లోపలికి వెళ్ళాడు.

"మేం వెళ్తున్నాం. నా ప్రశ్నకి ఆన్సర్ దొరికింది. హ్యాపీ టైమ్. లండన్ వెళ్ళగానే ఆశ్రయ్ గురించి మర్చిపోకు సుమా! ఫండ్స్. పింకీ! కమాన్" అని పిలుస్తూ పింకీని తీసుకుని తన ఇంట్లోకి వెళ్ళిపోయింది రష్మి.

• • •

భట్టు రెండునెలలు పైగా ఉన్నాడు బొంబాయిలో.

మధ్య మధ్యలో సెలవు పెట్టినా అరవింద స్కూలుకి వెళ్తూనేవుంది.

భట్టు పొద్దున్న వెళ్తే రాత్రే రావడం.

అరవింద మామూలుగా రష్మి పిల్లలతో గడుపుతోంది ఖాళీసమయంలో.

ఆఫీసు పని అంతా లండన్‌లోని అయినప్పుడు అంతంతసేపు ఏం చేస్తాడో రష్మికి అర్థం అవలేదు. "ఏవో ప్రాపర్టీ వ్యవహారాలు, అందుకే అంత బిజీ" అరవింద చెప్పింది ఒకరోజు.

"ఇంకా ఆ స్కూల్ ఎందుకు. రిజైన్ చెయ్యచ్చుకదా?" భట్టు ఉండగానే అడిగింది రష్మి ఒకరోజు.

"తనకి పిల్లలతో గడపడం చాలా ఇష్టం. వెళ్ళనియ్యండి రష్మి బెన్" అరవింద ఏదో చెప్ప బోతుండగానే భట్టు సమాధానం ఇచ్చాడు.

క్రిస్ట్‌మస్ సెలవులు వచ్చాయి. ఇద్దరూ అన్నాపురం వెళ్ళారు. చాలారోజులకి వచ్చినందుకు అందరూ ఎంతో సంతోషించారు ముఖ్యంగా అరవిందా వాళ్ళ ఊళ్ళో. చాలాకాలం తరువాత కూతురూ, అల్లుడూ వచ్చినందుకు పొంగిపోయారు ఊరు ఊరంతా.

అరవింద చాలా హుషారుగా తిరిగింది. తన ఆనందాన్ని అందరికీ పంచింది. తిరిగి అన్నాపురం వెళ్తుంటే, మళ్ళీ ఎన్నాళ్లికో అంటూ కంటతడిపెట్టారు.

పట్టుబట్టలూ, పిండివంటలూ, అరటిగెలతో సహా సారెపెట్టారు.

"ఇంక తరచూ వస్తూనేవుంటుందిలెండి మీ అమ్మాయి. ఇప్పటికి ఒకరకంగా స్థిరపడినట్లే మేము" భట్టు భరోసా ఇచ్చాడు.

"మీరు కూడా రావాలి బాబూ, అమ్మాయిమాత్రమే కాదు" మామగారి మాటలకు చిన్నగా నవ్వి తల పంకించాడు భట్టు.

అరవింద తల ఎత్తి అతని మొహంలోకి చూసింది. అదే నవ్వు తనకి కూడా విసిరాడు.

ఒకరోజు అన్నాపురంలో అందరూ భోజనాలు చేసి కచేరీ సావిట్లో సేద తీరుతున్నారు. సంక్రాంతి వరకూ ఎందుకు, తమ్ముడు వచ్చినప్పుడే పండుగ అని రోజా రకరకాల పిండి వంటలు చేయిస్తున్నారు అప్పల నరసింహంగారు. జమీందారుల ఇళ్ళల్లోలాగ పరుపులు, బాలీసులూ ఉండి హాయిగా సేదతీరచ్చు సావిట్లో.

"అబ్బో! బొబ్బట్లు ఎక్కువ తినేశా వదినా! కొంచెం వాము తెచ్చియ్యండి. అన్నా! ఇంక నేను తరచుగా రావడానికి కుదరదు. లండన్‌లోనే సెటిల్ అయిపోతున్నాను. ఆస్తి మొత్తం అరవిందపేరున మార్చేశానుకదా, తనే వచ్చి అన్నీ చూసుకుంటుంది" బాలీసుకి ఆనుకుని భుక్తాయాసం తీర్చుకుంటూ అన్నాడు భట్టు.

"అదేవిటి అలా అనేస్తున్నావు? సెలవుల్లో రావచ్చుకదా?" అన్నగారు కనుబొమ్మలు ముడిచారు.

"ఒక్కరోజు కూడా మానడానికి వీలుండదు. క్రిస్ట్‌మస్‌కి సెలవులు ఉన్నా, అప్పుడు బోలెడు పెండింగ్ పనివుంటుంది. కొన్నేళ్ళు రాత్రింబవళ్ళు పనిచేస్తే కానీ నిలదొక్కుకోలేం"

అరవింద అక్కడే దూరంగా కూర్చుని అన్నదమ్ముల సంభాషణ వింటోంది.

"నువ్వయినా చెప్పమ్మా, సముద్రాలు దాటి అంత కష్టపడవలసిన పనేముంది? ఇక్కడ మీకేం లోటని? పిల్లా పాపా, సంసారం, మనదేశం, మనవాళ్ళూ... ఇవికాదా కావలిసింది?"

"తనేం చెప్తుంది అన్నా! జీవితంలో ఎవరి ప్రాధాన్యతలు వాళ్ళకి ఉంటాయి. నాకు నా వృత్తే ముఖ్యం"

"సరే! ఇంక అంతలా చెప్తుంటే నేనేమంటాను. ఎవరంతటివాళ్ళు వాళ్ళు. అమ్మాయి ఎప్పుడు వచ్చినా స్వతంత్రంగా ఉండచ్చు. ఎప్పటికప్పుడు లెక్కలన్నీ చూపిస్తుంటాను. మీకు ఇక్కడ ఏ లోటూ ఉండదు" అప్పలనరసింహంగారు ఆలోచిస్తూ లేచారు లోపలికి వెళ్ళడానికి.

"బావగారూ!" అరవింద కొంగు నిండుగా కప్పుకుని పిలిచింది.

"ఏంటమ్మా? దస్తావేజులు అవీ చూస్తావా? క్రితంసారి రిజిస్ట్రేషన్‌కి వచ్చినప్పుడు చూపిస్తా నంటే వద్దన్నావు" మరదల్ని ఆప్యాయంగా చూస్తూ అడిగారు. భట్టుకి, ఆయనకి పదేళ్ళు తేడా. తన కూతురి వయసుదైన అరవిందంటే ఆయనకి చాలా అభిమానం.

"అక్కర్లేదండీ, మీమీద నాకు చాలా నమ్మకం. నేను ప్రతీ సంవత్సరం నవంబరు నుంచి మార్చివరకూ ఇక్కడుంటాను. పక్క మండువాలో గది నాకు కావలసినట్లు చేసుకుంటా. పని వాళ్ళని పిలిపిస్తే"

"తప్పకుండానమ్మా! అంతకంటేనా? నువ్వు ఈ దేశంలో ఉన్నప్పుడు ఇక్కడే ఉండాలి. కాకపోతే వేరే కుంపటీ అదీ అంటే ఊరుకోను" గట్టిగా నవ్వేసి వెళ్ళిపోయారు.

భట్టు కళ్ళుమూసుకుని ఆలోచిస్తూండిపోయాడు.

• • •

"అమ్మా!" భట్టు కెవ్వున కేక వేశాడు.

"అమ్మాయ్... అరవిందా!" అప్పలనరసింహం హడావుడిగా నడిచారు నట్టింట్లోంచి పెరట్లోకి. అప్పటికే అందరూ నూతిగట్టు దగ్గర గుమికూడారు.

అవతలి పెరట్లో పువ్వులు కోస్తున్న అరవింద పరుగెత్తుకునొచ్చింది.

నూతిపళ్ళెంలో వెనుక పక్కకి అన్నిచోట్ల నుంచీ వాడిన నీరు అంతా చేరి, పాకుడు ఉండదు కానీ జారుతూ వుంటుంది. స్నానం చేస్తున్న భట్టు, చేతిలో సబ్బుబిళ్ళ అక్కడ పడిపోయిందని అక్కడ చేరిన సబ్బునీళ్ళల్లో కాలు వేశాడు. జర్రున జారి, చెయ్యిపట్టు దొరక్క వెల్లకిల్లాపడిపోయాడు. తలకేం దెబ్బ తగల్లేదు కానీ కాలు మెలికపడి బుసబుసా పొంగింది.

అందరూ వచ్చి లేవతీశారు. అయితే అడుగుతీసి అడుగెయ్యలేకపోయాడు. ఒక చెయ్యి అన్నగారి భుజంమీద ఒక చెయ్యి అరవింద భుజంమీద వేసి నెమ్మదిగా సావిట్లోకి వచ్చాడు భట్టు. పళ్ళ బిగువున బాధ ఓర్చుకుంటున్నాడు.

చన్నీళ్ళలో దళసరి బట్ట ముంచి తుడిచి, సున్నం బెల్లంపట్టీ వేసింది అరవింద, ఎప్పుడో వాళ్ళ నానమ్మ తనకి చేసిన వైద్యం గుర్తుతెచ్చుకుని.

ఆ దెబ్బకి వారంరోజులు కాలు కింద పెట్టలేకపోయాడు భట్టు.

వారమైనా వాపు తగ్గక పోతుంటే అవధానిగారు వచ్చి బెణుకు మంత్రం వేశారు.

భట్టుకి నవ్వొచ్చింది. "ఇదంతా ఏమిటి? చాదస్తం. టౌనుకి వెళ్ళి డాక్టర్‌ని కలుస్తా"

"తాతలనాటినించీ వస్తున్న చిట్కాలు. అలా తీసిపడెయ్యకు. ఎంతమందికో నయం చేశారు అవధానిగారు" అన్నగారు అంటుంటే ఓరగా అరవిందని చూశాడు.

"ఓసారి డాక్టర్‌గారికి కూడా చూపిద్దామండీ" అరవింద బిగించి కట్టుకడుతూ అంది.

"సరేనమ్మా! ట్యాక్సీ పిలిపిస్తా రేపు"

మొత్తానికి మంత్రమో, మందులో... ఏదో ఒకటి భట్టు నడవగలిగాడు.

"అవేం కాదు, అమ్మాయి అరవింద చేసిన సేవవల్లే" అప్పల నరసింహం కితాబు ఇచ్చేశారు. నిజమే, అరవింద కళ్ళు మూయకుండా చేసింది.

భట్టు మొహమాటపడ్డాడు. పది ఎక్స్‌క్యూజ్‌లతో పిలవడం, ఇరవై సారీలు చెప్పడం.

"ఇదేం చోద్యం మరిదిగారూ? పెళ్ళాం మొగుడికి చెయ్యడంకూడా గొప్పేనా? మీ లండన్లో పట్టించుకోరు కాబోలు" వదినగారు బుగ్గలు నొక్కుకుంది.

అన్నాపురంలో వారం అనుకున్నది మూడువారాలు ఉండిపోవలసివచ్చింది. టైమ్ వేస్ట్ అయిపోయిందని గొణుక్కుంటూనే భట్టు భార్యాసమేతంగా బొంబాయి బయలుదేరాడు.

• • •

"అరవిందా! పద, త్వరగా వెళ్ళాలి. ఇక్కడ్నుంచి గంటపైన పడుతుంది. అక్కడ అందరూ వెయిట్ చేస్తుంటారు" భట్టు అసహనంగా అటూ ఇటూ పచార్లు చేస్తూ పిలిచాడు.

"ఒక్క నిముషం. వచ్చేస్తున్నా" అరవింద చీరకుచ్చిళ్ళు సర్దుకుంటూవచ్చింది లోపల్నుంచి. తలుపు తాళం వేస్తుంటే అప్పుడే రష్మి కూడా బయటికి వచ్చింది.

"గుడ్‌మార్నింగ్ భాయ్‌సాబ్, అర్విందా!" ఇద్దరూ ఒకేసారి వెనక్కితిరిగారు.

రష్మి కళ్ళు విప్పార్చి చూస్తుండిపోయింది. ఎంత చక్కని జంట.

గ్రే రంగు సూట్‌లో, జుట్టు వెనక్కి దువ్వి, పచ్చగా మెరిసిపోతూ, భట్టు బ్రిటీష్ దొరలాగే మెరిసిపోతున్నాడు. నడినెత్తికి సిగ చుట్టి, చెవులకి పెద్ద రింగులు, మెళ్ళో కెంపుల నక్లెస్, తెల్లని కాశ్మీర్‌సిల్కు చీరమీద ఎర్రపూలు,మోచేతులు దాటిన తెల్లని బ్లౌజు... చేతులకి రెండు కంకణాలు. అన్నింటికీ మించిన చిరునవ్వుతో అరవింద వైజయంతీమాలకి తీసిపోకుండా ఉంది.

"హా... నా దిష్టే తగిలేలా ఉంది. బ్యూటిఫుల్ కపుల్. మీరు వెళ్తున్న పని సక్సెస్ అవ్వాలని కోరుతున్నాను" అరవింద దగ్గరగా వచ్చి సుతారంగా చెయ్యి అందుకుని అంది రష్మి.

అరవింద చెయ్యి వణికింది స్వల్పంగా, వేడిగా కూడా ఉంది.

"ఒంట్లో బాగుందా అర్విందా? రేపు వెళ్ళకూడదూ?" ఆదుర్దాగా అడిగింది రష్మి, నుదుటి మీద చెయ్యి వేస్తూ.

"ఏంలేదు రష్మిబెన్. కొద్దిగా కోల్డ్. అంతే! చాలా పనులున్నాయి. జర్నీ దగ్గరకొచ్చింది. ఈ రోజే వెళ్ళాలి" భట్టు, అరవింద భుజాలచుట్టూ చెయ్యివేసి నడిపించాడు.

అప్పటికే వచ్చివున్న ట్యాక్సీలోకి ఎక్కుతూ చెయ్యి ఊపింది అరవింద.

రష్మి కొద్దిగా ఆందోళనగా చూస్తూ రెండు చేతులూ ఎత్తి టాటా చెప్పింది. పరిచయమైన ఇన్ని సంవత్సరాలలో ఎప్పుడూ ఇంత దగ్గరగా చూడలేదు భట్ దంపతులని. అరవింద ఒంటరి జీవితానికి స్వస్తి చెప్పి లండన్ వెళ్ళిపోతుందింక.

తను ఆమె కంపెనీ మిస్ అవుతుంది. కానీ భార్యాభర్తలు ఒక దగ్గర ఉండి హ్యాపీగా ఉంటే అంతకంటే ఇంకేంకావాలి లైఫ్‌లో...

రష్మి సన్నగా విజిల్‌వేస్తూ బస్‌స్టాప్‌లో నిలబడింది, ఆశ్రయ్‌కి వెళ్ళడానికి.

• • •

భట్టు ట్యాక్సీని వాళ్ళు ఉంటున్న కాలనీ దగ్గర్లోనే కొత్తగా కడుతున్న ఇళ్ళ దగ్గరికి తీసు కెళ్ళమన్నాడు. ఎంత దగ్గరైనా బొంబాయిలో అరగంటపైన ప్రయాణం చేస్తే కానీ కుదరదు.

ట్యాక్సీ వెళ్తున్నంతసేపూ భట్టు బ్రీఫ్‌కేసులోంచి ఏవో కాగితాలు తీసి చదువుతుంటే అరవింద కిటికీలోంచి బయటికి చూస్తూ కూర్చుంది.

గేట్లోంచి లోపలికి వెళ్ళగానే ట్యాక్సీని ఎదురుగా గుండ్రంగా కట్టిన భవనందగ్గరకి పోనిమ్మని అక్కడ ఆపించి, కిందికి దిగి చుట్టూతిరిగి వచ్చి అరవిందకి తలుపుతీశాడు భట్టు.

ట్యాక్సీ దిగి అడుగు వెయ్యబోతుండగా కొంగు తలుపు మధ్యలో ఇరుక్కుని ముందుకి పడబోయింది అరవింద.

భట్టు వెంటనే రెండు భుజాలూ పట్టుకుని ఆపి, కొంగు తప్పించి చెయ్యిపట్టుకున్నాడు.

"థ్యాంక్యూ" అరవింద అతని కళ్ళల్లోకి చూస్తూ అంది.

భవనంలోనికి ప్రవేశిస్తూవుండగానే సూట్ వేసుకున్న బట్టతలాయన గబగబా నడుచు కుంటూ వచ్చాడు.

"వీరు మిస్టర్ రాజారామ్. ఈ ప్రాజెక్ట్‌కి ఓనర్, డెవలపర్... అన్నీ. ఈమె..."

"నాకు తెలుసు భట్ సాబ్! నమస్తే అరవిందా జీ! మీ ఫోటోస్ అవీ డాక్యుమెంట్స్‌లోనే చూశాకదా, అందుకని" రాజారామ్ నమస్కారం పెట్టాడు.

ఆఫీసు అధునాతనంగా ఉంది. ఒకపక్క అర్ధచంద్రాకారంగా ఉన్న బల్ల వెనుక చక్కగా తయారయిన రిసెప్షనిస్ట్ ఫోన్లో మాట్లాడుతోంది.

రాజారామ్‌ని చూడగానే లేచి నిలబడి, చేతిలో ఫోన్ కిందపెట్టి ముందుకు వచ్చింది.

"ఆయీయే భట్‌సాబ్! ఆయీయే" కరచాలనం చేసి చల్లని ఏసీ గదిలోకి తీసుకెళ్ళి సోఫాల్లో కూర్చోబెట్టాడు.

"మీరు ఫస్ట్ బుక్‌చేశారు. ఇంక మాకు ఒకటే రష్ అనుకోండి. ఆల్ మోస్ట్ అన్ని ఇళ్ళూ అయిపోయాయి. వన్ ఇయర్‌లోపే మీకు హాండ్ ఓవర్ చేసేస్తాము" చల్లని కూల్‌డ్రింక్ స్వయంగా ఇస్తూ అన్నాడు.

భట్టు బ్రీఫ్‌కేసు తీసి ఫైల్లోని కాగితాలు, కాలనీ మ్యాప్, ఇంటిప్లాన్ బయటికి తీశాడు.

రాజారామ్ మధ్యలో సవరిస్తూవుండగా మొత్తం అరవిందకి వివరించాడు భట్టు.

"మొత్తం ఐదువేల అడుగుల బంగ్లా. మూడు అంతస్థుల్లో ఉంటుంది. తొమ్మిది బెడ్ రూమ్స్, మూడు హాల్స్, రెండు కిచెన్స్, అటాచ్డ్ బాత్స్ ఉంటాయి"

"ఎంత ఖరీదు?" అరవింద కళ్ళు పెద్దవిచేసి చూస్తూ అడిగింది. ఇంత పెద్ద ఇల్లా?

"ఎంతయితే నీకెందుకు? నచ్చిందా లేదా చెప్పు" భట్టు ఆరాధనగా చూస్తూ అన్నాడు.

తను ఇంతవాడవడానికి సహకరించిన, ఇంకా సహకరిస్తున్న అరవిందకి ఏమిచ్చినా, ఎంతిచ్చినా ఋణం తీరదు.

"ఇంటికేం, చాలా బాగుంది. కానీ ఇప్పుడు అంత అవసరమా? ఇక్కడున్నప్పుడు ఉండ డానికి ఫ్లాట్ ఎలాగా ఉంది"

"అది కూడా ఉంటుంది. నీకిష్టమయింది వాడుకోవచ్చు. లండన్ ధరలతో పోలిస్తే ఇది చాలా తక్కువే. డబ్బు గురించి ఆలోచించనక్కర్లేదు. ఇక్కడి పని పూర్తిచేసుకుని మనం లాయర్ చౌహాన్‌ని కలవాలి"

ఒక్కక్షణం అరవింద కళ్ళల్లో బాధ కనిపించింది. ఇతను చౌహాన్ దగ్గరే ఉండుంటే, ఒకసారి పైకి చూసి తల విదిలించింది.

"సరే! కానియ్యండి" వద్దంటున్నా అప్పుడు భట్టు కొన్న ఆ భవనం భవిష్యత్తులో అరవింద కార్యకలాపాలకి ఎంతగానో ఉపయోగపడింది.

• • •

తలుపు ఎవరో దబదబా బాదుతుంటే తెలివొచ్చింది అరవిందకి. ఒక్కక్షణం ఏమీ అర్థం అవలేదు. ఎక్కడుంది తను? కళ్ళు భగభగా మండుతున్నాయి. ఫ్లైట్ రావడమే ఆలస్యమై ఐదుకి రావలసింది రాత్రి ఎనిమిదింటికి వచ్చింది. ఆ తరువాత ఏవేవో కాగితాలు సర్దడం, కట్టవలసిన బిల్లులు కట్టడం, కొత్త ఇంటిపనులు ఏమేమి చెయ్యాలో వరుసగా రాసుకోవడం చాలా పొద్దు పోయింది. ఆ తరువాత కూడా ఎప్పటికో కానీ నిద్రపట్టలేదు. అయినా బెల్లుండగా తలుపు, ఎవరూ... లేచి తడబడుతున్న అడుగులతో వెళ్ళి, ఆవలిస్తూ తలుపు తీసింది.

భోరుమని ఏడుస్తూ కాళ్ళమీదికి పడిపోయింది ఒక స్త్రీ.

ముప్పై ఏళ్ళుంటాయి. తల దువ్వుకుని శుభ్రంగా ఉంది. మడమల పైకి గోచీపోసి కట్టిన ముతకచీర. ఎనిమిదో తొమ్మిదో నెలల గర్భిణీ.

అసంకల్పితంగా అడుగులు వెనక్కివేసింది అరవింద. ఎప్పుడూ చూడలేదే ఈమెని. ఎక్కడ్నుంచి వచ్చిందో. అసలు కింద వాచ్‌మేన్ ఎలా రానిచ్చాడు? తన తలుపే తట్టాలని ఎందుకు అనుకుంది? అరవింద అడగబోయేంతలో తనే లేచి నిల్చుంది.

"మాజీ! మాఫ్ కర్‌నా. నాకు ఎవరూ లేరు. నొప్పులొస్తున్నాయి. ప్రేమించానని ఈ ఊరు తీసుకొచ్చిన మగాడు, నడివీధిలో వదిలేసి పారిపొయ్యాడు. నేను ఎదురింట్లో పనిచేస్తాను. ఆ అమ్మా ఆదుకుంటానని పనిలోకి తీసుకుంది. ఇప్పుడు ఊరెళ్ళారు. ఇంకా పదిరోజులుపైనే ఉంది పురిటికి అన్నారు. అంతలో..." మళ్ళీ కడుపు పట్టుకుని నేలమీద కూలబడిపోయింది.

అరవింద వస్తూనే రశ్మి ఇల్లు తాళం గమనించింది. ఎక్కడికో వెళ్ళారేమో, మరునాడు మాట్లాడచ్చులే అనుకుంది. ఈ అమ్మాయిని ఆశ్రయ్‌లో చేర్పించకుండా ఇంట్లో ఎందుకు పెట్టుకుంది?

"ఆశ్రయ్‌లో ఖాళీ లేదటమ్మా! ఎవరో పుణ్యాత్ములు హాలు కట్టిస్తున్నారుట. అందాకా, తనదగ్గరే ఉంచుకుంది మహాతల్లి" అరవింద ఆలోచన గ్రహించినట్లు అందామె.

"నీ పేరేంటి?" తెలివైందే. మరి మగవాడి ఉచ్చులో ఎలా పడిందో.

"రుక్మాబాయి, పదివరకూ చదివా" పళ్ళ బిగువున బాధ భరిస్తూ అంది. తనతో తెచ్చుకున్న సంచీలో నుంచి పుస్తకం తీసిచ్చింది. హాస్పిటల్ వివరాలు, డాక్టర్ పేరు ఉన్నాయి.

ఏది ఏమయినా రశ్మికోసం ఈ బాధ్యత స్వీకరించక తప్పదు.

"లోపలికి రామ్మా!" చాప వేసి, రుక్మాబాయిని పడుకోమని, తను గబగబా స్నానం చేసి తయారయింది. ఫోన్‌చేసి ట్యాక్సీ పిలిచింది.

అది వచ్చేలోపు, రాత్రి వాచ్‌మేన్‌తో తెప్పించిన పాలుకాచి తనో గ్లాసు తాగి, రుక్మాబాయికో

గ్లాసు ఇచ్చింది. నెమ్మదిగా నడిపించుకుంటూ, ట్యాక్సీలో ఎక్కించి హాస్పిటల్‌లో చేర్పింది, అవసర మయిన డబ్బుకట్టి.

• • •

"అర్వొందా! ఎప్పుడొచ్చావ్? నయమే, నువ్వున్నావ్ కనుక సరిపోయింది.

మా ఊరెళ్ళా, పిల్లలకి చుట్టీకదా, అక్కడ అమ్మదగ్గర వదిలేసి వచ్చా, రుక్మాబాయ్ ఎలా ఉంది?" హడావుడిగా హాస్పిటల్లో వరండాల్లో కూర్చున్న అరవిందని చెయ్యి పట్టుకుని ఊపేస్తూ పలుకరించింది రష్మి.

"నిన్న రాత్రే వచ్చా. పొద్దున్నే నాకు ఈ పని పెట్టావ్. తప్పుతుందా మరీ..." అలసిన కళ్ళతో చూస్తూ చిరునవ్వు నవ్వింది అరవింద.

"అదిగో డాక్టర్" రష్మి, లేబర్ రూమ్‌లోనుంచి వస్తున్న డాక్టర్ దగ్గరగా వెళ్ళింది.

"మిసెస్ భట్! అమ్మాయి పుట్టింది. ఈజీ డెలివరీ. రేపే తీసుకెళ్ళిపోవచ్చు. నాకు ఇంకో కేసుంది. మీరు లోపలికి వెళ్ళిచూడచ్చు" గబగబా అడుగులువేస్తూ తన గదిలోకి వెళ్ళిపోయిందావిడ. అరవింద ఆశ్చర్యంగా చూసింది రష్మిని.

"ఇంతకాలం నువ్వు చూస్తే ఇప్పుడు నాకు చెప్తుందేమిటీ?"

"అదేమరి. నువ్వు డబ్బు కట్టావుకదా? ఈ డాక్టర్‌ని నేనెప్పుడూ కలవలేదు.అంతకుముందు చెకప్స్‌కి ఆశ్రయ్‌ద్వారా వచ్చాను. వాళ్ళకి ఫ్రీగా ట్రీట్ చేస్తారులే" నవ్వింది రష్మి.

వీళ్ళని చూడగానే పక్కమీదినుంచి లేవబోయింది రుక్మాబాయ్.

పాపకి స్నానం చేయించి, తువ్వాలుతో చుట్టి తీసుకొచ్చింది నర్సు.

ఆరోగ్యంగా, చక్కగా ఉంది పాప.

అరవింద అపురూపంగా అందుకుంది.

"లేవద్దమ్మా! రేపు తీసుకెళ్తాం నిన్ను. అందాకా పిచ్చిపనులు చెయ్యకుండా బుద్ధిగా నర్స మ్మలు చెప్పినమాట విను" పాపని చేతుల్లోకి తీసుకుని మందలించినట్లుగా అంది రష్మి.

"చెయ్యనమ్మా! మీరంతా ఉండగా నాకేం. ఆ అమ్మ సమయానికి ఆదుకుంది. ఇందరు మంచి మనుషులుంటే..." రుక్మాబాయ్ కళ్ళనిండా నీళ్ళు. మాట రానట్లు ఏదో అడ్డుపడినట్లు గొంతు పూడుకుపోయింది.

"జాగ్రత్తగా చూసుకోండమ్మా! నేను రేపొస్తా" రష్మి నర్సుకి చెప్పి బైటికొచ్చింది.

అరవింద పాపని నర్సుకిచ్చి రష్మి వెనుకే నడిచింది.

• • •

"పాప చాలా బాగుంది కదూ! అవునూ, ఎందుకలా అన్నావూ? అదే రుక్మాబాయిని పిచ్చి పనులు చెయ్యద్దని. రేపు మీ ఇంటికే తీసుకొస్తావా?" ఇంటికొచ్చాక అడిగింది అరవింద.

ఇద్దరూ రష్మి ఇంటికొచ్చారు.

"ఏం చెప్పను. ఆశ్రయ్‌లో చోటు లేదు. ఇప్పటికే ఇద్దరుండవలసిన గదికి నలుగురుంటు న్నారు. అందుకే మా ఇంట్లో పెట్టుకున్నా. రాహుల్ గొణుగుతూనేవున్నాడు, ఎక్కడుంచుతావ్. ఇంట్లో చోటేదీ అని. ఒక్కతే కదా వంటింట్లో ఉంటుందని ఒప్పించాను. నీట్‌గా ఉంటుంది కనుక

సరిపోయింది. ఇప్పుడు, తల్లీపిల్లా... రాహుల్ ఒప్పుకోడు. ఆశ్రయ్‌లో కొత్తగదులు కడతామన్నారు కానీ అంత సులభంకాదు. డోనార్స్ దొరకాలి, కట్టాలి... ఎప్పటికి? ఏం చెయ్యాలో అర్థం అవడం లేదు'' విచారంగా అంది రష్మి.

“అసలు రుక్కూబాయ్ ఎవరు? నిన్నెలా కలిసింది?''

“చాలా పెద్ద కథే. టీ తాగుతూ చెప్పుకుందాం'' రష్మి వంటింట్లోకి వెళ్ళి టీ పెడుతుంటే అరవింద ముందుగదిలో సోఫాలో కూర్చుని కాళ్ళు టీపాయ్‌మీద పెట్టి వెనక్కివాలి కళ్ళు మూసుకుంది. చెప్పలేనంత నీరసంగా ఉంది. కళ్ళు నిద్రపొమ్మని మొత్తుకుంటున్నాయి.

“అర్వీందా! లే, లే... పాంచ్ మినిట్ మే సోగయా?''

రష్మి చేతిమీద తట్టి పిలుస్తుంటే ఉలిక్కిపడి లేచింది. వేడి వేడి టీ పొగలు కక్కుతోంది. ఒక్కసారిగా కడుపులో పేగులు గడబిడ చెయ్యడం మొదలుపెట్టాయి.

“తినడానికి ఏమయినా ఉందా?'' టీ కప్పు అందుకుంటూ అడిగింది.

“అదికూడా తయార్'' లోపలికి వెళ్ళి ప్లేట్‌నిండా శాండ్‌విచ్‌లు తెస్తూ అంది రష్మి.

కడుపు నిండి, వేడి టీ మనసుని ఉల్లాసపరిచాక అరవింద కళ్ళలో కాంతి వచ్చింది కాస్త. “ఇప్పుడు చెప్పు''

రష్మి సాలోచనగా చూసింది. ఎక్కడ్నుంచి, ఎలా మొదలుపెట్టాలి? బొంబాయ్‌లో ఇటువంటి కథలు రోజుకి రెండు మూడు నడుస్తూనేవుంటాయి.

అర్వీందకి ఇంకా కొత్త. ప్రపంచంలో ఇటువంటి చీకటికోణం ఉంటుందని తెలియదు. ఎలా తీసుకుంటుందో! అయినా చెప్పాలి. తప్పదు.

“కళ్యాణ్‌కి సరిహద్దులో ఉన్న ఒక గ్రామం రుక్కుది''

“ఏదీ... ఇక్కడున్న కళ్యాణ్?''

అవునన్నట్లు తలూపింది రష్మి.

“కొద్దిగా స్థితిపరులే. ముగ్గురే పిల్లలు. తండ్రి చిన్నవ్యాపారి. పాతసామాన్లు కొని బొంబాయిలో స్క్రాప్ డీలర్స్‌కి అమ్ముతుంటాడు. రుక్కు చాలా తెలివయింది. సైన్స్‌లో క్లాస్ ఫస్ట్ వచ్చింది. టెంత్ చదువుతుండగా పరిచయం అయ్యాడు పాత్రో.

తెల్లని లాల్చీ పైజమా, నడిమధ్యలో పాపిడి తీసి తీరుగా దువ్విన జుట్టు, సౌమ్యంగా, నెమ్మదిగా మాట్లాడుతూ చిరునవ్వుతో అందరినీ ఆకట్టుకున్నాడు.

రుక్కు క్లాసులో ఉండే లలిత్‌బాయ్‌కి వరుసకి అన్న అవుతాడు. సినిమా కబుర్లు చెప్తూ, బొంబాయ్‌లో తనకి చాలామంది తెలుసని చెప్పేవాడు. పదహారేళ్ళ వయసు. అనేక ఊహలు, ఆశలు. సినిమాలో వేషం ఇప్పిస్తాను అంటూ కబుర్లు, అరచేతిలో స్వర్గం చూపించేవాడు.

లలిత్ చెప్తూనేవుండేది వాడి మాటలు నమ్మద్దని. పెద్దవాళ్ళకి తెలియకుండా స్కూలు ఎగ్గొట్టి తిరిగింది. ఏముందీ, కథ మామూలే. ఒకరోజు పాత్రోతో ఇక్కడికి వచ్చేసింది. వాడికి ఒక చిన్న ఇల్లు కూడా ఉందిట, ఏదో స్లమ్‌లో.

కొత్తలో కొన్ని స్టూడియోలు తిప్పాడు. రుక్కు మెళ్ళో ఉన్న గొలుసు అమ్మేసి జల్సా చేశారు.

ఒకరోజు పొద్దున్నే వెళ్ళినవాడు పత్తా లేకుండా పారిపోయాడు. ఏం చెయ్యాలో తోచని రుక్కు ఎదురుచూసీ చూసీ పక్కవాళ్ళతో మొత్తుకుంది. ఇంట్లో తినడానికేం లేదు. ఊరు తెలియదు. ఇంటికి వెళ్దామంటే పైసలు లేవు. పక్కింటివాళ్ళకి చెప్పిన రాత్రే నలుగురు మృగాల్లాంటి మనుషులు వచ్చి..." చెప్పలేక ఆగిపోయింది రష్మి.

అటువంటి సంగతులు మొదటిసారిగా వింటున్న అరవింద కళ్ళు ధారగా వర్షిస్తున్నాయి. కలిగిన కుటుంబంలో పుట్టి అంతకంటే కలిగిన మెట్టినింట్లో అన్ని భోగాలూ అనుభవిస్తున్న అరవిందకి తట్టుకోవడం కష్టంగానే ఉంది.

"పార్కులో తిరుగుతుంటే ఎవరో పుణ్యాత్మురాలు ఆశ్రయ్ గురించి చెప్పిందిట. అంతే కాదు, తీసుకొచ్చి అక్కడ దింపింది. అదే సమయంలో నేనక్కడున్నాను. ఇన్‌మేట్‌గా చేర్చుకోవడానికి ఖాళీ లేదు. వాళ్ళ గ్రామానికి పంపుదామంటే ఆమె ఒప్పుకోలేదు.

ఢిల్లీ కర్మయోగ్ చాలా పెద్దది. అక్కడికి పంపచ్చు. కానీ ఎవరు తీసుకెళ్తారు? మళ్ళీ ఎవరైనా మోసం చేస్తే అప్పుడే మా ఇంటికి తీసుకొచ్చాను.

ఇంట్లో చాలా సహాయంగా ఉంది. ఏదైనా చెప్తే వెంటనే అల్లుకుపోతుంది. నాక్కూడా హాయిగా ఉంది. ఎక్కువ సమయం ఆశ్రయ్‌లో గడపగలుగుతున్నాను. ఒక నెల గడవగానే రుక్కుకి అనుమానం వచ్చింది. ఇంకొక పదిహేను రోజులయ్యాక ప్రెగ్నెన్సీ కన్ఫర్మ్ అయింది. అప్పుడే రుక్కు భయంకరమైన నిర్ణయం తీసుకుంది.

తండ్రెవరో తెలియని పిల్లని కని ఎలా పెంచడం? అన్నీ సవ్యంగా ఉన్న తన బ్రతుకే ఇలా అయింది. అర్ధరాత్రి లేచి పైకి వెళ్ళి టెర్రస్‌మీదినుంచి దూకెయ్యబోయింది"

"అమ్మో! ఇంతకీ రుక్కు వయసెంత?"

"పదిహేడు సంవత్సరాలు. ఆ చీరకట్టులో అలా ఉంటుంది కానీ, మొహం పరీక్షగా చూస్తే లేతగా తెలుస్తుంది"

నిజమే... తను ఆ అమ్మాయి మొహంలోకి చూడనేలేదు అనుకుంది అరవింద. "మరి ఎవరు రక్షించారు?"

"ఆయుష్ ఉన్నట్లుంది. విపరీతమైన దాహం వేసి నేను లేచాను. అప్పుడే తలుపు తీసుకుని రుక్కు లిఫ్ట్‌దగ్గరకి నడిచింది. ఎవరైనా చూస్తారనేమో మనసు మార్చుకుని మెట్లెక్కి వెళ్ళింది. అనుమానం వచ్చి లిఫ్ట్‌మీద పైకి వెళ్ళాను. సరిగ్గా సమయానికి వెళ్ళి కాపాడగలిగాను" ఆ సంఘటన గుర్తుకొచ్చి మొహం అంతా చెమటలుపట్టాయి రష్మికి. చున్నీతో తుడుచుకుని, టీపాయ్‌మీద ఉన్న గ్లాసులో నీళ్ళు గడగడా తాగేసింది.

"బలవంతంగా కిందికి తీసుకొచ్చానేగానీ ఏడుపు మానిపించి మనుషుల్లో పడెయ్యడానికి పదిహేనురోజులు పట్టింది. ప్రతి నెలా హాస్పిటల్‌కి తీసుకెళ్ళి చూపిస్తున్నాను. ఇంతలో నేను ఊరికెళ్ళడం... ఎమర్జెన్సీ, దేముడు పంపినట్లు నువ్వు రావడం. అవునూ నువ్వేంటి ఇలా? భాయ్ సాబ్ రాలేదా?"

"అప్పుడు ఇల్లు కొన్నామని చెప్పాకదా, అది రిజిస్ట్రేషన్ చేసి, హ్యాండ్ ఓవర్ చేసుకోవాలి. అది నా పేరుమీదనే ఉంది. అందుకే నేనుంటే చాలు"

"అసలు నువ్వెళ్ళి ఎంతకాలమయిందీ? టూ మంత్స్? విమానాలకి పొయ్యడానికి పైసల్ మస్త్ మస్తున్నయ్యా?"

"పని ఉన్నప్పుడు ఎన్ని పైసలున్నా తప్పదుకదా! ఇంతకీ రేపు రుక్మాబాయ్‌ని ఏం చేస్తావు?"

"అదే ఆలోచిస్తున్నా అరవిందా, ఏం తోచడంలేదు. ఈ ప్రాబ్లమ్‌కి ఏం సొల్యూషన్ కనిపించ డంలేదు"

"నా దగ్గర ఒక ప్లాన్ ఉంది" అరవింద ఆలోచిస్తూ అంది.

"ఏంటది, చెప్పు చెప్పు" రష్మి లేచి అరవింద పక్కనే కూర్చుంది.

"రేపు మేము కొన్న ఇల్లు రిజిస్ట్రేషన్. అందులో ఆశ్రయ్‌వంటి సంస్థ స్థాపిద్దామని అను కున్నాను. అది ఎప్పుడో ఎందుకు. రుక్మాబాయ్‌తోనే ప్రారంభిస్తే?"

"ఏంటీ? అంత ఇల్లు ఆశ్రయ్‌కా? భట్ సాబ్ ఏమీ అనరా?" రష్మి కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి.

"ఆశ్రయ్‌వంటి అన్నానుకానీ ఆశ్రయ్ అనలేదు. నేనే స్టార్ట్ చేస్తాను, నా ఆశయాలకి అనుగుణంగా నీ సహాయంతో. నీకు ఇప్పుడు పిల్లలు కొంచెం పెద్దవాళ్ళయ్యారు కనుక ఫుల్ టైమ్ పనిచెయ్యగలవేమో అనుకుంటున్నాను. నీడీ ఉమన్ చాలామంది ఉంటున్నారు కదా? ఆ విషయం ఆశ్రయ్‌లో కొత్తవాళ్ళకి చోటు లేకపోవడంతోనే తెలుస్తోంది.

అంతా ఒక అడ్మినిస్ట్రేషన్ కింద ఉండడం కంటే రెండు మూడు ఉండడం ఎప్పటికీ మంచిది. కాంపిటీషన్ ఉంటుంది. ఇంక భట్‌సాబ్... ఏమీ అనరు. ఇండియాలో ప్రాపర్టీ అంతా నాకు నచ్చినట్లు నేను వాడు కోవడానికి ఎప్పుడో పర్మిషన్ ఇచ్చేశారు. లీగల్‌గా సర్వహక్కు లతో నాకు ట్రాన్స్‌ఫర్ చేసేశారు. నాకు ఇంటిదగ్గర్నుంచి, పంటలమీద బాగా వస్తుంది ఆదాయం. అదీకాక భట్‌సాబ్ కూడా పంపు తారు కావాలంటే. మిగిలింది మనిద్దరం కలిసి ప్లాన్ చెయ్య డమే" అంతా చెప్పాక అరవింద నవ్వింది. చల్లగా నవ్వింది. మొహం వింత తేజస్సుతో వెలిగిపోయింది.

రష్మి అలా చూస్తూండిపోయింది.

"హా... ఇదంతా నిజమే. నువ్వేం కలగనడంలేదు. రుక్మాబాయ్‌ని రేపు మా ఇంటికి తీసు కొచ్చేద్దాం. మా ఇంట్లో పనిచేసే అమ్మాయి ఎలాగా ఉంది. ఆమెనే పాపని చూసుకోమందాం. భట్‌సాబ్ ఇప్పుడప్పుడే రారు. అయినా ట్రంక్ కాల్ బుక్‌చేసి నీతో మాట్లాడిస్తాలే. నీ సందేహం తీరిపోతుంది"

"చాలా డబ్బుకావాలి అర్విందా! ఆశ్రయ్ అంటే కర్మయోగ్ వాళ్ళ సంస్థ. అది దేశవ్యాప్తంగా ఉంది మనం చెయ్యగలమా?"

"కమాన్ దీదీ! నిన్ను చూసే నాకు ఉత్సాహం వచ్చింది. నువ్వే డీలా పడిపోతే ఎలా? ముందు మనదగ్గరున్నదాంతో ప్రారంభిద్దాం. ఆ తరువాత భగవాన్ కృప. చలో! వంట చేసు కుందాం. పింకీ, ఛోటీ ఎప్పుడొస్తున్నారూ? భోజనం అయ్యాక, మన కొత్తసంస్థ బిల్డింగ్ చూద్దాం.

పేరేం పెడ్దాం?" అరవింద హడావుడి చేసింది.

రష్మి అయోమయంగా చూస్తూ సోఫాలోంచి లేచింది.

• • •

"తప్పకుండా చెయ్యండి రష్మిబెన్. నేను కూడా అప్పుడప్పుడు డబ్బు పంపుతుంటాను. అరవింద చాలా తెలివైంది. ఏం చెయ్యాలో ఆమెకి బాగా తెలుసు. నా గురించా... డోంట్‌వర్రీ, ఆమె ఇష్టప్రకారమే చెయ్యండి"

భట్టు ఫోన్ పెట్టెయ్యగానే అరవిందకేసి తిరిగింది రష్మి.

అరవింద కళ్ళెగరేసింది, ఇప్పుడేమంటావ్ అన్నట్లు.

తన ఇంట్లో ఒక గది రుక్మాబాయ్‌కి, పాపకి సర్దించి, రష్మి ఇంకా నిస్తేజంగా నడుస్తుంటే భట్టుతో మాట్లాడించింది అరవింద.

అయినా రష్మికి అనుమానంగానే ఉంది. ఒక సంస్థని ఏర్పరచాలంటే అంత సులభంకాదు. లక్షలు, కోట్లలో డబ్బు కావాలి. పెద్దవాళ్ళ అండదండలుండాలి. ఇవన్నీ తాము చెయ్యగలరా? ఎక్కడో ఆంధ్రా నుంచి వచ్చిన ఒక పల్లెటూరు అమ్మాయి ఇంత బృహత్ పథకాన్ని చెయ్యగలదా? తన సంసారం మాటేమిటి?

"ముందు చిన్నగా మొదలుపెడదాం దీదీ! మా ఇల్లు చూశావు కదా? ఇరవైమంది వరకూ ఈజీగా ఉండచ్చు అందులో. కొంత పెరిగాక లీగల్ ఫార్మాలిటీస్ సంగతి చూద్దాం. లాయర్ చౌహాన్ సహాయం అడుగుదాం. ముందు నీ అనుమానాలు, భయాలు పక్కన పెట్టు"

"అంతేనంటావా?"

"అంతే, నడూ రుక్మాబాయ్‌నీ, పాపనీ తీసుకొద్దాం"

"మరి నీ ఫ్యామిలీ? ఎంతకాలం భాయ్‌సాబ్ ఒంటరిగా ఉంటారు?"

"అదంతా నేను చూసుకుంటా కదా, ఒక ప్లాన్ ప్రకారం అంతా నడుస్తుంది. ఎవరికీ ఏ లోటూ రాదు సరేనా?"

అయినా కదలకుండా, కలవరపడుతూ కూర్చుంది రష్మి.

"భారత్ సంగ్రామ్ ముందు అర్జున్‌లాగ కూలబడ్డావే! ఇప్పుడు భగవాన్ కృష్ణని తీసుకు రాలేను కానీ రోజూ భగవద్గీతలో శ్లోకాలు కొన్ని మననం చేద్దాం. అప్పుడైనా నీ నైరాశ్యం వదులుతుందేమో!"

అరవింద మాటలకి నవ్వుతూ లేచింది రష్మి.

• • •

'చిన్నీ' కిలకిలా నవ్వింది పదినెలల పాప.

రుక్మాబాయ్ కూతురు సంస్థలో అందరిమధ్యా తిరుగుతూవుంటుంది పాకుతూ. బొద్దుగా, బూరెబుగ్గలతో, బుగ్గలమీద పడే సొట్టలతో అందర్నీ ఆకర్షిస్తూవుంటుంది. విశాలమైన కళ్ళు, ఒత్తైన కనురెప్పలు. మొహంలో రాచరికపు ఠీవి ఉట్టిపడుతుంటుంది. ఎవరో పక్కదారి పట్టిన యువరాజైవుంటాడు దీని తండ్రి అనుకుంటుంది అరవింద.

అరవింద సంస్థ పేరు 'ఆశ్రిత' అని పెట్టారు.

ఆశ్రిత అంటే ఎప్పుడూ దుఃఖించని స్త్రీ అని అర్థం. ఆశ్రితలో ఉన్న స్త్రీలు ఎప్పుడూ బాధపడకూడదని ఆ పేరు ఎంచుకున్నారు అరవింద, రష్మి.

అనుకున్నట్లుగానే రుక్కూబాయ్‌ని అరవింద ఇంటికి తీసుకొచ్చారు. వచ్చిన రెండురోజులకే లేచి తిరుగుతూ చిన్న చిన్న పనులు చెయ్యడం మొదలుపెట్టింది రుక్కు.

కొత్త భవనంలోకి మారి, అక్కడ అవసరమైన ఏర్పాట్లు చెయ్యడానికి ఆర్నెలలు పట్టింది. లాయర్ చౌహాన్‌చేత ప్రారంభోత్సవం చేయించింది అరవింద. భట్టు వచ్చి ఆస్తివ్యవహారాలు చక్కదిద్దినప్పుడు చౌహాన్‌తో బాగా పరిచయం ఏర్పడింది అరవిందకి.

సమాజసేవకి తనవంతు సహకారం అందించడానికి చౌహాన్ ఎప్పుడూ తయారుగా ఉంటాడు. అరవింద మనస్తత్వం, తన ఆశయాలు బాగా నచ్చాయి. అందుకే అడగ్గానే వెంటనే వచ్చాడు, తన పనులన్నీ పక్కనపెట్టి.

భట్టు అరవింద పేరుమీద కొన్న భవనం చాలా బాగుంది. విశాలంగా ఇంటిముందు, వెనుక స్థలం, పెద్ద గదులు, హాళ్ళు...

"చాలా మంచిపని చేశారమ్మా అర్‌బిందాజీ! ఇటువంటివి ప్రతి రాష్ట్రంలోనూ ఏర్పాటు చెయ్యాలి మీరు. ఎందరో ఆడవారు దిక్కు లేకుండా ఉన్నారు. కొందరికైనా మీరు ఆశ్రయం కల్పిస్తే పేరు సార్థకమవుతుంది" చౌహాన్ భవనం చూడగానే అన్నారు.

"మీవంటి వారి సహకారం ఉంటే ఎందుకు చెయ్యం లాయర్‌జీ? ఇది స్వచ్ఛందంగా పని చేసే ప్రభుత్వేతర సంస్థ (ఎన్.జి.ఓ) కింద రిజిస్టర్ చెయ్యడానికి మీరు హెల్ప్ చేస్తారా?" రష్మి వెంటనే అనేసింది.ఆశ్రయ్‌లో పనిచేసి తనకెపుడు ఎవర్ని ఏమి అడగాలో క్షుణ్ణంగా తెలుసు.

"తప్పకుండా చేద్దాం. మీ సంస్థ పనులను నేను ఫ్రీగా చేస్తాను. కొంత నిలదొక్కుకున్నాక చేద్దాం. చేపట్టిన కార్యక్రమాలు, లబ్దిపొందేవాళ్ళ సంఖ్య, ఇంకేదైనా సహకార సంస్థ చేరుతుందా, ఇవన్నీ చూసుకుని చేద్దాం"

నిరాడంబరంగా ప్రారంభోత్సవం అయ్యాక అందరూ హాలు పక్కన ఉన్న అరవింద ఆఫీసు గదిలో కూర్చున్నారు.

జైలు కార్మికులు చేసిన బల్లు, కుర్చీలు, సోఫాలు, మంచాలు కొంది అరవింద. బజార్లోకంటే తక్కువ ఖరీదుకి వచ్చాయి. వాటిలో వచ్చిన లాభాలు జైల్లో ఉన్న వారి మౌలిక సదుపాయాల కోసం ఉపయోగిస్తారని విని అక్కడే తీసుకుంది.

కొంత శ్రమపడినా, అధికారుల దగ్గరికి వెళ్ళడం, అనుమతులూ... రష్మి, అరవిందా బాగానే తిరిగారు. పెద్ద పెద్ద షాపుల్లో కొన్నవాటి పనితనం లేకపోయినా బాగానే ఉన్నాయి.

"ఇలా ఉంటేనే ఈస్థటిక్ సెన్స్ ఉన్నట్లు" అడిగినవాళ్ళకీ, అడగనివాళ్ళకీ రష్మి చెప్తుంటుంది, గొగ్గులు గొగ్గులుగా, ఎత్తుపల్లాలతో ఉన్న సోఫాలనీ కుర్చీలనీ, బల్లల్నీ చూపిస్తూ.

"ఎప్పుడు రమ్మంటారు చౌహాన్‌జీ?"

రష్మిని కోపంగా చూసింది అరవింద. లేడికి లేచిందే ప్రయాణంలా చేస్తుంది. మరేం ఫరవాలేదన్నట్లు కనురెప్పలు టపటపలాడించింది రష్మి.

"సంస్థలో ఇన్‌మేట్స్ ఎంతమంది?"

కనిపించీ కనిపించకుండా నవ్వుతున్న అరవింద మొహంకేసి చూసింది రష్మి. వాళ్ళ కాంప్లెక్స్‌లో పనిచేసే ఆడవాళ్ళందర్నీ తీసుకొచ్చినా పదిమందికంటే లేరు. ఇంక ఇన్‌మేట్స్...

"అంటే ప్రస్తుతం ఒక్కరే, కాదు ఇద్దరు..." అంటూ రుక్మాబాయ్‌ని, పాపని చూపించింది రష్మి.

"ఫరవాలేదమ్మా!పెద్ద సంస్థలన్నీ హంబుల్ బిగినింగ్‌తోనే మొదలవుతాయి.ఒక ఆర్నెల్లు ఆగండి. అప్పుడు చేద్దాం" చౌహాన్ టీ తాగి బయలుదేరాడు.

కారువరకూ వెళ్ళి చౌహాన్‌ని సాగనంపారు.

అట్టహాసాలేవీ వద్దనుకుని, బాగా తెలిసినవాళ్ళని పదిమందిని మాత్రం పిలిచారు. అందరూ వెళ్ళగానే హాల్లో, ఇద్దరే.

రుక్కు వంటింట్లో శుభ్రం చేస్తోంది. పాప నిద్రపోతోంది.

నిశ్శబ్దంగా ఉన్న హాల్లో కూర్చుని చుట్టూ పరికించింది అరవింద.

"అనుకున్నది సాధిస్తానా?"

• • •

అనుకున్నదానికంటే ఎక్కువే సాధించింది అరవింద. అదీ కొద్దికాలంలోనే.

ఆశ్రిత ప్రారంభించి ఆర్నెల్లు అవకుండానే, రుక్కుద్వారా అలా అలా తెలిసి పదిమంది వచ్చి చేరారు. అందరికీ పనులు సమానంగా వచ్చేలాగ విభజించారు.

ఆవరణ, ఇంటిలోపల శుభ్రంగా ఉంచడం... వంటపని, బజారుకి వెళ్ళి సరుకులు తెచ్చి సర్దడం... అన్నీ వంతులవారీగా పంచారు.

"మరి ఆదాయం?నువ్వు ఎన్నాళ్ళు ఎంతమందిని పోషిస్తావ్?"రష్మి నిలదీసింది ఒకరోజు.

"అదే ఆలోచిస్తున్నా, తొందర్లోనే చూద్దాం" ఇప్పటివరకూ ఫరవాలేదు కానీ ఇంకా సంఖ్య పెరిగితే కష్టమే.

"మెయిడ్స్‌లాగా పంపితే పొద్దున్న వెళ్ళి సాయంత్రం వచ్చేస్తారు. వాళ్ళ తిండి వాళ్ళు సంపాదించుకుంటారు"

"వద్దు దీదీ! మనం ఎక్స్‌ప్లాయిట్ చేసినట్లుంటుంది. అఫ్‌కోర్స్ మనం అటువంటి ఏజెన్సీ కూడా ప్రారంభించవచ్చు అనుకో. చౌహాన్ సాబ్‌ని అడిగి చేద్దాం. ముందు ఏదైనా ఒక చిన్న పరిశ్రమ... డిటర్జెంట్ తయారీనో, ఫినాయిల్ చెయ్యడమో మార్కెట్ గమనించాలి. ఆ పనిమీదే ఉందాం కొన్ని రోజులు"

చుట్టుపక్కల పల్లెల నుంచి వచ్చిన ఆడవాళ్ళు అక్కడక్కడ చిన్న చిన్న పనుల్లో కుదురుకున్నా రెండుపూటలూ కడుపు నింపుకోలేకపోతున్నారు.

"వీళ్ళకేదయినా ఉపాధి కల్పించలేమా?" ఫుట్‌పాత్‌మీద వరుసగా కూర్చున్న ఆడవాళ్ళని చూసి అంది అరవింద ఒకరోజు.

"మనం అనుకున్నాం కదా, స్మాల్ స్కేల్ ఇండస్ట్రీ అని. మాకు తెలిసినవాళ్ళబ్బాయి ఎమ్.బి.ఏ స్టూడెంట్ ఉన్నాడు. వాళ్ళలో కొంతమంది మార్కెటింగ్ స్పెషలైజ్ చేస్తారుట. బర్తన్

పౌడర్లు, బాత్‌రూమ్ క్లీనర్లు... చాలామంది చేస్తున్నారట. అదీకాక, విమ్, సర్ఫ్‌వంటి పెద్ద కంపెనీల సరుకులు వేటినీ పోనియ్యవట. ఏదైనా ఫుడ్ ప్రోడక్ట్... పాపడ్‌లాంటివి చూడమన్నాడు"

"పాపడ్‌లా? లిజ్జత్ పాపడ్స్ బాగా పాపులర్ అయాయి కదా! ఐడియా, మనం వడియాలు, పొడులు, నమ్కీన్ చేద్దాం. అవి ఎన్ని ఉన్నా మనం క్వాలిటీగా చేస్తే సక్సెస్ అవుతుంది"

"చలో... రేపే మీటింగ్ పెడదాం. మన కాంప్లెక్స్‌లో కూడా పిలుద్దాం" రష్మి ఒక్క ఉదుటన లేచింది.

"ముందు ఎంత అవుతుందో, ఏమేమి చెయ్యాలో, ఒక్కొక్క ఐటమ్‌కి ఎంత సరుకు కావాలో, వర్కింగ్ కాస్ట్ తయారుచెయ్యాలి. రుక్కుని తీసుకుని రేపు బజారుకి వెళ్ళి ఖరీదులు రాసుకుని, శాంపిల్ తయారుచేసుకోవాలి. మొదట మూడు వెరైటీలు చేద్దాం.

సగ్గుబియ్యం, సాగో పాపడ్ ఇప్పుడు అందరూ చప్పగా చేస్తున్నారు. ఆంధ్రాలో చేసినట్లు టిక్కాగా చేద్దాం. మైదా కొంచెం చవక. మైదాతో ఒక వెరైటీ, బేసిన్, రైస్‌తో ఒకటీ చేద్దాం. సరుకులు లిస్ట్ రాద్దాం పద..."

• • •

"ఇవేమిటి? అవేమిటి? రెండు రకాలు పాకెట్స్ పెట్టారు?" చౌహాన్ పరిశీలనగా చూస్తూ అడిగాడు.

"సగ్గుబియ్యంలో చాలా తేడాలుంటాయి. క్వాలిటీలో తెల్లగా, పెద్దగా ఉన్నవి ఫస్ట్‌క్లాస్. అవి చాలా ఖరీదు. నాలుగో ఐదో వెరైటీలు ఉన్నాయి. చివరికి వచ్చేసరికి రంగు మారిపోవడం, సైజు చిన్నదవడం జరుగుతుంది. అవి రేటు తక్కువ. అందుకే మేము చవకవి కొన్ని, ఖరీదువి కొన్ని చేస్తున్నాం.అదేవిధంగా మైదా కూడా. రేషన్లో కాస్ట్ తక్కువ. ఇక్కడ రేషన్‌కార్డులున్న వాళ్ళు తెచ్చి ఇచ్చిన పిండితో చేసినవి అవి. మంచిషాపులో పిండికొని చేసినవి ఇవి. బేసిన్ కూడా" అరవింద వివరించబోయింది.

చెయ్యి అడ్డుపెట్టి ఆపేశాడు చౌహాన్. "ఎక్కడ, ఎలా అమ్ముతున్నారు?"

"చుట్టుపక్కల చిన్న చిన్న కొట్లలో ఇస్తున్నాం. అలాగే తెలిసినవాళ్ళ కాంప్లెక్స్‌లకి పంపిస్తున్నాం. పర్మిషన్ తీసుకుని"

బొంబాయిలో సేల్స్ అమ్మాయిల్ని చాలా అపార్ట్‌మెంట్స్‌లోకి రానియ్యరు, పర్మిషన్ ఉంటే తప్ప. రష్మికి తెలిసిన కాంప్లెక్స్‌లలో, ఆశ్రయ్‌ద్వారా పరిచయం అయినవాళ్ళకి ఇవ్వగలుగుతున్నారు.

"అమ్మినవాటికి అకౌంట్స్ అవీ ఎవరు చూస్తున్నారు?" చౌహాన్ సీరియస్‌గా అడిగాడు.

"అంత ఏమీలేదు సాబ్. రెండు నెలలేకదా అయింది. నెలకి రెండువందలు కూడా లాభం రాలేదు. అర్వింందే చూస్తోంది"

చౌహాన్ ఇద్దర్నీ సాలోచనగా చూశాడు. ఆదివారం పొద్దున్నే ఆశ్రిత నుంచి పిలుపు అందుకుని, వీలు చూసుకుని వచ్చాడు చౌహాన్. నమ్కీన్ పరిశ్రమ మొదలుపెడుతున్నాం అంటే. కొంచెంసేపు ఏదో ఆలోచిస్తూ పేపర్‌మీద ఏదో రాస్తూవుండిపోయాడు.

"వడియాలు రెండు వెరైటీలూ వేయించి తెమ్మనండి"

రుక్మాబాయ్ గబగబా వేయించి తెచ్చింది.

రెండు రకాలూ రుచి చూశాడు చౌహాన్. అలాగే కారం కాజూలూ, మురుకులూ కూడా.

"రుచిలో పెద్ద తేడాలేదు కానీ, చూడ్డానికి ఖరీదువి చాలా బాగున్నాయి. కాస్ట్ వర్కవుట్ చెయ్యడానికి, అకౌంట్స్ రాయడానికి ఒక మనిషిని పెట్టుకోండి. డబ్బు అవుతుందని ఆలోచించ వద్దు. ఏ హోల్‌సేల్‌లో ఏ సరుకు దొరుకుతుందో, ఎక్కడ డిమాండ్ ఉందో వంటి పనులు కూడా చేయించుకోవచ్చు. అలాగే పెద్దషాపుల్లో మార్కెటింగ్ చెయ్యండి, మార్జిన్ తక్కువైనా సరే.

ఇంకొక విషయం, రెండు రకాలు చెయ్యద్దు. ఒకటే నంబర్‌వన్ క్వాలిటీ చెయ్యండి. దాంతోనే పేరు వస్తుంది. మొదట్లో లాభం రాకపోయినా, నెమ్మదిగా అందుకుంటుంది"

"అలాగే చౌహాన్ సాబ్. మీ సలహా పాటిస్తాం"

"నాకు తెలిసున్న చాకులాంటి కుర్రాడున్నాడు. పంపిస్తాను చూడండి. మీకు లాభాలు వచ్చేవరకూ అతన్ని నేను స్పాన్సర్ చేస్తాను"

అరవింద, రష్మి సంభ్రమంగా చూస్తుండగా చౌహాన్ లేచి భవనం బయటికి వచ్చాడు.

"తోట చాలా బాగుందే, పూలమొక్కలు కొద్దిగా వేసి, కాయగూరలు, ఆకుకూరలు పండించండి" మాట్లాడుతూనే కారెక్కి వెళ్ళిపోయాడు, చెయ్యి ఊపుతూ.

● ● ●

రెండు సంవత్సరాలు గడిచాయి.

మధ్యలో అరవింద రెండు నెలలు ఊరికి వెళ్ళివచ్చింది, పంటలు చూసుకుని, ఆదాయం తెచ్చుకోవడానికి.

భట్ వచ్చి ఒక నెల ఉన్నాడు. అరవింద చేస్తున్న పనికి చాలా సంతోషించాడు.

"నేను నేరం చేసినవాళ్ళని కాపాడుతుంటే నువ్వు దానికి బలైపోతున్నవాళ్ళని రక్షిస్తున్నా వన్నమాట" నవ్వేశాడు, అరవింద ఆశ్చర్యంగా చూస్తుండగా.

"బలైపోవడం ఏమిటి?"

"అదే రేప్ విక్టిమ్స్, అత్తల, మొగుళ్ళ ఆరళ్ళు పడినవాళ్ళు, డౌరీ డెత్‌లు తప్పించుకున్న వాళ్ళూ, మోసపోయినవాళ్ళు... వీళ్ళేకదా?"

"మరి మీరు తెలిసి ఎందుకు నేరస్థుల తరపున వాదిస్తారు?"

"అదో థ్రిల్, నేను కాకపోతే ఇంకొకరు వాదిస్తారు" ఏదయితేనేం, ఏ వాదన చేస్తేనేం, ఆశ్రితకి సంవత్సరానికి పదివేల పౌండ్లు పంపుతానని మొదటి చెక్ ఇచ్చాడు.

ఆశ్రితలో ఇప్పుడు ఇరవైమంది ఆశ్రయం పొందుతున్నారు.

బయటినుంచి వచ్చి పనిచేసేవాళ్ళు ఇంకొక ఇరవైమంది. వీళ్ళుకాక, సరుకులు ఇంటికి తీసుకెళ్ళి చేసి తెచ్చేవాళ్ళు ఇంకో ఇరవైమంది. లాభాలు రావడం మొదలుపెట్టాయి. అకౌంటెంట్ కార్తీక్‌కి జీతం. "ఆశ్రిత నమ్‌కీన్" పరిశ్రమ నుంచి అరవింద ఇవ్వగలుగుతోంది.

అనుకోని ఇబ్బందులు ప్రతి పరిశ్రమలోనూ తప్పవు. ఎన్నో ఒడిదుడుకుల్ని ఎదుర్కోవాలి. అనుభవం లేక అరవింద, రష్మి కూడా కొంత నష్టాన్ని భరించవలసివచ్చింది.

ఒకరోజు పదికిలోల వడియాలపిండి, ముప్పైమంది కలిసి పై డాబామీద, పెరట్లో... ఎక్కడ ఎండ ఉంటే అక్కడ ఎండబెట్టారు. పెట్టిన రెండు గంటలకి, శరవేగంతో మబ్బులు వచ్చి కమ్మేసి, కుంభవృష్టి కురిసింది. పరుగెత్తుకుంటూ వెళ్ళి తడిసిపోతూ, ఎలాగో తీసుకొచ్చినా, వడియాలు అన్నీ ఏకం అయిపోయి పిండి ముద్దై కూచుంది. ఆ పట్టిన వాన వారంరోజులవరకూ తెరిపి లేదు. వడియాలముద్ద అంతా బూజుపట్టి పడెయ్యవలసివచ్చింది. అప్పట్లో కోల్డ్ స్టోరేజ్‌లు అవీలేవు. ఇంక వేరేవిధంగా ఆరపెట్టే ఉపాయం ఉందా అని వెదికారు.

లిజ్జత్ పాపడ్ వాళ్ళు అయితే నులకమంచాలకింద హీటర్లు పెట్టి ఎండపెడతారు. వడియాల ముద్దకి అది పనికిరాదు. ఉడికిపోతాయి. అప్పట్నుంచీ వానాకాలం వడియాలు పెట్టకుండా జాగ్రత్తపడ్డారు. ఎండలు ఉన్నప్పుడే స్టాక్ తయారుచెయ్యడం నేర్చుకున్నారు. అవి సంవత్సరం వరకూ ఉంటాయి కనుక బాధ లేదు.

హోల్‌సేల్‌లో పప్పులు తెచ్చి ఆడించుకోవడం, స్వచ్ఛందసేవాసంస్థ కింద ప్రభుత్వం దగ్గర్నుంచి రాయితీ తీసుకుని మైదా గోడౌన్లలో నుంచి తేవడం, 80జి కింద ఆదాయపుపన్ను రాయితీ... ఇవన్నీ కార్తీక్ సహాయంతో చేసేశారు. పెద్ద దుకాణాల్లో, సూపర్ మార్కెట్లలో అమ్మకాలు పెరిగాయి. ధర కూడా అడిగినంతే ఇస్తున్నారు. లాభాలన్నీ సేవా కార్యక్రమాలకే అంటే మరింత సహృదయతతో స్పందించారు వ్యాపారస్థులు.

అంతా బాగా జరుగుతోందని అనుకుంటున్న సమయంలో జరిగిందిదది. సూపర్ మార్కెట్లలో, అన్ని షాపుల్లో... ఇచ్చిన వెంటనే సరుకులు అయిపోతున్నాయి. బాగానే ఉందిలే అనుకుని ఉత్పత్తి పెంచారు. అయినాసరే, తీసుకుని వెళ్ళి ఇచ్చిన వెంటనే సరుకు మాయం. షాపులవాళ్ళు ముందు నవ్వుతూ ఫోన్లు చేసేవారు.

వారంరోజులు అలా నడిచింది. మూడులక్షల రూపాయలపైన సరుకు వెళ్ళింది.

వారం తరువాత...

ఎక్కడ చూసినా ఆశ్రిత ప్యాకెట్లు చెత్తడబ్బాల్లో, సందుల్లో, ఫుట్‌పాత్‌లమీద... అదీ నిండుగా సరుకులతో, ఎవరైనా తీసి చూడబోతే...

"ఏ మాల్ అచ్చా నయి హై, బహుత్ ఖరాబ్ గందా మాల్. టేస్ట్ భీ నయీ, ఖానే కే బాద్ పేట్ మే బహుత్ గడ్‌బిడ్" అంటూ అన్ని భాషల్లో అక్కడున్న కొంతమంది వ్యాఖ్యలు.

ఇదంతా అరవిందావాళ్ళకి తెలిసేసరికి పదిహేనురోజులు పట్టింది.

అప్పటికి జరుగవలసిన అనర్థం జరిగిపోయింది. ఆ తరువాత పంపిన సరుకులు అలాగే ఉండిపోయాయి. ఎవరూ కొనడంలేదు.

ఏం చెయ్యాలి? ఇంత కష్టపడి వదులుకోవడమేనా? ఇదంతా ఎవరు చేస్తున్నారు?

అరవింద తన ఆఫీసుగదిలో అలా కూర్చుండిపోయింది. అక్కడే తనకి ఒక దివాన్, దానిమీద పరుపు ఏర్పాటుచేసుకుంది. మరీ ఆలస్యమయితే తన ఫ్లాట్‌కి వెళ్ళకుండా అక్కడే ఉండిపోతుంది. అప్పటికి మూడురోజులయింది ఇంటికి వెళ్ళి.

రష్మి రోజూ పొద్దున్న పదింటికి వచ్చి సాయంత్రం ఆరింటివరకూ ఉంటుంది.

లాభాలు వస్తున్నప్పట్నుంచీ తనకి కూడా అందులో కొంత వాటా ఇస్తోంది అరవింద, వద్దన్నా కూడా. దారి ఖర్చులకైనా కావాలికదా అని.

"ఏం చెయ్యాలి దీదీ?" అప్పుడే వచ్చిన రష్మికేసి చూసింది. నిద్రలేమిచే కళ్ళు ఎర్రగా ఉన్నాయి. కళ్ళనిండుగా నీళ్ళు. వారంరోజుల్లోనే చిక్కి సగమయింది.

రష్మి సాలోచనగా చూసింది.

• • •

"ఎప్పుడు జరిగింది?" చౌహాన్ కళ్ళజోడులోంచి చూస్తూ అడిగాడు.

అరవింద, రష్మి, కార్తీక్, చౌహాన్ ఆఫీసులో, అతని ఎదురుగా ఉన్న కుర్చీల్లో కూర్చున్నారు. అరవింద బాధ చూసిన రష్మి, ఏం చెయ్యాలో తోచక అక్కడికి తీసుకెళ్ళింది.

"రెండు నెలలవుతోంది సాబ్!" రష్మి సమాధానమిచ్చింది.

"మరి ఇంతవరకూ నాకెందుకు చెప్పలేదు?"

"ఏమవుతుందో మేము తెలుసుకునేసరికే ఒక నెల అయింది. ఆ తరువాత ఎందుకు ఇలా జరిగిందో, మామీద ఎవరికైనా కోపమా, ఇవన్నీ ఆలోచిస్తున్నాము. అంటే మేము ఆశ్రయమిచ్చిన ఆడవాళ్ళ బంధువులో, శత్రువులో... ఎవరా అని. అందర్నీ అడిగాము. ఎవరో కనిపెట్టలేకపోయాము. ఎవరికీ ఎటువంటి బెదిరింపులూ ఎప్పుడూ రాలేదు మరి. చివరికి మీవద్దకి వచ్చాం"

చౌహాన్ పేపర్ వెయిట్ తిప్పుతూ ఉండిపోయాడు, ఆలోచిస్తూ.

"మీరు ఈ బిజినెస్ మొదలుపెట్టాక ఎవరైనా చందాలకోసం వచ్చారా?"

రాలేదన్నట్లు తల అడ్డంగా తిప్పారు ముగ్గురూ.

"ఇది తప్పకుండా మీ బిజినెస్‌ని అణగదొక్కడానికి చేసిన పనే. ఒకటి వ్యక్తిగత కక్ష. అది ఎవరూ లేరని మీరు చెప్తున్నారు. ఇంకొకటి సాటి బిజినెస్‌వాళ్ళు. లిజ్జత్‌వంటి పెద్ద కంపెనీల వాళ్ళు పట్టించుకోరు. చిన్న చిన్న స్వగృహావాళ్ళు చెయ్యడానికి అవకాశాలు ఉన్నాయి. కానీ దానికి అంత టైము, డబ్బు వాళ్ళు ఖర్చుపెడతారని నేను అనుకోను"

"మరి ఇంకెవరున్నారు?"

"మనం మాఫియా గురించి మర్చిపోయాం. పొలిటికల్ పార్టీస్ చందాలు అడుగుతారు, బెదిరిస్తారు కాని ఇటువంటి టాక్టిక్స్ ఉపయోగించరు. తప్పకుండా మాఫియా పనే అయుంటుంది. వాళ్ళకి నెల నెలా డబ్బు పడెయ్యాలి. మీకు గవర్నమెంట్ టాక్స్ ఎగ్జంప్షన్ ఇచ్చిందేమో కానీ, వీళ్ళు ఇవ్వరు. అది నిరాశ్రయులకోసం చేస్తున్నదేనా సరే, వీళ్ళ మామూలు వీళ్ళకి ఇవ్వవలసిందే. అందులో బొంబాయ్‌లో పాంలల్ గవర్నమెంట్ నడుస్తోంది.

"మరి ఏమి చెయ్యాలి?" అరవింద అడిగింది. గొంతు నీరసంగా నూతిలోంచి మాట్లాడు తున్నట్లుగా ఉంది.

"అదే ఆలోచిస్తున్నా. మళ్ళీ ఒక బ్యాచ్ సప్లై చేసి, ఎవరు కొంటున్నారో చూసి, వాళ్ళద్వారా కనిపెట్టాలి. నాకు తెలిసిన డిటెక్టివ్ ఏజెన్సీ ఉంది. వాళ్ళని అడుగుదాం. కార్తీక్! రేపు పది గంట లకి ఒకసారి ఆఫీసుకి రా. మీరు ఈలోగా సరుకు తయారుచెయ్యండి"

"సరుకు నాలుగైదు షాపులకి పంపేంత ఉంది. మీరు ఎప్పుడు ఇమ్మంటే అప్పుడిస్తాం"

"డిటెక్టివ్ ఏజెన్సీ చెప్పినరోజుకి సరుకు ఇవ్వండి. రేపు కబురుచేస్తాను. మీరు ఎన్ని సంవత్స రాలయింది ఆశ్రిత పెట్టి?" చౌహాన్ కాగితం తీశాడు వివరాలు రాయడానికి.

"రెండు సంవత్సరాలు దాటింది. ఈ సంవత్సరం మిమ్మల్నీ, మా సంస్థమీద ఆసక్తి ఉన్న కొందర్నీ పిలిచి వార్షికోత్సవం చేద్దామనుకుంటున్నాము" అరవింద విచారంగా అంది.

"అంత నిరాశ వద్దమ్మా! ఏదో చేద్దాం. ఇదీ మంచికే వచ్చింది. అప్పుడెప్పుడో రష్మి బెన్ అడిగిన పని ఇప్పుడు చేసేద్దాం"

"అంటే, రిజిస్ట్రేషనా?"

"అదేంకాదు, ఇంకా ఎక్స్‌పాండ్ చేద్దాం, మీకిష్టమైతే. ఇంకొకచోట బ్రాంచ్ పెట్టడం, ఫుడ్ ప్రోడక్ట్స్ మాత్రమేకాక వేరేవి తయారుచెయ్యడంలాంటివి.

ఇప్పుడు ఇన్‌మేట్స్ ఎంతమంది ఉన్నారు?" నవ్వుతూ అడిగాడు చౌహాన్, మొదటిరోజు రష్మి చెప్పిన ఒక ఇన్‌మేట్ గురించి గుర్తుతెచ్చుకుని.

అంతసేపటికి అరవింద మొహంలో కూడా నవ్వు కనిపించింది.

"ముప్పైమంది ఉన్నారు. ఇల్లు సరిపోవట్లేదు. ఈ బిజినెస్‌లో ఇంకొంచెం లాభం వస్తే అద్దెకి ఇంకొకటి తీసుకుందామనుకున్నాము. మా కాలనీలోనే ఉన్నాయి కొన్ని ఖాళీగా"

"బయటి వర్కర్స్?"

"వాళ్ళు నలభైవరకూ ఉంటారు. నంబర్ మారుతుంటుంది"

"అందులో చదువుకున్నవాళ్ళు, వేరే పనులు... టైలరింగ్ వంటివి వచ్చినవాళ్ళున్నారా?" చౌహాన్ పాయింట్లన్నీ రాసుకుంటున్నాడు.

"ఉన్నారు. మమ్మల్ని అడుగుతుంటారు కూడా. ముగ్గురు ఫినాయిల్ చెయ్యడం నేర్చు కున్నారట. కొందరు డిటర్జెంట్స్, టైలరింగ్ వచ్చినవాళ్ళు... చెప్పాలంటే దర్జీ కుటుంబం నుంచి వచ్చినవాళ్ళు నలుగురు ఉన్నారు. మాకు అవన్నీ మొదలుపెట్టే వసతి లేక ఊరుకున్నాం"

"అయితే మనం ఆశ్రితని చిన్న చిన్న సంస్థలకింద విభజిద్దాం. ఆహారపదార్థాలకి, టైలరింగ్‌కి, మొదట మీవరకు అవసరమైన ఫినాయిల్, డిటర్జంట్ తయారీకి.... అలా. అన్నింటికీ పేర్లుపెట్టి కోపరేటివ్ సొసైటీకింద రిజిస్టర్ చేద్దాం. ఎవరెవర్ని మెంబర్స్‌కింద చేర్చుకుంటారో చూడండి. దానివల్ల చాలా లాభాలున్నాయి. రిజిస్టర్ చేస్తే, రిజిస్ట్రార్ ఆఫ్ కోపరేటివ్ సొసైటీస్ యాక్ట్ కిందికి వస్తుంది. దానివలన కొన్ని లాభాలున్నాయి. ముఖ్యంగా మాఫియావాళ్ళు వదిలేస్తారు. సాధారణంగా కొందరు పలుకుబడి ఉన్నవాళ్ళని చేర్చుకుంటే, ప్రపంచవ్యాప్తంగా అమ్మకాలు చెయ్యొచ్చు"

"ఎంతమంది ఉండాలి అందులో?" రష్మి అడిగింది. ఆశ్రిత, అరవింద కలల సాకారం. ఇప్పుడు వేరేవాళ్ళని పిలిచి పెట్టుకుంటే పెత్తనం వాళ్ళకిందికి వెళ్ళిపోతే.

"ఎందరైనా ఉండచ్చు. మొదట్లో ముగ్గుర్ని పెట్టుకోండి. అరవిందబెన్ లైఫ్‌లాంగ్ ఛైర్మన్‌గా ఉండచ్చు. ఒక సెక్రటరీ, ప్రెసిడెంట్... ప్రస్తుతానికి"

"మరి ఎన్.జి.ఓ.గా కూడా రిజిస్టర్ చేద్దామన్నారు కదా, ఇందులో బిజినెస్‌కంటే ముందు సేవాకార్యక్రమాలు ప్రధానమైనవి. అదికూడా చూడండి భాయ్‌సాబ్"

"అవునమ్మా! అసలు మీ ఆశ్రిత నిజమైన ఎన్.జి.ఓ.తప్పకుండా చేద్దాం. ఇంటర్నేషనల్‌గా రిజిష్టర్ చేస్తే ఇతర దేశాలనుంచి కూడా ఫండ్స్ తెప్పించుకోవచ్చు" చౌహాన్ కుర్చీని గిరుక్కున వెనక్కితిప్పి పుస్తకాల ర్యాక్ దగ్గరికి వెళ్ళాడు. అక్కడ్నుంచి పెద్ద బౌండ్ పుస్తకం తీసి చూడసాగాడు.

"ఇది మీకు బాగా వర్తిస్తుందని ఎందుకన్నానంటే ఈ ఐ.ఎన్.జి.ఓ అనేది స్థాపించబడిందే బానిసత్వాన్నీ, స్త్రీ అణచివేతనీ అరికట్టడానికి. దీని చరిత్ర 1839 ఏ.డి. వరకూ వెళ్తుంది. 1914 వచ్చేటప్పటికి 1083 సంస్థలు ఏర్పడ్డాయి.

ప్రస్తుతం ఉన్న ఈ పేరు ఐక్యరాజ్యసమితి ఏర్పడినప్పుడు 1945లో పెట్టారు. వాటి వివరాల జోలికి వెళ్ళనుకానీ ఒక్కటిమాత్రం చెప్పాలి. ఇకొసాక్ (ఇకనామికల్ సోషియో కౌన్సిల్) సంస్థలో మొదటిసారిగా దీనికి నిర్వచనం ఇచ్చారు.

వీటిలో దానదృక్పథం, సేవాదృక్పథం, అనుబంధసంస్థలుగా ఒక వర్గానికి లేదా ఒక దేశానికి, ప్రపంచానికి సంబంధించినవిగా విభాగాలున్నాయి.

'ఆశ్రిత' వనితలకి సంబంధించిన సేవాదృక్పథం ఉన్న సంస్థకింద వస్తుంది. ఆ విధంగా చేద్దాం. ఏమంటారు అర్వీందాబెన్?" చెప్పడం ఆపేసి అరవిందని చూశాడు చౌహాన్.

"మీరు ఎలా చెప్తే అలాగే భాయ్‌సాబ్! మెంబర్స్‌ని కూడా మీరే సూచించండి""

"మీరు ఛైర్మన్, రష్మిబెన్ సెక్రెటరీ. ఇంకా సిటీలో ప్రముఖ సోషల్‌వర్కర్స్‌ని కలిసి అడుగుదాం. అందరూ స్త్రీలే ఉండాలి. నేను ఎలాగా న్యాయసలహాదారుగా ఉంటాను. మీరు కూడా మీకు పరిచయం ఉన్నవాళ్ళని అడిగి చూడండి. కనీసం ఐదుగురు ఉంటే, వారి వారి పరిచయాలని ఉపయోగించుకోవచ్చు. ఇక నుంచీ ఆ పనిమీదే ఉందాం"

• • •

ఆశ్రిత గురించి ఆ నోటా ఆ నోటా చాలామందికి తెలిసింది. ఆ సంగతి అరవిందకి మాత్రం ఒక జడ్జీగారి భార్యని కలవడానికి వెళ్ళినప్పుడు తెలిసింది.

రష్మి అంత ఆశ్చర్యపోలేదు. ఒక్కోసారి మాట మనసంత వేగంగా ప్రయాణిస్తుందని తెల్సు. అందులో ప్రముఖ లాయర్ చౌహాన్ ఆసక్తి చూపిస్తున్నారంటే బొంబాయిలోని పెద్దవాళ్ళ క్లబ్బుల్లో తెలియకుండా ఉంటుందా?

జడ్జీగారి భార్య అనిత, ప్రముఖ న్యాయవాది కోమల్ సిన్హా, నానావతి హాస్పిటల్‌లో గైనకాలజిస్ట్ ప్రశాంతి వర్మ వెంటనే స్పందించారు ఆశ్రిత కమిటీ సభ్యులుగా ఉండడానికి.

చౌహాన్ చొరవవలన కావలసిన లాంఛనాలన్నీ ఆరునెలలలోనే ముగిశాయి.

"ఇవేళ మనం పండుగ చేసుకోవలసిందే" రష్మి ఆనందంగా అనౌన్స్ చేసింది. ఆ రోజే ఆశ్రిత ఎన్.జి.ఓ అయినట్లు చౌహాన్ ఫోన్‌చేసి చెప్పారు.

"నీ కల ఇన్ని రోజులకి నిజమయింది దీదీ! తప్పక చేసుకోవాలి. రుక్మా! ఈరోజు మిఠాయి చెయ్యండి" అరవింద కూడా హుషారుగానే ఉంది, బాధ్యత పెరిగిందని భయంగా ఉన్నా.

"ఇవిగోనమ్మా ఈ కాగితాలు ఫైల్ చెయ్యండి. కార్తీక్ రాలేదా? ఎలా చేస్తున్నాడు? నో ప్రాబ్లం కదా!" అప్పుడే చౌహాన్ లోపలికి వస్తూ అన్నాడు.

"బాగా చేస్తున్నాడు కానీ ఎక్కువరోజులు ఉంటాడనుకోను. వేరేచోట ప్రయత్నం చేస్తున్నాడు. ఎక్కువ జీతానికి"

"వద్దమ్మా! వెళ్ళనియ్యకండి. ఎన్.జి.ఓ.లో అందరూ వాలంటీర్లే ఉండనక్కర్లేదు. కొందరు ఎంప్లాయీస్ కూడా ఉంటారు. అన్నట్లు, ఈ డిటెక్టివ్ ఏజెన్సీ మన సరుకులు పాడుచేసినవాళ్ళని పట్టుకుంది. వాళ్ళే మాట్లాడి సెటిల్ చేసేశారు. మీరు యాడ్‌కి ఇంతవరకూ ఖర్చుపెట్టలేదు కదా, అదే అనుకుని వాళ్ళకి కొంత ఇచ్చెయ్యాలి. నెలకి ఐదువేలు"

"అంతా, ఎన్.జి.ఓ. అయితే వాళ్ళు మన జోలికి రారన్నారు"

"అందుకే రష్మిబెన్ అంత తక్కువ. లేదంటే లాభాల్లో వాటా ఇమ్మంటారు. మనం ఎక్స్‌పాండ్ చెయ్యాలనుకున్నాం కదా, దాని గురించి కూడా సర్వే చేయించాను. మొదట్లో చిన్న స్కేల్‌లో చేద్దాం. ఇదిగో, చదువు కార్తీక్" అప్పుడే వస్తున్న కార్తీక్‌కి లిస్ట్ ఇచ్చాడు చౌహాన్.

అరవింద ఒక్క నిముషం కళ్ళు మూసుకుని ఆలోచించింది, మరీ ఎక్కువగా తన పరిధి దాటి వెళ్ళిపోతోందేమో, తనేం చెయ్యాలనుకుంది? మోసగింపబడ్డ ఆడవాళ్ళని చేరదీసి వాళ్ళకి జీవితం మీద ఆశా, ఒక ధ్యేయం ఏర్పరుద్దామనుకుంది.

ఇప్పుడు అందులో వ్యాపారం. దానివల్ల కలిగే లాభనష్టాలూ, చికాకులూ... ఇవన్నీ అవసరమా? నిభాయించుకోగలదా? వీటన్నింటికీ డబ్బు...

"అర్విందా? ఎక్కడికెళ్ళిపోయావు? లండన్‌కా?" రష్మి కుదిపిలేపుతుంటే చూసి తన మామూలు చిరునవ్వు నవ్వింది.

చౌహాన్ ఆలోచిస్తున్నట్లుగా చూశాడు.

కార్తీక్ చదవడం మొదలుపెట్టాడు.

"టైలరింగ్ - ఇందులో ముందర ట్రైనింగ్ ఉంటుంది. రోటరీ క్లబ్ వాళ్ళు పది కుట్టుమిషన్లు ఇస్తామన్నారు. పేరు పొందిన డిజైనర్ షీలా డిసోజా తనదగ్గర పనిచేసేవాళ్ళని రోజుకి ఒక గంట క్లాసెస్ తీసుకోవడానికి పంపిస్తానన్నారు. పాలీ ప్రొపిలీన్ ఫ్యాక్టరీ-

మనం మోల్డింగ్ చేసి, సంచీలు చెయ్యొచ్చు, లేదా షీట్స్ కొని సంచీలు చేసుకోవచ్చు. రెండింటికీ కొటేషన్స్ ఉన్నాయి. దీనికి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బార్ అసోసియేషన్ మెంబర్స్ ఇస్తామన్నారు, మన సరుకులకి మాత్రమే తయారుచేసేలాగ. అంటే ఇన్‌హౌస్ మాన్యుఫాక్చరింగ్ అన్నమాట. నమ్కీన్స్ సరే. ఇంకా వెరైటీలు పెంచచ్చు. ఇది ఆశ్రితా చూసుకోగలదు.

మనమే ఒక చిన్న ఫ్లోర్‌మిల్ పెట్టుకుంటే వర్కింగ్‌కాస్ట్ తగ్గుతుంది. లోనావాలా దగ్గర్లో టూ ఏకర్స్ ల్యాండ్ రెడీగా ఉంది. అది కొనగలిగితే చాలా పనులు చెయ్యొచ్చు. దీనికి భట్ కావలసిన మనీ ఇస్తామన్నారు, లండన్‌లో అతని కాంటాక్ట్స్ ఉపయోగించి"

ఇది వింటూనే అరవింద లేచి నిల్చుంది. ఇంతింతై వటుడింతైలాగా... సాధ్యమా! కళ్ళలోంచి నీళ్ళు ధారగా కారిపోతున్నాయి. "ఇదంతా చెయ్యగలమా?"

"కమాన్ అర్విందా! ఇప్పుడు నువ్వు అర్జున విషాదం చూపించకు" రష్మి హెచ్చరించింది.

• • •

నాలుగు సంవత్సరాలలో ఆశ్రిత అనూహ్యంగా ఎదిగిపోయింది.

మొదట్లో తటపటాయించినా అరవింద విజృంభించి పనిచేసింది.

"జిహ్వ" (నమ్కీన్స్), "శుభం" (టైలరింగ్), "అన్నపూర్ణ" (ఫ్లోర్‌మిల్స్), "వాగ్దేవి" పిల్లలకి, పెద్దలకీ కూడా పాఠశాలలు.

బహుముఖాలుగా విస్తరించింది ఆశ్రిత. అన్ని పేర్లకీ ముందు ఆశ్రిత ఉంటుంది.

పాలిథీన్ సంచీల పరిశ్రమ మాత్రం ప్రారంభించిన ఏడాదికే మూతపడింది. ముంబయి (అప్పటికే బోంబే పేరు మారిపోయింది) చుట్టుపక్కల పుట్టగొడుగుల్లా వెలిసిన ఫ్యాక్టరీల పోటీకి తట్టుకోవడం కష్టమయింది. అదీకాక, సంచీలు కొని, ఆశ్రిత ప్రోడక్ట్ ప్రింట్ వేయిస్తే చవకపడింది. ఆ ఫ్యాక్టరీని వాగ్దేవి వయోజన విద్యాకేంద్రం కింద మార్చారు.

అనుకున్నట్లుగానే లోనావాలా దగ్గర రెండెకరాలు కొన్నారు, పూర్తిగా భట్టు పంపించిన డబ్బుతో. అక్కడ భవనాలు కట్టడానికి కూడా అనిత, ప్రశాంతి, మిగిలిన కమిటీ మెంబర్స్ అందరూ వారి వారి పరిచయాల ద్వారా స్పాన్సరర్స్‌ని తీసుకొచ్చారు.

సంస్థ పెద్దదయినకొద్దీ పాలిటిక్స్ కూడా తప్పదు. అందరూ సమాజంలో పేరుపొందిన వాళ్ళు. పెద్దమనుషులు. లక్షలు లక్షలు విరాళాలు ఇచ్చినవాళ్ళు, తీసుకొచ్చినవాళ్ళు. ఒక పథకం అమలుచెయ్యాలంటే కనీసం ఆర్నెల్లు కసరత్తు చెయ్యాల్సివచ్చేది.

అరవింద, రష్మి మాత్రం ఒకే మాటమీద ఉండేవాళ్ళు.

ఎవరిదగ్గర వాళ్ళ ఆలోచనలు కనిపెట్టి, వారికి అనుకూలంగా మాట్లాడి పనులు చక్క బెట్టేది రష్మి. తనకి ఐదారు భాషల్లో ఉన్న ప్రావీణ్యం బాగా ఉపయోగపడింది.

ప్రతీ సంవత్సరం అరవింద ఐదారు నెలలు ముంబాయి నుంచి వెళ్ళిపోయేది. రష్మి దానికి ప్రోత్సహించి సంస్థ పనంతా తనే చేసుకునేది. ఫోన్లు ఉండనే ఉన్నాయి అవసరమైతే.

భట్టు ప్రతి డిశంబరులోనూ వస్తున్నాడు. వచ్చినప్పుడు ధారాళంగా విరాళం తెస్తాడు.

ఆ రోజు ఆశ్రిత పదిహేనవ వార్షికోత్సవం.

"ఎంత మంచి భర్త దొరికాడు అరవిందా నీకు. నిన్ను ఇంతగా ప్రోత్సహించేవాడు దొరకడం నీ అదృష్టం, కాదంటావా? మీ దంపతులవల్ల ఎంతమంది ఆడవాళ్ళు, వారి పిల్లలు జీవితాల్ని చక్కదిద్దుకుంటున్నారు?" రష్మి కమిటీ మీటింగులో అంది.

"అవును. నేను ఈ విధంగా సేవాకార్యక్రమాలు ప్రారంభించడానికి, కొనసాగించడానికి ఒక్కరితో మొదలైన ఆశ్రిత ఈనాడు వందమందికి పైగా ఆశ్రయం, మూడు వందలకి పైగా ఉపాధి కల్పించడానికి శ్రీ భట్ ముఖ్యకారణం. ఎంతో పెద్ద మనసుతో వారి ఆస్తి అంతా ఈ విధంగా ఉపయోగించడానికి అభ్యంతరపెట్టకపోగా మొత్తం నా పేరుమీదికి మార్చేశారు"

అరవింద మాటలకి అందరూ చప్పట్లుకొట్టారు.

చౌహాన్ అవునన్నట్లు తలూపారు. నాగపూర్‌లో ఒక దాత స్థలం ఇస్తామన్నారు ఆశ్రిత స్థాపించడానికి. ఆ సంవత్సరం జమా ఖర్చులన్నీ కార్తీక్ అందరికీ చూపించాడు.

కార్తీక్ ఇప్పుడు ఫైనాన్స్ డైరెక్టర్. ఆశ్రితతో అనుబంధం బాగా పెంచుకున్నాడు. ఎక్కువ జీతం ఇస్తామని కార్పొరేట్ కంపెనీల్లో పిలిచినా వెళ్ళలేదు. అయినా, ఎప్పటికప్పుడు మార్కెట్

పరిస్థితి చూసి అరవింద అతని జీతం పెంచుతూనేవుంది. హైదరాబాద్‌లో కూడా ప్రారంభిద్దామని అరవింద సూచించింది. నాగార్జునసాగర్ రోడ్‌లో ఎప్పుడో భట్టు కొన్న పదిహేనెకరాల స్థలం సంస్థకి ఇస్తానని అంది. అందరూ అనుకూలంగా స్పందించి, వీలైనంతవరకూ సహాయపడతామన్నారు. మీటింగ్ అయిపోయి అందరూ వెళ్ళిపోయారు.

రష్మి, కార్తిక్ కూడా ఫైల్స్ పట్టుకుని వెళ్ళారు, మళ్ళీ ఒకసారి అన్ని విషయాలూ కూలంకషంగా చూసి అవసరమైన పత్రాలు తయారుచెయ్యడానికి.

అరవింద ఒక్కతే అలా కూర్చుండిపోయింది.

ఏదో వెలితి... తనలో తనకి తెలియకుండానే ఏదో అసంతృప్తి.

'నా అనే, అనుకునే పిల్లలు లేరనా?' తనలో తనే విశ్లేషించుకోసాగింది.

పిల్లలు ఉండీ రకరకాల కారణాలవల్ల తమ సంస్థలో చేరిన స్త్రీలు చాలామందే ఉన్నారు. భర్త అకాలమరణం చెందితే, శక్తి అంతా ధారపోసి పెంచిన రంగమ్మని, కొడుకు పెళ్ళవగానే చింకిపాతలా విసిరెయ్యడం వింది.

నిండా యాభై ఏళ్ళు లేని రంగమ్మ చక్కిలాలు చుట్టడంలో దిట్ట. చులాగ్గా రోజుకి రెండు మూడొందలు చుట్టేస్తుంది. ఆమె చేసే ప్రత్యేకమైన కూరపొడి కూడా చాలా ప్రసిద్ధి చెందింది. అలాగే, ఎంతోమంది పిల్లలచేత వెలివేయబడ్డవాళ్ళు...

వారందరి కన్నీటి కథలు విని, కొన్ని స్వయంగా చూసి కూడా ఇంకా తనకి పిల్లలు లేరని బాధ ఎందుకు. అసలు తను ఏమి కోల్పోయింది? ఏమి సాధించింది?

చిన్ని... రుక్కు కూతురు. 'మాజీ' అంటూ పుట్టినప్పట్నుంచీ తన ఒళ్ళోనే పెరిగింది. పెరుగుతోంది.

రష్మి కూతురు పింకీ. ఇప్పటికీ కాలేజీలో చదువుతున్నా, ఇంట్లో ఉన్నంతసేపూ ఒక్కక్షణం కూడా వదలదు. ఇంకా తన ఇంట్లోనే ఉంటుంది.

ఆశ్రితలో ఉంటున్న స్త్రీలు అందరూ మాజీ అంటూ ఎంతో గౌరవం ఇస్తున్నారు.

శాఖోపశాఖలుగా విస్తరిస్తున్న ఆశ్రితని చూసి ఎంతో ఆనందించాలి. కానీ అప్పుడప్పుడు ఈ నిర్వేదం వదలట్లేదు. ఎందరు ఉన్నా మానసికంగా ఈ ఒంటరితనం పట్టి పీడిస్తోంది. తల పగిలిపోతున్నట్లు అనిపిస్తోంది. తలపట్టుకుని బల్లమీదికి ఒరిగి కళ్ళుమూసుకుంది.

"మాజీ!" చిన్ని... చేతిలో కాఫీకప్పు పట్టుకుని, "తల నొప్పిగా ఉందా? కాఫీ తీసుకోండి. ఇప్పుడే వస్తా" కప్పు బల్లమీద పెట్టి తుర్రున పరుగెత్తింది.

వేడి కాఫీ... అరవింద నోటిదగ్గర పెట్టి చప్పరించింది. స్ట్రాంగ్‌గా, కొద్దిగా చక్కెరవేసి అచ్చు తనకి కావలసినవిధంగా. ఒక్కో చుక్కా గొంతులోకి దిగుతుంటే ఏదో ఉత్తేజం చేరుతోంది మనసులో, శరీరంలో. కాఫీ పూర్తయ్యే సమయానికి చిన్ని వచ్చింది, చేతిలో అమృతాంజనం పట్టుకుని.

దివాన్‌మీద పడుకోమని నుదుటిమీద కొద్దిగా అమృతాంజనం, వ్యాజలేన్ కలిపి నీళ్ళతో తడి చేసుకుని నెమ్మదిగా రాయసాగింది.

"మాజీ! మీరు కళ్ళుమూసుకుని ఏమీ ఆలోచించకుండా పడుకోండి" అంటూ చల్లని నీటిలో చేతిని ముంచి మసాజ్ చేసింది.

అరవింద అలా నిద్రలోకి జారుకుంది.

• • •

కళ్ళు మూసి తెరిచేలోపు రెండు సంవత్సరాలు గడిచిపోయాయి.

అరవిందకి పని చాలా పెరిగిపోయింది.

నాగపూర్‌లో, హైదరాబాద్‌లో ఆశ్రిత శాఖలు ప్రారంభమయ్యాయి. ముంబయి నుంచి ఆశ్రిత వసతిగృహాన్ని లోనావాలాకి మార్చేశారు. అక్కడే నమ్కీన్ల తయారీ, ఫ్లోర్‌మిల్, పాఠశాలా అన్నీ ప్రారంభించారు. అన్నింటినీ ఉద్యోగులు, స్వచ్ఛందంగా పనిచేసేవారు నిర్వహిస్తున్నారు.

ముంబయిలో అరవింద ఇల్లు సంస్థ కార్యకలాపాలకి వినియోగిస్తున్నారు. ఎవరైనా ఇతర రాష్ట్రాలనుంచీ, దేశాలనుంచీ వచ్చే అతిథులకోసం ఉపయోగిస్తున్నారు.

అరవింద తన అపార్ట్‌మెంట్ అమ్మేసి అదంతా ఆశ్రిత ఫండ్‌లో వేసి, తన మకాం ఆశ్రిత మొదటి అంతస్థులోకి మార్చేసింది.

రాహుల్ నాగపూర్‌కి బదిలీ చేయించుకున్నాడు. అతనికి కూడా ఆశ్రిత ఆశయాలు బాగా నచ్చాయి. నాగపూర్ ఆశ్రితని రష్మి చూసుకుంటోంది.

"మాజీ!"

ఒకరోజు పొద్దున్న అరవింద రాగానే పరుగెత్తుకుంటూవచ్చి అరవిందని పట్టేసుకుని భోరుమంది చిన్ని.

"ఏమయింది చిన్నీ?"

"అమ్మకి బాగాలేదు మాజీ! చాలారోజుల్నుంచీ జ్వరం వస్తోంది. మొదట్లో చెప్పలేదు. తరువాత ఇక్కడికొచ్చే డాక్టర్‌కి చూపించుకుంది. ఎన్ని మందులు వాడినా తగ్గట్లేదు. ఇవేళ పొద్దున్న కళ్ళు తిరిగి పడిపోయింది. ఎంత పిలిచినా లేవట్లేదు" ఏడుస్తూనే చెప్పింది చిన్ని.

అరవింద గబగబా రుక్కు ఉన్న గదికి వెళ్ళింది.

ఆశ్రితలో మొట్టమొదట్నుంచీ ఉంటున్న రుక్కూబాయ్‌కి వేరే ఒక చిన్నగది ఉంది. అందులో తనూ, చిన్ని ఉంటారు. మిగిలినవాళ్ళు ఒక్కోగదిలో నలుగురుంటారు. అవి పెద్ద గదులు. మొదటి రెండవ అంతస్థుల్లో ఉన్న పెద్ద హాళ్ళల్లో పదేసిమంది ఉంటారు. పగలు ఎత్తి మూలపెట్టేసిన చాపలు, జంపఖానాలు రాత్రి వేసుకుని పడుకుంటారు.

చేరినవాళ్ళల్లో కొందరు చిన్నవాళ్ళకి పెళ్ళిళ్ళు కూడా అయ్యాయి, సభ్యులకి తెలిసిన వాళ్ళద్వారా. రుక్కుని చూడగానే అరవిందకి అడుగు ముందుకి పడలేదు. అంతలా చిక్కిపోయింది. బుగ్గలు లోతుకి వెళ్ళిపోయి, కళ్ళల్లో జీవంపోయి తలంతా చింపిరిగా అయింది.

"ఇంతవరకూ ఎందుకు చెప్పలేదు నాకు?" బొంగురుపోయిన గొంతుతో అడిగింది.

"మామూలు జ్వరమే తగ్గిపోతుందిలే అనుకున్నాము మాజీ. ఏదీ తినాలనిలేదు, సహించడంలేదు అంటుంటే జ్వరంవల్ల నోరు చేదుగా అయి అలా ఉందేమో అనుకున్నాం. డాక్టరమ్మ యాంటీబయాటిక్స్, బికాంప్లెక్స్... అన్నీ ఇస్తున్నారు. కానీ ఇప్పుడు పిలిస్తే పలకట్లేదు"

చిన్ని వెనుకే రంగమ్మ కూడా వచ్చింది.

"రంగమ్మా! చిన్నపిల్ల... దానికి తెలియదు. మీరైనా నా దృష్టికి తీసుకురావద్దా? నేనేమో ఈ మధ్యన పనులు ఎక్కువయి అంత గమనించలేదు. ఎక్కడో ఉండి పనులు చేసుకుంటోందిలే అనుకున్నా" గబగబా తన ఆఫీసుగదిలోకి వెళ్ళి అంబులెన్స్‌కి ఫోన్ చేసింది.

సరిగ్గా అప్పుడే వారానికోసారి వచ్చి అందర్నీ పరీక్ష చేసే డాక్టర్ వచ్చింది.

"డాక్టర్! మీరైనా నాకు చెప్పద్దా? ఇంతవరకూ ఎందుకూరుకున్నారు? ఎముకలు కనిపించేలా చిక్కిపోతుంటే హాస్పిటల్‌కి పంపద్దా?" బాధగా అడిగింది. అంతకంటే ఏమీ అనలేదు. స్వచ్ఛందంగా వచ్చి సేవచేసేవాళ్ళని, అందులో ఈ డాక్టర్ ఎప్పట్నుంచో వస్తోంది. ఇప్పటివరకూ ఎవరికీ ఏమీ అత్యవసర పరిస్థితి రాలేదు.

"వారం క్రితం నేను చూసినప్పుడు ఇంత డిటీరియోరేట్ అవలేదు. బ్లడ్ టెస్ట్ అవీ చేయించి మెడిసిన్ మారుస్తూనే ఉన్నా, మామూలు బాక్టీరియల్ ఇన్ఫెక్షన్, అంత ప్రమాదం లేదనుకున్నా. మైగాడ్, వన్ వీక్‌లో ఇంతలా... నానావతికి తీసుకెళ్దాం" డాక్టర్ ఆదుర్దాగా అంది.

చాలా మంచి డాక్టర్. పేరు స్మిత. నలభై ఏళ్ళుంటాయి. ప్రశాంతికి మంచి స్నేహితురాలు. పది సంవత్సరాలనుంచీ క్రమంతప్పకుండా ఆశ్రితకి వస్తోంది.

అరవింద విచారంగా తలూపింది.

• • •

"ఎలా ఉన్నావ్ రుక్కూ?" చేతిలో పళ్ళని బల్లమీద పెట్టి పలుకరించింది అరవింద.

రుక్కూబాయ్ నీరసంగా నవ్వింది, హాస్పిటల్ మంచంమీద కూర్చుని.

"అలాగే ఉంది మాజీ. జ్వరం తగ్గడంలేదు" బత్తాయిరసం తీస్తున్న చిన్ని జవాబిచ్చింది.

"పదిహేను రోజులయింది. ఇంకా తగ్గకపోవడం ఆశ్చర్యంగా ఉంది. న్యుమోనియా, టైఫాయిడో ఏదీ కనిపెట్టలేకపోతున్నారా? ముంబయిలో ఇంత పెద్ద హాస్పిటల్‌లోనే ఇలా ఉంటే" పరుగున డాక్టర్ గదిలోకి వెళ్ళింది అరవింద.

"అన్ని టెస్ట్‌లూ చేశాం అర్విందాజీ. అందరం కూర్చుని డిస్కస్ చేస్తున్నాం. ఇంకొక వైరస్ టెస్ట్ రిపోర్ట్ రావాలి. అది చేసి, చెన్నైలో ఒక డాక్టర్‌ని కన్సల్ట్ చేసి అప్పుడు..." ఆపేసింది అప్పుడే డా॥ స్మితతో కలిసి గదిలోకి వచ్చిన డా॥ ప్రశాంతి.

అరవింద అనుమానంగా చూసింది. ఇద్దరు డాక్టర్లూ ఆందోళనగా ఉన్నారు.

"నిజం చెప్పండి డాక్టర్, రుక్కు పరిస్థితి"

"క్రిటికల్‌గానే ఉంది అర్విందాజీ. ఇప్పుడే కొత్త రిపోర్ట్స్ వచ్చాయి. ఒక్క నిముషం..." మోగుతున్న ఫోన్ ఎత్తింది. డా॥ స్మిత ఏదో మెడికల్ జర్నల్ చదువుతూ మధ్యలో ఒక పెద్ద పుస్తకం రిఫర్ చేస్తోంది. చాలా సీరియస్‌గా ఉన్నారు ఇద్దరూ.

"హా! డాక్టర్ సునీతీజీ... రిపోర్ట్ చూశారా? హా. పాజిటివ్. సెల్ కౌంట్ కూడా తక్కువగా ఉంది. కన్ఫర్మ్‌నా. నేనుకూడా అదే అనుకున్నా" కొంచెంసేపు మాట్లాడి పెట్టేసి అరవిందవైపు తిరిగింది ప్రశాంతి.

అరవింద ఆదుర్దాగా చూసింది.

"ఇది ఒక కొత్తరకం వ్యాధి. ఎక్కువగా అమెరికాలో, బ్రిటన్‌లో, ఆఫ్రికాలో బయటపడింది. ఈ మధ్యనే డాక్టర్ సునీతి సాలమన్ అని చెన్నైలో డాక్టర్ మనదేశంలో మొదటి కేసు కనుక్కున్నారు. అప్పట్నుంచీ ఆరుకేసులు ఆవిడే బయటపెట్టారు. చాలా భయంకరమైన జబ్బు.

శరీరంలోని రోగనిరోధకశక్తికి తోడ్పడే కణాలని హరించే వైరస్ హెచ్.ఐ.వి. అని వుంది. అది అటాక్ అయితే వస్తుంది. ఇది లైంగికసంపర్కంవల్ల వస్తుందని కూడా కనుక్కున్నారు" ప్రశాంతి వివరించబోయింది.

"నాకు తెలిసి, రుక్మాబాయి పదిహేను సంవత్సరాలనుంచీ ఆశ్రితలోనే ఉంది. ఒక్క రోజుకూడా వదిలి ఎక్కడికీ వెళ్ళలేదు" అరవింద మధ్యలో ఆపేసి అంది.

"ఆమె రేప్ విక్టిమ్ కదూ?"

అవునన్నట్లుగా తలూపింది అరవింద.

"ఇంకేం, అది చాలు. పైగా సామూహికంగా అని విన్నా నిజమేనా? అందులో ఎవరిద్వారానో వచ్చి ఉంటుంది. హెచ్.ఐ.వి. వైరస్ ఉన్నంతమాత్రాన వెంటనే ఎయిడ్స్ రావాలని లేదు. కొన్ని సంవత్సరాలు అయ్యాక, అంటే శరీరంలో కణాలు పోరాడలేనప్పుడు విజృంభించవచ్చు.

రుక్కు విషయంలో అదే జరిగివుంటుంది. ఇప్పుడు ప్రస్తుతం ఏ హాస్పిటల్‌లోనూ దీనికి ట్రీట్‌మెంట్ లేదు. అసలు అడ్మిట్ చేసుకోవట్లేదు కూడా. ఈమెని ఐసొలేషన్‌లో ఉంచాలి. చెన్నై డాక్టర్ వచ్చి చూస్తానన్నారు. స్టడీ చెయ్యడానికి మాత్రమే, చికిత్సకి కాదు. బాధ తగ్గడానికి, పెయిన్ కిల్లర్స్, నిద్రపట్టడానికి ట్రాన్క్విలైజర్స్ వాడడమే. ఎంతకాలం తీసుకుంటుందో కూడా చెప్పలేము" చదువుతున్న పుస్తకం మూసేసి స్మిత చెప్పింది.

అరవింద స్థాణువైపోయింది.

"ఇంకొక సంగతి, ఆశ్రితలో ఉన్న స్త్రీలందరికీ హెచ్.ఐ.వి. పరీక్ష చేయించాలి. ముఖ్యంగా రుక్కు కూతురికి, తల్లిదండ్రులనుంచి పిల్లలకి తప్పకుండా సంప్రాప్తిస్తుంది. చాలా ఖరీదయిన పరీక్ష. లయన్స్‌క్లబ్ వాళ్ళు స్పాన్సర్ చేస్తారేమో అడుగుదాం"

ప్రశాంతి చెప్తున్నది వింటుంటే అరవిందకి కర్తవ్యం బోధపడింది.

నిజమే, ఆశ్రితలో సగంమంది లైంగికంగా హింసింపబడ్డవాళ్ళే. కొందరు రెడ్‌లైట్ ఏరియా నుంచి వచ్చినవారు కూడా ఉన్నారు.

"నేను కూడా మా ఆశ్రిత నుంచి డబ్బు ఏర్పరుస్తాను. రేపట్నుంచే టెస్ట్లు మొదలుపెట్టండి. లయన్స్ క్లబ్‌వాళ్ళు ఇస్తే అప్పుడు చూసుకోవచ్చు"

"మీ సంస్థ అంటే నాకు అందుకే ఇష్టం అర్విందాజీ. ఏ సజెషన్ ఇచ్చినా వెంటనే స్పందించి పాటిస్తారు. రేపే చిన్నికి టెస్ట్లు చేయిద్దాం"

• • •

అరవిందకి ఒకందుకు దుఃఖంగా, ఒకందుకు సంతోషంగా ఉంది. రుక్కుకి ఇంక తగ్గదని చెప్పేశారు. డాక్టరు సునీతి తన హాస్పిటల్‌లో చేర్చుకుని ఉపశమనానికి మాత్రమే వైద్యం చేస్తా నన్నారు. ఒక రకంగా ఆవిడ కేస్ స్టడీకి దోహదం చేసినట్లే. అంతకంటే దారికూడా లేదు.

ఏ హాస్పిటల్‌లోనూ చేర్చుకోమన్నారు. చిన్నికి హెచ్.ఐ.వి. నెగెటివ్ వచ్చింది. అంటే ఆ జబ్బు వచ్చే ప్రమాదం లేదని నిర్ధారణ అయినట్లే.

"ఎందుకయినా మంచిది. ప్రతీ సంవత్సరం ఒకసారి పరీక్ష చేయిద్దాం. చిన్ని జన్మకి కారకుడైనవాడికి లేదన్నమాట. తల్లిదండ్రులు ఇద్దరికీ ఉంటే పిల్లలకి రావడానికి తొంభైశాతం అవకాశం ఉంది. అంతవరకూ అదృష్టవంతురాలే" డాక్టర్ స్మిత, చిన్ని రిపోర్ట్స్ చూడగానే అంది.

అవును అదృష్టవంతురాలే, అరవింద ఆలోచిస్తోంది. పెద్ద గీతముందు చిన్న గీత.

"నాన్నా!" అనే పిలుపు ఎరుగని దురదృష్టవంతురాలు. తండ్రి ఎవరో ఆ బ్రహ్మదేముడొచ్చి చెపితే తప్ప తెలుసుకోలేదు. కానీ అదృష్టవంతురాలే, ఎలాగ? ఎందుకు? ఏవిధంగా?

ఆకారం ఏర్పడకుండానే ఛిద్రం చేసెయ్యాలనే ఆలోచన తల్లికి రానందుకు. జన్మనివ్వగానే, ఏ చెత్తకుప్పలోనో తల్లి విసిరెయ్యనందుకు. రష్మి వంటి మానవతావాది కంట తల్లి పడినందుకు. ఒకరకంగా కారణజన్మురాలని కూడా చెప్పచ్చు. ఇంకా కళ్ళు తెరవని, ముడతలు పోని, బొడ్డుకోసిన దగ్గర రక్తంబొట్టుతో తన చేతుల్లోకి వచ్చిన ఆ అల్పప్రాణి, తనకి కర్తవ్యం బోధించినందుకు. 'ఆశ్రిత' జన్మించడానికి ఈ అదృష్టవంతురాలే అంకురం వేసినందుకు.

"అర్విందాజీ!" డా॥ స్మిత ఆదుర్దాగా పిలిచింది.

అరవింద కళ్ళు తుడుచుకుంది. తనకి తెలియకుండానే కళ్ళు జలపాతాలయ్యాయి. చిన్ని భవిష్యత్తు ఏమిటి? ఈ చిన్నారులకి ఇటువంటి స్థితి కల్పించిన వారినేం చెయ్యాలి? వారికెటువంటి శిక్షా లేదా? కాలం ముందుకు జరుగుతున్నకొలదీ ఆ కీచకుల సంఖ్య కూడా ఎక్కువైపోతోంది.

"అర్విందాజీ? అలా అయిపోయారేంటి?"

ఒంట్లో ఉన్న రక్తం అంతా అక్కడే చేరినట్లున్న ఎర్రబడ్డ కళ్ళతో స్మితని చూసింది.

"ఏమీలేదు. బాగానే ఉన్నా. మిగిలినవారి పరిస్థితి ఎలా ఉంది?"

స్మిత సమాధానం చెప్పకుండా బల్లమీదున్న పేపర్ వెయిట్ తిప్పుతూ కూర్చుంది.

"డాక్టర్! ఏమయింది?"

"ఇరవైమందికి పరీక్షలు చేశాము. పదిమందికి పాజిటివ్ వచ్చింది. ఇంకా లోనావాలాలోనే ఎనభైమంది పైగా చెయ్యాల్సినవాళ్ళు ఉన్నారు"

"అంటే యాభైశాతం. ఏం చెయ్యాలి?" ఉన్నట్టుండి అరవిందకి ఒక్కసారిగా నీరసం ముంచుకొచ్చేసింది.

"అందరికీ చేశాక స్టాటిస్టిక్స్ తీసి ఏం చెయ్యాలా అనేది మనం ఆలోచించాలి. వాళ్ళని అందరితో కలిపి వుంచలేము. ఈ జబ్బు గురించి ప్రజలకి అంత అవగాహన లేదు. ఆ మాటకొస్తే వైద్యులకే కొత్త. పరిశోధనలు సాగుతున్నాయి. ఇంతకాలం కలిసివుంచినట్లు అలాగే కొనసాగించవచ్చు. ఎందుకంటే ఇది అంటువ్యాధి కాదు. జనం అభ్యంతరపెట్టకపోవచ్చు. కానీ మాకే మంచిదనిపించడంలేదు"

"అందరికీ చేశాక ఆలోచిద్దాం. ప్రస్తుతం వీళ్ళందరినీ ఒక వింగ్‌లో పెడతాం"

అరవింద అలా శూన్యంలోకి చూస్తూ కూర్చుండిపోయింది. అనుకోని, ఎన్నడూ ఊహించని సమస్య. ఏవిధంగా పరిష్కరించాలి?

• • •

రుక్మాబాయి నెలలోగా మరణించింది. తనకి వచ్చింది ఎటువంటి జబ్బో, ఎందుకు వచ్చిందో తెలియకుండానే!

ఆమె మరణం సంఘంలోని సమస్యలలో కొత్త కోణం చూపించింది.

చిన్ని కన్నీళ్ళు ఆపడం ఎవరితరం కాలేదు. రాత్రిళ్ళు లేచి కూర్చుని గుండెలు అవిసేలాగ రోదించింది. దేనికయినా కాలం ఒక్కటే మందు. కాలేజీకి వెళ్తూ, చదువులోపడి కొంత మరిచి పోగలిగింది. చిన్నిని ఇంటర్ అయ్యాక నర్సింగ్ కోర్స్‌లో చేర్పించింది అరవింద.

ఎయిడ్స్ వ్యాధి అవగాహనకి, రుక్మాబాయిని ఉదాహరణ కింద తీసుకోవడానికి ప్రపంచ ఆరోగ్యసంస్థకి అనుమతి ఇచ్చింది చిన్ని. అంతేకాదు, రుక్మాబాయి శరీరాన్ని ముంబయి మెడి కల్ కాలేజ్‌కి ఇచ్చేసింది పరిశోధనలకి, అరవింద ఏమీ చెప్పకుండానే.

ఆశ్రిత ఏర్పడినప్పట్నుంచీ ఆశ్రితనే ప్రాణంగా భావించి తన పరిధిలో ఎంతో సేవ చేసింది రుక్మాబాయి. అందుకనే ఆమె పేరుమీదనే వెలిసింది.

లోనావాలాలోనే ప్రశాంతమైన పరిసరాలమధ్య రుక్మాబాయ్ మెమోరియల్ ఏ.హెచ్.ఏ.హెచ్ (ఆశ్రిత హోమ్ ఫర్ ఎయిడ్స్ అండ్ హెచ్ఐవి బాధితుల) సంస్థ.

ఆశ్రితలోనే మూడు శాఖల్లోనూ కలిపి యాభైమందికి ఉన్నట్లు తేలింది. అందులో పది మంది చిన్నపిల్లలు. తమ తల్లిదండ్రులకు పుట్టడంతప్ప ఏ పాపం ఎరుగని అమాయకులు. మొదలుపెట్టిన సంవత్సరంలోనే దేశంలో మూలమూలల్నుంచీ వందమంది చేరారు, ఇంక చోటు లేదని నిరాకరించేవరకూ.

సునీతి సాలమన్ పంపినవాళ్ళే ఇరవైమంది.హోమ్‌లో ఉన్నవాళ్ళందరికీ తన ల్యాబ్‌లో ఉచి తంగా పరీక్ష జరపడమేకాక ప్రతి నెలా వచ్చి అందర్నీ పరీక్షిస్తానని కూడా ఆవిడ చెప్పారు.

ప్రపంచ ఆరోగ్యసంస్థ, ఎయిడ్స్ నివారణోద్యమ సంస్థ బాగా ఆర్థికంగా సహాయం చేశాయి. సేవలనందించడానికి నిష్ణాతులైన నర్సులను నానావతి హాస్పిటల్‌నుంచి ప్రశాంతి పంపారు.

మంచి ఆహారం, ఆహ్లాదకరమైన వాతావరణం, ప్రేమనందించే సేవకులు... చిన్నపిల్లలకి ఒక స్కూలు, పెద్దలకి వారి వారి అభిరుచినిబట్టి కాలక్షేపం. ఆశ్రిత హోమ్ సేవలు ప్రపంచమంతా తెలిశాయి. అన్ని దేశాల్లోనూ అనుకరిస్తూ హోమ్‌లు వెలిశాయి.

అరవింద స్థాపించిన సంస్థలన్నింటిలో ఇది మానవతాదృక్పథం ఉన్న ప్రతి మనిషి హృద యంలో స్థానం సంపాదించుకుంది. ప్రతీ సంస్థ స్వయంసమృద్ధిని సాధించుకుంది. అన్ని శాఖ ల్లోనూ కమిటీలు... ఒక ఛైర్మన్, సెక్రెటరీ, సభ్యులు... అప్పుడప్పుడు అభిప్రాయభేదాలు వచ్చినా ధ్యేయం ఒకటే కనుక నిరాటంకంగా నడుస్తోంది.

ఇంత చేసినా అరవింద తన ఫోటో ఎక్కడా రావడానికి ఇష్టపడదు. ప్రతిరోజూ ఎక్కడున్నా ప్రతి సంస్థదీ కార్యకలాపాల సంగతి కనుక్కుని సలహాలివ్వడం మానదు. ఎప్పటికప్పుడు తన విజ్ఞానాన్ని పెంచుకుంటూ, ఆధునిక ప్రపంచీకరణ చేసిన సదుపాయాల్ని వినియోగించుకుంటూ,

వివిధ సేవాసంస్థల్నీ పరిశీలిస్తూ ముందుకు సాగిపోతోంది మిసెస్ అరవిందా భట్. ముంబయి విశ్వవిద్యాలయంవారు ఈ మధ్యనే గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు.

• • •

"ఇదే హేమాజీ! మాజీ నలభై ఐదు సంవత్సరాల ఆశ్రితతో ప్రయాణం"

హేమ నోటమాట రానట్లు అలా కూర్చుండిపోయింది. గొంతు పొడారిపోయి విపరీతమైన దాహం వేసింది.

తన ఆలోచన గ్రహించినట్లు శ్రీలేఖ పెద్దగ్లాసులో చల్లనినీరు తెచ్చి ఇచ్చింది.

"ఇంకో కప్పు టీ?"

తల ఊపింది హేమ. మూగవోయినట్లు, చుట్టూ అంతా స్తంభించిపోయినట్లు, నిశ్చేష్ట అయి చూస్తూవుండిపోయింది.

"ఇక్కడున్నారా? మీకోసం అంతా వెతికి వస్తున్నాను" అరవింద మాట విని కలలోనుంచి లేచినట్లుగా లేచి నిలుచుంది హేమ.

అరవింద, విశ్వనాథంగారు వరండాలోకి వచ్చి కుర్చీల్లో కూర్చున్నారు.

"ఏమ్మా హేమా! అలా ఉన్నావేమిటి? ఒంట్లో బాగుందా? పింకీ?"

అప్పుడే శ్రీలేఖ బయటికి వచ్చింది, ట్రేలో ఐదు కప్పుల్లో టీ పట్టుకుని.

"మీక్కూడా పెట్టేశాను టీ. నాకు తెలుసు వస్తూవుంటారని" అందరికీ టీ ఇచ్చి, తన కప్పు తీసుకుని వరండాలో గోడవారగా ఉన్న అరుగుమీద కూర్చుంది శ్రీలేఖ.

"అరిందం మామ్మా!" ఎవరో కొత్తమనిషిని చూస్తున్నట్లుగా చూస్తూ, నేలమీద ఆవిడ కాళ్ళ దగ్గిర కూర్చుంది హేమ.

"ఏం పింకీ? అంతా చెప్పేశావా?"

"హా మాసీ, మీరు హేమని ఇక్కడికి తీసుకొచ్చారంటేనే తనకి అంతా తెలియాలని ఊహించాను. మీ ఫ్యామిలీ మెంబర్ని మాకు చూపించడం ఇదే మొదటిసారి కదా, భట్ అంకుల్ సరేననుకో, నీకు శ్రమ ఎందుకని" నవ్వేసింది శ్రీలేఖ.

"నిజంగా ఇంట్లో ఎవరికీ తెలియదా మామ్మా? ఎలా?" హేమ టీ తాగేసి అడిగింది, మిలమిలా మెరుస్తున్న కళ్ళతో.

"మనింట్లో ఎవరికివాళ్ళే వాళ్ళపనుల్లో ఉంటారు. నేను అక్కడ లేనప్పుడు లండన్లో ఉంటానని కదా! ఎవరూ ఇంగ్లీష్ పేపర్లు తెప్పించరు. పైగా ఏ పేపర్లోనూ నా ఫోటో రాదు. సంస్థల గురించి వచ్చినా, నా పేరు చూసినా ఎవరో అనుకుంటారు. మన ఊరు, ఇంటి అడ్రస్ ఎవరికీ చెప్పలేదు నేను. అలా సినిమాకథలా నడిపించాను అనుకో" నవ్వేసింది అరవింద.

"మరి ఇప్పుడు, నాకు ఎందుకు చెప్పావు? నన్నెందుకు తీసుకొచ్చావు?"

"పిచ్చితల్లీ!" హేమ తల నిమురుతూ అంది అరవింద.

"నేను ఎప్పటికీ ఉండిపోను కదా! మనింట్లో ఎవరికైనా అభిరుచి ఉందా అని చూశాను. నాకెందుకో నువ్వు, కాంబాబు అర్థంచేసుకుని, నా వారసత్వం తీసుకుంటారేమో అనిపించింది.

మీకు ఇష్టం లేకపోయినా ఆగదనుకో. చాలామందే ఉన్నారు. కానీ ఎప్పటికయినా మీరు అందుకుంటారేమోనని ఆశ"

"శ్రీలేఖ ఎవరూ? ఆమె మీ కథలో పింకీనా? మిగిలిన అందరూ ఎక్కడున్నారూ?"

"అవును. నేనే పింకీని. విశ్వనాథంగారు నా భర్త. ఆయన ముంబయి యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా రిటైర్ అయ్యారు. నేను అక్కడే ఆశ్రితని చూసుకుంటూవుండేదాన్ని.

ఆయన రిటైర్ అయ్యాక ఇక్కడి సంస్థ చూసుకోమని మౌసీ అంటే ఇక్కడికి వచ్చేశాము. మాకు ఇద్దరు అమ్మాయిలు. ఇద్దరూ ఒకళ్ళు ఢిల్లీలో, ఒకళ్ళు బెంగళూరులో ఉన్నారు. అప్పుడప్పుడు వస్తుంటారు. వాళ్ళకి పుట్టినప్పట్నుంచీ ఆశ్రితతో అనుబంధమే" శ్రీలేఖ జవాబిచ్చింది.

"రష్మీ... చిన్నీ..."

"రష్మీ మా అమ్మ. మా, పాపా కూడా లాస్ట్ ఇయర్ స్వర్గానికి వెళ్ళిపోయారు. ఛోటీ, నా చెల్లెలు. ఫ్యామిలీతో ముంబయిలోనే ఉంది. తను ఈ సంస్థలని పెద్దగా పట్టించుకోదు. అందరూ ఒకలా ఉండరు కదా? చిన్ని, తనే ప్రభ. ఇందాకా మీరు కలిసిన ఆవిడ.

నర్సింగ్ చేశాక ఏ.హెచ్.ఏ.హెచ్ సంస్థని పూర్తిగా తనే నిర్వహిస్తోంది. ఎయిడ్స్ తల్లికి కూతురు అని ఎవరూ పెళ్ళిచేసుకోవడానికి సాహసించలేదు. తనకి కూడా అంత బాధ లేదు బయటికి తెలిసినంతవరకూ. ఇప్పుడు, ఇక్కడ కొత్తగా వచ్చిన ఇద్దరికి హెచ్.ఐ.వి. పాజిటివ్ వచ్చిందని తీసుకెళ్ళడానికి వచ్చింది. చౌహాన్, డాక్టర్ ప్రశాంతి, అప్పటి కమిటీసభ్యులలో చాలా మంది... వయసైపోయింది కదా" అంటూ కుడిచేతిని పైకి చూపించింది.

"చాలామంది కొత్తవాళ్ళు ఉన్నారు ఇప్పుడు. కానీ అందులో ఎక్కువమంది పాతవాళ్ళకి సన్నిహితులు. ఆశ్రిత అభివృద్ధిని చూస్తూవున్నవాళ్ళు. అందుకనే మార్పు సహజంగా జరిగిపోతోంది" అరవింద దూరంగా ఉన్న గుడిలోని గంటల్ని వింటూ అంది. ప్రతి సంస్థలోనూ ఒక చిన్న గుడి, ఒక చర్చి ఉన్నాయి. ముస్లిం స్త్రీలు నమాజ్ చేసుకోవడానికి ఒక హాలు ఉంది.

"అమ్మమ్మా!" సంభ్రమంగా చూస్తూ పిలిచింది హేమ.

హేమని చూసి నవ్వింది అరవిందం.

"ఇదంతా ఇంకా నమ్మలేకపోతున్నాను. అసలు అన్నాపురంలో అరిందం మామ్మేంటీ, ఇలా ఇంటర్నేషనల్‌గా... అక్కడి మామ్మకీ, ఈవిడకీ పోలికే లేదు" హేమ అలాగే కూర్చుండిపోయింది.

"నిజంగా లేదా? ఒక్కసారి ఆలోచించు"

హేమ తలపైకి ఎత్తి అరిందం మామ్మ మొహంలోకి చూసింది. నిజమే...

అన్నాపురంలో అందరూ అరిందం మామ్మ సలహా తీసుకోవలసిందే. ఆవిడకి తెలియని విషయాలు, చేతకాని పనులు లేవని, ఏ అవసరం వచ్చినా పరుగెత్తుకుని వస్తారు.తన పెళ్ళప్పుడు, ఊర్లో అడుగుపెట్టినప్పట్నుంచీ అందరినోటా ఆవిడ పేరే. కానీ, అదంతా ఆవిడ పెద్దరికంవలన, లండన్లో ఉంటూ అన్నీ తెలియడంవలన అనుకుంది. అసలు, అక్కడున్నప్పుడు అచ్చు పల్లెటూరి మామ్మలాగే, మడీ, పూజా, కట్టుబొట్టూ, భాష మాత్రం... హేమకి నవ్వొచ్చింది.

"ఏమిటీ అన్నాపురంలో నా ఇంగ్లీష్ గురించి నవ్వుతున్నావా? మరి లండన్ నుంచి వచ్చి

నప్పుడు ఆ మాత్రం ఉండద్దా! అక్కడి ఆప్యాయతలూ, అభిమానాలూ... అటువంటి కుటుంబంలో, ఆ ఊర్లో మెట్టినందుకు నేనెంతో పెట్టిపుట్టాననుకుంటాను"

హేమ అవునన్నట్లు తలూపింది. తను ఉన్న కొద్దిరోజుల్లోనే అవన్నీ చవిచూసింది. ఎక్కడో పల్లెటూర్లో పుట్టి, పద్నాలుగేళ్ళకే కనీవినీ ఎరుగని అతి పెద్దపట్నంలో అడుగుపెట్టిన అమాయకురాలైన ఆడపిల్లకి ఇంతటి బృహత్కార్యాలు చెయ్యడం సాధ్యమయ్యే పనేనా?

"ఎవరూ ఒక్కసారి కూడా ముంబయి రాలేదా? మీరేం చేస్తున్నారో ఎలా తెలియకుండా ఉంది? అంత పెద్దసంసారం, అందరు మనుషులు.మీ అమ్మా, నాన్న, తమ్ముడు... ఎవరూ?"

"పెళ్ళైన కొత్తలో వచ్చేవారు. నేను వెళ్ళినప్పుడు మొదట్లో మీ తాతగారితోనే వెళ్ళివచ్చేదాన్ని. మేము ముంబయి వెళ్ళిన ఎనిమిదేళ్ళకి మీ తాతగారు లండన్ వెళ్ళారు. అప్పటికి నేను అన్నీ నేర్చేసుకుని ఒక్కదాన్నే రష్మి సహాయంతో పనులన్నీ, ప్రయాణాలూ చేసేసుకునేదాన్ని. ఎప్పుడైనా వచ్చినా హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌వరకూ వచ్చి దింపేవారు. లండన్‌వరకూ రాలేమని చెప్పి. అప్పట్లో మూడురోజులు పట్టేది అన్నాపురం నుంచి బొంబాయి వెళ్ళడానికి. ఇంకా సందేహాలేమయినా ఉన్నాయా?" నవ్వింది అరవింద.

"మాజీ! ఇక్కడున్నారా? ఆఫీసుకి వెళ్ళివస్తున్నా. ఇద్దరికీ భోజనం పట్టుకొచ్చా!" ప్రభ క్యారియర్‌లో భోజనం పట్టుకునివచ్చింది.

తనని చూడగానే హేమకి అనిర్వచనీయమైన భావం కలిగింది. మాజీ అంటే ఎంత శ్రద్ధా! ఏ కులమో, ఎవరికి పుట్టిందో తెలియకపోతేనేం? మానవకులం, మానవత మూర్తీభవించిన కులం. ప్రభ చేస్తున్న సేవ మదర్ థెరెసా సేవకేమాత్రం తీసిపోదు.

"అరే, అప్పుడే రెండయిందా? హేమాజీ! సారీ. మీ లంచ్ మాటే మర్చిపోయాను. రండి, డైనింగ్‌హాల్‌కి వెళ్దాం" శ్రీలేఖ నొచ్చుకుంటున్నట్లు అంది.

"చిన్నీ! పద, అందరం అక్కడే తిందాం. క్యారియర్ అక్కడికే తీసుకెళ్దాం" అరవింద, చిన్ని చెయ్యి అందిస్తే కుర్చీలోంచి లేచింది.

హేమ లేచి, ఇంట్లోకి వెళ్ళి బాత్రూమ్‌లో మొహం కడుక్కునివచ్చింది. ఆశ్రిత కథ వింటుంటే వివిధ రకాలైన ఉద్వేగాలు కలిగాయి మరి.

అందరూ డైనింగ్‌హాల్‌కేసి బయల్దేరారు.

• • •

అరవింద అలసిపోయి తన ఆఫీసుగదిలో సోఫాలో విశ్రాంతి తీసుకుంటోంది. ఎంత హుషారుగా తిరిగినా వయసు ప్రభావం కనిపిస్తోంది. అందులో భోజనం అయ్యాక ఒక గంటవరకూ కదల్లేదు. సోఫాలో అలాగే పడుకుని కళ్ళుమూసుకుంది.

ప్రతి ఆశ్రితలోనూ అరవిందకి ఒక ఆఫీసు ఉంటుంది. అందులోనే తను ఉండడానికి కూడా వసతి, వెనుకగదిలో అన్ని సదుపాయాలూ ఉంటాయి.

హేమ, కాంబాబుకి ఫోన్‌చేసి, ఆఫీసునుంచి ఆశ్రితకి రమ్మని చెప్పి, తను కూడా అక్కడున్న దివాన్‌మీద వాలింది. శ్రీలేఖ వాళ్ళు మళ్ళీ వస్తామని వెళ్ళిపోయారు.

సాయంకాలం నాలుగయింది.

శ్రీలేఖ, విశ్వనాథంగారు వచ్చారు.

ప్రభ వెనుకగదిలో టీ తయారుచేస్తోంది.

అరవింద లేచి మొహంకడుక్కుని వచ్చి అందర్నీ చిరునవ్వుతో పలుకరించి కూర్చుంది.

"అరిందం మామ్మా! ఇది నీ సంస్థా?" ఆశ్చర్యంగా అంటూ కాంబాబు తిన్నగా లోపలికి వచ్చేశాడు.

"అప్పుడే ఎలా వచ్చారు?"

"నువ్వు ఫోన్ చెయ్యగానే బాస్‌కి చెప్పి వచ్చేశా హేమా! అసలు అరిందం మామ్మ వచ్చిందని ముందే పర్మిషన్ అడిగాలే..."

ఒక కెటిల్‌లో టీ డికాక్షన్‌తో, సరంజామా అంతా తీసుకునివచ్చి బల్లమీద పెట్టి టీ కలిపి అందరికీ ఇచ్చింది ప్రభ.

కాంబాబు సంభ్రమంగా అంతా చూస్తున్నాడు. అరవింద ఆఫీసులోంచి ఆవరణ సగం పైగా కనిపిస్తుంది. అతను ఏదో అడగబోయేంతలో అరవింద సెల్ మోగింది. ఒక చేత్తో టీ తాగుతూనే స్విచ్ నొక్కింది. అటుపక్కనుంచి చెప్పింది వినగానే టీ కప్పు చేతిలోనుంచి జారిపోయింది. ఫోన్ అలాగే పట్టుకుని వెనక్కివాలిపోయింది అరవింద. మొహమంతా చెమటలు.

ప్రభ ఒక్క ఉదుటున లేచి అరవింద సోఫాదగ్గరికి వెళ్ళింది.

"మాజీ, మాజీ!" పిలుస్తూ, ఒళ్ళో పడిన కప్పు కిందపెట్టి సెల్ చెవికానించింది. కూ అనే కూత విని, స్విచ్ ఆర్పి అరవిందని పిలుస్తూ కొంగుతో మొహం అద్దుతోంది.

అరవింద పలకట్లేదు.

శ్రీలేఖ డాక్టర్‌కి ఫోన్‌చేసి బాత్రూమ్‌లోకి వెళ్ళి బట్ట తడిపి తెచ్చి నుదుటిమీద వేసింది. హేమకీ, కాంబాబుకీ ఏంచెయ్యాలో తోచలేదు.

విశ్వనాథంగారు అంబులెన్స్‌కి ఫోన్ చేస్తున్నారు.

"అవేవీ అవసరంలేదు చిన్నీ, ఫోన్లు చెయ్యద్దు"

ఒక్కసారిగా అందరూ అరవింద చుట్టూ చేరారు. కళ్ళు తెరచి అందర్నీ చూస్తూ అంది అరవింద. "భట్టుసాబ్ మనకింక లేరు"

• • •

"మాజీ!" ప్రభ ముందుగా తేరుకుంది.

అందరూ ఆదుర్దాగా చూశారు.

"ఎనభై ఏళ్ళు దాటాక, ఎప్పుడో వార్త వినాలి అని తెలిసినా, ఒక్కసారి వినగానే కొంచెం తట్టుకోవడం కష్టం. పింకీ కొంచెం మంచినీళ్ళిస్తావా?"

హేమ గబగబా వెళ్ళి తీసుకొచ్చి నోటిదగ్గర పెట్టి తాగించింది, అరవింద చేతులు వణుకుతుంటే.

"మౌసీ! టికెట్ బుక్ చెయ్యమంటారా? లండన్ వెళ్తారా? మీ ట్రావెల్ ఏజెంట్ ఎవరూ? మేమెవరైనా రామా?"

అరవింద అయోమయంగా చూసింది. "నేనా! లండన్? ఎందుకూ? నాకసలు వీసా లేదు. ఆ మాటకొస్తే పాస్‌పోర్ట్ కూడా లేదు" అరవింద మాటలు వినగానే అందరూ కళ్ళు పెద్దవి చేసి చూశారు.

"అవును. నిజమే, మీకు తెలియని కథ ఇంకొకటి ఉంది అరిందం మామ్మది"

అంతా నిశ్శబ్దం. అక్కడున్నవారి ఊపిరి శబ్దంతప్ప ఇంకేమీ వినిపించడంలేదు.

అప్పుడు చెప్పడం మొదలుపెట్టింది అరవింద.

• • •

"ఆయన మొదటిసారి లండన్ నుంచి వచ్చినప్పుడు నిజంగా చాలా సంతోషించాను. ఏడు సంవత్సరాలు పైగా కలిసి ఉన్న మనిషి వెళ్ళినప్పుడు పెద్ద అనిపించలేదు. కానీ నాలుగేళ్ళ తర్వాత తిరిగివస్తే అనిపించింది. ఆయన లేకుండా ఇన్నాళ్ళు ఎలా ఉన్నానా అని. కానీ ఒంట్లో బాగోలేదని దూరం దూరం ఉంటే నిజమే కాబోలనుకున్నాను.

అన్నాపురం వెళ్ళడానికి ఫస్ట్‌క్లాస్ కూపే బుక్‌చేస్తే ఆశ్చర్యంతో, ఆనందంతో బోగీలోకి అడుగుపెట్టాను. ఇకనైనా మామధ్య దూరం తగ్గిపోతుందేమోనని. ఆ ప్రయాణంలోనే తెలుస్తుం దని ఊహించలేదు, మామధ్య ఎప్పటికీ కలవలేని దూరం ఏర్పడబోతోందని.

రైలు ఎక్కినప్పట్నుంచీ భట్టుగారు చేస్తున్న మర్యాద చూసి, ఇలా మారిపోతారా మనుషులు ఫారిన్ వెళ్తే అనుకున్నాను. బ్రిటీష్ లేడీకి చేసే మర్యాద, ఎంతో అభిమానం, శ్రద్ధ. ముందు ఏదైనా నాకు ఇచ్చి, నేను తీసుకున్నాక తను తీసుకోవడం, అంతవరకూ ఎప్పుడూ చూపించని ఏకాగ్రతతో నా మాటలు వినడం. అవన్నీచూసి నా అంత అదృష్టవంతురాలు లేదనుకున్నాను.

బొంబాయిలో ఉన్నప్పుడు నిజంగానే ఆయన వృత్తిలో పైకి రావాలని నాతో ఆ విధంగా ఉండేవారేమో అనిపించింది. నేనే సరిగ్గా అర్థం చేసుకోలేదేమో! ఎన్నడూ ఒక్క పరుషవాక్యం కూడా అనలేదే. చదువుకోమనీ, లోకజ్ఞానం పెంచుకోమనీ ప్రోత్సహించారే, ఎప్పుడూ ఇంత ఖర్చెందుకయిందని నిలదీయలేదే. ఈ విధంగా ఆలోచిస్తూ అనురాగంతో, ప్రేమతో ఆయన ప్రతీ చేష్టనీ గమనిస్తూ, ఒక గంట ప్రయాణం అయ్యాక అడిగాను, "ఈసారి నేనుకూడా వస్తున్నా కదా, ఇల్లు అదీ తీసు కున్నారా? పాస్‌పోర్ట్‌కి అప్లై చెయ్యాలి కదా?" ఆయన మొహంలో ఒక్కక్షణం కలవరం కనిపించింది. కొద్దిసేపు ఏమీ పలకకుండా ఆలోచిస్తున్నట్లు కూర్చున్నారు. ఐనా, తను చెప్పదలుచుకున్నదానికి నేనే నాంది పలికాను కదా! అది కొంత నయం అనిపించినట్లుంది.

"అరవిందా! నువ్వు చదువుకున్నదానివి. చాలా తెలివైనదానివి. మన కాపురంలో ఏనాడూ నా సుఖానికీ, సంతోషానికీ అడ్డు చెప్పలేదు. ఇది లేదనీ, అది కావాలనీ మామూలు గృహిణుల్లాగ నన్ను వేధించలేదు. ఏ చీకూచింతా లేకుండా నేను నా ప్రాక్టీస్‌మీద దృష్టి నిలుపగలిగాను.

ఇప్పుడు నేను చెప్పబోయేది కూడా నా దృక్పథంలోంచి ఆలోచించి సహకరిస్తావని ఆశిస్తు న్నాను" ఇంత సుదీర్ఘంగా మాట్లాడ్డం ఇదే మొదటిసారి. ఇన్ని పొగడ్తలా? నా ధర్మం నేను నెర వేర్చాను. అడగ డానికి, సాధించడానికీ చనువుండాలి కదా! ఏం మాట్లాడకుండా, చెప్పండి అన్నట్లు చూసి సర్దుకుని కూర్చున్నాను.

"లండన్ వెళ్ళగానే చాల కష్టపడవలసివచ్చింది నిలదొక్కుకోవడానికి. పరీక్షలు అవీ పాస్ అవడం పెద్ద సమస్యేం కాదు. కానీ చాలా పోటీ ఉన్న వృత్తి. బ్రిటీష్ సామ్రాజ్యంలో భాగాలయిన దేశాలన్నింటినుంచీ వచ్చి ఎందరెందరో బారిస్టర్ అవాలని ప్రయత్నిస్తారు. చాలారోజులు కంటికి నిద్ర లేకుండా గడిపాను. చివరికి ఒక పెద్ద 'లా' ఆఫీసులో ఉద్యోగం దొరికింది. అపుడే పరిచయం అయింది జేన్. మా బాస్‌కూతురు. తనుకూడా అప్రంటీస్ చేస్తోంది. ఇద్దరికీ ఎన్నో కామన్ విషయాలు. బారిస్టర్లుగా పేరు తెచ్చుకోవాలనే తపన. రోజులో పదహారు గంటలు కష్టపడ్డాము.

ఆ సమయంలోనే సాన్నిహిత్యం ఏర్పడింది. అది మా బాస్‌కి తెలిసింది. బ్రిటీష్ రాజ కుటుంబానికి దూరపు బంధువులు. ఏదయినా అఫైర్ మొదలయిందంటే అది పెళ్ళికి దారి తియ్యాలనే ఆలోచనలు ఉన్న వంశం. ఒకరోజు పిలిచి నన్ను, జేన్‌ని నిలదీశారు. చెప్పాను నాకు వివాహమయిందనీ, అనుకోకుండా జేన్‌తో క్లోజ్ అవడం జరిగిందీ అని.

"ఓ.కే... అయితే ఇండియా వెళ్ళిపో, ఇక్కడ ఉండాలంటే నీ భార్యకి విడాకులు ఇచ్చి జేన్‌ని వివాహం చేసుకో" అంటూ అక్కడ్నుంచి వెళ్ళిపోయారు. వెళ్తూ ఒక్క మాటకూడా అన్నారు. ఇన్నేళ్ళు విడిచివచ్చావు, ఇకముందు కూడా విడిచివుండడానికి ఏం కష్టం అని.

నాకు లండన్‌లో ఉండడం ఎంత ఇష్టమో నీకు తెలుసు. నా దగ్గరున్నప్పుడు భౌతికంగా ఏమోకానీ, మానసికంగా నీవేం సుఖపడలేదని నాకు తెలుసు.

నువ్వు కనుక ఒప్పుకుంటే ఇక్కడున్న నా ఆస్తులు మొత్తం నీకిచ్చేస్తాను. నీపేరుమీద రాయడమే కాదు, నీ ఇష్టం వచ్చినట్లు చేసుకోవచ్చు. అంతేకాదు నా సంపాదనలో పదిశాతం ప్రతి సంవత్సరం పంపుతాను. ఇప్పుడు నా భవిష్యత్తు అంతా నీ చేతిలో ఉంది"

ఆయన మాటలు మొదట్లో నాకర్థం అవలేదు. శూన్యంలోకి చూస్తున్నట్లుగా, ఎక్కడో చూస్తూ కూర్చుండిపోయాను. ఒక గంట అయాక పిలిచారు. "అరవిందా!"

రైలు పూనా దాటింది. కిటికీకి ఆనుకుని, కాళ్ళుపైన పెట్టి కూర్చున్నాను.

నాకు ఎదురుగా తలుపువైపుకి కూర్చున్నాయన నా పక్కకి జరిగారు. నా చెయ్యి తన చేతిలోకి తీసుకోబోయారు. అప్రయత్నంగా వెనక్కిజరిగి ముడుచుకుపోయాను. ఒళ్ళు జలదరించినట్లయింది. ఆయన కూడా చెయ్యి తీసేసి ఆదుర్దాగా నా మొహంలోకి చూశారు.

"నేను ఇప్పుడేం చెయ్యాలి?" నిజంగానే నాకు అర్థం అవలేదు.

"విడాకులు ఇవ్వాలి"

గాలి స్తంభించినట్లయిపోయింది. విడాకులంటే... ఆ మాటే వినలేదు నేను. ఇంగ్లీష్ నవలల్లో సినిమాల్లో డైవోర్స్ అని అంటుంటారు అదేనా? పురాణాల్లో, మన ఇతిహాసాల్లో ఎప్పుడూ దాని ఊసే లేదు. ఇంక మన కుటుంబాలలో భార్యాభర్తలు విడిపోయేది ఒక్కసారే అని తెలుసు. అసలు ఎందుకు? ఇప్పుడు మాత్రం కలిసి ఉన్నామా? కొత్తగా విడిపోవడానికి? మీరు అక్కడా నేను ఇక్కడా ఇలాగే ఉండచ్చు. దానికి విడాకులు అని పేరెందుకు?

నా ఊహలన్నీ నా కళ్ళల్లో చదివారు.

"నేను జేన్‌ని పెళ్ళిచేసుకోవాలంటే విడాకులు తీసుకుని తీరాలి. లేకపోతే లండన్ వెళ్ళలేను. నీకు నచ్చినవాడు దొరికితే నువ్వు కూడా మళ్ళీ..." నా కళ్ళలో తీక్షణత చూసి ఆగిపోయారు.

ఇంక మాట్లాడకుండా పై బర్త్‌మీదికెక్కి పడుకున్నారు. రాత్రంతా అలాగే కూర్చున్నాను. శరీరం అంతా కొలిమిమీద ఉన్నట్లుండుండి ఒంట్లోనుంచి వేడి ఆవిరి బయటికి వస్తోంది.నోరంతా చేదుగా, కడుపులో వికారంగా చెప్పలేని స్థితి. ఇదా నేను కోరుకున్న జీవితం? పరిస్థితులనర్థంచేసుకుని సర్దుకుపోగలిగిన నేను ఊహించని ఈ స్థితిని తట్టుకోలేకపోతున్నాను. ఏం చెయ్యాలి?

భట్టుగారు అడిగినట్లు డైవోర్స్ ఇచ్చేస్తే, మొగుడు వదిలేసిన ఆడదానిగా ఎలా బ్రతకాలి? సాంప్రదాయాల్ని ప్రాణంలా చూసుకునే కుటుంబాలు ఇద్దరివీ. పెద్దవాళ్ళు తట్టుకోగలరా? అప్పటికి ఇంకా మామగారు, మా అమ్మానాన్నలు అందరూ ఉన్నారు.

ఇవ్వకుండా ఇక్కడే ఉండిపొమ్మంటే, ఆ ఆలోచనకే వణుకు వచ్చింది. ఎటువంటి వ్యతిరేక భావమూ లేకుండానే బొంబాయి కాపురం ఎంత నిస్తేజంగా ఉండేదో... ఇంక ఆయన కలల జీవితాన్ని నేను లాక్కుంటే ఎలా ఉంటుంది?అంతా నాకు చెప్పేసి, భారం దించుకున్న భట్టుగారు గురకపెడుతున్నారు. రైలుచక్రాల శబ్దంతో లయగా, నా గుండెలో మద్దెల వాయిస్తున్నట్లు.

తెల్లవారుఝాముకి హైదరాబాద్ చేరుకున్నాము. రిట్జ్ హోటల్లో గది తీసుకున్నారు. ఆ రోజంతా అక్కడ ఏవో పనులట. మర్నాడు రాజమండ్రీ వెళ్ళి అక్కడ్నుంచి ట్యాక్సీ చేసుకుని అన్నాపురం వెళ్ళాలి. పొద్దున్నంతా పనులు చూసుకుని మధ్యాన్నం భోజనం గదికి తెప్పించారు. ఆకలికి నీరసంవచ్చి కళ్ళు తిరిగిపోతున్నాయి. మనసులోని ఆందోళన కడుపుకి తెలియదు కదా! కోపమో, బాధో, ఆవేశమో, ఉక్రోషమో! గుండె కుతకుతా ఉడుకుతున్నట్లుగా కొట్టుకుంటోంది. అదంతా పక్కకి నెట్టి భట్టుగారితో కలిసి భోంచేశాను.

ఆ తరువాత అడిగారు. "ఏమాలోచించావు అరవిందా?"

నిద్రలేమి, వ్యాకులచిత్తం, చింతనిప్పుల్లా ఉన్న కళ్ళతో చూస్తూ అన్నాను.

"అలాగే! విడాకులు ఇస్తాను. కొన్ని షరతులతో"

• • •

భట్టు మొహం వికసించింది. ఏ షరతులైనా, ఎన్ని షరతులైనా ఫరవాలేదు.

నాకింక మన్నించాలని కూడా అనిపించలేదు. ప్రపంచంలో ఎందరో మగవాళ్ళలో అతనొకడు. నాకూ అతనికీ ఇంకేం సంబంధం? నలభై అయిదేళ్ళక్రితం ఆంధ్రదేశంలో, అందులో పల్లెటూర్లలో విడాకులు ఇంకా విజృంభించలేదు. భార్యాభర్తలు ఎలా సర్దుకుపోవాలా అని ఆలోచించేవారు.

రాత్రంతా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాను. అదే అతనితో చెప్పబోతున్నాను.

"ఏమిటో చెప్పు" కుతూహలంగా ముందుకు వంగాడతను.

"మీకు విడాకులు ఇంగ్లాండ్‌లో కదా అవసరం?"

అవునన్నట్లు తలూపాడు.

"అయితే ఇండియాలో అందరికీ తెలియవలసిన అవసరంలేదు కదా?"

మళ్ళీ నిలువుగా ఊగింది తల.

"మీరు వాగ్దానం చేస్తున్నట్లుగానే ఆస్తి అంతా ఇండియాలో ఉన్న ఆస్తులన్నీ నా పేరుమీదికి బదిలీ చెయ్యండి. అలాగే రాబోయే మీ ఆదాయంలో శాతం కూడా... అలా అని మనం విడాకుల

అగ్రిమెంట్‌లోనే రాసుకుందాం" ఆశ్చర్యంగా చూశాడతను నాకేసి. ఇంత డబ్బుమనిషా. ఆస్తికి మొగుడ్ని వదులుకుంటుందా అన్నభావం కనిపించింది నాకు అతని కళ్ళల్లో.

అతని ఇష్టప్రకారమే జరుగుతున్నా కూడా. అవేమీ పట్టించుకోని స్థాయికి ఎదిగిపోయాను అప్పటికే, ఒక్క రాత్రిలోనే.

"మన ఊర్లలో ఎవరికీ చెప్పకూడదు. నేను మామూలుగా వెళ్తుంటాను. అప్పుడప్పుడు మీ వీలునుబట్టి మీరుకూడా వస్తే మంచిదే. అలాగే బొంబాయిలో మనకి తెలిసినవాళ్ళకి కూడా. ఒక్క లాయరుగారికి తప్ప. అదీ చౌహాన్‌గారిద్వారా వెళ్దాం. ఆయనకి మాత్రమే తెలియాలి.

మీరు ప్రతీ సంవత్సరం బొంబాయిమాత్రం తప్పకుండా రావాలి. నేనున్న ఇంటిలో కొన్ని రోజులు ఉండాలి. ఒక పరిచయస్తుడిలాగా! బయటివాళ్ళకి మాత్రమే భార్యాభర్తలం"

"నువ్వు చెప్పింది అంతా బాగానే ఉంది కానీ, నువ్వు లండన్ ఎందుకు వెళ్ళట్లేదని ఎవరైనా అడిగితే, అక్కడికి రాకుండా ఎలా మభ్యపెడతావు?"

"అవన్నీ నేను చూసుకుంటాను. ఇంత ఆస్తి ఇస్తున్నందుకు కృతజ్ఞతగా మీకు చెడ్డపేరు రాకుండా చూసుకుంటాను. అదృష్టవశాత్తూ బొంబాయికీ, అన్నాపురంకీ చాలా దూరం ఉంది. ఇక్కడ కొన్నాళ్ళు, అక్కడ కొన్నాళ్ళు ఉంటూ... మీరన్నట్లు లండన్ వెళ్ళినట్లు మభ్యపెడతాను" ఆ మాటలు చెపుతున్నప్పుడు నాకు తెలియకుండానే గొంతు బొంగురుపోయింది.

కొంచెంసేపు గొంతు పట్టేసినట్లు అయిపోయి మాట్లాడలేకపోయాను.

అప్పుడు, అతని కళ్ళలో కొంచెం సానుభూతి కనిపించింది.

"అవసరమైతే మూడో ఇల్లు... ఏ కలకత్తాలోనో తీసుకుంటాను. ఎవరికీ కనిపించకుండా కొన్నాళ్ళు అజ్ఞాతవాసం చేస్తాను"

ఇదంతా సాధ్యమా అన్నట్లు చూశాడతను.

నిజమే, అబద్ధం చెప్పకుండా, నిజం చెప్పకుండా ఎలా? ఏమో, అప్పుడయితే ఏ ధైర్యంతో అనేశానో, ఏం చేద్దామనీ? నా భవిష్యత్తు ఏమిటీ? నది మధ్యలో నావ మునిగినట్లైంది నా పని. ముందు ఈ సుడిగుండం దాటితే ఆ తరువాత ఆలోచించవచ్చు ఈదగలనా లేదా అని.

"నీ ఇష్టం అరవిందా! నువ్వెలా చెప్తే అలాగే"

నవ్వొచ్చింది నాకు. గట్టిగా నవ్వాను. కళ్ళలో నీళ్ళు కారేలా నవ్వాను.

అతను బిత్తరపోయి చూశాడు. నాకు పిచ్చెక్కిందనుకున్నాడేమో, కూజాలోంచి చల్లని నీళ్ళిచ్చి తాగమన్నాడు.

నీళ్ళు తాగుతూ కూడా నవ్వాను. గొంతులో పరకపోయేలా...

"అరవిందా! ప్లీజ్, ప్లీజ్..."

"నా ఇష్టం, నేనెలా చెబితే అలా చేస్తారు కదూ..." నవ్వి నవ్వి ఇంక నవ్వలేక సోఫాలో పడి నిద్రపోయాను. మరునాడు బయలుదేరి అన్నాపురం వెళ్ళాము.

• • •

అప్పట్నుంచే మొదలయింది నా జీవితంలో నటన. నాతోపాటు భట్టు. మా ఊర్లో అమ్మా నాన్నల దగ్గర, అన్నాపురంలో అందరిదగ్గర నటించాము. నటనలో జీవించాము.

తమ్ముడిమీద ఎంత నమ్మకమో... మా బావగారికి ఏమాత్రం అనుమానం రాలేదు. అసలు అప్పటికి విడాకులు వంటివి ఉంటాయనే తెలియని కుటుంబాలు.

బొంబాయి వచ్చినప్పట్నుంచీ జరిగింది మీకు తెలుసు. భట్టుతో చెప్పినట్లుగానే బొంబాయి నుంచి అన్నాపురం వెళ్ళి కొన్ని నెలలు ఉండేదాన్ని.

బొంబాయిలో వాళ్ళు లండన్ వెళ్ళాననుకునేవాళ్ళు. అలాగే అన్నాపురంలో కూడా. అక్కడ లేకపోతే లండన్‌లో ఉన్నట్లు లెక్క.

మాట తప్పకుండా భట్టు ప్రతీ సంవత్సరం రావడం, మూడు వారాలు పైగా ఉండడం... అప్పుడప్పుడు అన్నాపురం వెళ్ళడం, తన ఆదాయంలో కొంత శాతం ఇవ్వడం. ఎవరూ జరుగుతున్నది ఊహించను కూడా లేదు. అనుమానానికి తావు ఇవ్వకుండా నటించాము. నాకే ఆశ్చర్యం వేస్తుంటుంది. ఇదంతా ఎలా సాధ్యం అయిందీ అని.

ఇప్పుడు ఆలోచిస్తూ ఉంటే, ముఖ్యంగా రెండు కారణాలు కనిపించాయి నాకు. ఒకటి, అప్పట్లో సమాచారాలు చేరేసే సాధనాలు చాలా తక్కువ. కమ్యూనికేషన్ చాలా కష్టంగా ఉండేది. ఒక ఉత్తరం అన్నాపురం నుంచి బొంబాయి చేరాలంటే మూడురోజులు పట్టేది, అదీ పోస్ట్‌మేన్ వెంటనే అందజేస్తే. ఇంక లండన్ అంటే కనీసం పదిహేనురోజులు.

టెలిఫోన్ సరేసరి. ట్రంక్ కాల్ బుక్ చేస్తే మూడు నాలుగు గంటలు కూర్చోవాలి. మధ్యలో ప్రతీ మూడునిముషాలకీ ఆపరేటర్ అడ్డురావడం 'టైమ్ అయిపోయింది సార్' అనుకుంటూ.

ఇంక లండన్‌కి కాల్‌బుక్ చెయ్యాలంటే ఒక పూట సరిపోయేది కాదు. బొంబాయి నుంచి ఫరవాలేదనుకోండి. ఇంక విసుగొచ్చి ఊరుకునేవాళ్ళు. ఎప్పుడైనా మేము ఫోన్ చేసి మాట్లాడాల్సిందే. అయినా ప్రతీ ఏడూ నేను మూడు నాలుగు నెలలు అక్కడే ఉండేదాన్ని కదా! తరువాత తరువాత... కమ్యూనికేషన్ మరీ సులువైపోయాక, ఇంకా సులభంగా నమ్మించగలిగాము. సెల్ ఫోన్లో పక్కవీధిలోనే ఉన్నా ప్రపంచంలో ఎక్కడో ఉన్నట్లు నమ్మించచ్చు. ఇంటర్నేషనల్ చిప్ తీసుకుంటే. ఈమెయిల్స్ కూడా అంతేకదా. మనం ఎక్కడున్నామో ఎవరూ కనిపెట్టలేరు.

రెండో కారణం మా నటన. మామీద అందరికీ ఉన్న నమ్మకం. అంత బాగా ఒప్పించాము. కొన్నాళ్ళకి మా జీవనవిధానం కూడా ఆ ప్రజలకి అలవాటైపోయింది.

ఎవరూ నన్ను వెతక్కుండా నేనే తరచూ, సెల్‌ఫోన్లు వచ్చాక ప్రతిరోజూ అందర్నీ పలకరిస్తూంటాను. మీకందరికీ అనుభవమే కదా! నా అదృష్టం... నాకు బాగా కావలసినవాళ్ళు, పరిచయం ఉన్నవాళ్ళు, వాళ్ళ పిల్లలు, మా కుటుంబంలో వాళ్ళు ఎవరూ ఇంగ్లాండ్ వెళ్ళలేదు. వెళ్ళాలనుకోలేదు. ఒక ధ్యేయం అంటూ లేకుండా ఏం చెయ్యాలా, ఇకముందు జీవితం ఎలాగా అనుకుంటున్న సమయంలో రష్మి, రుక్మాబాయ్ నా సమస్యకి పరిష్కారం చూపించారు.

చిన్ని నాకు ఒక ధ్యేయం అంటూ ఏర్పడడానికి దోహదం చేసింది. అంతేకాదు అడుగడుగునా ధైర్యం చెప్తూ ఎటువంటి ఒడుదుడుకులనైనా ఎదుర్కొనే శక్తి ఇచ్చింది రష్మి.

మా సంగతి ఇండియాలో ఒక్క చౌహాన్‌గారికి తప్ప ఎవరికీ తెలియదు. ఆయన చివరి వరకూ నా నమ్మకాన్ని వమ్ము చెయ్యలేదు. ఏది జరిగినా మన మంచికే అంటారు. నాకు ఒక

సంసారం, సంతానం... కుటుంబం లేదే అని ఎన్నో రాత్రులు ఏడ్చాను, విడాకులు అయిన కొత్తలో. ఇంత పెద్ద కుటుంబం, వందలమంది సంతానం, ఇంత పెద్ద ఇళ్ళు రాసిపెట్టుంటే, ఒక చిన్న కుటుంబానికే ఎలా పరిమితమవుతాను? ఆ తరువాత నేను ఎప్పుడూ విచారించలేదు. ఆశ్రితకి ఏదయినా హాని జరిగినప్పుడుతప్ప.

అదర్రా... నా స్టోరీ.

• • •

గదంతా ఒక్కసారి నిశ్శబ్దం అయిపోయింది.

అరవింద మాటలు అందరి చెవుల్లోనూ ప్రతిధ్వనిస్తున్నాయి.

"అరిందం మామ్మా! ఒక్కదానివీ ఎలా భరించావమ్మా? అందరికీ ఎంత ఆనందాన్ని పంచావూ?" వెక్కి వెక్కి ఏడుస్తూ కాంబాబు కింద కూలబడి, ఆవిడ మోకాళ్ళమీద తలపెట్టాడు. మిగిలినవాళ్ళు కూడా తేరుకుని కళ్ళనీళ్ళు కారుస్తూ నిలబడిపోయారు.

"అన్నాపురం వార్త చెప్పద్దా? కర్మకాండలూ అవీ..." కాంబాబు ఆగిపోయాడు అరవింద మొహం చూసి.

"అతను క్రిస్టియన్ మతం పుచ్చుకున్నాడు. ఇంకా మన కర్మా అదీ, అర్థం లేదు" విరక్తిగా అంది అరవింద.

"కానీ ఆ సంగతి మనవాళ్ళకి తెలియదు కదా?"

నిజమే అన్నట్లు చూసింది కాంబాబుకేసి.

"సరే, నా నాటకంలో ఆఖరి అంకం. అలాగే వేసేద్దాం"

• • •

"అయితే అరిందం మామ్మా! ఇంక లండన్ వెళ్ళరా? ఇక్కడే ఉంటారా?" నాగమణి అడిగింది.

"అవునే నాగమణీ, ఇక్కడే ఉంటాను"

భట్టు కర్మకాండలు ముగిసి అందరూ తిరుగు ప్రయాణం అవుతున్నారు.

"ఎలా కుదురుతుంది? మామ్మ నా దగ్గరికి వస్తుంది. పద మామ్మా బట్టలు సర్దుకో!" కాంబాబు హడావుడి పెట్టేశాడు.

"అలాగే, సగం అక్కడా, సగం ఇక్కడా... ఫిఫ్టీ ఫిఫ్టీ"

"అరిందం మామ్మా! సగం లండన్‌లోనూ, సగం అన్నాపురంలోనూ ఉన్నట్లా?" నవ్వేశాడు కాంబాబు.

-: అయిపోయింది :-

అమ్మతనం

"నువ్వు వెయ్యి చెప్పు... లక్ష చెప్పు నీదంతా మొండిపట్టుదల. నువ్వాలోచిస్తున్న విధానం తప్పు. దయచేసి నా మాట విని నీ పంతం మానుకో" అప్పటికి అరగంట నుండీ వైజయంతిని కన్విన్స్ చేయడానికి ప్రయత్నిస్తూనేవున్నాడు. శ్రీనాథ్. మాటలంటే విభిన్నంగా మారాయిగాని, వాటిలోని సారాంశం మాత్రం అదే. చెప్పిచెప్పి నోరు నొప్పెడుతోంది కాని వైజయంతి వినిపించుకోవడంలేదు.

"ఇల్లిటరేట్‌లా మూర్ఖంగా మాట్లాడకు శ్రీ. నీకు తెలుసు... నేనేంచేసినా చాలా డీప్‌గా ఆలోచించి చేస్తానని.అన్నీ తెలిసి నువ్విలా అబ్జెక్ట్‌చేయడం బాగాలేదు"విసురుగా అంది వైజయంతి.

"నేను అబ్జెక్ట్ చేయడంలేదు వైజూ... ఒక తల్లిగా కాస్త మనసు పెట్టమంటున్నాను" తానూ ఏమాత్రం తగ్గకుండా అన్నాడు శ్రీనాథ్.

"తల్లిని కాబట్టే నా బిడ్డ భవిష్యత్తు ఉజ్జ్వలంగా ఉండాలని ఆశిస్తున్నాను. అది తప్పా!" ఎదురు ప్రశ్నించింది వైజయంతి పెద్ద స్వరంతో.

శ్రీనాథ్ అసహనంగా కణతలు రుద్దుకుంటూ "తప్పని నేననడంలేదు వైజూ... బిడ్డ ఉన్నతిని కాంక్షించడం ఏమాత్రం నేరంకాదు. కాని, దానికోసం ఆ బిడ్డను దూరంగా నెట్టేయాలనుకోవడం, మానసికంగా హింసించడం మాత్రం అన్యాయం" అన్నాడు శ్రీనాథ్ కాస్త కోపంగా.

"నీదంతా విడ్డూరం శ్రీ... ఏమాత్రం పసలేని వితండవాదం.నాకు ప్రేమలేక వాడిని హాస్టల్‌లో ఉంచుతానని అంటున్నాననుకుంటున్నావా! ఇప్పుడంతా పోటీ ప్రపంచం. పక్కవాడిని తోసుకు ముందుకుపోతే కాని బతకడం కష్టం. ఈ కాంపిటేటివ్ రేస్‌లో గెలవడంకోసం ఇప్పటినుంచే శ్రమపడడం చాలా అవసరం. అందుకే వాడినా టెక్నోస్కూల్‌లో చేరుద్దామనుకుంటున్నాను"పట్టుదల ధ్వనించింది వైజయంతి స్వరంలో.

"నాకో సంగతి బోధపడడంలేదు వైజూ... ఇప్పటినుండీ మన పిల్లాడికి పక్కవాడిని ముందుకు నెట్టేసి తాను ముందుకు దూసుకుపోవాలన్న స్వార్థం, తపన అవసరమా! వాడు ముక్కుపచ్చలారని పసివెధవ. అమ్మానాన్నల సమక్షంలో సేదతీరుతూ, ముద్దుముచ్చట్లనుభవిస్తూ పెరగవలసిన వాడి బంగారు బాల్యాన్ని అలా టెక్నోస్కూళ్ళకి తాకట్టుపెట్టడం నాకెంతమాత్రం ఇష్టం లేదు" అనునయించడానికి ప్రయత్నించాడు శ్రీనాథ్.

కె.కె.భాగ్యశ్రీ

"అందుకే అన్నది నీదంతా విడ్డూరమని! అసలా టెక్నో స్కూల్లో సీటు దొరకడమే చాలా కష్టం తెలుసా! మా కొలీగ్ స్వప్నవాళ్ళ అంకులే దానికి డైరెక్టర్ కావడంవలన ఏ ఎంట్రన్స్ టెస్టూ లేకుండా సీటు దొరికింది. ఐనా వాడింకా పసివాడేమిటీ! పది వెళ్ళి పదకొండు వస్తూంటేనూ!

ఇప్పటినుంచే పోటీతత్వం అలవరచుకోకపోతే రేప్పొద్దున్న నెట్టుకురావడం చాలా కష్టం అయిపోతుంది. అందుకే సాత్విక్‌ని ఇప్పటినుంచే ఆ స్కూల్లో చేర్పిస్తే, వాళ్ళు ఇప్పటినుంచే మంచి తర్ఫీదునిచ్చి, ఐ.ఐ.టి.లో స్పెషల్ కోచింగ్ ఇచ్చి జెమ్స్‌లా తయారుచేస్తారు" ఏమాత్రం తగ్గని వైజయంతి తానన్న మాటమీదే స్థిరంగా నిలబడివుంది.

"నువ్వన్నది సెంట్ పర్సెంట్ కరెక్ట్ వైజూ. కాని, ఈ టెక్నోస్కూళ్ళలోనూ, కార్పొరేట్ కాలేజీల లోనూ చదువులు వెలగబెడుతున్న ఎంతమంది విద్యార్థులు ఐ.ఐ.టి. యన్స్‌గా తయారవుతున్నారు చెప్పు! ప్రతి వెయ్యిమందికి మహా అయితే ఓ పది, పదిహేనుమంది సీటు సాధిస్తూ ఉండివుంటారు. అయినా వాడు ఇంటర్మీడియెట్‌కి వచ్చినదగ్గర నుంచి ఆ కార్పొరేట్ కాలేజీల్లో ఖైదు, మానసిక ఒత్తిడి ఎలాగూ తప్పవుకదా! ఇప్పటినుంచీ వాడిని ఆ కారాగారంలో బంధించి శిక్షించడం దేనికి? మరొక నాలుగైదేళ్ళు వాడిని ఏ టెన్షనూ లేకుండా స్వేచ్ఛగా, ప్రశాంతంగా ఉండనిద్దాం" వైజయంతిని బతిమలాడుతూ నచ్చచెప్పచూశాడు శ్రీనాథ్.

వైజయంతి చిరాగ్గా అరచేత్తో నుదురు కొట్టుకుంటూ "ఖర్మ... ఖర్మ. ఏ తండ్రైనా పిల్లలు గొప్పవాళ్ళు కావాలని ఆశిస్తాడు. నువ్వేంటి శ్రీ ఇలా!" అంది ఆగ్రహాన్ని తన కంఠంలో ప్రస్ఫుటింపజేస్తూ.

"మనకు పదిమంది పిల్లలు లేరు వైజూ. ఉన్న ఒక్కగానొక్క నలుసును చదువు పేరుతో ఆ హాస్టళ్ళలో మగ్గబెట్టడం ఎందుకన్న నా ఆవేదనను నువ్వర్థం చేసుకోకపోవడం నా దురదృష్టం" నిస్పృహయంగా నిట్టూర్చాడు శ్రీనాథ్.

"నా బాధ కూడా అదే శ్రీ... ఒక్కగానొక్క బిడ్డను బాగా చదివించి ప్రయోజకుడిని చేద్దామనే నా ఆరాటమంతా. దాన్ని నువ్వు అర్థంచేసుకోకపోగా ఇలా... వాదించి వాదించి నన్ను విసిగిస్తున్నావు. నువ్వెంత చెప్పినా ఈ విషయంలో నామాటే చెల్లాలి" నిక్కచ్చిగా చెప్పేసి ఆఫీసుకి నిష్క్రమించింది వైజయంతి.

చేతకానివాడిలా... డీలాపడిపోయి ఉస్సురని చూశాడు శ్రీనాథ్ ఆమె వెళ్ళినవైపు. గడచిన పద్రోజులుగా ఆ ఇంట్లో, ఆ భార్యాభర్తల మధ్యన ఇదే చర్చ. ఎడతెగని వాదోపవాదాలు, పెచ్చుమీరిన వాగ్వివాదాలు. ఎన్నివిధాల నచ్చచెప్పినా వైజయంతి దిగిరాలేదు. తన పంతంనుంచి వీసమెత్తైనా పక్కకు జరగలేదు. తాను తలచుకున్నది జరిగితీరాలన్న కృతనిశ్చయం ఆమెలో దృఢంగా వేళ్ళూనుకుపోయింది.

వైజయంతి, శ్రీనాథ్‌లు వేరువేరు ప్రైవేట్ కంపెనీల్లో పనిచేస్తున్నారు. ఇద్దరూ తమతమ కొలువులను కొనసాగించకపోతే మనుగడ దుర్భరమయ్యే పరిస్థితి.

ఆర్థికంగా కాస్త నిలదొక్కుకోవాలన్న తపనతో ఇద్దరూ కొన్నాళ్ళపాటు పిల్లలు పుట్టకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. తామిద్దరి జీతాలతో ఓ పసివాడిని కని, పెంచి, పోషించి, విద్యాబుద్ధులు

చెప్పించగలమన్న నమ్మకం కలిగాక తాము తాత్కాలికంగా పాటిస్తున్న కుటుంబనియంత్రణా విధానాలకి ఫుల్‌స్టాప్ పెట్టి సాత్విక్‌కి జన్మనిచ్చారు. మరి పిల్లలని కనకూడదన్న నిర్ధారణకి వచ్చిన పిమ్మట శ్రీనాథ్ వేసెక్టమీ చేయించుకున్నాడు. ఒక్కడే గారాల తనయుడు కావడంమూలాన సాత్విక్‌ని అపురూపంగా పెంచుకొస్తున్నారా దంపతులు.

సాత్విక్ ఐదోతరగతికి వచ్చాడు. పిల్లవాడు చదువులో, ఆటలలో చురుకుగా ఉంటాడు. అమ్మానాన్నలకి ముద్దుబిడ్డ కావడంతో ఆడింది ఆట,పాడింది పాటగా సాగిపోతూవుండగా...

అప్పుడు పట్టుకుంది వైజయంతికి ఒకానొక ఫీవర్. సమాజసంస్కృతిలో సింహభాగాన్నాక్రమించిన కార్పొరేట్ చదువుల వలయంలో తానూ పరిభ్రమించనారంభించింది ఆమె. ఇలా... ఆడుతూ పాడుతూ చదివితే తన కొడుకు ర్యాంకుల రేసులో వెనకపడతాడేమోనన్న భయం వైజయంతిని పట్టి కుదిపేసింది. తన ఏకైక పుత్రుడు ఐ.ఐ.టి.లో ఉన్నతవిద్యనభ్యసించి, గొప్ప స్థానంలో నిలవాలని ఆమె కన్నమనసు తహతహలాడింది.

ఇక్కడే ఈ సాధారణ స్కూళ్ళలో చదివితే సాత్విక్ ఐ.ఐ.టి.లో కాదుకదా... ఎమ్‌సెట్‌లో కూడా సీటు సాధించలేడన్న అనుమానం ఆమె మెదడును కుమ్మరిపురుగులా దొలవనారంభించింది. ఆ దొలచిన ఫలితంగా ఆమె మదిలో ఓ ఆలోచన ఉద్భవించింది.

విజయవాడలో ఉన్న ఓ ప్రముఖ ఈ. టెక్నో స్కూల్లో సాత్విక్‌ని చేర్పించాలని సంకల్పించి ఆ దిశగా పావులు కదిపింది. సాత్విక్‌ని ఆ స్కూల్లో జాయిన్‌చేస్తే, వాడు చదువులో పురోగతి సాధించడం సంభవిస్తుంది. అంతేకాదు... తాను ప్రమోషన్ నిమిత్తం రాసే డిపార్ట్‌మెంటల్ టెస్ట్‌లకోసం ప్రిపేరవడం కూడా సాధ్యపడుతుంది.

ఆమెలోని ఈ భావనలని, ఆమె ప్రతిపాదనను తీవ్రంగా ఖండించాడు శ్రీనాథ్. బిడ్డని ఇప్పటినుంచే దూరంగా పెడితే వాడు మానసికంగా తమకి దూరమయ్యే ప్రమాదం పొంచివుండవచ్చునని విడమరచి చెప్పాడు. చదువులో ముందంజ వేయడంకోసం వాడి బంగారు బాల్యాన్ని బలిచేయవద్దని, స్వేచ్ఛగా వికసించే వాడి పసిమనసుని మరుగుజ్జు వృక్షంలా కుదింపచేయవద్దని ఎన్నోవిధాల నచ్చచెప్పాడు. కాని, అవేవీ వైజయంతి చెవులకెక్కలేదు. ఎన్నో నిరాహారదీక్షలు, మరెన్నో సహాయ నిరాకరణ ఉద్యమాల అనంతరం ఆమె తాననుకున్నది సాధించింది.

అయిదో తరగతి పాసైన సాత్విక్‌చేత నామకానికి ఎంట్రెన్స్ టెస్ట్ రాయించి, బోలెడంత ఫీజు కట్టి, అతడిని 'ఆ' పేరున్న ఈ.టెక్నో స్కూల్‌లో జాయిన్ చేసింది. తాను తలపోసినది నెరవేరాక వైజయంతి విజయగర్వంతో నవ్వితే, వధ్యశిలకు కొనిపోబడుతున్న పశువులా దీనంగా చూస్తూ ఆ స్కూల్లోకి ప్రవేశించాడు సాత్విక్. హృదయాన్ని కదిలించే ఆ చూపు ములుకై, వాడి బాకై తన గుండెల్లో దిగబడిన ఆ క్షణాన్ని ఈనాటికీ విస్మరించలేకున్నాడు శ్రీనాథ్.

• • •

ఆఫీసునుంచి వస్తూ తోవలో ఉన్న కల్వర్ట్ దగ్గర జనం గుమిగూడివుండడం చూసి ఏం జరిగిందోనన్న ఉత్సుకతతో తన స్కూటీని పార్క్‌చేసి ఆ గుంపును తోసుకుంటూ ముందుకు నడిచింది వైజయంతి.

"ఏ తల్లి కన్నబిడ్డో! వజరంనాగుంది. బంగారంనాంటి ఈ బిడ్డనిట్టా పారేసిపోవడానికి ఆ

తల్లి మనసెట్టా ఒప్పిందో!" అంటోందో ఆడమనిషి జాలిగా.

"ఒళ్ళు కొవ్వెక్కి కామం తీర్చుకునేందుకు పొర్లాడి, ఇలా బిడ్డలను కనిపారేయడం ఈ అమ్మాయిలకో ఫ్యాషనైపోయింది" ఒక పెద్దాయన కోపంగా అంటున్నాడు.

"ఇలాంటి పిల్లలే ఆవారాలుగా పెరిగి తదుపరి కాలంలో సంఘవిద్రోహ శక్తులుగా మారి సమాజాన్ని పీడిస్తారు" మరొకాయన వీరబ్రహ్మంగారి లెవెల్లో తన కాలజ్ఞానాన్ని ప్రదర్శిస్తున్నాడు. ఆశ్చర్యంగా వాళ్ళ మాటలు ఆలకిస్తూనే పరిసరాలను గమనించసాగింది వైజయంతి.

ఆ కల్వర్ట్ కింద పారుతున్న మురుగునీటి కాలువ పక్కనే పొత్తిళ్ళలో చుట్టిపారవేయబడి ఉందో చిన్నారిరూపం. ఇంకా బొడ్డుతడి కూడా ఆరినట్లు లేదు. ముద్దులు మూటగడుతున్న ఆడశిశువును చూడగానే వైజయంతి హృదయం బాధగా మూలిగింది. అలాంటి అపురూపమైన చిన్నారిపాపను అలా కాలువలో పడేసిపోవడానికి ఆ కన్నతల్లికి హృదయమెలా అంగీకరించిందో! తన జన్మని సార్థకం చేసే అమ్మతనాన్ని విస్మరించి ఈ పురిటిగుడ్డునిలా దూరం చేసుకునేందుకు ఆమెని ప్రేరేపించిన సంఘటనలేమిటో!

ఏ తల్లైనా నవమాసాలూ మోసి కడుపుచించుకున్న చిన్నారి ప్రాణాన్ని కావాలని దూరం చేసుకుంటుందా! ఆమె ఈ కఠోరనిర్ణయం తీసుకోవడానికి పురికొల్పిన ఆ బలీయమైన పరిస్థితులేమిటో కదా! మనసులోనే సమీక్షించుకోసాగింది వైజయంతి. గుండె కకావికలయ్యింది. ఒంటిమీద చారికలు కట్టిన రక్తపుమరకలతో, కాళ్ళూ-చేతులూ కొట్టుకుంటూ ఏడుస్తున్న ఆ పసిదాన్ని చూసి గుండె చెరువైపోతోంది చూపరులకి. అసలింతసేపుగా ఆ పసిప్రాణాన్ని ఏ కుక్కలు, నక్కలు పీక్కుతినకపోవడమే ఆశ్చర్యం అని ముక్కున వేలేసుకుంటున్నారు.

"గట్టిపిండం... ఈ భూమ్మీద ఇంకా నూకలున్నట్లున్నాయి. అందుకే ఇంతసేపు గడచినా ఇంకా జీవించేవుంది" అన్నారెవరో.

"ఇలా ఎంతసేపు చూస్తాం. అనాథ శరణాలయం వాళ్ళకి ఫోన్ చేస్తే వచ్చి తీసుకుపోయి ఆలనాపాలనా చూస్తారు" సలహా ఇచ్చాడు ఇందాకటి పెద్దాయన.

"అది నిజమేననుకోండి... వాళ్ళొచ్చేవరకు ఈ పాప ఇలా ఏడుస్తూ పడుండవలసినదేనా!" సందేహం వెలిబుచ్చాడింకో ఆయన.

"మీకా బయం అక్కరనేదునెండి బాబూ...మా ఇల్లీ పక్కనే. ఈ పాపను నాతో తీసుకెల్లి తానం సేయిపించి, పాలు తాపిస్తాను. ఆ వచ్చినోల్లకి నా పేరు, అడరెసు ఇత్తే సాలు" ముందు కొచ్చిందో మాతృమూర్తి.

ఒళ్ళంతా మురికి కంపు కొడుతున్న ఆ పసికందుని ఆప్యాయంగా లేవనెత్తి గుండెలకి హత్తుకుంది. ఆ దృశ్యాన్ని చూసినవాళ్ళంతా ఆ స్త్రీమూర్తిని శ్లాఘించి, ఆమె ఔదార్యాన్ని పలు నోళ్ళ కీర్తించి ఎవరి దారిన వాళ్ళు పోయారు. పర్సులో నుంచి రెండు వందనోట్లు తీసి ఆమె చేతిలో పెట్టింది వైజయంతి, ఆమె వద్దన్నా వినకుండా. ఆ తరువాత ఎంతోసేపు ఆ దృశ్యం ఆమెను వెంటాడుతూనేవుంది. ముక్కుపచ్చలారని ఆ పురిటికందుని ఆ తల్లి ఎలా మరవగలిగింది! ఈ ప్రశ్న పలుమార్లు మదిలో మెదిలి ఆమె మనశ్శాంతిని హరించింది.

ఇంటికి రాగానే భర్తతో ఈ విషయం చెప్పి బాధ పడింది వైజయంతి.

"చుట్టూ అంతమందీ మూగి చోద్యం చూస్తున్నారా! ఏ ఒక్కరూ ముందుకొచ్చి ఆ బిడ్డని కాపాడే ప్రయత్నం చేయలేదు. ఆఖరికి ఆమె ఎవరో ముందుకొచ్చి ఆ బిడ్డను అక్కున చేర్చుకుని ప్రాణాలు నిలిపింది" బరువైన స్వరంతో చెప్పింది వైజయంతి.

"అందరి సంగతీ దేనికిగాని... నువ్వు చేయగలిగావా ఆ పని!" శ్రీనాథ్ సూటి ప్రశ్న వైజయంతి మనసుని కల్లోలపెట్టింది. నిజమే! ఎవరూ కూడా ముందుకు రాలేదని వాపోతోంది కాని, తానే ముందుకొచ్చి ఆ పసికందుని చేరదీయాలని తనకెందుకు అనిపించలేదు!?

అంతలోనే ఉలిక్కిపడిందొక్కసారిగా. ఆ తల్లి పసికందుని నిర్దాక్షిణ్యంగా పారేసిందని ఆవేదనచెందుతున్నావేగాని నువ్వుమాత్రం చేసినదేమిటి! నీ సన్నిధికోసం ఆరాటపడే ఓ చిన్ని ప్రాణాన్ని చదువు నెపంతో ఆయాల సంరక్షణలోకి నెట్టేయలేదూ! కోరి స్వంతబిడ్డని దూరం చేసుకున్న నీకు ఇంకొకరిని వేలెత్తి చూపించే అర్హత ఉందా!

ఎందుకో... శ్రీనాథ్ చూపులు తనని నిలదీసినట్లుగా ఫీలయ్యింది వైజయంతి. ఒంటినిండా ఎండిపోయిన రక్తపు మరకలతో 'కేరు కేరు'మని ఏడుస్తున్న ఆ పసిబిడ్డ, హాస్టల్‌లోకి వెళ్ళేముందు బిత్తరచూపులతో తననే చూస్తున్న సాత్విక్... ఎందుకో పదేపదే ఈ రూపాలే వెంటాడాయామె మదిని. కాసేపు ఆలోచనల మథనం తరువాత స్థిమితపడింది వైజయంతి.

తాను తన బిడ్డ బాగుపడాలన్న తపనతోనే హాస్టల్‌కి పంపింది. అంతేకాని, వాడిమీద మమత చచ్చికాదు. తనకక్కరలేదని బిడ్డను నడిబజార్లో పారేసిన ఆ ఆడదానికి, తనకి పోలికేమిటి! నాన్సెన్స్! అసహనంగా తల విదిల్చి ఆ విషయాన్ని అక్కడితో మరచిపోయేందుకు ప్రయత్నించింది వైజయంతి.

• • •

ఆఫీస్ అవర్స్‌లో వర్క్‌తో తలమునకలుగా ఉన్న వైజయంతి సెల్ మోగింది. ఆ కాల్ సాత్విక్ చదువుతున్న స్కూల్ ప్రిన్సిపాల్ దగ్గరనుంచి వచ్చింది.

వెంటనే అలర్టయ్యి ఫోన్ లిఫ్ట్‌చేసింది వైజయంతి.

"నమస్తే సార్... చెప్పండి. మా సాత్విక్ ఎలా చదువుతున్నాడు? స్కూల్ వాతావరణానికి అలవాటుపడ్డాడా!" అంటూ మర్యాదపూర్వకమైన స్వరంతో పలకరిస్తూ ప్రశ్నించింది.

"ఆ విషయం గురించి మాట్లాడడానికే ఫోన్ చేశాను మేడమ్! మీ సాత్విక్..."

"ఆఁ... మా సాత్విక్‌కి ఏమైంది? ఒంట్లో బాగాలేదా!" ఆదుర్దా నిండిన స్వరంతో అడిగింది వైజయంతి.

"మీ అబ్బాయి ఒంట్లో బాగానే ఉంది మేడమ్.. కాని, అతడి ప్రవర్తనే బాగాలేదు. విపరీతంగా బిహేవ్ చేస్తున్నాడు. పక్కపిల్లల పొడ అసలు గిట్టడంలేదు. ఎప్పుడూ ఒంటరిగా ఉండడానికి ఇష్టపడుతున్నాడు. తనతోపాటు రూమ్ షేర్ చేసుకుంటున్న పిల్లలతో దుడుకుగా వ్యవహరిస్తున్నాడు. మొన్న క్లాస్ టెస్ట్‌లలో పక్కసీటబ్బాయికి తనకన్నా రెండు మార్కులెక్కువ వచ్చాయని రక్తం వచ్చేలా కొరికేశాడు. ఒకటా! రెండా! చెప్పడానికి బోలెడు. అవన్నీ ఫోన్‌లో చెప్పేవికావు, మీరోసారి వస్తే పర్సనల్‌గా మాట్లాడాలి" అనేసి ఫోన్ పెట్టేశాడాయన.

నిశ్చేష్టయై నిలిచిపోయింది వైజయంతి. వాస్తవానికి సాత్విక్ అల్లరిపిల్లాడు కాదు. ఒక్కడే కొడుకని గారాంగా పెంచినా అది ఇంటివరకే పరిమితంకాని, బయట ఎవరినీ ఇబ్బందిపెట్టేలా ప్రవర్తించడు. స్కూల్లో తనతోటి విద్యార్థులతో కూడా భేషజం లేకుండా కలిసిపోయి, వాళ్ళతో స్నేహంగా మెలిగేవాడు. ఏనాడూ దుందుడుకు చేష్టలు చేసి ఎవరినీ విసిగించిన దాఖలాలు లేవు. అటువంటి సాత్విక్ ఇలా... విపరీతంగా తయారవ్వడానికి కారణమేమిటి!? ఎంతగా ఆలోచించినా సమాధానం దొరకలేదు వైజయంతికి. ఆఫీసుకి లీవుపెట్టి ఇంటికి వెళ్తూ శ్రీనాథ్‌కి ఫోన్ చేసింది వెంటనే ఇంటికి రమ్మని.

"ఇలా ఎందుకు జరిగిందో నాకు బోధపడడంలేదు శ్రీ... మన సాత్విక్ అలాంటి దుడుకు పిల్లాడు కాదు. ఎక్కడ మిస్టేక్ జరిగిందో నాకు అంతుచిక్కడంలేదు" దిగులుగా అంది, శ్రీనాథ్ భుజంమీద తలవాల్చిన వైజయంతి.

"నిజమే వైజా... సాత్విక్ సహజసిద్ధంగా, స్వాభావికంగా అల్లరివాడు కాదు. కాని, మనమే... కేవలం మనమే... వాడినలా తయారుచేశాం. మన తప్పుడు నిర్ణయాలవల్లనే వాడు అలా తయారయ్యాడని నా భావన" అన్నాడు శ్రీనాథ్ సాలోచనగా.

"నువ్వేమంటున్నావో నాకర్థంకావడంలేదు శ్రీ" అయోమయంగా చూసింది వైజయంతి.

"జరిగినదాంట్లో నీ తప్పుందని నీకనిపించడంలేదా వైజా!" వైజయంతి కళ్ళలోకి సూటిగా చూశాడు శ్రీనాథ్.

"నా తప్పా! అదెలా శ్రీ?" నిర్ఘాంతపోతూ ప్రశ్నించింది వైజయంతి.

"హాయిగా, నింగిలో విహరించే విహంగంలా... స్వేచ్ఛగా ఎగిరే సీతాకోకచిలుకలా ఆడుతూ పాడుతూ బతికేవాడిని తీసుకెళ్ళి ఆ బందిఖానాలో పడేశావు. అమ్మానాన్నల అనురాగపు ఛాయలో సంపూర్ణంగా ఎదగాల్సినవాడి వ్యక్తిత్వాన్ని ర్యాంకుల వేటలో తనను దాటుకుపోతున్న పక్కవాడిని అణగదొక్కే విధంగా తయారుచేశావు. పక్కవాడికన్నా తానే మెరుగ్గా ఉండాలన్న ఆకాంక్ష వాడిలో బలీయమై, ఏం చేసైనా పక్కవాడిని అణగదొక్కే స్వభావం వాడిలో అంకురించడానికి తల్లిదండ్రులుగా మనమే కారణమయ్యాము.

సాటివారిపట్ల ఎంతో స్నేహభావంతో మెలిగే మన సాత్విక్ ఇలా స్వార్థంతో, సంకుచితంగా ఆలోచించడానికి మూలం ఏమిటి వైజా?

అసలే భ్రష్టుపట్టిన మన విద్యావ్యవస్థను, మరింత చెడిపోయేలా చేస్తున్నది మనలాంటి తల్లిదండ్రులే. ఎంతసేపూ మన బిడ్డే ముందుండాలి అన్న స్వార్థభావనే తప్ప ఆ నేపథ్యంలో పిల్లలు ఎంత ఒత్తిడికి, అశాంతికి లోనవుతున్నారో మనం పట్టించుకోవడంలేదు.

'స్పర్థయా వర్ధతే విద్యా' అంటారు. కాని ఆ పోటీ ఆరోగ్యకరంగా ఉన్నప్పుడే పిల్లలు మంచి విద్యావంతులుగా, ఉత్తమ వ్యక్తులుగా ఎదుగుతారు. ప్రతి తల్లిదండ్రులూ కూడా తమ పిల్లల్ని ఏ ఇంజనీరుగానో, డాక్టర్‌గానో, లేకపోతే సైంటిస్ట్‌గానో చూడాలని ఆశపడుతున్నారే గాని మంచి వ్యక్తిత్వమున్న ఉత్తమ పౌరుడిగా రూపుదిద్దుకుని సాటివాడికి సాయపడే సౌహార్ద్రాన్ని పెంపొందించుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకోవడంలేదు.

కేవలం తల్లిదండ్రుల బలహీనతలవల్లనే మన విద్యావిధానం ఇలా తయారయ్యింది. మన లాంటివాళ్ళ బలహీనతలని, ఆశలని సొమ్ముచేసుకుని అడ్డంగా బలుస్తున్నాయి ఈ కార్పొరేట్ విద్యాసంస్థలు. ఆరునెలల కాలంలోనే సాత్విక్ ప్రవర్తన ఇంత విధ్వంసకరంగా తయారయ్యిందంటే కొన్నాళ్ళు పోతే! వద్దు... ఊహించుకుందికే భయమేస్తోంది.

ఇప్పుడు సాత్విక్ వయస్సు పదేళ్ళు వైజూ. మనిద్దరిలో నీ దగ్గరే వాడికి ఎక్కువ చేరిక. ఒక్కసారిగా నీకు దూరమైన వాడి పసిమనసులోని ఆవేదనను ఎవరితో చెప్పుకోవాలో, తన బాధను ఎలా వ్యక్తపరచాలో తెలియని ఆ పసివాడు ఇలా విపరీత ప్రవర్తనకు లోనై తన ఒత్తిడిని పోగొట్టుకుంటున్నాడేమోనని నా భావన.

తల్లికన్నా తన బిడ్డమీద ఎవరికీ కూడా ఎక్కువ ప్రేమ, అభిమానం ఉండవు. కడుపులో పెట్టుకు కాపాడవలసిన తల్లే అలా కర్కశంగా కాలదన్నినప్పుడు ఆ బిడ్డ పరిస్థితి ఏమిటి!" భారంగా అన్న శ్రీనాథ్ నిర్ణయం తీసుకోవలసిన బాధ్యత నీదే అన్నట్లుగా వైజయంతిని ఒంటరిగా వదిలి లోపలికి వెళ్ళిపోయాడు.

వైజయంతి అలా కొయ్యబొమ్మలా బిగుసుకుపోయింది. 'కన్నతల్లే కాలదన్నినప్పుడు ఆ బిడ్డ పరిస్థితి ఏమిటి?' అనుక్షణం శ్రీనాథ్ మాటలే చెవుల్లో మారుమ్రోగి మనసుని కెలికిపారేస్తున్నాయి. 'ఇలాంటి పిల్లలే రేప్పొద్దున్న ఏ సంఘ విద్రోహశక్తులుగానో మారి సమాజాన్ని పీడిస్తారు" ఆనాడు... మురికి కాలువలో పారవేయబడిన ఆ పసిపాపనుద్దేశించి జనం చేసిన వ్యాఖ్యలు చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. అంటే... తనవల్ల నిర్లక్ష్యం చేయబడిన తన బిడ్డ... తన చిన్నారి సాత్విక్ కూడా... ఆలోచించడానికే ఏదోలా అనిపించింది వైజయంతికి.

ఆనాడు... ఆ కన్నతల్లి తన అమ్మతనాన్ని మరచి బిడ్డని వీడి ఎలా పోగలిగిందోనని తెగ బాధపడింది తాను. కాని, తానుమాత్రం చేసినదేమిటి! మాతృత్వాన్ని సమాధి చేసి, తన సాన్నిధ్యంకోసం పరితపిస్తూ, తన నీడన సేదతీరాలని ఆత్రపడే బంగారుబాబుని 'మంచి చదువు' పేరుతో హాస్టల్లో పడేసింది.

తనకీ, ఆ తల్లికీ ఆట్టే తేడా ఏమీలేదు. కరుకుదనంలో ఆ తల్లిని మించిపోయింది తాను. ఆ తల్లికి బిడ్డను నవమాసాలు కడుపును మోసిన పేగుబంధమే తప్ప ఈ లోకంలో ఏర్పడిన సన్నికర్షగాని, మానసికబంధంగాని, తల్లీబిడ్డల మధ్యనుండే అనుబంధం కానీ ఏమీలేవు. కాని, తానలా కాదే! తామిద్దరి నడుమ పదేళ్ళపాటు సాగిన అనురాగబంధం ఉంది. ప్రాణాల్లో ప్రాణంగా పెనవేసుకుపోయిన మమతానుబంధముంది. అటువంటి మాతృత్వపు మధురానందాన్ని మరచిపోయి తానిలాంటి కఠోరనిర్ణయం ఎలా తీసుకోగలిగింది!

అనేకమైన ప్రశ్నలు వైజయంతి గుండెల్లో వాడి, ముళ్ళై దిగబడుతూ గుండెను ఛిద్రం చేస్తూనేవున్నాయి. అపరిమితమైన ఆలోచనా మధనానికి లోనైన ఆమె అంతరంగం స్వచ్ఛమైన నిలువుటద్దంలా తయారైంది. అందులో ఆమె ప్రతిబింబం తేటగా కనిపిస్తోంది. ఎదలోతుల్లో అణచిపారేసిన అమ్మతనాన్ని అమూల్యాభరణంలా మరల ధరించి మురిసిందామె హృదయం.

'సాత్విక్... నా తండ్రీ. వస్తున్నానురా...' అనుకుంది ఆమె ఆర్తిగా. ◇◇

నాన్నెందుకొచ్చాడో?

గది బయట పొడవాటి నీడ... అటూ ఇటూ తచ్చాడుతూ. లోనికి రాబోతూ అంతలోనే ఆగిపోతున్నట్లు ఆ నీడ కాస్త ముందుకీ, మరికాస్త వెనక్కీ కదలాడుతోంది. ఆ వచ్చింది ఎవరో నాకు తెలుసు.

నాన్న.

ఔను! నాన్నే!

ఆయన నన్ను కలవాలన్నా... నాతో మాట్లాడాలన్నా... ఈ గది గుమ్మందాకా వచ్చి అలా ఆ నీడద్వారా తన ఆగమన సందేశాన్నందిస్తాడు. అది ఇప్పటి ఆనవాయితీ కాదు.

నా పెళ్ళయినప్పట్నుంచీ అదే తంతు.

ఇంటికి కోడలుపిల్ల వచ్చిందంటే అత్తామామలకి ప్రాణసంకటమని ఎవరన్నారో కానీ... మా ఇంట్లో అక్షరాలా అది నిజమైంది. నా భార్య ఈ ఇంటిగడప తొక్కింది మొదలు నాన్న నా గది గడపతొక్కడం మానేశాడు.

ఓ అపరిచితుడిలా గుమ్మం బయటే నిల్చుని పరాయివాడైపోయినట్లు కొడుకుని చూస్తుంటాడు. కారణమంటూ ప్రత్యేకించి వేరే ఏంలేదు.

కోడలు బయటనుంచి వచ్చింది. కొడుకు జీవిత భాగస్వామిగా మారి... ఈ ఇంటి అజమాయిషీ తలకెత్తుకుంది. దాంతో, 'ఇన్నాళ్ళూ కలిసిమెలిసి ఉన్న ఈ ఇల్లు తమది కాదనే భ్రమ కన్నతల్లిదండ్రుల్లో కలగడం... అది భ్రమకాదు. నిజంగా నిజమం'టూ తన భార్య కాస్త 'అతి' చేయడంతో ఇంట్లో శాంతి కరువైంది. ఇంచుమించు ప్రతి ఇంటికథా ఇంతే కాబోలు.

పెళ్ళితో రెండు జీవితాలు ముడిపడడం మాట అటుంచి కుటుంబాల్లో కలతలు చెలరేగడం ఎంత దారుణం? ఎక్కడెక్కడో పెరిగిన ఇద్దరు యువతీయువకుల్ని పెళ్ళి ఒకటిగా

పి.వి.డి.ఎస్.ప్రకాష్

చేస్తుందా? అత్తింటి కాపురాల్ని రెండుగా విడదీస్తుందా? అంటే... రెండోదే నిజమని నిరూపిస్తున్నాయి ఈనాటి చాలా కుటుంబాలు.

సర్దిచెప్పేందుకు ప్రయత్నించిన కొడుకులు 'అడకత్తెరలో పోకచెక్క'ల్లా నలగడం మినహా ఈ అనివార్య సంఘటనల్ని నిరోధించలేని నిస్సహాయస్థితికి చేరుకుని తమలో తాము మథన పడుతుంటారు. నేనూ అలాటి ఓ కొడుకునే.

ఒకే గదిలో చెరోవైపు శత్రుసైన్యాల్లా మోహరించిన అత్తాకోడళ్ళ ఆవేశకావేశాల్ని చూస్తూ చూస్తూవుండటంతప్ప ఏం చేయలేకపోయాను. ఎవర్ని ఓదార్చాలో, ఎవర్ని గద్దించాలో తెలీని సంకటస్థితిలో పడిపోయాను. ఓ వైపుకి కాస్త ఒరిగితే చాలు మరోవేపు నుంచి తుపానులు, సునామీలు చుట్టుముట్టి ఉక్కిరిబిక్కిరిచేసేవి. దాంతో, చిన్నప్పట్నుంచీ నేర్చుకున్న మాటని సైతం పరిత్యజించి మౌనాన్ని ఆశ్రయించాల్సిన పరిస్థితి ఎదురైంది నాకు.

అటు కనిపెంచిన తల్లికి నచ్చచెప్పలేకపోయా...అలాగే, తండ్రినీ సముదాయించలేకపోయా. అంతేకాదు, ఇటువైపు భార్యని అదుపులో పెట్టుకోలేకపోయా. ఫలితం... 'పెళ్ళాంచాటు మొగుడ'నే పచ్చబొట్టు పొడిపించుకున్నా. దాంతో, కనిపించని ఇనుపతెరలు మా జీవితాల మధ్యకి వచ్చాయి. ఒకే కప్పుకింద ఒకే ఇంట్లో ఉంటున్నా... ఎవరి గదుల్లో వాళ్ళు. ఎపుడో ఎదురుపడ్తే తప్ప చిర్నవ్వుల్తో పలకరించడం, హాయిగా మాటాడుకోవడం దాదాపు అత్యాశే అయిపోయింది.

అమ్మ ఉన్నన్నాళ్ళూ నాన్న అవసరాలన్నీ ఆమె స్వయంగా చూసుకునేది. ఆర్నెల్లక్రితం ఆమె పోయిందగ్గర్నుంచీ తన అవసరాలు తనే స్వయంగా చూసుకుంటూ ఏకాకిలా బతుకుతున్నాడు నాన్న. మధ్యమధ్య ఇదిగో, ఇలా గుమ్మంబయట 'నీడ'లా నిల్చుని దూరపు చుట్టాల్లా పలకరించుకోవడం. మధ్యలో ఆర్థికావసరాల ప్రస్తావన వస్తే పరిస్థితి చేయిదాటిపోవడం 'షరా మామూలు'గా మారింది. నా పెళ్ళైన కొత్తల్లో ప్రాణం ఉన్న మనుషులు అగాధాల్ని సృష్టించుకుంటే... ఇపుడు నాన్నకీ, నాకూ మధ్య ప్రాణంలేని 'రంగుకాగితాలు' రక్తసంబంధాన్ని వెక్కిరిస్తున్నాయి. నాన్న నీడ అటూ ఇటూ కదిలింది.

"ఏడవందే రాడుగా..." పొగలు కక్కుతున్న కాఫీ తాగుతూ పొగరుగా అంది నా శ్రీమతి. సరిగ్గా, అదే సమయంలో గోడ గడియారం వరుసగా ఏడుగంటలు కొట్టింది.

"అలా నన్నెందుకు చూస్తారు? మీ నాన్నొచ్చాడుగా. వెళ్ళి పలకరించండి. పదో పరకో చేతుల్లో పెట్టి వట్టిచేతులు దులుపుకుని రండి..." విసురుగా అంది నా భార్య.

నేను తాగుతున్న కాఫీ కప్పుని టీపాయ్‌మీద పెట్టి గుమ్మందగ్గరికి వెళ్ళబోతుండగా... "ఏమండీ! ఒక్కక్షణం" లోగొంతుతో పిలిచింది.

"ఏమిట"న్నట్లు చూశాను.

"మళ్ళీ ఏదో బాధ్యత నెత్తిమీదకి పెట్టుకుని ఏ వెయ్యో, రెండువేలో అడగబోతాడేమో? ఇవ్వాలో, ఇవ్వద్దో కాస్త ఆలోచించి ఆచితూచి వ్యవహరించండి" సూచించింది.

ఆమెవైపు కోపంగా చూడబోయాను. నాకు చేతకాలేదు. అలా ఎపుడు చూశాను కనుక... ఇపుడు చేతనవడానికి.

పెళ్ళిచూపుల్లో వెర్రిచూపులు చూశాను. పెళ్ళయ్యాక శోభనంగదిలో పిచ్చిచూపులు చూశాను. తర్వాత్తర్వాత... ఆమె చీర కొంగట్టుకుని ఆమె కడగంటిచూపుకోసం వెర్రెత్తిపోయాను. ఇన్ని చూపుల మధ్య అమ్మ చివరిచూపుని సరిగ్గా చూసుకోలేదు. ఇపుడు నాన్నని చూసుకోవడంలేదు... నాలో నేను సంఘర్షించుకుంటున్నాను. ఎందుకో ఆ సమయంలో నాకు కుక్కతోక గుర్తొచ్చింది. అదెపుడూ వంకరేనా? డౌటొచ్చింది.

ఆ తర్వాత నా భార్యమాటలు చెవుల్లో గింగిరాలు కొట్టింది. "పదో పరకో చేతిలో పడేయండి... అంతకుమించి అసలివ్వొద్దు" ఆమె హుకుం జారీచేసినట్లు హడలిపోయాను.

ఔనూ... నాన్నేమిటీ? ఈ మధ్య చీటికీమాటికీ నన్ను డబ్బులడుగుతున్నాడు. ప్రతి రెండు నెలలకోసారి నిస్సిగ్గుగా తనదగ్గర చేయి చాపుతున్నాడు. కారణం చెప్పడు. అవసరమంటాడు. ఇచ్చితీరాలన్నట్లు కాబూలీవాడిలా గుమ్మానికడ్డంగా నిల్చుంటాడు. అడిగినంత డబ్బు చేతిలో పడితేగానీ అక్కడ్నుంచీ కదలడు. అల్పాహారం మొదలుకుని అన్నంవరకూ, ఉదయ, సాయం కాలాల్లో కాఫీ, టీలవరకూ ఇంట్లోనే అన్నీ సమకూరుస్తూనేవున్నాం. అయినా మొదట్లో వందల్తో మొదలై ఇపుడు వేలరూపాయలవరకూ ఎదిగింది నాన్న అవసరం.

"అమ్మ పోయి ఒంటరైపోయాక హాయిగా రామా కృష్ణా అంటూ కాలక్షేపం చేయకుండా కాసుల్తో పనేంటీ? అసలా అవసరాలేంటీ? ఈ వయసులో వ్యసనాలేమైనా చుట్టుకున్నాయా?" ఈ కోణంలో కూడా చాలాసార్లు ఆలోచించాను. అయితే, సిగరెట్ తాగడం... వక్కపొడి నమలడం లాంటి చిన్న చిన్న అలవాట్లు కూడా ఉద్యోగం చేస్తున్న రోజుల్లోనే నాన్నకు లేవు. ఓ ప్రయివేట్ కంపెనీలో చాలీచాలని జీతానికి నానా అరవచాకిరీ చేయడం... వచ్చిన ప్రతి పైసా కళ్ళకద్దుకుని ఏ చిన్ని అవసరానికైనా పనికొస్తుందని పొదుపు, ఖర్చువిషయంలో పాటించడం చిన్నతనం నుంచీ నేనెరిగిన నాన్న లక్షణం.

కానీ, ఇపుడు నాన్న బాగా మారాడు. అదీ... నాకు ఉద్యోగంలో గెజిటెడ్ హోదాస్థాయి ప్రమోషనొచ్చాక... ఇంట్లో సమకూర్చుకోదగ్గ సకల సౌకర్యాలు అమర్చుకోగల డబ్బులు నా దోసిట్లో పడుతున్న ఈమధ్యకాలంలోనే నాన్న అవసరాలు పెరిగాయి. మొదట్లో మొహమాటంగా... తర్వాత్తర్వాత సిగ్గులేకుండా- 'అవసరానికి డబ్బులు కావాలం'టూ అడిగేస్తున్నాడు. ఇవ్వకపోతే మొండికేస్తున్నాడు.

"ఇపుడూ నాన్న వచ్చింది అందుకేనేమో?" ముందుగానే నా భార్య హెచ్చరించింది.

గుమ్మం దగ్గరికొచ్చాను. ఎదురుగా నాన్న. నాన్ననలా చూడగానే నా చూపెందుకో పాతి కేళ్ళ వెనక్కి మళ్ళింది. ఇదే గదిలో నాన్న ఉండేవాడు. ఇపుడు నాన్న ఉన్న స్థానంలో నేనుండే వాడిని భయంభయంగా. తక్కువ మార్కులొచ్చిన ప్రోగ్రెస్‌కార్డుమీద సంతకంకోసమో... కట్టాల్సిన ఫీజుకి ఆ రోజుతో ఆఖరి గడువు ముగిసిందనో... పుస్తకాలు కొనుక్కోవడానికి డబ్బులు కావా లనో... ఏదో కారణంతో అక్కడ అలాగే నిల్చుండేవాడిని. పెద్దపులిలా నాన్న కనిపించేవాడు. ఎదురుపడితే చాలు నిక్కరు తడిసేది. సరిగ్గా, అదే సమయంలో-

"ఏరా బాబీ! అక్కడేం చేస్తున్నావ్?" అంటూ దేవతలా అమ్మ ప్రత్యక్షమయ్యేది. అడక్కుండానే వరాలిచ్చేది. చేతిలో ప్రోగ్రెస్‌కార్డుని తనే తీసుకుని నాన్నకి అందించి అతడి కోపం చూపు నామీద

పడకుండా అడ్డుగా నిలిచేది. ఫీజుకి డబ్బు కావాల్సివచ్చినప్పుడు... నాన్న దగ్గర అవి లేనప్పుడు నానా అవస్థలుపడి నాన్న ఆ డబ్బులు సమకూర్చేవాడు. ఒక్కోసారి నాన్నవల్ల కాకపోయేసరికి అమ్మ రంగంలోకి దిగేది. హుటాహుటిన పెరట్లోంచి బయటకి వెళ్ళి ఏం మాయ చేసేదో ఏమో చేతుల్నిండా నోట్లకట్టల్తో వచ్చేది. ఆ తర్వాత ఏ మధ్యాహ్నంవేళో వంటింట్లో ఓ ఇత్తడిబిందె కనిపించక నాన్న ఆరా తీస్తుంటే... పెరట్లోంచి వెళ్తున్న అమ్మ చీరకొంగులో ఏదో దాచి ఎవరికీ కనిపించకుండా వెళ్ళడం ఇప్పటికీ తనకు గుర్తే. ఖచ్చితంగా అది ఆ ఇత్తడిబిందె అయివుంటుంది. అవన్నీ గుర్తొచ్చి నా కళ్ళు చెమర్చాయి.

"ఏం నాన్నా... ఇలా వచ్చావ్?"

"ఏం లేదు. ఊరకే..." చిన్నప్పుడు నాన్న అడిగిన ప్రశ్నకి తనూ అదే సమాధానం చెప్పేవాడు. అపుడూ, ఇపుడూ 'ఊరకే...' అంటే 'ఏంలేద'ని కాదు. 'ఏదో ఉంద'ని. ఆ 'ఏదో' అపుడు నాన్నకి తెలుసు. ఇపుడు ఇంత పెరిగినతర్వాత నాకూ తెలుసు.

"చల్లకొచ్చి ముంత ఎందుకు దాయడం... ఏ అవసరమో చెప్పు" అడిగాను.

"ఊ... చెప్పరా? ఏం కావాలి నీకు?" నాన్న గద్దించి అడిగినట్లు అనిపించింది.

"డబ్బు... డబ్బులు కావాలి" అపుడూ నా గొంతునుంచి అదే జవాబు.

"ఎందుకు?" అపుడు నాన్న... ఇపుడు నేను.

"అవసరం..." గొంతులోంచి మాట బయటకి రాకుంటే విశ్వప్రయత్నంతో అడుగుతున్న అభ్యర్థన అది.

"సినిమాలకూ... షికార్లకా?" అప్పట్లో నాన్న అడిగే ప్రశ్న అదేకానీ, ఆ ప్రశ్న ఇపుడు నేను అడగలేను. కారణం... నాన్న నా చిన్నప్పుడే సినిమాలు చూడడం వృథాఖర్చని మానేశాడు. అమ్మ ఎంత పోరినా ఆ విషయంలో పట్టు సడలించుకోలేదు. ఇపుడైతే నాన్నకి అమ్మ లేదు. ఇంట్లో గదిలో ఒంటరిగా ఏం తోచడంలేదు కాబోలు. షికార్లు చేస్తున్నాడేమో? ఎవరితో చేస్తున్నాడో ఆ షికార్లు? ఇంత పెద్దవయసులో కూడా ఒక్కోసారి ఇలాటి పైత్యం కలుగుతుంటుందా?

ఒక్కడే షికారు చేస్తే ఏం ఫర్వాలేదు. జంటగా చేస్తేనే ఖర్చుతో కూడిన పని. ఒంటరి నాన్నకి ఓ జంట కుదిరిందా? అందుకోసమేనా... తరచూ డబ్బులు అడుగుతున్నాడు. ఆలోచిస్తున్నాను. పైకి నా గొంతు పెగలకపోయినా... నా కళ్ళలో ఆ ప్రశ్న కనిపించింది కాబోలు... నాన్న చిన్నగా గొణుగుతూ అన్నాడు- "ఒక్క వెయ్యిరూపాయలు సర్దు..."

"వెయ్యిరూపాయలే... మన పెరట్లో నువ్వేమైనా డబ్బు చెట్లు నాటావా? అంత డబ్బు ఇప్పటికిప్పుడు ఎక్కడ్నుంచి వస్తుంది?"

"ఎలాగోలా చూడు. అత్యవసరం"

"ఏ అవసరం. కాస్త ఉప్పూ కారం తగ్గించు. ఈ అవసరాలు తగ్గుతాయి" కాస్త కటువుగానే చెప్పా. అలా చెప్పాక నా గుండెలో సన్నగా నొప్పి. నేనేనా... నాన్ననేనా... ఆ మాటలంది.

హఠాత్తుగా అమ్మ గుర్తొచ్చింది. "మీ నాన్నకి నేను తప్ప మరో ఆడమనిషి తెలీదురా?" అన్నట్లనిపించింది.

"చెప్పు నాన్నా... ఏ అవసరం?"

"నా చిన్ననాటి స్నేహితుడు సూర్యం చనిపోయాడు. చచ్చేదాకా పనిచేస్తున్నా... చచ్చిపోయిన తర్వాత అంత్యక్రియలకి వాడేం దాచుకోలేదు. తనింకా కొన్నాళ్ళు బతుకుతాననుకున్నాడో ఏమో... దుర్మార్గంగా చావు వాడిని చావుదెబ్బ తీసింది" నాన్న కళ్ళనుంచి బొటబొటా కన్నీరు. భుజంమీద ఉన్న తుండువాతో కళ్ళు తుడుచుకున్నాడు.

"ఆ డబ్బు నువ్వు వాడికి ఊరికినే ఇవ్వడంలేదు. చేసిన బాకీ తీరుస్తున్నావంతే"

"నేనా... నీ ఫ్రెండ్ సూర్యం దగ్గర అప్పు ఎపుడు తీసుకున్నాను..." అడిగాను కోపంగా. ఆ వెంటనే... "నీక్కావాలంటే డబ్బులు నిజాయితీగా అడుగు. వాళ్ళ చావు, వీళ్ళ చావులమీద సానుభూతితో అడక్కు. అయినా కావల్సిన డబ్బుకోసం భలే ఫిటింగులు పెడ్తావే. చచ్చేక కాల్చుకోడానికి డబ్బులు లేవు... ఆ సూర్యం నాకు డబ్బులు సర్దేడట..." హేళనగా నవ్వాను.

"నిజమేరా? సూర్యమే డబ్బు సర్దుబాటు చేయకపోతే నీ పేరు పక్కన డిగ్రీ వచ్చి చేరేదికాదు. ఇంత మంచి గెజిటెడ్ హోదాగల ఉద్యోగం వచ్చేదికాదు. నువ్వూ నాలాగే ఏదో పెన్షన్ సౌకర్యం లేని ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ కాలం వెళ్ళబోసేవాడివి. నిజం చెప్పనా... నీ డిగ్రీ ఫైనలియర్ ఎగ్జామ్స్ ఫీజు నేనెలా కట్టాననుకుంటున్నావ్? ఆ సూర్యం ఇచ్చిన డబ్బుల్తో. సుస్తీ చేసిన తన భార్య మందులకోసం అప్పు తెచ్చిన సూర్యం నీనా అవసరాన్ని గుర్తించి... ఆ డబ్బు సర్దుబాటు చేశాడు. ఇంకో విషయం చెబితే నువ్వింకా ఆశ్చర్యపోతావ్. అలా తెచ్చిన ఆ డబ్బు నా ఇబ్బందుల వల్ల ఇప్పటికీ నేను తీర్చలేకపోయాను" చెప్పాడు నాన్న.

"నాన్నా..."

"ఔన్రా...! నీ దగ్గర చీటికిమాటికి ఏదో నెపంతో డబ్బులు గుంజుతున్నానని అనుకుంటున్నావ్. కానీ, నువ్వొకటి అర్థం చేసుకోవడంలేదు. మనిషి సంఘజీవి. ఇవాళ నువ్వీ హోదాలో పనిచేస్తున్నా వన్నా... సమాజంలో ఏ ఒక్కడి సాయం లేకుండా నీ ఒక్కడివే... నీ కష్టంతో సాధించింది కాదు. స్కూల్లో, కాలేజీలో నువ్వు చదువుకున్నావంటే... అది గురువులు పెట్టిన భిక్ష. నీ చదువులకయ్యే ఫీజులు మంచిమనసున్న సూర్యంలాంటివాళ్ళు చేసిన సాయం. తీసుకున్న డబ్బు తిరిగిచ్చేయ వచ్చేమో కానీ... తద్వారా లభించిన సంపద జీవితాంతం నువ్వు అనుభవించేదేకదా! ఆ సంపదమీద నీ ఒక్కడికే హక్కుందనుకోవడం మూర్ఖత్వం.

ఇంకోటి చెప్పనా...? న్యాయంగా సూర్యం అంత్యక్రియలకు డబ్బులు ఇవ్వక్కర్లేదు. ఎందుకం కంటే... వాడిదగ్గర డబ్బులు నేరుగా నువ్వు నీ స్వహస్తాల్తో తీసుకోలేదు. కానీ, నైతికంగా ఆ సొమ్ము తిరిగి ఇవ్వడం నీ బాధ్యత. కారణం... ఆ సొమ్ముని నువ్వే వాడుకున్నావ్. పరీక్ష ఫీజు కట్టావ్. తద్వారా ఈ స్థితికి చేరుకున్నావ్" చెప్పాడు నాన్న.

నేనింకేం మాట్లాడలేదు. ఇంట్లో బీరువాలోంచి రెండు అయిదొందల రూపాయల నోట్లు తీసుకున్నాను. నాన్నకి ఆ సొమ్ము ఇవ్వొద్దన్న నా భార్య మాటల్ని నేనసలు పట్టించుకోలేదు. నా చేతుల్లోంచి ఆ నోట్లు అందుకుంటూ నాన్న నావైపు చూసిన చూపు నేనెప్పటికీ మరిచిపోలేను. అడపాదడపా నన్నడిగి నాన్న తీసుకున్న డబ్బులు వ్యసనానికి ఖర్చుచేస్తున్నాడేమోనన్న నా ఊహకి నాలో నేనే కుమిలిపోతున్నాను. ఆ బాధ ఈ జన్మకి తీరనిది.

నాన్నా... ఎక్కడున్నావ్?

సూర్యం చనిపోయిన రెండు వారాలకే నాన్న చనిపోయాడు. బహుశా... చిన్నతనం నుంచీ తనతో ఆడి పాడిన నేస్తం, కష్టాలు, కన్నీళ్ళు కలిసి పంచుకున్న దోస్త్... ఇక లేడనే బెంగతో కాబోలు నాన్న చనిపోయాడు. ఇపుడు ఇంట్లో నాన్న లేని కొరత కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఇంట్లో నాన్న ఉన్నప్పుడు ఏనాడూ అతడి దగ్గర కూచోలేదు. నోరారా ఆత్మీయంగా పలకరించలేదు. ఇంట్లో వండినవి తన భార్య ఆయన గదిలో పెడ్తే ఏదో తిన్నాడు.. ఏదో ఉన్నాడు.

అమ్మపోయినతరువాత ఒంటరైన నాన్నకు సూర్యం దిక్కయ్యాడు కాబోలు. తన ఈడు వాడు తన కళ్ళముందే కళ్ళుమూసేసరికి తన చావు తనకి గుర్తొచ్చినట్టుంది. మృత్యువుకి ఎదురేగి మరీ కావలించుకున్నాడు కాబోలు... ఒంటరైన నాన్న చనిపోయాడు. ఇన్నాళ్ళూ రోజూ ఎదురుపడి మాట్లాడకున్నా నాన్న ఉన్నాడన్న ఊహే ఎంతో ధైర్యంగా ఉండేది. ఇపుడు నాన్న లేడు. అంతకుముందే అమ్మ లేదు.

లోకంలో ఒంటరివాడినయ్యాననే భావన హఠాత్తుగా నాలో కలిగింది. తల్లిదండ్రులిచ్చిన జన్మే ఇది. శరీరమిచ్చారు. రక్తమిచ్చారు. పాలిచ్చి పెంచి పోషించారు. అలాటి తల్లిదండ్రులకు నేనేం చేశాను? ఏమీ చేయలేదు. తన జీవితానికో తోడు దొరకగానే నిలువెత్తు స్వార్థంగా మారిపోయాను. ఆలనాపాలనా చూసిన అమ్మని పట్టించుకోలేదు. బతికుండగా నాన్న ఉనికిని గుర్తించలేదు. ఆఖరికి... లేనిపోని ఊహల్తో నాన్న వ్యక్తిత్వాన్నే అనుమానించాను.

వండిన అన్నం పెట్టడంకాదు... ఒంటరి బతుకులో ఆసరాగా నిలవాల్సిన నేను... ఆ సంగతి విస్మరించాను. తలచుకుంటున్నకొద్దీ తలనొప్పి అధికమవుతోంది. నాన్న అంత్యక్రియలు ఘనంగా చేశాను. చనిపోయిన నాన్నకు అదే నే చేసిన ఆఖరి సత్కారం

నాన్న చావుకొచ్చిన చుట్టాలంతా నే చేసిన ఏర్పాట్లకు ఆశ్చర్యపోతూ... "కొడుకంటే ఇలా ఉండాలి. బతికున్నంతకాలం ఏ వృద్ధాశ్రమంలో పడేయకుండా తనదగ్గరే ఉంచుకున్నాడు. తీరా చనిపోయాక... పదికాలాలు గుర్తుండిపోయేలా నాన్న అంత్యక్రియలు ఘనంగా చేశాడు. నిప్పుతో అప్పు తీర్చుకున్నవాడే అసలుసిసలైన కొడుకులు..." అని పొగుడుతుంటే నాన్న పదేపదే గుర్తొచ్చి ఏడుపొస్తోంది.

ఊపిరున్నంత కాలం సతాయించాను. నాకు చదువు సంస్కారాలు నేర్పి సమాజంలో ఆర్థికంగా నిలదొక్కుకునేలా కొండంత సాయం చేసి అండగా నిలిచిన నాన్న నా ఎదురుగా నిలిచి చేతులు చాస్తే ఛీదరించుకున్నాను. ఆయన చనిపోయాక ఇపుడో... శ్రాద్ధకర్మలు అత్యంత శ్రద్ధగా చేసి సమాజం మన్నన పొందాను. ఇక, ఏడుపు ఆపుకోవడం నావల్ల కాలేదు. కన్నీళ్ళు ఇంకిపోయేదాకా పొగిలిపొగిలి ఏడుస్తున్నాను. 'నాన్నా! ఎక్కడున్నావ్! తిరిగిరావా ఒక్కసారి?' గుండెల్లో సంద్రాలు వెల్లువెత్తుతూ నన్ను తడిపి ముద్దచేస్తున్నాయి.

ఎంతకాలం గడిచిందో... అలా ఏడుస్తూనేవున్నా.

◇◇

KRSA102m290

క్రిస్టల్ డాల్ఫిన్స్, పోర్సిలిన్, క్యూపిడ్స్ మరియు కట్ గ్లాస్ విగ్రహాలు
ఎప్పుడైనా మీ కుటుంబానికి నిర్దిష్టమైన ఆహారాన్ని వండగలవా?

మీ ఆత్మీయులని మీరెంత ప్రేమిస్తున్నారు అన్నది వ్యక్తపరుచుకోవడానికై, ఒక అందమైన మరియు ఉపయోగకరమైనగిఫ్టని ఎవరికైనా బహుమతిగా ఇవ్వాలనప్పుడు, మార్ఫీ రిఛార్డ్స్ లాంటిది మరొకటి లేదు. మా అంతర్జాతీయంగా డిజైన్ చెయ్యబడ్డ ఉత్పాదనలు, చూడటానికి బాగుంటాయి మరియు ఏళ్లతరబడి మన్నికనిస్తాయి. మార్ఫీరిఛార్డ్స్ 19 కేటగిరీలలో, ప్రీమియం హోం అప్లయెన్సెస్‌లో శ్రేణిని అందజేస్తోంది. వీటిలో మిక్సర్ గ్రైండర్లు, హ్యాండ్ బ్లెండర్లు, పాప్-అప్ టోస్టర్లు, స్టీం మరియు డ్రై ఐరన్లు, మరియు కాఫీ మేకర్లు ఉంటాయి. మరి, ఇప్పుడు సందర్భం ఏదయినా సరే, ఒక మార్ఫీ రిఛార్డ్స్ అప్లయెన్స్ ఒక పర్ఫెక్ట్ గిఫ్ట్ అవుతుంది.

భారతదేశపు నం. 1 బ్రాండ్-ఓటిజిలు, కాఫీ మేకర్స్, ఎలెక్ట్రిక్ కెటిల్స్ మరియు టోస్టర్స్.

morphy richards UK
The Perfect Gift

For Trade/Institutional/Corporate enquiries, kindly contact: South: Bangalore 9980635677/9611444116/9900946600, Chennai 9884833723/8754580302/9176642991, Cochin & Thrissur 9446511102, Coimbatore 9940845288, Hyderabad 9849538271/ 8008088600/9949868685/9949595112, Kannur, Calicut & Mallapuram 9645095519, Madurai 9994255057, Mangalore & Hubli 9620025007, Trivandrum & Kottayam 9946720555, Vijayawada 9885733308, Visakhapatnam 9246693903. North: Chandigarh/J&K/H.P. 8558805012, Delhi 9212411181/9953012227, Eastern UP 9792337006, Haryana/Kundli 09654574044/9654112270, Punjab 8968918831, Rajasthan 9928750687, Western UP 09871593322. West: Ahmedabad 7874028080, Goa 8007772718, Indore 9617339393, Mumbai 9930412254/9821993473, Nagpur & Raipur 9011048011, Pune 9975385756, Surat & Baroda 9426777654. East: Bhubaneshwar 9937257575/8017006545, Bihar & Jharkhand 8969822244/8017006545, Guwahati & North East 9864279600/8017006545, Kolkata 9830410046/8017006545.

Available at all leading outlets in your city. Also available at:

morphy richards care 1-800-22-6722

To buy or gift our products online, please visit www.morphyrichardsindia.com

To buy the perfect gift, scan the QR code.

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KRSA102M289
పుస్తకం పేరు	స్వాతి
తారీఖు	23 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	201 yes
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	BC
లేని పేజీలు	
తయారు చేసినది	Sowmya
పేజీలు విడదీసినది	Sowmya
స్కాన్ చేసినది	Kaveri
పరీక్ష చేసినది	PRIYANKA
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good